# లెనిన్

## సంకలిత రచనలు

### తొమ్మిది సంపుటాల్లో

## 3


మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు • జాతుల
స్వయంనిర్ణయ హక్కు • సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ
విధానపు అత్యున్నత దశ • శ్రామికవర్గ విప్లవపు
సైనిక కార్యక్రమం

"ప్రగతి" ప్రచురణాలయం, మాస్కో



VISALAANDHRA
PUBLISHING HOUSE, HYD.
Rs 12 P 00

సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!



В. Ульянов (Ленин)

# వి.ఐ. లెనిన్

# సంకలిత రచనలు

## తొమ్మిది సంపుటాల్లో

## 3

"ప్రగతి" ప్రచురణాలయం

మాస్కో

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు
రాచమల్లు రామచంద్రారెడ్డి

**В. И. ЛЕНИН**

ИЗБРАННЫЕ ПРОИЗВЕДЕНИЯ В 9 ТОМАХ

том III

*на языке телугу*

**V. I. Lenin**

SELECTED WORKS IN NINE VOLUMES

III

*in Telugu*

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1985
సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

Л $\frac{0101020000—275}{014(01)—85}$ 345—85

# విషయసూచిక


ప్రచురణకర్తల మాట . . . . . . . . . . . . . . . 9
మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . . 14
దారిలో (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . . . . . . . . 22
గేర్ట్సెన్‌కి స్మృత్యంజలి (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . 31
ఐక్యతకోసం పొలికేకల మాటున ఐక్యత విచ్ఛిత్తి (అను: నిడమర్తి ఉమారాజేశ్వర రావు) . . . . . . . . . . . . . . . . 39
1. "గ్రూపు తత్వం" గురించి . . . . . . . . . . . . 40
2. చీలికను గురించి . . . . . . . . . . . . . 45
3. "ఆగస్టు కూటమి" విచ్ఛిత్తిని గురించి . . . . . . . 50
4. "ఏడుగురు"కి ఒక రాజీవాది సలహా . . . . . . . . 53
5. ట్రాట్స్కీ రద్దువాద అభిప్రాయాలు . . . . . . . . 57
జాతుల స్వయంనిర్ణయ హక్కు (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . 63
1. జాతుల స్వయంనిర్ణయ హక్కు అంటే ఏమిటి? . . . . . . 63
2. ఈ సమస్య చారిత్రక నిర్దిష్ట ప్రాతిపదిక . . . . . . . 69
3. రష్యాలోని జాతీయ సమస్య నిర్దిష్ట లక్షణాలు, రష్యా బూర్జువా ప్రజాతంత్ర పరివర్తన . . . . . . . . . . . . . 73
4. జాతీయ సమస్యలో "ఆచరణాత్మకత" . . . . . . . . . 78
5. జాతీయ సమస్యలో ఉదారవాద బూర్జువావర్గమూ, సోషలిస్టు అవకాశవాదులూ . . . . . . . . . . . . . . 84
6. స్వీడన్‌నుంచి నార్వే విడిపోవడం . . . . . . . . . . 95
7. అంతర్జాతీయ లండన్ మహాసభ (1896) తీర్మానం . . . . 102
8. ఊహాజనితవాది కార్ల్ మార్క్స్, ఆచరణశీలి రోజా లుక్సెంబుర్గ్ . 107

9. 1903 కార్యక్రమమూ, దాని రద్దుదారులూ . . . . . . 115
10. ముగింపు . . . . . . . . . . . . . . . 125
యుద్ధమూ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ (అను: రాచమల్లు రామ చంద్రారెడ్డి) . . . . . . . . . . . . . . 131
మహా రష్యన్ల జాతీయ గర్వం గురించి (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . 139
యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం గురించి (అను: రాచమల్లు రామచంద్రా రెడ్డి) . . . . . . . . . . . . . . . . . 144
ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ యుద్ధం గురించి విడుదలచేసిన ప్రణాళికమీద "సొత్సియాల్ డెమోక్రట్" సంపాదకీయ వ్యాఖ్య (అను: నిడమర్తి ఉమా రాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . 149
యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం గురించి . . . . . . . 149
సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ (సులభశైలి స్థూల చిత్రం) (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . . . . . . 150
ముందుమాట . . . . . . . . . . . . . . . 150
ఫ్రెంచి, జర్మన్ కూర్పులకు ముందుమాట . . . . . . . . 152
I. . . . . . . . . . . . . . . 152
II. . . . . . . . . . . . . . . 152
III. . . . . . . . . . . . . . . 154
IV. . . . . . . . . . . . . . . 155
V. . . . . . . . . . . . . . . 156
1. ఉత్పత్తి సాంద్రీకరణా, గుత్తసంస్థలూ . . . . . . . . 159
2. బాంకులూ, వాటి కొత్త పాత్ర . . . . . . . . . 174
3. ఫైనాన్స్ పెట్టుబడీ, ఫైనాన్షల్ ప్రభుమండలీ . . . . . . 192
4. పెట్టుబడి యెగుమతి . . . . . . . . . . . . 208
5. పెట్టుబడిదారీ సంఘాల మధ్య ప్రపంచ విభజన . . . . . 214
6. గొప్ప రాజ్యాల మధ్య ప్రపంచ విభజన . . . . . . . 223
7. పెట్టుబడిదారీ విధానపు ప్రత్యేక దశగా సామ్రాజ్యవాదం . . . 236
8. పెట్టుబడిదారీ విధానపు పరభాగ్యోప జీవనమూ, శైథిల్యమూ . . 248
9. సామ్రాజ్యవాద పరిశీలన . . . . . . . . . . . 257

10. చరిత్రలో సామ్రాజ్యవాదపు స్థానం . . . . . . . . . 272
"సామ్రాజ్యవాద ఆర్థికవాదపు" ఆవిర్భవిస్తున్న ధోరణి (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . . 278
శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమం (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) 288
I. . . . . . . . . . . . . . . . . . . 288
II. . . . . . . . . . . . . . . . . . . 292
III. . . . . . . . . . . . . . . . . . . 295
వివరణలు . . . . . . . . . . . . . . . . . . 301
పేర్ల సూచి . . . . . . . . . . . . . . . . . . 347

# ప్రచురణకర్తల మాట

9 సంపుటాలుగా మేము వెలువరిస్తున్న సంకలిత రచనల్లోని మూడవ సంపుటంలో 1906–1916 దశలో వి. ఐ. లెనిన్ చేసిన రచనలు వున్నాయి.

ఈ సంవత్సరాల్లో పార్టీని పదిలంగా కాపాడి, బలపరచేందుకు లెనిన్ రాజీలేని పోరాటం జరిపాడు, ప్రథమ రష్యన్ విప్లవ (1905–1907) గుణపాఠాలను సాధారణీకరించే కృషిని కొనసాగించాడు, కొత్త పరిస్థితుల్లో పార్టీ కర్తవ్యాలనూ, విధానాన్నీ నిర్దేశించాడు. ఈ సంపుటంలో ఉన్న రచనలు పార్టీలోపలా, అంతర్జాతీయ రంగంలోనూ అవకాశవాదానికీ, రివిజనిజానికీ వ్యతిరేకంగా లెనిన్ సాగించిన పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి. వలసదేశాల్లోనూ, పరాధీన దేశాల్లోనూ జరిగే జాతీయ విముక్తి ఉద్యమ సమస్యలపైనా, సైనికతత్వానికీ, సామ్రాజ్యవాద యుద్ధానికీ వ్యతిరేకంగా జరిగే పోరాట సమస్యలపైనా బోల్షెవిక్కుల వైఖరి యీ రచనల్లో రూపొందించబడింది.

మాస్కోలో 1905 డిసెంబరు సాయుధ తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఘటనలను గురించి వి. ఐ. లెనిన్ తన రచనల్లో మళ్లీ మళ్లీ చర్చించి, మాస్కో శ్రామికవర్గం జరిపిన పోరాటపు చరిత్రాత్మక అనుభవాన్ని లోతుగా అధ్యయనం చెయ్యవలసిందిగా నొక్కి చెప్పాడు. ఈ సంపుటంలో చేర్చబడిన "మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు" అన్న లెనిన్ రచన సాయుధ తిరుగుబాటుకు సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతాభివృద్ధిలో ముఖ్యమైన ఒక మైలురాయి. లెనిన్ తన యీ రచనలో 1905 డిసెంబరులో జరిగిన సాయుధ తిరుగుబాటుకు సంబంధించిన నిర్దిష్టమైన సంఘటనలను అన్ని కోణాలనుంచీ విశ్లేషించి, కొన్ని సైద్ధాంతిక సాధారణీకరణలనూ, ఆ తిరుగుబాటును శ్రామికవర్గ పార్టీ సంఘటితం చేసి, దానికి నాయకత్వం సమకూర్చే విషయంలోనూ, దానికితోడు విప్లవంలో కార్మికవర్గం అనుసరించే సాయుధ పోరాట రూపాలు, పద్ధతులు, ఎత్తుగడలను గురించి కూడా ఆచరణాత్మక సూచనలు చేశాడు.

తిరుగుబాటును ఒక కళగా పరిగణించాల్సి వుంటుందన్న మార్క్స్, ఎంగెల్స్‌ల ప్రసిద్ధమైన సూత్రీకరణమీదనే ఆధారపడి, ఒక నూతన చారిత్రక పరిస్థితికీ, శ్రామికవర్గ పోరాటపు నూతన పరిస్థితులకీ ముడిపెట్టి లెనిన్ ఆ సమస్యను మొట్టమొదటి సారిగా సమగ్రంగా విశ్లేషించాడు. సార్వత్రిక సమ్మె శ్రామికవర్గ పోరాటపు అత్యున్నత రూపమైన సాయుధ పోరాటంలోకి పరిణతి చెందడమన్న సమస్యపట్ల లెనిన్ విశేషమైన శ్రద్ధ చూపాడు. 1905 డిసెంబరు నాటి శ్రామిక ప్రజా పోరాటం సమ్మెనుంచి తిరుగుబాటుకి పరివర్తన చెందడాన్ని రష్యన్ విప్లవం సాధించిన అత్యున్నత విజయంగా లెనిన్ పరిగణించాడు.

విప్లవాన్ని సంకుచితమైన బూర్జువా చట్రానికి పరిమితం చేసి, విప్లవ నాయకత్వాన్ని బూర్జువావర్గానికి కట్టబెట్టాలన్న మెన్షెవిక్కుల అవకాశవాద ఎత్తుగడలను లెనిన్ నిశితంగా విమర్శించాడు. శ్రామికవర్గ, రైతాంగాల విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వ స్థాపన మాత్రమే బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాల అమలుకు బాటవేసి, అది సోషలిస్టు విప్లవంగా పరిణతి చెందడానికి దారితీస్తుందని లెనిన్ పదేపదే వక్కాణించి చెప్పాడు.

కార్యక్రమం, ఎత్తుగడల విషయంలో మార్క్సిజంనుంచి మెన్షెవిక్కులు వైదొలగిన కారణంగా, నిర్మాణానికి సంబంధించిన విషయాల్లో కూడా వాళ్ళ అవకాశవాద పద్ధతులు అవలంబించేందుకు దారితీసింది. పార్టీ విప్లవ కార్యక్రమాన్నీ, నినాదాలనీ పరిత్యజించిన మెన్షెవిక్కులు రహస్య విప్లవ కార్యకలాపాల నిలిపివేతకోసం కృషిచేయడమే కాదు, వాస్తవానికి కార్మికవర్గ విప్లవ పార్టీ రద్దు కావాలని కోరుకున్నారు. విప్లవాత్మక సంప్రదాయాలను పరిత్యజించి మెన్షెవిక్కులు చట్టబద్ధమైన సంస్కరణవాద కార్మిక పార్టీ ఉనికికి జారిస్టు ప్రభుత్వంనుంచి అనుమతి పొందేందుకు ప్రయత్నించారు. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ (ఆర్.ఎస్.డి.ఎల్.పి.)లోని యీ అవకాశవాద ధోరణికి వ్యతిరేకంగా లెనిన్ రాజీలేని సైద్ధాంతిక, నిర్మాణపర పోరాటాన్ని మొదలుపెట్టాడు.

అదే సమయంలో లెనిన్, పార్టీలోని ''ఒత్‌జొవిజం'' అనబడే ఒక ''వామపక్ష'' అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాడాడు. విప్లవ నినాదాలను మాటుగా పెట్టుకొని, అభివృద్ధినిరోధక పరిస్థితుల్లో పార్టీ రహస్య కార్యకలాపాలు మాత్రమే సాగించాలని చెప్తూ, ఒత్‌జొవిస్టులు చట్టబద్ధ పద్ధతుల్లో కార్యకలాపాలు సాగించడానికి స్వస్తిచెప్పాలనీ, స్టేట్ దూమ (పార్లమెంటు)నుంచి సోషల్ డెమోక్రటిక్ ప్రతినిధులను ఉపసంహరించాలనీ పార్టీకి విజ్ఞప్తి చేశారు.

1908 డిసెంబరులో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ అఖిల రష్యా కాన్ఫరెన్సు ''రద్దువాదులను'' అవకాశవాదులుగా ఖండించి, ''ఒత్‌జొవిజం''నుంచి తెగతెంపులు చేసుకుంది.

"దారిలో" అన్న తన వ్యాసంలో, వర్గాల మధ్య సంబంధాల, జారిజం విధానాల మార్క్సిస్టు విశ్లేషణ ప్రాతిపదికమీద పార్టీ చట్టబద్ధ, రహస్య కార్యకలాపాల అంతస్సంబంధ సమస్యకు ఆ సమావేశం సరైన పరిష్కారాన్ని చూపిందనీ, దూమని ఒక వేదికగా వినియోగించుకోవాలని చెప్పిందనీ, దూమలోని పార్టీ విభాగపు కార్యకలాపాలకు మార్గదర్శక సూత్రాలను రూపొందించిందనీ లెనిన్ రాశాడు.

ఆ సంవత్సరాల్లోనే జాతీయ సమస్యకి సంబంధించిన సుసంగతమైన ఒక సిద్ధాంతాన్ని లెనిన్ రూపొందించాడు. సమాజపు విప్లవకర పరివర్తనలో జాతీయ సమస్యకు వున్న స్థానాన్ని వెల్లడిస్తూ, అది వర్గపోరాట ప్రయోజనాలకు లోబడి వుంటుందని ఆయన నిరూపించాడు. లెనిన్ యిలా రాశాడు: "బూర్జువావర్గం ఎప్పుడూ తన జాతీయ డిమాండ్లను అన్నింటికన్న ముందుపెడుతూ వుంటుంది... శ్రామికవర్గానికి సంబంధించి యీ జాతీయ డిమాండ్లు వర్గపోరాట ప్రయోజనాలకు లోబరచబడతాయి" (ఈ సంపుటంలో 79వ పేజి).

ఈ సంపుటంలో ఉన్న "జాతుల స్వయంనిర్ణయ హక్కు," "మహా రష్యన్ల జాతీయ గర్వం గురించి" అన్న రచనలకు జాతీయ సమస్యపైన బోల్షివిక్ పార్టీ కార్యక్రమ, సిద్ధాంతాల వివరణ, సమర్థనల్లో విశేషమైన సైద్ధాంతిక, ఆచరణాత్మక ప్రాముఖ్యం వుంది.

మార్క్స్, ఎంగెల్స్‌ల ఉపదేశాన్ని సృజనాత్మకంగా మరింత అభివృద్ధిచేస్తూ, జాతుల సమస్యా పరిష్కారం శ్రామికవర్గ విప్లవ విజయంమీద ఆధారపడివుంటుందన్న సూత్రాన్ని లెనిన్ రూపొందించాడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్దేశింపబడిన జాతీయ విముక్తి ఉద్యమం సామ్రాజ్యవాదాన్ని దెబ్బతీసి, బలహీనపరచి, మరింత అభివృద్ధిచెందిన దేశాల కార్మికులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటాన్ని సులభతరం చేస్తుంది.

జాతీయ సమస్యమీద బోల్షివిక్ పార్టీ కార్యక్రమానికి సంబంధించిన ప్రధాన ప్రాతిపదిక సూత్రాలను లెనిన్ రూపొందించాడు; ఇవి — స్వయంనిర్ణయ హక్కు, జాతుల సమానత్వం; ప్రజాస్వామ్యం, సోషలిజాలకోసం జరిగే పోరాటంలో వివిధ జాతులకు చెందిన కార్మికులకూ, శ్రామిక ప్రజలకూ మధ్య ఘనిష్ఠత; సోషలిస్టు అభివృద్ధి పంథాలో ప్రవేశించిన జాతుల ప్రజల మధ్య సన్నిహితమైన రాజకీయ, సైనిక, ఆర్థిక పొత్తు; తమతమ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధి ప్రాతిపదికమీద జాతులకు సమానత్వం సమకూర్చడం.

జాతుల స్వయంనిర్ణయ హక్కు అంటే, విడిపోయి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకునేందుకు జాతులకు వున్న హక్కుగా బోల్షివిక్కులు అర్థంచేసుకుంటున్నారని లెనిన్ తన రచనల్లో వివరించాడు. జాతుల స్వయంనిర్ణయ హక్కును తిరస్కరించడమంటే, పెత్తందారీ జాతి ప్రత్యేక సౌకర్యాలను సమర్థించడమే. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం జరిపే పోరాట ప్రయోజనాల సాధనకు అన్ని జాతులకు చెందిన కార్మికుల

మధ్య పూర్తి సంఘీభావమూ, సాధ్యమైనంత మిక్కిలి సన్నిహిత ఐక్యతా అవసరం, బూర్జువా వర్గం అనుసరించే జాతీయవాద విధానాన్ని తిప్పికొట్టడం అవసరం. జాతుల స్వయం నిర్ణయ హక్కు సమస్యను ఏదో ఒక జాతి విడిపోయే ఆవశ్యకతా సమస్యతో గందరగోళం చెయ్యకూడదు. ప్రతి నిర్దిష్ట సందర్భంలోనూ యీ సమస్యను, సోషలిజంకోసం శ్రామిక వర్గం జరిపే వర్గపోరాట ప్రయోజనాల దృష్ట్యా, సమాజపు సాంఘికాభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే పరిశీలించాలి. జాతుల సమస్యతోబాటు ఏ సాంఘిక సమస్యనైనా కూడా ఆయా దేశాల నిర్దిష్ట చారిత్రక పరిస్థితినీ, విశిష్ట లక్షణాలనూ తగినంతగా పరిగణనలోకి తీసుకొని మరీ విశ్లేషించాలన్నది మార్క్సిస్టు సూత్రం.

కార్మికవర్గం అనుసరించిన విధానపు సారాంశం శ్రామికవర్గ అంతర్జాతీయతేననీ, దీని సారాంశం మార్క్స్, ఎంగెల్స్‌ల "సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!" అన్న నినాదంలో వ్యక్తంచెయ్యబడిందనీ లెనిన్ వెల్లడించాడు. కార్మికవర్గపు సిద్ధాంతంగానూ, విధానంగానూ శ్రామికవర్గ అంతర్జాతీయత బూర్జువా జాతీయవాదానికి వ్యతిరేకంగా జరిగే నిశితమైన పోరాట క్రమంలో కాకలుతీరి అభివృద్ధిచెందుతుంది. బూర్జువా జాతీయవాదపు లక్ష్యం యేమిటంటే, జాతీయత మేరకు కార్మికులనూ, సామ్రాజ్యవాద శక్తుల ఐక్య సంఘటన సమ్ముఖంలో ఆయా జాతుల ప్రజలనూ వేరుచేయడం. అదే సమయంలో, పీడిత జాతి జాతీయవాదానికీ, పీడక జాతి జాతీయవాదానికీ మధ్య కమ్యూనిస్టులు విచక్షణ చూపుతారని లెనిన్ వక్కాణించి చెప్పాడు. పీడిత జాతి జాతీయవాదంలో సాధారణంగా ప్రజాతంత్ర సారం వుంటుంది. ఒకానొక దశలో దాన్ని చారిత్రకంగా సమర్థనీయమైనదిగా కమ్యూనిస్టులు పరిగణిస్తారు. కమ్యూనిస్టులు సమర్థించేది పీడిత జాతుల జాతీయవాదపు సాధారణ ప్రజాతంత్ర సారాన్నే గాని, ఉన్నదున్నట్లు వాటి జాతీయవాదాన్ని కాదు.

శ్రామికవర్గ పార్టీల, విప్లవోద్యమపు అన్ని విభాగాల కార్యకలాపాల్లో జాతీయ, అంతర్జాతీయ అంశాలను సరైన పాళ్లలో మేళవించడం, అవసరమైతే శ్రామికవర్గపు జాతీయ, ప్రత్యేక ప్రయోజనాలను అంతర్జాతీయ, సాధారణ ప్రయోజనాలకు లోబరచడం — దీన్నే అంతర్జాతీయ విధానపు కేంద్ర సమస్యగా లెనిన్ పరిగణించాడు. సరిగా అర్థంచేసుకోబడిన జాతీయ ప్రయోజనాలు అంతర్జాతీయ ప్రయోజనాలకు విరుద్ధం కావు.

ప్రథమ ప్రపంచ యుద్ధం — దీని భారాన్ని శ్రామిక జనబాహుళ్యమే మొయ్యవలసి వచ్చింది — ఇంతకు ముందెన్నడూ లేని ఆర్థిక, రాజకీయ, జాతీయ సంక్షోభాలకు కారణభూతమై, వర్గ వైరుధ్యాలను వ్యగ్రంచేసి, ఆ విధంగా విప్లవానికి అవసరమైన వస్తుపర పూర్వావసరాలను పెంచింది.

యుద్ధం, శాంతి, విప్లవాల సమస్యలపైన బోల్షివిక్ పార్టీ సిద్ధాంతాన్నీ, ఎత్తుగడల్నీ విపులీకరించడంలో ప్రథమ ప్రపంచ యుద్ధ కాలంలో లెనిన్ రచించిన "యుద్ధమూ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం," "యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం గురించి," "శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమం" అనే వ్యాసాలకు విశేష ప్రాధాన్యం వుంది. యుద్ధంలో మగ్నమైవున్న ఉభయ పక్షాలూ సామ్రాజ్యవాద, దురాక్రమణపర, అధర్మ యుద్ధమే చేస్తున్నాయని వర్ణిస్తూ, యుద్ధంపట్ల బోల్షివిక్ పార్టీ, అంతర్జాతీయ శ్రామిక వర్గాల విప్లవకర ఎత్తుగడలను లెనిన్ రూపొందించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చడం, పెత్తందారీ వర్గాలకు వ్యతిరేకంగా విప్లవంగా మార్చడం – యిదే ఎత్తుగడలకి సంబంధించిన ప్రధాన నినాదం. ఎత్తుగడలకి సంబంధించిన రెండవ నినాదం: సామ్రాజ్యవాద యుద్ధంలో తమ సొంత ప్రభుత్వాన్ని పరాజితం చెయ్యడం – మొదటి దానితో సన్నిహితంగా ముడివడివుంది. ఆచరణలో దీని అర్థం యేమిటంటే, యీ ప్రభుత్వాలను పటిష్ఠంచేసే చర్యలను బలపరచ నిరాకరించడం, యుద్ధరంగంలోని పరాజయాలను పీడకులకు వ్యతిరేకంగా పీడితులు చేసే విప్లవ పోరాటానికి అనుకూలంగా మార్చుకోవడం. ఎత్తుగడలకు సంబంధించి లెనిన్ ప్రతిపాదించిన మూడవ నినాదం: పతనమైపోయిన రెండవ ఇంటర్నేషనల్‌తో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలి, ఒక కొత్త, నికరమైన శ్రామికవర్గ మూడవ ఇంటర్నేషనల్‌ని నెలకొల్పుకోవాలి.

సోషలిస్టు విప్లవానికి సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతం యింతకు ముందు పేర్కొనబడిన "యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం గురించి," "శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమం," అలాగే, "సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అనే రచనల్లో మరింత అభివృద్ధిచెయ్యబడింది. సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ దేశాల అసమ ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సూత్రాన్ని కనుగొని, ధృవీకరించిన తర్వాత, ఆదిలో సోషలిజం కొద్ది దేశాల్లో గాని ఒకేఒక దేశంలో గాని విజయవంతమయ్యే అవకాశం వుందని లెనిన్ నిర్ధారణ చేశాడు. నిర్దిష్టమైన చారిత్రక పరిస్థితి ఆధారంగా ధర్మాధర్మ యుద్ధాల సిద్ధాంతాన్నీ, అలాగే శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమాన్నీ లెనిన్ రూపొందించాడు. సోషలిస్టు విజయాల సాయుధ పరిరక్షణ, శ్రామికవర్గ రాజ్య పరిరక్షణలో యుద్ధాల ధర్మబద్ధ స్వభావం – యివి శ్రామికవర్గపు లెనినిస్టు సైనిక కార్యక్రమంలో ఒక భాగం. అన్ని దేశాల్లోనూ ఏక కాలంలో సోషలిజం విజయవంతం కావడం అసాధ్యమన్న సిద్ధాంతంనుంచి నేరుగా యిది ఉత్పన్నమవుతుంది. ఆదిలో సోషలిజం ఒక్క దేశంలో గాని, కొన్ని దేశాల్లో గాని విజయవంతమవుతుందన్న సూత్రంనుంచే విభిన్న సామాజిక, రాజకీయ వ్యవస్థలను కలిగిన రాజ్యాల శాంతియుత సహజీవన సూత్రం కూడా ఉత్పన్నమవుతుంది.

# మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు

"1905 డిసెంబర్‌లో మాస్కో" (మాస్కో, 1906) అనే పుస్తకం ప్రచురించబడడం యెంతో సకాలంలో జరిగింది. డిసెంబర్ తిరుగుబాటు[1] గుణపాఠాలను జీర్ణం చేసుకోవడం కార్మికుల పార్టీకి జరూరు కర్తవ్యం. దురదృష్టవశాత్తు, యీ పుస్తకం గంటెడు విషం కలిపి భ్రష్టు పట్టించిన తేనె పీపా లాంటిది: అసంపూర్ణంగా వున్నప్పటికీ అత్యంత ఆసక్తికరమైన సమాచారమూ, చాలా అశ్రద్ధతో చేసిన మిక్కిలి సాదా నిర్ధారణలూ. యీ నిర్ధారణల గురించి మరొక సందర్భంలో మాట్లాడుదాం. ప్రస్తుతం యీనాటి ముఖ్య రాజకీయ సమస్యకు, మాస్కో తిరుగుబాటు గుణపాఠాలకు, మన శ్రద్ధను మళ్లిద్దాం.

మాస్కోలోని డిసెంబర్ ఉద్యమపు ప్రధాన రూపాలు శాంతియుత సమ్మె, ప్రదర్శనలూ. కార్మికులలో అపారమైన మెజారిటీ చురుకుగా పాల్గొన్న పోరాట రూపాలు యివి మాత్రమే. అయినప్పటికీ, స్వతంత్రమైన, అత్యంత ముఖ్యమైన పోరాట రూపంగా సాధారణ సమ్మెకు కాలం చెల్లిందనీ, ఉద్యమం దుర్వారమైన, ప్రాకృతిక శక్తితో యీ సంకుచిత హద్దులను పగలజీల్చుకొని వెలువడుతూ, తిరుగుబాటు అనే అత్యున్నత పోరాట రూపాన్ని ఉత్పన్నం చేస్తున్నదనీ మాస్కోలోని డిసెంబర్ చర్య కన్నులకు కట్టినట్లు నిరూపించింది.

సమ్మెకు పిలుపు యివ్వడంలో, అనివార్యంగా అది తిరుగుబాటుగా పెరగక తప్పదని విప్లవ పార్టీలన్నీ, మాస్కో యూనియన్లు అన్నీ గుర్తించినాయి, మనోదృష్టితో గ్రహించినాయి కూడా. డిసెంబర్ 6న కార్మిక ప్రతినిధుల సోవియట్ "సమ్మెను సాయుధ తిరుగుబాటుగా మార్చడానికి ప్రయత్నించాలని" తీర్మానించింది. కానీ, వాస్తవం యేమిటంటే, యే సంస్థలూ దీనికి సిద్ధంగా లేవు. ఐచ్ఛిక పోరాట దళాల సంయుక్త కౌన్సిల్[2] (డిసెంబర్ 9న!) తిరుగుబాటును గురించి యేదో సుదూర విషయమైనట్లు మాట్లాడింది; జరిగిన వీధి పోరాటంతో దానికేమీ సంబంధం లేదనీ, పోరాటం దాని అదుపులో లేదనీ సుస్పష్టంగా తెలుస్తున్నది. శాఖలు ఉద్యమంయొక్క పెరుగుదలనుంచీ, విస్తృతినుంచీ వెనకపడినాయి.

ప్రధానంగా, అక్టోబర్ తర్వాత[3] ఏర్పడిన వస్తుగత పరిస్థితుల ఒత్తిడి ఫలితంగా, సమ్మె తిరుగుబాటుగా పెరుగుతూ వుండింది. సాధారణ సమ్మె అనేది యిక యెంత

మాత్రమూ ప్రభుత్వాన్ని యేమరచి జరగజాలదు: ప్రభుత్వం అప్పటికే విప్లవ ప్రతిఘాత శక్తులను సంఘటితపరిచింది, అవి మిలిటరీ చర్యకు సిద్ధంగా వుండినాయి. అక్టోబర్ తర్వాత మొత్తం రష్యన్ విప్లవ గతీ, డిసెంబర్ దినాలలో మాస్కోలోని ఘటనల క్రమమూ మార్క్సు చేసిన ప్రగాఢ సూత్రీకరణల్లో ఒకదాన్ని కన్నులకు కట్టినట్లు ధ్రువపరిచినాయి: విప్లవం బలమైన సమైక్య విప్లవ ప్రతిఘాతాన్ని ఉత్పన్నం చేస్తూ పురోగమిస్తుంది; అనగా అది అంతకంతకూ తీవ్రమైన ఆత్మరక్షణ చర్యలు తీసుకునేటట్లు శత్రువును నిర్బంధించి, ఆ విధంగా అంతకంతకూ బలమైన దాడి పద్ధతులను రూపొందిస్తుంది.[4]

డిసెంబర్ 7, 8: శాంతియుత సమ్మె, శాంతియుత వీధి ప్రదర్శనలూ. 8 సాయంత్రం: అక్వేరియంను పట్టుకోవడం.[5] 9 పగలు: స్త్రస్త్నాయ స్క్వేర్‌లోని గుంపుమీద ఆశ్విక సైనికులు దాడిచేసినారు. సాయంత్రం: ఫీడ్లర్ భవనంమీద దాడి జరిగింది.[6] ఉద్రేకం పెరిగింది. అసంఘటిత వీధి సమూహాలు అత్యంత అప్రయత్నంగా, తటపటాయిస్తూ, మొదటి మార్గావరోధాలు నిర్మించినారు.

10: వీధుల్లోని మార్గావరోధాలమీదా, జన సమూహాలమీదా ఫిరంగి కాల్పులు జరిగినాయి. మార్గావరోధాలు మరింత ప్రయత్న పూర్వకంగా నిర్మించబడినాయి — యెక్కడో ఒకచోట కాదు, నిజంగా విస్తృత ప్రమాణంలో. మొత్తం ప్రజానీకమంతా వీధుల్లో చేరింది; నగరంలోని ముఖ్య కేంద్రాలన్నిటినీ మార్గావరోధాల సమాహారం ఆవరించింది. కొన్ని రోజుల పాటు ఐచ్ఛిక పోరాట దళాలు సైనికులతో మొండి గెరిల్లా యుద్ధం చేసినాయి; యిది సైనికులను నిర్వీర్యపరిచింది, అదనపు బలాలకొరకు దుబాసొవ్ ప్రాథేయపడవలసివచ్చింది. డిసెంబర్ 15న మాత్రమే ప్రభుత్వ బలాల ఆధిక్యం పూర్తి అయింది; డిసెంబర్ 17న సెమ్యోనొవ్‌స్కీ రెజిమెంటు చివరి తిరుగుబాటు కేంద్రం అయిన ప్రేస్న్య పేటను[7] అణచివేసింది.

సమ్మె, ప్రదర్శనాలనుండి విడి మార్గావరోధాలవరకు. విడి మార్గావరోధాల నుండి సామూహిక మార్గావరోధాల నిర్మాణంవరకూ, సైనికులతో వీధి పోరాటంవరకూ. సంఘాల ప్రమేయం లేకుండా కార్మికవర్గ సామూహిక పోరాటం సమ్మెనుండి తిరుగుబాటువరకు అభివృద్ధి అయింది. యిది 1905 డిసెంబర్‌లో రష్యన్ విప్లవం సాధించిన అత్యంత గొప్ప చారిత్రక లాభం; గత లాభాలన్నిటిలాగే యిది కూడా మహత్తరమైన త్యాగాల వ్యయంతో కొనబడింది. ఉద్యమం సాధారణ రాజకీయ సమ్మెనుండి మరింత ఉన్నత దశకు కొనిపోబడింది. ప్రగతి వ్యతిరేకత తన ప్రతిఘటనలో ఆఖరి హద్దుదాకా పోయేలా అది చేసింది; ఆ విధంగా అది విప్లవం కూడా దాడి పద్ధతులను ప్రయోగించడంలో ఆఖరి హద్దుదాకా పోయే తరుణాన్ని అపారంగా దగ్గరికి తెచ్చింది. ప్రగతి వ్యతిరేకత మార్గా

వరోధాలమీదా, భవనాలమీదా, జనసమూహాలమీదా కాల్పులు చేయడంకంటె ముందుకు పోజాలదు. కానీ, విప్లవం మాస్కో ఐచ్ఛిక పోరాట దశాలు పోయినంతకంటె చాలా ముందుకు పోగలదు; విస్తృతిలోనూ, తీవ్రతలోనూ అది యింకా యెంతో ముందుకు పోగలదు. మరి, విప్లవం డిసెంబర్‌నుండి యెంతో పురోగమించింది. విప్లవ సంక్షోభంయొక్క అడుగు మట్టం అపారంగా విస్తరించింది — యిప్పుడిక వాదరకు మరింత తీక్ష్ణత వచ్చేటట్లు పదును పెట్టాలి.

వస్తుగత పరిస్థితులలో వచ్చిన మార్పుసూ, సమ్మెనుండి తిరుగుబాటుకు పరివర్తన జరగవలసిన అవసరాన్నీ కార్మికవర్గం తన నాయకులకంటె ముందుగా పసికట్టింది. యెప్పుడూ జరిగేటట్లే, ఆచరణ సిద్ధాంతంకంటె ముందు నడిచింది. శాంతియుత సమ్మెతోనూ, ప్రదర్శనలతోనూ కార్మికులు తృప్తిపడలేదు. తరువాత చేయవలసిందేమిటని వాళ్ళు అడిగినారు. వాళ్ళు మరింత కృతనిశ్చిత చర్యను డిమాండుచేసినారు. మార్గావరోధాలు నిర్మించడానికి యిచ్చిన ఆదేశాలు పేటలకు చాలా ఆలస్యంగా చేరినాయి, అప్పటికే నగర కేంద్రంలో మార్గావరోధాలు నిర్మింపబడుతూ వుండినాయి. కార్మికులు విస్తారమైన సంఖ్యలో పనికి పూనుకున్నారు; కానీ యిది కూడా వాళ్ళను తృప్తిపరచలేదు. తరువాత చేయవలసిందేమిటని వాళ్ళు అడిగినారు — చురుకైన చర్యలు వాళ్ళు డిమాండుచేసినారు. డిసెంబర్‌లో మనం, సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గంయొక్క నాయకులం తన సైన్యాలలో అత్యధిక భాగం యుద్ధంలో క్రియాత్మకంగా పాల్గొననట్లు వ్యూహం తీర్చిన సేనానాయకుని లాగా వుండినాము. కార్మిక జనబాహుళ్యం కృతనిశ్చిత సామూహిక చర్యకొరకు ఆదేశాలు డిమాండుచేసింది, కానీ పొందలేకపోయింది.

కనుక, సమ్మె అకాలంలో జరిగిందనీ, సమ్మెను ప్రారంభించివుండకూడదనీ, "వాళ్ళు సాయుధ పోరాటానికి దిగివుండకూడదు" అనీ ప్లెహానొవ్ చెప్పగా అవకాశవాదు లందరూ యెగబడి సంగ్రహించుకున్న అభిప్రాయంకంటె హ్రస్వదృష్టి అభిప్రాయం వుండజాలదు. తద్వ్యతిరేకంగా, మనం మరింత కృతనిశ్చయంగా, చురుకుగా, పరాక్రమంగా సాయుధ పోరాటానికి దిగివుండాలి. శాంతియుత సమ్మెకు పరిమితం చేయడం అసాధ్యమనీ, భయంలేని, సడలుబాటులేని సాయుధ పోరాటం అవసరమనీ మనం జనాలకు వివరించివుండాలి. రాజకీయ సమ్మెలు చాలవని యిక యిప్పుడు మనం బాహాటంగా, బహిరంగంగా ఒప్పుకోవాలి. సాయుధ పోరాటానికి అనుకూలంగా మనం జనాలలో అత్యంత విస్తృత ఆందోళన సాగించాలి; "ప్రాథమిక దశల" గురించిన మాటలతో యీ సమస్యను మరుగుపరచడానికి గానీ, మరే విధంగానైనా గంద్రగోళపరచడానికి గానీ మనం ప్రయత్నించకూడదు. రాబోయే విప్లవ చర్యయొక్క తక్షణ కర్తవ్యంగా తెంపరి, రక్తపాతపు ఘాతుక యుద్ధంయొక్క అవశ్యకతను

మనం జనాలనుండి మరుగుపరిస్తే, మనం ఆత్మవంచనా, ప్రజావంచనా చేసినట్లౌతుంది.

యిది డిసెంబర్ ఘటనల మొదటి గుణపాఠం. మరొక గుణపాఠం తిరుగుబాటు స్వభావానికీ, దానిని సాగించిన పద్ధతులకూ, సైనికులు ప్రజల పక్షానికి వచ్చేటట్లు చేసిన పరిస్థితులకూ సంబంధించినది. యీ చివరి అంశం విషయంలో మన పార్టీలోని దక్షిణ పక్షంలో తీవ్రమైన దురభిప్రాయం వుంది. ఆధునిక సైనికులతో పోరాడే అవకాశం లేదనీ, సైనికులు విప్లవకరం కావాలనీ వాళ్లు అంటారు. నిజమే, విప్లవం సామూహిక స్వభావం పొంది, సైనికులకు వ్యాపిస్తే తప్ప గురుతరమైన పోరాటపు సమస్యే లేదు. మనం సైనికులలో పనిచేయాలనేది చెప్పనక్కరలేదు. కానీ, మనం నచ్చజెప్పిన ఫలితంగా గానీ, తమ సొంత విశ్వాసాల ఫలితంగా గానీ వాళ్లు ఒక్క దెబ్బతో మనవైపుకు వస్తారని మనం ఊహించకూడదు. యిది యెంత మక్కీకిమక్కీ, నిర్జీవపు అభిప్రాయం అయిందీ మాస్కో తిరుగుబాటు స్పష్టంగా నిరూపించింది. వాస్తవం యేమిటంటే, ప్రతి నిజమైన ప్రజా ఉద్యమంలోనూ అనివార్యమైనట్టి సైనికుల తటపటాయింపు, విప్లవ పోరాటం తీవ్రమైనప్పుడల్లా, సైన్యంకొరకు సిసలైన పోరాటానికి దారితీస్తుంది. ప్రగతి వ్యతిరేకతకూ విప్లవానికీ మధ్య సైన్యంకొరకు జరిగే ఆదుర్దాతో కూడిన తెంపరితనపు పోరాటానికి మాస్కో తిరుగుబాటు కచ్చితంగా ఒక ఉదాహరణగా వుండింది. మాస్కో పటాలంలోని పద్దెదువేలమందిలో అయిదువేలమంది మాత్రమే విశ్వసనీయులని దుబాసొవ్ స్వయంగా ప్రకటించినాడు. తటపటాయించేవాళ్లను ప్రభుత్వం అత్యంత వివిధమైన తెంపరి చర్యలతో అరికట్టింది: నచ్చచెప్పింది, ఉబ్బించింది, లంచాలు యిచ్చింది, గడియారాలూ, డబ్బూ, వగైరా బహూకరించింది, సారాయితో మత్తెక్కించింది, అబద్ధాలు చెప్పింది, బెదరించింది, బారకాసులలో వుంచి నిరాయుధులను చేసింది, అత్యంత అవిశ్వసనీయులుగా అనుమానింపబడినవాళ్లను ద్రోహంతోనూ, హింసతోనూ తొలగించింది. యీ విషయంలో మనం ప్రభుత్వంకంటె వెనుకబడినామని బాహాటంగా, నిస్సంకోచంగా ఒప్పుకునే ధైర్యం మనకు వుండాలి. తటపటాయించే సైనికుల కొరకు ప్రభుత్వం యెలాంటి పోరాటం చేసి గెలిచిందో అలాంటి ధైర్యంతో, యుక్తితో, ఉద్ధతితో కూడిన, చురుకైన పోరాటానికి మన వశంలో వుండిన శక్తులను మనం వినియోగించలేదు. మనం సైన్యంలో పనిచేసినాము, సైనికులను మనవైపు తిప్పుకోడానికి భవిష్యత్తులో సిద్ధాంతపరంగా మన కృషిని ద్విగుణీకృతం చేస్తాము. కానీ, తిరుగుబాటు సమయంలో సైనికులకొరకు ప్రత్యక్ష పోరాటం కూడా సాగాలనే విషయం మనం మరచిపోతే, మనం దౌర్భాగ్యపు ఛాందసులమని రుజువుచేసుకుంటాము.

సిద్ధాంతపరంగా సైనికులను మనవైపు తిప్పుకోడంలో, డిసెంబర్ రోజులలో మాస్కో కార్మికవర్గం మనకు అద్భుతమైన గుణపాఠాలు నేర్పింది. ఉదాహరణకు, డిసెంబర్ 8న,

ప్రెస్నెన్స్కాయ స్క్వేర్‌లో జనం అశ్విక సైనికులను చుట్టుముట్టి, వాళ్లతో కలిసిమెలసి, చనవు నెరపి, వెనక్కి పోయేటట్లు వాళ్లకు నచ్చజెప్పినారు. డిసెంబర్ 10న, ప్రేస్న్య పేటలో, యిద్దరు కార్మిక బాలికలు పదివేలమంది జనంలో యెర్ర జండా పట్టుకొని "మమ్మల్ని చంపండి! ప్రాణం వుండగా మేమీ జండాను అప్పగించము!" అని కేకలు వేస్తూ, పరుగెత్తుతూ సైనికుల కెదురుగా వచ్చినారు. సైనికులు యేమి చేయడానికీ తోచక, గుర్రాల మీద దౌడుతీసినారు, "సైనికులకు జై!" అని జనం జయజయ ధ్వానాలు చేసినారు. ధైర్య, వీరత్వాల యీ ఉదాహరణలు కార్మికవర్గ మనఃఫలకంమీద శాశ్వతంగా ముద్రింపబడి వుండాలి.

మనం దుబాసోవ్‌కు వెనుకబడిన ఉదాహరణలు యిస్తాను. డిసెంబర్ 9న, తిరుగుబాటుదార్లతో కలవడానికి సైనికులు "మార్సెలేజ్" పాట పాడుకుంటూ బొల్షాయ సెర్పు హోవ్స్కయ వీధివెంట పోతూవుండినారు. వాళ్లను కలుసుకోడానికి కార్మికులు తమ ప్రతినిధులను పంపినారు. మలాహోవ్ స్వయంగా గుర్రంమీద చావుపరుగుతో వాళ్లవద్దకు వచ్చినాడు. కార్మికులకు సమయం మించిపోయింది, సైనికులవద్దకు మలాహోవ్ ముందు వచ్చినాడు. అతను ఆవేశపూరితమైన ఉపన్యాసం యిచ్చి, వాళ్లను తటపటాయించేటట్లు చేసి, అశ్విక సైనికులతో వాళ్లను చుట్టుముట్టి, వాళ్లను బారకాసులకు నడిపించుకొని పోయి, లోపల పెట్టి తాళం వేసినాడు. రెండు రోజులలో మన పిలుపుకు 1,50,000 మంది లేచినప్పటికీ, వీళ్ల వీధుల గస్తీ యేర్పాటు చేయగలిగి, చేయవలసి వుండినప్పటికీ, ఈసారి మలాహోవ్ సైనికులవద్దకు సకాలంలో చేరినాడు, మనం చేరలేదు. మలాహోవ్ సైనికులను అశ్విక సైనికులతో చుట్టుముట్టినాడు; మనం మలాహోవ్‌లను బాంబులు వేసేవాళ్లతో చుట్టుముట్ట లేకపోయినాము. యీ పని మనం చేయగలిగింది, చేయవలసివుండింది. తిరుగుబాటు కాలంలో సివిల్, మిలిటరీ అధికారులను నిర్దాక్షిణ్యంగా హతమార్చడం మన విధి అని చాలా కాలంకిందటే సోషల్ డెమొక్రటిక్ పత్రికలు (పాత "ఇస్క్రా"[8]) గుర్తుచేసినాయి. బొల్షాయ సెర్పుహోవ్స్కయ వీధిలో జరిగింది, దాని ప్రధాన లక్షణాలలో, నెస్విజ్‌స్కియె బారకాసులలోనూ, క్రుతీత్‌స్కియె బారకాసులలోనూ పునరావృత్తమైనట్లుంది; కార్మికులు యెకాతెరినోస్లావ్ రెజిమెంటును "ఉపసంహరించుకోడానికి" ప్రయత్నించినప్పుడూ, అలెక్సాంద్రొవ్‌లోని శాపర్స్ (sappers)వద్దకు ప్రతినిధులను పంపినప్పుడూ, మాస్కోకు వస్తూ వుండిన రొస్తొవ్ తుపాకి దళాన్ని వెనక్కి పంపినప్పుడూ, కొలోమ్నలో శాపర్స్ నిరాయుధులు చేయబడినప్పుడూ, మొదలైన సందర్భాలలో కూడా అది పునరావృత్తమైనట్లుంది. తిరుగుబాటు కాలంలో, తటపటాయించే సైనికులకొరకు పోరాటం చేయడంలో మనం మన కర్తవ్యానికి సరితూగ లేకపోయినాము.

మార్క్స్ చేసిన ప్రగాఢమైన సూత్రీకరణల్లో మరొకదాన్ని, అవకాశవాదులు మరచి పోయినట్టిదాన్ని, డిసెంబర్ ఘటనలు ధ్రువపరచినాయి. అదేమిటంటే: తిరుగుబాటు అనేది ఒక కళ; యీ కళలో ప్రధాన నియమం తెంపరి సాహసంతో, తిరుగులేని కృతనిశ్చయంతో దాడి చేయడం.[9] యీ సత్యాన్ని మనం తగినంతగా జీర్ణం చేసుకోలేదు. యీ కళను, యెంత కష్టమైనా దాడి చేయాలనే నియమాన్ని, మనమే తగినంతగా నేర్చుకోలేదు, జనాలకు నేర్పనూ లేదు. యీ లోపాన్ని మనం శాయశక్తులా పూరించుకోవాలి. రాజకీయ నినాదాల సమస్యమీద అటోయిటో వుండడం చాలదు; సాయుధ తిరుగుబాటు సమస్యమీద కూడా అటోయిటో వుండడం అవసరం. దీనిని వ్యతిరేకించేవాళ్లను, దీనికి సన్నాహాలు చేయని వాళ్లను, విప్లవ మద్దతుదార్ల శ్రేణులనుండి నిర్దాక్షిణ్యంగా లాగిపారవేయాలి, విప్లవ శత్రువులవద్దకు గానీ, ద్రోహులవద్దకు గానీ, పిరికి పందలవద్దకు గానీ వెంటనే పంపించి వేయాలి. యెందుకంటే, యీ సూత్రం ప్రకారం శత్రువులనూ, మిత్రులనూ వింగడించేటట్లు ఘటనల బలమూ, పోరాట పరిస్థితులూ మనలను నిర్బంధించే రోజు సమీపిస్తున్నది. మనం బోధించవలసింది నిష్క్రియాపరత్వం కాదు, సైనికులు మన పక్షానికి వచ్చిందాకా వూరక "కాచుకొనివుండడం" కాదు. కాదు! సాహసపు చొరవకూ, సాయుధ దాడికీ గల అవసరాన్నీ, అలాంటి సమయాల్లో శత్రువులకు నాయకత్వం వహించే వ్యక్తులను హత మార్చడానికీ, తటపటాయించే సైనికులకొరకు అత్యంత చురుకైన పోరాటం చేయడానికీ గల అవశ్యకతనూ మనం మిద్దెకప్పులనుండి ప్రకటించాలి.

మాస్కో నేర్పిన మూడవ గొప్ప గుణపాఠం తిరుగుబాటుకొరకు అవలంబించే యెత్తుగడలకూ, బలాలను సంఘటితపరచడానికీ సంబంధించినది. సైనిక యెత్తుగడలు సాంకేతిక స్థాయిమీద ఆధారపడతాయి. యీ కటిక సత్యాన్ని ఎంగెల్స్ నిరూపించి, మార్క్సిస్టులందరికీ కండ్లముందు పెట్టినాడు. సైనిక సాంకేతిక స్థాయి యీనాడు పందొమ్మిదవ శతాబ్ది మధ్య భాగంలో వున్నట్లు లేదు. ఫిరంగి దళాన్ని గుంపులు యెదిరించడమూ, రివాల్వర్లతో మార్గావరోధాలను రక్షించుకోవడమూ అవివేకం. మాస్కో ఘటనల తర్వాత, ఎంగెల్స్ నిర్ణయాలను పునరాలోచించడం అవసరమనీ, "కొత్త మార్గావరోధాల యెత్తుగడల"ను మాస్కో ప్రారంభించిందనీ కౌట్స్కీ రాయడం సరైనది. యీ యెత్తుగడలు గెరిల్లా యుద్ధపు యెత్తుగడలు. యిలాంటి యెత్తుగడలకు కావలసిన సంఘటన యెలాంటిదంటే, పదిమంది వున్న దళాలు, లేదా ముగ్గురు వున్న దళాలు, లేదా యిద్దరు కూడా వున్న దళాలు. అయిదుగురో, ముగ్గురో వున్న దళాల మాట యెత్తినప్పుడల్లా నిరసించే సోషల్ డెమోక్రట్లు యిప్పుడు మనకు తరుచు కనపడుతున్నారు. కానీ ఆధునిక సైనిక సాంకేతిక స్థాయి విధించిన పరిస్థితులలో వీధి పోరాటం లేవనెత్తే యెత్తుగడల, యేర్పాట్ల నూతన సమస్యను ఉపేక్షిం

చడానికి నిరసన అనేది చౌకబారు పద్ధతి మాత్రమే. పెద్దమనుషులారా, మాస్కో తిరుగుబాటు కథను జాగ్రత్తగా అధ్యయనం చేయండి, "అయిదుగురి దళాల"కూ "కొత్త మార్గావరోధాల యెత్తుగడల"కూ మధ్య గల సంబంధం మీకు అర్థమౌతుంది.

మాస్కో యీ యెత్తుగడలను ప్రతిపాదించింది, కానీ వాటిని తగినంతగా అభివృద్ధి చేయడంలోనూ, గణనీయమైన మేరకు, నిజంగా విస్తారమైన మేరకు వాటిని ప్రయోగించడంలోనూ విఫలమైంది. ఐచ్ఛిక పోరాట దళాలు మరీ తక్కువగా వుండినాయి, సాహసపు దాడి అనే నినాదం కార్మిక జనాలకు యివ్వలేదు, వాళ్ళు దానిని ప్రయోగించలేదు; గెరిల్లా దళాలు స్వభావంలో మరీ ఏకరూపంగా వుండినాయి, వాటి ఆయుధాలూ, పద్ధతులూ మరీ అరకొరగా వుండినాయి, గుంపుకు నాయకత్వం వహించడానికి వాటి సామర్థ్యం దాదాపు అవికసితంగా వుండింది. యీ లోపమంతటినీ మనం భర్తీచేసుకోవాలి; మాస్కో అనుభవంనుండి నేర్చుకోవడం ద్వారా, యీ అనుభవాన్ని జనాలలో వ్యాప్తిచేయడం ద్వారా, దీనిని మరింత అభివృద్ధి చేయడానికి వాళ్ళ సృజనాత్మక కృషిని ప్రేరేపించడం ద్వారా మనం భర్తీ చేసుకుంటాము. డిసెంబర్‌నుండి దాదాపు యెడతెరపి లేకుండా రష్యా అంతటా జరుగుతున్న గెరిల్లా యుద్ధమూ, సామూహిక హింసాకాండా సరైన తిరుగుబాటు యెత్తుగడలు నేర్చుకోడానికి జనాలకు నిస్సందేహంగా తోడ్పడతాయి. సోషల్ డెమోక్రసీ యీ సామూహిక హింసాకాండని గుర్తించి, తన యెత్తుగడలలో భాగంగా చేర్చుకోవాలి; దానిని యేర్పాటుచేసి, సహజంగానే, అదుపులో పెట్టుకోవాలి; దానిని కార్మికవర్గ ఉద్యమంయొక్క, సాధారణ విప్లవ పోరాటంయొక్క ప్రయోజనాలకూ, పరిస్థితులకూ లోబరచాలి; కానీ, యీ గెరిల్లా యుద్ధంయొక్క "ఆకతాయితనపు" వికృతరూపాన్ని — తిరుగుబాటు కాలంలో మన మాస్కో కామ్రేడ్లూ, పేరుకెక్కిన లాత్వియన్ రిపబ్లికన్ రోజుల్లో[10] లాత్వియన్లూ దేనితో అంత అద్భుతంగా, నిర్దాక్షిణ్యంగా వ్యవహరించినారో దాన్ని — తొలగించాలి, నిర్దాక్షిణ్యంగా కత్తిరించాలి.

యిటీవలి కాలంలో సైనిక సాంకేతిక రంగంలో కొత్త పురోగతులు జరిగినాయి. జపాన్ యుద్ధం[11] చేతి బాంబును రంగంలోకి తెచ్చింది. చిన్న ఆయుధాల ఫాక్టరీలు ఆటొమాటిక్ రైఫిళ్ళు తయారుచేసి, అమ్ముతున్నాయి. యీ రెండు ఆయుధాలూ యిప్పటికే రష్యన్ విప్లవంలో విజయవంతంగా వాడబడుతున్నాయి, కానీ తగినంత స్థాయిలో కాదు. సైనిక సామగ్రి మెరుగుదలలను వినియోగించుకోవడమూ, బాంబులను విస్తారంగా తయారుచేయడం కార్మిక దళాలకు నేర్పడమూ, ప్రేలుడు పదార్థాలూ, ఫ్యూజులూ, ఆటొమాటిక్ రైఫిళ్లూ సంపాయించుకోవడంలో కార్మిక దళాలకూ, మన పోరాట దళాలకూ తోడ్పడడమూ మనం చేయగలం, చేసితీరాలి. పట్టణాలలోని తిరుగుబాట్లలో కార్మికులలో అధికభాగం పాల్గొంటే, శత్రువుమీద సామూహిక దాడులు జరిపితే, సైనికులకొరకు — దూమ[12] తర్వాత, స్వేయా

బొర్గ్, క్రోన్‌ష్టాడ్ట్[13] తర్వాత సైనికులు యెప్పుడూ లేనంతగా ఊగిసలాడుతున్నారు — కృతనిశ్చితమైన, నేర్పుతో కూడిన పోరాటం చేస్తే, సాధారణ పోరాటంలో గ్రామీణ ప్రాంతాలు పాల్గొనడం మనం నిస్సందేహం చేస్తే, వచ్చే అఖిల రష్యా సాయుధ తిరుగుబాటులో విజయం మనదౌతుంది!

కనుక, రష్యన్ విప్లవ మహా దినాల గుణపాఠాలను మననం చేసుకుంటూ, మన పనిని మరింత విస్తృతంగా అభివృద్ధి చేద్దాం, మన కర్తవ్యాలను మరింత ధైర్యంగా పెట్టుకుందాం. మన పనికి పునాది యేదంటే, ప్రస్తుత సమయంలో వర్గ ప్రయోజనాలయొక్కా, జాతీయ అభివృద్ధి అవసరాలయొక్కా సరైన అంచనా. జారిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడమూ, విప్లవ ప్రభుత్వం రాజ్యాంగనిర్ణయ సభను సమావేశపరచేలా చెయ్యడమూ అనే నినాదంకింద కార్మికవర్గంలోనూ, రైతాంగంలోనూ, సైన్యంలోనూ అంతకంతకూ యెక్కువ భాగాన్ని మనం సమీకరిస్తున్నాము, సమీకరించబోతున్నాం. యింతకుముందు లాగే, మన పనియొక్క ప్రాతిపదికా, ప్రధాన వస్తువూ జనాల రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధి చేయడం. కానీ, యీ సాధారణ, నిత్య, మౌలిక కర్తవ్యానికితోడు, రష్యాలో యిప్పుడున్నట్టి కాలం యితర, నిర్దిష్ట, ప్రత్యేక కర్తవ్యాలను విధిస్తుంది. మనం ఛాందస పండితులమూ, కూపస్థమండూకాలమూ కావద్దు, సకల కాలాలలోనూ, సకల పరిస్థితులలోనూ మారకుండా వుండే శాశ్వత కర్తవ్యాలకు అర్థంలేని ప్రస్తావనలు చేయడం ద్వారా తత్కాలపు ప్రత్యేక కర్తవ్యాలను మనం తప్పించుకోవద్దు.

గొప్ప సామూహిక పోరాటం సమీపిస్తున్నదని మనం జ్ఞాపకం పెట్టుకుందాం. అది సాయుధ తిరుగుబాటుగా వుంటుంది. అది, సాధ్యమైనంతవరకు, ఏకకాలంలో జరగాలి. సాయుధమైన, రక్తపాతంతోకూడిన, తెంపరి పోరాటంలో దిగుతున్నామని జనాలు తెలుసుకోవాలి. మృత్యువుపట్ల యేవగింపు వాళ్లలో వ్యాపించాలి, అది విజయాన్ని నిస్సందేహం చేస్తుంది. అత్యధిక శక్తితో శత్రువుమీద దాడి చేయాలి; దాడి అనేది జనాల నినాదంగా వుండాలి, ఆత్మరక్షణ కాదు; శత్రువును నిర్దాక్షిణ్యంగా రూపుమాపడం వాళ్ల కర్తవ్యంగా వుంటుంది; పోరాటం యేర్పాటు చలనశీలమూ, పట్టువిడుపులు గలదీ అవుతుంది; సైనికులలో తటపటాయించేవాళ్లు క్రియాత్మక భాగస్వామ్యంలోకి ఆకర్షింపబడతారు. యీ ముఖ్యమైన పోరాటంలో వర్గచైతన్యపూరిత కార్మికవర్గంయొక్క పార్టీ తన విధిని పరిపూర్ణంగా నిర్వర్తించాలి.

"ప్రొలెతారియ్," సంచిక 2,
ఆగస్టు 29, 1906

# దారిలో

విచ్ఛిత్తి, సిద్ధాంత, రాజకీయ అనైక్యతా, పార్టీ లక్ష్యరహితంగా కొట్టుకపోవడమూ జరిగిన సంవత్సరం గడిచింది. మన సకల పార్టీ శాఖల సభ్యత్వమూ పడిపోయింది. వాటిలో కొన్ని – అన్నిటికంటె తక్కువ కార్మికవర్గ సభ్యత్వం గలవి – ముక్క చెక్కలైనాయి. విప్లవం సృష్టించిన అర్ధచట్టబద్ధ పార్టీ శాఖలు పదేపదే బ్రద్దలు చేయబడినాయి. పరిస్థితులు యే స్థితికి వచ్చినాయంటే, సాధారణ విచ్ఛిత్తి ప్రభావం వలన పార్టీలోని కొంత మంది పాత సోషల్ డెమోక్రటిక్ పార్టీని నిలుపుకోవడం అవసరమా అనీ, దాని పనిని కొనసాగించడం అవసరమా అనీ, మరొకసారి అజ్ఞాతవాసంలోకి వెళ్లడం అవసరమా అనీ, యెలా వెళ్లాలి అనీ అడుగుతున్నారు. యెట్టి పరిస్థితులలోనూ, పార్టీ కార్యక్రమాన్నీ, యెత్తుగడలనూ, నిర్మాణాన్నీ బహిరంగంగా విసర్జించడం అనే మూల్యం చెల్లించి అయినా, మనల్ని మనం చట్టబద్ధీకరించుకోవడం అవసరమనే అర్థంలో అతివాద దక్షిణపక్షీయులు (రద్దువాదుల ధోరణి[14] అనబడేది) యీ ప్రశ్నకు జవాబు చెప్తున్నారు. నిస్సందేహంగా యిది, నిర్మాణపరమైన సంక్షోభం మాత్రమే కాదు, సిద్ధాంత, రాజకీయ సంక్షోభంగా కూడా వుండింది.

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీయొక్క యిటీవలి అఖిల రష్యా కాన్ఫరెన్సు[15] పార్టీని మళ్లీ దారిలోకి తెచ్చింది; విప్లవ ప్రతీఘాతపు విజయం తర్వాత రష్యన్ కార్మిక వర్గ ఉద్యమంలో యిది మలుపులా కనిపిస్తోంది. కాన్ఫరెన్సు తీర్మానాలు, మన పార్టీ కేంద్ర కమిటీచేత జారీచేయబడిన ప్రత్యేక "నివేదిక"లో ప్రచురింపబడినట్టివి, కేంద్ర కమిటీచేత ఆమోదింపబడినాయి; కనుక అవి వచ్చే మహాసభదాకా యావత్తు పార్టీ తీర్మానాలుగా వుంటాయి. యీ తీర్మానాలు సంక్షోభపు కారణాలూ, ప్రాముఖ్యమూ, దాన్ని అధిగమించే మార్గాలూ యేమిటనే ప్రశ్నకు చాలా నిశ్చితమైన జవాబు యిస్తాయి. కాన్ఫరెన్సు తీర్మానాల తత్వంలో పనిచేయడం ద్వారా, పార్టీ కార్యకర్త లందరూ పార్టీయొక్క ప్రస్తుత కర్తవ్యాలను స్పష్టంగా, పూర్తిగా గుర్తించేటట్లు కృషిచేయడం ద్వారా, మన శాఖలు ఫలవంత

మైన విప్లవ సోషల్ డెమోక్రటిక్ పనికిగాను తమ బలాలను పటిష్ఠపరుచుకొని, దృఢ పరుచుకొనగలవు.

పార్టీ నిర్మాణంమీద చేసిన తీర్మానపు ఉపోద్ఘాతంలో పార్టీ సంక్షోభపు ప్రధాన కారణం సూచింపబడింది. యీ ప్రధాన కారణం ఊగిసలాడే మేధావి, పెటీబూర్జువా అంశాలు; వీటిని కార్మికుల పార్టీ తొలగించుకోవలసి వుండింది. యీ అంశాలు ప్రధానంగా బూర్జువా ప్రజాతంత్ర విప్లవం త్వరగా జయిస్తుందనే ఆశతో కార్మికవర్గ ఉద్యమంలో చేరినాయి; ప్రగతి వ్యతిరేక దశకు యివి తట్టుకోలేకపోయినాయి. వీటి అస్థిరత్వం యిటు సిద్ధాంతం లోనూ ("విప్లవ మార్క్సిజంనుండి వైదొలగడం": ప్రస్తుత పరిస్థితిమీద తీర్మానం), యెత్తుగడలలోనూ ("నినాదాలను తగ్గించడం"[16]), అలాగే పార్టీ నిర్మాణ విధానంలోనూ వెల్లడైంది. వర్గచైతన్యపూరిత కార్మికులు యీ అస్థిరత్వాన్ని యెదుర్కొని, రద్దువాదాన్ని వ్యతిరేకించి పార్టీ శాఖలను నిర్వహించడమూ, నడిపించడమూ తమ చేతుల్లోకి తీసుకోవడం ప్రారంభించినారు. పార్టీలోని యీ గట్టి కేంద్రకం అనైక్యతా, సంక్షోభాల అంశాలను మొట్ట మొదట అధిగమించలేకపోయిందంటే, విప్లవ ప్రతీఘాతం విజయం పొందడం యీ కర్త వ్యం పెద్దదీ, కష్టమైనదీ కావడంవల్ల మాత్రమే కాదు, విప్లవాభిముఖులైనప్పటికీ, తగి నంతగా సోషలిస్టు చైతన్యపూరితులు గాని కార్మికులలో పార్టీపట్ల కొంత నిర్లక్ష్యం వుండ డంవల్ల కూడా. అనైక్యతతోనూ, ఊగిసలాటతోనూ పోరాడే మార్గాల గురించి సోషల్ డెమోక్రసీయొక్క రాటుదేలిన అభిప్రాయంగా కాన్ఫరెన్సు తీర్మానాలు ప్రధానంగా ఉద్దేశింప బడింది సరిగ్గా వర్గచైతన్యపూరితులైన రష్యా కార్మికులకే.

యీనాటి వర్గ సంబంధాలమీదా, జారిజంయొక్క నూతన విధానంమీదా మార్క్సిస్టు పరిశీలన; గతంలో లాగే యిప్పుడూ మన పార్టీ పెట్టుకుంటూనే వున్న తక్షణ పోరాట లక్ష్యం గురించి సూచన; విప్లవ సోషల్ డెమోక్రట్ల యెత్తుగడలు యెంతవరకు సరైన వనే విషయంమీద విప్లవం నేర్పిన గుణపాఠాలను గ్రహించడం; పార్టీ సంక్షోభపు కారణా లను వివరించడమూ, దానిమీద పోరాటంచేసిన పార్టీలోని కార్మికవర్గ అంశాల పాత్ర నొక్కి చెప్పడమూ; రహస్య సంఘాలకూ, చట్టబద్ధ సంఘాలకూ మధ్య గల సంబంధం గురించిన సమస్యా పరిష్కారం; దూమ వేదికను వినియోగించుకోవలసిన అవసరాన్ని గుర్తించడమూ, మన దూమ బృందం[17] పొరపాట్లమీద సూటి విమర్శతో జతపరిచి, ఆ బృందాన్ని నడిపిం చడానికి కచ్చితమైన ఆదేశాలు రూపొందించడమూ — యిది కార్మికవర్గ పార్టీ ప్రస్తుత కష్ట దశలో కచ్చితమైన ఒక మార్గాన్ని యెన్నుకునే సమస్యకు సంపూర్ణమైన జవాబు యిచ్చే కాన్ఫరెన్సు తీర్మానాల ప్రధాన సారం. యీ జవాబు శ్రద్ధగా పరిశీలిద్దాం.

తమ రాజకీయ గ్రూపింగులలో వర్గాల సంబంధం జనాల ప్రత్యక్ష విప్లవ పోరాటం

జరిగిన గత దశలో* వున్నట్లే వుంది. యేది అర్ధఫ్యూడల్ భూయాజమాన్యాన్ని ధ్వంసం చేస్తుందో, జారిజంను కూలదోయకుండా యేది సాధింపబడజాలదో, ఆ వ్యవసాయ విప్లవంకొరకు అత్యధిక భాగం రైతులు ఆశపడకుండా వుండరు. ప్రగతి వ్యతిరేకతయొక్క విజయం రైతాంగంలోని ప్రజాతంత్ర శక్తులను తీవ్రంగా దెబ్బతీసింది; రైతాంగం గట్టిగా సంఘటితపడడానికి శక్తి లేకుండా వుంది. కానీ, యెంత దమనకాండ వున్నప్పటికీ, "నల్ల నూర్ల" దూమ[18] వున్నప్పటికీ, "త్రుదొవీక్కులు"[19] అత్యంత అస్థిరంగా వున్నప్పటికీ, రైతు జనాల విప్లవ మనస్థితి మూడవ దూమ చర్చలలో స్పష్టంగా వెల్లడౌతున్నది. రష్యాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవపు కర్తవ్యాల విషయంలో కార్మికవర్గపు మౌలిక వైఖరి యేమీ మారకుండా అలాగే వుంది: ప్రజాతంత్ర రైతాంగానికి నాయకత్వం వహించడమూ, ఉదారవాద బూర్జువావర్గంయొక్క, అక్టోబరిస్టుల[20]తో చిల్లర సొంత కీచులాటలు వున్నప్పటికీ యేది అంతకంతకూ వాళ్లకు దగ్గరగా జరుగుతూనే వుందో, యేది యిటీవలి జాతీయ దురహంకార ఆందోళన ద్వారా జాతీయ ఉదారవాదాన్ని నెలకొల్పడానికీ, జారిజంనూ, ప్రగతి వ్యతిరేకతనూ బలపరచడానికీ కృషిచేస్తున్నదో ఆ కాడెట్ పార్టీ[21]యొక్క ప్రభావంనుండి బయటకి లాగడమూ. రాజరికాన్ని పూర్తిగా రద్దుచేయడానికీ, కార్మికవర్గమూ, విప్లవ రైతాంగమూ రాజకీయాధికారం గెలుచుకోడానికీ పోరాటం గతంలో లాగే సాగుతుంది, అని తీర్మానం చెప్తున్నది.

గతంలో లాగే నిరంకుశత్వం కార్మికవర్గానికీ, సమస్త ప్రజాతంత్ర ధోరణులకూ ప్రధాన శత్రువు. కానీ, అది మారకుండా అలాగే వుంటుందని అనుకోవడం పొరపాటు. స్తొలీపిన్ "రాజ్యాంగమూ," స్తొలీపిన్ భూ విధానమూ[22] పాత, అర్ధపితృస్వామిక, అర్ధఫ్యూడల్ జారిజంయొక్క విచ్ఛిత్తిలో ఒక నూతన దశనూ, అది బూర్జువా రాజరికంగా రూపాంతరం చెందడంవైపు ఒక కొత్త అడుగునూ సూచిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితియొక్క యీ గుణవర్ణనను పూర్తిగా తొలగించాలనీ, "బూర్జువా"కు బదులు "ధనస్వామ్య" అని పెట్టాలనీ కోరిన కాకసస్ ప్రతినిధులది తప్పు. నిరంకుశత్వం చాలా కాలంగా ధనస్వామ్యంగా వుంది; కానీ, విప్లవ ప్రథమ దశ తర్వాతనే, దాని దెబ్బల ప్రభావంవల్లనే, నిరంకుశత్వం తన వ్యవసాయ విధానంలోనూ, బూర్జువావర్గంలోని కొన్ని పొరలతో జాతీయ స్థాయిలో యేర్పాటు చేయబడిన దాని ప్రత్యక్ష పొత్తులోనూ బూర్జువా అవుతున్నది. నిరంకుశత్వం చాలా కాలంగా బూర్జువావర్గాన్ని లాలిస్తున్నది. డబ్బు ద్వారా బూర్జువావర్గం చాలా కాలంగా "పైకి" దారిచేసుకుంటున్నది, శాసన నిర్మాణంమీదా, పరిపాలనమీదా పలుకుబడి సంపాయించుకుం

---

* అనగా 1905–1907 విప్లవ దశ.—సం.

టున్నది, ప్రభువర్గం పక్కన స్థానం సంపాయించుకుంటున్నది. కానీ, ప్రస్తుత పరిస్థితి లోని విశిష్ట లక్షణం యేమిటంటే, నిరంకుశత్వం బూర్జువావర్గంలోని కొన్ని పొరలకొరకు ఒక ప్రతినిధుల సభను నెలకొల్పడమూ, వాళ్లకూ, ఫ్యూడల్ భూస్వాములకూ మధ్య సమతూకం నెలకొల్పడమూ, దూమలోని యీ భాగాల మధ్య పొత్తు యేర్పరచడమూ చేయవలసి వచ్చింది; నిరంకుశత్వం రైతుయొక్క పితృస్వామికతత్వంమీద తాను పెట్టుకొని వుండిన ఆశలన్నిటినీ విసర్జించి, గ్రామీణ జనాలకు వ్యతిరేకంగా, గ్రామ సమష్టి సంఘాన్ని నాశనం చేస్తున్న ధనిక రైతులలో అండదండలకొరకు ప్రయత్నం చేయవలసివచ్చింది.

నిరంకుశత్వం కుహనా రాజ్యాంగబద్ధ సంస్థల బురఖా వేసుకుంటున్నది; కానీ, అదే సమయంలో, పురిష్కేవిచ్‌లతోనూ, గుచ్‌కోవ్‌లతోనూ, వాళ్లతో మాత్రమే, జారు పొత్తు పెట్టుకోవడం ద్వారా, నిరంకుశత్వంయొక్క వర్గ సారం యెప్పుడూ లేనంతగా బట్టబయలౌతున్నది. నిరంకుశత్వం వస్తుగతంగా అవసరమైన బూర్జువా విప్లవ కర్తవ్యాలను తానే నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నది — బూర్జువా సమాజపు వ్యవహారాలను నిజంగా నిర్వహించే ప్రజా ప్రతినిధుల సభను నెలకొల్పడమూ, గ్రామీణ ప్రాంతంనుండి మధ్యయుగపు, బీరకాయ పీచు లాంటి, కాలం తీరిన భూ సంబంధాలను ప్రక్షాళనం చేయడమూ. కానీ, నిరంకుశత్వం తీసుకున్న యీ కొత్త చర్యల ఆచరణగత ఫలితాలు యింతవరకు కచ్చితంగా శూన్యం; యీ చారిత్రక కర్తవ్య నిర్వహణకు యితర శక్తులూ, యితర మార్గాలూ అవసరమని మాత్రమే యిది యెప్పుడూ లేనంత స్పష్టంగా తెలుపుతున్నది. రాజకీయాలలో అనుభవంలేని లక్షలాది ప్రజల మనస్సుల్లో యింతవరకు నిరంకుశత్వానికీ, దరహంమీద ప్రజా ప్రాతినిధ్యానికీ గల భేదం చూడబడేది. యిప్పుడు పోరాటం తన లక్ష్యాలను సంకుచితపరుస్తూ, ఆ ప్రజా ప్రాతినిధ్యంయొక్క స్వభావాన్నీ, ప్రాముఖ్యాన్నీ నిర్ణయించే రాజ్యాధికారంకొరకు పోరాటంగా తన కర్తవ్యాన్ని మరింత నిర్దిష్టంగా నిర్వచిస్తున్నది. అందువల్లనే మూడవ దూమ పాత జారిజంయొక్క విచ్ఛిత్తిలోనూ, దాని దుందుడుకు స్వభావం తీవ్రతరం కావడంలోనూ, పాత విప్లవ లక్ష్యాలు పాతుకపోవడంలోనూ, యీ లక్ష్యాలకొరకు జరిగే పోరాట రంగం (పోరాటంలో పాల్గొనేవాళ్ల సంఖ్యా) విస్తృతంకావడంలోనూ ఒక ప్రత్యేక దశను సూచిస్తున్నది.

యీ దశను మనం దాటాలి. ప్రస్తుత నూతన పరిస్థితులకు నూతన పోరాట రూపాలు కావాలి. దూమ వేదికను ఉపయోగించుకోవడం పరమ అవసరం. కార్మికవర్గ జనాలను చైతన్యవంతులను చేసి, వాళ్లను సంఘటితం చేయడానికి దీర్ఘ కృషి మరీ ముఖ్యమౌతున్నది. రహస్య నిర్మాణాన్నీ, చట్టబద్ధ నిర్మాణాన్నీ కలపడం పార్టీ ముందు ప్రత్యేక సమస్యలను లేవనెత్తుతున్నది. విప్లవానుభవాన్ని ప్రజలకు తెలియజేయడమూ, వివరించడమూ — ఉదారవాదులూ, రద్దువాద మేధావులూ వేటిని అపఖ్యాతి పాలుచేయడానికి ప్రయత్నిస్తున్నారో అవి —

సిద్ధాంత, ఆచరణాత్మక ప్రయోజనాలకు అవసరం. కానీ, పార్టీయొక్క యెత్తుగడల పంథా — పోరాట పద్ధతులలోనూ, మార్గాలలోనూ, కొత్త పరిస్థితులను లెక్కలోకి తీసు కోగలిగివుండవలసిన పంథా — మారదు. విప్లవ సోషల్ డెమోక్రటిక్ యెత్తుగడలు సరైన వని 1905–07 సామూహిక పోరాట అనుభవం ధ్రువపరుస్తున్నదని ఒక కాన్ఫరెన్సు తీర్మానం తెలుపుతున్నది. యీ మొదటి ఉద్యమం ఫలితంగా యేర్పడిన విప్లవ పరాజయం వెల్లడించిందేమిటంటే, కర్తవ్యాలు తప్పు అని కాదు, తక్షణ లక్ష్యాలు "ఊహాజనితమైన"వని కాదు; అది వెల్లడించిందేమిటంటే, శక్తులు తగినంతగా సన్నద్ధం కాలేదని, విప్లవ సంక్షోభం తగినంత విస్తృతంగా, లోతుగా లేదని, స్తొలీపిన్ వగైరాలు దానిని విస్తృతమూ, లోతూ చేయ డానికి ప్రశంసనీయమైన దీక్షతో కృషిచేస్తున్నారు! ఉదారవాదులూ, భయకంపిత మేధా వులూ స్వేచ్ఛకొరకు జరిగిన మొదటి నిజమైన ప్రజా పోరాటం తర్వాత ధైర్యం కోల్పోదురు గాక, వాళ్లు పిరికిపందల్లాగ యిలా పునశ్చరణ చేయుదురు గాక: యింతకుముందు ఓడి పోయిన చోటికి పోవద్దు, ఆ మరణాంతక మార్గంలో మళ్లీ అడుగుపెట్టవద్దు. వర్గ చైతన్యంగల కార్మికవర్గం వాళ్లకు యిలా జవాబు చెప్తుంది: చరిత్రలోని మహా యుద్ధాలు, విప్లవాల మహా సమస్యలు, పురోగామి వర్గాలు మళ్లీమళ్లీ దాడిచేయడానికి ముందుకు రావడం ద్వారానే పరిష్కరింపబడినాయి — పరాజయ గుణపాఠాలు నేర్చుకున్న తర్వాత ఆ వర్గాలు విజయం సాధించినాయి. ఓడిపోయిన సైన్యాలు బాగా నేర్చుకుంటాయి. రష్యా విప్లవ వర్గాలు తమ మొదటి దాడిలో ఓడిపోయినాయి, కానీ విప్లవ పరిస్థితి అలాగే వుంది. కొత్త రూపాలలో, యితర మార్గాలలో, విప్లవ సంక్షోభం సమీపిస్తున్నది, మళ్లీ మొనదేలు తున్నది. కొన్ని సందర్భాలలో మనం ఊహించినదానికంటె మందకొడిగా సమీపిస్తున్నది. మరింత విస్తారమైన జనాలను ఆ సంక్షోభానికి సన్నద్ధం చేసే దీర్ఘ కృషిని మనం సాగిం చాలి; యీ సన్నాహక కృషి మరింత నిష్ఠగా జరగాలి, మరింత ఉన్నతమైన, నిర్దిష్టమైన కర్తవ్యాలను లెక్కలోకి తీసుకోవాలి; యీ పనిని మనం యెంత సమర్థవంతంగా చేస్తే, అంత నిశ్చయంగా వుంటుంది కొత్త పోరాటంలో మన విజయం. 1905లో తన నాయక త్వంకింద ఒక బానిసల జాతి మొదటి సారి జారిజంమీద దెబ్బతీసే లక్షోపలక్షల దండు, విప్లవ సైన్యం, అయినందుకు రష్యన్ కార్మికవర్గం గర్వపడగలదు. ఈ కార్మికవర్గమే యింకా శక్తివంతమైన విప్లవ సైన్యంయొక్క కొత్త సైనికులను చైతన్యవంతులను చేసే శిక్షణ యిచ్చే పనిని పట్టువిడువకుండా, దీక్షగా, ఓపికగా చేయడం తెలుసుకుంటుంది.

యింతకుముందు చెప్పినట్లు, చైతన్యవంతులను చేసి, శిక్షణ యిచ్చే యీ పనిలో దూమ వేదికను ఉపయోగించుకోవడం ఒక ముఖ్యమైన అంశం. దూమ బృందంమీద కాన్ఫరెన్సు తీర్మానం మన పార్టీకి (చరిత్రనుండి ఉదాహరణలు తీసుకోవాలంటే) సోషలిస్టు వ్యతిరేక

చట్టం[23] కాలంలో జర్మన్ సోషల్ డెమొక్రట్ల అనుభవానికి అతి దగ్గరగా వుండే దారిని సూచిస్తుంది. చట్టబద్ధమైన దూమ బృందాన్ని యెలా ఉపయోగించుకోవలసిందీ రహస్య పార్టీ తెలుసుకోవాలి, నేర్చుకోవాలి; తన కర్తవ్యాలకు సరితూగే పార్టీ సంఘంగా దానిని పార్టీ తర్ఫీదుచేయాలి. ప్రస్తుత దశలోని పరిస్థితులలో అత్యంత పొరపాటు యెత్తుగడా, స్థిరమైన కార్మికవర్గ కృషినుండి అత్యంత శోచనీయంగా వైదొలగడమూ యేదంటే, దూమ నుండి మన బృందాన్ని ఉపసంహరించడమనే సమస్యను లేవనెత్తడం (కాన్ఫరెన్సులో యిద్దరు "ఒత్జొవీస్తులు"[24] వుండినారు, కానీ వాళ్ళ యీ సమస్యను బహిరంగంగా లేవనెత్తలేదు), లేదా (కాన్ఫరెన్సులో కొందరు ప్రతినిధులు పట్టుబట్టినట్లు) దూమ బృందం పొరపాట్లను సూటిగా, బహిరంగంగా విమర్శించకుండానూ, వాటిని తీర్మానంలో పేర్కొనకుండానూ వుండడం. యే పొరపాట్లకు తాను మాత్రమే బాధ్యురాలు కాదో, యేవి మన పార్టీ శాఖలన్నిటియొక్క పొరపాట్లలాగే వుండినాయో, ఆ పొరపాట్లను బృందం చేసిందని తీర్మానం పూర్తిగా గుర్తిస్తున్నది. కానీ, యితర పొరపాట్లు వున్నాయి — పార్టీయొక్క రాజకీయ పంథా నుండి వ్యతిక్రమణలు. యీ వ్యతిక్రమణలు జరిగినాయి గనుక, మొత్తం పార్టీ తరఫున బహిరంగంగా వ్యవహరించే సంఘం ద్వారా యివి జరిగినాయి గనుక, యివి పెడదారులని పార్టీ స్పష్టంగా, నిశ్చితంగా ప్రకటించక తప్పలేదు. పశ్చిమ యూరపియన్ సోషలిస్టు పార్టీల చరిత్రలో, పార్లమెంటరీ బృందాలకూ, పార్టీకీ మధ్య విపరీత సంబంధాలు వుండిన ఉదాహరణలు అనేకం వున్నాయి. యీనాటికీ లాటిన్ దేశాలలో యీ సంబంధాలు తరుచుగా విపరీతంగా వున్నాయి; అక్కడ బృందాలు తగినంత పార్టీతత్వం ప్రదర్శించవు. మనం రష్యాలో మొట్టమొదటినుండే పార్లమెంటరిజంను మరొక ప్రాతిపదికమీద యేర్పాటుచేయాలి; యీ రంగంలో మనం వెంటనే సమష్టి కృషిని నెలకొల్పాలి — పార్టీ తన వెనక వుందనీ, దానికి తన పొరపాట్లపట్ల గాఢమైన ఆదుర్దా వుందనీ, తన మార్గాన్ని చక్కదిద్దడానికి అది ప్రయత్నిస్తుందనీ ప్రతి సోషల్ డెమొక్రటిక్ ప్రతినిధీ నిజంగా అనుకునేటట్లు — ప్రతి పార్టీ కార్యకర్త దూమ బృందంమీద చేసే ఆచరణాత్మక మార్క్సిస్టు విమర్శ ద్వారా నేర్చుకుంటూ, దానికి తోడ్పడడం తన విధి అని అనుకుంటూ, బృందంయొక్క ప్రత్యేకమైన పనిని పార్టీయొక్క మొత్తం ప్రచారాందోళన కార్యకలాపాలకు అనుగుణంగా మలచడానికి కృషిచేస్తూ, పార్టీయొక్క సాధారణ దూమ పనిలో పాల్గొనేటట్లు.

యీ కాన్ఫరెన్సు మొత్తం సెషన్‌లో దూమలోని సోషల్ డెమొక్రటిక్ బృందం పనిని చర్చించడానికి అత్యంత పెద్ద పార్టీ శాఖల ప్రతినిధుల మొదటి ఆధికారిక సమావేశం అయింది. మన పార్టీ తన దూమ పనిని యెలా ఏర్పాటుచేయబోయేదీ, యీ రంగంలో యిది పార్టీకీ, బృందానికీ యెంత కఠినంగా వుండబోయేదీ, నిజమైన సోషల్ డెమొక్రటిక్

పార్లమెంటరిజంను అభివృద్ధిచేయడానికి మన పార్టీ యెలా దారి తొలగకుండా, స్థిరంగా కృషిచేయదలచుకున్నదీ కాన్ఫరెన్సు తీర్మానం తెలుపుతున్నది.

దూమ బృందంపట్ల మన వైఖరికి సంబంధించిన సమస్యలో యెత్తుగడల పార్శ్వమూ, నిర్మాణపరమైన పార్శ్వమూ వున్నాయి. రెండవ పార్శ్వంలో దూమ బృందపు తీర్మానం మన సాధారణ నిర్మాణపర సూత్రాలను – నిర్మాణపర సమస్యమీద సూచనలు యిచ్చే తీర్మానంలో కాన్ఫరెన్సు రూపొందించిన సూత్రాలను – ఒక ప్రత్యేక సందర్భానికి వర్తింపజేయడం మాత్రమే. యీ సమస్యమీద రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో రెండు ప్రధాన ధోరణులు వున్నాయని కాన్ఫరెన్సు నమోదుచేసింది: అందులో ఒకటి రహస్య సంఘాలకు ప్రాముఖ్యం యిస్తుంది; మరొకటి, "రద్దువాదానికి" దాదాపు సమానమైనట్టిది, చట్టబద్ధ, అర్ధచట్టబద్ధ సంఘాలకు ప్రాముఖ్యం యిస్తుంది. విషయమేమంటే, నేను యింతకు ముందే చెప్పినట్లు, కొంతమంది పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా మేధావులు, కానీ కొందరు కార్మికులు కూడా, పార్టీని వదలిపెట్టడం ప్రస్తుత పరిస్థితియొక్క విశిష్ట లక్షణంగా వుంది. అత్యుత్తములూ, అత్యంత చురుకైనవాళ్లూ పార్టీని విసర్జించి, చట్టబద్ధ సంఘాలను యెన్నుకుంటున్నారా, లేక "ఊగిసలాడే మేధావి, పెటీబూర్జువా అంశాలు" పార్టీని వదలిపెడుతున్నాయా అనే ప్రశ్నను "రద్దువాద" ధోరణి లేవనెత్తుతున్నది. కంఠోక్తిగా "రద్దువాదాన్ని" నిరాకరించి, ఖండించడం ద్వారా కాన్ఫరెన్సు యీ రెండవ అంశాలే పార్టీని వదలిపెడుతున్నాయని సమాధానం చెప్పిందని చెప్పనక్కరలేదు. పార్టీలోని అత్యంత నిరాస్తిపరులూ, సూత్రాలలో అత్యంత స్థిరంగా, అత్యంత సోషల్ డెమోక్రటిక్‌గా వుండిన మేధావులూ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీకి విధేయంగా నిలిచినారు. పార్టీని విసర్జించడమంటే పార్టీ శుద్ధికావడమన్న మాట, పార్టీ తనలోని తక్కువ స్థిరమైన వాళ్లనూ, అవిశ్వసనీయ మిత్రులనూ, సహ ప్రయాణికులనూ (Mitläufer) తొలగించుకోవడమన్న మాట; యీ సహ ప్రయాణికులు యెప్పుడూ కొంతకాలంపాటు కార్మిక వర్గంలో చేరుతారు, వీళ్లు పెటీబూర్జువావర్గంనుండి గానీ, లేదా "వర్గ రహితుల" నుండి, అనగా యేదో ఒక నిర్దిష్ట వర్గపు కక్ష్యనుండి నెట్టివెయ్యబడినవాళ్లనుండి గానీ చేర్చుకోబడినవాళ్లు.

పార్టీ నిర్మాణపర సూత్రపు యీ అంచనానుండి తర్కబద్ధంగా యేర్పడుతుంది కాన్ఫరెన్సు ఆమోదించిన నిర్మాణపర విధానపు పంథా. రహస్య పార్టీని పటిష్ఠపరచడమూ, అన్ని పని రంగాలలోనూ పార్టీ శాఖలను సృష్టించడమూ, "ప్రతి పారిశ్రామిక సంస్థలోనూ కార్మికులు మాత్రమే గల పార్టీ కమిటీలను, వాళ్ల సంఖ్య తక్కువగా వున్నా సరే," మొట్టమొదట నెలకొల్పడమూ, నాయకత్వపు కర్తవ్యాలను కార్మికులనుండే వచ్చిన సోషల్

డెమొక్రటిక్ ఉద్యమ నాయకుల చేతుల్లో సాంద్రీకరించడమూ — యిది యీనాటి కర్తవ్యం. యీ శాఖల, కమిటీల కర్తవ్యం అర్ధచట్టబద్ధ సంఘాలనన్నిటినీ, వీలైనంతవరకు చట్టబద్ధ సంఘాలనూ వినియోగించుకోవడంగానూ, "జనాలతో సన్నిహిత సంబంధం" పెట్టుకోవడంగానూ, జనాల అవసరాల కన్నిటికీ సోషల్ డెమొక్రసీ ప్రతిస్పందించేటట్లు పనిని నడిపించడంగానూ వుండాలని చెప్పనక్కరలేదు. ప్రతి పార్టీ శాఖా, ప్రతి కార్మికుల కమిటీ "జనాలలో ఆందోళనకూ, ప్రచారానికీ, ఆచరణగతమైన సంఘటిత పనికీ కేంద్రం" కావాలి; అనగా, అవి జనాలు యెక్కడుంటే అక్కడికి పోవాలి, అడుగడుగునా జనాల చైతన్యాన్ని సోషలిజం దిశలో ముందుకు తోయడానికీ, ప్రతి నిర్దిష్ట సమస్యనూ కార్మిక వర్గపు సాధారణ కర్తవ్యాలతో లంకెవేయడానికీ, ప్రతి నిర్మాణపర చర్యనూ వర్గ దృఢీకరణ చర్యగా మార్చడానికీ, చురుకుదనం ద్వారా, సిద్ధాంత ప్రభావం ద్వారా (పదవుల ద్వారా, హోదాల ద్వారా కాదని చెప్పనక్కరలేదు) కార్మికవర్గ చట్టబద్ధ సంఘా లన్నిటిలోనూ అగ్రస్థానం సంపాయించడానికీ ప్రయత్నించాలి. యీ శాఖలూ, కమిటీలూ ఒకోసారి చాలా చిన్నవైనా, అవి పార్టీ సంప్రదాయంచేతా, పార్టీ నిర్మాణంచేతా, ఒక నిర్దిష్ట వర్గ కార్య క్రమంచేతా ఒకటిగా లంకించబడతాయి; యీ విధంగా పార్టీలోని యిద్దరుముగ్గురు సోషల్ డెమొక్రటిక్ సభ్యులు రూపంలేని చట్టబద్ధ సంఘంలో మునిగిపోకుండా వుండగలిగి, అన్ని పరిస్థితులలోనూ, అన్ని రకాల సన్నివేశాలలోనూ తమ పార్టీ పంథాను అనుసరించగలిగి, పరిసరాలు తమను దిగమింగనీయకుండా పరిసరాలను తాము మొత్తం పార్టీతత్వంలో ప్రభావితం చేయగలిగివుంటారు.

యేదో ఒక రకం ప్రజా సంఘాలు రద్దుచేయబడవచ్చు గాక, చట్టబద్ధ ట్రేడ్ యూనియన్లను వేధించవచ్చు గాక, విప్లవ ప్రతీఘాత వ్యవస్థలో కార్మికుల చొరవగల ప్రతి బహిరంగ చర్యనూ పోలీసులు యేదో ఒక సాకుతో ధ్వంసం చేయవచ్చు గాక, కానీ రష్యా యిప్పటికే అయిన మాదిరి పెట్టుబడిదారీ దేశంలో కార్మిక జనాల సమీకరణను యే శక్తీ నివారించలేదు. యేదో ఒక విధంగా, చట్టబద్ధంగానో, అర్ధచట్టబద్ధంగానో, బహిరంగంగానో, ప్రచ్ఛన్నంగానో కార్మికవర్గం తన సొంత సమీకరణ కేంద్రాలు కనుక్కుంటుంది. పార్టీలోని వర్గచైతన్యపూరిత సోషల్ డెమొక్రట్లు సర్వదా, సర్వత్రా జనాల ముందర నడుస్తారు, సర్వదా, సర్వత్రా జనాలను పార్టీ తత్వంలో ప్రభావితం చేయడానికి సమైక్యంగా కృషి చేస్తారు. తాను వర్గ పార్టీనని బహిరంగ విప్లవంలో రుజువుచేసుకున్న సోషల్ డెమొక్రటిక్ పార్టీ, సమ్మెలోనూ, 1905 తిరుగుబాటులోనూ, 1906–1907 యెన్నికలలోనూ లక్షోపలక్షలమందిని నడిపించడంలో కృతకృత్యురాలైన పార్టీ, యిప్పుడు కూడా వర్గ పార్టీగా, జనాల పార్టీగా, అగ్రదళంగా వుంటుంది; అత్యంత కష్ట సమయాల్లో కూడా సైన్యం

లోని అధిక భాగంతో సంపర్కం కోల్పోకుండా, యీ కష్ట సమయాలను అధిగమించడానికీ, తన శ్రేణులను మళ్లీ సంఘటితపరచుకోడానికీ, అధికాధికంగా కొత్త యోధులను తర్ఫీదు చేయడానికీ పైన్యానికి తోడ్పడగలిగి వుంటుంది.

కరుడుగట్టిన నల్ల నూర్లవాళ్లు దూమలోపలా, బయటా, రాజధానిలోనూ, సుదూరపు రాష్ట్రాలలోనూ సంతోషంతో పొలికేకలు వేయనీ, ప్రగతి వ్యతిరేకత తాండవించనీ – ఒరగడ్డంగా వున్న నిరంకుశత్వాన్ని దాని పతనం దగ్గరికి తీసుకురాకుండా, రాజకీయ అస్తవ్యస్తాల, అసంబద్ధాల కొత్త చిక్కు సృష్టించకుండా, కార్మికవర్గ శ్రేణులకూ, రైతు జనాలలోని విప్లవ శక్తుల శ్రేణులకూ కొత్త, తాజా శక్తులను కలపకుండా నిత్య వివేకవంతుడైన స్తొలీపిన్ ఒక్క చర్య కూడా తీసుకోలేడు. జనాల సంపర్కంతో పట్టువిడువని పని చేయడానికి తన్ను తాను దృఢపరుచుకోవడంలో విజయం పొందే పార్టీ, పురోగామి వర్గంయొక్క పార్టీ, తన అగ్రదళాన్ని సంఘటితపరుచుకోవడంలో విజయం పొందే పార్టీ, కార్మికవర్గంలోని ప్రతి జీవ లక్షణాన్నీ సోషల్ డెమొక్రటిక్ తత్వంలో ప్రభావితం చేసేటట్లుగా తన శక్తులను నడిపించే పార్టీ – యేమి జరిగినా సరే అలాంటి పార్టీ గెలుస్తుంది.

''సొత్సియాల్ డెమొక్రట్,'' సంచిక 2,
జనవరి 28 (ఫిబ్రవరి 10), 1909

# గేర్‌త్సెన్‌కి స్మృత్యంజలి

గేర్‌త్సెన్ జన్మించి యిప్పటికి నూరేళ్ళు గడిచిపోయాయి. యావత్తు ఉదారవాద రష్యా ఆయనకి గౌరవాంజలి ఘటిస్తూనే సోషలిజానికి సంబంధించిన తీవ్ర సమస్యల్ని దాటవేస్తోంది, విప్లవకారుడు గేర్‌త్సెన్‌ని ఉదారవాది గేర్‌త్సెన్‌నుంచి వేరుజేసే అంశాన్ని మరుగుపరచేందుకు నానా తంటాలూ పడుతోంది. మితవాద పత్రికలు కూడా గేర్‌త్సెన్ శతజయంతిని జరుపుతున్నాయి, గేర్‌త్సెన్ తన జీవితపు చివరి సంవత్సరాల్లో విప్లవాన్ని పరిత్యజించాడంటూ అసత్యారోపణలు చేస్తున్నాయి. గేర్‌త్సెన్ గురించి విదేశాల్లో లిబరల్స్, నరోద్నిక్కులూ[25] చేస్తున్న మహోపన్యాసాల్లో పదాడంబరానికి పట్టాభిషేకం జరుగుతోంది.

కార్మికవర్గ పార్టీ కూడా గేర్‌త్సెన్ శతజయంతిని జరపాలి — సాంప్రదాయికి పద్ధతిలో గేర్‌త్సెన్ భజన చేసేందుకు కాక, తన కర్తవ్యాలను స్పష్టంగా తేల్చుకొని, రష్యన్ విప్లవానికి మార్గాన్ని సుగమంచెయ్యడంలో మహత్తరమైన పాత్ర వహించిన యీ రచయితకి చరిత్రలో వున్న అసలైన స్థానమేమిటో అర్థంచేసుకొనేందుకు.

గేర్‌త్సెన్, గత శతాబ్ది మొదటి అర్ధభాగపు ప్రభువర్గానికీ, భూస్వాములకీ చెందిన విప్లవకారుల తరానికి చెందినవాడు. ఆ ప్రభువర్గం రష్యాకి బిరోన్లనూ, అరక్చేయెవ్‌లనూ, లెక్క లేనంతమంది "తాగుబోతు ఆఫీసర్లనూ, హంగుదార్లనూ, తిరణాల వీరులనూ, జూదగాళ్ళనూ, వేటకుక్కల పెంపకందార్లనూ, కోతలరాయుళ్ళనూ, కొరడారాయుళ్ళనూ, తార్పుడుగాళ్ళనూ," అంతే కాకుండా, తీయగా మాట్లాడే మనీలొవ్‌లనూ సమర్పించింది. "కాని, వాళ్ల మధ్యనే డిసెంబరిస్టులూ,[26] క్రూర మృగాల పాలతో బలం పుంజుకున్న రోమ్యులస్, రేమస్‌ల వంటి పలువురు వీరులూ తయారయ్యారు.... వాళ్ళు పూర్తిగా కాకలు తీరిన అతిమానుషులు, ఒక నూతన జీవితంకోసం యువతరాన్ని జాగృతం చేసి, నిరంకుశత్వ, బానిసత్వ వాతావరణంలో పుట్టిన పిల్లలను పరిశుద్ధులను చేసేందుకు కావాలని మృత్యువును కౌగలించుకున్న సహ యోధులు" అని గేర్‌త్సెన్ రాశాడు.

ఆ పిల్లల్లో గేర్‌త్సెన్ ఒకడు. డిసెంబరిస్టుల తిరుగుబాటు ఆయన్ని జాగృతంచేసి "పరిశుద్ధం చేసింది." 19వ శతాబ్ది 40ల నాటి ఫ్యూడల్ రష్యాలో, తన కాలపు మిక్కిలి

గొప్ప చింతనాపరుల్లో ఉన్నత శిఖరాలను ఆయన అధిరోహించాడు. ఆయన హేగెల్ గతితర్కాన్ని జీర్ణించుకున్నాడు. అది "విప్లవపు బీజగణితం" అన్న విషయాన్ని ఆయన గ్రహించాడు. ఆయన హేగెల్‌ని దాటి ముందుకు పోయి, ఫాయెర్‌బాఖ్‌ని అనుసరించి భౌతికవాదం దగ్గరకి చేరుకున్నాడు. తన "ప్రకృతి అధ్యయనంపై లేఖలు"లో "ప్రత్యక్షానుభవయుతవాదం, భావవాదం" పేర 1844లో ఆయన రచించిన మొదటి లేఖలో ఆధునిక ప్రత్యక్షానుభవ యుతవాద ప్రకృతిశాస్త్రజ్ఞుల తొంబకన్న, యీనాటి భావవాద, పాక్షిక భావవాద తత్త్వ వేత్తల తొంబకన్న ఎంతో ఎత్తున విహరించే చింతనాపరుడు మనకి దర్శనమిస్తాడు. గేర్‌త్సెన్ గతితార్కిక భౌతికవాదందాకా చేరుకొని, చారిత్రక భౌతికవాద ప్రాంగణంలో ఆగాడు.

1848 విప్లవ పరాజయానంతరం ఆయన ఆశాభంగానికి "ఆగడం" కారణం. గేర్‌త్సెన్ రష్యా వదిలివెళ్లిపోయి, ఆ విప్లవాన్ని ప్రత్యక్షంగా గమనించాడు. అప్పట్లో ఆయన ప్రజాస్వామ్యవాది, విప్లవకారుడు, సోషలిస్టు. అయితే ఆయన "సోషలిజం" 1848 నాటి సవాలక్ష బూర్జువా, పెటీబూర్జువా సోషలిజపు రూపాల్లో, తరహాల్లో ఒకటి. అదే సంవత్సరం జూన్ రోజుల్లో[27] వాటికి చావు దెబ్బ తగిలింది. నిజానికి, అది ఆనాటి బూర్జువా ప్రజాస్వామ్యవాదుల, అలాగే, ఆ ప్రజాస్వామ్యవాదుల ప్రభావంనుంచి తనని తాను యింకా విముక్తం చేసుకోని శ్రామికవర్గపు ఆనాటి విప్లవ స్వభావాన్ని వ్యక్తంచేసే కొన్ని ఆర్ద్రమైన పదబంధాలూ, ఉదారమైన కలలే తప్ప సోషలిజం ఎంత మాత్రమూ కాదు.

గేర్‌త్సెన్ ఆశాభంగం 1848 దరిమిలా ఆయన ప్రగాఢ సంశయవాదమూ, నిరాశావాదమూ నిజానికి సోషలిజంపట్ల బూర్జువా భ్రమల విచ్ఛిత్తియే. ప్రపంచ చరిత్రలోని ఏ దశలోనైతే బూర్జువా ప్రజాతంత్రవాదుల విప్లవకర స్వభావం అప్పటికే యూరప్‌లో తిరోగమనంలో వుందో, సోషలిస్టు శ్రామికవర్గపు విప్లవకర స్వభావం యింకా పరిణతం కాలేదో ఆ దశ ఉత్పాదితమూ, ప్రతిబింబమే గేర్‌త్సెన్ ఆశాభంగం. గేర్‌త్సెన్ సంశయవాదాన్ని గురించి యీనాడు అలంకారపూరిత పదజాలం వాడటం ద్వారా తమ విప్లవ ప్రతీఘాత స్వభావాన్ని మరుగుపరుస్తూ, ధారాళంగా ఆడంబర పదప్రయోగంచేసే వీరయోధులు అర్థం చేసుకోని, అర్థంచేసుకోజాలని విషయం యిది. 1905 నాటి రష్యన్ విప్లవానికి ద్రోహం చేసి, విప్లవకారుడు అన్న గొప్ప పేరును గురించి ఆలోచించడం సైతం మరచిపోయిన యీ వీరయోధుల విషయంలో, సంశయవాదం అన్నది ప్రజాస్వామ్యంనుంచి ఉదారవాదానికి — 1848లో కార్మికులను కాల్చి చంపిన తొత్తుదారీ, నీతిబాహ్య, క్షుద్ర ఉదారవాదానికి, ఛిన్నాభిన్నమైన సింహాసనాలను పునరుద్ధరించి, మూడవ నెపోలియన్‌ను ప్రస్తుతించిన (దీని వర్గ స్వభావాన్ని అర్థంచేసుకోలేక గేర్‌త్సెన్ దీనిమీద శాపనార్థాలు పెట్టాడు) ఉదారవాదానికి ఒక పరివర్తన రూపం.

గేర్‌త్సెన్‌కి సంబంధించినంతవరకు, సంశయవాదం అన్నది, "వర్గాలకు అతీతమైన" బూర్జువా ప్రజాస్వామ్య భ్రమనుంచి నిష్క్రమణమైన, తిరుగులేని, అజేయమైన శ్రామికవర్గపు వర్గపోరాటానికి ఒక పరివర్తన రూపం. గేర్‌త్సెన్ 1869లో, తన మరణానికి ఒక ఏడాది ముందు బకూనిన్‌కి రాసిన "ఒక పాత కామ్రేడ్‌కి లేఖలు" యిందుకు రుజువు. గేర్‌త్సెన్ అరాజకవాది బకూనిన్‌తో తెగతెంపులు చేసుకున్నాడు. ఈ తెగతెంపుల్ని తన వర్గపు విజయంపట్ల విశ్వాసం కలిగిన శ్రామికుని దృక్పథానికీ, తన ముక్తిపట్ల నిరాశచెందిన పెటీ బూర్జువా దృక్పథానికీ మధ్య ఒక అగాధంగా కాక, ఎత్తుగడల విషయంలో కేవల భేదాభిప్రాయంగా మాత్రమే గేర్‌త్సెన్ యింకా చూస్తున్నాడన్న మాట నిజమే. ఈ లేఖల్లో సైతం, సోషలిజం "కార్మికుణ్ణీ, యజమానినీ, రైతునీ, మధ్య తరగతివాణ్ణీ సమానంగానే ఉద్దేశించి నీతిబోధ చెయ్యాలన్న" బూర్జువా ప్రజాతంత్ర పాత పదాలను గేర్‌త్సెన్ వల్లిస్తున్నాడన్న మాట నిజమే. అయితేనేం, బకూనిన్‌తో తెగతెంపులుచేసుకోవడంలో గేర్‌త్సెన్ తన దృష్టిని ఇంటర్నేషనల్‌వైపు, మార్క్స్ నాయకత్వాన వున్న ఇంటర్నేషనల్‌వైపు, "అసంఖ్యాక" శ్రామికవర్గాన్ని "సమీకరించ" నారంభించి, "శ్రమించకుండా ఫలితాలను అనుభవించేవాళ్ల ప్రపంచాన్ని పరిత్యజిస్తున్న"[28] ఇంటర్నేషనల్‌వైపు మళ్లించాడే గాని, ఉదారవాదంవైపు మళ్లించలేదు.

---

1848 నాటి యావత్తు ఉద్యమపు బూర్జువా ప్రజాతంత్ర స్వభావాన్నీ, మార్క్సిస్టు పూర్వపు సోషలిజం రూపాలన్నింటినీ అర్థంచేసుకోలేకపోయిన గేర్‌త్సెన్, రష్యన్ విప్లవపు బూర్జువా స్వభావాన్ని యింకా తక్కువ అర్థంచేసుకోగలిగాడు. గేర్‌త్సెన్ "రష్యన్" సోషలిజం, "నరోదిజం" పిత. భూదాస్యంనుంచి రైతుల విముక్తిలో, భూమిపైన ఉమ్మడి యాజమాన్యంలో, భూమితోబాటు రైతుల విముక్తిలో, "భూమి కలిగివుండే హక్కు" గురించిన రైతు దృష్టిలో ఆయన "సోషలిజాన్ని" చూశాడు. ఈ అంశంమీద తనకి అభిమాన పాత్రమైన భావాలను ఆయన సవాలక్షసార్లు వెల్లడించాడు.

వాస్తవానికి, గేర్‌త్సెన్ ప్రతిపాదించిన యీ సిద్ధాంతంలో గాని, యీనాటి "సోషలిస్టు రివల్యూషనరీల"[29] అంతరించిపోయిన నరోదిజంతోబాటు రష్యన్ నరోదిజం అంతట్లో గాని, ఆవగింజంత సోషలిజం లేదు. పశ్చిమ దేశాల్లోని "1848 నాటి సోషలిజపు" వివిధ రూపాల మాదిరిగా, యిది అదే మాదిరి ఆర్ద్రమైన పదజాలమూ, ఔదార్యపూరిత స్వప్నాలూ మాత్రమే. వీటిలో రష్యాలోని బూర్జువా రైతాంగ ప్రజాస్వామ్యపు విప్లవతత్వం వ్యక్తం

చెయ్యబడింది. 1861లో రైతులు ఎంత ఎక్కువ భూమిని పొంది[30] ఎంత తక్కువగా దానికోసం చెల్లించవలసివుంటే, ఫ్యూడల్ భూస్వాముల పెత్తనం అంత ఎక్కువగా దొలిచి వేయబడివుండేది, అంత ఎక్కువ వేగంగా, స్వేచ్ఛగా, విస్తృతంగా రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందివుండేది. "భూమి కలిగివుండే హక్కు," "సమానకరణ భూమి పంపిణీ" అన్నది భూస్వాముల పెత్తనాన్ని పూర్తిగా కూలదోసేందుకూ, భూస్వామ్య విధానాన్ని పూర్తిగా రద్దుచేసేందుకూ పోరాడుతున్న రైతులు సమానత్వంకోసం పెంచుకున్న విప్లవాత్మకమైన ఆకాంక్షకు ఒక రూపమే.

దీన్ని 1905 విప్లవం పూర్తిగా రుజువుచేసింది: ఒక వైపున, సోషల్ డెమోక్రటిక్ పార్టీని స్థాపించిన శ్రామికవర్గం పూర్తి స్వతంత్రంగా విప్లవ పోరాటపు అగ్రభాగాన నిలిచింది. మరో వైపున, విప్లవకర రైతులు ("త్రుదొవీక్కులు," రైతు సంఘం[31]) "భూమిపైన వ్యక్తి స్వామ్యపు రద్దు"తోబాటు అన్ని రకాల భూస్వామ్యపు రద్దుకోసం పోరాడారు, సరిగ్గా సొంతదారుల మాదిరిగా, చిన్న తరహా పరిశ్రమదారుల మాదిరిగానే పోరాడారు.

ఈనాడు, భూమి కలిగివుండే హక్కు "సోషలిస్టు స్వభావమూ," వగైరాల గురించిన వివాదం, రష్యన్ బూర్జువా విప్లవంలో ఉదారవాద బూర్జువావర్గ ప్రయోజనాలకీ విప్లవకర రైతాంగ ప్రయోజనాలకీ మధ్య తేడాకి సంబంధించిన నిజంగా ముఖ్యమూ, గంభీరమైన చారిత్రక సమస్యను అస్పష్టంచేసి, మరుగుపరచేందుకు మాత్రమే పనికివస్తుంది. మరోలా చెప్పాలంటే, ఆ విప్లవంలో ఉదారవాద, ప్రజాతంత్ర ధోరణులూ, "రాజీవాద" (రాజరిక), రిపబ్లికన్ ధోరణులూ బయటపడ్డాయి. విషయానికి సంబంధించిన మాటల కేసి గాక సారాంశంకేసి మన దృష్టిని మళ్లించినట్లయితే, వర్గపోరాటాన్ని మనం "సిద్ధాంతాలకూ," సూత్రాలకూ ప్రాతిపదికగానే తప్ప అందుకు తలకిందులుగా మనం పరిశీలించక పోయినట్లయితే, గేర్‌త్సెన్ "కోలొకొల్"[32] ముందకు తెచ్చిన సమస్య సరిగా యిదే.

గేర్‌త్సెన్ విదేశాల్లో స్వేచ్ఛాయుత పత్రికలను నెలకొల్పాడు, ఆయన చేసిన సేవల్లో యిది గొప్పది. "పొల్యార్నయ జ్వెజ్దా"[33] డిసెంబరిస్టుల సంప్రదాయాన్ని చేబట్టింది. "కోలొకొల్" (1857–67) రైతుల విముక్తిని శక్తివంతంగా సమర్థించింది. బానిస బుద్ధితో కూడిన మౌనం భగ్నంచెయ్యబడింది.

కాని గేర్‌త్సెన్ భూస్వామ్య, ప్రభువర్గ విభాగానికి చెందినవాడు. ఆయన 1847లో రష్యాని వదలివెళ్లాడు. ఆయన విప్లవకారులైన ప్రజలను చూడలేదు, విప్లవంలో ఆయన విశ్వాసాన్ని పెంపొందించుకోలేకపోయాడు. అందుకనే "పై తరగతులవారికి" ఆయన ఉదారవాద విజ్ఞప్తిచేశాడు. అందుకనే ఉరితీతదారైన జారు రెండవ అలెక్సాంద్ర్‌కి "కోలొకొల్"లో ఆయన అనేక తియ్యతియ్యని లేఖలు రాశాడు. ఈనాడు వాటిని చదివితే అసహ్యం కలగక మానదు.

జనబాహుళ్యపు ఉద్యమమే ఆ తుపాను. సంపూర్ణంగా విప్లవాత్మక వర్గమైన శ్రామిక వర్గం జనబాహుళ్యపు అగ్రశ్రేణిలో నిలబడి, తొట్టతొలి సారి దశలక్షలాది రైతులు విప్లవ పోరాటం ఆరంభించేలా వాళ్లని జాగృతంచేసింది. ఈ తుపానులో తొలి దాడి 1905లో సంభవించింది. మరుసటిది మన కళ్ల ముందు పరిణతమవనారంభిస్తోంది.

గేర్త్సెన్ సంస్మరణ సందర్భంగా శ్రామికవర్గం విప్లవ సిద్ధాంతపు మహత్తర ప్రాముఖ్యాన్ని గ్రహించడంలో ఆయన జీవిత గుణపాఠాన్ని స్వీకరిస్తోంది. విత్తనాలు నాటేందుకూ పంట కోసుకునేందుకూ మధ్య సుదీర్ఘ దశాబ్దాల వార వున్నా కూడా విప్లవంపట్ల నిస్వార్థ అంకిత భావమూ, జనంలో విప్లవ ప్రచారమూ వ్యర్థంకాలేదని శ్రామికవర్గం నేర్చుకుంటోంది. రష్యన్ విప్లవంలోనూ, అంతర్జాతీయ విప్లవంలోనూ వివిధ వర్గాల పాత్రను అంచనా వెయ్యడమెలాగో అది నేర్చుకుంటోంది. ఈ గుణపాఠాలతో సుసంపన్నమైన శ్రామికవర్గం, ఏ జారిస్టు రాజరికానికి వ్యతిరేకంగానైతే, ప్రజా బాహుళ్యానికి తన స్వేచ్ఛాయుతమైన రష్యన్ మాటలు పేర విజ్ఞప్తిచేసి, పోరాటపు మహత్తర ధ్వజాన్ని తొట్టతొలిగా ఎగరేశాడో, ఆ రోసిపోయిన రాకాసిని కాలరాసి, శ్రామికవర్గం అన్ని దేశాల సోషలిస్టు కార్మికులతో స్వేచ్ఛాయుతమైన పొత్తుకోసం పోరాడుతూ ముందుకెళ్తుంది.

"సోత్సియాల్ డెమోక్రట్," సంచిక 26,
మే 8 (ఏప్రిల్ 25), 1912

నువ్వు, పేంజలో హత్యచెయ్యబడిన తండ్రి కొడుకువైన నువ్వు — యిప్పుడు చూస్తున్నది అతన్నే.... నీ కాపలాదారులు నీ అంత అజ్ఞానులు, నీ అంత పేదలే.... కజాన్‌లో నీకోసం కష్టం పాలైన మరో అంథోనీ (బిషప్ అంతోనీ కాదు, బెజ్దాకి చెందిన అంతోన్) అలాంటివాడే.... నీ అమరవీరుల మృతదేహాలు అర్ధశత అద్భుతాలు నిర్వర్తించవు, వాటిని ప్రార్థిస్తే నీ పంటి నొప్పి తగ్గదు. కాని వాళ్ల సజీవ స్మృతి నీ విమోచన అనే ఒక అద్భుతాన్ని సాధించవచ్చు."

బానిస భావాల పుట్టలైన "చట్టబద్ధ" పత్రికల్లో తిష్ఠవేసిన మన ఉదారవాదులు గేర్‌త్సెన్‌మీద ఎలా నీచమూ, నికృష్టమూ అయిన అభాండాలు వేస్తున్నారో పై ఉల్లేఖననుబట్టి తెలుసుకోవచ్చు. వీళ్లు గేర్‌త్సెన్‌లోని లోపాలను గోరంతలు కొండంతలు చేసి, మంచి అంశాలను గురించి మాట్లాడకుండా దాటవేస్తారు. 1840 దశకంలో రష్యాలోని విప్లవకారులైన జనాన్ని స్వయంగా చూడలేకపోవడం గేర్‌త్సెన్ దురదృష్టమే గాని ఆయన పొరపాటు కాదు. 1860 దశకంలో విప్లవకారులైన జనాన్ని చూసినప్పుడు ఆయన ఉదారవాదానికి వ్యతిరేకంగా విప్లవకర డెమోక్రటిక్ ఉద్యమాన్ని సమర్థించాడు. భూస్వాముల జారుకీ, ఉదారవాద బూర్జువావర్గానికీ మధ్య రాజీకోసం కాక, జారిజంమీద ప్రజల విజయంకోసం ఆయన పోరాడాడు.

---

గేర్‌త్సెన్ శతజయంతి సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్న యీ తరుణంలో రష్యన్ విప్లవంలో మూడు తరాలూ, మూడు వర్గాలూ క్రియాశీలంగా వున్నట్లు మనం స్పష్టంగా చూస్తాం. మొట్టమొదట ప్రభువులూ, భూస్వాములూ, డిసెంబరిస్టులూ, గేర్‌త్సెన్. ఈ విప్లవకారులు కేవలం ఒక సంకుచిత బృందంగా ఏర్పడ్డారు. వాళ్లు జనానికి చాలా దూరంగా వుండేవారు. కాని వాళ్ల కృషి వృథా కాలేదు. డిసెంబరిస్టులు గేర్‌త్సెన్‌ని జాగృతంచేశారు. గేర్‌త్సెన్ విప్లవాందోళన కృషిని మొదలుపెట్టాడు.

ఈ కృషిని విప్లవకారులైన రాజ్నోచీంత్సి — చెర్నిషేవ్‌స్కీనుంచి "నరోద్నయ వోల్య" వీరులదాకా[40] — చేబట్టి, విస్తరింపజేసి, పటిష్ఠంచేసి, పదునుపెట్టారు. పోరాట యోధుల పరిధి విస్తరించింది, జనంతో వాళ్ల సంబంధం మరింత సన్నిహితమైంది. గేర్‌త్సెన్ వాళ్లకి "ముంచుకు వస్తున్న తుపానులో యువ కర్ణధారులు" అని నామకరణం చేశాడు. కాని అది యింకా అసలు తుపాను కానే కాదు.

పండు జుట్టు మేగ్దలీనా (పుల్లింగానికి చెందిన)[36]'' గురించి ''కోలొకొల్'' రాసినప్పుడు తుర్గేనెవ్ తనని తాను వెంటనే గుర్తుపట్టాడు.

రష్యన్ ఉదారవాదుల యావత్తు ముఠా గేర్త్సెన్ పోలండును సమర్థించినందుకు ఆయన్నుంచి దూరమైనప్పుడూ, యావత్తు ''విద్యావంతుల సమాజమూ'' ''కోలొకొల్''కి విముఖమైనప్పుడూ, గేర్త్సెన్ విభ్రాంతిచెందలేదు. ఆయన పోలండు స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తూనే వున్నాడు; రెండవ అలెక్సాండ్ర్ కొలువులో వున్న అణచివేతదారులనీ, కసాయి వాళ్ళనీ, ఉరితీతదారులనీ తీవ్రంగా విమర్శిస్తూనే వున్నాడు. గేర్త్సెన్ రష్యన్ డెమొక్రటిక్ ఉద్యమ గౌరవాన్ని కాపాడాడు. గేర్త్సెన్ తుర్గేనెవ్‌కి యిలా రాశాడు: ''మనం రష్యన్ పేరు ప్రతిష్ఠల్ని కాపాడాం, అలా చేసినందుకుగాను బానిస భావాలు కలిగిన అధిక సంఖ్యాకుల చేతుల్లో మనం నష్టపడ్డాం.''

ఒక భూదాసుడికి పెళ్ళి సంబంధం స్థిరపడిన తర్వాత, ఆ వధువును చెరిచేందుకు ప్రయత్నించిన భూస్వామిని భూదాసుడైన ఆ రైతు హత్యజేసినట్లు వచ్చిన వార్తమీద ''కోలొకొల్''లో గేర్త్సెన్ యిలా వ్యాఖ్యానించాడు: ''మంచి పని చేశాడు!'' రైతులను ''శాంతియుతంగా'' ''విడుదల చేసేందుకు'' సైనికాధికారులు నియమింపబడబోతున్నట్లు వార్త వెలువడినప్పుడు గేర్త్సెన్ యిలా రాశాడు: ''రైతుల్ని అణచివేసేందుకు బదులు, తన దళంతోబాటు రైతులతో కలిసే తొలి తెలివైన కల్నల్, రొమానొవ్‌ల సింహాసనాన్ని అధిష్ఠిస్తాడు.'' హంతకులకి సహాయకుడుగా ఉండరాదని కోరుకున్న కారణంగా కల్నల్ రైటెర్న్ వార్సాలో తనని తాను కాల్చుకుని చనిపోయినప్పుడు (1860) గేర్త్సెన్ యిలా రాశాడు: ''కాల్పులంటూ జరగాల్సివస్తే, నిరాయుధులైన ప్రజలమీద కాల్పులకి ఆజ్ఞ జారీ చేసే జనరల్సును కాల్చి చంపాలి.'' బెజ్దాలో యాభై మందిని ఊచకోత కోసి, వాళ్ల నాయకుడైన అంతోన్ పెత్రోవ్‌ను కాల్చి చంపినప్పుడు (1861 ఏప్రిల్ 12),[37] గేర్త్సెన్ ''కోలొకొల్''లో యిలా రాశాడు:

> ''కష్టజీవీ, కడగండ్లు పడే రష్యాదేశ వాసీ, నా మాటలు నీకు చేరగలిగితే ఎంత బాగుండును!... సెంట్ పీటర్స్‌బుర్గ్ సినడ్,[38] జర్మన్ జారూ[39]నీమీద రుద్దిన మత కాపలాదార్లని నువ్వెలా ద్వేషించాలో నీకెంత బాగా నేర్పివుండేవాడినో కదా.... నువ్వు నీ భూస్వామిని ద్వేషిస్తావు, నువ్వు అధికారుల్ని ద్వేషిస్తావు, నువ్వు వాళ్ళంటే భయపడతావు, అది సరైనదే కూడా కాని, నీకింకా జారులోనూ, బిషప్‌లోనూ విశ్వాసం వుంది.... వాళ్ళని నమ్మకు. జారు వాళ్ళలో వాడే, వాళ్ల అతని మనుష్యులే. నువ్వు — బెజ్దాలో హత్యచెయ్యబడిన యువకుడి తండ్రివైన

గేర్‌త్సెన్ ప్రజాస్వామ్యంనుంచి ఉదారవాదంలోకి దిగజారినందుకు కొత్త తరానికి చెందిన విప్లవాత్మక రాజ్నొచీంత్సికి[34] ప్రాతినిధ్యం వహించే చెర్నిషేవ్‌స్కీ, ద్రొబొల్యూబొవ్, సెర్నొ-సొలొవ్యేవిచ్‌లు విమర్శించారంటే, అందులో వాళ్ళ నూటికి నూరు పాళ్ళూ రైటు. అయితే నిజంగా చెప్పాలంటే, గేర్‌త్సెన్ ప్రజాస్వామ్యానికీ ఉదారవాదానికీ మధ్య ఎంత ఎక్కువగా ఊగిసలాడినా కూడా, ఆయనలోని ప్రజాస్వామ్యవాదిదే పైచెయ్యిగా వుండేది.

ఉదారవాద బానిస స్వభావానికి మిక్కిలి నికృష్ట ప్రతినిధుల్లో ఒకడైన కవేలిన్ – యితగాడు ఒకప్పుడు, సరిగ్గా దాని ఉదారవాద ధోరణుల కారణంగానే "కోలొకోల్"ని మెచ్చుకున్నాడు. కాని యితగాడు రాజ్యాంగానికి వ్యతిరేకంగా కత్తికట్టి, విప్లవాందోళనను ఖండించి, "బలప్రయోగం"నీ, దానికి విజ్ఞప్తులనూ నిరసించి, సంయమనాన్ని బోధించనారంభించినప్పుడు, గేర్‌త్సెన్ ఆ ఉదారవాద సంయమితో తెగతెంపులు చేసుకున్నాడు. "ఉదారమైనదిగా నటించే ప్రభుత్వానికి ఆంతరంగిక మార్గదర్శిగా" కవేలిన్ రచించిన "అరకొరదీ, అర్థరహితమైనదీ, హానికరమైనదీ అయిన పుస్తకం"మీద, "రష్యన్ ప్రజలను గొర్రెల మందగానూ, ప్రభుత్వాన్ని సాకార మేధానిధిగానూ" వర్ణించిన కవేలిన్ "ఆర్ద్ర భావాలతో కూడిన రాజకీయ సుభాషితాల"మీద గేర్‌త్సెన్ విరుచుకుపడ్డాడు. "సమాధిమీది రాత" పేర "కోలొకోల్" ఒక వ్యాసాన్ని ప్రచురించింది. ఆ వ్యాసం "తమ కుళ్ళు భావాలతో మురికి సాలెగూళ్లను అల్లే ప్రొఫెసర్లకీ, ఒకప్పుడు దాపరికంలేకుండా మాట్లాడుతూ వుండి, క్రమంగా మురిగిపోయిన తమ ఆలోచనపట్ల మానసికారోగ్యం కలిగిన యువజనం సానుభూతి చూపని కారణంగా దరిమిలా ద్వేషం పెంచుకున్న మాజీ ప్రొఫెసర్లకీ" వ్యతిరేకంగా తీవ్రమైన దాడి చేసింది. కవేలిన్ యీ చిత్రణలో తనని తాను వెంటనే గుర్తించుకున్నాడు.

చెర్నిషేవ్‌స్కీ అరెస్టయినప్పుడు, నికృష్టుడైన ఉదారవాది కవేలిన్ యిలా రాశాడు: "ఈ అరెస్టుల్లో ఆగ్రహకారణమైనది నాకేమీ కనిపించడంలేదు.... ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అన్ని పద్ధతులనూ సక్రమమైనవిగానే విప్లవ పార్టీ పరిగణిస్తుంది, కాగా ప్రభుత్వం తన సొంత పద్ధతుల్లో తనని తాను రక్షించుకొంటుంది." దీనికి బదులుగా అన్నట్లు, చెర్నిషేవ్‌స్కీ విచారణను గురించి గేర్‌త్సెన్ యిలా రాశాడు: "మనని పరిపాలిస్తున్న దొంగల గుంపుని, లఫంగుల ముఠాని నిరసించరాదని చెప్పే దౌర్భాగ్యులు, కలుపు మొక్కల్లాంటివాళ్ళు, అస్థిరులు మనకిక్కడ వున్నారు."

ఉదారవాది తుర్గేనెవ్ రెండవ అలెక్సాండ్రర్‌కి తన విధేయతని తెలుపుతూ ఒక ఆంతరిక లేఖను రాసి, పోలిష్ తిరుగుబాటు[35] అణచివేత కాలంలో గాయపడిన సైనికుల సహాయార్థం రెండు బంగారు నాణాలను విరాళంగా యిచ్చినప్పుడు "తనని పైకొన్న పశ్చాత్తాపం గురించి జారుకి తెలియలేదన్న ఆలోచనతో తన కంటికి నిద్ర లేకుండా పోయిందని జారుకి లేఖ రాసిన

# ఐక్యతకోసం పొలికేకల మాటున ఐక్యత విచ్ఛిత్తి

సమకాలిక కార్మికోద్యమ సమస్యలు, ప్రత్యేకించి, ఆ ఉద్యమపు నిన్న మొన్నటికి (అంటే, చారిత్రకంగా యిప్పుడే గడిచిపోయిన దశకి) చెందిన ప్రతినిధులను అనేక విధాలుగా వేధిస్తున్న సమస్యలు. ఇది గ్రూపుతత్వం అనబడేదానికి, చీలికలు, వగైరాలకు చెందిన సమస్యలకు ప్రధానంగా వర్తిస్తుంది. కార్మికోద్యమంలోని మేధావులు, వేధిస్తున్న యీ సమస్యలను లేవగొట్టవద్దని, కంగారుగా, ఉద్రిక్తంగా, దాదాపు ఉన్మత్తావేశంతో చేసే వేడకోళ్లను మనం తరచుగా వింటూవుంటాం. మార్క్సిస్టులలో వున్న వివిధ ధోరణుల మధ్య సుదీర్ఘ సంవత్సరాలపాటు (ఉదాహరణకు 1900–01 దరిమిలా), జరిగిన ఘర్షణ సంగతి తెలిసినవారు, వేధిస్తున్న యీ సమస్యల విషయంలో వచ్చిన అనేక వాదనలను తిరిగి వల్లించడం అనావశ్యకమని సహజంగానే భావించవచ్చు.

కాని, మార్క్సిస్టుల మధ్య జరిగిన పద్నాలుగేళ్ల ఘర్షణలలో (ఆ మాటకు వస్తే, "ఆర్థికవాదపు"[41] తొలి చిహ్నాలు పొడచూపిన నాటినుంచీ లెక్కపెట్టినట్లయితే పద్దెనిమిది లేక పంథొమ్మిది ఏళ్ల ఘర్షణలో) పాల్గొన్నవారిలో ఎక్కువమంది యీనాడు మిగిలి లేరు. ఈనాడు మార్క్సిస్టుల శ్రేణుల్లో వున్న కార్మికుల్లో అత్యధిక సంఖ్యాకులకు వెనకటి ఆ పోరాటం గుర్తైనా వుండివుండదు, లేకుంటే వాళ్లు దాన్ని గురించి ఎన్నడూ వినివుండరు. అత్యధిక సంఖ్యాకులకు (సందర్భవశాత్తూ మన పత్రిక[42] జరిపిన అభిప్రాయ సేకరణ నిరూపించినట్లు), వేధిస్తున్న యీ సమస్యలు అసాధారణాధిక ఆసక్తిదాయకమైనవి. అందుకని, ట్రాట్స్కీయొక్క "గ్రూపు అతీత కార్మిక పత్రిక" "బొర్బా"[43]చేత, యివేవో కొత్తవి అన్నట్లు (మరి, కార్మికుల యువతరానికి అవి నిజంగా కొత్తవి) లేవదీయబడిన యీ సమస్యలను నేను యిక్కడ పరిశీలించాలనుకుంటున్నాను.

# 1. "గ్రూపు తత్వం" గురించి

ట్రాట్స్కీ తన కొత్త పత్రికను "గ్రూపు అతీతమైనది" అంటున్నాడు. తన అడ్వర్ టైజ్మెంట్లలో అతనీ మాటను పై పంక్తిలో పెట్టాడు. అతనీ మాటను అన్ని విధాలా వల్లిస్తూ నొక్కిచెప్పాడు, రద్దువాద "సేవెర్నయ రబోచయ గజేత"44లోనే కాకుండా ("బోర్బా" ప్రచురణ ప్రారంభం కాకముందు దానిపైన ట్రాట్స్కీ రాసిన వ్యాసం దీనిలో ప్రచురింపబడింది) నేరుగా "బోర్బా" సంపాదకీయ వ్యాసాల్లో కూడ యీ మాటను నొక్కిచెప్పాడు.

ఈ "గ్రూపు అతీత తత్వం" అంటే ఏమిటి?

ట్రాట్స్కీయొక్క "కార్మికుల పత్రిక" అంటే, కార్మికులకోసం ట్రాట్స్కీ పత్రిక అనవలసివుంటుంది; దానిలో కార్మికుల చొరవకు సంబంధించిన చిన్నెలుగాని, కార్మికవర్గ సంఘాలతో దానికి ఎటువంటి సంబంధాలుగాని లేకపోవడమే యిందుకు కారణం. సుబోధక శైలిలో రాయదలచుకున్న ట్రాట్స్కీ, కార్మికులకోసం తను పెట్టిన పత్రికలో, తన పాఠకుల ప్రయోజనార్థం, "టెరిటరీ," "అంశం" మొదలైన పదాల అర్థాలను యిచ్చాడు.

సరేనయ్యా, చాలా బాగానే వుంది. అయితే, "గ్రూపు అతీత తత్వం" అన్న పదానికి అర్థాన్ని కూడా కార్మికులకు వివరించకూడదూ? "టెరిటరీ," "అంశం" అన్న పదాల కంటె యీ పదం ఎక్కువ సుబోధకమైనదా?

అబ్బే, అది కాదు కారణం. "గ్రూపు అతీత తత్వం" అన్న లేబులు, కార్మికుల్లోని యువతరాన్ని భ్రమపరచడానికి గాను, గ్రూపు తత్వపు అత్యంత హీన అవశేషాల అత్యంత హీన ప్రతినిధులచేత వాడబడుతోంది. దీన్ని వివరించడం సముచితంగా వుంటుంది.

ఒకానొక నిర్దిష్ట చారిత్రక దశలో, గ్రూపు తత్వం సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రధాన విశిష్ట లక్షణంగా వుంది. ఆ దశ ఏది? 1903–1911 మధ్య కాలమే ఆ దశ.

గ్రూపులుగా ఈ చీలికను మరింత స్పష్టంగా వివరించేందుకుగాను, ఉదాహరణకు, 1906–07లో వున్న నిర్దిష్ట పరిస్థితులను మనం గుర్తుచేసుకోవలసివుంటుంది. ఆ కాలంలో పార్టీ సమైక్యంగా వుంది, దానిలో చీలిక లేదు, కాని గ్రూపు విభజన వుంది, అంటే, సమైక్య పార్టీలో వాస్తవానికి రెండు గ్రూపులు, రెండు వాస్తవంగా సరైన సంఘాలు వున్నాయి. కింది కార్మిక శాఖలు సమైక్యంగా వున్నాయి, కాని ప్రతి ముఖ్య విషయంపైనా

ఆ రెండు గ్రూపులూ రెండు రకాల ఎత్తుగడలను రూపొందించాయి. ఆయా ఎత్తుగడల సమర్థకుల మధ్య సమైక్య కార్మిక సంఘాల్లో వాదోపవాదాలు జరిగాయి (ఉదాహరణకు, 1906లో దూమ, లేక కాడెట్, మంత్రి వర్గమా లేక 1907లో లండన్ మహాసభకి ప్రతినిధుల ఎన్నిక కాలంలోనా అన్న వివాదాల విషయంలో మాదిరిగా), మరి ఆ సమస్యలు మెజారిటీ ఓట్లనుబట్టి నిర్ణయింపబడ్డాయి. ఒక గ్రూపు స్టాక్‌హోమ్ ఐక్య మహాసభ (1906)లో ఓడిపోతే, మరో గ్రూపు లండన్ ఐక్య మహాసభ (1907)లో ఓడిపోయింది.[45]

రష్యాలో సంఘటిత మార్క్సిజం చరిత్రలో యివి సర్వసామాన్యంగా తెలిసిన వాస్తవాలు.

ట్రాట్స్కీ ఎలాంటి పచ్చి అబద్ధాలను ప్రచారంచేస్తున్నాడో గ్రహించేందుకుగాను సర్వసామాన్యంగా తెలిసిన యీ వాస్తవాలను గుర్తుచేసుకొంటే చాలు.

1912 దరిమిలా, రెండేళ్లకుపైగా, రష్యాలోని సంఘటిత మార్క్సిస్టుల్లో గ్రూపు తత్వం లేదు, సమైక్య సంఘాల్లోనూ సమైక్య కాన్ఫరెన్సులలోనూ, మహాసభలలోనూ ఎత్తుగడలపైన తగాదాలు లేవు. 1912 జనవరిలో, రద్దువాదులు తనకు చెందరని పార్టీ లాంఛనప్రాయంగా ప్రకటించిన తర్వాత, పార్టీకీ, రద్దువాదులకూ మధ్య పూర్తి ఎడబాటు వచ్చింది.[46] ట్రాట్స్కీ యీ పరిస్థితికి "చీలిక" అని పేరు పెట్టాడు. నేనీ నామకరణాన్ని గురించి తర్వాత ప్రత్యేకించి ప్రస్తావిస్తాను. అయితే, "గ్రూపు తత్వం" అన్న మాట సత్య దూరం అయినది అన్న విషయం నిస్సందేహ వాస్తవం.

నేనింతకు ముందే చెప్పినట్లు, యీ పదం పునశ్చరణ, నిన్నటి రోజున నిజమైనదాని, అంటే, యిప్పటికే గడిచిపోయినదాని విమర్శనా రహితమైన, అహేతుకమైన, అర్థరహిత మైన పునశ్చరణ. ట్రాట్స్కీ "గ్రూపు పోరాట అయోమయ స్థితి"ని గురించి మనకు చెప్పినప్పుడు (1వ సంచికలోని 5, 6 పేజీలూ, యింకా అనేక యితర పేజీలూ చూడండి) గతానికి చెందిన ఏ దశను అతని మాటలు ప్రతిధ్వనిస్తున్నాయో మనం వెంటనే గ్రహిస్తాం.

ప్రస్తుత పరిస్థితులను, రష్యాలోని సంఘటిత మార్క్సిస్టులలో పదింట తొమ్మిది వంతులైన యువ రష్యన్ కార్మికుల దృక్కోణంనుంచి పరిశీలించండి. వాళ్లు కార్మికోద్యమం లోని భిన్న అభిప్రాయాల లేక ధోరణుల మూడు సామూహిక వ్యక్తీకరణలను చూస్తారు: 40,000 కాపీల సర్క్యులేషను గల ఒక వార్తాపత్రిక చుట్టూ సమీకృతులైన "ప్రావ్దా" వాళ్లు,[47] "రద్దువాదులు" (15,000 సర్క్యులేషను), వామపక్ష నరోద్నిక్కులు[48] (10,000 సర్క్యులేషను). ఆయా సిద్ధాంతాలకు గల సామూహిక స్వభావాన్ని సర్క్యులేషన్ అంకెలు పాఠకునికి తెలియజేస్తాయి.

ఇప్పుడొక ప్రశ్న ఉదయిస్తుంది: దానితో "అయోమయ స్థితి"కి సంబంధం ఏమిటి? ట్రాట్స్కీకి ఆడంబర, శుష్క పదాలంటే మక్కువ అన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే

"అయోమయ స్థితి" అన్న పడికట్టు పదం పదగుంభనం మాత్రమే కాదు; గడిచిపోయిన దశలో విదేశాల్లో ఉండిన సంబంధాలను రష్యన్ గడ్డలో, ప్రస్తుత దశలో, నాటడాన్ని, లేక, నాటేందుకు జరిపే వ్యర్థ ప్రయత్నాన్ని కూడా అది తెలియజేస్తుంది. అదీ అసలు విషయం.

మార్క్సిస్టులకూ నరోద్నిక్కులకూ మధ్య పోరాటంలో "అయోమయ స్థితి" అంటూ ఏమీ లేదు. ట్రాట్స్కీ సైతం దాన్ని తిరస్కరించ సాహసించడని ఆశిస్తాను. మార్క్సిస్టులకూ నరోద్నిక్కులకూ మధ్య పోరాటం ముప్పదేళ్లకుపైగా, అంటే మార్క్సిజం అస్తిత్వంలోకి వచ్చిననాటినుంచీ సాగుతోంది. శ్రామికవర్గం, రైతాంగం అనే రెండు భిన్న వర్గాల – ప్రయోజనాలకూ, దృక్పథాలకూ మధ్య గల తీవ్ర వైరుధ్యమే యీ పోరాట కారణం. ఎక్కడైనా ఏ "అయోమయ స్థితి" అయినా వుంటే, అది, యీ విషయాన్ని అర్థంచేసుకోలేని మతిమాలినవాళ్ల బుర్రల్లో మాత్రమే వుంది.

మరైతే, యిక మిగిలిందేమిటి? మార్క్సిస్టులకూ రద్దువాదులకూ మధ్య పోరాటంలోని "అయోమయ స్థితా"? అదీ తప్పే. ఎందుకంటే, ఒక ధోరణితో పోరాటాన్ని, దేన్నైతే యావత్తు పార్టీ ఒక ధోరణిగా గుర్తించి, వెనక ఎన్నడో 1908లోనే ఖండించిందో, దాన్ని అయోమయ స్థితి అనలేము. రద్దువాదం, దాని నాయకులకూ, తోడ్పాటుదారులకూ సంబంధించి సైతం, మెన్షెవిజంతోనూ (1903–08), ఆర్థికవాదంతోనూ (1894–1903) మిక్కిలి సన్నిహితంగానూ, విడదీయరాని విధంగానూ ముడిపడివుందన్న సంగతి రష్యాలో మార్క్సిజం చరిత్రతో ఏ కొంచెమైనా పరిచయం వున్న ప్రతివాడికీ తెలుసు. తత్పర్యవసానంగా యిక్కడ, కూడా, సుమారు యిరవై ఏళ్లకుపైగా విస్తరించిన చరిత్ర మనకి వుంది. సొంత పార్టీ చరిత్రనే "అయోమయ స్థితి"గా పరిగణించడమన్నది క్షమించరాని బుద్ధిశూన్యతను ప్రదర్శించడమే.

ఇప్పుడిక, మనం ప్రస్తుత పరిస్థితిని పారిస్ లేక వియన్నా దృష్ట్యా పరిశీలిద్దాం.[49] అలా చేస్తే వెన్వెంటనే చిత్రం యావత్తూ మారిపోతుంది. "ప్రావ్దా"వాళ్ల, "రద్దువాదులకు" తోడు, ఒకే సోషల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యత్వం తమదేననే రష్యన్ గ్రూపులు అయిదుకి తక్కువ కాకుండా వున్నట్లు మనం చూస్తాం: ట్రాట్స్కీ గ్రూపు, రెండు "వ్పెర్యోద్" గ్రూపులు, "పార్టీ అనుకూల బోల్షెవిక్కులు," "పార్టీ అనుకూల మెన్షెవిక్కులు."[50] పారిస్‌లోనూ, వియన్నాలోనూ మార్క్సిస్టులందరికీ (ఉదాహరణ నిమిత్తం నేనీ రెండు మిక్కిలి పెద్ద కేంద్రాలనూ తీసుకున్నాను) యీ విషయం బాగా తెలుసు.

ఒక విధంగా యీ విషయంలో ట్రాట్స్కీ చెప్పింది రైటు; ఇది నిజంగానే గ్రూపు విభజన, నిజంగానే అయోమయ స్థితి!

పార్టీలోపల గ్రూపులు, అంటే, నామ్‌కే వాస్తే ఐక్యత (ప్రతి ఒక్కటీ ఒక్క పార్టీ వారసత్వాన్నే తనదంటే తనదంటోంది), వాస్తవంలో అనైక్యత (నిజానికి అన్ని గ్రూపులూ ఒకటి మరొకదానినుండి స్వతంత్రమైనవి, ఒకటి మరొకదానితో సార్వభౌమ రాజ్యాల మాదిరిగా, ఒకటి మరొకదానితో రాయబారాలు జరిపి, ఒప్పందాలు కుదుర్చుకొంటాయి).

"అయోమయ స్థితి," అంటే, (1) రష్యాలో కార్మికోద్యమంతో యీ గ్రూపులు ముడిబడి వున్నాయనడానికి వస్తుపరమైన, నిరూపించేందుకు అనువైన రుజువులు లేకపోవడం, (2) ఈ గ్రూపుల వాస్తవ భావజాలాత్మక, రాజకీయ స్వరూపాన్ని మనం నిర్ణయించగలిగేందుకు అవసరమైన ఏ సమాచారమూ లేకపోవడం. 1912, 1913 – ఈ రెండు పూర్తి సంవత్సరాల దశను తీసుకోండి. అది కార్మికోద్యమ పునరుద్ధరణ, విజృంభణల దశ అన్న సంగతీ, అప్పుడు ఏకొంచెమో జనసామూహిక స్వభావం కలిగిన ప్రతి ఒక ధోరణీ (రాజకీయాల్లో జనసామూహిక స్వభావం మాత్రమే గుర్తించబడుతుంది) నాల్గవ దూమ ఎన్నికలపైన,[51] సమ్మె ఉద్యమంపైన, చట్టబద్ధంగా వెలువడే పత్రికలపైన, ట్రేడ్ యూనియన్లపైన, భీమా చేయించడం మొదలైన వాటిపైన కొంత ప్రభావాన్ని బరపకుండా ఉండలేకపోయింది అన్న సంగతి ప్రతివాడికీ తెలుసు. పూర్తిగా ఆ రెండేళ్ల కాలంలోనూ, విదేశాల్లో వున్న యీ ఐదు గ్రూపుల్లోనూ ఏ ఒక్కటీ కూడా, రష్యాలోని కార్మిక జన సామూహిక ఉద్యమం పైన పేర్కొనబడిన కార్యకలాపాలు ఏ ఒక్క దానిలోనూ కించిత్తు కూడా తన సత్తాను నిరూపించుకోలేదు!

ఎవరైనా తేలికగా ధ్రువపరుచుకోగల వాస్తవం యిది.

ట్రాట్స్కీని "గ్రూపు తత్వపు అత్యంత హీన అవశేషాల" ప్రతినిధి అని పిలవడం సరైనదేనని యీ వాస్తవం రుజువుచేస్తోంది.

తను గ్రూపు తత్వానికి అతీతుడినని ట్రాట్స్కీ చెప్పుకొంటున్నప్పటికీ "ట్రాట్స్కీ గ్రూపు"కి అతగాడు ప్రతినిధి అన్న సంగతి, రష్యాలోని కార్మికోద్యమంతో ఏ కొంచెమైనా పరిచయం ఉన్న ప్రతి ఒక్కడికీ తెలుసు. మనకిక్కడ గ్రూపు విభజన వుంది, దానికి వుండే రెండు ఆవశ్యక లక్షణాలు మనకి కనిపిస్తాయి: (1) నామ్‌కే వాస్తే ఐక్యతను గుర్తించడం, (2) వాస్తవంలో గ్రూపుల వేర్పాటు. ఇక్కడ గ్రూపు విభజన అవశేషాలు వున్నాయి, ఎందుకంటే, రష్యాలోని కార్మిక జనసామూహిక ఉద్యమంతో నిజమైన సంబంధముంటూ ఉన్న రుజువు ఏమాత్రం లేదు.

ఇక చివరి సంగతి, భావజాలాత్మకమైన లేక రాజకీయమైన నిర్దిష్టత అంటూ ఏమీ లేదు గనుక, గ్రూపు విభజన రూపాల్లో యిది అత్యంత హీనమైనది. "ప్రావ్ద"వాదు

లకు యీ నిర్దిష్టత అన్నది విశిష్ట లక్షణం అనడాన్ని నిరాకరించలేం (మన బద్ధ వ్యతిరేకి అయిన ఎల్. మార్తొవ్ సైతం, అన్ని సమస్యలపైనా సర్వే సర్వత్రా తెలిసిన లాంఛన ప్రాయమైన నిర్ణయాల విషయంలో మనకు "ఐక్యతా, క్రమశిక్షణా ఉన్నట్లు" ఒప్పుకున్నాడు), రద్దువాదులకూ (వాళ్ళు, కనీసం వాళ్లలో మిక్కిలి ప్రముఖులు, అత్యంత నిర్దిష్టమైన లక్షణాలను, అంటే, మార్క్సిస్టు కాక, లిబరల్ లక్షణాలను కలిగివున్నారు).

ట్రాట్స్కీ గ్రూపు మాదిరి కొన్ని గ్రూపులు వాస్తవానికి రష్యన్ దృక్కోణంనుంచి కాక, కేవలం వియన్నా-పారిస్ దృక్కోణంనుంచి మాత్రమే వున్నాయి; వాటికి కొంత నిర్దిష్టత వుందన్న విషయాన్ని నిరాకరించలేం. ఉదాహరణకు, మాహిస్టు "వ్పెర్యోద్" గ్రూపు మాహిస్టు సిద్ధాంతాలు నిర్దిష్టమైనవి. రద్దువాదాన్ని సైద్ధాంతికంగా ఖండించడంతో బాటు, యీ సిద్ధాంతాలను "పార్టీ అనుకూల మెన్షెవిక్కులు" గట్టిగా తిరస్కరించడం, మార్క్సిజాన్ని బలపరచడం కూడా నిర్దిష్టమైనవే.

అయితే ట్రాట్స్కీకి సైద్ధాంతికమూ, రాజకీయమూ అయిన నిర్దిష్టత ఏమీ లేదు; ఎందుకంటే, "గ్రూపు అతీత తత్వానికి" అతని సర్వస్వామ్య హక్కు, మనం త్వరలోనే మరింత వివరంగా చూడబోయేట్లు, ఒక గ్రూపునుంచి మరో గ్రూపుకి, యిటూ అటూ స్వేచ్ఛగా ఫిరాయించేందుకు సర్వస్వామ్య హక్కు మాత్రమే.

సారాంశం ఏమిటంటే:

1) వివిధ మార్క్సిస్టు ధోరణుల మధ్యా, గ్రూపుల మధ్యా గల సైద్ధాంతిక అభిప్రాయ భేదాల చారిత్రక ప్రాముఖ్యాన్ని — యీ అభిప్రాయభేదాలు సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క యిరవదేళ్ల చరిత్ర పొడుగునా సాగుతూవచ్చినా, యీనాటి మౌలిక సమస్యలతో వాటికి సంబంధం వున్నా కూడా (యీ విషయాన్ని నేను తర్వాత నిరూపిస్తాను) — ట్రాట్స్కీ వివరించడు, అవి అతనికి అర్థమూ కాలేదు;

2) గ్రూపులుగా విభజన ప్రధాన విశిష్ట లక్షణాలు ఐక్యతను నామ్‌కే వాస్తే గుర్తించడం, వాస్తవంలో అనైక్యత అన్న విషయాన్ని అర్థంచేసుకోవడంలో ట్రాట్స్కీ విఫలుడయాడు;

3) "గ్రూపు అతీత తత్వం" మరుగున, ప్రత్యేకించి నిర్దిష్టమైన సూత్రాలు గాని, రష్యాలోని కార్మికోద్యమంలో పునాది గాని లేని, ఒక దేశాంతర గ్రూపు ప్రయోజనాలను ట్రాట్స్కీ బలపరుస్తున్నాడు.

మెరిసేదంతా బంగారం కాదు. ట్రాట్స్కీ పదబంధాల్లో చాలా తళుకూ, శబ్దాడంబరం వున్నాయి గాని, అవి అర్థరహితమైనవి.

# 2. చీలికను గురించి

"'ప్రావ్ద'వాళ్లూ, మీలో గ్రూపు విభజన, అంటే, ఐక్యతను నామ్‌కే వాస్తే గుర్తించడం, వాస్తవంలో అనైక్యతా లేకపోయినప్పటికీ, మీలో అంతకన్న అధ్వాన్నమైనవి, అనగా చీలిక ఎత్తుగడలు వున్నాయి" అని చెప్తున్నారు మనకి. ట్రాట్స్కీ చెప్పేది సరిగా యిదే. తన భావాలను బాగా సారించలేక, తన వాదనలను గుదిగుచ్చలేక, ఒక క్షణాన గ్రూపు విభజనకు వ్యతిరేకంగా ఆడంబర పదప్రయోగానికి పూనుకొంటాడు, మరుసటి క్షణాన "చీలిక ఎత్తుగడలు ఆత్మహత్యా సదృశమైన ఒక విజయం తర్వాత మరొకదాన్ని సాధిస్తున్నాయి" (1వ సంచిక, 6వ పేజి) అంటూ అరుస్తాడు.

ఈ ప్రకటనకు ఒకేఒక్క అర్థం మాత్రమే ఉండగలదు: "'ప్రావ్ద'వాళ్లు విజయం తర్వాత విజయం సాధిస్తున్నారు" (ఇదొక వస్తుపరమైన, ప్రమాణానికి నిలబడే యథార్థం, రష్యాలో కార్మిక జనసామూహిక ఉద్యమ అధ్యయనం ద్వారా – ఉదాహరణకు 1912, 1913 సంవత్సరాల్లో జరిగినదాని ద్వారా – యిది ధృవీకరింపబడింది), కాని ట్రాట్స్కీ అనే నేను, "ప్రావ్ద"వాళ్లను (1) చీలికదారులుగానూ, (2) ఆత్మహత్యాకర రాజకీయ వేత్తలుగానూ నిరసిస్తున్నాను.

దీన్ని మనం పరిశీలిద్దాం.

మొట్టమొదట మనం ట్రాట్స్కీకి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. కొద్దికాలం క్రితం (1912 ఆగస్టునుండి 1914 ఫిబ్రవరివరకు) అతను, ఎఫ్. దాన్‌తో ఏకీభవించాడు. ఈ దాన్ రద్దువాద వ్యతిరేకతను "హతమారుస్తాను" అని బెదరించిన సంగతీ, అలా చెయ్యండని యితరులకు కూడా విజ్ఞప్తిచేసిన సంగతీ అందరికీ బాగా తెలిసినదే. ప్రస్తుతం ట్రాట్స్కీ మన ధోరణిని "హతమారుస్తాను" అని బెదరించడం లేదు (మన ధోరణిని కాక, పార్టీని – కోపగించుకోకు ట్రాట్స్కీ మహాశయా, యిది నిజం!), అది తనను తాను హతమార్చుకుంటుందని మాత్రమే అతను జోస్యం చెప్తున్నాడు!

ఇది మరింత మృదువైనది, కదూ? ఇది దాదాపు "గ్రూపు అతీత తత్వం" కదూ?

అయితే హాస్యాన్ని పక్కన పెడదాం (ట్రాట్స్కీయొక్క సహింప సాధ్యంగాని ఆడంబర పదప్రయోగాన్ని తిప్పికొట్టడానికి హాస్యం ఒక్కటే మార్గం అయినా).

"ఆత్మహత్య" శుష్క పదబంధం, శుద్ధ "ట్రాట్స్కీయిజం."

చీలిక ఎత్తుగడలు అన్నది తీవ్రమైన రాజకీయ నేరారోపణ. రద్దువాదులూ, పైన పేర్కొనబడిన అన్ని గ్రూపులూ – పారిస్, వియన్నాల దృష్ట్యా యివి ప్రత్యక్షంగా వున్నాయి – సవాలక్ష పద్ధతుల్లో మనకి వ్యతిరేకంగా యీ నేరారోపణనే పునశ్చరణ చేశారు.

వాళ్లందరూ కూడా తీవ్రమైన యీ రాజకీయ నేరారోపణను అబ్బురం గొలిపేటంత అవివేకమైన పద్ధతిలో పునశ్చరణ చేస్తున్నారు. ట్రాట్స్కీనే చూడండి. "చీలిక ఎత్తుగడలు ఆత్మహత్యా సదృశమైన ఒక విజయం తర్వాత మరొకదాన్ని ('ప్రావ్ద'వాళ్లు విజయం పొందుతున్నారని చదువుకోండి) సాధిస్తున్నాయి" అని అతను ఒప్పుకున్నాడు. దీనికి అతనింకా యిలా జోడిస్తాడు:

> "పలువురు పురోగామి కార్మికులే, పూర్తి రాజకీయ విభ్రాంత స్థితిలో, తరచుగా చీలికకు చురుకైన ఏజెంట్లు అవుతున్నారు" (1వ సంచిక, 6వ పేజి).

ఈ మాటలు, యీ సమస్యపైన, బాధ్యతా రాహిత్యానికి ప్రస్ఫుటమైన ఉదాహరణ కావా?

మా ముందు, రష్యాలోని కార్మికోద్యమ రంగంలో మాకు కనిపిస్తున్నదల్లా రద్దువాదం కాగా, మీరు మాపైన చీలికదారులమన్న ఆరోపణ చేస్తున్నారు. అంటే, రద్దువాదంపట్ల మా వైఖరి తప్పని మీరు భావిస్తున్నారా? నిజంగానే, నేను పైన పేర్కొన్న దేశాంతర గ్రూపులు అన్నీ, అవి ఒకదాన్నుంచి మరొకటి ఎంతగా విభేదించినప్పటికీ, రద్దువాదంపట్ల మా వైఖరి తప్పనీ, అది "చీలికదారుల" వైఖరి అనే విషయంలో మటుకు ఏకాభిప్రాయం కలిగివున్నాయి. ఈ అన్ని గ్రూపులకీ, రద్దువాదులకీ మధ్య సామ్యాన్ని (బాగా సన్నిహితమైన రాజకీయ బాంధవ్యాన్నీ) కూడా యిది వెల్లడిస్తోంది.

రద్దువాదంపట్ల మా వైఖరి సిద్ధాంతరీత్యా, సూత్రరీత్యా తప్పయినట్లయితే, మరి ట్రాట్స్కీ అలాగని నిర్మొగమాటంగా చెప్పాలి, తనెందుకుగాను అది తప్పని భావిస్తున్నాడో అసందిగ్ధంగా, నిర్దిష్టంగా ప్రకటించాలి. అయితే, ట్రాట్స్కీ అతి ముఖ్యమైన యీ అంశాన్ని ఏళ్ల తరబడి దాటవేస్తున్నాడు.

ఉద్యమానుభవం ద్వారా, రద్దువాదంపట్ల మా వైఖరి తప్పని ఆచరణలో రుజువైనట్లయితే, అప్పుడు యీ అనుభవాన్ని విశ్లేషించాలి; అయితే ట్రాట్స్కీ అదీ చెయ్యడం లేదు. "పలువురు పురోగామి కార్మికులు చీలికకు చురుకైన ఏజెంట్లు అవుతున్నారు" అని అతను ఒప్పుకొంటున్నాడు ("ప్రావ్ద"వాళ్ల పంథాయొక్క, ఎత్తుగడలయొక్క, విధానంయొక్క, నిర్మాణంయొక్క చురుకైన ఏజెంట్లు అని అర్థం).

ట్రాట్స్కీ ఒప్పుకొంటున్నట్లు, అనుభవంచేత ధృవీకరింపబడినట్లు, పురోగామి కార్మికులు, అందునా పలువురు పురోగామి కార్మికులు "ప్రావ్ద"ని బలపరుస్తున్నారన్న వ్యసనకరమైన వాస్తవానికి గల కారణం ఏమిటి?

ఈ పురోగామి కార్మికుల "పూర్తి రాజకీయ విభ్రాంతే" దానికి కారణం అని జవాబిస్తాడు ట్రాట్స్కీ.

ఈ వివరణ ట్రాట్స్కీకి, విదేశాల్లోని మొత్తం ఐదు గ్రూపులకీ, రద్దువాదులకీ విశేషంగా తృప్తి కలిగించేదని చెప్పనక్కర్లేదు. ట్రాట్స్కీకి, పాండిత్య ప్రకర్షక నైపుణ్యంతో చారిత్రక విషయాలను, తనకు తృప్తి కలిగించే విధంగా, ఆత్మ స్తోత్రప్రాయమైన, ఆడంబర పదబంధాలను ఉపయోగించడమంటే మహా యిష్టం. "పలువురు పురోగామి కార్మికులు" ట్రాట్స్కీ పంథాకు అనుగుణంగా లేని రాజకీయ, పార్టీ పంథాయొక్క "చురుకైన ఏజెంట్లు" అయారు గనుక, ట్రాట్స్కీ యీ సమస్యను నిస్సంకోచంగా, నేరుగా యిలా తేల్చేస్తాడు: ఈ పురోగామి కార్మికులు "పూర్తి రాజకీయ విభ్రాంత స్థితి"లో వున్నారు, మరి తను, ట్రాట్స్కీ, స్పష్టమైన రాజకీయ స్థిరత్వ, స్పష్టతా "స్థితిలో" వుండి, సరైన పంథాను అనుసరిస్తున్నాడట!... మరి యిదే ట్రాట్స్కీ, రొమ్ములు బాదుకొంటూ, గ్రూపు తత్వానికీ, నిర్మాణ రాహిత్యానికీ, కార్మికులపై తమ యిచ్ఛను రుద్దేందుకు మేధావులు చేస్తున్న ప్రయత్నాలకూ వ్యతిరేకంగా మండిపడతాడు!...

ఇలాంటి విషయాలను చదివినప్పుడు, ఎవరైనా తమను తాము యిలా ప్రశ్నించుకోకుండా వుండలేరు: ఇటువంటి స్వరాలు వినవస్తున్నది పిచ్చి ఆసుపత్రినుంచా?

రద్దువాద సమస్యను, దాన్ని ఖండించే సమస్యను, "పురోగామి కార్మికుల" ముందు పార్టీ పెట్టినది ఎన్నడో 1908లో, మరి అత్యంత నిర్దిష్టమైన రద్దువాదుల గ్రూపు నుంచి (అక్షరాలా, "నాష జర్యా" గ్రూపు[52] నుంచి) "చీలిపోవాలన్న" సమస్య, అంటే, పార్టీని నిర్మించే ఏకైక మార్గం యీ గ్రూపు లేకుండానూ, దానికి వ్యతిరేకంగానూ అనే యీ సమస్య రెండేళ్లకుపైగా వెనక, 1912 జనవరిలో లేవనెత్తబడింది. పురోగామి కార్మికులలోని అత్యధిక సంఖ్యాకులు "జనవరి (1912) పంథా"కు అనుకూలంగా ప్రకటించారు. "విజయాలు" గురించీ, "పలువురు పురోగామి కార్మికులు" గురించీ తను చెప్తున్నప్పుడు, స్వయానా ట్రాట్స్కీయే యీ వాస్తవాన్ని ఒప్పుకొంటున్నాడు. కాని, కేవలం యీ పురోగామి కార్మికులపైన నిందలు విసరడం ద్వారా, వాళ్లకి "చీలికదారులు" అనీ, "రాజకీయంగా విభ్రాంతి చెందినవాళ్లు" అనీ పేర్లుపెట్టడం ద్వారా, ట్రాట్స్కీ దీన్నుంచి బయటపడాలని చూస్తున్నాడు!

ఈ వాస్తవాలనుంచి స్వస్థచిత్తులు యిందుకు భిన్నమైన నిర్ధారణలు చేసుకుంటారు.

వర్గచైతన్యం కలిగిన కార్మికుల్లో అధిక సంఖ్యాకులు ఎక్కడైతే కచ్చితమైన, నిర్దిష్టమైన నిర్ణయాల చుట్టూ సమీకృతులయ్యారో, అక్కడ అభిప్రాయ, ఆచరణ ఐక్యత వుంది, అక్కడ పార్టీ వుంది, పార్టీతత్వం వుంది.

మనం మరోవంక, కార్మికులచేత "పదవినుంచి తొలగింపబడిన" రద్దువాదులను, లేక, రష్యాలోని సామూహికమైన కార్మికోద్యమంతో సంబంధం కలిగివున్నట్లు రెండేళ్లుగా రుజువు చేసుకోని అరడజను దేశాంతర గ్రూపులను చూసినప్పుడు, మరి నిజానికి అక్కడే విభ్రాంత స్థితి, చీలిక ఎత్తుగడలూ కనిపిస్తాయి. మార్క్సిస్టు "ప్రావ్ద"వాళ్ల గుర్తించే ఆ "సమైక్య మొత్తం"యొక్క నిర్ణయాలను నిర్వర్తించవద్దని కార్మికులను యిప్పుడు ఒప్పించేందుకు ప్రయత్నించడం ద్వారా ట్రాట్స్కీ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకూ, చీలికను తెచ్చి పెట్టేందుకూ ప్రయత్నిస్తున్నాడు.

ఈ ప్రయత్నాలు నిష్ఫలమైనవే, కాని, ఏ మేధావంతుల గ్రూపుల నాయకులైతే, తామే ఒక మూల చీలికలు కల్పిస్తూ, మరో మూల యితరులు చీలికలు కల్పిస్తున్నారంటూ పెడబొబ్బలు పెడుతున్నారో, ఆ అహంకార స్వాతిశయపూరిత నాయకుల బండారాన్ని మనం బహిర్గతం చేసితీరాలి. గత రెండేళ్లుగానో, అంతకన్న పైగానో "పురోగామి కార్మికుల" చేతుల్లో పూర్తి ఓటమి పాలైన తర్వాత, ఎవరైతే నమ్మరానంతటి తృణీకారభావంతో యీ పురోగామి కార్మికుల నిర్ణయాలనూ, యిచ్ఛనూ నిర్లక్ష్యం చేస్తున్నారో, వాళ్లను "రాజకీయంగా విభ్రాంతులైనవాళ్లు" అంటున్నారో, ఆ నాయకులను మనం బహిర్గతం చేసి తీరాలి. ఇవి పూర్తిగా నాజ్‌ద్ర్యోవ్, లేక "జూడాస్" గొలొవ్ల్యోవ్ పద్ధతులు.[53]

చీలికను గురించి పదే పదే వినవస్తున్న యీ కేకలకు జవాబుగానూ, జర్నలిస్టుగా నాకు గల బాధ్యతా నిర్వహణ దృష్ట్యానూ, తప్పైనవిగా నిరూపింపబడని, తిరుగులేని, కచ్చితమైన అంకెలను యిస్తున్నాను. రెండవ దూమలో కార్మిక క్యూరియాలచేత[54] ఎన్నుకోబడిన ప్రతినిధుల్లో 47 శాతం మంది బోల్షెవిక్కులు కాగా, మూడవ దూమలో 50 శాతం మందీ, నాల్గవ దూమలో 67 శాతం మందీ బోల్షెవిక్కులు.

అదుగో "పురోగామి కార్మికుల్లో" మెజారిటీ అక్కడ వున్నారు, అదిగో పార్టీ అక్కడ వుంది, వర్గచైతన్య పూరితులైన కార్మికుల్లోని మెజారిటీ అభిప్రాయైక్యతా, ఆచరణైక్యతా అదిగో అక్కడ వుంది.

దీనికి రద్దువాదులు చెప్పేదేమిటంటే ("నాష జర్యా" 3వ సంచికలో బూల్కిన్, ఎల్. ఎమ్. చూడండి), మనం మన వాదనలను స్తొలీపిన్ క్యూరియాలపైన ఆధారపడి చేస్తున్నామని. మూర్ఖమైన, చిత్తశుద్ధిలేని వాదన యిది. స్త్రీలను మినహాయించే బిస్మార్కియన్ ఎన్నికల చట్టంకింద నిర్వహింపబడిన ఎన్నికల ఫలితాలనుబట్టి జర్మన్లు తమ విజ

యాలను అంచనా వేసుకుంటారు. అమల్లో ఉన్న ఎన్నికల చట్టంకింద, దానిలో వున్న అభివృద్ధి నిరోధక నిర్బంధాలను ఎంతమాత్రమూ బలపరచకుండా, జర్మన్ మార్క్సిస్టులు తమ విజయాలను అంచనావేసుకున్నందుకుగాను, వాళ్లని మతి కోల్పోయినవాళ్లు మాత్రమే తప్పుపడతాడు.

మరి మనం కూడా, క్యూరియాలను లేక క్యూరియా పద్ధతిని బలపరచకుండా, అమల్లో ఉన్న ఎన్నికల చట్టంకింద మన విజయాలను అంచనా వేసుకున్నాం. మొత్తం మూడు (రెండవ, మూడవ, నాల్గవ) దూమ ఎన్నికల్లోనూ క్యూరియాలు వున్నాయి. మరి కార్మిక క్యూరియాలోపల, సోషల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యులలోపల, రద్దువాదులకు వ్యతిరేకంగా ఒక పూర్తి ఊపు వచ్చింది. తమని తామూ, యితరులనూ మోసగించ కోరని వాళ్లు వస్తుపరమైన ఈ యథార్థాన్ని, అంటే, రద్దువాదులపైన కార్మికవర్గ ఐక్యత విజయాన్ని అంగీకరించవలసివుంటుంది.

రెండవ వాదం కూడా యింత "తెలివైనదే": "ఫలానా ఫలానా బోల్షెవిక్కుకి మెన్షెవిక్కులు, రద్దువాదులు వోటుచేశారు (లేక ఫలానా ఫలానా బోల్షెవిక్ ఎన్నికలో పాల్గొన్నారు)." అద్భుతం! మరైతే, రెండవ దూమకి ఎన్నికైన 53 శాతం మంది, మూడవ దూమకి ఎన్నికైన 50 శాతం మంది, నాల్గవ దూమకి ఎన్నికైన 33 శాతం మంది బోల్షెవికేతర ప్రతినిధులకు యిదే వర్తించదా?

ఎన్నుకోబడిన ప్రతినిధుల సంఖ్యలకు బదులు, ఎన్నికదారుల లేక కార్మికుల ప్రతినిధులు వగైరాల సంఖ్యలు మనకి లభ్యమైనట్లయితే, మనం సంతోషంగా వాటినే ఉల్లేఖించివుండే వాళ్లం. కాని, మరింత వివరమైన యీ అంకెలు అందుబాటులో లేవు, పర్యవసానంగా "పోటీదారులు" వట్టినే జనం కళ్లలో దుమ్ము కొడుతున్నారు.

అయితే, భిన్న ధోరణులకు చెందిన వార్తాపత్రికలకు తోడ్పాటునిచ్చే కార్మికుల గ్రూపుల సంఖ్యల మాట ఏమిటి? రెండు ఏళ్ల కాలంలో (1912, 1913) 2,801 గ్రూపులు "ప్రావ్ద"ను బలపరచగా, 750 గ్రూపులు "లూచ్"[55]ని బలపరచాయి.* ఈ అంకెలు సరైనవా కావా అని ఎవరైనా తనిఖీ చేసుకోవచ్చు కాని, వాటిని తనిఖీ చేసేందుకు ఎవరూ ప్రయత్నించలేదు.

---

*1914 ఏప్రిల్ 1వరకు వేసిన ప్రాథమిక అంచనా మేరకు, 4000 గ్రూపులు (1912 జనవరి 1తో మొదలు పెట్టి) "ప్రావ్ద"కి అనుకూలమనీ, 1000 గ్రూపులు రద్దువాదులకు, వాళ్ల మిత్రులందరితో సహా, అనుకూలమనీ తేలింది.

"పురోగామి కార్మికుల" ఆచరణైక్యతా, మెజారిటీ యిచ్ఛా ఎక్కడుంది, మెజారిటీ యిచ్ఛయొక్క ఉల్లంఘన ఎక్కడుంది?

ట్రాట్స్కీ "గ్రూపు అతీత తత్వం" వాస్తవంలో – కార్మికుల్లోని మెజారిటీ యిచ్ఛను సిగ్గుమాలి ఉల్లంఘిస్తున్న దృష్ట్యా – చీలిక ఎత్తుగడ.

## 3. "ఆగస్టు కూటమి" విచ్ఛిత్తిని గురించి

చీలిక ఎత్తుగడలను గూర్చిన ట్రాట్స్కీ ఆరోపణలు సరైనవనీ, సత్యమైనవనీ నిరూపించేందుకు మరోపద్ధతి కూడా, అందునా చాలా ముఖ్యమైనది, వుంది.

"లెనినిస్టులే" చీలికదారులని మీరు పరిగణిస్తారా? సరే, మీరు చెప్పేది సరేనని మనం అనుకుందాం.

మీరే కనుక సరైనట్లయితే, "లెనినిస్టులను" మినహాయించి, "చీలికదారులకు" వ్యతిరేకంగా రద్దువాదులతో ఐక్యత సాధ్యమని యితర అన్ని విభాగాలూ, గ్రూపులూ ఎందుకు రుజువుచెయ్యలేదు?... మేము చీలికదారులం అయితే, మీరు, ఐక్యతావాదులు, మీలో మీరూ, రద్దువాదులతోనూ ఎందుకు సమైక్యం కాలేదు? మీరు ఆ పని చేసివుంటే చేతల్లో మీరు కార్మికులకు ఐక్యత సాధ్యమనీ, ప్రయోజనకరమైనదనీ నిరూపించివుండేవారు!...

ఘటనాక్రమాన్ని మనం పరిశీలిద్దాం.

1912 జనవరిలో, "లెనినిస్టు" "చీలికదారులు" తమది రద్దువాదులు లేని, రద్దువాదులకు వ్యతిరేకమైన పార్టీ అని ప్రకటించారు.

1912 మార్చిలో, అన్ని గ్రూపులూ, ముఠాలూ: రద్దువాదులు, ట్రాట్స్కీయిస్టులు, "వ్పెర్యోద్"వాళ్ళు, "పార్టీ అనుకూల బోల్షెవిక్కులు," "పార్టీ అనుకూల మెన్షెవిక్కులు," తమ రష్యన్ పత్రికల పుటల్లోనూ, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ వార్తాపత్రిక "Vorwärts"[56]లోనూ, యీ "చీలికదారులకు" వ్యతిరేకంగా ఐక్యమయారు. వాళ్ళందరూ ఏకగ్రీవంగా, ఉమ్మడిగా, కలసికట్టుగా, ముక్తకంఠంతో మమ్మల్ని నిందించి "అక్రమ ఆక్రమణదారులు" అన్నారు, "బూటకులం" అన్నారు, యింతకు తక్కువ ప్రేమ పూరితంకాని, సున్నితమైన యితర పేర్లతో మమ్మల్ని పిలిచారు.

సరే, పెద్దమనుషులారా, బాగానే వుంది! అయితే, "అక్రమ ఆక్రమణదారులకు" వ్యతిరేకంగా ఐక్యమవడం, "పురోగామి కార్మికులకు" ఐక్యతా ఆదర్శాన్ని నెలకొల్పడం

కన్న మీకు సులభతరమైనది మరొకటి ఏముండగలదు? ఒకవంక "అక్రమ అక్రమణ దారులకు" వ్యతిరేకంగా అందరి ఐక్యతనూ, రద్దువాదుల, రద్దువాదేతరుల ఐక్యతనూ, మరోవంక, ఏకాకులైన "అక్రమ అక్రమణదారులనూ," "చీలికదారులు," వగైరాలనూ పురోగామి కార్మికులు చూసినప్పుడు, వాళ్ళ ఐక్యతావాదులను బలపరచివుండరంటారా?

"లెనినిస్టుల"చేత మాత్రమే అభిప్రాయభేదాలు కల్పింపబడటం లేక గోరంతలు కొండంతలు చెయ్యబడటం, వగైరాలు జరిగివుంటే, వాస్తవంలో రద్దువాదులు, ప్లెహానొ వైట్లు, "వ్పెర్యోద్"వాళ్ళ, ట్రాట్స్కీయిస్టులు, వగైరాల మధ్య ఐక్యత సాధ్యం అయిన ట్లయితే, గత రెండేళ్ల కాలంలో మీరీ విషయాన్ని మీ సొంత ఉదాహరణ ద్వారానే ఎందుకు నిరూపించలేదు?

1912 ఆగస్టులో, "ఐక్యతా సాధకుల" కాన్ఫరెన్సు ఒకటి జరిగింది. వేర్పాటు వెన్వెంటనే ఆరంభమైంది: ప్లెహానొవ్ అనుచరులు అసలు దానికి హాజరయ్యేందుకే తిరస్కరించారు; "వ్పెర్యోద్"వాళ్ళ హాజరయారు, కాని, మొత్తం యీ వ్యవహారమంతటి బూటకపు స్వభావాన్నీ బహిర్గతం చేసి, దానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసిన మీదట వాకౌట్ చేశారు.

రద్దువాదులు, లాత్వియన్లు, ట్రాట్స్కీయిస్టులు (ట్రాట్స్కీ, సెమ్కోవ్‌స్కీ), కకే షియన్లు, ఏడుగురు[57] "ఐక్యమయ్యారు." కాని నిజంగా ఐక్యమయారా? వాళ్ళ ఐక్యం కాలేదనీ, రద్దువాదాన్ని కప్పిపెట్టుకొనేందుకు యిదొక తెర మాత్రమేననీ మనం అప్పుడు ప్రకటించాం. మన ప్రకటన సరైనది కాదని ఘటనలు రుజువుచేశాయా?

సరిగా పద్దెనిమిది నెలల తర్వాత, 1914 ఫిబ్రవరిలో, మనం యీకింది విషయాలు జరగడం చూశాం:

1. ఏడుగురు విడిపోతున్నారు. బుర్యానొవ్ వాళ్లని వదిలిపోయాడు.

2. మిగిలిన కొత్త "ఆరుగురు"లో ఛెయిద్జె, తుల్యకోవో మరొకరో, ప్లెహానొవ్‌కి యివ్వాల్సిన జవాబు విషయంలో ఏకీభవించలేకపోతున్నారు. ప్లెహానొవ్‌కి జవాబిస్తామని వాళ్ళ పత్రికల్లో ప్రకటించారు గాని, వాళ్ళ యివ్వలేకపోయారు.

3. పలు మాసాలుగా "లూచ్" పత్రిక పేజీల్లోంచి దాదాపు మరుగైపోయిన ట్రాట్స్కీ, విడిపోయి, "తన సొంత" పత్రిక "బొర్బా"ను ప్రారంభించాడు. ఈ పత్రి కను "గ్రూపు అతీత తత్వం"గా పిలవడం ద్వారా, ట్రాట్స్కీ స్పష్టంగా (యీ విషయంతో ఏమాత్రం పరిచయం వున్నవాళ్లకైనా స్పష్టంగా) యిలా తెలియజేస్తాడు: తన, అంటే ట్రాట్స్కీ అభిప్రాయంలో, "నాష జర్యా," "లూచ్" "గ్రూపు తత్వంతో కూడినవి"గా అంటే, నాసిమైన ఐక్యతాకారులుగా రుజువుచేసుకున్నాయి.

మా ప్రియమైన ట్రాట్స్కీ, మీరే గనుక ఐక్యతాకారులైతే, రద్దువాదులతో ఐక్యం కావడం సాధ్యమేనని మీరు చెప్పే మాటైతే, మీరూ, వారూ "1912 ఆగస్టులో రూపొందించబడిన మౌలిక భావాలకు" కట్టుబడివుంటే ("బొర్బా" సంచిక 1, పేజి 6, "సంపాదకీయ వివరణ"), "నాష జర్యా," "లూచ్"లతో మరి స్వయంగా మీరే ఎందుకు ఐక్యం కాలేదు?

ట్రాట్స్కీ పత్రిక వెలువడేందుకు ముందు, "సేవెర్నయ రబోచయ గజేత" పత్రిక స్వభావం "అస్పష్టంగా వుందనీ," యీ పత్రికను గురించి "మార్క్సిస్టు వర్గాల్లో చాలా విషయాలు వినవస్తున్నాయనీ" పేర్కొంటూ తీవ్రమైన వ్యాఖ్య వెలువడినప్పుడు, "పుత్ ప్రావ్ది"[58] (37వ సంచిక) యీ అసత్యాన్ని సహజంగానే బహిర్గతంచెయ్యవలసి వచ్చింది. అది యిలా పేర్కొంది: "లూచ్"వాళ్లకి వ్యతిరేకంగా ట్రాట్స్కీ రాసిన ఒక రహస్య మెమొరాండాన్ని గురించి "మార్క్సిస్టు వర్గాల్లో పుకార్లు వున్నాయి"; ట్రాట్స్కీ స్వభావం, ఆగస్టు కూటమినుంచి ఆయన వేర్పాటూ పూర్తిగా "స్పష్టం."

4. ఎల్. సెదోవ్‌పైన దాడిచేసిన (యిందుకుగాను యితగాడు ఎఫ్. దాన్ ప్రభృతుల చేత బహిరంగంగా దూషింపబడ్డాడు), కకేషియన్ రద్దువాదుల ప్రసిద్ధ నాయకుడైన ఆన్, యిప్పుడు "బొర్బా"లో కనిపించాడు. కకేషియన్లు యిప్పుడు ట్రాట్స్కీతో వెళ్తారా లేక దాన్‌తో వెళ్తారా అన్నది యింకా "అస్పష్టంగానే" వుంది.

5. "ఆగస్టు కూటమి"లోని నిజమైన ఒకేఒక సంఘమైన లాత్వియన్ మార్క్సిస్టులు, లాంఛనప్రాయంగా దాన్నుంచి ఉపసంహరించుకొంటూ, తమ చివరి కాంగ్రెస్ తీర్మానంలో (1914లో) యిలా ప్రకటించారు:

> "రద్దువాదులతో ఎలాగైనా సరే ఐక్యం కావాలని రాజీవాదులు చేసిన ప్రయత్నం (1912 ఆగస్టు కాన్ఫరెన్సు) వమ్మైపోయింది, కాగా ఐక్యతాకారులే సైద్ధాంతికంగానూ, రాజకీయంగానూ రద్దువాదులపైన ఆధారితులయ్యారు."

తన మటుకు తాను తటస్థంగా వుండి, రెండు కేంద్రాల్లోనూ ఏ ఒకదానితోనూ సంబంధం పెట్టుకోగోరని ఒక సంఘం, పద్దెనిమిది నెలల అనుభవానంతరం యీ ప్రకటన చేసింది. తటస్థుల యీ నిర్ణయానికి ట్రాట్స్కీ దృష్టిలో మరింత ఎక్కువ విలువ వుండాల్సింది!

చాలు, ఔనా?

మనం చీలికవాదులమనీ, రద్దువాదులతో సరిపెట్టుకొనేందుకు యిష్టపడటం లేదనీ లేక రద్దువాదులతో సరిపెట్టుకోలేకపోతున్నామనీ మనపై ఆరోపణ చేసినవాళ్లు, తామే వాళ్లతో సరిపెట్టుకోలేకపోతున్నారు. ఆగస్టు కూటమి ఒక మిథ్య అని తేలిపోయింది, అది విచ్ఛిన్నమైపోయింది.

ఈ విచ్ఛిత్తిని తన పాఠకులనుండి మరుగుపరచడం ద్వారా, ట్రాట్స్కీ వాళ్లను మోస గిస్తున్నాడు.

మా వ్యతిరేకుల అనుభవం మేము రైటన్న సంగతిని రుజువు చేసింది, రద్దువాదులతో సహకరించడం సాధ్యంకాదని రుజువు చేసింది.

# 4. ''ఏడుగురు''కి ఒక రాజీవాది సలహా

''దూమా గ్రూపులో చీలిక'' అనే శీర్షికతో ''బోర్బా'' 1వ సంచికలో వెలువడిన సంపాదకీయ వ్యాసంలో ఏడుగురు రద్దువాద అనుకూల (లేక రద్దువాదం వైపు మొగ్గుతున్న) దూమా సభ్యులకు ఒక రాజీవాది సలహా వుంది. ఈ సలహా కీలకాంశం యిదీ:

> ''ఇతర గ్రూపులతో ఒక ఒప్పందానికి రావడం అవసరమైనప్పుడల్లా మొట్ట మొదట ఆరుగురితో సంప్రదించు....'' (పేజి 29).

''లూచ్''కి చెందిన రద్దువాదులతో ట్రాట్స్కీ అభిప్రాయభేదానికి వివేకవంతమైన యీ సలహాయే యితర విషయాలతోబాటు కారణం ఉండవచ్చు. దూమలోని రెండు గ్రూపుల మధ్యా తగాదా మొదలైన నాటినుండీ, వేసవి (1913) సమావేశపు తీర్మానం[59] నాటినుండీ ''ప్రావ్ద''వాళ్లు కలిగివున్న అభిప్రాయం యిదీ. దూమలోని రష్యన్ సోషల్ డెమోక్రటిక్ గ్రూపు చీలిక అనంతరం సైతం, ''ఏడుగురు'' పదేపదే తిరస్కరించినప్పటికీ కూడా, తను యీ వైఖరికే కట్టుబడివున్నట్లు పత్రికల్లో పునరుద్ఘాటించింది.

అదినుంచీ, వేసవి సమావేశపు తీర్మానం ఆమోదింపబడినప్పటినుంచీ, దూమలో కార్యకలాపాలకు సంబంధించిన సమస్యలపై ఒప్పందాలు వాంఛనీయమనీ, సాధ్యమనీ మేము అభిప్రాయపడ్డాం, యిప్పటికీ అభిప్రాయపడుతున్నాం. పెటీబూర్జువా రైతు డెమోక్రట్ల (త్రుదొవీక్కుల)తోనే అటువంటి ఒప్పందాలు పదేపదే చేసుకోబడినప్పుడు, పెటీబూర్జువా, ఉదారవాద కార్మిక రాజకీయవేత్తలతో అవి మరింతగా సాధ్యమూ, అవసరమూ కూడా.

అభిప్రాయభేదాలను అతిశయం చేసి చెప్పకూడదు, అయితే వాస్తవాలను ఎదుర్కోవాలి: "ఏడుగురు" రద్దువాదం వంక మొగ్గుతున్నవాళ్లు, నిన్నటి రోజున వాళ్లు పూర్తిగా దాన్ నాయకత్వాన్ని అనుసరించారు, మరి యీరోజున వాళ్ల కళ్లే కాంక్షాదృష్టితో దాన్‌నుండి ట్రాట్స్కీ దగ్గరకూ, తిరిగి వెనక్కీ పయనిస్తున్నాయి. రద్దువాదులు — పార్టీనుండి విడిపోయి, లిబరల్ కార్మిక విధానాన్ని అనుసరిస్తున్న చట్టబద్ధవాదుల ఒక గ్రూపు. వాళ్ల "రహస్య కార్యకలాపాల"ను నిరాకరిస్తారు గనుక, పార్టీ నిర్మాణానికీ, కార్మికోద్యమానికీ సంబంధించిన వ్యవహారాల్లో వాళ్లతో ఐక్యత ప్రసక్తి ఉండజాలదు. ఇందుకు భిన్నంగా ఆలోచించేవారు ఎవరైనా పూర్తిగా పొరపడుతున్నారు, 1908 దరిమిలా సంభవించిన మార్పుల ప్రగాఢ స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలురవుతారు.

అయితే, పార్టీ వెలుపల లేక పార్టీ అంచున వుండే యీ గ్రూపుతో కొన్ని సమస్యలపైన ఒప్పందాలు నిస్సందేహంగా అనుమతింపదగినవే: మనం ఎప్పుడూ యీ గ్రూపుని కూడా, త్రుదొవీక్కులను మాదిరిగానే కార్మికుల ("ప్రావ్ద"వాళ్ల) విధానానికీ, లిబరల్ విధానానికీ మధ్య ఎంపిక చేసుకొనేలా చెయ్యాలి. ఉదాహరణకు, పత్రికా స్వేచ్ఛకోసం పోరాడే సమస్యపైన రద్దువాదులు, ఆ సమస్యయొక్క లిబరల్ విధానానికీ — యీ విధానం రహస్య పత్రికలను నిరాకరించింది లేక దాని అవసరాన్ని గమనించలేదు — తద్వ్యతిరేకమైన, కార్మిక విధానానికీ మధ్య ఊగిసలాడారు.

దేనిలోనైతే అతి ముఖ్యమైన దూమయేతర సమస్యలు నేరుగా లేవదియ్యబడవో, ఆ దూమ విధాన పరిధిలోపల, ఏడుగురు లిబరల్ కార్మిక ప్రతినిధులతో ఒప్పందాలు సంభవమూ, వాంఛనీయమూ కూడా. ఈ అంశంమీద ట్రాట్స్కీ తన వైఖరిని రద్దువాదుల వైఖరినుంచి పార్టీ వేసవి (1913) సమావేశపు వైఖరికి మార్చుకున్నాడు.

అయితే యీ సందర్భంగా ఒక విషయాన్ని మరచిపోకూడదు. పార్టీ వెలుపల వుండే ఒక గ్రూపుకి ఒప్పందంపట్ల వుండే వైఖరి, పార్టీ మనుషులకు సామాన్యంగా ఆ పదంపట్ల వుండే అవగాహనకు పూర్తిగా భిన్నమైనది. దూమలో "ఒప్పందం" అంటే పార్టీయేతరుల దృష్టిలో "ఎత్తుగడ దృష్ట్యా ఒక తీర్మానాన్నో లేక పంథానో రూపొందించడం." పార్టీవాళ్లకి ఒప్పందం అన్నది, పార్టీ పంథాను అమలు జరిపే పనిలో యితరులను కూడ గట్టుకోవడం.

ఉదాహరణకు, త్రుదొవీక్కులకు పార్టీ లేదు. ఒప్పందం అంటే వాళ్లు, యీరోజున కాడెట్లతోనూ, రేపటి రోజున సోషల్ డెమొక్రట్లతోనూ ఒక పంథాను ఒక విధంగా "స్వచ్ఛందంగా" "రూపొందించడం" అని అర్థంచేసుకుంటారు. అయితే మనం, త్రుదొవీక్కులతో ఒప్పందం అన్నదాన్ని యిందుకు పూర్తి భిన్నంగా అర్థంచేసుకుంటాం.

ఎత్తుగడలకు సంబంధించిన అన్ని ముఖ్య సమస్యలపైనా మనకి పార్టీ నిర్ణయాలు వుంటాయి, మనం యీ నిర్ణయాలనుండి ఎన్నడూ బెసగం. త్రుదొవీక్కులతో ఒప్పందం అంటే వాళ్లని మన పక్షానికి తిప్పుకోవడం, మనం చెప్పేది సరైనదని వాళ్లని ఒప్పించడం, "నల్ల నూర్ల"కి వ్యతిరేకంగానూ, లిబరల్సుకి వ్యతిరేకంగానూ సంయుక్త కార్యాచరణను నిరాకరించకపోవడం.

ఒప్పందాలపైన పార్టీ, పార్టీయేతర దృక్పథాల మధ్య వున్న యీ ప్రాథమిక భేదాన్ని ట్రాట్స్కీ ఏ మేరకు విస్మరించాడన్న విషయం (రద్దువాదులతో అతను వట్టినే కలవలేదు), అతని యీకింది వాదనలో వెల్లడైంది:

"ఇంటర్నేషనల్[60] ప్రతినిధులు మన చీలిపోయిన పార్లమెంటరీ గ్రూపుయొక్క రెండు విభాగాలనూ సన్నిహితంచెయ్యాలి, వాటిని ఐక్యంచేసే, వేరుచేసే అంశాలను తేల్చుకోవాలి... పార్లమెంటరీ ఎత్తుగడల సూత్రాలను నిర్వచించే సవివరమైన ఒక ఎత్తుగడల తీర్మానాన్ని రూపొందించాలి...." (సంచిక 1, పేజీలు 29–30).

రద్దువాదులు సమస్యను ఎలా ప్రతిపాదిస్తారన్నదానికి యిదొక విలక్షణమైన, నమూనా ప్రాయమైన ఉదాహరణ! ట్రాట్స్కీ పత్రిక పార్టీని గురించి మరచిపోతుంది; అటువంటి అల్పవిషయం గుర్తుంచుకోవలసినంతటిది కాదు కదా!

యూరప్‌లోని వేర్వేరు పార్టీలు (ట్రాట్స్కీకి యూరపియనిజం గురించి అసందర్భంగా మాట్లాడటమంటే యిష్టం) ఒక ఒప్పందానికి వచ్చినప్పుడో లేక ఐక్యమైనప్పుడో, అవి యిలా చేస్తాయి: ఆయా పార్టీల ప్రతినిధులు కలుసుకొని, మొదట అభిప్రాయ భేదాలున్న అంశాలను గురించి తేల్చుకుంటారు ("పాత పార్టీ యికనెంత మాత్రం లేదు" అన్న కొట్స్కీ అనాలోచిత ప్రకటనను తీర్మానంలో చేర్చకుండా, రష్యాకు సంబంధించి ఇంటర్నేషనల్ ప్రతిపాదించినది సరిగా యిదే)[61]. అభిప్రాయభేదం వున్న అంశాలేమిటో తేల్చుకున్నాక, ఎత్తుగడలు, నిర్మాణం, వగైరా సమస్యలపైన, ఏ నిర్ణయాలను (తీర్మానాలు, షరతులు, వగైరా) రెండు పార్టీల కాంగ్రెస్సులకూ సమర్పించాలో, ఆ ప్రతినిధులు నిర్ణయిస్తారు. ఏకగ్రీవమైన నిర్ణయాలను రూపొందించడంలో వారు సఫలురైతే, ఆ కాంగ్రెస్సులు వాటిని ఆమోదించడమో, ఆమోదించకపోవడమో నిర్ణయిస్తాయి. భిన్నమైన ప్రతిపాదనలు చెయ్యబడినట్లయితే, అవి కూడా రెండు పార్టీల కాంగ్రెస్‌ల తుది నిర్ణయానికి సమర్పించబడతాయి.

రద్దువాదులకూ, ట్రాట్స్కీకీ నచ్చేది అవకాశవాదపు యూరపియన్ నమూనాలేగాని, యూరపియన్ పార్టీతత్వపు నమూనాలు కాదు.

దూమ సభ్యులచేత "ఎత్తుగడలకు సంబంధించిన సవివరమైన ఒక తీర్మానం" రూపొందించబడుతుంది!! ఈ ఉదాహరణ రష్యన్ "పురోగామి కార్మికులకు" — వీరిపట్ల ట్రాట్స్కీకి బాగా అయిష్టం కలగడానికి పెద్ద కారణమే వుంది — వియన్నా, పారిస్‌లలోని గ్రూపులు (రష్యాలో "పార్టీ అంటూ ఏదీ లేదని" కౌట్స్కీని సైతం ఎక్కేసినవి యివే) అసంగతమైన తమ పథక రచనలో ఎంత దూరం వెళ్లగలవో అన్నదానికి యిదొక ప్రస్ఫుటమైన ఉదాహరణ. అయితే, యీ విషయంలో విదేశీయులను ఒకొక్కప్పుడు మోసగించడం సాధ్యం కావచ్చుగాని, రష్యన్ "పురోగామి కార్మికులు" (భయంకరుడైన ట్రాట్స్కీ కోపం తెచ్చుకునేందుకు గట్టిగా ప్రోత్సహించే ప్రమాదం వున్నా కూడా) యిలాంటి పథకాలు వేసేవాళ్ల ముఖాలమీద నవ్వుతారు.

"పురోగామి కార్మికులు" వాళ్లకు యిలా చెప్తారు: "మాలో, ఎత్తుగడలకు సంబంధించిన సవివరమైన తీర్మానాలు పార్టీ కాంగ్రెస్‌లలోనూ, మహాసభల్లోనూ, ఉదాహరణకు, 1907, 1908, 1910, 1912, 1913 నాటిలో మాదిరిగా జరుగుతాయి (పార్టీయేతరులైన మీలో ఎలా జరుగుతాయో మాకు తెలియదుగాని). మరుపు జబ్బు వున్న రష్యన్లకే కాకుండా, విషయ పరిజ్ఞానం లేని విదేశీయులకు మేము మా పార్టీ నిర్ణయాలను తెలియజేస్తాం, యింకా మరింత సంతోషంగా 'ఏడుగురు ప్రతినిధులను,' లేక 'ఆగస్టు కూటమి సభ్యులను,' లేక 'వామపక్షీయులను'[62] లేక మరెవరినైనా సరే, తమ మహాసభల, లేక తమ కాన్ఫరెన్సుల తీర్మానాలను తెలియజెయ్యమనీ, తదుపరి మహాసభలో, మా తీర్మానాలపట్ల, లేక 1914 నాటి తటస్థ లాత్వియన్ మహాసభ తీర్మానం వగైరాలపట్ల వాళ్ళు వహించవలసిన వైఖరికి సంబంధించిన నిర్దిష్ట సమస్యను ముందుకు తేవలసిందిగా, అడుగుతాం."

అవాస్తవిక పథకాలు వేసే రకరకాలవాళ్లకు రష్యా "పురోగామి కార్మికులు" చెప్పేది యిదీ. ఉదాహరణకు, సెంట్ పీటర్స్‌బుర్గ్‌కి చెందిన సంఘటిత కార్మికులు మార్క్సిస్టు పత్రికల్లో యింతకు ముందే చెప్పినది యిదే. రద్దువాదులకు ప్రచురింపబడిన యీ షరతులను నిర్లక్ష్యంచెయ్యాలని ట్రాట్స్కీ కోరుకుంటున్నాడా? అలా అయితే అది ట్రాట్స్కీ కర్మ. రష్యాలోని వర్గచైతన్యపూరిత కార్మికుల మెజారిటీ అభీష్టాన్ని లెక్కలోకి తీసుకునేందుకు నిరాకరించే ఆ "ఐక్యతా" (ఆగస్టు తరహా "ఐక్యతా"?) పథక రచన ఎంత అవకతవక అయినదో మన పాఠకులకు హెచ్చరిక చెయ్యడం మన విధి.

# 5. ట్రాట్స్కీ రద్దువాద అభిప్రాయాలు

తన అభిప్రాయాల సారాంశానికి సంబంధించి, తన కొత్త పత్రికలో సాధ్యమైనంత తక్కువ చెప్పేందుకు ట్రాట్స్కీ పూనుకొన్నాడు. "రహస్య కార్యకలాపాలు" సమస్యపైనగాని, బహిరంగ పార్టీకోసం కృషిచెయ్యాలన్న నినాదం వగైరాల గురించిగాని ట్రాట్స్కీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని "పుత్ర్య ప్రావ్ది" (సంచిక 37) యింతకుముందే వ్యాఖ్యానించింది. ఇతర కారణాలతోబాటు యీ కారణంగా కూడా, ఏ సైద్ధాంతిక రాజకీయ వైఖరీ లేని వేరే సంఘాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రయత్నాలు చెయ్యబడినప్పుడు, అది అత్యంత హీనమైన గ్రూపు తత్వం అవుతుందని మనం చెప్పినది అందుకే.

తన అభిప్రాయాలను బహిరంగంగా వివరించేందుకు ట్రాట్స్కీ వెనుదీసినప్పటికీ, అతని పత్రికలోని పలు భాగాలు, అతను ఏ మాదిరి భావాలను చొప్పించేందుకు ప్రయత్నిస్తున్నాడో స్పష్టంచేస్తున్నాయి.

అతని పత్రిక మొదటి సంచికలోని మొట్టమొదటి సంపాదకీయ వ్యాసంలోనే మనకు యీకింది వాక్యాలు కనిపిస్తాయి:

> "మన దేశంలోని విప్లవ పూర్వపు సోషల్ డెమోక్రటిక్ పార్టీ, భావాల్లోనూ, ఆశయాల్లోనూ మాత్రమే, ఒక కార్మిక పార్టీ. యథార్థానికి అది, జాగృతమవుతున్న కార్మికవర్గాన్ని నడిపిన మార్క్సిస్టు మేధావివర్గపు ఒక సంఘం." (5.)

ఇది పాత లిబరల్ రద్దువాద పల్లవి, వాస్తవానికి యిది పార్టీ పరిత్యాగానికి అవతారిక. చారిత్రక యథార్థాల వక్రీకరణపైన యిది ఆధారపడివుంది. 1895–96 నాటి సమ్మెలు భావాల్లోనూ, నిర్మాణంలోనూ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంతో సంబంధం కలిగివున్న సామూహిక కార్మికోద్యమ ఉద్భవానికి యింతకుముందే దారితీశాయి. మరి యీ సమ్మెల్లో, యీ ఆర్థిక, ఆర్థికేతర ఆందోళనలో, ఆ "మేధావివర్గమే కార్మికవర్గాన్ని నడిపిందా"!!?

లేకుంటే, అంతకుముందరి దశతో సరిపోలిస్తే 1901–03 దశలో రాజకీయ నేరాలకు సంబంధించిన కచ్చితమైన యీకింది గణాంకాలను తీసుకోండి.

రాజకీయ నేరాలకుగాను ప్రాసిక్యూట్ చెయ్యబడిన విముక్తి
ఉద్యమ భాగస్వాముల వృత్తులు
(శాతం)

| కాలం | వ్యవసాయం | పరిశ్రమలు వాణిజ్యం | స్వచ్ఛంద వృత్తులు, విద్యార్థులు | నిర్దిష్ట వృత్తి లేనివారు, అసలు వృత్తి లేనివారు |
|---|---|---|---|---|
| 1884–90 | 7.1 | 15.1 | 53.3 | 19.9 |
| 1901–03 | 9.0 | 46.1 | 28.7 | 8.0 |

80వ దశకంలో, రష్యాలో యింకా సోషల్ డెమొక్రటిక్ పార్టీ లేనప్పుడు, ఉద్యమం "నరోద్నిక్" ఉద్యమంగా ఉన్నప్పుడు, మేధావివర్గం ప్రాబల్యంలో వుంది, ఉద్యమ భాగస్వాముల్లో సగంమందికి పైగా వాళ్లే వున్నారు.

అయితే, 1901–03 నాటికి అప్పడే సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఏర్పడివుంది, అప్పటికి పాత "ఇస్క్రా" తన పని సాగిస్తోంది, కాగా 1901–03లో చిత్రం పూర్తిగా మారిపోయింది. ఉద్యమ భాగస్వాముల్లో మేధావివర్గం మైనారిటీ అయిపోయారు; మేధావులకన్న కార్మికులు ("పారిశ్రామిక, వాణిజ్య") చాలా అధికసంఖ్యలో వున్నారు, కార్మికులూ, రైతులూ కలిసి మొత్తంలో సగానికిపైగా వున్నారు.

మార్క్సిస్టు ఉద్యమంలోపల సరిగా వివిధ ధోరణుల మధ్య ఘర్షణలోనే సోషల్ డెమొక్రటిక్ పార్టీ పెటీబూర్జువా మేధావివర్గ పక్షం ముందుకొచ్చింది, ఈ క్రమం "ఆర్థిక వాదం"తో (1895–1903) మొదలై, "మెన్షెవిజం" (1903–08)తోనూ, "రద్దువాదం" (1908–14)తోనూ కొనసాగింది. ట్రాట్స్కీ పార్టీకి వ్యతిరేకంగా రద్దువాద అభాండాలను పునశ్చరణ చేస్తున్నాడు, పార్టీలోపల వివిధ ధోరణుల మధ్య ఇరవై యేళ్లుగా సాగుతున్న ఘర్షణను ప్రస్తావించడానికి భయపడుతున్నాడు.

మరో ఉదాహరణ యిదిగో:

> "పార్లమెంటరిజంపట్ల తన వైఖరిలో, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ అవే మూడు దశల గుండానే గడిచింది [యితర దేశాల్లో మాదిరిగానే]... మొదట

> 'బహిష్కరణవాదం'... తర్వాత సూత్రరీత్యా పార్లమెంటరీ ఎత్తుగడలను ఆమోదించడం, కాని... [మహత్తరమైన ఆ 'కాని,' ఏ 'కాని'ని అయితే ష్చెద్రీన్ యీకింది విధంగా అనువదించాడో: నుదుటికన్న చెవులు ఎన్నడూ ఎత్తుకి ఎదగవు, ఎన్నడూ!]... కేవలం ఆందోళన నిమిత్తం... మరి చివరి అంశం, దూమ వేదికనుండి... సమకాలిక డిమాండ్ల ప్రతిపాదన..." (సంచిక 1, పేజి 34.)

చరిత్రకు యిది కూడా ఒక రద్దువాద వక్రీకరణే. రెండవ, మూడవ దశల మధ్య తేడా, సంస్కరణవాదానికీ, అవకాశవాదానికీ వత్తాసుగా, కల్పింపబడింది. "పార్లమెంటరి జంపట్ల తన వైఖరిలో సోషల్ డెమొక్రటిక్ పార్టీ" ఒక దశగా బహిష్కరణవాదం, యూరప్‌లో (అక్కడ అరాజకవాదం వెనక వుంది, యిప్పుడు కొనసాగుతోంది) గాని, లేక రష్యాలో (ఉదాహరణకు, అక్కడ బులీగిన్ దూమ[63] బహిష్కరణ ఒక నిర్దిష్ట సంస్థకు మాత్రమే వర్తిస్తుంది) గాని పార్లమెంటరిజంతో లంకెపడి ఎన్నడూ లేదు, దాడి కొనసాగింపుకై లిబరలిజానికీ మార్క్సిజానికీ మధ్య సాగిన పోరాటపు విలక్షణ స్వభావంచేత అది ఉత్పన్నమైంది. మార్క్సిజంలోని యీ రెండు ధోరణుల మధ్య ఘర్షణను యీ పోరాటం ప్రభావితంచేసిన పద్ధతిని గురించి ట్రాట్స్కీ ఒక్క మాట కూడా మాట్లాడడు!

ఎవరైనా చరిత్రను ప్రస్తావించేటప్పుడు, నిర్దిష్టమైన సమస్యలనూ, విభిన్న ధోరణుల వర్గ మూలాలనూ వివరించాలి. బులీగిన్ దూమలో పాల్గొనే సమస్యమీద వర్గాల, ధోరణుల పోరాటాన్ని అధ్యయనం చెయ్యాలనుకునేవాడు ఎవడైనా, దానిలో లిబరల్ కార్మిక విధాన మూలాలను చూస్తాడు. కాని, ట్రాట్స్కీ అందుకు భిన్నంగా, నిర్దిష్టమైన సమస్యలను దాటవేసేందుకూ, యీనాటి అవకాశవాదులకు దోషరాహిత్య నిరూపణనూ లేక దోషరాహిత్య నిరూపణ ఆభాసనూ కల్పించేందుకు మాత్రమే చరిత్రను "ప్రస్తావిస్తాడు." అతను యిలా రాస్తాడు:

> "వాస్తవానికి, అన్ని ధోరణులూ ఒకే రకమైన పోరాట, నిర్మాణ పద్ధతులను వినియోగిస్తాయి." "మన కార్మికోద్యమంలో లిబరల్ ప్రమాదాన్ని గురించిన పెడబొబ్బలు కేవలం వాస్తవాన్ని మొరటుగానూ, ఒంటెత్తు పద్ధతిలోనూ మరుగు పరచడం మాత్రమే" (సంచిక 1, పేజీలు 5, 35).

ఇది రద్దువాదులకు అతి స్పష్టమైన, అతి ప్రస్ఫుటమైన వత్తాసు. అయితే మేము అతి చిన్న యథార్థాన్ని, అతి తాజా అయిన దాన్ని ఉల్లేఖించే స్వేచ్ఛ తీసుకుంటాం. ట్రాట్స్కీ-

కేవలం మాటలను రువ్వుతాడు; కార్మికులు స్వయంగా యథార్థాలను గురించి ఆలోచించాలని మేము కోరుతున్నాం.

"సేవెర్నయ రబోచయ గజేత" మార్చి 13న యీకింది విధంగా రాసిన మాట వాస్తవం:

> "కార్మికవర్గం ఎదుర్కొంటున్న నిర్దిష్టమైన, కచ్చితమైన కర్తవ్యాన్ని, అనగా బిల్లును [పత్రికలను గురించి] తోసివేసేలా దూమపై ఒత్తిడి తేవాలని ఉద్ఘాటించేందుకు బదులు 'నిర్నిబంధ నినాదాల'కోసం పోరాడాలన్న ఒక అస్పష్టమైన సూత్రం ప్రతిపాదింపబడింది, అదే సమయంలో రహస్య పత్రికలను గురించి విస్తృతంగా ప్రచారం చెయ్యబడింది, కార్మికులు తమ బహిరంగ పత్రికలకోసం చేసే పోరాటాన్ని సడలింపజెయ్యడానికి మాత్రమే యిది దారితీస్తుంది."

రద్దువాద విధానానికీ, "ప్రావ్ద" విధాన విమర్శకీ యిదొక స్పష్టమైన, కచ్చితమైన, రాతపూర్వకమైన రుజువు. సరే, యీ సమస్యపైన రెండు ధోరణులూ "ఒకేరకమైన పోరాట, నిర్మాణ పద్ధతులను" వినియోగిస్తున్నాయని విద్యావంతుడైన వ్యక్తి ఎవడైనా అంటాడా? రద్దువాదులు యీ సమస్యపైన లిబరల్ కార్మిక విధానాన్ని అనుసరించడం లేదనీ, కార్మికోద్యమానికి లిబరల్ ప్రమాదం శుద్ధ కాల్పనికమైనదనీ విద్యావంతుడైన వ్యక్తి ఎవడైనా అంటాడా?

యథార్థాలూ, నిర్దిష్టమైన ఆధారాలూ ట్రాట్స్కీ కోపిష్టి పెడబొబ్బలనూ, ఆడంబర పదాలనూ అన్నింటినీ నిర్దాక్షిణ్యంగా ఖండిస్తున్నాయి. అతను వాటిని దాటవెయ్యడానికి సరిగా అదే కారణం. ఒక పోజుపెట్టి, "మొరటైన, ఒంటెత్తువాద పద్ధతిలో మరుగు పరచడమే" అనడం చాలా తేలికే. లేక "మితవాద గ్రూపింగులనుంచి విముక్తి" వంటి మరింత నిశితమైన, ఆడంబరమైన నినాదాన్ని చేర్చడం కూడ తేలికే.

అయితే యిది మిక్కిలి చౌకబారుగా లేదూ? హైస్కూలు విద్యార్థి శ్రోతల ముందు ట్రాట్స్కీ వైభవోపేతంగా పోజుకొట్టిన కాలపు ఆయుధాగారంనుంచి అరువు దెచ్చుకొన్న ఆయుధం కాదూ యిది?

ఏదేమైనప్పటికీ, ఎవరిపట్ల అయితే ట్రాట్స్కీ మహా కోపంగా వున్నాడో ఆ "పురోగామి కార్మికులు" చాటుమాటుల్లా లేకుండా, స్పష్టంగా యీకింది విషయాలు వినగోరుతున్నారు: ఒక నిర్దిష్ట రాజకీయ ఆందోళనకు సంబంధించి పైన పేర్కొనబడిన అంచ

నాలో నిర్దిష్టంగా వ్యక్తంచెయ్యబడిన "పోరాట, నిర్మాణ పద్ధతి"ని మీరు ఆమోదిస్తు న్నారా, ఆమోదించడం లేదా? మీరు ఆమోదించినట్లయితే, మార్క్సిజానికీ, పార్టీకీ ద్రోహం చేసి, లిబరల్ కార్మిక విధానాన్ని మీరు అనుసరిస్తున్నారన్నమాట. అటువంటి విధానంతో, అటువంటి విధానాన్ని అనుసరించే గ్రూపులతో "శాంతి" లేక "ఐక్యత" అనడమంటే, మిమ్మల్ని మీరు మోసగించుకోవడం, యితరులను మోసగించడమే.

కాదంటారా, ఆ విషయం చాటుమాటుల్లు లేకుండా చెప్పండి. ఈనాటి కార్మికులకు మాటలు ఆశ్చర్యం గొలపలేవు, తృప్తిపరచలేవు, బెదిరించనూ లేవు.

అన్నట్లు, పైన ఉల్లేఖింపబడిన ఖండికలో రద్దువాదులు వినియోగించిన విధానం లిబరల్ దృక్పథంనుంచి సైతం మూర్ఖమైనది. ఎందుకంటే, దూమలో ఒక బిల్లు ప్యాసు కావాలంటే, కమిటీలో యింతకుముందే జోక్యంచేసుకున్న బెన్నిగ్సెన్ మాదిరి "జేమ్స్త్వో కార్యకర్తలైన అక్టోబరిస్టుల"[64] పైన అది ఆధారపడివుంటుంది.

* * *

రష్యాలోని మార్క్సిస్టు ఉద్యమంలో పాల్గొన్న పాత సభ్యులకు వ్యక్తిగా ట్రాట్స్కీ చాలా బాగా తెలుసు, కాగా అతన్ని గురించి వాళ్లకి వివరించనవసరం లేదు. కాని యువతరం కార్మికులకు అతన్ని గురించి తెలియదు, అందుకనే అతన్ని గురించి వివరించడం అవసర మైంది. విదేశాల్లో వున్న అయిదు గ్రూపులకూ కూడా — నిజానికి, అవి కూడా రద్దు వాదులకూ, పార్టీకీ మధ్య ఊగిసలాడుతున్నాయి — అతను నమూనాప్రాయుడు కావడమే అందుకు కారణం.

పాత "ఇస్క్రా" కాలంలో (1901–03), "ఆర్థికవాదుల"నుండి "ఇస్క్రా" వాళ్ల దగ్గరకూ, మళ్లీ వెనక్కూ పోయిన ఊగిసలాటదారులు "తూషినొ ఫిరాయింపుదార్లు" అని పిలవబడ్డారు (రష్యాలో కల్లోల కాలంలో[65] ఒక శిబిరంనుంచి మరొక శిబిరానికి మారిన సైనికులకు పెట్టబడిన పేరు).

మనం రద్దువాదం గురించి చెప్తున్నప్పుడు, మనమొక నిర్దిష్ట భావజాలాత్మక ధోర ణిని గురించి చెప్తున్నాం. అనేక సంవత్సరాల క్రమంలో తలెత్తిన యీ రద్దువాదం, మార్క్సిజపు ఇరవై యేళ్ల చరిత్రలో మెన్షెవిజంనుంచీ, ఆర్థికవాదంనుంచీ ఉత్పన్నమైంది; ఒక నిర్దిష్ట వర్గపు — లిబరల్ బూర్జువావర్గపు — విధానంతోనూ, భావజాలంతోనూ అది సంబంధం కలిగివుంది.

"తూషినొ ఫిరాయింపుదార్లు" తమ భావాలను ఒక రోజున ఒక గ్రూపునుంచీ, మరొక

రోజున మరొక గ్రూపునుంచీ "అరువు తెచ్చుకుంటారు." కాగా, తాము గ్రూపులకు అతీతులమని చెప్పకోడానికి వాళ్లకి గల ఆధారమల్లా యిదొక్కటే. 1901–03లో ట్రాట్స్కీ వీర "ఇస్క్రా"వాడు, 1903 నాటి మహాసభలో అతని పాత్రను ర్యజానొవ్ "లెనిన్ దుడ్డుకర్ర"గా వర్ణించాడు. 1903 చివర ట్రాట్స్కీ వీర మెన్షెవిక్, అంటే, అతను "ఇస్క్రా"వాళ్లనుండి ఆర్థికవాదుల్లోకి పోయాడు. అతను "పాత 'ఇస్క్రా'కీ, కొత్తదానికీ మధ్య అగాధం వుంది" అన్నాడు. 1904–05లో అతను మెన్షెవిక్కులకు సలాం కొట్టి, ఊగిసలాట వైఖరిని చేబట్టి, ఒకసారి మర్తీనొవ్ (ఆర్థిక వాది)తో సహకరిస్తూ, మరొకసారి తన అవకతవక అతివాద "నిరంతరాయ విప్లవ"[66] సిద్ధాంతాన్ని చాటుతూ వచ్చాడు. 1906–07లో, అతను బోల్షెవిక్కులకు సమీపంగా వచ్చాడు, 1907 వసంతంలో తను రోజా లుక్సెంబుర్గ్‌తో ఏకీభవిస్తున్నట్లు అతను ప్రకటించాడు.

విచ్ఛిత్తి కాలంలో, దీర్ఘకాలంపాటు "గ్రూపు అతీత తత్వ" ఊగిసలాట అనంతరం, అతను మళ్లీ దక్షిణ పక్షంవైపు వెళ్లాడు. మళ్లీ 1912 ఆగస్టులో అతను రద్దువాదులతో ఒక సంఘటనలో చేరాడు. ఇప్పుడు అతను సారాంశంలో వాళ్ల చౌకబారు భావాలనే వల్లిస్తున్నప్పటికీ, మళ్లీ వాళ్లను విడిచిపెట్టాడు.

ఈ బాపతువాళ్లు గత చరిత్ర నిర్మాణ రూపాల అవశేషాలు, రష్యాలో సామూహిక కార్మికోద్యమం యింకా నిద్రాణంగా ఉన్న కాలపు అవశేషాలు. అప్పట్లో ప్రతి ఒక గ్రూపుకీ తానొక ధోరణిగా, గ్రూపుగా లేక పక్షంగా, ముక్తసరిగా చెప్పాలంటే, ఒక "శక్తి"గా పోజు పెట్టేందుకూ, యితర గ్రూపులతో సంలీనం విషయమై సంప్రదింపులు జరిపేందుకూ "బోలెడంత అవకాశం" వుండేది.

1908నుండి రద్దువాదంపట్ల మన వైఖరిని నిర్వచించి, సుస్థిరంచేసిన పార్టీ నిర్ణయాలను పరిగణనలోకి తీసుకొనేందుకు పూర్తి అయిష్టతతో గాని, లేక, పైన పేర్కొనబడిన నిర్ణయాల పూర్తి గుర్తింపు ప్రాతిపదికపైన మెజారిటీ ఐక్యతను ప్రత్యక్షంగా సాధించిన, రష్యాలోని యీనాటి కార్మికోద్యమ అనుభవంతో గాని నిమిత్తం పెట్టుకొనేందుకు బొత్తిగా యిష్టపడకుండా, నమ్మశక్యం కానంతటి డాంబికమైన గొప్పలు చెప్పకొంటూ ఎవరైనా వ్యక్తులు తమ ముందుకు వచ్చినప్పుడు, తాము సరిగా ఎవరితో వ్యవహరిస్తున్నారో యువతరం కార్మికులు తెలుసుకోవలసి వుంది.

"ప్రొస్వెష్చేనియె," 5వ సంచిక,
1914 మే

# జాతుల స్వయంనిర్ణయ హక్కు

రష్యన్ మార్క్సిస్టుల కార్యక్రమంలో జాతుల స్వయంనిర్ణయ హక్కును గురించి చర్చించే 9వ క్లాజు ("ప్రాస్వెష్చేనియె"లో మేమింతకు ముందే పేర్కొన్నట్లు)* యిటీవల అవకాశవాదుల ముమ్మర దాడికి దారితీసింది. రష్యన్ రద్దువాది సెమ్‌కోవ్‌స్కీ సెంట్ పీటర్స్‌బర్గ్ రద్దువాదుల వార్తాపత్రికల్లో బుందిస్ట్[67] లీబ్‌మనూ, ఉక్రేనియన్ జాతీయవాద సోషలిస్టు యుర్కేవిచ్ తమతమ పత్రికల్లోనూ యీ క్లాజుమీద తీవ్రంగా దాడిచేసి, దాన్ని పరమ తిరస్కారపూర్వకంగా చూశారు. మన మార్క్సిస్టు కార్యక్రమానికి వ్యతిరేకంగా నానాగోత్రాలకు చెందిన అవకాశవాదుల గుంపూ జరిపే సామూహిక దాడి దరహంమీద యీనాటి జాతీయవాద ఊగిసలాటలతో సన్నిహితంగా ముడిపడివుందన్న విషయంలో ఎలాంటి సందేహమూ లేదు. అందుచేతనే యీ సమస్యను సవివరంగా పరిశీలించడం సమయోచితమని నేను భావిస్తున్నాను. సందర్భవశాత్తూ నేనొక విషయం చెప్పదలుచుకున్నాను, పైన పేర్కొనబడిన అవకాశవాదుల్లో ఏ ఒక్కరూ తన సొంత వాదన ఒక్కదాన్నీ ప్రతిపాదించలేదు. "జాతీయ సమస్యా, స్వయంపాలనా" అనే 1908–09 నాటి సుదీర్ఘమైన తన పోలిష్ వ్యాసంలో రోజా లుక్సెంబుర్గ్ చెప్పినదాన్నే వాళ్లందరూ కేవలం తిరిగి వల్లిస్తున్నారు. కాగా, నా వివరణలో రోజా లుక్సెంబుర్గ్ "మౌలిక" వాదనలను మాత్రమే నేను పరిశీలిస్తాను.

## 1. జాతుల స్వయంనిర్ణయ హక్కు అంటే ఏమిటి?

స్వయంనిర్ణయం అనబడేదాన్ని గురించి మార్క్సిస్టు పద్ధతిలో పరిశీలించేందుకు ప్రయత్నమేదైనా జరిపినప్పుడు సహజంగానే, మొట్టమొదట ఉత్పన్నమయ్యే ప్రశ్న యిదే. ఆ

---

* చూ: V. I. Lenin, *Collected Works*, Vol. 20, pp. 17–51. – సం.

మాటని ఎలా అర్థంచేసుకోవాలి? చట్టానికి సంబంధించిన రకరకాల "సాధారణ భావనల" నుంచి ఉత్పన్నమయ్యే చట్టబద్ధ నిర్వచనాలనుంచి దీనికి జవాబును వెతుక్కోవాలా? లేక జాతీయోద్యమాల చారిత్రక, ఆర్థిక అధ్యయనంలో వెతుక్కోవాలా?

సెమ్‌కోవ్‌స్కీలూ, లీబ్‌మన్‌లూ, యుర్కేవిచ్‌లూ యీ ప్రశ్నను అసలు లేవనెత్తాలని అనుకోనైనాలేదన్నా, మార్క్సిస్టు కార్యక్రమపు "అస్పష్టత"ని గురించి వెటకారంగా భుజాలు ఎగరేశారన్నా ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. వాళ్ల అమాయకత్వంలో, జాతుల స్వయంనిర్ణయ హక్కుని గురించి 1903 నాటి "రష్యన్ కార్యక్రమం"లోనే కాకుండా, 1896లో లండన్‌లో జరిగిన అంతర్జాతీయ మహాసభలో కూడా (యీ విషయాన్ని నేను సముచితమైన చోట సవివరంగా చర్చిస్తాను)[68] చర్చింపబడిందన్న విషయాన్ని వాళ్ళు గుర్తించలేదన్న విషయం స్పష్టం. పరిశీలనలో వున్న క్లాజుయొక్క అనిర్దిష్టమూ, అధిభౌతికమూ అనబడే స్వభావం గురించి ఎక్కువగా మాట్లాడే రోజా లుక్సెంబుర్గ్ అనిర్దిష్టతా, అధిభౌతికతా దోషానికి లోనుగావడం యింకా చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఈ విషయపు సారాంశం చట్టపరమైన నిర్వచనాల్లో వుందా లేక ప్రపంచమంతటా సాగే జాతీయోద్యమాల్లో వుందా అన్న సమస్యను స్పష్టంగానూ, కచ్చితంగానూ ఎక్కడా సూత్రీకరించకుండా స్వయంనిర్ణయం గురించి సాధారణీకరణల్లోకి వరుసగా దిగజారిపోతున్నది (జాతి యిచ్ఛను తెలుసుకోవడం ఎలాగన్న సమస్య గురించి తమాషాగా తర్కించేదాకా పోయినది) రోజా లుక్సెంబుర్గ్.

ఈ సమస్యను కచ్చితంగా సూత్రీకరించుకున్నట్లయితే — దీన్ని ఏ మార్క్సిస్టూ తప్పించుకోలేడు — రోజా లుక్సెంబుర్గ్ వాదనల్లో పదింట తొమ్మిది వంతులు పరాస్తమైపోతాయి. రష్యాలో జాతీయోద్యమాలు తలెత్తడం యిదే మొదటిసారీ కాదు, అవి ఒక్క రష్యాకి మాత్రమే విశిష్టమైనవీ కాదు. ప్రపంచమంతటల్లోనూ, ఫ్యూడలిజంమీద పెట్టుబడిదారీ విధానపు అంతిమ విజయ కాలం జాతీయోద్యమాలతో ముడిపడివుంది. సరుకు ఉత్పత్తి సంపూర్ణ విజయం పొందాలంటే, బూర్జువావర్గం దేశీయ మార్కెట్టుని స్వాయత్తం చేసుకోవాలి, ఒకే భాష మాట్లాడుతూ ఉన్న జనాభాగల భూప్రాంతాలను రాజకీయంగా సమైక్యం చేయాలి, ఆ భాషభివృద్ధికీ, సాహిత్యంలో అది స్థిరపడేందుకూ ఆటంకాలన్నీ తొలగింపబడాలి. అందులోనే వుంది జాతీయోద్యమాల ఆర్థిక పునాది. మానవుల మధ్య సంసర్గానికి భాషే అతి ముఖ్య సాధనం. ఆధునిక పెట్టుబడిదారీ విధానానికి అనుగుణమైన స్థాయిలో నికార్సైన స్వేచ్ఛాయుత, విస్తృత వాణిజ్యానికీ, తన అన్ని వర్గాల్లోనూ జనాభా స్వేచ్ఛగా, విస్తృతంగా సమీకృతం కావడానికీ, చివరి సంగతి, మార్కెట్టుకీ, పెద్ద, చిన్న ప్రసక్తి లేకుండా ప్రతి ఒక్క సొంతదారుకీ మధ్యా, అమ్మకపుదారుకీ కొనుగోలుదారుకీ

మధ్యా సన్నిహిత సంబంధ స్థాపనకీ భాష ఐక్యతా, దాని అకుంఠితాభివృద్ధి అతిముఖ్యమైన షరతులు.

కాగా, ఆధునిక పెట్టుబడిదారీ విధానపు యీ అవసరాలను అత్యుత్తమ రీతిలో తీర్చే జాతీయ రాజ్యాల స్థాపనే, ప్రతి ఒక్క జాతీయోద్యమ వాంఛ. అత్యంత ప్రగాఢమైన ఆర్థిక అంశాలు యీ గమ్యం దిశగా నెట్టుతాయి. అందుచేతనే పశ్చిమ యూరప్ అంతటికీ, ఆ మాటకొస్తే, యావత్తు నాగరిక ప్రపంచానికీ జాతీయ రాజ్యం నమూనా ప్రాయమైనదీ, పెట్టుబడిదారీ దశకి సామాన్యమైనదీ.

అందుకని న్యాయశాస్త్రపరమైన నిర్వచనాలను అటూయిటూ మెలితిప్పి గారడీ చెయ్యడం ద్వారా కాకుండా, లేక అనిర్దిష్టమైన నిర్వచనాలను "కల్పించడం" ద్వారా కాకుండా, జాతీయోద్యమాల చారిత్రకార్థిక పరిస్థితులను పరిశీలించడం ద్వారా జాతుల స్వయం నిర్ణయ హక్కు అర్థాన్ని మనం గ్రహించదలచుకొంటే, జాతుల స్వయంనిర్ణయ హక్కు అంటే విదేశీ జాతీయ సంస్థలనుంచి యీ జాతుల రాజకీయ వేర్పాటు అనీ, స్వతంత్రమైన జాతీయ రాజ్య స్థాపన అన్న నిర్ధారణకి మనం విధిగా చేరుకోవలసివుంటుంది.

స్వయంనిర్ణయ హక్కు అంటే విడి రాజ్యంగా ఉండే హక్కు మాత్రం కాక మరేదైనా అని భాష్యం చెప్పడం ఎలా తప్పన్నదానికి మరికొన్ని కారణాలను మనం తర్వాత చూస్తాం. ప్రస్తుతానికి, జాతీయ రాజ్యం కావాలన్న ఆకాంక్ష వెనక ప్రగాఢమైన ఆర్థిక అంశాలు వుంటాయన్న అనివార్య నిర్ధారణను "తోసిపుచ్చేందుకు" రోజా లుక్సెంబుర్గ్ చేసే ప్రయత్నాలను మనం పరిశీలించాల్సివుంది.

కౌట్స్కీ పుస్తకం "జాతీయత, అంతర్జాతీయత"తో రోజా లుక్సెంబుర్గ్‌కి బాగా పరిచయం వుంది. ("Die Neue Zeit"[69], సంచిక 1, 1907–08కి అనుబంధం; రష్యన్ అనువాదం "నవూచ్నయ మీస్ల్"[70] పత్రికలో, రీగా, 1908.) జాతీయ రాజ్య సమస్యని ఆ పుస్తకపు 4వ ప్రకరణంలో జాగ్రత్తగా విశ్లేషించిన తర్వాత, ఒట్టో బౌవర్ "జాతీయ రాజ్యంపట్ల ఆకాంక్షను తక్కువ అంచనా వేస్తున్నాడు" (ఆ పుస్తకం 23వ పేజి) అన్న నిర్ధారణకి కౌట్స్కీ చేరుకున్నాడు.* కౌట్స్కీ రచించిన యీకింది మాటలని రోజా

---

*1916లో యీ వ్యాసాన్ని పునర్ముద్రణకి తయారుచేసేటప్పుడు యీ ఖండికకి లెనిన్ యీ దిగువ వివరణ యిచ్చాడు: "1909దాకా, 'అధికారానికి మార్గం' అన్న తన అద్భుతమైన వ్యాసందాకా, కౌట్స్కీ అవకాశవాదానికి శత్రువనీ, అతను అవకాశవాద సమర్థకుడైనది 1910–11లో మాత్రమేననీ, అంతకంటె కచ్చితంగా అవకాశవాద సమర్థకుడైనది 1914–16లో మాత్రమేననీ, విస్మరించవద్దని పాఠకులను కోరుతున్నాం." – సం.

లుక్సెంబుర్గ్ స్వయంగానే ఉల్లేఖిస్తుంది: "జాతీయ రాజ్యమే ప్రస్తుత పరిస్థితులకు మిక్కిలి బాగా అనువైనది" (అంటే, మధ్యయుగ, పెట్టుబడిదారీ పూర్వ, మొదలైన వాటికి భిన్నంగా పెట్టుబడిదారీ, నాగరిక, ఆర్థికంగా ప్రగతిశీల పరిస్థితులకు); "రాజ్యం తన కర్తవ్యాలను అత్యుత్తమంగా నిర్వర్తించగలిగిన రూపం అదే" (అంటే, పెట్టుబడిదారీ విధానపు మిక్కిలి స్వేచ్ఛాయుత, మిక్కిలి విస్తృత అత్యంత శీఘ్ర అభివృద్ధిని సాధించే కర్తవ్యాలు). సంకీర్ణ జాతీయ సంపుటిగల రాజ్యాలు (జాతీయ రాజ్యాలకు భిన్నంగా బహుళ జాతి రాజ్యాలు అనబడేవి) ఏవంటే "వేటి ఆంతరిక రాజ్యాంగం ఏ కారణంగానైతేనేమి అసాధారణంగానో లేక తక్కువ అభివృద్ధి చెందినదిగానో" (వెనుకబడో) "వుండే రాజ్యాలే" అని కౌట్స్కీ చేసిన మరింత సరైన వ్యాఖ్యని మనం దీనికి జోడించాలి. అసాధారణమైనదని కౌట్స్కీ అన్నప్పుడు, అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానపు అవసరాలకు మిక్కిలి బాగా నప్పేదానితో పొసగనితనాన్ని గురించి మాత్రమే అతను ఉద్దేశిస్తున్నాడని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

ఇప్పుడిక్కడ ఉత్పన్నమయ్యే ప్రశ్న యేమిటంటే: కౌట్స్కీ చేసిన యీ చారిత్రక, ఆర్థిక నిర్ధారణల విషయంలో రోజా లుక్సెంబుర్గ్ వైఖరి ఏమిటి? అవి రైటా లేక తప్పా? తన చారిత్రక, ఆర్థిక సిద్ధాంతంలో కౌట్స్కీ రైటా లేక మౌలికంగా మనస్తాత్విక సిద్ధాంత ప్రతిపాదకుడైన బౌవర్ రైటా? బౌవర్ అసందిగ్ధ "జాతీయ అవకాశవాదానికీ," సాంస్కృతిక-జాతీయ స్వయంపాలనకు[71] అతని సమర్థనకీ, అతని జాతీయవాద వ్యామోహానికీ (కౌట్స్కీ అన్నట్లు "జాతీయ పార్శ్వంమీద అడపా దడపా వక్కాణింపు"), "అంతర్జాతీయ పార్శ్వాన్ని పూర్తిగా అశ్రద్ధచేసి జాతీయ పార్శ్వానికి అతనిచ్చే విశేషమైన వక్కాణింపు" (కౌట్స్కీ), జాతీయ రాజ్య స్థాపన ఆకాంక్షకి వున్న బలంపట్ల అతని తక్కువ అంచనాకీ మధ్య సంబంధం ఏమిటి?

రోజా లుక్సెంబుర్గ్ యీ ప్రశ్ననైనా లేవదియ్యలేదు. ఆమె ఆ సంబంధాన్ని గమనించలేదు. బౌవర్ సైద్ధాంతిక అభిప్రాయాల వెరశి మొత్తాన్ని ఆమె బాగా ఆలోచించలేదు. జాతీయ సమస్యకు సంబంధించిన చారిత్రక, ఆర్థిక సిద్ధాంతాలనూ, మనస్తాత్విక సిద్ధాంతాలనూ ఒకదాన్ని మరొకదానితో ఆమె పోల్చిచూడలేదు. కౌట్స్కీని విమర్శించడంలో ఆమె యీకింది మాటలకి తనని తాను పరిమితం చేసుకుంటుంది:

> "...ఈ 'అత్యుత్తమ' జాతీయ రాజ్యం ఒక సాధారణీకరణ మాత్రమే, దాన్ని తేలిగ్గా అభివృద్ధిచెయ్యడం, కాపాడటం సైద్ధాంతికంగా మాత్రమే సాధ్యం గాని, అది వాస్తవికతకి అనురూపమైనది కాదు." ("Przegląd Socjaldemokratyczny,"[72] 1908, № 6, p. 499.)

ఈ ఉద్ఘాటనను రూఢిపరుస్తూ చిన్న జాతుల "స్వయంనిర్ణయ హక్కు" బడా పెట్టు బడిదారీ రాజ్యాల అభివృద్ధిచేతా, సామ్రాజ్యవాదంచేతా భ్రమప్రాయ మొనర్చబడిందన్న వాదనలు చెయ్యబడ్డాయి. రోజా లుక్సెంబుర్గ్ "రాజకీయ పోరాట ఫలితమూ, 'యూరప్ స్వరమేళ,' దౌత్య క్రీడ పర్యవసానంగానే నామమాత్రంగా స్వతంత్రులైన మాంటినెగ్రిన్లు, బల్గేరియన్లు, రుమేనియన్లు, సెర్బుల, గ్రీకుల, పాక్షికంగా స్విస్సుల కూడా 'స్వయంనిర్ణయం' గురించి ఎవరైనా గంభీరంగా మాట్లాడగలరా?!" (పేజి 500) అంటూ ఆశ్చర్యపోతోంది. ఈ పరిస్థితులకి చాలా బాగా సరిపోయే రాజ్యం "కౌట్స్కీ విశ్వసిస్తున్నట్లు జాతీయ రాజ్యం కాదు, కొల్లదారీ రాజ్యం." బ్రిటిష్, ఫ్రెంచి, తదితర వలస యాజమాన్య దేశాల వలసల ప్రమాణానికి సంబంధించిన అంకెలు డజన్ల కొలది ఉల్లేఖింపబడ్డాయి.

ఇలాంటి వాదనలు చదివాక, అసలు విషయం యేమిటి అన్న సంగతిని తప్పుగా అర్థంచేసుకోవడంలో యీ రచయిత్రి సామర్థ్యంపట్ల అబ్బురపడకుండా ఎవరూ ఉండలేరు. సీరియస్ పోజు పెట్టి, చిన్న రాజ్యాలు పెద్ద రాజ్యాలమీద ఆర్థికంగా ఆధారపడివున్నాయనీ, యితర జాతులను కొల్లదారీ పద్ధతిలో అణచివేసేందుకు బూర్జువా రాజ్యాల మధ్య పోరాటం చెలరేగుతోందనీ, సామ్రాజ్యవాదమూ, వలసదేశాలూ ఉన్నాయనీ కౌట్స్కీకి బోధించడం — యిదంతా తెలివిగా కనపడేందుకు చేసే కుత్రతనంతో కూడిన అవకతవక ప్రయత్నం తప్ప మరేమీ కాదు. ఎందుకంటే, వీటిలో ఏ ఒక్కదానికీ అసలు విషయంతో సంబంధం లేదు. ఒక్క చిన్న రాజ్యాలు మాత్రమే కాదు, ఉదాహరణకి రష్యా సైతం "ధనిక" బూర్జువా రాజ్యాల సామ్రాజ్యవాద ఫైనాన్సు పెట్టుబడిమీద ఆర్థికంగా పూర్తిగా ఆధారపడివుంది. మార్క్స్ "పెట్టుబడి" గ్రంథంలో పేర్కొన్నట్లు చిన్న సైజు బాల్కన్ రాజ్యాలు మాత్రమే కాదు, 19వ శతాబ్దపు అమెరికా సైతం, ఆర్థికంగా, యూరప్‌కి వలస రాజ్యమే.[73] మరే యితర మార్క్సిస్టుకి మాదిరిగానే కౌట్స్కీకి యీ విషయం బాగానే తెలుసు, అయితే జాతీయోద్యమాలు, జాతీయ రాజ్యం సమస్యతో దానికి యెలాంటి సంబంధమూ లేదు.

జాతుల రాజకీయ స్వయంనిర్ణయం, బూర్జువా సమాజంలో రాజ్యాలుగా వాటి స్వాతంత్ర్యం అన్న సమస్య స్థానంలో రోజా లుక్సెంబుర్గ్ వాటి ఆర్థిక స్వాతంత్ర్య సమస్యను పెట్టింది. ఇదెంత తెలివిగా వుందంటే, బూర్జువా రాజ్యంలో పార్లమెంటు, అంటే, ప్రజా ప్రతినిధుల సభ సర్వోన్నతాధికారంకోసం కార్యక్రమ సంబంధమైన డిమాండును గురించి చర్చించేటప్పుడు, బూర్జువా దేశంలో, అక్కడ పాలన ఎలాంటిదైనా కూడా, బడా

పెట్టుబడి ప్రాబల్యం వహిస్తుందన్న పూర్తి సరైన అభిప్రాయాన్ని ఎవరైనా వివరించబూను కోవడంలా వుంది.

అత్యధిక జనాభా కలిగిన ఆసియా ఖండంలో అధిక భాగం "అగ్ర రాజ్యాల" వలసల నడంలోనూ లేక బాగా పరాధీన లేక పీడిత దేశాలనడంలోనూ సందేహం లేదు. అయితే, అందరికీ తెలిసిన యీ విషయం, అదే ఆసియాలో సరుకు ఉత్పత్తియొక్క మిక్కిలి సంపూర్ణ అభివృద్ధీ, పెట్టుబడిదారీ విధానపు అత్యంత స్వేచ్ఛాయుత, మిక్కిలి విస్తృత, అత్యంత శీఘ్ర పెరుగుదలకూ పరిస్థితులు ఒక్క జపానులో మాత్రమే, అంటే, ఒక్క స్వతంత్ర జాతీయ రాజ్యంలో మాత్రమే సృష్టింపబడ్డాయన్న అసందిగ్ధ వాస్తవానికి ఏ విధంగానైనా భంగం కలిగిస్తుందా? జపాను ఒక బూర్జువా రాజ్యం, యీ కారణంగా తనే యితర జాతులను పీడించడం, యితర దేశాల స్వాతంత్ర్యాన్ని హరించి, వాటిని వలసలను చేసుకోవడం మొదలు పెట్టింది. పెట్టుబడిదారీ విధానం కూలిపోయేందుకు ముందు, యూరప్ మాదిరిగా, స్వతంత్ర జాతీయ రాజ్యాల వ్యవస్థగా అభివృద్ధిచెందేందుకు ఆసియాకి వ్యవధి వుంటుందో వుండదో మనం చెప్పలేం. కాని ఆసియాని జాగృతంచేసిన పెట్టుబడిదారీ విధానం, ఆ ఖండంలో కూడా సర్వత్రా జాతీయోద్యమాలను రెక్కొలిపిందన్న విషయం, యీ ఉద్యమాల ధోరణి ఆసియాలో జాతీయ రాజ్యాల స్థాపన దిశగానే వుందన్న విషయం, పెట్టుబడిదారీ విధానానికి మిక్కిలి అనువైన పరిస్థితులను కల్పించేది అలాంటి రాజ్యాలేనన్న విషయమూ నిర్వివాదం. ఆసియా ఉదాహరణ కౌట్స్కీకి అనుకూలంగానూ, రోజా లుక్సెంబర్గ్‌కి వ్యతిరేకంగానూ వుంది.

అలాగే బాల్కన్ రాజ్యాల ఉదాహరణ కూడా ఆమెకి ప్రతికూలంగా వుంది, ఎందుకంటే, బాల్కన్ ద్వీపకల్పంలో స్వతంత్ర జాతీయ రాజ్యాలు ఏ అనుపాతంలో ఏర్పడ్డాయో సరిగా అదే అనుపాతంలో బాల్కన్లలో పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధికి అత్యంతానుకూల పరిస్థితులు కల్పింపబడ్డాయన్న విషయాన్ని ఎవరైనా చూడగలరు.

కాగా, రోజా లుక్సెంబర్గ్ ఏమి చెప్పినా కూడా, యావత్తు ప్రగతిశీల, నాగరిక మానవాళి ఉదాహరణా, బాల్కన్ల ఉదాహరణా, ఆసియా ఉదాహరణా కౌట్స్కీ ప్రతిపాదన పూర్తిగా రైటన్న విషయాన్ని నిరూపిస్తున్నాయి: జాతీయ రాజ్యం అన్నది పెట్టుబడిదారీ విధానపు నియమమూ, "ప్రమాణమూ." బహుళజాతి రాజ్యం వెనుకబాటుతనానికి ప్రాతినిధ్యం వహిస్తుంది, లేక అదొక మినహాయింపు. జాతీయ సంబంధాల దృష్ట్యా, పెట్టుబడిదారీ విధానాభివృద్ధికి అత్యంత సానుకూల పరిస్థితులను నిస్సందేహంగా జాతీయ రాజ్యమే సమకూరుస్తుంది. నిజమే, బూర్జువా సంబంధాలమీద ఆధారపడిన అలాంటి రాజ్యం జాతుల దోపిడినీ, అణచివేతనీ తొలగించగలదని దీని అర్థం కాదు. జాతీయ రాజ్యాల స్థాపన

ఆకాంక్షను ఉత్పన్నంచేసే శక్తివంతమైన ఆర్థిక అంశాలను మార్క్సిస్టులు గమనించకుండా ఉండజాలరని మాత్రమే దీని అర్థం. మార్క్సిస్టుల కార్యక్రమంలోని "జాతుల స్వయం నిర్ణయానికి," చారిత్రక, ఆర్థిక దృష్ట్యా, రాజకీయ స్వయంనిర్ణయ హక్కు, రాజ్య స్వాతంత్ర్యం, జాతీయ రాజ్య స్థాపనా అనే తప్ప మరే అర్థమూ ఉండజాలదనే దీని తాత్పర్యం.

"జాతీయ రాజ్యం"కోసం బూర్జువా ప్రజాతంత్ర డిమాండును మార్క్సిస్టు, అంటే, వర్గంగా శ్రామిక దృక్కోణంనుంచి ఏ పరిస్థితుల్లో సమర్థించాలన్న విషయం సవివరంగా ముందు చర్చించబడుతుంది. ప్రస్తుతానికి, "స్వయంనిర్ణయ" భావన నిర్వచనానికి నన్ను నేను పరిమితం చేసుకుని, రోజా లుక్సెంబుర్గ్‌కి యీ భావన అర్థమేమిటో ("జాతీయ రాజ్యం") తెలుసునని, కాగా ఆమె పక్షం వహించే అవకాశవాదులు లీబ్‌మన్లకీ, సెమ్‌కోవ్‌స్కీలకీ, యుర్కేవిచ్‌లకీ అది కూడా తెలియదనీ మాత్రమే యిక్కడ చెప్పదలుచుకున్నాను!

## 2. ఈ సమస్య చారిత్రక నిర్దిష్ట ప్రాతిపదిక

ఏ సాంఘిక సమస్యనైనా కూడా నిర్దిష్టమైన చారిత్రక చట్రంలోపల పరిశీలించాలి అన్నది మార్క్సిస్టు సిద్ధాంతానికి సంబంధించిన తప్పనిసరి అవసరం. కాగా, ఆ సమస్య ఏ ప్రత్యేక దేశానికైనా సంబంధించినదైతే (ఉదాహరణకి ఒక దేశపు జాతీయ కార్యక్రమం), అదే చారిత్రక దశలో యితర దేశాలనుంచి ఆ దేశాన్ని వేరుచేసే నిర్దిష్ట లక్షణాలేమిటో వాటిని పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రస్తుతం చర్చింపబడుతున్న సమస్యకు అన్వయించినప్పుడు మార్క్సిస్టు సిద్ధాంతానికి సంబంధించిన యీ తప్పనిసరి అవసరం అర్థమేమిటి?

మొట్టమొదటిది, జాతీయోద్యమం దృష్ట్యా పెట్టుబడిదారీ విధానపు మౌలికంగా విభేదించే రెండు దశలను వేరుచేయాలని దీని అర్థం. ఒక వైపున, ఫ్యూడలిజమూ, నిరంకుశత్వమూ కూలిపోతూ, బూర్జువా ప్రజాతంత్ర సమాజమూ, రాజ్యమూ రూపొందుతున్న దశ. ఈ దశలో జాతీయోద్యమాలు మొట్టమొదటిసారిగా ప్రజోద్యమాలు అవుతాయి. పత్రికల ద్వారా, ప్రాతినిధ్య సంస్థల్లో పాల్గొనడం వగైరాల ద్వారా అవి జనాభాలోని అన్ని వర్గాలనీ ఏదో ఒక విధంగా రాజకీయాల్లోకి లాగుతాయి. మరో వైపున, చాలా కాలంగా స్థిరపడిన రాజ్యాంగబద్ధమైన పాలన కలిగి, శ్రామికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య

శత్రువైరుధ్యం ఉన్నత స్థాయికి పెరిగి, పూర్తిగా రూపొందిన పెట్టుబడిదారీ రాజ్యాల దశ. దీన్ని పెట్టుబడిదారీ విధానం పతన ప్రాంగణంలో వున్న దశ అని పిలవవచ్చు.

మొదటి దశకు విశిష్టమైన లక్షణాలు: జాతీయోద్యమాల జాగృతి, మొత్తంమీద రాజకీయ స్వాతంత్ర్యంకోసం, ప్రత్యేకించి జాతి హక్కులకోసమూ జరిగే పోరాటం సందర్భంగా జనాభాలో అత్యధిక సంఖ్యాక, మందకొడి విభాగమైన రైతాంగాన్ని యీ ఉద్యమాల్లోకి లాగడం. రెండో దశకు విశిష్టమైన లక్షణాలు: ప్రజాసామూహిక బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమాలు లేకపోవడం, అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ విధానం, యింతకు ముందే వాణిజ్య సంబంధాల్లోకి పూర్తిగా లాగబడిన జాతులను మరింత సన్నిహితంగా తెచ్చి, అవి పరస్పరం మరింతగా హెచ్చు స్థాయిలో కలిసిపోయేలా చెయ్యడం – యివి అంతర్జాతీయంగా ఐక్యమైన పెట్టుబడికీ, అంతర్జాతీయ కార్మికోద్యమానికీ మధ్య వైరుధ్యాలను ముందుకు తెస్తాయి.

ఈ రెండు దశలూ ఒకదాన్నుంచి మరొకటి మధ్య గోడ కట్టుకొని వేరుపడిపోలేదన్న మాట నిజమేననుకోండి. అవి అనేక పరివర్తన సంబంధాలచేత బంధింపబడతాయి. వివిధ దేశాలు తమ జాతీయాభివృద్ధి వేగంలో, జనాభా జాతీయ సంపుటి, దాని పంపిణీ మొదలైన వాటిలో ఒక దాన్నుంచి మరొకటి భిన్నంగా వుంటాయి. ఈ సాధారణ చారిత్రక, నిర్దిష్ట రాజ్య పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా యే దేశపు మార్క్సిస్టులైనా తమ జాతీయ కార్యక్రమాన్ని రూపొందించుకోలేరు.

సరిగ్గా యిక్కడే రోజా లుక్సెంబుర్గ్ వాదనల్లోని మిక్కిలి బలహీనమైన అంశం మనకి ఎదురవుతుంది. అసాధారణమైన పట్టుదలతో తన వ్యాసాన్ని ఆమె, మన కార్యక్రమంలోని 9వ క్లాజుకి వ్యతిరేకంగా, "కఠినమైన" పదాలతో అలంకరిస్తుంది. కార్యక్రమంలోని 9వ క్లాజు "విచక్షణారహితమైనది"గా వుందనీ, "ఒక గంభీర ప్రవచనం," "అధిభౌతిక పదజాలం" అనీ వగైరా, వగైరాలనీ ఆమె ప్రకటిస్తుంది. అధిభౌతికవాదాన్నీ (మార్క్సిస్టు అర్థంలో, అంటే, గతితర్క వ్యతిరేకతనీ), శుష్క సాధారణీకరణలనీ యింత ప్రశంసనీయంగా ఖండించే రచయిత్రి యీ సమస్యని గురించి నిర్దిష్టమైన చారిత్రక విశ్లేషణ చెయ్యడమెలాగో ఒక ఆదర్శం నెలకొల్పుతుందని ఆశించడం సహజం. ఒకానొక నిర్దిష్ట దేశంలో – రష్యాలో – ఒక నిర్దిష్ట దశలో (20వ శతాబ్ది మొదట్లో) మార్క్సిస్టుల జాతీయ కార్యక్రమమే యిప్పుడు పరిశీలనాంశం. అయితే, రోజా లుక్సెంబుర్గ్ రష్యా <u>ఏ చారిత్రక దశను</u> గడుస్తోందో, లేక, ఆ <u>ప్రత్యేక</u> దశలో, ఆ <u>ప్రత్యేక</u> దేశపు జాతీయ సమస్య, జాతీయోద్యమాల <u>నిర్దిష్ట</u> లక్షణాలు <u>ఏమిటి</u> అన్న ప్రశ్నను రోజా లుక్సెంబుర్గ్ లేవదీసిందా?

దాన్ని గురించి ఆమె బొత్తిగా ఏమీ చెప్పదు! ప్రస్తుత చారిత్రక దశలో రష్యాలో జాతుల సమస్య ఎలా వుందన్న విషయం గురించి గాని, ప్రత్యేకించి యీ విషయంలో రష్యా విశిష్ట లక్షణాలు ఏమిటన్న దాన్ని గురించి గాని ఆమె రచనలో విశ్లేషణ ఆభాస కూడా మనకేమీ కనిపించదు!

బాల్కన్లలో జాతీయ సమస్య ఐర్లండ్‌లో దానికి భిన్నంగా వుందని ఆమె చెప్తుంది. 1848 నాటి నిర్దిష్ట పరిస్థితుల్లో పోలిష్, చెక్ జాతీయోద్యమాలను గురించి మార్క్స్ ఫలానా ఫలానా విధంగా అంచనా వేశాడని చెప్తుంది (మార్క్స్‌నుంచి ఒక పేజి ఉల్లేఖనలు). ఆస్ట్రియాకి వ్యతిరేకంగా స్విట్జర్లండు అటవీ ప్రాంతాల పోరాటాన్నీ, 1315లో జరిగిన మోర్‌గార్టెన్ యుద్ధాన్నీ ఫలానా ఫలానా మాదిరిగా ఎంగెల్స్ అంచనా వేశాడని చెప్తుంది (కౌట్స్కీనుంచి సముచిత వ్యాఖ్యలతో, ఎంగెల్స్ రచనలనుంచి ఒక పేజి ఉల్లేఖనలు). 16వ శతాబ్దపు జర్మనీలో జరిగిన రైతు యుద్ధాన్ని అభివృద్ధినిరోధకమైనదిగా లాసాల్ పరిగణించాడనీ, వగైరాలు చెప్తుంది.

ఈ వ్యాఖ్యల్లోగాని, ఉల్లేఖనల్లోగాని కొత్తదనం లేదు. కాని మొత్తంమీద, విడి దేశాల్లోని నిర్దిష్ట చారిత్రక సమస్యల విశ్లేషణపట్ల మార్క్స్, ఎంగెల్స్, లాసాల్‌లు ఏ వైఖరి తీసుకున్నారన్న విషయం మటుకు జ్ఞాపకంచేసుకోవడం పాఠకులకి ఆసక్తిదాయకంగా వుంటుంది. మార్క్స్, ఎంగెల్సుల రచనలనుంచి యివ్వబడిన జ్ఞానదాయకమైన ఉల్లేఖనలను మరోసారి చదివినప్పుడు రోజా లుక్సెంబుర్గ్ ఎలాంటి పరిహాసాస్పదమైన పరిస్థితిలో చిక్కుకుందో స్ఫుటంగా బయటపడుతుంది. ఆయా దేశాల్లో, ఆయా కాలాల్లో జాతీయ సమస్యను నిర్దిష్ట చారిత్రక విశ్లేషణ జరపవలసిన ఆవశ్యకతను గురించి ఆమె ధాటిగా, కోపంగా బోధిస్తుంది. కాని 20వ శతాబ్ది మొదట్లో, పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి చరిత్రలో రష్యా ఏ దశను గడుస్తోందన్న విషయాన్ని, లేక, యీ దేశంలో జాతుల సమస్య విశిష్ట లక్షణాలు ఏమిటో నిర్ణయించేందుకు కించిత్తు ప్రయత్నం కూడా ఆమె చెయ్యదు. ఈ సమస్యని మార్క్సిస్టు పద్ధతిలో యితరులు ఎలా విశ్లేషించారన్న దానికి రోజా లుక్సెంబుర్గ్ సత్సంకల్పాలతో నరకానికి ఎంత తరచుగా బాట పరచబడిందో, ఎంత తరచుగా మంచి సలహా – అలాంటి సలహాను ఆచరణలో అనుసరించే విషయంలో అయిష్టతనీ లేక చేతకానితనాన్నీ మరుగుపరుస్తుందో బుద్ధిపూర్వకంగా నొక్కిచెప్తున్నట్లు – ఉదాహరణలు యిస్తుంది.

ఆమె యిచ్చిన బోధనాత్మకమైన పోలికల్లో యిదొకటి. పోలండు స్వాతంత్ర్యంకోసం డిమాండును ఖండిస్తూ "పారిశ్రామికంగా పోలండు శీఘ్రతరాభివృద్ధి"ని గురించీ, పోలండులో ఉత్పత్తిచేయబడుతున్న సరుకులు రష్యాలో విక్రయింపబడటాన్ని గురించీ నిరూపిస్తూ

1898లో తను రాసిన ఒక చిన్న పుస్తకంనుంచి ఆమె ఉల్లేఖించింది. దీన్నుంచి జాతుల స్వయంనిర్ణయ హక్కును గురించి ఎలాంటి నిర్ధారణగాని చెయ్యడం దుస్సాధ్యమని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. పాత ఫ్యూడల్ పోలండు అంతరించిపోయిందన్న విషయాన్ని, వగైరాలను మాత్రమే యిది నిరూపిస్తుంది. కాని రోజా లుక్సెంబుర్గ్‌కి ఎప్పుడూ పాఠకుల కళ్లు కప్పి ఏదో ఒక నిర్ధారణకి చేరుకోవడం మామూలు. రష్యా, పోలండులను సమైక్యం చేసే అంశాల్లో ఆధునిక పెట్టుబడిదారీ సంబంధాలలోని శుద్ధ ఆర్థిక సంబంధాలు యిప్పుడు ప్రాబల్యం వహిస్తున్నాయన్నదే ఆ నిర్ధారణ.

అటుతర్వాత మన రోజా, తన వ్యాస శీర్షిక "జాతుల సమస్యా, స్వయంపాలనా" అయినప్పటికీ, మొత్తంగా స్వయంపాలన హక్కు సమస్య దగ్గరకి పోయి, పోలండు రాజ్యానికి ప్రత్యేకమైన స్వయంపాలన హక్కు వుందని వాదించడం మొదలుపెడుతుంది (1913లో వెలువడిన "ప్రాస్వేష్చేనియె" 12వ సంచిక చూడండి*). పోలండు స్వయంపాలన హక్కును సమర్థించేందుకు గాను, రోజా లుక్సెంబుర్గ్ రష్యా రాజ్య వ్యవస్థను దాని ఆర్థిక, రాజకీయ, సామాజిక విశిష్ట లక్షణాలనుబట్టీ, రోజువారీ జీవితాన్నిబట్టీ అంచనా వేస్తోందనడం స్పష్టం — ఈ లక్షణాలు అన్నింటినీ కలిసికట్టుగా చూసినప్పుడు "ఆసియా తరహా నిరంకుశత్వ" భావనని కల్పిస్తుంది ("Przegląd," సంచిక 12, పేజి 137).

ఆర్థిక వ్యవస్థలో ఎప్పుడెప్పుడైతే పూర్తి పితృస్వామిక, పెట్టుబడిదారీ పూర్వ లక్షణాలు ప్రాబల్యం వహిస్తాయో, ఎక్కడైతే సరుకు ఉత్పత్తీ, వర్గ విభజనా ఎక్కువ అభివృద్ధి చెందలేదో అప్పుడు, అక్కడ యీ తరహా రాజ్య వ్యవస్థకి విశేషమైన స్థిరత్వం ఉంటుందన్న విషయం సాధారణంగా తెలిసిందే. అయితే, కచ్చితంగా పెట్టుబడిదారీ పూర్వ స్వభావపు రాజ్య వ్యవస్థను కలిగిన ఏదైనా ఒక దేశంలో, పెట్టుబడిదారీ విధానం వేగంగా అభివృద్ధిచెందుతూ జాతీయంగా కేటాయింపబడిన ప్రాంతం ఒకటి వున్నప్పుడు, ఆ పెట్టుబడిదారీ విధానం ఎంత వేగంగా అభివృద్ధిచెందితే, దానికీ, పెట్టుబడిదారీ పూర్వ రాజ్య వ్యవస్థకీ మధ్య వైరుధ్యం అంత ఎక్కువగా వుంటుంది, పురోగమించిన ఆ ప్రాంతానికీ మొత్తం దేశానికీ మధ్య — దీనితో ఆ ప్రాంతం "ఆధునిక పెట్టుబడిదారీ" బంధనాలచేత గాక, "ఆసియా తరహా నిరంకుశమైన" బంధనాలు వగైరాలచేత అనుబంధింపబడి వుంటుంది — వేర్పాటుకి అంత ఎక్కువ అవకాశం వుంటుంది.

ఈ విధంగా, బూర్జువా పోలండుకి సంబంధించి రష్యా ప్రభుత్వపు సాంఘిక నిర్మాణ స్వరూప సమస్యని గురించి సైతం రోజా లుక్సెంబుర్గ్ తన వాదనలను కూడగట్టి పుంచ

---

* చూ: V. I. Lenin, *Collected Works*, Vol. 20, pp. 45—51. — సం.

లేదు. రష్యాలోని జాతీయోద్యమాల నిర్దిష్ట, చారిత్రక, విశిష్ట లక్షణాల సమస్యనే ఆమె అసలు ఎత్తుకోలేదు.

మనం పరిశీలించాల్సిన అంశాల్లో యిదొకటి.

# 3. రష్యాలోని జాతీయ సమస్య నిర్దిష్ట లక్షణాలు, రష్యా బూర్జువా ప్రజాతంత్ర పరివర్తన

> " 'జాతుల స్వయంనిర్ణయ హక్కు' సూత్రానికి వైకల్పిక అర్థం వున్నా కూడా — యిది కేవలం ఒక శుష్క ప్రవచనం మాత్రమే, పోతే, యీ సూత్రం రష్యాలోని జాతులకే కాకుండా, జర్మనీ ఆస్ట్రియాల్లోని జాతులకీ, స్విట్జర్లండు, స్వీడన్లలోని జాతులకీ, అమెరికా, ఆస్ట్రేలియాల్లోని జాతులకీ కూడా వర్తిస్తుంది — ఈనాటి సోషలిస్టు పార్టీల్లో ఏ ఒక్కదాని కార్యక్రమాల్లో కూడా అది మనకి కనిపించదు...." ("Przegląd," సంచిక 6, పేజి 483).

రోజా లుక్సెంబుర్గ్ మార్క్సిస్టు కార్యక్రమంలోని 9వ క్లాజుకి వ్యతిరేకంగా తన దాడిని యిలా మొదలుపెడుతుంది. ఆ కార్యక్రమంలోని యీ క్లాజు "కేవలం ఒక శుష్క ప్రవచనం" అన్న భావాన్ని మనమీద రుద్దేందుకు చేసే ప్రయత్నంలో, వినోదం కలిగించే ధైర్యంతో యీ అంశం రష్యా, జర్మనీ, వగైరాలకి "స్పష్టంగా, సమానంగా వర్తిస్తుంది" అని చెప్పడం ద్వారా రోజా లుక్సెంబుర్గే యీ పొరపాటుకి గురి అవుతోంది.

రోజా లుక్సెంబుర్గ్ తన వ్యాసాన్ని తార్కిక పొరపాట్లతో — స్కూలు పిల్లల ఎక్సర్సైజులకి ఉపయోగపడదగిన పొరపాట్లతో — నింపేయదలచుకున్నదన్న విషయం స్పష్టమనే మేము చెప్పే సమాధానం. ఎందుకంటే, రోజా లుక్సెంబుర్గ్ వాదం కేవలం అర్థరహితమైనదీ, ఈ సమస్య చారిత్రక నిర్దిష్ట ప్రతిపాదనకు అపహాస్యప్రాయమైనదీని.

మార్క్సిస్టు కార్యక్రమాన్ని ఎవరైనా కుర్రతనపు పద్ధతిలో కాకుండా, మార్క్సిస్టు పద్ధతిలో వ్యాఖ్యానించాలని అనుకుంటే, అది బూర్జువా ప్రజాతంత్ర జాతీయోద్యమాలకు వర్తిస్తుందన్న విషయాన్ని సులభంగా గ్రహించగలరు. సంగతి యిలా ఉండగా — యిది నిస్సందేహంగా యిలాగే ఉంది — యీ కార్యక్రమం "విచక్షణా రహితంగా," కేవలం ఒక

"శుష్క ప్రవచనం" వగైరాగా అన్ని బూర్జువా ప్రజాతంత్ర జాతీయోద్యమాలనూ పర్యావరిస్తుందన్న మాట "సుస్పష్టం." రోజా లుక్సెంబుర్గ్ దీన్ని గురించి ఏ కొంచెం ఆలోచించినా, మన కార్యక్రమం, అలాంటి ఉద్యమాలు వాస్తవంలో ఎక్కడ వున్నాయో వాటికి మాత్రమే వర్తిస్తుందన్న నిర్ధారణ ఆమెకు సుస్పష్టమై వుండేది.

సువిదితమైన యీ అంశాలను గురించి ఆలోచించివున్నట్లయితే తనెంత అర్థరహితంగా మాట్లాడుతోందో రోజా లుక్సెంబుర్గ్ తేలిగ్గా గ్రహించగలిగివుండేది. మనం "శుష్క ప్రవచనం" చేస్తున్నామని మనమీద ఆరోపిస్తూ, ఏ దేశాల్లోనైతే బూర్జువా ప్రజాతంత్ర జాతీయోద్యమాలు లేవో, ఆ దేశాల కార్యక్రమాల్లో జాతుల స్వయంనిర్ణయ హక్కు గురించిన ప్రస్తావన లేదన్న వాదనని మనకి వ్యతిరేకంగా ఆమె ముందుకు తెచ్చింది. భలే తెలివైన వాదన!

వివిధ దేశాల రాజకీయ, ఆర్థిక అభివృద్ధి, దీనికితోడు వాటి మార్క్సిస్టు కార్యక్రమాలను పోల్చి చూడడానికి మార్క్సిజం దృష్ట్యా మహత్తర ప్రాముఖ్యం వుంది. అన్ని ఆధునిక రాజ్యాలూ ఒకే రకమైన పెట్టుబడిదారీ స్వభావం కలిగినవనడంలోనూ, అవి ఒకే రకమైన అభివృద్ధి నియమంచేత శాసింపబడతాయనడంలోనూ ఎలాంటి సందేహమూ లేకపోవడమే యిందుకు కారణం. అయితే, అలా పోల్చిచూడటం నేర్పుగా జరగాల్సివుంటుంది. ఈ పోల్చి చూడటానికి ప్రాథమికమైన షరతు ఏమిటంటే, పరిశీలనలో వున్న దేశాల అభివృద్ధి చారిత్రక దశలు అసలు పోల్చదగినవేనా అని కనుక్కోవడం. ఉదాహరణకి, కేవలం పరమ మూఢులు మాత్రమే ("రూస్కయ మీస్ల్"[74]లో ప్రిన్స్ ఇ. త్రుబెత్స్కోయ్ లాగ) రష్యన్ మార్క్సిస్టు వ్యావసాయిక కార్యక్రమాన్ని పశ్చిమ యూరప్ దేశాల కార్యక్రమాలతో "పోల్చి చూడ"గలుగుతారు. ఎందుకంటే, మన కార్యక్రమం బూర్జువా ప్రజాతంత్ర వ్యవసాయ సంస్కరణ సమస్యలకి పరిష్కారాలు చెప్పేది కాగా, పశ్చిమ దేశాల్లో అలాంటి సమస్యే లేదు.

జాతీయ సమస్యకి కూడా యిదే వర్తిస్తుంది. పశ్చిమ దేశాల్లో అత్యధికమైనవాటిలో యీ సమస్య ఎన్నడో పరిష్కరింపబడింది. పశ్చిమ యూరపియన్ దేశాల కార్యక్రమాల్లో లేని ప్రశ్నలకు సమాధానాలు వెదకడం పరిహాసాస్పదమైన విషయం. ఈ విషయంలో రోజా లుక్సెంబుర్గ్ అతి ముఖ్య విషయాన్ని – బూర్జువా ప్రజాతంత్ర పరివర్తనలు ఎన్నడో పూర్తయిన దేశాలకీ, అవి పూర్తికాని దేశాలకీ మధ్య తేడాని – దృష్టిలోకి తీసుకోలేదు.

ఈ విషయానికి కీలకం యీ తేడాలోనే వుంది. రోజా లుక్సెంబుర్గ్ యీ అంశాన్ని బొత్తిగా పట్టించుకోని కారణంగా పదాడంబరంతో కూడిన ఆమె వ్యాసం శుష్క, అర్థరహిత ప్రవచనాల పోగుగా తయారైంది.

పశ్చిమ, కాంటినెంటల్ యూరప్ దేశాల్లోని బూర్జువా ప్రజాతంత్ర విప్లవాల దశ చాలవరకు ఒక నిర్దిష్ట కాలానికి – సుమారు 1789–1871 మధ్య – చెందివుంది. ఇది సరిగ్గా జాతీయోద్యమాల, జాతీయ రాజ్యాలు ఏర్పడిన దశ. ఈ దశ ముగిశాక, పశ్చిమ యూరప్ స్థిరపడిన ఒక బూర్జువా రాజ్యాల వ్యవస్థగా పరివర్తన చెందింది. యివి సర్వ సాధారణంగా జాతీయంగా ఐక్య రాజ్యాలు. అందుచేత, యీనాటి పశ్చిమ యూరపియన్ సోష లిస్టుల కార్యక్రమాల్లో స్వయంనిర్ణయ హక్కుకోసం వెదకడమంటే, మార్క్సిజం ఓన మాలు సైతం తెలియనితనాన్ని బయటపెట్టుకోవడమే.

తూర్పు యూరప్‌లోనూ, ఆసియాలోనూ బూర్జువా ప్రజాతంత్ర విప్లవాల దశ 1905లో మాత్రమే మొదలైంది. రష్యా, పర్షియా, టర్కీ, చైనాలలో విప్లవాలు, బాల్కన్ యుద్ధాలు – మన కాలంలో, మన "ప్రాచ్యం"లో ప్రపంచ సంఘటనల క్రమం యిదీ.[75] ఈ ఘటనా క్రమంలో జాతీయ స్వతంత్ర రాజ్యాలను, జాతీయంగా ఐక్య రాజ్యాలను నెలకొల్పుకొనేందుకు కృషిచేసే బూర్జువా ప్రజాతంత్ర జాతీయోద్యమ పరంపర అంతటి జాగృతిని అంధులు మాత్రమే చూడలేరు. రష్యా, దాని యిరుగుపొరుగు దేశాలూ సరిగ్గా యీ దశనే గడుస్తున్నాయి కనుకా, సరిగ్గా ఆ కారణంగానే జాతుల స్వయంనిర్ణయ హక్కును గురించి ఒక క్లాజును మన కార్యక్రమంలో మనం పెట్టుకుతీరాలి.

సరే, రోజా లుక్సెంబుర్గ్ వ్యాసపు ఉల్లేఖనను మరి కొంచెం పొడిగిద్దాం. ఆమె యిలా రాస్తుంది:

> "...ప్రత్యేకించి, అత్యంత వైవిధ్య పూరితమైన జాతీయ సంపుటిని కలిగిన రాజ్యంలో పనిచేస్తున్న ఒక పార్టీ (దీనికి జాతుల సమస్య ప్రథమగణ్య ప్రాముఖ్యం కలిగినది) కార్యక్రమంలో – ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్యక్రమంలో – జాతుల స్వయంనిర్ణయ హక్కు సూత్రం లేదు" (అదే పేజి).

ఈ విధంగా, "ప్రత్యేకించి" ఆస్ట్రియా ఉదాహరణ ద్వారా పాఠకులను ఒప్పించే ప్రయత్నం జరిగింది. నిర్దిష్టమైన చారిత్రక వాస్తవాల వెలుగులో యీ ఉదాహరణను పరిశీలించి, అదెంత సమంజసమైనదో చూద్దాం.

మొదటిది, బూర్జువా ప్రజాతంత్ర విప్లవ పరిపూర్తికి సంబంధించిన మౌలిక ప్రశ్న వేసి పరిశీలిద్దాం. ఆస్ట్రియాలో యీ విప్లవం 1848లో మొదలై, 1867లో ముగి సింది. దరిమిలా, దాదాపు పూర్తిగా స్థిరపడిన బూర్జువా రాజ్యాంగం అక్కడ సుమారు అర్ధశతాబ్దంపాటు ప్రాబల్యం వహించి, దాని ప్రాతిపదికమీద చట్టబద్ధమైన కార్మిక పార్టీ చట్టబద్ధంగా పనిచేస్తోంది.

అందుచేత, ఆస్ట్రియా అభివృద్ధికి సంబంధించి ఆంతరిక పరిస్థితుల్లో (అంటే, మొత్తంమీద ఆస్ట్రియాలోనూ, ప్రత్యేకించి ఆస్ట్రియాలోని వివిధ జాతుల్లోనూ పెట్టు బడిదారీ విధానాభివృద్ధి దృష్ట్యా), లంఘనలను సృష్టించే అంశాలేవీ లేవు; అటువంటివే వుంటే, జాతీయ స్వతంత్ర రాజ్యాలు ఏర్పడివుండునేమో. పోల్చి చూడడం ద్వారా, ఈ విషయంలో రష్యా సమాన స్థితిలో వుందనుకొని, రోజా లుక్సెంబుర్గ్ మౌలికంగా పొరపాటైన, చారిత్రక వ్యతిరేకమైన ప్రతిపాదన చెయ్యడమే కాకుండా, అప్రయత్నంగా "రద్దువాదం"[46] లోకి దిగజారుతోంది.

రెండవది, మనం యిప్పుడు పరిశీలిస్తున్న సమస్యకి, ఆస్ట్రియాలోని జాతుల మధ్యా, రష్యాలోని జాతుల మధ్యా సంబంధాల్లోని ప్రగాఢమైన భేదానికి ప్రత్యేక ప్రాముఖ్యం వుంది. ఆస్ట్రియా, దీర్ఘ కాలంపాటు జర్మన్ల ప్రాబల్యం వహించిన రాజ్యం మాత్రమే కాదు, ఆస్ట్రియన్ జర్మన్లు మొత్తంగా జర్మన్ జాతిలో సామాన్య నాయక పాత్రని డిమాండు చేశారు. ప్రవచనాలు, చిట్కాలు, సాధారణీకరణలు వగైరాలపట్ల బాగా అయిష్టతను ప్రదర్శించే రోజా లుక్సెంబుర్గ్, యీ "డిమాండు" 1866 యుద్ధంలో ఓడింపబడిందన్న విషయాన్ని దయచేసి గుర్తుకు తెచ్చుకుంటుందనుకుంటాం. ఆస్ట్రియాలో ప్రాబల్యంలో వున్న జర్మన్ జాతి, చివరకు 1871లో రూపుదాల్చిన స్వతంత్ర జర్మన్ రాజ్య పరిధి వెలుపల ఉన్నట్లు ఉంది. మరోవైపున, ఒక స్వతంత్ర జాతీయ రాజ్య స్థాపనకోసం హంగేరియన్లు చేసిన ప్రయత్నం, ఎన్నడో 1849లో, రష్యన్ ఫ్యూడల్ సైన్యపు తాకిళ్లకు కూలిపోయింది.

ఈవిధంగా చాలా విశిష్టమైన పరిస్థితి ఒకటి ఏర్పడింది — హంగేరియన్లూ, దరిమిలా చెక్‌లూ ఆస్ట్రియానుంచి వేర్పాటుకోసంగాక అందుకు భిన్నంగా ఆస్ట్రియా ఐక్యతా పరిరక్షణపట్ల మొగ్గు చూపారు. మరింత కొల్లదారీ స్వభావం కలిగి, శక్తివంతమైన యిరుగు పొరుగు దేశాలచేత పూర్తిగా అణచివెయ్యబడకుండా జాతీయ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడంకోసం సరిగ్గా అలా మొగ్గు చూపారు. ఈ విశిష్టమైన పరిస్థితి మూలంగా ఆస్ట్రియా ఒక ద్వంద్వ రాజ్య రూపాన్ని సంతరించుకుంది, అది యీనాడు ఒక త్రిముఖ రాజ్యంగా (జర్మన్లు, హంగేరియన్లు, స్లావ్‌లు) పరివర్తన చెందుతోంది.

రష్యాలో యిలాంటిది ఏదైనా వుందా? మరింత దారుణమైన జాతీయ పీడన ప్రమాదం దృష్ట్యా, మహా రష్యన్లతో ఐక్యతకోసం "రష్యనేతరులు" కృషిచెయ్యడమన్నది మన దేశంలో ఉందా?

జాతుల స్వయంనిర్ణయ హక్కు సమస్యమీద రష్యాకీ, ఆస్ట్రియాకీ మధ్య సాపత్యం తేవడం అర్థరహితమూ, శుష్క ప్రవచనాత్మకమూ, తెలియనితనమూ అన్న విషయం గ్రహించేందుకు యీ ప్రశ్న వేస్తే చాలు.

జాతీయ సమస్యకి సంబంధించి రష్యాలోని విశిష్ట పరిస్థితులు ఆస్ట్రియాలో మనం చూసేవాటికి పూర్తి భిన్నం. రష్యా ఏకైక జాతీయ కేంద్రం — మహా రష్యన్లను — కలిగిన రాజ్యం. విశాలమైన, అవిచ్ఛిన్నమైన భూప్రాంతం కలిగిన మహా రష్యన్ల జనాభా సుమారు ఏడు కోట్లు. ఈ జాతీయ రాజ్యపు విశిష్ట లక్షణాలు యివీ: ఒకటి, "రష్యనేతరులు" (వీళ్ళ మొత్తంమీద జనాభాలో అధిక సంఖ్యాకులు — 57 శాతం మంది) సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్నారు; రెండు, ఈ రష్యనేతర ప్రజలపై పీడన పొరుగు రాజ్యాల్లో కన్న (చివరకు యూరపియన్ రాజ్యాల్లో సైతం మాత్రమే కాదు) యిక్కడ పటుతరంగా వుంది; మూడు, కొన్ని సందర్భాల్లో సరిహద్దు ప్రాంతాల్లో నివసించే పీడితజాతులకు సరిహద్దులకు అవతలి పక్కన స్వజాతీయులు వుండటం, వారు అక్కడ మరింత ఎక్కువ జాతీయ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తూ వుండటం తటస్థిస్తోంది (రాజ్యపు పశ్చిమ, దక్షిణ సరిహద్దులలో వున్న ఫిన్నులనూ, స్వీడులనూ, పోలులనూ, ఉక్రేనియన్లనూ, రుమేనియన్లనూ పేర్కొంటే చాలు); నాలుగు, తరచుగా కేంద్రంలోకన్న "రష్యనేతర" సరిహద్దు ప్రాంతాల్లో పెట్టుబడిదారీ విధానాభివృద్ధీ, సంస్కృతి సాధారణాభివృద్ధి స్థాయీ మరింత అధికంగా వుంటాయి. చివరి సంగతి, ఇరుగుపొరుగు ఆసియా రాజ్యాల్లోనే బూర్జువా విప్లవాల జాతీయోద్యమాల దశారంభాన్నీ, అవి రష్యా సరిహద్దుల్లోపలి సంబంధిత జాతులకి విస్తరించడాన్నీ మనం చూస్తాం.

ఈవిధంగా, రష్యాలోని జాతుల సమస్యయొక్క ప్రత్యేక, నిర్దిష్ట, చారిత్రక లక్షణాలే ప్రస్తుత దశలో జాతుల స్వయంనిర్ణయ హక్కు గుర్తింపుని మన దేశంలో ప్రత్యేకించి తక్షణావశ్యక విషయంగా తయారుచేస్తున్నాయి.

సందర్భవశాత్తూ, శుద్ధ వాస్తవ దృక్కోణంనుంచి సైతం, ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రట్ల కార్యక్రమంలో జాతుల స్వయంనిర్ణయ హక్కు గుర్తింపబడలేదన్న రోజా లుక్సెంబుర్గ్ ఉద్ఘాటన తప్పే. జాతీయ కార్యక్రమాన్ని ఆమోదించిన బ్రూన్ మహాసభ[76] మినిట్సును తెరిచి ఉక్రేనియన్ (రుథేనియన్) ప్రతినిధివర్గం అంతటి తరఫునా రుథేనియన్ సోషల్ డెమొక్రట్ గంకేవిచ్ చేసిన ప్రకటనా (మినిట్స్ 85వ పేజి) పోలిష్ ప్రతినిధివర్గం అంతటి తరఫునా పోలిష్ సోషల్ డెమొక్రట్ రేగెర్ చేసిన ప్రకటనా (పేజి 108) చూస్తే, పైన పేర్కొనబడిన రెండు జాతులకూ చెందిన ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రట్ల ఆకాంక్షల్లో ఒకటి జాతీయైక్యతా సాధనా, తమ జాతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సాధనే అన్న విషయం స్పష్టంగా కనిపిస్తుంది. కాగా, ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రట్లు జాతుల స్వయంనిర్ణయ హక్కును ప్రత్యక్షంగా తమ కార్యక్రమంలో చేర్చకపోయినప్పటికీ, జాతీయ స్వాతంత్ర్యంకోసం పార్టీలోని విభాగాలు చేసే డిమాండును వాళ్ళు అనుమతిం

చారు. ఆచరణలో దీని అర్థం జాతుల స్వయంనిర్ణయ హక్కును గుర్తించడమేననడం స్పష్టం! కాగా, ఆస్ట్రియాని గురించి రోజా లుక్సెంబుర్గ్ చేసిన ప్రస్తావన అన్ని విధాలా రోజా లుక్సెంబుర్గ్‌కే ప్రతికూలం.

# 4. జాతీయ సమస్యలో ''ఆచరణాత్మకత''

మన కార్యక్రమంలోని 9వ క్లాజులో ''ఆచరణాత్మకమైనది'' ఏమీ లేదన్న రోజా లుక్సెంబుర్గ్ వాదనని అవకాశవాదులు చేజిక్కించుకున్నారు. రోజా లుక్సెంబుర్గ్ యీ వాదనతో ఎంతగా సమ్మోహితురాలైందంటే, ఆమె వ్యాసంలోని కొన్ని భాగాల్లో, యీ ''నినాదం'' ఒకే పేజీలో ఎనిమిది సార్లు వల్లింపబడింది.

ఆమె యిలా రాస్తుంది: 9వ క్లాజు ''శ్రామికవర్గపు రోజువారీ విధానంలో ప్రత్యక్ష మార్గదర్శకత్వమూ, జాతుల సమస్యకి ఆచరణాత్మక పరిష్కారమూ యివ్వదు.''

ఈ వాదాన్ని—మరో చోట 9వ క్లాజుని పరమ అర్థరహితమైనదిగా చూపే విధంగా, లేక అన్ని జాతుల ఆకాంక్షలనీ సమర్థించేలా మనల్ని నిబద్ధులను చేసేలాగ సూత్రీకరింప బడిన వాదాన్ని—పరిశీలిద్దాం.

జాతుల సమస్య ''ఆచరణాత్మకంగా ఉండాలనే'' యీ డిమాండుకి అర్థం యేమిటి?

దానికి అర్థం యీకింది మూడింట్లో యేదో ఒకటి అయ్యుండాలి: అన్ని జాతుల ఆకాంక్షలనూ సమర్థించడం; ఏ జాతి అయినా విడిపోవాలని కోరుకున్నప్పుడు, ఆ ప్రశ్నకు ''ఔను'' అనో ''కాదు'' అనో జవాబివ్వడం; లేకపోతే మొత్తంమీద జాతీయ డిమాండ్ల తక్షణ ''సాధ్యత.''

''ఆచరణాత్మకత'' డిమాండుకి వున్న సంభావ్య అర్థాలు మూడింటినీ పరిశీలిద్దాం.

ప్రతిఒక్క జాతీయోద్యమ ఆరంభంలోనూ సహజంగానే నాయకత్వం వహించే బూర్జువావర్గం, అన్ని జాతీయ ఆకాంక్షల సమర్థన ఆచరణాత్మకమని చెప్తుంది. కానైతే, జాతుల సమస్యలో (అన్ని యితర సమస్యల్లో మాదిరిగానే) కార్మికవర్గ విధానం బూర్జువా వర్గాన్ని ఒక నిర్దిష్ట దిశలో మాత్రమే సమర్థిస్తుంది గాని, అది బూర్జువా విధానంతో ఎన్నడూ ఏకీభవించదు. జాతీయ శాంతి సాధనకోసమూ (శాంతిని బూర్జువావర్గం ఎన్నడూ పూర్తిగా సాధించలేదు, సంపూర్ణ ప్రజాస్వామ్యంతో మాత్రమే శాంతి సాధన సంభవం), సమాన హక్కులను సాధించి వర్గ పోరాటానికి అత్యుత్తమ పరిస్థితులను కల్పించేందు

కోసమూ మాత్రమే కార్మికవర్గం బూర్జువావర్గాన్ని సమర్థిస్తుంది. అందుచేత, జాతీయ సమస్యలో బూర్జువావర్గపు ఆచరణాత్మకతకి వ్యతిరేకంగా శ్రామికులు తమ సూత్రాలను ముందుకు తెస్తారు. వాళ్లెప్పుడూ కూడా బూర్జువావర్గానికి షరతులతో కూడిన తోడ్పాటు మాత్రమే యిస్తారు. జాతీయ సమస్యలో ప్రతిఒక్క బూర్జువావర్గమూ చెయ్యాలనుకునేది యేమిటంటే, తన సొంత జాతికి ప్రత్యేక సౌకర్యాలు సాధించుకోవడం, లేక తనకి అసాధారణ ప్రయోజనాలు సాధించుకోవడమూ; ఇదే "ఆచరణాత్మకత" అని పిలవబడుతూ వుంటుంది. శ్రామికవర్గం అన్ని ప్రత్యేక సౌకర్యాలకీ, అన్ని ప్రత్యేకతలకీ వ్యతిరేకం. అది "ఆచరణాత్మకంగా" ఉండాలని డిమాండు చెయ్యడమంటే అర్థం బూర్జువావర్గపు నాయకత్వాన్ని అనుసరించడం, అవకాశవాదంలోకి జారడమే.

ఏ జాతి అయినా విడిపోవాలని కోరుకున్నప్పుడు "ఔననో" లేక "కాదనో" జవాబు చెప్పాలన్న డిమాండు చాలా "ఆచరణాత్మకమైనదిగా" కనిపించవచ్చు. నిజానికి అది అసంగతమైన డిమాండు. సిద్ధాంతరీత్యా అది అధిభౌతికమైనది, కాగా ఆచరణలో అది శ్రామిక వర్గాన్ని బూర్జువావర్గ విధానానికి లోబరచేందుకు దారితీస్తుంది. బూర్జువావర్గం ఎప్పుడూ కూడా తన జాతీయ డిమాండ్లను అన్నిటికన్న ముందుపెడుతూ వుంటుంది. శ్రామికవర్గానికి సంబంధించి యీ డిమాండ్లు వర్గపోరాట ప్రయోజనాలకు లోబరచబడతాయి. బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ఒక ప్రత్యేక జాతి మరో జాతినుంచి విడిపోవడంలో ముగుస్తుందో, లేక రెండోదానితో దాని సమానత్వంలో ముగుస్తుందో సైద్ధాంతికంగా మనం ముందే చెప్పలేం. ఈ రెండు సందర్భాల్లోనూ కూడా శ్రామికవర్గానికి సంబంధించి ముఖ్యమైన విషయం యేమిటంటే, తన వర్గాభివృద్ధిని ధ్రువీకరించుకోవడం. బూర్జువావర్గానికి సంబంధించి ముఖ్య విషయం యేమిటంటే, తన "సొంత" జాతి ఆశయాలను శ్రామికవర్గ ఆశయాలకంటె ముందుకు నెట్టి, శ్రామికవర్గపు యీ అభివృద్ధిని కుంటుబరచడం. అందుకని శ్రామికవర్గం ఏ జాతికీ హామీలు యివ్వకుండా, మరో జాతిని నష్టపరచి ఏమి యిచ్చేందుకూ పూనుకోకుండా స్వయంనిర్ణయ హక్కు అనే ప్రతికూల డిమాండు గుర్తింపుకి తనని తాను పరిమితం చేసుకుంటుంది.

ఇది "ఆచరణాత్మకం" కాకపోవచ్చు, కాని సంభావ్య పరిష్కారాలు అన్నింట్లోనూ యిది ఆచరణలో అత్యంత ప్రజాస్వామికమైనది. ఇతర జాతుల పరిస్థితి (లేక సంభావ్య యిబ్బందులు) యేమిటన్నదానితో ప్రసక్తి లేకుండా, ప్రతిఒక్క దేశపు బూర్జువావర్గమూ తన "సొంత" ప్రయోజనాలకు హామీని కోరగా, శ్రామికవర్గానికి అలాంటి హామీలు మాత్రమే అవసరం.

బూర్జువావర్గం నిర్దిష్టమైన డిమాండు "సాధ్యత"లో అన్నింటికన్న ఎక్కువగా

ఆసక్తమై వుంటుంది — అందుకే అది శ్రామికవర్గానికి నష్టదాయకంగా, యితర జాతుల బూర్జువావర్గంతో రాజీపడే విధానాన్ని విధిగా అనుసరిస్తుంది. అయితే, శ్రామికవర్గానికి సంబంధించి మాత్రం ముఖ్యమైనది యేమిటంటే, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా తన వర్గాన్ని పటిష్ఠంచేసుకోవడం, సుసంగతమైన ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాలలో జన బాహుళ్యాన్ని తీర్చిదిద్దడం.

అవకాశవాదులకు సంబంధించినంతవరకు యిది "ఆచరణాత్మకం" కాకపోవచ్చు, కాని, ఫ్యూడల్ భూస్వాముల, జాతీయవాద బూర్జువావర్గ ప్రసక్తి లేకుండా, అదొక్కటే వాస్తవమైన హామీ, అధికతర జాతీయ సమానత్వానికీ, శాంతికీ అదొక్కటే వాస్తవమైన హామీ.

జాతీయ సమస్యలో శ్రామికుల యావత్తు కర్తవ్యమూ, ప్రతిఒక్క దేశపు జాతీయవాద బూర్జువావర్గపు దృక్పథంలోనూ, "అనాచరణీయమైనది." ఎందుచేతంటే, శ్రామికులు, అన్ని రకాల జాతీయవాదానికీ వ్యతిరేకులు, "సర్వసామాన్య" సమానత్వాన్ని డిమాండు చేస్తారు. సూత్ర రీత్యా, అవెంత స్వల్పమైనవైనా సరే, విశేష హక్కులంటూ ఉండకూడదని శ్రామికులు డిమాండుచేస్తారు. ఈ విషయాన్ని గ్రహించడంలో విఫలమైన రోజా లుక్సెంబర్గ్, ఆచరణాత్మకతపట్ల తనకు పొరపాటుగా వున్న ప్రశంసా దృష్టి కారణంగా, అవకాశ వాదులకూ, ప్రత్యేకించి మహా రష్యన్ జాతీయవాదానికి అవకాశవాద రాయితీలకీ వాకిలి బార్లా తెరిచింది.

మహా రష్యన్ ఎందుకు? ఎందుకంటే, రష్యాలో మహా రష్యన్లు ఒక పీడక జాతివాళ్లు. జాతీయ సమస్యలో అవకాశవాదం పీడిత జాతుల్లోనూ, యితర పరిస్థితుల్లోనే పీడక జాతుల్లోనూ వ్యక్తమవుతుంది.

తన డిమాండ్లు "ఆచరణాత్మకమైనవి" అన్న వాదంతో పీడిత జాతుల బూర్జువా వర్గం తన ఆకాంక్షలను నిర్ద్వంద్వంగా బలపరచమని శ్రామికవర్గానికి విజ్ఞప్తిచేస్తుంది. అన్ని జాతులకీ విడిపోయే హక్కుకు అనుకూలంగా కాక, ఒక ప్రత్యేక జాతి విడిపోయేందుకు అనుకూలంగా స్పష్టంగా "ఔను" అని చెప్పడమే మిక్కిలి ఆచరణాత్మకమైన క్రమం!

అలాంటి ఆచరణాత్మకతకి శ్రామికవర్గం వ్యతిరేకం. సమానత్వాన్నీ, జాతీయ రాజ్యాన్ని కలిగివుండే విషయంలో సమాన హక్కుల్నీ గుర్తిస్తూ, శ్రామికవర్గం అన్ని జాతుల కార్మికుల పొత్తునూ అన్నిటికన్న ఎక్కువ విలువైనదిగా పరిగణించి, దానికి అగ్రస్థానాన్ని యిస్తుంది; ఏ జాతీయ డిమాండునైనా, ఏ జాతి విడిపోవడాన్నైనా కార్మికుల వర్గపోరాట దృక్కోణం నుంచి అంచనావేస్తుంది. ఆచరణాత్మకత అనే నినాదం నిజానికి బూర్జువా ఆకాంక్షలను సవిమర్శకంగా పరిశీలించకుండా యథాతథంగా అనుసరించే నినాదం.

విడిపోయే హక్కుని సమర్థించడం ద్వారా, పీడిత జాతుల బూర్జువా జాతీయవాదాన్ని

బలపరుస్తున్నామని మాకు చెప్తున్నారు. రోజా లుక్సెంబుర్గ్ చెప్తున్నది యిదే, ఆమె వాదాన్నే వల్లిస్తున్నాడు అవకాశవాది సెమ్‌కోవ్‌స్కీ. అన్నట్లు యీ సెమ్‌కోవ్‌స్కీ ఎవరనుకున్నారు, రద్దువాద పత్రికలో యీ సమస్యమీద రద్దువాద భావాలను వ్యక్తంచేసిన ఏకైక ప్రతినిధి!

దీనికి నా సమాధానం ఏమిటంటే: అట్బే, యీ సమస్యకి "ఆచరణాత్మక" పరిష్కారం ముఖ్యమైనది బూర్జువావర్గానికే. కార్మికులకి ముఖ్యమైనది సూత్రరీత్యా రెండు ధోరణులనూ వేరుచేయడం. పీడిత జాతి బూర్జువావర్గం పీడక జాతితో పోరాడుతుంది కాబట్టి, మేమెప్పుడూ, ప్రతి సందర్భంలోనూ, మిగతా ఎవ్వరికంటే దృఢతరంగా, దానికి అనుకూలం. పీడనకి మేము మిక్కిలి సూత్రబద్ధమైన, మిక్కిలి సుసంగతమైన శత్రువులం కావడమే యిందుకు కారణం. అయితే పీడిత జాతి బూర్జువావర్గం తన సొంత బూర్జువా జాతీయ వాదానికే అనుకూలంగా నిలబడే మేరకు, మేము దానికి వ్యతిరేకం. పీడక జాతి విశేష హక్కులకీ, హింసకీ వ్యతిరేకంగా మేము పోరాడుతాం, విశేష హక్కుల విషయంలో పీడిత జాతి ఆకాంక్షలను సైతం ఎంతమాత్రం సహించం.

మన రాజకీయ ఆందోళనలో విడిపోయే హక్కు నినాదాన్ని ముందుకు తెచ్చి, సమర్థించడంలో మనం విఫలమైతే, మనం ఒక్క బూర్జువావర్గపు చేతుల్లోకే కాకుండా, ఫ్యూడల్ భూస్వాముల చేతుల్లోకీ, పీడక జాతి నిరంకుశత్వం చేతుల్లోకీ పోతాం. కౌట్స్కీ చాలా కాలం క్రితమే యీ వాదాన్ని రోజా లుక్సెంబుర్గ్‌కి వ్యతిరేకంగా వాడాడు, మరి ఆ వాదం నిర్వివాదమైనది. పోలండు జాతీయ బూర్జువావర్గానికి "తోడ్పాటు" యివ్వరాదన్న తన భయం మూలంగా, రష్యాలో మార్క్సిస్టుల కార్యక్రమంలోని విడిపోయే హక్కుని రోజా లుక్సెంబుర్గ్ తిరస్కరిస్తున్నప్పుడు, నిజానికి ఆమె మహా రష్యన్ల నల్లనూర్లవాళ్లకి తోడ్పడుతోంది. నిజానికి ఆమె మహా రష్యన్ల విశేష హక్కుల (విశేష హక్కులకంటే అధ్వాన్నం) అవకాశవాద సహనానికి తోడ్పడుతోంది.

పోలండులోని జాతీయవాద వ్యతిరేక పోరాటంతో కొట్టుకుపోయిన రోజా లుక్సెంబుర్గ్, మహా రష్యన్ల జాతీయవాదాన్ని — ప్రస్తుతం యీ జాతీయవాదమే మిక్కిలి అధ్వాన్నమైనదైనప్పటికీ — విస్మరించింది. అది బూర్జువాకన్న, ఎక్కువ ఫ్యూడల్ జాతీయవాదం, అది ప్రజాస్వామ్యానికీ, శ్రామికవర్గ పోరాటానికీ ప్రధాన ఆటంకం. ఏ పీడిత జాతి బూర్జువా జాతీయవాదంలోనైనా పీడనకి వ్యతిరేకంగా ఉన్ముఖమైన సాధారణ ప్రజాతంత్ర సారాంశం వుంటుంది, మరి మనం నిర్ద్వంద్వంగా సమర్థించేది యీ సారాంశాన్నే. అదే సమయంలో, దాన్ని మనం కచ్చితంగా జాతీయ ప్రత్యేకతా ధోరణినుంచి వేరుచేసి చూస్తాం. యూదులు వగైరా, వగైరాలను పీడించే పోలిష్ బూర్జువా ధోరణికి వ్యతిరేకంగా మనం పోరాడుతాం.

బూర్జువా దృష్టిలోనూ, కూపస్థమండూకపు దృష్టిలోనూ యిది "అనాచరణా

త్మకమైనది.'' కాని, జాతీయ సమస్యలో స్వాతంత్ర్య ప్రాతిపదిక కలిగిన ఆచరణాత్మక విధానం యిదొక్కటే, యిదొక్కటే ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛనీ, శ్రామికవర్గ ఐక్యతనీ పెంపొందిస్తుంది.

అన్ని జాతులకీ విడిపోయే హక్కు గుర్తింపు; విడిపోవడానికి సంబంధించిన ప్రతిఒక్క నిర్దిష్ట సమస్యనూ అన్ని రకాల అసమానత్వాన్నీ, విశేష హక్కుల్నీ, విశిష్టతలనీ తొలగించే దృష్ట్యా అంచనావెయ్యడం.

పీడక జాతి వైఖరిని మనం పరిశీలిద్దాం. ఏ జాతి అయినా యితర జాతుల్ని అణచేట్లయితే, ఆ జాతి స్వేచ్ఛ కలిగి ఉండగలదా? ఉండలేదు. మహా రష్యన్ జనాభా* స్వేచ్ఛా ప్రయోజనాలకు అలాంటి పీడనకి వ్యతిరేకంగా పోరాటం అవసరం. పీడిత జాతుల ఉద్యమాల అణచివేత సుదీర్ఘ, శతాబ్దాల చరిత్రా, అలాంటి అణచివేతకి అనుకూలంగా "పై" వర్గాలు క్రమబద్ధంగా చేసే ప్రచారమూ, దురభిమానాలు వగైరాల రూపంలో, మహా రష్యన్ ప్రజల స్వాతంత్ర్య లక్ష్యానికి బృహత్తరమైన ఆటంకాలను కల్పించింది.

మహా రష్యన్ల నల్లనూర్లవాళ్ళు యీ దురభిప్రాయాలను బుద్ధిపూర్వకంగా పెంపొందించి, వాటిని ప్రోత్సహిస్తారు. మహా రష్యన్ బూర్జువావర్గం వాటిని సహిస్తుంది లేక మన్నిస్తుంది. మహా రష్యన్ శ్రామికవర్గం యీ దురభిప్రాయాలను క్రమబద్ధంగా ఖండించనిదే, తన సొంత లక్ష్యాలను సాధించుకోలేదు లేక తన స్వాతంత్ర్యానికి మార్గాన్ని సుగమం చేసుకోలేదు.

రష్యాలో, స్వతంత్ర జాతీయ రాజ్య స్థాపన, ప్రస్తుతానికి, కేవలం మహారష్యన్ జాతి విశేష హక్కుగా వుంది. ఎలాంటి విశేష హక్కుల్నీ సమర్థించని మహా రష్యన్ శ్రామికులమైన మనం, యే విశేష హక్కునీ సమర్థించం. ఒక నిర్దిష్ట రాజ్యపు గడ్డమీద మనం పోరాడుతున్నాం; ఈ రాజ్యంలో నివసించే అన్ని జాతులకు చెందిన కార్మికులనూ మనం ఐక్యంచేస్తాం; మనం ప్రత్యేకించి ఏ ఒక్క నిర్దిష్ట జాతీయాభివృద్ధి పంథాకీ పూచీ పడలేం. సాధ్యమైన అన్ని మార్గాల్లోనూ మన వర్గ గమ్యానికి మనం సాగిపోతున్నాం. కాని, మనం అన్ని రకాల జాతీయవాదానికీ వ్యతిరేకంగా పోరాడి, వివిధ జాతుల సమా

* పారిస్‌లోని ఒకానొక ఎల్. వ్ల. యీ మాటని మార్క్సిస్టు వ్యతిరేకమైనదిగా పరిగణిస్తున్నాడు. ఈ ఎల్. వ్ల. వినోదం కలిగించేటంతగా "superklug" ("అతి తెలివిపరుడు"). ఈ "అతి తెలివిపరుడైన" ఎల్. వ్ల. మన కనీస కార్యక్రమం[77]నుంచి (వర్గపోరాటం దృష్ట్యా!) "జనాభా," "జాతి," వగైరా మాటల తొలగింపుని గురించి ఒక వ్యాసం రాయసంకల్పించాడనడం సువ్యక్తం.

సత్వాన్ని సమర్థించనిదే ఆ గమ్యం దిశగా పురోగమించలేం. ఉదాహరణకు, ఉక్రెయిన్ ఒక స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకోగలదా, లేదా అన్న విషయం సవాలక్ష అనూహ్య అంశాల చేత నిర్ణయింపబడుతుంది. శుష్కమైన "ఊహలు చేసేందుకు" ప్రయత్నించకుండా, నిస్సంశయమైనదైన అలాంటి రాజ్యాన్ని స్థాపించుకునేందుకు ఉక్రెయిన్‌కి వున్న హక్కును మనం దృఢంగా సమర్థిస్తాం. మనం యీ హక్కును గౌరవిస్తాం. ఉక్రేనియన్లకి సంబంధించి మహా రష్యన్లకి వున్న విశేష హక్కుల్ని మనం సమర్థించం. ఏ జాతికైనా సరే రాజ్యపు విశేష హక్కుల్ని తిరస్కరించే దృష్టిలో, జాతుల ఆ హక్కుని గుర్తించే విషయంలో జన బాహుళ్యాన్ని మనం తీర్చిదిద్దుతాం.

బూర్జువా విప్లవాల కాలంలో అన్ని జాతులూ వేసిన ముందంగల్లో, జాతీయ రాజ్యం కలిగివుండే హక్కు విషయంలో కొట్లాటలూ, పోరాటాలూ సాధ్యమూ, సంభవమే. శ్రామికులమైన మనం మహా రష్యన్ విశేష హక్కులకి వ్యతిరేకులమనీ, మన యావత్తు ప్రచారానికీ, ఆందోళనకీ యిదే మార్గదర్శక సూత్రమనీ ముందుగానే చాటిచెస్తాం.

"ఆచరణాత్మకత"కోసం తన వెతుకులాటలో రోజా లుక్సెంబుర్గ్, మహారష్యన్ శ్రామికవర్గపు, తదితర జాతుల శ్రామికవర్గపు ప్రధానమైన ఆచరణాత్మక కర్తవ్యాన్ని విస్మరిస్తోంది: అదేమిటంటే, అన్ని రాజ్య, జాతీయ విశేష హక్కులకీ వ్యతిరేకంగానూ, తమతమ జాతీయ రాజ్యాలను కలిగివుండేందుకూ అన్ని జాతులకూ వున్న హక్కుకోసం, సమాన హక్కుకోసమూ రోజువారీ ఆందోళన, ప్రచారం. జాతీయ సమస్యలో (ప్రస్తుతం) మన ప్రధాన కర్తవ్యం యిదే. ఎందుకంటే, యీ పద్ధతిలో మాత్రమే ప్రజాస్వామ్య ప్రయోజనాలనూ, సమాన ప్రాతిపదికమీద అన్ని జాతుల అందరు శ్రామికుల పొత్తునూ మనం కాపాడగలం.

మహా రష్యన్ పీడకుల దృష్టిలోనూ, అలాగే పీడిత జాతుల బూర్జువావర్గం దృష్టిలోనూ యీ ప్రచారం "అనాచరణాత్మకం" కావచ్చు. (వీళ్లిద్దరూ కూడా నిశ్చయంగా "ఔను" లేక "కాదు" అన్న సమాధానాన్ని డిమాండు చేస్తారు, సోషల్ డెమోక్రట్లమీద "అస్పష్టంగా" ఉన్నారని ఆరోపిస్తారు.) నిజానికి యీ ప్రచారం, యీ ప్రచారం మాత్రమే, జనబాహుళ్యాన్ని నికార్సైన ప్రజాస్వామిక పద్ధతిలో, నికార్సైన సోషలిస్టు పద్ధతిలో తీర్చి దిద్దడాన్ని రూఢిపరుస్తుంది. రష్యా బహుళజాతి రాజ్యంగా మిగలాలంటే, వేర్వేరు జాతీయ రాజ్యాలుగా మిక్కిలి శాంతియుతమైన (శ్రామికవర్గ వర్గపోరాటానికి హానిరహితమైన) విభజన జరగాలంటే (అలాంటి విభజన సమస్య ఉత్పన్నమైతే), రష్యాలో జాతీయ శాంతికి అత్యధిక అవకాశాలను రూఢంచేసే ప్రచారం యిదొక్కటే.

జాతీయ సమస్యలో యీ విధానాన్ని — ఒకేఒక శ్రామికవర్గ విధానాన్ని — మరింత నిర్దిష్టంగా వివరించేందుకుగాను, ''జాతుల స్వయంనిర్ణయం''పట్ల మహా రష్యన్ ఉదార వాదపు వైఖరినీ, స్వీడన్‌నుంచి నార్వే విడిపోవడానికి సంబంధించిన ఉదాహరణనీ మనం పరిశీలిద్దాం.

# 5. జాతీయ సమస్యలో ఉదారవాద బూర్జువావర్గమూ, సోషలిస్టు అవకాశవాదులూ

రష్యన్ మార్క్సిస్టుల కార్యక్రమానికి వ్యతిరేకంగా తను చేసే పోరాటంలో రోజా లుక్సెంబుర్గ్ ఉపయోగించే ''తురుపు ముక్కల్లో'' యీకింది వాదన ఒకటి అన్న సంగతి మనం చూశాం: స్వయంనిర్ణయ హక్కు గుర్తింపు అన్నది పీడిత జాతుల బూర్జువా జాతీయ వాదాన్ని సమర్థించడంతో సమానం. మరోవైపున, ఈ హక్కుకి అర్థం, యితర జాతుల పట్ల సమస్త హింసకీ వ్యతిరేకంగా పోరాడటం మాత్రమే అని మనం అనుకుంటే, ఆ కార్య క్రమంలో దీన్ని గురించి ఒక ప్రత్యేక క్లాజుని చేర్చవలసిన అవసరం లేదు. ఎందుకంటే, సోషల్ డెమోక్రట్లు మొత్తంమీద, సమస్త జాతీయ పీడనకీ, అసమానతలకీ వ్యతిరేకులు.

మొదటి వాదన, కౌట్స్కీ సుమారు యిరవై ఏళ్ళక్రితం తిరుగులేని పద్ధతిలో రుజువు చేసినట్లు, తన సొంత జాతీయవాదానికిగాను యితరులను దూషించిన సందర్భం. పీడిత జాతుల జాతీయవాదంపట్ల తనకి వున్న భయం కారణంగా, రోజా లుక్సెంబుర్గ్ వాస్తవంలో మహా రష్యన్ల నల్లనూర్లవాళ్ల జాతీయవాదపు చేతుల్లో పడుతోంది! ఆమె రెండవ వాదన, జాతీయ సమానత్వపు గుర్తింపులో విడిపోయే హక్కు గుర్తింపు యిమిడివుందా, లేదా అన్న సమస్యను వాస్తవానికి బెరుకుగా దాటవెయ్యడమే తప్ప మరేమీ కాదు. విడిపోయే హక్కు యిమిడివుంటే, రోజా లుక్సెంబుర్గ్, సూత్రరీత్యా, మన కార్యక్రమంలోని 9వ క్లాజు సరైనదని ఆమోదించినట్లు. లేకపోతే, ఆమె జాతీయ సమానత్వాన్ని గుర్తించదన్న మాట. తక్కిడిబిక్కిడి చేసి, దాటవేసినందువల్ల వ్యవహారం యిక్కడ పరిష్కారం కాదు!

అయితే, యీ వాదనలనీ, యిలాంటి యితర వాదనలన్నింటినీ పరీక్షకి గురిచేసే అత్యుత్తమ మార్గం ఏమిటంటే, యీ సమస్యపట్ల సమాజంలోని వివిధ వర్గాల వైఖరిని అధ్యయనం చెయ్యడం. మార్క్సిస్టుకి యీ పరీక్ష అన్నది విధిగా చెయ్యవలసిన పని. వస్తుపరమైనదాన్నుంచి మనం బయల్దేరాలి. ఈ అంశంమీద వర్గాల మధ్య సంబంధాలను మనం

పరిశీలించాలి. అలా చెయ్యడంలో విఫలమవడంతో రోజా లుక్సెంబుర్గ్, ఏ అధిభౌతికవాదం, సాధారణీకరణలూ, శుష్క ప్రవచనాలూ, విచక్షణారహితమైన ప్రకటనలూ వగైరా నేరాలకు పాల్పడ్డారని తన ప్రత్యర్థులను ఆడిపోసేందుకు వృథా ప్రయత్నం చేసిందో, సరిగా అవే దోషాలకు తను పాల్పడింది.

రష్యన్ మార్క్సిస్టుల కార్యక్రమాన్ని, అంటే, రష్యాలోని అన్ని జాతుల మార్క్సిస్టుల కార్యక్రమాన్ని మనమిక్కడ చర్చిస్తున్నాం. మరి అలాంటప్పుడు రష్యా పాలక వర్గాల వైఖరిని మనం పరిశీలించవలసిన అవసరం లేదా?

"బ్యూరాక్రసీ" (యీ సరియైనది కాని పదం వాడినందుకు నన్ను మన్నింతురుగాక), మన సమైక్య ప్రభువర్గం తరహా ఫ్యూడల్ భూస్వాముల వైఖరి సువిదితమే. జాతుల సమానత్వం, స్వయంనిర్ణయ హక్కు — యీ రెండింటినీ వాళ్లు తప్పకుండా తిరస్కరిస్తారు. వాళ్లది భూదాసుల రోజులకు చెందిన యీకింది పాత నినాదం: నిరంకుశత్వం, క్రైస్తవ మతం, జాతీయతత్వం — యీ చివరి పదం మహా రష్యన్ జాతికి మాత్రమే వర్తిస్తుంది. ఉక్రేనియన్లు సైతం "రష్యనేతరులు"గా చాటబడ్డారు. వాళ్ల మాతృభాష సైతం అణచివెయ్యబడుతోంది.

రష్యన్ బూర్జువావర్గాన్ని కొంచెం పరికిద్దాం. "జూన్ 3వ తేదీ"[78] చట్టపరమూ, పరిపాలన సంబంధమూ అయిన వ్యవస్థ మేరకు రష్యన్ బూర్జువావర్గానికి అధికారంలో పాత్ర — అతి స్వల్ప పాత్రేనన్నమాట నిజమేననుకోండి — "వహించవలసివచ్చింది." ఈ సమస్యలో అక్టోబరిస్టులు దక్షిణపక్షీయుల్ని అనుసరిస్తున్నారని రుజువుచేసేందుకు ఎక్కువ మాటలు చెప్పాల్సిన అవసరం లేదు. మహా రష్యన్ ఉదారవాద బూర్జువావర్గం, ప్రోగ్రెసిస్టులు,[79] కాడెట్లు వైఖరిపట్ల కొందరు మార్క్సిస్టులు దురదృష్టవశాత్తూ చూపవలసినదానికంటె చాలా తక్కువ శ్రద్ధ చూపుతున్నారు. కాగా ఆ వైఖరిని అధ్యయనంచేసి, దాన్ని గురించి శ్రద్ధగా ఆలోచించడంలో విఫలమైనవాడు, జాతుల స్వయంనిర్ణయ హక్కు సమస్యను చర్చించే క్రమంలో సాధారణీకరణల్లోనూ, ఆధారరహితమైన ప్రకటనల్లోనూ కొట్టుమిట్టాడుతాడు.

"అప్రియమైన" ప్రశ్నలకు సూటి సమాధానాలను లౌక్యంగా తప్పించుకోవడంలో నిపుణమైనదే అయినప్పటికీ కాన్స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ ప్రధాన పత్రిక అయిన "రేచ్"[80] గత సంవత్సరం "ప్రావ్దా"తో జరిగిన వివాదంలో కొన్ని విలువైన ఒప్పుకోళ్లకి దిగిరావలసివచ్చింది. 1913 వేసవిలో ల్వోవ్‌లో జరిగిన అఖిల ఉక్రెయిన్ విద్యార్థి మహాసభ[81] విషయంలో తంటా మొదలైంది. "ఉక్రేనియన్ వ్యవహారాల నిపుణుడు" లేక "రేచ్"కి ఉక్రేనియన్ విలేకరి మొగిలాన్‌స్కీ ఒక వ్యాసం రాశాడు. అందులో అతను ఉక్రెయిన్ విడి

పోవాలన్న భావంమీద ఘాటైన దూషణ కురిపించాడు ("ప్రలాపాలు," "దుందుడుకు వాదం," వగైరా). విడిపోవడానికి సంబంధించిన యీ భావాన్ని జాతీయవాద సోషలిస్టు అయిన దొన్‌త్సోవ్ ప్రతిపాదించగా, పైన పేర్కొనబడిన మహాసభ ఆమోదించింది.

దొన్‌త్సోవ్‌తో తను ఏ విధంగానూ ఏకీభవించక, అతను జాతీయవాద సోషలిస్టు అనీ, చాలామంది ఉక్రేనియన్ మార్క్సిస్టులు అతనితో ఏకీభవించలేదనీ విస్పష్టంగా ప్రకటించి, "రేచ్" ధోరణి, లేక, యీ సమస్యను అది సూత్రీకరించిన పద్ధతి, ఒక మహా రష్యన్ ప్రజాతంత్రవాదికి, ఆమాటకి వస్తే ప్రజాతంత్రవాదిగా చలామణీ అవాలని వాంఛించే ఏ వ్యక్తికైనాకూడా అయుక్తమైనదీ, నిందార్హమైనదీ అని "రబోచయ ప్రావ్ద"[82] పేర్కొంది. "రేచ్"ని, కావాలని అనుకుంటే దొన్‌త్సోవ్‌లను ఖండించనివ్వండి. కాని, సూత్ర దృష్ట్యా, మహా రష్యన్ ప్రజాస్వామ్య పత్రికనని చెప్పుకొంటున్న ఒక పత్రిక, విడిపోయే స్వేచ్ఛనీ, విడిపోయే హక్కునీ పట్టించుకోకుండా ఉండజాలదు.

కొద్ది నెలల తర్వాత, "రేచ్" 331వ సంచిక, దొన్‌త్సోవ్ సమాధానం గురించి ల్వోవ్‌లో ప్రచురింపబడే ఉక్రేనియన్ పత్రిక "ష్ల్యాహి"[83] ద్వారా తెలుసుకున్న మొగిలాన్‌స్కీ దగ్గర్నుంచి, ఒక "సంజాయిషీ"ని ప్రచురించింది. తన సమాధానంలో, సందర్భవశాత్తూ, దొన్‌త్సోవ్ యిలా పేర్కొన్నాడు: "'రేచ్'లోని జాతీయ దురహంకారపూరిత దాడులను ఒక్క రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పత్రికలు మాత్రమే సక్రమంగా ఖండించాయి (ముద్ర వేశాయి?)." "దొన్‌త్సోవ్ సూచనల విమర్శకీ" "జాతుల స్వయంనిర్ణయ హక్కు తిరస్కృతికీ ఉమ్మడి అంశమేమీ లేదు" అంటూ మూమ్మారు వల్లింపబడిన ప్రకటనతో ఈ "సంజాయిషీ" కూడివుంది.

> మొగిలాన్‌స్కీ యిలా రాశాడు: "'జాతుల స్వయంనిర్ణయ హక్కు' సైతం విమర్శనాతీతమైన సంకేతారాధన (గుర్తుంచుకోండి!!) కాదని చెప్పవలసివుంది: జాతుల జీవితంలోని అనారోగ్యకర పరిస్థితులు జాతీయ స్వయంనిర్ణయంలో అనారోగ్యకర ధోరణులను ఉత్పన్నంచెయ్యవచ్చు, యివి వెలుగులోకి తీసుకురాబడ్డాయన్న వాస్తవానికి జాతుల స్వయంనిర్ణయ హక్కు తిరస్కరించబడిందని అర్థం కాదు."

మీరు చూస్తున్నదే కదా, "సంకేతారాధన" గురించిన యీ ఉదారవాది మాటలు రోజా లుక్సెంబుర్గ్ మాటలకు పూర్తి అనుగుణంగా వున్నాయి. రాజకీయ స్వయంనిర్ణయ హక్కుకి, అంటే, విడిపోయే హక్కును ఆయన గుర్తిస్తున్నాడా, లేదా అన్న ప్రశ్నకి సూటి సమాధానం యివ్వకుండా దాటవేసేందుకు మొగిలాన్‌స్కీ ప్రయత్నిస్తున్నాడనడం స్పష్టం.

"ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద"[84] పత్రిక (1913, డిసెంబరు 11 నాటి 4వ సంచిక) కూడా, మొగిలాన్‌స్కీకీ, కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీకీ సూటిగా యీ ప్రశ్న వేసింది.

అందుమీదట "రేచ్" (340వ సంచిక) యీ ప్రశ్నకు సమాధానమిస్తూ, సంతకంలేని, అంటే అధికారికమైన, సంపాదకీయ ప్రకటన ప్రచురించింది. ఈ సమాధానాన్ని పరిశీలిస్తే యీకింది మూడు అంశాలు తేలుతాయి:

1) కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ కార్యక్రమపు 11వ క్లాజు "స్వేచ్ఛాయుత సాంస్కృతిక స్వయంనిర్ణయ హక్కు" గురించి సూటిగా, కచ్చితంగా, స్పష్టంగా చెప్తుంది.

2) "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" స్వయంనిర్ణయాన్ని వేర్పాటువాదంతోనూ, ఆయా జాతులు విడిపోవడంతోనూ "దారుణంగా గందరగోళంచేస్తోంది" అని "రేచ్" ధృవీకరిస్తోంది.

3) "నిజంగా, రష్యన్ రాజ్యంనుంచి 'జాతులు విడిపోయే' హక్కును సమర్థించేందుకు కాడెట్లు ఎన్నడూ కట్టుబడిలేరు." (1913, డిసెంబరు 20వ తేదీనాటి "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" 12వ సంచికలోని "జాతీయ ఉదారవాదం, జాతుల స్వయంనిర్ణయ హక్కు" అనే వ్యాసాన్ని చూడండి.)

"రేచ్" చెప్పినదాంట్లోని రెండవ అంశాన్ని ముందు పరిశీలిద్దాం. "స్వయంనిర్ణయం" అన్న పదంయొక్క "అస్పష్టత," లేక "అనిర్దిష్టత" అనబడేదాన్ని గురించి సెమ్‌కోవ్‌స్కీలూ, లీబ్‌మన్‌లూ, యుర్కేవిచ్‌లూ, తదితర అవకాశవాదులూ లేవదీసిన అల్లరీ, పెడబొబ్బలూ నిజానికి, అంటే, రష్యాలోని వస్తుపరమైన వర్గసంబంధాలు, వర్గపోరాటం దృష్ట్యా, ఉదారవాద రాజరిక బూర్జువావర్గపు మాటలను కేవలం అటూయిటూ తిప్పి చెప్పడం తప్ప మరేమీ కాదన్న విషయాన్ని వాళ్లకి ఎంత స్ఫుటంగా చూపుతుంది!

"ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" "రేచ్"కి చెందిన విజ్ఞాన ప్రబుద్ధులైన "కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్" పెద్దమనుషులకి యీకింది మూడు ప్రశ్నలు వేసింది: 1) అంతర్జాతీయ ప్రజాస్వామ్యపు యావత్తు చరిత్రలోనూ, ప్రత్యేకించి 19వ శతాబ్ది మధ్యనుంచీ, జాతుల స్వయంనిర్ణయం అన్నది సరిగ్గా రాజకీయ స్వయంనిర్ణయ హక్కుగానూ, స్వతంత్ర జాతీయ రాజ్య స్థాపన హక్కుగానే అర్థంచేసుకోబడిందన్న విషయాన్ని వాళ్లు కాదంటారా? 2) 1896లో లండన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహాసభ ఆమోదించిన సుప్రసిద్ధ తీర్మానపు అర్థం అదేననడాన్ని వాళ్లు కాదంటారా? 3) ప్లెహానొవ్ ఎన్నడో 1902లో స్వయంనిర్ణయాన్ని గురించి రాసినప్పుడు, సరిగ్గా రాజకీయ స్వయం

నిర్ణయం అన్న అర్థంలోనే ఆయన యీ పదాన్ని ఉద్దేశించాడనడాన్ని వాళ్లు కాదంటారా? "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" యీ మూడు ప్రశ్నల్ని వేసినప్పుడు, కాడెట్లు నిర్వాక్కు లయ్యారు!

ఇందుకు సమాధానంగా వాళ్లు ఒక్క మాట కూడా చెప్పలేదు, చెప్పేందుకు వాళ్ల కేమీ లేకపోవడమే యిందుకు కారణం. వాళ్లు తమ మౌనం ద్వారా "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" చెప్పింది పూర్తిగా రైటని ఒప్పుకోవలసివచ్చింది.

"స్వయంనిర్ణయం" అన్న పదం అస్పష్టమైనది, సోషల్ డెమోక్రట్లు దాన్ని వేర్పాటు వాదంతో "దారుణంగా గందరగోళం చేస్తున్నారు" అంటూ ఉదారవాదులు వేసే గావు కేకలు యీ సమస్యను గందరగోళపరచేందుకూ, సార్వత్రికంగా స్థిరపడిన ప్రజాస్వామ్య సూత్రపు గుర్తింపును దాటవేసేందుకూ చేసే ప్రయత్నాలే తప్ప మరేమీ కావు. సెమ్‌కోవ్‌స్కీలూ, లీబ్‌మన్‌లూ, యుర్కేవిచ్‌లూ అంతమరీ అజ్ఞానులు కాకపోతే, కార్మికుల ముందు ఉదారవాద ధోరణిలో ప్రసంగించేందుకు సిగ్గుపడివుండేవారు.

అయితే, తర్వాతి సంగతి చూద్దాం. కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రట్ల కార్యక్రమం లోని "సాంస్కృతిక" స్వయంనిర్ణయం అన్న పదానికి ఆచరణలో అర్థం రాజకీయ స్వయం నిర్ణయ హక్కు తిరస్కృతే అన్న విషయాన్ని ఒప్పుకోక తప్పని పరిస్థితిని "రేచ్"కి "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" కల్పించింది.

"నిజానికి, రష్యన్ రాజ్యంనుంచి 'జాతులు విడిపోయే' హక్కును సమర్థించేందుకు కాడెట్లు ఎన్నడూ కట్టుబడిలేరు" – "రేచ్"నుంచి వచ్చిన యీ మాటలను మన కాడెట్ల "విధేయత"కి ఒక ఉదాహరణగా "నోవొయె వ్రేమ్య"[85]కీ, "జేమ్‌ష్చిన"[86]కీ "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" సిఫారసు చేసిందంటే అందుకు కారణం లేకపోలేదు. "యూదుల్ని" ప్రస్తావించేందుకూ, కాడెట్లని దెప్పిపొడిచేందుకూ దొరికిన ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోని "నోవొయె వ్రేమ్య," తన 13563వ సంచికలో, యిలా పేర్కొంది:

> "సోషల్ డెమోక్రట్లకు ఏదైతే రాజకీయ విజ్ఞతకి సంబంధించిన స్వయం స్పష్ట సత్యమో" (అంటే, స్వయంనిర్ణయానికీ, విడిపోయేందుకూ జాతులకి వున్న హక్కు గుర్తింపు), "అది యీనాడు కాడెట్లలో సైతం అభిప్రాయభేదాల్ని కలిగించ నారంభిస్తోంది."

తాము "రష్యన్ రాజ్యంనుంచి జాతుల విడిపోయే హక్కును సమర్థించేందుకు ఎన్నడూ కట్టుబడిలేరు" అని ప్రకటించడం ద్వారా కాడెట్లు సూత్రరీత్యా, సరిగ్గా "నోవొయె

ప్రేమ్య" తీసుకున్న వైఖరినే తీసుకున్నారు. కాడెట్ జాతీయ ఉదారవాదానికీ, పురిష్కేవిచ్‌లతో వాళ్ల సన్నిహితత్వానికీ, పురిష్కేవిచ్‌లమీద కాడెట్ల రాజకీయ, సైద్ధాంతిక, ఆచరణాత్మక పరాధీనతకీ సంబంధించిన మౌలిక అంశాల్లో సరిగ్గా యిదొకటి. "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" యిలా రాసింది: "కాడెట్లు చరిత్రని అధ్యయనం చేశారు, తమని 'పట్టుకుని అణచిపారేసేందుకు'[87] పురిష్కేవిచ్‌లకి వున్న పురాతన హక్కు అమలు, మృదువుగా చెప్పాలంటే, తరచుగా ఎలాంటి సామూహిక హత్యాకాండ మాదిరి చర్యలకి దారితీసిందో వాళ్లకి చాలా బాగా తెలుసు." పురిష్కేవిచ్‌ల సర్వశక్తిమత్వపు ఫ్యూడలిస్టు మూలం గురించీ, స్వభావం గురించీ నిర్దుష్టంగా తెలిసినా కూడా, కాడెట్లు, అదే వర్గం సృష్టించిన సంబంధాల, సరిహద్దుల ప్రాతిపదికమీద తమ వైఖరిని నిర్ణయించుకుంటున్నారు. యూరపియనేతరమూ, యూరపియన్ వ్యతిరేకమూ అయిన యీ వర్గం (జపనీయులకీ, చైనీయులకీ అసముచితంగా అవమానపరిచేదిగా అనిపించకపోయినట్లయితే, ఆసియాటిక్ అనే పదం వాడుతాం) సృష్టించిన, లేక స్థిరపరచిన సంబంధాల్లోనూ, సరిహద్దుల్లోనూ చాలానే వుందన్న విషయం పూర్తిగా తెలిసినా కూడా, కాడెట్లు, వాటినే అంతిమ పరిమితిగా ఆమోదిస్తారు.

ఈవిధంగా, వాళ్లు పురిష్కేవిచ్‌లకి అనుగుణంగా తమని తాము సరిపెట్టుకుంటున్నారు, వాళ్లముందు మోకరిల్లుతున్నారు, వాళ్ల స్థితికి ఎక్కడ అపాయం కలిగిస్తామోనని భయపడుతూ, ప్రజోద్యమంనుంచీ, ప్రజాస్వామ్యంనుంచీ వాళ్లని కాపాడుతున్నారు. "ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద" రాసినట్లు: "ఆచరణలో దీనికి అర్థం యేమిటంటే, ఫ్యూడల్ భావాలు కలిగిన భూస్వాముల ప్రయోజనాలకూ, ప్రబలజాతియొక్క మిక్కిలి హీనమైన జాతీయవాద దురభిప్రాయాలకూ — ఆ దురభిప్రాయాలకు వ్యతిరేకంగా క్రమబద్ధమైన పోరాటం జరిపేందుకు బదులు — అనుగుణంగా తమని తాము మలుచుకోవడమే."

చరిత్ర పరిజ్ఞానం కలిగి, ప్రజాతంత్రవాదులమని చెప్పుకునే కాడెట్లు, యీనాడు తూర్పు యూరప్‌కీ, ఆసియాకీ కూడా విశిష్టమై, నాగరిక పెట్టుబడిదారీ దేశాల నమూనాలో ఆ రెండు ప్రాంతాలనీ మార్చేందుకు ప్రయత్నిస్తున్న ప్రజాతంత్ర ఉద్యమం పురిష్కేవిచ్‌ల సర్వశక్తిమత్వపు యుగం, బూర్జువావర్గానికీ, పెటీబూర్జువావర్గానికీ చెందిన విస్తృత విభాగాలకు హక్కులులేనివాళ్లను చేసిన ఫ్యూడల్ యుగం నిర్ణయించిన సరిహద్దులను చెక్కుచెదరకుండా ఉంచక తప్పదన్న విషయాన్ని వక్కాణించి చెప్పేందుకైనా ప్రయత్నించరు.

"ప్రొలెతార్‌స్కయ ప్రావ్ద"కీ, "రేచ్"కీ మధ్య వివాదంలో లేవదియ్యబడిన సమస్య కేవలం సాహిత్యపరమైన సమస్య మాత్రమే కాక, ఆనాటి వాస్తవ రాజకీయ సమస్య దానిలో యిమిడివుందన్న యథార్థాన్ని, 1914 మార్చి 23–25 తేదీల్లో జరిగిన కాన్‌స్టిట్యూ

షనల్ డెమొక్రటిక్ పార్టీ చివరి కాన్ఫరెన్సు యితర అంశాలతోబాటు, రుజువుచేసింది. "రేచ్" (83వ సంచిక, 1914 మార్చి 26) ప్రచురించిన ఈ కాన్ఫరెన్సు నివేదికలో యిలా వుంది:

"జాతీయ సమస్యలమీద కూడా ప్రత్యేకించి సముత్సాహమైన చర్చ జరిగింది. కీయెవ్ ప్రతినిధులు — వీరిని ఎన్. వి. నెక్రాసొవ్, ఎ. ఎమ్. కొలుబాకిన్‌లు సమర్థించారు — జాతుల సమస్య కీలక సమస్య అవుతోందనీ, ఇప్పటిదాకా మాదిరిగా కాకుండా దాన్ని మరింత పట్టుదలగా ఎదుర్కోవాలనీ సూచించారు. అయితే కొకోష్కిన్ చెప్పాడు" (యీ "అయితే" అన్న మాట ష్చెద్రీన్ "కాని" లాంటిది — "గ్రారె తోక ఎప్పుడూ బెత్తెడే, అది అంతకంటే ఎన్నడూ ఎదగదు!"), "కార్యక్రమ, గత రాజకీయానుభవాల దృష్ట్యా 'జాతుల స్వయంనిర్ణయ హక్కు'కి సంబంధించిన 'వైకల్పిక అర్థం యిచ్చే సూత్రీకరణల విషయంలో' చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి."

కాడెట్ కాన్ఫరెన్సులోని మిక్కిలి గమనీయమైన యీ వాదనపట్ల అందరు మార్క్సిస్టులూ, అందరు ప్రజాస్వామ్యవాదులూ విశేషమైన శ్రద్ధ చూపాల్సివుంది. (నిస్సందేహంగా బాగా విషయ పరిజ్ఞానం కలిగినదీ, కొకోష్కిన్ భావాలను నిస్సందేహంగా సరిగ్గా చిత్రించే "కీయెవ్‌స్కయ మీస్ల్,"[88] తన ప్రత్యర్థులకి, ఆయన రాజ్య "విచ్ఛిత్తి"ని గురించి ప్రత్యేకమైన వక్కాణింపు హెచ్చరిక ప్రాయంగానే అనుకోండి, యిచ్చాడని జోడించడాన్ని బ్రాకెట్లలో మనం గమనిస్తాం.)

"రేచ్"లో ప్రచురింపబడిన అధికారిక నివేదిక పరమ నైపుణ్యంతో కూడిన లౌక్యంతో రూపొందించబడింది. అసలు విషయంమీది ముసుగు సాధ్యమైనంత తక్కువ తొలగించి, సాధ్యమైనంత ఎక్కువ మరుగుపరచేందుకు అది ఉద్దేశింపబడింది. అయితేనేం, కాడెట్ కాన్ఫరెన్సులో ప్రధానంగా ఏమి జరిగిందో పూర్తిగా స్పష్టపడింది. ఉక్రెయిన్‌లోని పరిస్థితులతో పరిచయం కలిగిన ఉదారవాద బూర్జువా ప్రతినిధులూ, "వామపక్ష" కాడెట్లూ సరిగ్గా జాతుల రాజకీయ స్వయంనిర్ణయ హక్కు సమస్యనే లేవనెత్తారు. లేకపోయివుంటే, యీ "సూత్రీకరణ విషయంలో" "జాగ్రత్తగా వ్యవహరించాలి" అని కొకోష్కిన్ విజ్ఞప్తిచెయ్యవలసిన అవసరం వుండేదికాదు.

కాడెట్ కార్యక్రమం రాజకీయ స్వయంనిర్ణయ హక్కును గురించి కాక, "సాంస్కృతిక" స్వయంనిర్ణయ హక్కును గురించే ప్రస్తావిస్తోందన్న విషయం కాడెట్ కాన్ఫరెన్సు

ప్రతినిధులకు నిస్సందేహంగా తెలుసు. అందుకే, కొకోష్కిన్ ఉక్రేనియన్ ప్రతినిధులకి వ్యతిరేకంగానూ, వామపక్ష కాడెట్లకి వ్యతిరేకంగానూ ఆ కార్యక్రమాన్ని సమర్థించాడు. "రాజకీయ" స్వయంనిర్ణయ హక్కుకి ప్రతిగా "సాంస్కృతిక" స్వయంనిర్ణయాన్ని ఆయన బలపరుస్తున్నాడు. "రాజకీయ" స్వయంనిర్ణయాన్ని వ్యతిరేకించడంలోనూ, "రాజ్య విచ్ఛిత్తి" ప్రమాదాన్ని భూతద్దంలో చూపించడంలోనూ, "రాజకీయ స్వయంనిర్ణయ" సూత్రాన్ని "వైకల్పిక అర్థం కలిగినది" అనడంలోనూ (రోజా లుక్సెంబుర్గ్‌కి పూర్తి అనుగుణంగా వుంది!) కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీయొక్క మరింత "వామ పక్ష" లేక మరింత ప్రజాస్వామిక శక్తులకీ, ఉక్రేనియన్ బూర్జువావర్గానికీ కూడా వ్యతిరేకంగా కొకోష్కిన్ మహా రష్యన్ జాతీయవాద ఉదారవాదాన్ని సమర్థించాడు.

కాడెట్ కాన్ఫరెన్సులో కొకోష్కిన్ విజయం సాధించాడన్న విషయం "రేచ్" నివేదికలోని విద్రోహపూరితమైన "అయితే" అన్న చిన్న పదాన్నిబట్టి సుస్పష్టం. కాడెట్లలో మహా రష్యన్ జాతీయవాద ఉదారవాదం విజయం పొందింది. ఆ కాడెట్ల మాదిరిగానే, "జాతుల రాజకీయ స్వయంనిర్ణయానికి సంబంధించిన వైకల్పిక అర్థం కలిగిన సూత్రాల" పట్ల భయపడనారంభించిన రష్యన్ మార్క్సిస్టుల్లో కొందరి — కాడెట్ల మాదిరిగానే "జాతుల రాజకీయ స్వయంనిర్ణయానికి సంబంధించిన వైకల్పిక అర్థం కలిగిన సూత్రాల"పట్ల భయపడనారంభించిన వ్యక్తుల — సంశయాల నివృత్తికి యీ విజయం తోడ్పడదూ?

"అయితే," కొకోష్కిన్ ఆలోచనా స్రవంతి సారాంశాన్ని మనం పరిశీలిద్దాం. "గత రాజకీయానుభవాన్ని" ప్రస్తావించడం ద్వారానూ (అంటే, మహా రష్యన్ బూర్జువా వర్గం తన జాతీయ విశేష హక్కుల విషయంలో బెంబేలుపడి, తన భయాలతో కాడెట్ పార్టీని బెదరగొట్టిన 1905 నాటి అనుభవం), అంతేకాక "రాజ్య విచ్ఛిత్తి" ప్రమాదాన్ని భూతద్దంలో చూపడం ద్వారానూ, రాజకీయ స్వయంనిర్ణయ హక్కంటే విడిపోయి, స్వతంత్ర జాతీయ రాజ్యాన్ని ఏర్పాటుచేసుకొనే హక్కు తప్ప మరేమీ కాదన్న విషయాన్ని తను పూర్తి బాగా అర్థంచేసుకున్న సంగతిని కొకోష్కిన్ నిరూపించాడు. మొత్తంమీద ప్రజాస్వామ్యం దృష్ట్యానూ, ప్రత్యేకించి శ్రామికవర్గ పోరాటం దృష్ట్యానూ కొకోష్కిన్ భయాలను ఎలా అంచనా వేసుకోవాలి?

విడిపోయే హక్కు గుర్తింపు "రాజ్య విచ్ఛిత్తి" ప్రమాదాన్ని పెంచుతుందని నమ్మమని కొకోష్కిన్ మనకి చెప్తున్నాడు. "పట్టుకుని అణచిపారేయ్" అన్న సూక్తిని పాటించే పోలీసు కాన్‌స్టబుల్ మిమ్రెత్సోవ్ దృక్పథం యిది. మొత్తంమీద ప్రజాస్వామ్యం దృష్ట్యా, సంగతి సరిగ్గా యిందుకు తలకిందులైనది: విడిపోయే హక్కు గుర్తింపు "రాజ్య విచ్ఛిత్తి" ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

కొకోష్కిన్ సరిగ్గా జాతీయవాదుల్లాగ వాదిస్తున్నాడు. తమ గత మహాసభలో ఉక్రేనియన్ "మజేపిస్టుల"[89]మీద వాళ్లు దాడిచేశారు. ఉక్రేనియన్ ఉద్యమం ఉక్రెయిన్‌కీ రష్యాకీ మధ్య సంబంధాలను బలహీనపరచే ప్రమాదం వుందని సవేంకొ బృందం వాదించింది. ఆస్ట్రియన్ ఉక్రెయిన్ భాష, సంస్కృతి ప్రవేశపెట్టడం ద్వారా ఆస్ట్రియాతో ఉక్రేనియన్ల సంబంధాలను బలపరుస్తూవుండటమే యిందుకు కారణం అంటున్నారు వాళ్లు!! ఏ పద్ధతిని వినియోగించినందుకు సవేంకొ సభ్యులు ఆస్ట్రియాను తప్పుపడుతున్నారో అదే పద్ధతి ద్వారా, అంటే, తమ సొంత భాషని ఉపయోగించుకునే స్వేచ్ఛనీ, స్వయంపాలన హక్కునీ, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన పార్లమెంటునీ ఉక్రేనియన్లకి మంజూరు చెయ్యడం ద్వారా, ఉక్రేనియన్లతో తన సంబంధాలను "దృఢపరచుకొనేందుకు" రష్యా ఎందుకు ప్రయత్నించలేకపోయిందో యింకా వివరించబడలేదు.

సవేంకొల, కొకోష్కిన్ల వాదనలు సరిగ్గా ఒకేలా వున్నాయి. శుద్ధ తార్కిక దృష్ట్యా అవి రెండూ సమానంగానే హాస్యాస్పదంగానూ, అవకతవకగానూ వున్నాయి. ఏ ఒక ప్రత్యేక దేశంలోనైనా ఉక్రేనియన్ జాతి ఎంత ఎక్కువ స్వేచ్ఛని అనుభవిస్తే, ఆ దేశంతో దాని సంబంధాలు అంత దృఢతరంగా వుంటాయనడం స్పష్టం కాదా? ప్రజాస్వామ్యానికి సంబంధించిన పూర్వ ఉపోద్ఘాతాలన్నింటినీ పూర్తిగా త్యజించనిదే యీ సర్వసాధారణ సత్యాన్ని ఖండించడం సాధ్యం కాదని ఎవరికైనా అనిపిస్తుంది. విడిపోయేందుకు స్వేచ్ఛ, స్వతంత్ర జాతీయ రాజ్య స్థాపనకి స్వేచ్ఛ – యింతకంటే ఎక్కువ జాతీయ స్వేచ్ఛ అంటూ ఏదైనా వుంటుందా?

ఉదారవాదులచేత (తెలివితక్కువగా వాళ్లు చెప్పినదాన్ని వల్లిస్తున్నవాళ్లచేత) విపరీతంగా గందరగోళపరచబడిన యీ సమస్యని సుబోధకం చేసేందుకుగాను అతి సరళమైన ఉదాహరణనొకదాన్ని మేము ఉదహరిస్తాం. విడాకుల సమస్య తీసుకుందాం. రోజా లుక్సెంబుర్గ్, తన వ్యాసంలో కేంద్రీకృత రాజ్యం తన అంతర్భాగాలకు స్వయంపాలన హక్కును యిస్తూనే, చట్టనిర్మాణానికి సంబంధించిన అతి ముఖ్య శాఖలను, విడాకులకు సంబంధించిన శాసన నిర్మాణ హక్కుతోబాటు, కేంద్ర పార్లమెంటు అధికారపరిధిలో ఉంచుకోవాలని రాసింది. దీన్నిబట్టి, ప్రజాతంత్ర రాజ్యపు కేంద్రాధికారం విడాకులను అనుమతించే అధికారాన్ని నిలుపుకోవాలన్న ఆమె తాపత్రయం స్పష్టం. అభివృద్ధి నిరోధకులు విడాకుల స్వేచ్ఛకి వ్యతిరేకులుగా వుంటారు. వాళ్లు, ఈ విషయంలో "జాగ్రత్తగా వ్యవహరించాలి" అంటారు. విడాకులంటే "కుటుంబ విచ్ఛిత్తే" అంటూ గట్టిగా అరుస్తారు. అయితే, అభివృద్ధి నిరోధకులు కపటులనీ, ఆచరణలో వాళ్లు పోలీసు, బ్యూరాక్రసీల సర్వశక్తిమత్వాన్నీ, ఉభయ లింగాలకు చెందినవాళ్లలో ఒక లింగానికి చెందినవాళ్ల విశేష హక్కుల్నీ, స్త్రీలను

దారుణంగా అణచివెయ్యడాన్నీ సమర్థిస్తున్నారనీ ప్రజాస్వామ్యవాదులు భావిస్తారు. వాస్తవంలో విడాకుల స్వేచ్ఛ కుటుంబ సంబంధాల "విచ్ఛిత్తి"కి దారితియ్యక, అందుకు భిన్నంగా, వాటిని ఒక ప్రజాతంత్ర ప్రాతిపదికమీద – నాగరిక సమాజంలో యిదొక్కటే సంభావ్యమూ, పదికాలాలపాటు వుండే ప్రాతిపదిక – సుదృఢంచేస్తుంది.

స్వయంనిర్ణయ స్వేచ్ఛని, అంటే, విడిపోయే స్వేచ్ఛని సమర్థించేవాళ్ల వేర్పాటు వాదాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించడం, విడాకుల స్వేచ్ఛని సమర్థించేవాళ్ల కుటుంబ సంబంధాల విచ్ఛిత్తిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించడమంత మూర్ఖమైనదీ, కుటిలమైన దీని. బూర్జువా సమాజంలో విశేష హక్కుల్నీ, అవినీతినీ – బూర్జువా వివాహానికి యివే ఆధారం – సమర్థించేవాళ్ల విడాకుల హక్కుని ఎలా వ్యతిరేకిస్తారో, సరిగ్గా అలాగే, పెట్టుబడిదారీ రాజ్యంలో జాతుల స్వయంనిర్ణయ హక్కును, అంటే, విడిపోయే హక్కును తిరస్కరించడమంటే, ప్రజాతంత్ర పద్ధతులకు భంగకరంగా, ప్రబల జాతి విశేష హక్కుల్నీ, పరిపాలనలో పోలీసు పద్ధతుల్నీ సమర్థించడం తప్ప మరేమీ కాదు.

పెట్టుబడిదారీ సమాజంలో వున్న సంబంధాలన్నింటినుంచీ ఉత్పన్నమయ్యే రాజకీయ కాపట్యం కొన్ని సందర్భాల్లో పార్లమెంటు సభ్యులూ, జర్నలిస్టులూ ఏదో ఒక జాతి విడిపోవడాన్ని గురించి అర్థరహితమైన సొల్లు మాట్లాడటానికి దారితీస్తూ వుంటుంది. అయితే అలాంటి మాటలకు అభివృద్ధినిరోధకులు మాత్రమే భయపడటం (లేక భయపడినట్లు నటించడం) సంభవిస్తుంది. ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడివున్నవాళ్ళ, అంటే, రాజ్య సమస్యల్ని జనబాహుళ్యం నిర్ణయించాలని పట్టుబట్టేవాళ్ల, రాజకీయ వేత్తలు వాగేదానికీ, జనం నిర్ణయించేదానికీ మధ్య విపరీతమైన ఎడం ఉందని చాలా బాగా ఎరుగుదురు. భౌగోళిక, ఆర్థిక సంబంధాల విలువ ఏమిటో, పెద్ద మార్కెట్లు, పెద్ద రాజ్యాలవల్ల ప్రయోజనాలేమిటో జనబాహుళ్యానికి వాళ్ల రోజువారీ అనుభవం ద్వారా చాలా బాగా తెలుసు. అందుచేత, జాతీయ పీడనా, జాతీయ ఘర్షణా ఉమ్మడి జీవితాన్ని పూర్తిగా సహించరానిదిగా చేసినప్పుడూ, ఏ ఒక్క లేక అన్ని ఆర్థిక సంసర్గాలనూ ఆటంకపరచినప్పుడూ మాత్రమే వాళ్ల విడిపోయేందుకు పూనుకొంటారు. అలాంటి సందర్భంలో, పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రయోజనాలూ, వర్గపోరాట స్వేచ్ఛా ప్రయోజనాలూ విడిపోయినప్పుడు మాత్రమే బాగా తీరుతాయి.

ఈవిధంగా, కొకోష్కిన్ వాదనలను మనం ఏ కోణంనుంచి పరిశీలించినా కూడా, అవి పరమ అవకతవక అయినవనీ, ప్రజాస్వామ్య సూత్రాలకు అవి ఆభాస మాత్రమేననీ రుజువవుతుంది. అయినాకూడా, యీ వాదనల్లో రవ్వంత తర్కం, మహా రష్యన్ బూర్జువా వర్గపు వర్గ ప్రయోజనాల తర్కం, వుంది. కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుల్లో

అత్యధిక సంఖ్యాకులకి మాదిరిగానే, కొకోష్కిన్ కూడా ఆ బూర్జువావర్గానికి చెందిన ధన స్వాములకి తైనాతీ. మొత్తంమీద ఆ బూర్జువావర్గపు విశేష హక్కులనూ, ప్రత్యేకించి దాని రాజ్యపు విశేష హక్కులనూ ఆయన సమర్థిస్తాడు. పురిష్కేవిచ్‌తో చేయీ చేయీ, భుజం భుజం కలిపి వాటిని ఆయన సమర్థిస్తాడు. అయితే ఒక్కటే తేడా. అదేమిటంటే, పురిష్కేవిచ్ భూస్వామ్య దుడ్డుకర్రలో మరింత విశ్వాసం ఉంచగా, కొకోష్కిన్ ప్రభృతులు ఆ దుడ్డుకర్ర 1905లో బాగా దెబ్బతిన్నదన్న విషయాన్ని గ్రహించినవారై, జన బాహుళ్యపు కన్నుగప్పడంలో బూర్జువా పద్ధతులమీద – ఉదాహరణకు "రాజ్య విచ్ఛిత్తి" బూచిని చూపి పెటీబూర్జువావర్గాన్నీ, రైతుల్నీ బెదరగొట్టడం, "ప్రజల స్వేచ్ఛ"ని చారిత్రక సంప్రదాయంతో మేళవించడం వగైరా పదబంధాలతో వాళ్లని మభ్యపెట్టడం – మరింత ఎక్కువగా ఆధారపడతారు.

జాతుల రాజకీయ స్వయంనిర్ణయ హక్కుకి ఉదారవాదుల ప్రాతికూల్యానికి నిజమైన వర్గపరమైన ఒకేఒక్క అర్థం ఉండగలదు: జాతీయవాద ఉదారవాదం, మహా రష్యన్ బూర్జువావర్గ రాజ్యపు విశేష హక్కుల సమర్థన. ఈనాడు, జూన్ 3 పాలనకింద, జాతుల స్వయంనిర్ణయ హక్కుకి వ్యతిరేకంగా వున్న రష్యన్ మార్క్సిస్టుల్లోని అవకాశవాదులు – రద్దువాది సెమ్‌కోవ్‌స్కీ, బుందిస్టు లీబ్‌మన్, ఉక్రేనియన్ పెటీబూర్జువా యుర్కేవిచ్ – వాస్తవంలో జాతీయవాద ఉదారవాదుల అడుగుజాడల్లో నడుస్తూ, కార్మికవర్గాన్ని జాతీయవాద ఉదారవాద భావాలతో కలుషితుల్ని చేస్తున్నారు.

కార్మికవర్గ ప్రయోజనాల సాధనకూ, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా అది జరిపే పోరాటంలో విజయానికీ గాను అన్ని దేశాల కార్మికుల మధ్యా మిక్కిలి సన్నిహితమైన సంబంధాలు అవసరం. ప్రతిఒక్క దేశపు బూర్జువావర్గమూ అనుసరించే జాతీయవాద విధానాన్ని ప్రతిఘటించడం అవసరం. కాగా, సోషల్ డెమోక్రట్లు జాతుల స్వయంనిర్ణయ హక్కును, అంటే, పీడిత జాతి విడిపోయే హక్కును తిరస్కరించడమంటే అర్థం, శ్రామికవర్గ విధానంనుంచి పక్కకి వైదొలగి, కార్మికులను బూర్జువావర్గ విధానానికి లోబరచడమే. తను రష్యనేతర బూర్జువావర్గంచేత కాకుండా మహా రష్యన్ బూర్జువావర్గంచేత దోచుకోబడినా, లేక యూదు బూర్జువావర్గంచేత కాకుండా పోలిష్ బూర్జువావర్గంచేత దోచుకోబడినా, లేక మరే బూర్జువావర్గంచేతనో కాకుండా యింకే బూర్జువావర్గంచేతనో దోచుకోబడినా, వేతన కార్మికుడికి ఒక్కటే. తన వర్గ ప్రయోజనాలను అర్థంచేసుకున్న వేతన కార్మికుడు, మహా రష్యన్ పెట్టుబడిదారుల రాజ్య సంబంధమైన విశేష హక్కుల పట్లా లేక ఉక్రేనియన్ పెట్టుబడిదారులు, తాము రాజ్య సంబంధమైన విశేష హక్కుల్ని పొందినప్పుడు భూతల స్వర్గాన్ని సృష్టిస్తామంటూ యిచ్చే హామీలపట్లా కూడా ఒకే మాది

రిగా అనాసక్తి చూపుతాడు. సంకీర్ణ జనాభా కలిగిన సమ్మైక్య రాజ్యాల్లోనూ, విడి జాతీయ రాజ్యాల్లోనూ కూడా ఎటుతిరిగీ, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందుతోంది, అభివృద్ధి చెందుతూనే వుంటుంది కూడా.

ఏదెలా వున్నా, వేతన కార్మికుడు దోపిడికి గురి అవుతూనే వుంటాడు. దోపిడికి వ్యతిరేకంగా జరిపే పోరాటం విజయవంతమవాలంటే శ్రామికవర్గం జాతీయవాదాన్ని వదిలించుకొని, ఆ మాటకొస్తే, వివిధ దేశాల బూర్జువావర్గాల మధ్య సర్వాధికారంకోసం జరుగుతున్న పోరాటంలో పూర్తి తటస్థంగా వుండాలి. ఏ ఒక దేశపు శ్రామికవర్గమైనా తన "సొంత" జాతీయ బూర్జువావర్గపు విశేష హక్కులకు ఏ కొంచెం తోడ్పాటునిచ్చినా, అది యింకో దేశపు శ్రామికవర్గంలో విధిగా అపనమ్మకాన్ని ఉత్పన్నంచేస్తుంది. అది కార్మికుల అంతర్జాతీయ వర్గ సంఘీభావాన్ని సడలింపజేసి, వాళ్లని చీల్చి, బూర్జువావర్గానికి సంతోషం కలిగిస్తుంది. జాతుల స్వయంనిర్ణయ హక్కు లేక విడిపోయే హక్కును తిరస్కరించడమంటే, ఆచరణలో విధిగా అర్థం, ప్రబల జాతి విశేష హక్కులకు తోడ్పాటు యివ్వడమే.

స్వీడన్‌నుంచి నార్వే విడిపోవడానికి సంబంధించిన నిర్దిష్ట ఉదాహరణను పరిశీలిస్తే దీనికి మరింత కొట్టవచ్చినట్లు కనిపించే ధృవీకరణ మనకి దొరుకుతుంది.

## 6. స్వీడన్‌నుంచి నార్వే విడిపోవడం

రోజా లుక్సెంబుర్గ్ సరిగ్గా యీ ఉదాహరణనే యిచ్చి, యీకింది విధంగా చర్చిస్తోంది:

"సమాఖ్య సంబంధాల చరిత్రలో యిటీవల జరిగిన సంఘటన స్వీడన్‌నుంచి నార్వే విడిపోవడం – అప్పట్లో యీ ఘటనని సాంఘిక దేశభక్తియుత పోలిష్ పత్రికలు (క్రాకొవ్‌కి చెందిన 'Naprzód'[90] చూడండి) హడావిడిగా దొరకపుచ్చుకొని రాజ్యం విడిపోయే దిశగా సాగే ధోరణి పటిమనీ, ప్రగతిశీల స్వభావాన్నీ ఒక సంతృప్తికర చిహ్నంగా వర్ణించాయి – సమాఖ్యతత్వమూ, దాని సహవర్తియైన వేర్పాటూ, ప్రగతి లేక ప్రజాస్వామ్యపు వ్యక్తీకరణ ఏవిధంగానూ కావన్నదానికి తక్షణ రుజువును సమకూర్చాయి. నార్వీజియన్ 'విప్లవం' అనబడేదాని తర్వాత – స్వీడిష్ రాజు పదవీ

చ్యుతం చెయ్యబడ్డాడనీ, అతను నార్వేని వదిలి పోవలసివచ్చిందనీ దీని అర్థం — నార్వీజియన్లు లాంఛనప్రాయమైన దేశవ్యాపిత ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా రిపబ్లిక్ స్థాపన ప్రతిపాదనను తిరస్కరించి, చల్లగా మరో రాజును ఎన్నుకొనబూనుకున్నారు. అన్ని జాతీయోద్యమాలనూ, స్వాతంత్ర్యపు బాహ్యాకారాన్నీ పైపైనుంచి చూసి ప్రశంసించేవాళ్లు 'విప్లవం'గా పరిగణించినది కేవలం రైతు, పెటీ బూర్జువా ప్రత్యేకతావాదం తప్ప, అంటే, తమ డబ్బుకి స్వీడిష్ ప్రభువర్గం తమమీద రుద్దిన రాజుకి బదులు, 'తమ సొంత' రాజు ఉండాలన్న వాంఛ తప్ప, మరేమీ కాదు. ఈ కారణంగా యీ ఉద్యమానికి విప్లవంతో ఎలాంటి సంబంధం లేదు. అదే సమయంలో, స్వీడన్, నార్వేల మధ్య ఐక్యత విచ్ఛిత్తి, యీ సందర్భంలో కూడా, అంతదాకా వున్న సమాఖ్య శుద్ధ రాజవంశ ప్రయోజనాలను మాత్రమే ఏమేరకు వ్యక్తం చేసిందో, ఆ కారణంగా అది రాజరికానికీ, అభివృద్ధి నిరోధకత్వానికీ కేవలం ఒక రూపం మాత్రమేనో, మరోసారి నిరూపించింది'' ("Przegląd").[72]

ఈ విషయంలో రోజా లుక్సెంబుర్గ్ చెప్పిందంతా అక్షరాలా యింతే! స్పష్టంగా తేలిన ఒక విషయం యేమిటంటే, తన వైఖరి పనికిమాలినతనాన్ని యీ ప్రత్యేక సందర్భంలో బయటపెట్టుకున్న దానికంటే మరింత స్ఫుటంగా వెల్లడించడం ఆమెకు కష్టసాధ్యమై వుండేది.

సమస్య గతంలోనూ, యిప్పుడూ కూడా ఏమిటంటే: సంకీర్ణ జాతీయ రాజ్యంలోని సోషల్ డెమొక్రట్లకి జాతుల స్వయంనిర్ణయ లేక విడిపోయే హక్కుని గుర్తించే కార్యక్రమం ఉండాలా అక్కర్లేదా?

రోజా లుక్సెంబుర్గ్ ప్రస్తావించిన నార్వే ఉదాహరణ యీ అంశంమీద మనకి ఏం చెప్తుంది?

మన రచయిత్రి మెలికలు తిప్పుతుంది, మెలికలు తిరుగుతుంది, తన చాతుర్యం ప్రయోగిస్తుంది, "Naprzód"మీద దుమ్మెత్తిపోస్తుంది, కాని ఆ ప్రశ్నకి మాత్రం సమాధానం చెప్పదు! పరిశీలనలో వున్న వాస్తవాంశాన్ని గురించి <u>ఒక్కమాట కూడా చెప్పకుండా దాటవేసేందుకుగాను</u> రోజా లుక్సెంబుర్గ్ ప్రపంచంలోని అన్ని విషయాలను గురించీ చెప్తుంది!

తమ డబ్బుకి తమ సొంత రాజును కలిగివుండాలని కోరుకోవడంలోనూ, దేశవ్యాపిత ప్రజాభిప్రాయ సేకరణలో రిపబ్లిక్ స్థాపన ప్రతిపాదనను తిరస్కరించడంలోనూ, నార్వీజియన్ పెటీబూర్జువావర్గం మిక్కిలి హీనమైన కూపస్థమండూక లక్షణాలను ప్రదర్శిం

చిందనడం నిస్సందేహమైన విషయం. ఈ విషయాన్ని గుర్తించే విషయంలో విఫలమవ డంలో "Naprzód" అంతే హీనమైన, అంతే కూపస్థమండూక ప్రాయమైన లక్షణాలను ప్రదర్శించిందనడం కూడా నిస్సందేహ విషయమే.

కాని, పరిశీలనాంశంతో దీనంతకీ సంబంధం యేమిటి?

చర్చనీయాంశం జాతుల స్వయంనిర్ణయ హక్కు, యీ హక్కుపట్ల సోషలిస్టు శ్రామికవర్గం అవలంబించవలసిన వైఖరి ఏమిటి, అన్నది! మరి అలాంటప్పుడు, ప్రశ్న చుట్టూ గిరికీలు తిరిగేందుకు బదులు రోజా లుక్సెంబుర్గ్ యీ ప్రశ్నకి సమాధానం ఎం దుకు చెప్పదు?

ఎలుక దృష్టిలో పిల్లికంటే బలమైన జంతువు లేదని అంటూవుంటారు. రోజా లుక్సెంబుర్గ్ దృష్టిలో "ఫ్రాకీ"కంటే బలమైన జంతువు మరొకటి లేదనడం స్పష్టం. "ఫ్రాకీ" అన్నది "పోలిష్ సోషలిస్టు పార్టీకి"[91] లోకప్రియమైన పేరు, అది దాని విప్లవ కర విభాగం అనబడేది. క్రాకొవ్ వార్తాపత్రిక "Naprzód," ఆ "విభాగపు" అభిప్రా యాలనే కలిగివుంది. రోజా లుక్సెంబుర్గ్ ఆ "విభాగపు" జాతీయవాదానికి వ్యతిరేకంగా తను చేసే పోరాటంతో ఎంతగా అంధురాలైందంటే, "Naprzód"ని తప్ప ఆమె మరి దేన్నీ చూడదు.

"Naprzód" "ఔను" అంటే, వెంటనే "కాదు" అనడం తన పవిత్ర విధి అని రోజా లుక్సెంబుర్గ్ భావిస్తుంది. తను అలా చెయ్యడం ద్వారా "Naprzód"నుంచి తను తన స్వాతంత్ర్యాన్ని వెల్లడించుకోకపోగా, అందుకు భిన్నంగా "ఫ్రాకీ"మీద తన హాస్యాస్పద మైన పరాధీనతనూ, క్రాకొవ్ చీమలపుట్టకంటే ఎక్కువ గంభీరమూ విశాలమూ అయిన దృక్పథంనుంచి విషయాలను చూడలేని తన అసమర్థతనూ ఆమె ప్రదర్శించుకుంటోంది. "Naprzód" దగుబ్బాజీ పత్రిక అనడం, మార్క్సిస్టు పత్రిక ఎంతమాత్రం కాద నడం నిజమేననుకోండి; అయితే అంతమాత్రాన, నార్వే ఉదాహరణను ఎంచుకున్న మనం, దాన్ని సక్రమంగా విశ్లేషించడానికి అది ఆటంకం కాకూడదు.

ఈ ఉదాహరణను మార్క్సిస్టు పద్ధతిలో విశ్లేషించేందుకు, "ఫ్రాకీ"యొక్క మహో దారణమైన దోషాలను కాదు మనం పరిశీలించవలసింది. అందుకు భిన్నంగా, ఒకటి, స్వీడన్ నుంచి నార్వే విడిపోయేందుకు సంబంధించిన నిర్దిష్ట చారిత్రక లక్షణాలనూ, రెండు, ఈ విడిపోవడానికి సంబంధించి ఆ రెండు దేశాల శ్రామికవర్గానికీ ఎదురవుతున్న కర్త వ్యాలను గురించీ మనం పరిశీలించవలసివుంది.

నార్వేకీ, స్వీడనుకీ మధ్య వున్న భౌగోళిక, ఆర్థిక, భాషాపర సంబంధాలు మహా రష్య న్లకీ చాలా యితర స్లావ్ జాతులకీ మధ్య వున్న సంబంధాలంత సన్నిహితమైనవి. కాని,

నార్వేకీ, స్వీడనుకీ మధ్య కలయిక ఐచ్ఛికమైనది కాదు, కాగా "సమాఖ్య" సమస్యని యిందు లోకి లాక్కురావడం ద్వారా రోజా లుక్సెంబుర్గ్ అసందర్భంగా ఏదేదో మాట్లాడుతోంది, కేవలం ఏం చెప్పాలో తెలియకపోవడమే యిందుకు కారణం. నెపోలియన్ యుద్ధాలకాలంలో, నార్వీజియన్ల యిచ్ఛకి వ్యతిరేకంగా, చక్రవర్తులచేత స్వీడన్‌కి నార్వే ధారపోయబడింది. నార్వేని లొంగదీసేందుకు స్వీడులు నార్వేలోకి సైనికుల్ని తీసుకురావలసివచ్చింది.

ఈ కలయిక అనంతరం చాలా దశాబ్దాలపాటు నార్వేకి చాలా విస్తృతమైన స్వయం పాలన హక్కు ఉన్నా కూడా (దానికి సొంత పార్లమెంటు వగైరాలు వున్నాయి); నార్వేకీ, స్వీడనుకీ మధ్య ఎడతెగని ఘర్షణ జరిగింది. స్వీడిష్ నిరంకుశత్వ శృంఖలాలను విదిలించు కొనేందుకు నార్వీజియన్లు తీవ్రంగా పోరాడారు. చివరకు, 1905 ఆగస్టులో, వాళ్ళు విడిపోయారు: స్వీడిష్ రాజు యిక ఎంతమాత్రమూ తమ రాజు కాడని నార్వీజియన్ పార్ల మెంటు తీర్మానించింది. నార్వీజియన్ ప్రజల్లో తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో నార్వీజియన్లలో అత్యధిక సంఖ్యాకులు (కొద్ది వందలమందికి వ్యతిరేకంగా సుమారు 2,00,000 మంది) స్వీడన్‌నుంచి పూర్తి వేర్పాటుకి అనుకూలంగా ఓటుచేశారు. కొద్దికాలం ఊగిస లాడిన తర్వాత, నార్వే వేర్పాటు విషయంలో స్వీడులు సరిపెట్టుకున్నారు.

ఆధునిక ఆర్థిక, రాజకీయ సంబంధాలకింద ఏ ఆధారాలమీద జాతులు విడిపోయే సంద ర్భాలు సంభవం, వాస్తవంగా సంభవిస్తాయి అన్న విషయాన్నీ, రాజకీయ స్వేచ్ఛా, ప్రజా స్వామ్య పరిస్థితుల్లో యీ విడిపోవడం కొన్ని సమయాల్లో ఎలాంటి రూపం తీసుకోవచ్చు నన్న విషయాన్నీ యీ ఉదాహరణ మనకి చూపిస్తుంది.

జాతులు విడిపోవడానికి సంబంధించి తలెత్తే సంఘర్షణల పరిష్కారంకోసం, "రష్యన్ పద్ధతిలో'" కాకుండా, నార్వే, స్వీడన్ల మధ్య 1905లో పరిష్కరింపబడిన ఏకైక మార్గంలో పరిష్కారంకోసం, క్రమబద్ధమైన ప్రచారం చేసి, భూమికను సిద్ధంచెయ్యడం వర్గచైతన్యం కలిగిన కార్మికుల తప్పనిసరి విధి అన్న విషయాన్ని యీ ఉదాహరణ వాస్త వానికి నిరూపిస్తోందన్న విషయాన్ని ఏ సోషల్ డెమోక్రటూ — రాజకీయ స్వేచ్ఛా, ప్రజా స్వామ్యాల సమస్యలపట్ల అతను అలక్ష్యం వహించకపోతే (అదే నిజమైతే సహజంగానే అత నిక ఎంతమాత్రమూ సోషల్ డెమోక్రట్ కాడు) — నిరాకరించడు. జాతుల స్వయం నిర్ణయ హక్కుకి సంబంధించి కార్యక్రమంలో వున్న డిమాండుకి అర్థం సరిగ్గా యిదే. కాని రోజా లుక్సెంబుర్గ్, నార్వీజియన్ కూపస్థమండూకాల, క్రాకొవ్ "Naprzód"ల కూప స్థమండూకతత్వంమీద తీవ్రంగా దాడిచెయ్యడం ద్వారా తన సిద్ధాంతానికి యిబ్బందికరమైన వాస్త వంనుంచి తప్పుకుపోయేందుకు ప్రయత్నించింది. జాతుల స్వయంనిర్ణయ హక్కు అన్నది "ఊహాజనితమైనది" లేక "బంగారు రేకులు తినేసే" హక్కు లాంటిది అన్న తన మాట

లను యీ చారిత్రక అనుభవం పూర్తిగా తిరస్కరిస్తోంది అన్న విషయాన్ని ఆమె పూర్తిగా అర్థంచేసుకోవడమే యిందుకు కారణం. అలాంటి పదాలు తూర్పు యూరపియన్ దేశాల్లో యీనాడున్న బలాల పొందిక అచంచలత్వంలో ఆత్మసంతృప్తితో కూడిన అవకాశవాద విశ్వాసాన్ని మాత్రమే తెలియజేస్తాయి.

ఇంకా ముందుకు పోయి చూద్దాం. ఇతర అన్ని సమస్యల్లో మాదిరిగానే జాతుల స్వయంనిర్ణయ హక్కు సమస్యలో కూడా, ఆయా దేశాల్లోని శ్రామికవర్గపు స్వయం నిర్ణయ హక్కులోనే ప్రథమంగానూ, ప్రధానంగానూ మనం ఆసక్తి చూపుతాం. రోజా లుక్సెంబర్గ్ చల్లగా యీ సమస్యని కూడా దాటవేసింది, తనే ఎంచుకున్న నార్వే ఉదాహరణ ప్రాతిపదికమీద దాన్ని విశ్లేషించడం, తన "సిద్ధాంతానికి" వినాశకరమవుతుందని ఆమె గ్రహించుకోవడమే యిందుకు కారణం.

విడిపోయే విషయంలో జరిగిన ఘర్షణలో నార్వీజియన్ శ్రామికవర్గమూ, స్వీడిష్ శ్రామిక వర్గమూ తీసుకున్న, నిజానికి తీసుకోవలసివచ్చిన, వైఖరి ఏమిటి? నార్వే విడిపోయిన తర్వాత, వర్గ చైతన్యం కలిగిన నార్వే కార్మికులు సహజంగానే రిపబ్లిక్‌కి అనుకూలంగా ఓటుచేసివుండేవాళ్లు,* కొందరు సోషలిస్టులు మరోలా ఓటుచేశారంటే, యూరపియన్ సోషలిస్టు ఉద్యమంలో కొన్ని సమయాల్లో కూపస్థమండూకతత్వంతో కూడిన అవకాశవాదం ఎంత దట్టంగా అల్లుకొని వుందో మాత్రమే దీనివల్ల తెలుస్తుంది. ఈ విషయంలో రెండు అభిప్రాయాలు ఉండేందుకు తావులేదు. ఆకుకి అందకుండా, పోకకి పొందకుండా మాట్లాడటం ద్వారా సమస్యను మభ్యపుచ్చాలని రోజా లుక్సెంబుర్గ్ ప్రయత్నిస్తోంది, అందుకే మేమీ అంశాన్ని ప్రస్తావిస్తున్నాం. విడిపోయే సమస్యమీద నార్వీజియన్ సోషల్ డెమోక్రట్లు ప్రత్యేకమైన కొన్ని అభిప్రాయాలను కలిగివుండటాన్ని నార్వీజియన్ సోషలిస్టు కార్యక్రమం విధ్యుక్తం చేసిందేమో మాకు తెలియదు. అది అలా చెయ్యలేదనీ, నార్వే స్వయంపాలన హక్కు వర్గపోరాటాన్ని స్వేచ్ఛగా సాగించేందుకు అవసరమైనంత అవకాశాన్ని ఏమేరకు యిచ్చింది, లేక, స్వీడిష్ నియంతృత్వంతోడి శాశ్వత వైరుధ్యాలూ, ఘర్షణలూ ఆర్థిక జీవిత స్వేచ్ఛని ఏమేరకు నిరోధించాయన్నదాన్ని నార్వీజియన్ సోషలిస్టుల చర్చనీయాంశంగానే

---

* శ్రామికవర్గం రిపబ్లిక్‌ను కోరుతూండగా, నార్వీజియన్ జాతిలో అధిక సంఖ్యాకులు రాజరికానికి అనుకూలంగా ఉన్నారుగనుక, మామూలుగా చెప్పాలంటే, నార్వీజియన్ శ్రామికవర్గం ముందు రెండు ప్రత్యామ్నాయాలు నిలిచాయి: విప్లవానికి పరిస్థితులు పరిపక్వంగా వుంటే విప్లవం, లేకపోతే అధిక సంఖ్యాకుల యిచ్ఛకి తలొగ్గి దీర్ఘకాలిక ప్రచారాందోళనలు సాగించడం.

వదిలేసిందనీ నేను అనుకుంటున్నాను. కాని నార్వీజియన్ శ్రామికవర్గం యీ నియంతృత్వాన్ని వ్యతిరేకించి, నార్వీజియన్ రైతు ప్రజాస్వామ్యాన్ని సమర్థించవలసివచ్చిందన్న విషయం (కూపస్థమండూకతత్వంతో కూడిన తన అన్ని పరిమితులతో) నిర్వివాదం.

మరి స్వీడిష్ శ్రామికవర్గమో? స్వీడిష్ మతగురువుల ప్రోద్బలంతో స్వీడిష్ భూస్వాములు నార్వేతో యుద్ధం జరపాలని ప్రచారంచేశారన్న విషయం అందరికీ తెలిసిందే. నార్వే స్వీడన్‌కంటే చాలా బలహీనమైన దేశం, స్వీడిష్ దండయాత్రకు అది యింతకుముందే గురిఅయింది, స్వీడిష్ ప్రభువర్గానికి స్వదేశంలో బ్రహ్మాండమైన ప్రతిష్ఠ వుంది, కాగా, ఈ యుద్ధ ప్రచారం తీవ్ర ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. "జాతుల స్వయంనిర్ణయ హక్కుకి సంబంధించిన వైకల్పిక అర్థం యిచ్చే సూత్రాలతో" "జాగ్రత్తగా వ్యవహరించాలి" అన్న విజ్ఞప్తుల ద్వారానూ, "రాజ్య విచ్ఛిత్తి" ప్రమాదానికి సంబంధించిన భయంకర చిత్రాలు చిత్రించడం ద్వారానూ, "ప్రజల స్వేచ్ఛ" స్వీడిష్ నిరంకుశత్వపు సంప్రదాయాలకు అనుగుణమైనదేనని హామీ యివ్వడం ద్వారానూ స్వీడిష్ ప్రజల మనస్సులను కలుషితం చేసేందుకు స్వీడిష్ కొకోష్కిన్‌లు చాలా కాలాన్నీ, శక్తినీ వినియోగించారన్న విషయాన్ని మనం దృఢంగా చెప్పవచ్చు. స్వీడిష్ సోషల్ డెమోక్రట్లు అటు భూస్వామ్య, యిటు "కొకోష్కిన్" సిద్ధాంత, విధానాలమీద తమ సమస్త శక్తులతోనూ పోరాడకపోతే, మొత్తంగా జాతుల సమానత్వాన్ని మాత్రమే కాకుండా (కొకోష్కిన్లు కూడా దీన్ని సమర్థిస్తారు) జాతుల స్వయంనిర్ణయ హక్కునీ, విడిపోయే విషయంలో నార్వే స్వేచ్ఛనీ డిమాండు చెయ్యడంలో వాళ్లు విఫలురైతే, స్వీడిష్ సోషల్ డెమోక్రట్లు సోషలిజం, ప్రజాస్వామ్యాల లక్ష్యానికి ద్రోహం చేశారనడంలో కొంచెం కూడా అనుమానం లేదు.

నార్వీజియన్, స్వీడిష్ కార్మికుల మధ్య సన్నిహితమైన పొత్తూ, వాళ్ల పూర్తి సౌభ్రాతృత్వపూరిత వర్గ సంఘీభావమూ నార్వీజియన్ల విడిపోయే హక్కును స్వీడిష్ కార్మికులు గుర్తించడంతో లాభపడ్డాయి. దీనితో, స్వీడిష్ కార్మికులు స్వీడిష్ జాతీయవాదమనే జాడ్యానికి లోనుకాలేదనీ, వాళ్లు నార్వీజియన్ శ్రామికులతో సౌభ్రాతృత్వానికి స్వీడిష్ బూర్జువావర్గపు, ప్రభువర్గపు విశేష హక్కులకు కన్న ఉన్నత స్థానం యిచ్చారనే నమ్మకం నార్వీజియన్ కార్మికులకి కలిగింది. నార్వేమీద యూరప్ చక్రవర్తులూ, స్వీడిష్ నిరంకుశప్రభుత్వమూ రుద్దిన సంబంధాల రద్దు నార్వీజియన్, స్వీడిష్ కార్మికుల మధ్య సంబంధాలను సుదృఢంచేసింది. బూర్జువా విధానంలో ఎన్నో ఎగుడుదిగుళ్లు ఉన్నప్పటికీ – బూర్జువా సంబంధాలు స్వీడులకు బలవంతాన నార్వీజియన్లను లోబరచే పూర్తి అవకాశం వుంది! – స్వీడిష్, నార్వీజియన్ బూర్జువావర్గాలు రెండింటికీ వ్యతిరేకంగా రెండు జాతుల కార్మికుల సంపూర్ణ సమానత్వ, వర్గ సంఘీభావాలను వాళ్లు పదిలపరచి కాపాడగలుగుతారు.

సందర్భవశాత్తూ, రోజా లుక్సెంబుర్గ్‌తో మన అభిప్రాయభేదాలను పోలిష్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి వ్యతిరేకంగా "ఉపయోగించేందుకు" "ఫ్రాకీ" కొన్ని సందర్భాల్లో చేసిన ప్రయత్నాలు ఎంత అర్థరహితమైనవో, యిది వెల్లడిస్తుంది. "ఫ్రాకీ" శ్రామికవర్గ పార్టీ గాని, సోషలిస్టు పార్టీ గాని కాక, ఒక పెటీబూర్జువా జాతీయవాద పార్టీ, పోలిష్ సోషల్ రివల్యూషనరీల్లాంటి వాళ్లు. రష్యన్ సోషల్ డెమోక్రట్లకీ, యీ పార్టీకీ మధ్య ఐక్యత అనే ప్రశ్న వెనకా ఎన్నడూ లేదు, యికముందూ ఉండజాలదు. అందుకు భిన్నంగా, పోలిష్ సోషల్ డెమోక్రట్లతో నెలకొల్పబడిన సన్నిహిత సంబంధాలు, ఐక్యత విషయంలో ఏ రష్యన్ సోషల్ డెమోక్రటూ ఎన్నడూ "పశ్చాత్తాప పడలేదు." జాతీయవాద ఆకాంక్షల తోనూ, రాగద్వేషాలతోనూ నిండిన దేశమైన పోలండులో, మొట్టమొదటి నిజమైన మార్క్సిస్టు, శ్రామికవర్గ పార్టీని ఏర్పాటుచెయ్యడం ద్వారా పోలిష్ సోషల్ డెమోక్రట్లు చారిత్రకంగా ఒక గొప్ప సేవచేశారు. అయితే, పోలిష్ సోషల్ డెమోక్రట్లు చేసిన సేవ గొప్పది ఎందుకైందంటే, రష్యన్ మార్క్సిస్టుల కార్యక్రమంలోని 9వ క్లాజుని గురించి రోజా లుక్సెంబుర్గ్ బోలెడంత చెత్త మాట్లాడిన మూలంగా కాదు, అలా మాట్లాడిన విచారకరమైన పరిస్థితి ఉన్నా కూడా!

"జాతుల స్వయంనిర్ణయ హక్కు" సమస్య రష్యన్ సోషల్ డెమోక్రట్లకు ముఖ్యమైనదైనంతగా పోలిష్ సోషల్ డెమోక్రట్లకు ముఖ్యమైనది కాదు. జాతీయతత్వంతో అంధులైన పోలిష్ పెటీబూర్జువాలతో పోరాడాలన్న పట్టుదలతో కూడిన తమ ఉత్సాహంలో (బహుశా, కొన్ని సందర్భాల్లో కొంచెం అధికమేమో కూడా) పోలిష్ సోషల్ డెమోక్రట్లు కొంత అతిగా వ్యవహరించడాన్ని అర్థంచేసుకోవచ్చు. పోలండు విడిపోవడానికి వ్యతిరేకంగా ఉన్నందుకు పోలిష్ సోషల్ డెమోక్రట్లను నిందించాలని ఏ రష్యన్ మార్క్సిస్టూ ఎన్నడూ అనుకోలేదు. రష్యన్ మార్క్సిస్టుల కార్యక్రమంలో స్వయంనిర్ణయ హక్కు గుర్తింపును చేర్చవలసిన ఆవశ్యకతను రోజా లుక్సెంబుర్గ్ మాదిరిగా, తాము తిరస్కరించ ప్రయత్నించినప్పుడు మాత్రమే యీ సోషల్ డెమోక్రట్లు తప్పు చేస్తారు.

వాస్తవానికి యిదెలాంటిదంటే, మహా రష్యన్లతోబాటు, రష్యాలో నివసిస్తున్న అన్ని ప్రజా సమూహాలకీ, జాతులకీ, క్రాకొవ్ ప్రమాణాల ప్రకారం అర్థంచేసుకోగల సంబంధాలను అన్వయించేందుకు ప్రయత్నించడం లాంటిది. దీని అర్థం, రష్యన్ సోషల్ డెమోక్రట్ల మాదిరిగానూ, అంతర్జాతీయ సోషల్ డెమోక్రట్ల మాదిరిగానూ కాక "తలకిందులు పోలిష్ జాతీయవాదులుగా" ఉండటం.

ఎందుకంటే, అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం జాతుల స్వయంనిర్ణయ హక్కుకి అనుకూలంగా నిలుస్తుంది. దీన్ని గురించి యిప్పుడు మనం చర్చిద్దాం.

# 7. అంతర్జాతీయ లండన్ మహాసభ (1896) తీర్మానం

ఆ తీర్మానంలో యిలా వుంది:

"ఈ మహాసభ అన్ని జాతుల స్వయంనిర్ణయ హక్కునూ (Selbstbestimmungsrecht) సమర్థిస్తోందనీ, ఈనాడు సైనిక, జాతీయ లేక తదితర నిరంకుశత్వ శృంఖలాలకింద నలిగిపోతున్న ప్రతిఒక్క దేశపు కార్మికులపట్లా తన సానుభూతిని వ్యక్తంచేస్తోందనీ ప్రకటిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానాన్ని ఓడించేందుకోసమూ, అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ లక్ష్యాల సాధనకోసమూ సంయుక్తంగా పోరాడేందుకుగాను వర్గచైతన్యం కలిగిన (Klassen-bewusste = తమ వర్గ ప్రయోజనాలను అర్థంచేసుకున్న) యావత్ప్రపంచ కార్మిక శ్రేణులతో చేరవలసిందిగా యీ దేశాలన్నింటి కార్మికులకూ యీ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది."*

నేనింతకుముందే పేర్కొన్నట్లు మన అవకాశవాదులకి సెమ్‌కోవ్‌స్కీ, లీబ్‌మన్, యుర్కేవిచ్‌లకి యీ తీర్మానం గురించి బొత్తిగా తెలియనే తెలియదు. కాని రోజా లుక్సెంబుర్గ్‌కి దాని సంగతి తెలుసు. మన కార్యక్రమంలో ఉన్నట్లే "స్వయంనిర్ణయం" అన్న పదం వున్న ఆ తీర్మానపు పూర్తి పాఠాన్ని ఆమె ఉల్లేఖిస్తోంది.

రోజా లుక్సెంబుర్గ్ తన "అపూర్వ" సిద్ధాంత మార్గంలోంచి యీ ఆటంకాన్ని ఎలా తొలగిస్తుంది?

---

* లండన్ మహాసభకి సంబంధించిన అధికారిక జర్మన్ నివేదిక చూడండి: *Verhandlungen und Beschlüsse des internationalen sozialistischen Arbeiter- und Gewerkschafts-Kongresses zu London, vom 27. Yuli bis 1. August 1896*, Berlin, 1896, S. 18. అంతర్జాతీయ మహాసభల తీర్మానాలతో కూడిన చిన్న రష్యన్ పుస్తకం ఒకటి ప్రచురింపబడింది. దానిలో "స్వయంనిర్ణయం" అన్న పదం "స్వయంపాలన"గా తప్పుగా అనువదింపబడింది.

ఓ, దానిదేముంది చాలా అవలీలగా తొలగిస్తుంది: .... యావత్తు ఉటంకింపూ తీర్మానపు రెండవ భాగంలో వుంది... దాని ప్రకటనాత్మక స్వభావం... దాన్ని ఎవరైనా ప్రస్తావించడమంటే పొరపాటున మాత్రమే అలా చెయ్యగలరు!!

మన రచయిత్రి బలహీనతా పరమ గందరగోళమూ కేవలం ఆశ్చర్యకరమైనవి. మామూలుగా అవకాశవాదులే కార్యక్రమంలోని సుసంగతమైన ప్రజాస్వామిక, సోషలిస్టు భావాలు కేవలం ప్రకటనలు మాత్రమేనని చెప్తూ, వాటిమీద చర్చను పిరికిగా తప్పించుకొంటూ వుంటారు. రోజా లుక్సెంబుర్గ్ యీసారి సెమ్‌కోవ్‌స్కీల, లీబ్‌మన్‌ల, యుర్కేవిచ్‌ల శోచనీయ సాంగత్యంలో పడటమన్నది అకారణ విషయం కాదనడం సుస్పష్టం. తను అనుకొంటున్నది పై తీర్మానం సరైనదనా, సరైనది కాదనా అన్న విషయాన్ని బాహాటంగా చాటి చెప్పేందుకు రోజా లుక్సెంబుర్గ్ సాహసించదు. తీర్మానపు రెండో భాగాన్ని చదవడం మొదలుపెట్టేలోగా మొదటి భాగాన్ని మరచిపోయే, లేక, లండన్ మహాసభకి పూర్వం సోషలిస్టు పత్రికల్లో జరిగిన చర్చ గురించి ఎన్నడూ వినని, శ్రద్ధాళువు కాని, విషయ పరిజ్ఞానం లేని పాఠకుడిమీద ఆధారపడుతున్నట్లు, ఆమె యిటూ అటూ మాటలు మార్చి, కలగాపులగం చేస్తుంది.

అంత ముఖ్యమైన మౌలిక సమస్యమీద ఇంటర్నేషనల్ చేసిన తీర్మానాన్ని సవిమర్శకంగా పరిశీలించేపాటి వినయమైనా చూపకుండా, తిరస్కార భావంతో చూస్తున్న తాను, రష్యాలోని వర్గ చైతన్యం కలిగిన కార్మికుల దృష్టినుంచి తప్పించుకు పోగలనని రోజా లుక్సెంబుర్గ్ ఊహించుకుంటే, ఆమె పెద్ద పొరపాటు చేసినట్లే అవుతుంది.

రోజా లుక్సెంబుర్గ్ అభిప్రాయం లండన్ మహాసభకి పూర్వం జరిగిన చర్చల్లో, ప్రధానంగా జర్మన్ మార్క్సిస్టుల పత్రిక అయిన "Die Neue Zeit" పేజీల్లో వ్యక్తీకరింపబడింది. వాస్తవంలో, యీ అభిప్రాయం ఇంటర్నేషనల్‌లో పరాజితంచెయ్యబడింది! ఇదీ రష్యన్ పాఠకుడు తన మనస్సులో ప్రత్యేకించి ఉంచుకోవలసినది.

ఆ చర్చ పోలండు స్వాతంత్ర్య సమస్యమీద జరిగింది. మూడు అభిప్రాయాలు వ్యక్తం చేయబడ్డాయి:

1) "ఫ్రాకీ" అభిప్రాయం వీటిలో ఒకటి, దీని తరఫున హెక్కెర్ మాట్లాడాడు. పోలండు స్వాతంత్ర్య డిమాండుని గురించి ఇంటర్నేషనల్ తన సొంత కార్యక్రమంలో చేర్చాలని వాళ్లు కోరారు. ఇంటర్నేషనల్‌లో ఆ ప్రతిపాదనకి ఆమోదం లభించక, అది వీగిపోయింది.

2) రోజా లుక్సెంబుర్గ్ అభిప్రాయం: పోలిష్ సోషలిస్టులు పోలండుకి స్వాతంత్ర్యాన్ని

డిమాండు చెయ్యకూడదు. ఈ దృక్పథం జాతుల స్వయంనిర్ణయ హక్కు ప్రకటనని పూర్తిగా తోసిరాజంది. ఇంటర్నేషనల్ యీ అభిప్రాయాన్ని కూడా అలాగే ఓడించింది.

3) రోజా లుక్సెంబుర్గ్‌ని వ్యతిరేకించి, ఆమె భౌతికవాదం మిక్కిలి ఏకముఖమైనది అని రుజువుచేసి, అప్పట్లో కె. కౌట్స్కీ వివరించిన అభిప్రాయం. కౌట్స్కీ అభిప్రాయం ప్రకారం, ఇంటర్నేషనల్ అప్పట్లో పోలండు స్వాతంత్ర్యాన్ని తన కార్యక్రమంలో చేర్చుకోలేక పోయింది; అయితే, అలాంటి డిమాండును పోలిష్ సోషలిస్టులు ముందు పెట్టగలరు. సోషలిస్టుల దృష్టిలో, జాతీయ పీడన సాగే పరిస్థితిలో జాతీయ విముక్తి కర్తవ్యాలను అలక్ష్యంచెయ్యడం నిస్సందేహంగా పొరపాటు.

ఈ దృక్పథంలోని అత్యంత ఆవశ్యకమూ, మౌలికమూ అయిన ప్రతిపాదనలను ఇంటర్నేషనల్ తీర్మానం యిలా పునరుల్లేఖించింది: ఒకవైపున, అన్ని జాతుల పూర్తి స్వయం నిర్ణయ హక్కునూ పరమ బాహాటంగానూ, నిర్ద్వంద్వంగానూ గుర్తించడం; మరోవైపున, కార్మికుల వర్గపోరాటంలో వాళ్ల అంతర్జాతీయ ఐక్యతకోసం అంతే నిర్ద్వంద్వమైన విజ్ఞప్తి.

ఈ తీర్మానం పూర్తిగా సరైనదనీ, 20వ శతాబ్ది మొదట్లో తూర్పు యూరప్ దేశాలకూ, ఆసియా దేశాలకూ యీ తీర్మానమే — దాని రెండు భాగాలూ ఒక సమగ్ర మొత్తంగా — జాతుల సమస్యలో శ్రామికవర్గపు వర్గ విధానానికి ఒకేఒక సరైన మార్గ దర్శకత్వం యిస్తున్నదనీ నేను అభిప్రాయపడుతున్నాను.

పైన పేర్కొనబడిన మూడు దృక్పథాలని గురించి మరింత విపులంగా చర్చిద్దాం.

పోలండు స్వాతంత్ర్య డిమాండుకి క్రియాశీలమైన తోడ్పాటునివ్వడం యావత్తు పశ్చిమ యూరపియన్ డెమోక్రసీ, అంతకంటే అధికంగా సోషల్ డెమోక్రసీ పరమ విధి అని కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు పరిగణించిన సంగతి అందరికీ తెలిసిందే. 1840–1860ల కాలానికీ, ఆస్ట్రియా, జర్మనీల్లోని బూర్జువా విప్లవాల కాలానికీ, రష్యాలో "రైతు సంస్కరణ" కాలానికీ యీ దృక్పథం పూర్తి సరైనది, సుసంగతమైన ప్రజాస్వామిక, శ్రామిక వర్గ దృక్పథం యిదొక్కటే.

రష్యాలోని, స్లావ్ రాజ్యాల్లో అత్యధికమైనవాటిలోని జనబాహుళ్యం యింకా మగతలో కూరుకుపోయి వున్నంత కాలం, ఆ దేశాల్లో స్వతంత్ర, ప్రజా సామూహిక, ప్రజాతంత్ర ఉద్యమాలు లేనంత కాలం, పోలండులోని భూస్వామ్య ప్రభువుల విముక్తి ఉద్యమం, ఒక్క రష్యన్, ఒక్క స్లావ్‌ల యావత్తు దృక్పథంనుంచే కాకుండా, మొత్తంగా యూరపియన్ ప్రజాస్వామ్య దృక్పథంనుంచి బృహత్తర, సర్వోన్నత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.*[92]

---

* 1863లోని పోలిష్ భూస్వామ్య ప్రభువు తిరుగుబాటుదారుని వైఖరి — అఖిల

అయితే, 40లకీ, 50లకీ, 60లకీ, లేక 19వ శతాబ్ది మూడవ కాలు భాగానికీ సంబంధించి మార్క్స్ దృక్పథం పూర్తిగా సరైనదే అయినప్పటికీ, 20వ శతాబ్దం నాటికి అది సరైనది కాకుండా పోయింది. అత్యధిక స్లావ్ దేశాల్లోనూ, చివరకు స్లావ్ దేశాల్లో కెల్లా మిక్కిలి వెనకబడిన రష్యాలో సైతం స్వతంత్ర ప్రజాతంత్ర ఉద్యమాలూ, స్వతంత్ర శ్రామికవర్గ ఉద్యమం సైతం తలెత్తాయి. ప్రభువర్గపు పోలండు అంతరించిపోయి, పెట్టుబడిదారీ పోలండుకి చోటిచ్చింది. అలాంటి పరిస్థితుల్లో పోలండు తన అసాధారణ విప్లవాత్మక ప్రాముఖ్యాన్ని పోగొట్టుకోక తప్పలేదు.

మార్క్స్ ఒక భిన్నమైన యుగంలో కలిగివున్న దృక్పథాన్ని 1896లో శాశ్వతంగా అన్ని కాలాలకీ "స్థిరపరచాలన్న" పి.ఎస్.పి. (పోలిష్ సోషలిస్టు పార్టీ, యీనాటి "ఫ్రాకీ") ప్రయత్నం మార్క్సిజం మాటల్ని మార్క్సిజం భావానికి పోటీ పెట్టే ప్రయత్నం. అందు చేత, పోలిష్ సోషల్ డెమోక్రట్లు పోలిష్ పెటీబూర్జువావర్గపు అతీత జాతీయవాదాన్ని ఖండించి, పోలండులో మొట్టమొదటిసారిగా శుద్ధ శ్రామికవర్గ పార్టీని నెలకొల్పి జాతీయ సమస్య ద్వితీయ ప్రాముఖ్యం కలిగినదని పేర్కొనడమూ పోలిష్, రష్యన్ కార్మికులు తమ వర్గపోరాటంలో అత్యంత సన్నిహితమైన పొత్తును సాగించాలన్న అతి ముఖ్యమైన సూత్రాన్ని చాటిచెప్పడమూ పూర్తి రైటు.

అయితే, జాతుల స్వయంనిర్ణయ హక్కు, లేక విడిపోయే హక్కు తూర్పు యూరప్‌కీ, ఆసియాకీ అనవసరమని ఇంటర్నేషనల్ 20వ శతాబ్ది మొదట్లో పరిగ

---

రష్యా విప్లవ డెమోక్రట్ చెర్నిషేవ్‌స్కీ (ఈయన మార్క్స్‌లాగే పోలిష్ ఉద్యమ ప్రాముఖ్యాన్ని మెచ్చుకోగలిగాడు) వైఖరి, ఉక్రేనియన్ పెటీబూర్జువా ద్రగొమానొవ్ (ఇతను చాలా తర్వాతివాడు, ఎంతో అజ్ఞానీ, మందకొడివాడూ, తన పేడకుప్పకి బాగా అతుక్కుపోయినవాడూ అయిన ఒక రైతు అభిప్రాయాన్ని యితను వ్యక్తంచేశాడు, కాగా పోలిష్ భూస్వామ్య ప్రభువులపట్ల అతనికి వున్న ద్వేషం కారణంగా అఖిల రష్యా ప్రజాస్వామ్యం కోసం వాళ్లు చేసే పోరాట ప్రాముఖ్యాన్ని గమనించలేనంత అంధుడయాడు) వైఖరి — ఈ రెండు వైఖరులనూ సరిపోల్చిచూడటం చారిత్రక పరిశోధన దృష్ట్యా చాలా ఆసక్తికరంగా వుంటుంది. (చూడండి: ద్రగొమానొవ్, "చారిత్రకంగా పోలండు, మహా రష్యన్ ప్రజాస్వామ్యమూ.") ద్రగొమానొవ్ ఉద్రేకపూరిత చుంబనాలు పొందే విశేషమైన యోగ్యత వుంది. ఇవి అతగాడికి దరిమిలా పి. బి. స్త్రూవెనుంచి లభించాయి అప్పటికి అతను జాతీయ ఉదారవాదిగా మారాడు.

ణించి ఉండగలదని దీని అర్థమా? అలా పరిగణిస్తే అది అసంగతత్వానికి పరాకాష్ఠ అయి వుండేది, మరి (సైద్ధాంతికంగా) టర్కిష్, రష్యన్, చైనీయ రాజ్యాల సంస్కరణలు ఫలసిద్ధి పొందినట్లు ఆమోదించడమే అయివుండేది; నిజానికి అది (ఆచరణలో) నిరంకుశత్వం దిశగా అవకాశవాదమే అయివుండేది.

కాదు. తూర్పు యూరప్‌లోనూ, ఆసియాలోనూ బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలు జరిగిన కాలంలో, జాతీయోద్యమాలు జాగృతమై, ముమ్మరమై, స్వతంత్ర శ్రామిక వర్గ పార్టీలు రూపొందిన దశలో, జాతీయ విధానం విషయంలో యీ పార్టీల కర్తవ్యం ద్విముఖంగా ఉండాల్సివుంటుంది: బూర్జువా ప్రజాతంత్ర పరివర్తన యింకా పూర్తి కాలేదు గనుక, కార్మికవర్గ డెమోక్రటిక్ పార్టీ సుసంగతంగా, సీరియస్‌గా, చిత్తశుద్ధితో (ఉదారవాద, కొకోష్కిన్ పద్ధతిలో కాదు) జాతుల సమాన హక్కులకోసం పోరాడుతుంది గనుక అన్ని జాతుల స్వయంనిర్ణయ హక్కునూ గుర్తించడమూ, ఒకానొక నిర్దిష్ట రాజ్యంలో అన్ని జాతులకూ చెందిన అన్ని జాతుల వర్గపోరాటంలో — దాని చరిత్ర అంతట్లో అన్ని మార్పుల క్రమంలో, బూర్జువావర్గం అన్ని రకాల రాజ్యాల సరిహద్దుల మార్పులతో ఎలాంటి సంబంధమూ లేకుండా — విడదీయరాని పొత్తూ.

సరిగా శ్రామికవర్గపు యీ ద్విముఖ కర్తవ్యాన్నే 1896 నాటి ఇంటర్నేషనల్ తీర్మానం సూత్రీకరించింది. 1913 వేసవిలో జరిగిన రష్యన్ మార్క్సిస్టుల కాన్ఫరెన్సు తీర్మానపు సారాంశమూ, ఆ తీర్మానానికి మూలమైన సూత్రమూ అదే. ఈ తీర్మానంలో, జాతుల స్వయంనిర్ణయ హక్కునూ, విడిపోయే హక్కునూ గుర్తించే 4వ అంశం జాతీయవాదానికి అత్యధిక రాయితీని "దఖలుపరుస్తున్నట్లు" కనిపిస్తోంది (నిజానికి, అన్ని జాతుల స్వయంనిర్ణయ హక్కు గుర్తింపులో మిక్కిలి ఎక్కువ ప్రజాస్వామ్యమూ, మిక్కిలి తక్కువ జాతీయవాదమూ యిమిడివుంటాయి), 5వ అంశం ఆయా దేశాల బూర్జువావర్గాల జాతీయవాద నినాదాలకు వ్యతిరేకంగా కార్మికులను హెచ్చరించి, అంతర్జాతీయ సమైక్య శ్రామికవర్గ సంఘాల్లో అన్ని జాతుల కార్మికుల ఐక్యతనీ, సంలీనాన్నీ డిమాండు చేస్తుంది — అన్న వాస్తవంలో కొందరికి "వైరుధ్యం" కనిపిస్తుంది. అయితే, బొత్తిగా ఖాళీ బుర్రలున్న వాళ్లకే యిదొక "వైరుధ్యం." ఉదాహరణకు, విడిపోయి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటుచేసుకునేందుకు నార్వేకి వున్న స్వేచ్ఛను స్వీడిష్ కార్మికులు సమర్థించినప్పుడే స్వీడిష్, నార్విజియన్ శ్రామికవర్గాల ఐక్యతా, వర్గ సంఘీభావమూ ఎందుకు పెంపొందాయో యీ ఖాళీ బుర్రలు అవగాహన చేసుకోలేవు.

# 8. ఊహాజనితవాది కార్ల్ మార్క్స్, ఆచరణశీలి రోజా లుక్సెంబుర్గ్

పోలండు స్వాతంత్ర్యానికి "ఊహాస్వర్గం" అని పేరుపెట్టి, ఆ మాటని విసుగుపుట్టే దాకా పునరుచ్చరించి, రోజా లుక్సెంబుర్గ్ వ్యంగ్య స్ఫోరకంగా యిలా అడుగుతుంది: ఐర్లండు స్వాతంత్ర్యంకోసం మాత్రం ఎందుకు డిమాండుచెయ్య కూడదు?

ఐర్లండు స్వాతంత్ర్య సమస్యమీద కార్ల్ మార్క్స్ వైఖరి ఏమిటో పాపం "ఆచరణ శీలి" అయిన రోజా లుక్సెంబుర్గ్‌కి తెలియదనడం స్పష్టం. జాతీయ స్వాతంత్ర్యం కోసం ఒక నిర్దిష్టమైన డిమాండు, అవకాశవాద దృక్పథంనుంచి కాక, నిజాయితీ అయిన మార్క్సిస్టు దృక్పథంనుంచి ఎలా విశ్లేషింపబడిందో చూపేందుకుగాను యీ అంశాన్ని కొంచెం విపులంగా పరిశీలించడం ప్రయోజనకరంగా వుంటుంది.

తన సోషలిస్టు పరిచితుల తెలివినీ, సిద్ధాంతాల్లో వారి విశ్వాస ప్రగాఢత్వాన్నీ పరీక్షించేందుకుగాను, మార్క్స్ అంటూ వుండినట్లు, వారిని "తరిచి చూడటం" ఆయనకి ఒక అలవాటుగా ఉంటూండేది. లొపాతిన్‌తో పరిచయం చేసుకున్నాక, 1870 జూలై 5న ఎంగెల్సుకి మార్క్స్ ఒక లేఖ రాశాడు. అందులో ఆయన ఆ యువ రష్యన్ సోషలిస్టుని గురించి బాగా ఉన్నతాభిప్రాయాన్ని వెల్లడిస్తూ, అదే సమయంలో యిలా జోడించాడు:

"...పోలండు విషయంలో అతనికి ప్రగాఢమైన అవగాహన లేదు. ఈ అంశంమీద అతను సరిగ్గా ఒక ఆంగ్లేయుడి మాదిరిగా – పాత తరహా ఆలోచనా ధోరణికి చెందిన ఒక ఆంగ్ల చార్టిస్టు[93] లాగా – ఐర్లండుని గురించి మాట్లాడతాడు."

ఒక పీడిత జాతిని గురించి మీ వైఖరి యేమిటని పీడక జాతికి చెందిన ఒక సోషలిస్టుని మార్క్స్ ప్రశ్నిస్తాడు, ప్రబల దేశాలకు (ఆంగ్ల, రష్యన్) చెందిన సోషలిస్టుల్లో సర్వసామాన్యంగా ఉండే ఒక లోపాన్ని వెన్వెంటనే ఆయన బహిర్గతంచేస్తాడు. అదేమిటంటే, అణగదొక్కబడిన జాతులపట్ల సోషలిస్టులుగా తమ సోషలిస్టు బాధ్యతలను అర్థంచేసుకోవడంలో వైఫల్యం, "ప్రబల జాతి" బూర్జువావర్గంనుంచి సంతరించుకున్న దురభిప్రాయాలను వాళ్లు ప్రతిధ్వనించడం.

ఐర్లండును గురించి మార్క్స్ చేసిన కచ్చితమైన ప్రకటనలను చూసేందుకు ముందు, జాతుల సమస్యపట్ల మార్క్స్ ఎంగెల్స్‌ల వైఖరి సాధారణంగా తీవ్ర విమర్శనాత్మకమైనదనీ,

చారిత్రకంగా పరిమితమైనదిగా దాని ప్రాముఖ్యాన్ని వారు గుర్తించారనీ పేర్కొనవలసి వుంది. ఈవిధంగా, చరిత్ర అధ్యయనం పోలండును గురించి తను నిరాశావహమైన నిర్ణయాలకు చేరుకునేందుకు దారితీస్తోందనీ, పోలండు ప్రాముఖ్యం తాత్కాలికమైనదనీ — రష్యాలో వ్యావసాయిక విప్లవం జరిగేదాకా మాత్రమేననీ — 1851 మే 23న మార్క్సుకి రాసిన లేఖలో ఎంగెల్సు పేర్కొన్నాడు. చరిత్రలో పోలిష్‌వారి పాత్ర అన్నది "సాహసికమైన మూర్ఖత్వం." "పోలండు ఒక్కగానొక్క సందర్భంలోనైనా, చివరకు రష్యా విషయంలోనైనా, విజయవంతంగా ప్రగతికి ప్రాతినిధ్యం వహించినట్లు గాని, లేక చారిత్రక ప్రాముఖ్యం కలిగినదేదైనా చేసిందనేందుకు గాని ఒక్క ఉదాహరణని కూడా ఎవరూ చూపించలేరు." "సోంబేరి భూస్వామ్య ప్రభువుల పోలండు" కన్న రష్యాలో ఎక్కువ నాగరికత, విద్య, పరిశ్రమలు, బూర్జువావర్గమూ ఉన్నాయి. "సెంట్ పీటర్స్‌బుర్గ్, మాస్కో, ఒదేస్సలతో పోల్చినప్పుడు వార్సా, క్రాకొవ్‌లు ఏపాటివి!" పోలిష్ భూస్వామ్య ప్రభువుల తిరుగుబాట్ల విజయంపట్ల ఎంగెల్సుకి విశ్వాసం లేదు.

అయితే, ప్రగాఢమైన మేధా సంపత్తిని వెల్లడించే యీ భావాలన్నీ, మరో పన్నెండేళ్ల తర్వాత, రష్యా యింకా నిద్రాణమై వుండి, పోలండు కుతకుతలాడుతున్న తరుణంలో, పోలిష్ ఉద్యమంపట్ల అత్యంత ప్రగాఢమూ, ఉత్సాహభరితమూ అయిన సానుభూతిని వ్యక్తం చేయడానికి ఎంగెల్సు, మార్క్సులకు ఆటంకం కాలేదు.

1864లో ఇంటర్నేషనల్ విజ్ఞప్తిని రచించేటప్పుడు, మార్క్సు ఎంగెల్స్‌కి (1864 నవంబరు 4న) తను మజ్జీనీ జాతీయవాదంమీద పోరాటం జరపవలసివచ్చిందని పేర్కొని, యింకా యిలా రాశాడు: "విజ్ఞప్తిలో అంతర్జాతీయ రాజకీయాల ప్రసక్తి వచ్చినప్పుడు, నేను జాతులను గురించి కాక దేశాలని గురించి చెప్పాను, minores gentium*ని కాక, రష్యాని ఖండించాను." "కార్మిక సమస్య"తో పోల్చినప్పుడు జాతీయ సమస్య తగ్గు స్థానం విషయంలో మార్క్సుకి ఎలాంటి సందేహమూ లేదు. అయితే, ఆయన సిద్ధాంతం జాతీయ ఉద్యమాలను అలక్ష్యం చేసిందనడంలో ఆకాశానికీ భూమికీ మధ్య ఉన్నంత ఎడం ఉంది.

1866 వచ్చింది. "జాతులన్నవి అర్థరహితమైనవని ప్రకటించి, బిస్మార్కు, గరిబాల్డీలమీద దాడులు జరిపే 'ప్రూడనిస్టు ముఠా'"ని గురించి మార్క్సు ఎంగెల్సుకి రాశాడు. "జాతీయ దురహంకారతత్వానికి వ్యతిరేకంగా వాదోపవాదాలకైతే వాళ్ల చర్యలు ఉపయోగకరమైనవీ, సహేతుకమైనవే. కాని ప్రూడన్‌లో విశ్వాసం కలిగినవారుగా (నాకిక్కడ చాలా

---

* తక్కువ స్థాయి జాతులు. — సం.

మంచి స్నేహితులైన లాఫార్గ్, లోంగెలు కూడా యీ ముఠాకే చెందుతారు) (ఫ్రాన్సులోని పెద్దమనుషులు పేదరికాన్నీ, అజ్ఞానాన్నీ రూపుమాపేదాకా యావత్తు యూరపూ గొంతు కూర్చోవాలనీ, కూర్చుంటుందనీ భావించేవాళ్ళుగా మాత్రం — వాళ్ళ హాస్యాస్పదులు" (1866 జూన్ 7వ తేదీ లేఖ).

1866 జూన్ 20న మార్క్స్ యిలా రాశాడు: "ఇంటర్నేషనల్ కౌన్సిల్లో ప్రస్తుత యుద్ధంమీద నిన్న చర్చలు జరిగాయి... మనం ముందే ఊహించుకోగలిగినట్లు, మొత్తం మీద 'జాతీయ సమస్య' గురించిన, ఆ సమస్యపట్ల మనం తీసుకునే వైఖరి గురించిన ప్రస్తావనకు ఆ చర్చలు పరిమితమయాయి.... 'తరుణ ఫ్రాన్సు' ప్రతినిధులు (కార్మికేతరులు) జాతులూ, చివరకు దేశాలూ సైతం 'పాతగిలిపోయిన దుర్భ్రమలు' అన్న భావాన్ని ముందుకు తెచ్చారు. ప్రూడన్ తరహా ష్టిర్నెరిజం.... ఫ్రెంచివాళ్ళ సామాజిక విప్లవానికి పరిణతులయ్యేదాకా యావత్ప్రపంచమూ వేచివుంటుందన్న భావం.... జాతులను రద్దు చేసిపారేసిన మన మిత్రులు లాఫార్గ్ ప్రభృతులు, మనతో ఫ్రెంచిలో, అంటే, శ్రోతల్లో పదింట తొమ్మిదిమందికి అర్థం కాని భాషలో మాట్లాడారు అన్న మాటలతో నేను నా ఉపన్యాసం మొదలుపెట్టగానే ఇంగ్లీషువాళ్ళ విపరీతంగా నవ్వారు. జాతుల నాస్తీకరణ ద్వారా లాఫార్గ్, తనకి బొత్తిగా తెలియకుండానే, ఆదర్శప్రాయమైన ఫ్రెంచి జాతిలో వాటి విలీనంగా అర్థంచేసుకున్నట్లుందని కూడా నేను సూచించాను."

మార్క్స్ చేసిన ఆయా విమర్శనాత్మక వ్యాఖ్యలన్నింటినుంచీ తేలే నిర్ధారణ యేమిటో సుస్పష్టం: జాతీయ సమస్యను ఇతరుల మాదిరిగా కార్మికవర్గం ఒక సంకేతారాధనను చెయ్యదు. పెట్టుబడిదారీ విధానం అన్ని జాతులనూ స్వతంత్ర జీవనానికి విధిగా జాగృతం చెయ్యకపోవడమే యిందుకు కారణం. అయితే, సామూహిక జాతీయోద్యమాలు మొదలయ్యాక వాటిని తోసిపుచ్చడం, వాటిలో ప్రగతిశీలమైనదానికి తోడ్పాటునివ్వ నిరాకరించడం అన్నదానికి ఆచరణలో అర్థమేమిటంటే, జాతీయవాద దురభిప్రాయాలకు దోహదంచెయ్యడమే, అంటే, తన "సొంత జాతి" ఒక "ఆదర్శవంతమైన" జాతిగా గుర్తించడం (లేక, మనం యిలా కూడా చేర్చవచ్చు, రాజ్యంగా ఏర్పడే ప్రత్యేకమైన విశేష హక్కు కలిగిన జాతిగా గుర్తించడం).*

* 1867 జూన్ 3న మార్క్స్ ఎంగెల్సుకి రాసిన లేఖను కూడా పోల్చిచూడండి: "...'The Times'[94]లో వెలువడ్డ పారిస్ లేఖల్లో రష్యాకి వ్యతిరేకంగా పారిస్ వాసులు చేసిన పోలిష్ అనుకూల వ్యాఖ్యలను చూసినప్పుడు నాకు నిజంగా సంతోషం కలిగింది.... ప్రూడనూ, అతని సిద్ధాంతజడమైన ముఠా అసలైన ఫ్రెంచి ప్రజలు కారు."

సరే మళ్లీ ఐర్లండు సమస్యకి వెళ్దాం.

మార్క్స్ లేఖల్లోని యీకింది భాగాల్లో యీ సమస్యమీద ఆయన వైఖరి ఏమిటో మిక్కిలి స్పష్టంగా వ్యక్తంచెయ్యబడింది:

"ఫెనియనిజానికి[95] అనుకూలంగా ఆంగ్ల కార్మికుల ప్రదర్శన జరిపేందుకు నేను నా శాయశక్తులా కృషిచేశాను.... ఇంగ్లండునుంచి ఐర్లండు వేర్పాటు అసంభవమని నేను అనుకొంటూ ఉండేవాణ్ణి. వేర్పాటు తదనంతరం సమాఖ్య ఏర్పడటం సంభవమే అయినప్పటికీ, యీ వేర్పాటు అనివార్యమని నేనిప్పుడు అనుకుంటున్నాను." ఎంగెల్సుకి 1867 నవంబరు 2న మార్క్స్ రాసినది సరిగ్గా యిదీ.

అదే సంవత్సరం నవంబరు 30న తను రాసిన లేఖలో ఆయన యిలా జోడించాడు:

"ఆంగ్ల కార్మికులకి మనం ఏమి సలహా యిద్దాం? నా ఉద్దేశంలో వాళ్ళ యూనియన్ రద్దును" [ఇంగ్లండుతో ఐర్లండు యూనియన్‌ని, అంటే, ఇంగ్లండునుంచి ఐర్లండు వేర్పాటుని] "(క్లుప్తంగా చెప్పాలంటే, 1783నాటి డిమాండు, ప్రజాస్వామికం చెయ్యబడి, యీకాల పరిస్థితులకి అన్వర్తింపబడాలి[96]) తమ కార్యక్రమంలోని ఒక క్లాజుని చెయ్యాలి. ఐరిష్ విమోచనకి సంబంధించి యిది మాత్రమే చట్టబద్ధమైన పద్ధతి, తత్కారణంగా ఆంగ్ల పార్టీ కార్యక్రమంలో చేర్చ సాధ్యమైన ఒకేఒక రూపం. ఈ రెండు దేశాల మధ్యా కేవల వ్యక్తిగత యూనియన్ మనుగడ కొనసాగగలదా అన్న విషయాన్ని దరిమిలా అనుభవం రుజువుచెయ్యాలి....

"... ఐరిష్‌వారికి కావలసింది ఏమిటంటే:

"1) స్వయంపాలన, ఇంగ్లండునుంచి స్వాతంత్ర్యం.

"2) వ్యావసాయిక విప్లవం...."

ఐరిష్ సమస్యకి మార్క్స్ విశేషమైన ప్రాముఖ్యాన్ని ఆపాదించాడు, ఈ సమస్యమీద జర్మన్ కార్మిక సంఘంలో గంటన్నర ఉపన్యాసాలు యిచ్చాడు (1867 డిసెంబరు 17వ తేదీ లేఖ).

1868 నవంబరు 20న రాసిన లేఖలో "ఐరిష్‌వాళ్లపట్ల ఆంగ్ల కార్మికుల్లో కనిపించిన ద్వేషం" గురించి ఎంగెల్స్ ప్రస్తావించాడు. దాదాపు ఒక ఏడాది తర్వాత (1869 అక్టోబరు 24) యీ అంశం గురించి మళ్లీ ప్రస్తావిస్తూ ఆయన యిలా రాశాడు:

"ఐర్లండునుంచి రష్యాకి il n'y a qu'un pas [ఒక్క అడుగు మాత్రమే] .... ఒక జాతికి మరొక జాతిని లోబరచుకోవడం ఎలాంటి దురదృష్టమో ఐరిష్ చరిత్రను చూస్తే తెలుస్తుంది. ఇంగ్లీషువాళ్ల రోత అలవాట్లన్నింటికీ మూలం ఆంగ్లేయుల పరిపాలనకు లోబడిన ఐర్లండులో వుంది. క్రామ్‌వెల్ కాలాన్ని నేనింకా పరిశీలించవలసివుంది.

కాని, యింతవరకు మటుకు కచ్చితమని నాకు అనిపిస్తోంది, అదేమిటంటే, ఐర్లండులో సైనిక పాలనని సాగించి, అక్కడొక కొత్త ప్రభువర్గాన్ని సృష్టించవలసిరాకపోతే, ఇంగ్లండులో సైతం ఘటనలు మరో మార్గం పట్టివుండేవి.''

సందర్భవశాత్తూ, 1869 ఆగస్టు 18న ఎంగెల్సుకి మార్క్స్ రాసిన ఉత్తరాన్ని చూద్దాం:

''పోసెన్‌లోని పోలిష్ కార్మికులు, బెర్లిన్‌లోని తమ సహచరుల సహాయంతో విజయవంతంగా ఒక సమ్మె చేశారు. 'పెట్టుబడిగారికి' వ్యతిరేకంగా జరిగిన యీ పోరాటం — సమ్మె అనే నిమ్న రూపంలోనైనా — బూర్జువా పెద్దమనుషుల పెదవులనుంచి శాంతి ప్రవచనాలనుకుంటె జాతీయ దురభిప్రాయాలను వదిలించుకొనే మరింత గంభీరమైన ఒక పద్ధతి.''

ఇంటర్నేషనల్‌లో ఐరిష్ సమస్యమీద మార్క్స్ అనుసరించిన విధానమేమిటో యీకింది వాటినుంచి గ్రహించవచ్చు:

ఐరిష్ క్షమాదానంపట్ల బ్రిటిష్ మంత్రివర్గ వైఖరి సమస్యమీద ఇంటర్నేషనల్ కౌన్సిల్లో గంటంపావు తను ప్రసంగించాననీ, యీకింది తీర్మానాన్ని ప్రతిపాదించాననీ 1869 నవంబరు 18న ఎంగెల్స్‌కి రాసిన ఒక లేఖలో మార్క్స్ రాశాడు:

''నిర్బంధంలో వున్న ఐరిష్ దేశభక్తులను విడుదల చెయ్యాలన్న ఐరిష్ డిమాండ్లకు తానిచ్చిన సమాధానంలో మిస్టర్ గ్లాడ్‌స్టన్ బుద్ధిపూర్వకంగా ఐరిష్ జాతిని అవమానిస్తున్నాడనీ;[97]

''దుష్పరిపాలనకి గురైనవాళ్ళకీ, అలాగే వాళ్ళు ఏ జాతికైతే చెందుతారో ఆ జాతికీ అవమానకరమైన షరతులతో రాజకీయ క్షమాదానాన్ని ఆయన అడ్డుకొంటున్నాడనీ;

''తను బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా, బహిరంగంగానూ, సముత్సాహంగానూ అమెరికన్ బానిసయజమానుల తిరుగుబాటును హర్షించినమీదట, ఆయన యిప్పుడిక ఐరిష్ ప్రజలకి సాత్విక విధేయతా సిద్ధాంతాన్ని బోధించేందుకు పూనుకుంటున్నాడనీ;

''ఐరిష్ క్షమాదాన సమస్య విషయంలో ఆయన యావత్తు కార్యకలాపాలూ ఆ 'ఆక్రమణ విధానపు' — దీన్ని తీవ్రంగా నిరసించడం ద్వారానే మిస్టర్ గ్లాడ్‌స్టన్ తన ప్రత్యర్థులైన టోరీలను అధికారచ్యుతుల్ని చేశాడు — నిజమైన, నికార్సైన సంతానమేననీ;

''అంతర్జాతీయ కార్మిక సంఘ జనరల్ కౌన్సిల్, ఐరిష్ ప్రజలు తమ రాజకీయ క్షమాదాన ఉద్యమాన్ని నిర్వహిస్తున్న ఉద్రేకపూరితమూ, సుదృఢమూ, ఆత్మౌన్నత్య పూరితమూ అయిన రీతిని హర్షిస్తోందనీ;

"యూరప్, అమెరికాల్లోని అంతర్జాతీయ కార్మిక సంఘ శాఖలన్నింటికీ, దానితో సంబంధమున్న కార్మిక సంఘాలన్నింటికీ యీ తీర్మానాన్ని పంపాలనీ;

"తీర్మానించడమైనది."

ఇంటర్నేషనల్ కౌన్సిల్లో ఐరిష్ సమస్యపై తను చదవబోయే పత్రం యిలా ఉండబోతుందని 1869 డిసెంబరు 10న మార్క్స్ రాశాడు:

"ఐర్లండుకి 'అంతర్జాతీయ,' 'మానవీయ' న్యాయాన్ని గురించిన పదబంధాలన్నింటి మాటా అలా వుంచి – ఇంటర్నేషనల్ కౌన్సిల్ వాటిని వాస్తవంగా పరిగణిస్తుంది – ఐర్లండుతో తన ప్రస్తుత సంబంధాన్ని వదిలించుకోవడం ఆంగ్ల కార్మికవర్గపు ప్రత్యక్ష, పరమ ప్రయోజనానికి అనుగుణమైనది. కొన్ని కారణాల మూలంగా ఇది నా పూర్తి నమ్మకం. ఈ కారణాల్లో కొన్ని నేను ఆంగ్ల కార్మికులకి నేరుగా చెప్పలేనివి. ఆంగ్ల కార్మికవర్గం ప్రాబల్యంలోకి వస్తే ఐరిష్ పాలనని కూలదొయ్యడం సాధ్యమవుతుందని నేను చాలా కాలంపాటు నమ్ముతూ వచ్చాను. నేనెప్పుడూ యిదే అభిప్రాయాన్ని 'New York Tribune'లో [ఇదొక అమెరికన్ పత్రిక. చాలా కాలంపాటు మార్క్స్ యీ పత్రికకు తన రచనలు పంపాడు][98] వ్యక్తంచేస్తూ వచ్చాను. గాఢమైన అధ్యయనం మూలంగా నేనిప్పుడు దానికి భిన్నమైన అభిప్రాయానికి చేరుకున్నాను. ఐర్లండుని వదిలించుకొంటేనేగాని ఆంగ్ల కార్మిక వర్గం ఎన్నడూ దేన్నీ సాధించలేదు.... ఇంగ్లండులోని ఆంగ్ల అభివృద్ధి నిరోధకత్వానికి మూలం ఐర్లండును లోబరచుకోవడంలో ఉంది." (మార్క్స్ వక్కాణింపు.)

ఐరిష్ సమస్యమీద మార్క్స్ విధానమేమిటో మా పాఠకులకు యిప్పటికి పూర్తిగా స్పష్టపడివుండాలి.

"ఊహాజనితవాది" అయిన మార్క్స్ ఎంతటి "అనాచరణాత్మకమైనవాడంటే," ఆయన ఐర్లండు వేర్పాటుకి అనుకూలంగా నిలబడ్డాడు, మరి ఈ వేర్పాటు అర్ధశతాబ్దం గడిచిన తర్వాత కూడా సాధింపబడలేదు.

మార్క్స్‌యొక్క యీ విధానం ఎలా ఉత్పన్నమైంది, అది తప్పు కాదా?

ఐర్లండు, పీడిత జాతి జాతీయోద్యమం ద్వారా విముక్తం కాదనీ, అందుకు భిన్నంగా అది పీడక జాతి కార్మికోద్యమం ద్వారా విముక్తమవుతుందనీ మొదట్లో మార్క్స్ భావించాడు. కార్మికవర్గ విజయం మాత్రమే అన్ని జాతుల సంపూర్ణ విముక్తిని సాధించగలదని ఎరిగివున్న మార్క్స్, జాతీయోద్యమాన్ని పరమమైనదిగా చిత్రించలేదు. పీడిత జాతుల బూర్జువా విముక్తి ఉద్యమాలకీ, పీడక జాతి శ్రామికవర్గ విమోచనోద్యమానికీ మధ్య ఉండగల సంబంధాలన్నింటినీ ముందుగానే అంచనావెయ్యడం (సరిగ్గా యీ సమస్యే రష్యాలో జాతుల సమస్యని యీనాడు ఎంతో క్లిష్టం చేస్తోంది) అసాధ్యం.

అయితే, ఆంగ్ల కార్మికవర్గం లిబరల్సు పలుకుబడికింద దీర్ఘకాలం ఉండటం తటస్థించి, లిబరల్సుకి అది ఒక తోకగా తయారైంది, లిబరల్ కార్మిక విధానాన్ని అవలంబించడం ద్వారా తనని తాను నాయకుడు లేకుండా చేసుకుంది. ఐర్లండులో బూర్జువా విముక్తి ఉద్యమం మరింత బలపడి విప్లవాత్మక రూపాలను సంతరించుకుంది. మార్క్స్ తన అభిప్రాయాన్ని పునర్విమర్శించుకొని, దాన్ని సరిదిద్దుకున్నాడు. "ఒక జాతికి మరొక జాతిని లోబరచుకోవడం ఎలాంటి దురదృష్టం." ఆంగ్ల శృంఖలాలనుంచి ఐర్లండు స్వతంత్రం కానిదే ఆంగ్ల కార్మికవర్గం ఎన్నడూ స్వతంత్రం కాదు. ఐర్లండు బానిసత్వం మూలంగా ఇంగ్లండులోని అభివృద్ధినిరోధక శక్తులు బలపడి, పెంపొందాయి (సరిగ్గా, రష్యా యితర దేశాలను బానిసలుగా చేసుకున్న కారణంగా రష్యాలోని అభివృద్ధినిరోధక శక్తులు పెంపొందినట్లుగా!).

ఇంటర్నేషనల్‌లో "ఐరిష్ జాతి"కీ, "ఐరిష్ ప్రజ"కీ సానుభూతి తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ (తెలివిపరుడైన ఎల్. వ్ల. పాపం మార్క్స్‌ని వర్గపోరాటాన్ని విస్మరించినందుకు బహుశా దూషించివుండేవాడే!), "వేర్పాటు అనంతరం సమాఖ్య ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ," ఇంగ్లండునుంచి ఐర్లండు వేర్పాటును మార్క్స్ ప్రతిపాదించాడు.

మార్క్స్ నిర్ధారణకి అప్పట్లో సైద్ధాంతిక ఆధారాలేమిటి? ఇంగ్లండులో బూర్జువా విప్లవం చాలా కాలం క్రితమే పూర్తిచెయ్యబడింది. అయితే ఐర్లండులో అదింకా పూర్తికాలేదు. అర్ధశతాబ్ది గడిచిపోయాక, ఆంగ్ల లిబరల్సు సంస్కరణల ద్వారా, అది యిప్పుడే పూర్తిచెయ్యబడుతోంది. మార్క్స్ మొదట్లో ఆశించినంత త్వరగా ఇంగ్లండులో పెట్టుబడిదారీ వ్యవస్థ కూలదొయ్యబడివుంటే, ఐర్లండులో బూర్జువా ప్రజాతంత్ర, సార్వత్రిక జాతీయోద్యమానికి ఆస్కారం ఉండేది కాదు. అయితే అది తలెత్తింది గనుక, దానికి తోడ్పాటునిచ్చి, దానికి విప్లవాత్మకమైన ఊపునిచ్చి, తమ సొంత ప్రయోజనాల నిమిత్తమే దాన్ని చివరికంటా తీసుకెళ్లవలసిందిగా ఆంగ్ల కార్మికులకు మార్క్స్ సలహా యిచ్చాడు.

1860 దశకంలో ఐర్లండు, ఇంగ్లండుల మధ్య ఆర్థిక సంబంధాలు, పోలండు, ఉక్రెయిన్, వగైరాలతో యీనాడు రష్యాకి వున్న సంబంధాలకన్న మరింత సన్నిహితమైనవిగా వుండేవనడం స్పష్టం. ఐర్లండు వేర్పాటు "అనాచరణీయత," "అసాధ్యత" (భౌగోళిక పరిస్థితులు, ఇంగ్లండుకి వున్న విశేషమైన వలస శక్తి కారణంగా మాత్రమే అయినా) పూర్తిగా స్పష్టం. సూత్రరీత్యా సమాఖ్యతత్వానికి శత్రువే అయినప్పటికీ, మార్క్స్ యీ మారు సమాఖ్య సంభావ్యతని కూడా సమ్మతించాడు,* అయితే, అందుకు ఒక షరతు

---

* సందర్భవశాత్తూ, సోషల్ డెమోక్రటిక్ దృక్పథంనుంచి, "స్వయంనిర్ణయ" హక్కుకి అర్థం సమాఖ్యా కాదు, స్వయంపాలనా కాదు అన్న విషయాన్ని గమనించడం కష్టం కాదు

ఏమిటంటే, ఐర్లండు విముక్తి సంస్కరణవాద పద్ధతిలో కాక, విప్లవాత్మక పద్ధతిలో, ఇంగ్లండు కార్మికవర్గపు తోడ్పాటుతో ఐరిష్ జనబాహుళ్యపు ఉద్యమం ద్వారా సాధింప బడాలి. ఆ చారిత్రక సమస్యకి అలాంటి పరిష్కారం మాత్రమే శ్రామికవర్గ ప్రయోజనాలను అత్యుత్తమ పద్ధతిలో తీర్చివుండేదనడానికీ, శీఘ్ర సాంఘిక ప్రగతికి అత్యంత సానుకూలమైన దనడానికీ ఎలాంటి సందేహమూ ఉండజాలదు.

అయితే, వ్యవహారాలు యిందుకు భిన్నంగా జరిగాయి. ఐరిష్ ప్రజలూ, ఆంగ్ల శ్రామిక వర్గమూ కూడా బలహీనంగా ఉన్నట్లు తేలింది. ఇప్పుడు మాత్రమే, ఆంగ్ల లిబరల్సుకీ, ఐరిష్ బూర్జువావర్గానికీ మధ్య వ్యవసాయ సంస్కరణ ద్వారానూ (నష్ట పరిహారంతో), హోమ్ రూల్ ద్వారానూ (యింకా ప్రవేశపెట్టబడలేదు) ఐరిష్ సమస్య పరిష్కరింపబడు తోంది (ఇది ఎంత కష్టంగా జరుగుతోందో అల్‌స్టర్* ఉదాహరణనుబట్టి చూడవచ్చు). అయితే, ఏమిటిట? దీన్నిబట్టి మార్క్స్, ఎంగెల్సులు "ఊహాజనితవాదుల"నీ, జాతులకు సంబంధించి వారు "అసాధ్యమైన" డిమాండ్లు ప్రతిపాదించారనీ, లేక ఐరిష్ పెటీ బూర్జువా జాతీయవాదుల ప్రభావానికి తమని తాము గురికానిచ్చుకున్నారనీ (ఎందు కంటే, ఫెనియన్ ఉద్యమపు పెటీబూర్జువా స్వభావం విషయంలో సందేహమేమీ లేదు), వగైరాలనీ తేలుతోందా?

లేదు. ఐరిష్ సమస్యలో కూడా మార్క్స్, ఎంగెల్సులు సుసంగతమైన శ్రామికవర్గ విధానాన్ని అనుసరించారు. ఆ విధానం జనబాహుళ్యాన్ని ప్రజాస్వామ్య, సోషలిజం అవగాహ నలో నిజంగానే సుశిక్షితులను చేసింది. కేవలం అలాంటి విధానం మాత్రమే, అవసరమైన సంస్కరణలను ప్రవేశపెట్టడంలో ఐర్లండు, ఇంగ్లండులు రెండింటికీ అర్ధశతాబ్దపు

---

(సాధారణంగా చెప్పాలంటే, రెండూ కూడా "స్వయంనిర్ణయం" అన్న భావాభివర్గం కిందికే వస్తాయి). సమాఖ్య అన్నదానికి ద్వైపాక్షిక ఒప్పందం అని అర్థం కనుక, సమాఖ్య హక్కు అన్నది శుద్ధ అర్థరహితమైనది. మార్క్సిస్టులు తమ కార్యక్రమంలో సమాఖ్య తత్వ సమర్థనను చేర్చలేరన్న విషయం స్వయంస్పష్టమే. ఇంక స్వయంపాలనకు సంబం ధించినంతవరకు, మార్క్సిస్టులు స్వయంపాలన "హక్కును" కాక, బహుళ జాతుల సంపు టినీ, విశేష వైవిధ్యపూరిత భౌగోళికాది పరిస్థితులనూ కలిగిన ప్రజాతంత్ర రాజ్యపు స్వయంపాలననే, ఒక సాధారణ సార్వత్రిక సూత్రంగా సమర్థిస్తారు. తత్పర్యవసానంగా, "జాతుల సమాఖ్య హక్కు" గుర్తింపు అన్నది ఎంత అసందర్భమో, "జాతుల స్వయం పాలన హక్కు" అన్నది కూడా అంతే అసందర్భమైనది.

* ఐర్లండ్‌లో ముఖ్య పట్టణం. — సం.

విలంబన జరగకుండా కాపాడి, అభివృద్ధి నిరోధకుల మెప్పుదలకోసం లిబరల్సు యీ సంస్కరణలను అపభ్రంశం చెయ్యకుండా నిరోధించగలిగివుండేది.

ఐరిష్ సమస్యమీద మార్క్సు, ఎంగెల్సుల విధానం జాతీయోద్యమాలపట్ల పీడక జాతుల శ్రామికవర్గం ఎలాంటి వైఖరిని అవలంబించాలన్నదానికి ఉజ్వలమైన నమూనాగా వుంటుంది. ఈ నమూనా తన విశేష ఆచరణాత్మక ప్రాముఖ్యాన్ని ఈనాటికీ ఏమాత్రం కోల్పోలేదు. ఒక దేశపు భూస్వాముల, బూర్జువాల హింసాకాండ, విశేష హక్కుల మూలంగా నెలకొల్పబడిన సరిహద్దులను మార్చాలన్న భావాన్ని "ఊహాజనితమైనది" అంటూ ముద్ర వేసేందుకు అన్ని దేశాల, రంగుల, భాషల కూపస్థమండూకాలూ చూపే "బానిసబుద్ధితో కూడిన హడావిడి"కి వ్యతిరేకంగా యిదొక హెచ్చరికగా పనికొస్తుంది.

ఐరిష్, ఆంగ్ల శ్రామికవర్గాలు మార్క్సు విధానాన్ని ఆమోదించలేదన్నా, ఐర్లండు వేర్పాటును తమ నినాదాన్ని చేసుకోలేదన్నా, అది చాలా హీనమైన అవకాశవాదం అవుతుంది. ప్రజాస్వామ్యవాదులుగానూ, సోషలిస్టులుగానూ తమ విధులపట్ల వారి అశ్రద్ధా, ఆంగ్ల అభివృద్ధినిరోధక శక్తులకీ, ఆంగ్ల బూర్జువావర్గానికీ వాళ్లు యిచ్చిన రాయితీ అయివుండేవి.

# 9. 1903 కార్యక్రమమూ, దాని రద్దుదారులూ

రష్యన్ మార్క్సిస్టుల కార్యక్రమం ఆమోదించబడిన 1903 మహాసభ మినిట్సు మహా అపురూపమైపోయాయి. కార్మికోద్యమపు క్రియాశీల సభ్యుల్లో విస్తృత మెజారిటీకి యీనాడు వివిధ అంశాల వెనక వున్న ప్రధానోద్దేశాలతో పరిచయం లేదు (దానికి సంబంధించిన సాహిత్యమంతటికీ చట్టబద్ధ ప్రతిపత్తి లేకపోవడం యిందుకు మరింతగా కారణం....). అందుచేత, ప్రస్తుతం మన పరిశీలనలో ఉన్న సమస్యమీద 1903 మహాసభలో జరిగిన చర్చలను విశ్లేషించడం అవసరం.

మొట్టమొదట నన్నొక విషయం చెప్పనియ్యండి. "జాతుల స్వయంనిర్ణయ హక్కు"ను గురించిన రష్యన్ సోషల్ డెమొక్రటిక్ సాహిత్యం ఎంత తక్కువగా ఉన్నా కూడా, దాన్ని చూస్తే, యీ హక్కు ఎప్పుడూ విడిపోయేందుకు హక్కుగానే అర్థంచేసుకోబడిందన్న విషయం సుస్పష్టమవుతుంది. ఈ విషయాన్ని శంకించి, 9వ క్లాజు "అస్పష్టంగా" వుందనీ, వగైరాలు చెప్పే సెమ్‌కోవ్‌స్కీలూ, లీబ్‌మన్‌లూ, యుర్కేవిచ్‌లూ కేవలం తమ అజ్ఞానంవల్లనో లేక అలక్ష్యంవల్లనో మాత్రమే అలా చెప్తున్నారు. ఎన్నడో

1902లోనే, ప్లెహానొవ్* "జర్యా"లో[99] ముసాయిదా కార్యక్రమంలోని "జాతుల స్వయం నిర్ణయ హక్కు"ని సమర్థించి, బూర్జువా డెమోక్రట్లకు విధ్యుక్తం కాని యీ డిమాండు "సోషల్ డెమోక్రట్లకు విధ్యుక్తమైనది" అని రాశాడు. ప్లెహానొవ్ యిలా రాశాడు: "మహా రష్యన్ జాతికి చెందిన మన తోటి దేశస్థుల జాతీయవాద దురభిప్రాయాలకు ఎక్కడ భంగం కలిగిస్తామోనన్న భయంతో, మనం యీ విషయాన్ని విస్మరించినా లేక దాన్ని ముందుపెట్టేందుకు సంకోచించినా, 'సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!' అన్న నినాదం, మన పెదాలమీద మాత్రమే ఆడే సిగ్గుచేటు అబద్ధమే అవుతుంది...."[100]

ప్రస్తుతం పరిశీలనలో వున్న అంశానికి సానుకూలమైన మౌలిక వాదనకి యిది చాలా సముచితమైన వర్ణన; అదెంత సముచితమైనదంటే, మన కార్యక్రమాన్ని విమర్శించే "ప్రత్యేక వివరాల్లో నమ్మకంలేని" విమర్శకులు బెరుకుగా దాన్ని దాటవెయ్యడం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. ఏ ఉద్దేశాలతో అయితేనేమి, యీ అంశాన్ని వదలడమంటే, మహా రష్యన్ జాతీయతత్వానికి ఆచరణలో "సిగ్గుమాలి" రాయితీ యివ్వడమే. అయితే, యిది అన్ని జాతుల స్వయంనిర్ణయ హక్కు సమస్య అయినప్పుడు, ఒక్క మహా రష్యన్ మాత్రమే ఎందుకు? మహా రష్యన్లనుంచి విడిపోవడాన్ని అది ప్రస్తావిస్తోంది కనుక. శ్రామికుల ఐక్యతా ప్రయోజనాలకూ, వాళ్ల వర్గ సంఘీభావ ప్రయోజనాలకూ జాతుల విడిపోయే హక్కును గుర్తించడం అవసరం — ప్లెహానొవ్ పన్నెండేళ్ల క్రితం పైన పేర్కొన్న మాటల్లో యీ విషయాన్ని ఆమోదించాడు. మన అవకాశవాదులు యీ అంశాన్ని గురించి ఆలోచించి వున్నట్లయితే, జాతుల స్వయంనిర్ణయ హక్కుని గురించి వాళ్లింత చెత్త మాట్లాడేవాళ్లు కారు.

ప్లెహానొవ్ సమర్థించిన ముసాయిదా కార్యక్రమాన్ని ఆమోదించిన 1903 మహాసభలో, కార్యక్రమ కమిషన్ ప్రధాన కృషిని నిర్వహించింది. దురదృష్టవశాత్తూ ఆ కమిషన్ చర్చల మినిట్సు రాయబడలేదు. యీ అంశంమీద అవి ప్రత్యేకించి ఆసక్తిదాయకంగా ఉండేవి. ఎందుకంటే, ఆ కమిషన్‌లోనే పోలిష్ సోషల్ డెమోక్రట్ల ప్రతినిధులైన వర్షావ్‌స్కీ, గానెత్స్కీలు తమ అభిప్రాయాలను సమర్థించుకొనేందుకూ, "జాతుల స్వయంనిర్ణయ

---

* 1916లో లెనిన్ యీ ఖండానికి యీకింది వివరణ యిచ్చాడు: "1903లో, అవకాశవాదానికి ప్రధాన వ్యతిరేకుల్లో ప్లెహానొవ్ ఒకడు. అప్పటికి ఆయన దుష్ప్రసిద్ధమైన రోసిపోయిన తన రంగు మార్చిడికీ, దరిమిలా జాతీయ దురహంకారతత్వానికీ దిగజారలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవలసిందిగా నేను పాఠకులను కోరుతున్నాను." — సం.

హక్కు"ను ఖండించేందుకూ ప్రయత్నించారు. వాళ్ల వాదనలనూ (వర్షావ్‌స్కీ ఉపన్యాసంలోనూ, అతనూ, గానెత్స్కీ చేసిన ప్రకటనలోనూ వివరింపబడిన వాదనలను — మహాసభ మినిట్సు పేజీలు 134–36, 388–90) రోజా లుక్సెంబుర్గ్ తన పోలిష్ వ్యాసంలో ప్రతిపాదించినవాటితో — నేను వీటిని విశ్లేషించాను — పోల్చిచూసే శ్రమ తీసుకునే ఏ పాఠకుడికైనా ఆ రెండింటిలోని సాదృశ్యమూ కనిపిస్తుంది.

పోలిష్ మార్క్సిస్టులకు వ్యతిరేకంగా మిగతా ఎవరికన్న ప్లెహానొవ్ ఎక్కువగా మాట్లాడిన రెండవ మహాసభ కార్యక్రమ కమిషన్‌లో యీ వాదనలపట్ల ఎలాంటి వైఖరి వెల్లడైంది? అవి నిర్దాక్షిణ్యమైన హేళనకి గురిఅయ్యాయి! రష్యన్ మార్క్సిస్టు జాతుల స్వయంనిర్ణయ హక్కు గుర్తింపును తిరస్కరించాలని ప్రతిపాదించడంలోని అపభ్రంశం ఎంత నిర్ద్వంద్వంగానూ, స్పష్టంగానూ ప్రదర్శితమైందంటే, పోలిష్ మార్క్సిస్టులు మహాసభ విస్తృత సమావేశంలో తమ వాదనలను పునరుక్తంచేసేందుకు సైతం సాహసించలేకపోయారు!! మార్క్సిస్టుల — మహా రష్యన్, యూదు, జార్జియన్, ఆర్మీనియన్ — అత్యున్నత సభలో తమ వాదనకి పట్టబోయే దుర్గతిని తెలుసుకున్న ఆ ప్రతినిధులు మహాసభనుంచి నిష్క్రమించారు.

తన సొంత కార్యక్రమంపట్ల తీవ్రాసక్తిని కలిగిన ప్రతిఒక్కడికీ యీ చారిత్రక ఘటన ప్రాముఖ్యం అత్యధికమైనదన్న విషయం వేరే చెప్పనక్కర్లేదు. పోలిష్ మార్క్సిస్టుల వాదనలు మహాసభ కార్యక్రమ కమిషన్‌లో పూర్తిగా ఓడింపబడ్డాయన్న వాస్తవమూ, మహాసభ విస్తృత సమావేశంలో తమ అభిప్రాయాలను సమర్థించుకొనే ప్రయత్నాన్ని పోలిష్ మార్క్సిస్టులు విరమించుకున్నారన్న వాస్తవమూ విశేష ప్రాముఖ్యం కలిగినవి. రోజా లుక్సెంబుర్గ్ 1908లో తను రాసిన వ్యాసంలో యీ విషయాన్ని గురించి "చల్లగా" మౌనం వహించిందంటే, అది ఆశ్చర్యపడాల్సిందేమీ కాదు — ఆ మహాసభను గురించి జ్ఞాపకంచేసుకోవడం ఆమెకు మరీ ఇబ్బందికరంగా వుండివుండాలి! పోలిష్ మార్క్సిస్టులందరి తరఫునా కార్యక్రమంలోని 9వ క్లాజుని "సవరించాలి" అంటూ వర్షావ్‌స్కీ, గానెత్స్కీ చేసిన పరమ అసంగతమైన ప్రతిపాదనని గురించి కూడా — యీ ప్రతిపాదనను తిరిగి వల్లించేందుకు రోజా లుక్సెంబుర్గ్ కాని, తదితర పోలిష్ సోషల్ డెమొక్రట్లు కాని సాహసించలేదు (సరి కదా యికముందెన్నడూ కూడా సాహసించరు).

రోజా లుక్సెంబుర్గ్, 1903లో తన పరాజయాన్ని మరుగుపరచి, యీ వాస్తవాల విషయంలో మౌనం కొనసాగించినప్పటికీ, తమ పార్టీ చరిత్రలో ఆసక్తి చూపేవాళ్లు వాటిని ధృవీకరించుకోడాన్ని తమ పనిగా పెట్టుకొని, వాటి ప్రాముఖ్యాన్ని గురించి ఆలోచిస్తారు.

1903 మహాసభనుంచి నిష్క్రమించినమీదట రోజా లుక్సెంబుర్గ్ మిత్రులు యీకింది ప్రకటన చేశారు:

"ముసాయిదా కార్యక్రమపు 7వ క్లాజు [యిప్పుడది 9వ క్లాజు] యీకింది విధంగా ఉండాలని మేము ప్రతిపాదిస్తున్నాం: క్లాజు 7. రాజ్యంలో చేరివున్న అన్ని జాతుల పూర్తి సాంస్కృతికాభివృద్ధికీ హామీనిచ్చే సంస్థలు" (మినిట్సు పేజి 390).

ఈ విధంగా, అప్పట్లో పోలిష్ మార్క్సిస్టులు జాతుల సమస్యమీద చాలా అస్పష్టమైన అభిప్రాయాలను ముందుకుతెచ్చారు. జాతుల స్వయంనిర్ణయ హక్కుకి బదులు వాళ్లు వాస్తవానికి రోసిపోయిన "సాంస్కృతిక జాతీయ స్వయంపాలన"ను, కేవలం మరో పేరుతో ప్రతిపాదించారు!

ఇది దాదాపు నమ్మశక్యం కానిదిగా కనిపిస్తుంది, అయితే దురదృష్టవశాత్తూ యిది నిజం. అసలు అయిదు ఓట్లను కలిగిన అయిదుగురు బుందిస్టులూ, ఆరు ఓట్లను కలిగిన ముగ్గురు కకేషియన్లూ – కొస్త్రోవ్ సలహా వాణిని లెక్కలోకి తీసుకోకుండా – హాజరైన ఆ మహాసభలోనే జాతీయ స్వయంనిర్ణయ హక్కుని గురించిన క్లాజు తిరస్కృతికి అనుకూలంగా ఒక్కగానొక్క ఓటు కూడా పడలేదు. ఈ క్లాజుకి "సాంస్కృతిక జాతీయ స్వయంపాలన" అన్న పదాలను చేర్చాలన్న ప్రతిపాదనకి అనుకూలంగా ("జాతుల సాంస్కృతికాభివృద్ధికి పూర్తి స్వేచ్ఛను కల్పించే సంస్థల స్థాపన" అనే గోల్డ్‌బ్లాట్ సూత్రానికి అనుకూలంగా) మూడు ఓట్లు పడ్డాయి. లీబెర్ సూత్రానికి ("తమ సాంస్కృతికాభివృద్ధి స్వేచ్ఛ విషయంలో జాతుల హక్కు") అనుకూలంగా నాలుగు ఓట్లు పడ్డాయి.

ఇప్పుడిక రష్యన్ ఉదారవాద పార్టీ – కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ – రంగం మీద అవతరించింది గనుక, దాని కార్యక్రమంలో జాతుల రాజకీయ స్వయంనిర్ణయ హక్కు స్థానంలో "సాంస్కృతిక స్వయంనిర్ణయ హక్కు" చేర్చబడిందన్న సంగతి మనకి తెలుసు. అందుచేత, రోజా లుక్సెంబుర్గ్ పోలిష్ మిత్రులు పి.ఎస్.పి. జాతీయవాదంమీద "పోరాడుతున్నారు"; అందునా, వాళ్లు ఆ పోరాటాన్ని ఎంత విజయవంతంగా చేశారంటే, మార్క్సిస్టు కార్యక్రమం స్థానంలో ఒక ఉదారవాద కార్యక్రమాన్ని పెట్టాలని వాళ్లు ప్రతిపాదించారు! మరి అదే గుక్కలో మనది అవకాశవాద కార్యక్రమం అని వాళ్లు ఆరోపించారు; ఈ ఆరోపణను రెండవ మహాసభ కార్యక్రమ కమిషన్ నవ్వుతాలుగా తీసుకున్నదంటే, అందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు!

రెండవ మహాసభ ప్రతినిధుల్లో ఏ ఒక్కరూ "జాతుల స్వయంనిర్ణయ హక్కు"కి వ్యతిరేకం కారన్న విషయాన్ని మనం యింతకుముందే చూశాం, కాగా, ఆ ప్రతినిధులు "స్వయంనిర్ణయ హక్కు"ను ఎలా అర్థంచేసుకున్నారు?

దానికి సంబంధించి మినిట్సులో యీకింది మూడు ఉదాహృత భాగాలు ఉన్నాయి:

"'స్వయంనిర్ణయ హక్కు' అన్న పదబంధానికి విస్తృతమైన వ్యాఖ్యానం యివ్వరాదని మర్తీనొవ్ అభిప్రాయపడ్డాడు; కేవలం దీని అర్థం యేమిటంటే, ప్రాంతీయ స్వయం పాలనగా కాకుండా ఒక ప్రత్యేక రాజ్యంగా తనని తాను నెలకొల్పుకొనే హక్కు ఒక జాతికి ఉండాలని మాత్రమే" (పేజి 171). మర్తీనొవ్ కార్యక్రమ కమిషన్‌లో ఒక సభ్యుడు. దానిలో రోజా లుక్సెంబుర్గ్ మిత్రుల వాదనలు నిరాకరింపబడటమే కాకుండా హేళనకు గురయ్యాయి. మర్తీనొవ్ తన అభిప్రాయాల్లో అప్పటికి ఒక "ఆర్థికవాది," "ఇస్క్రా"కి బద్ధ వ్యతిరేకి. అతనే గనుక కార్యక్రమ కమిషన్‌లోని మెజారిటీ సభ్యులు ఏకీభవించని అభి ప్రాయాన్ని వ్యక్తంచేసివుంటే, అతన్ని తప్పనిసరిగా ఖండించివుండేవాళ్లే.

ఆ కమిషన్ తన కార్యకలాపాలను పూర్తిచేశాక, మహాసభ కార్యక్రమంలోని 8వ క్లాజును (ప్రస్తుతపు 9వ క్లాజు) చర్చించినప్పుడు మొట్టమొదట మాట్లాడినది బుందిస్టు గోల్డ్ బ్లాత్.

అతను యిలా అన్నాడు:

> "'స్వయంనిర్ణయ హక్కు'కి వ్యతిరేకంగా ఏ అభ్యంతరాలనూ లేవదియ్యడం సాధ్యం కాదు. ఏ జాతి అయినా స్వాతంత్ర్యంకోసం పోరాడేటప్పుడు, దాన్ని వ్యతి రేకించరాదు. పోలండు రష్యాతో చట్టబద్ధమైన వివాహబంధంలో ప్రవేశించ నిరాక రిస్తే, ప్లెహానొవ్ అన్నట్లు, దానితో జోక్యంచేసుకోరాదు. ఈ పరిమితుల్లోపల యీ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను" (పేజీలు 175-76).

మహాసభ విస్తృత సమావేశంలో ప్లెహానొవ్ యీ అంశంమీద అసలు మాట్లాడనే లేదు. కార్యక్రమ కమిషన్‌లో ప్లెహానొవ్ చెప్పినదాన్నే గోల్డ్‌బ్లాత్ యిక్కడ ప్రస్తావిస్తు న్నాడు. ఆ కమిషన్‌లో "స్వయంనిర్ణయ హక్కు" సరళమే అయినా సవివరమైన పద్ధతిలో, విడిపోయే హక్కు అని వివరింపబడింది. గోల్డ్‌బ్లాత్ తర్వాత లీబెర్ యిలా వ్యాఖ్యానించాడు:

> "సహజంగానే, రష్యా సరిహద్దులలోపల తానిక నివసించజాలనని ఏ జాతి అయినా అనుకుంటే, దాని మార్గంలో పార్టీ ఎలాంటి అవరోధాలూ పెట్టదు" (పేజి 176).

కార్యక్రమం ఆమోదింపబడిన పార్టీ రెండవ మహాసభలో, స్వయంనిర్ణయ హక్కు అన్నది విడిపోయే హక్కుగా "మాత్రమే" ఏకగ్రీవంగా ఆమోదింపబడిందన్న విషయాన్ని

పాఠకుడు చూస్తాడు. చివరకు బుందిస్టులు సైతం అప్పట్లో యీ సత్యాన్ని గ్రహించారు. కాగా, విప్లవ ప్రతీఘాతమూ, అన్ని రకాల "స్వపక్ష త్యాగమూ" ఎడతెగకుండా సాగుతున్న మన యీ దౌర్భాగ్యపు కాలంలో మాత్రమే, తమ అజ్ఞానం కారణంగా, ఆ కార్యక్రమం "అస్పష్టంగా" ఉందని చెప్పే మనుషులు మనకి కనిపిస్తారు. అయితే యీ తను "సోషల్ డెమోక్రట్లు" అనబడేవాళ్ల కోసం కాలం వెచ్చించే లోపల, ఆ కార్యక్రమంపట్ల పోలుల వైఖరి పరిశీలనను ముందు మనం ముగిద్దాం.

ఐక్యత అవసరమనీ, తప్పనిసరి అనీ ప్రకటించి, రెండవ మహాసభకి (1903) వాళ్లు వచ్చారు. కాని, కార్యక్రమ కమిషన్‌లో తమకు కలిగిన "పరాజయాల" అనంతరం మహాసభనుంచి వాళ్లు వెళ్లిపోయారు. వాళ్ల చివరి మాట ఒక లిఖిత పూర్వక ప్రకటన. మహాసభ మినిట్సులో అచ్చువెయ్యబడిన ఆ ప్రకటనలో సాంస్కృతిక జాతీయ స్వయంపాలనను స్వయం నిర్ణయ హక్కు స్థానంలో పెట్టాలంటూ చెయ్యబడిన పైన పేర్కొనబడిన ప్రతిపాదన యిమిడివుంది.

1906లో పోలిష్ మార్క్సిస్టులు పార్టీలో చేరారు. చేరినప్పుడు గాని, తర్వాత గాని (1907 నాటి మహాసభలో గాని, 1907, 1908 కాన్ఫరెన్సుల్లో[101] గాని, 1910 విస్తృత సమావేశంలో[102] గాని) రష్యన్ కార్యక్రమంలోని 9వ క్లాజుకి ఒక్కగానొక్క ప్రతిపాదనని కూడా వాళ్లు ప్రవేశపెట్టలేదు!

ఇదొక వాస్తవం.

కాగా, ఎన్ని మాటలు చెప్పి, ఎన్ని హామీలు యిచ్చినప్పటికీ, యీ వాస్తవం ఒక అంశాన్ని నిశ్చితంగా రుజువుచేస్తోంది – రెండవ మహాసభ కార్యక్రమ కమిషన్‌లో జరిగిన చర్చ ద్వారానూ, అలాగే మహాసభ నిర్ణయం ద్వారానూ యీ సమస్య పరిష్కరింపబడినట్లే రోజా లుక్సెంబుర్గ్ మిత్రులు పరిగణించారనీ, 1903లో ఆ మహాసభనుంచి నిష్క్రమించిన దరిమిలా, అనుక్తంగా తమ పొరపాటును ఆమోదించి, పార్టీ వేదికల ద్వారా కార్యక్రమంలోని 9వ క్లాజును సవరించేందుకు ఒక్క ప్రయత్నం కూడా చెయ్యకుండా, 1906లో పార్టీలో చేరడం ద్వారా వాళ్లు దాన్ని దిద్దుకున్నారన్నదే ఆ అంశం.

రోజా లుక్సెంబుర్గ్ వ్యాసం ఆమె సంతకంతో 1908లో ప్రచురింపబడింది. సహజంగానే, కార్యక్రమాన్ని విమర్శించే హక్కు పార్టీ పత్రికా రచయితలకు లేదన్న భావం ఏ ఒక్కరి బుర్రలోకీ ప్రవేశించలేదు. పోతే, యీ వ్యాసం రచింపబడిన దరిమిలా, పోలిష్ మార్క్సిస్టుల ఏ ఒక్క అధికారిక సంఘమూ 9వ క్లాజును సవరించాలన్న సమస్యను లేవదియ్యలేదు.

అందుచేత, "బొర్బా" సంపాదకవర్గం తరఫున, ఆ పత్రిక 2వ సంచికలో (1914

మార్చి) యీకింది విధంగా రాసి, ట్రాట్స్కీ రోజా లుక్సెంబుర్గ్ అభిమానులకు పెద్ద కీడునే చేశాడు:

> "...'జాతుల స్వయంనిర్ణయ హక్కు' అన్న దానిలో రాజకీయ సారం బొత్తిగా లేదనీ, దాన్ని కార్యక్రమంలోంచి తొలగించాలనీ పోలిష్ మార్క్సిస్టులు పరిగణిస్తున్నారు" (పేజి 25).

సహాయకారి అయిన ట్రాట్స్కీ శత్రువుకంటె మరింత ప్రమాదకారి! "పోలిష్ మార్క్సిస్టులను" మూకుమ్మడిగా రోజా లుక్సెంబుర్గ్ రాసిన ప్రతిఒక్క వ్యాసాన్నీ సమర్థించే వాళ్ళగా వర్గీకరించేందుకు "ఆంతరంగిక సంభాషణలను" తప్ప (అంటే, కేవలం గాలి కబుర్లు అన్నమాట, ట్రాట్స్కీ ఎప్పుడూ వీటిమీదనే ఆధారపడతాడు) ట్రాట్స్కీ ఏ రుజువునూ చూపలేదు. ట్రాట్స్కీ "పోలిష్ మార్క్సిస్టులను" గౌరవం, ఆత్మశుద్ధీ లేనివారుగా, తమ సొంత విశ్వాసాలనూ, తమ పార్టీ కార్యక్రమాన్నీ సైతం గౌరవించలేనివారుగా చిత్రించాడు. ఓహో, ట్రాట్స్కీ ఎంత సహాయకారి!

1903లో పోలిష్ మార్క్సిస్టుల ప్రతినిధులు జాతుల స్వయంనిర్ణయ హక్కు సమస్య కారణంగా రెండవ మహాసభనుంచి వాకౌట్ చేశారు. వారు యీ హక్కును సారంలేనిదనీ, కార్యక్రమంనుంచి తొలగించవలసిందనీ పరిగణించినట్లు ట్రాట్స్కీ అప్పట్లో చెప్పివుండగల అవకాశం వుంది.

కాని, అటు తర్వాత పోలిష్ మార్క్సిస్టులు జాతుల స్వయంనిర్ణయ హక్కును తమ కార్యక్రమంగా కలిగిన పార్టీలో చేరారు, దాన్ని సవరించాలని వాళ్లెన్నడూ ప్రతిపాదించలేదు.*

తన పత్రిక పాఠకులనుంచి యీ వాస్తవాలను ట్రాట్స్కీ ఎందుకు మరుగుపరిచాడు? రద్దువాదానికి పోలిష్, రష్యన్ వ్యతిరేకుల మధ్య విభేదాలను రెచ్చగొట్టి, కార్యక్రమం సమస్య

---

* పోలిష్ మార్క్సిస్టులు 1913లో జరిగిన రష్యన్ మార్క్సిస్టుల వేసవి కాన్ఫరెన్సుకి కేవలం సలహాదారుల ప్రతిపత్తిలో మాత్రమే హాజరయ్యారనీ, జాతుల స్వయంనిర్ణయ హక్కు (విడిపోయే హక్కు) సమస్యమీద వోటుచెయ్యనేలేదనీ, మొత్తంగా యీ హక్కుకి తమ వ్యతిరేకతను ప్రకటించారనీ మనకి చెప్తున్నారు. సహజంగానే, వాళ్ళు ప్రవర్తించినట్లు ప్రవర్తించే పూర్తి హక్కు వాళ్లకి ఉంది, అలాగే, యిప్పటిదాకా వాళ్ళు చేసిన మాదిరిగా పోలండులో విడిపోయే హక్కుకి వ్యతిరేకంగా ఆందోళన చేసే హక్కు కూడా వుంది. అయితే ట్రాట్స్కీ చెప్పింది సరిగ్గా యిదే కాదు; ఎందుకంటే, పోలిష్ మార్క్సిస్టులు "కార్యక్రమం నుంచి" 9వ క్లాజు "తొలగింపు"ను డిమాండుచెయ్యలేదు.

మీద రష్యన్ కార్మికులను మోసగించినందువల్ల తనకి లాభం కలుగుతుందన్న అంచనా మాత్రమే యిందుకు కారణం.

మార్క్సిజానికి సంబంధించిన ఏ ఒక్క ముఖ్య సమస్యమీదా ట్రాట్స్కీకి యింతవరకెన్నడూ దృఢమైన అభిప్రాయమంటూ లేదు. అతను ఎప్పుడూ కూడా ఏదైనా ఒక అభిప్రాయభేదం వుంటే, దాని సందుల్లో చోటుచేసుకుని ఒక పక్షాన్ని పరిత్యజించి మరో పక్షంలో చేరుతూ వుంటాడు. ప్రస్తుతానికి అతను బుందిస్టుల, రద్దువాదుల సాంగత్యంలో వున్నాడు. ఈ పెద్దమనుషులు పార్టీకి సంబంధించినంతవరకు పట్టింపులేమీ పెట్టుకోరు.

బుందిస్టు లీబ్‌మన్ చెప్పేదేమిటో చూడండి.

ఈ పెద్దమనిషి యిలా రాస్తాడు:

> "పన్నెండేళ్ల క్రితం రష్యన్ సోషల్ డెమోక్రట్లు ప్రతి జాతికీ 'స్వయం నిర్ణయ హక్కు'ను గురించిన అంశాన్ని తమ కార్యక్రమంలో చేర్చినప్పుడు, ప్రతి ఒక్కడూ [!] తనని తాను యిలా ప్రశ్నించుకున్నాడు: ఈ ఫేషనబుల్ [!] పదానికి నిజమైన అర్థం యేమిటి? జవాబేమీ ఊడిపడలేదు [!]. మబ్బుతెరతో కప్పబడిన ఈ పదం అలాగే వదిలెయ్యబడింది [!]. నిజానికి, అప్పట్లో, ఆ మబ్బుతెరని తొలగించడం కష్టసాధ్యంగా ఉంది. ఈ అంశాన్ని నిర్దిష్టంగా తేల్చే తరుణం రాలేదనీ, అంచేత, ప్రస్తుతానికి దాన్ని ఆ మబ్బుతెర [!] మరుగున అలాగే ఉండనిమ్మనీ, దానిలో ఎలాంటి సారాన్ని చేర్చాలో అనుభవమే నిరూపిస్తుందనీ – తలచబడింది."

ఓహో గొప్పగా లేదూ, పార్టీ కార్యక్రమాన్ని యీ "దౌర్భాగ్యుడు" వెక్కిరించిన తీరు? మరి యితగాడు దాన్నెందుకు వెక్కిరించినట్లు?

ఎందుకంటారా, అతను శుద్ధ అజ్ఞాని కనుక, అతనెన్నడూ ఏమీ నేర్చుకోలేదు గనుక, చివరకు పార్టీ చరిత్రను సైతం చదవలేదు గనుక. అందుకు భిన్నంగా కేవలం రద్దువాద వర్గాల్లో చేరడం తటస్థించింది గనుక, ఆ వర్గాల్లో పార్టీకీ, పార్టీ వేటివేటికి నిలబడుతుందో వాటన్నింటికీ సంబంధించిన జ్ఞానం విషయంలో నగ్నంగా తిరుగుతూ ఉండడం "సరైనదిగా" పరిగణింపబడుతుంది గనుక.

పొమ్యలోవ్‌స్కీ నవలలో మత పాఠశాల విద్యార్థి "ఊరగాయ జాడీలో ఉమ్మేశానని"[103] కోతలు కోస్తాడు. బుందిస్టు పెద్దమనుషులు మరింత ముందుకి పోయారు. వాళ్లు లీబ్‌మన్‌ని తమ సొంత జాడీలోకే బహిరంగంగా ఉమ్మేసేందుకు స్వేచ్ఛగా వదిలారు. ఇంటర్నేషనల్ మహాసభ ఒక తీర్మానాన్ని ఆమోదించిందన్నా, తమ సొంత పార్టీ మహాసభలో తమ

సొంత బుంద్ ప్రతినిధులు యిద్దరు, "జాతీయ స్వయంనిర్ణయ హక్కు"ను అర్థం చేసుకోగల సామర్థ్యం తమకి పూర్తిగా ఉందనీ (మరి వాళ్ళ "ఇస్క్రా"ని ఎంత "తీవ్రంగా" విమర్శించేవాళ్ళు, దానికి ఎంత బద్ధ శత్రువులుగా వుండేవాళ్ళు!), చివరకు దాన్ని తాము ఆమోదిస్తున్నామనీ రుజువుచేసుకున్నా — యీ వాస్తవం లీబ్‌మన్‌లకి ఏమి పట్టుతుంది? "పార్టీ పత్రికారచయితలు" (నవ్వకండి సుమా!) తమ చరిత్రతో, కార్యక్రమంతో మత పాఠశాల విద్యార్థి మాదిరిగా వ్యవహరిస్తే, పార్టీని రద్దుచేసెయ్యడమే మరింత తేలికేమో?

"ద్జ్వీన్"[104]కి చెందిన యుర్కేవిచ్. ఈయన మరో "దౌర్భాగ్యుడు." రెండవ మహా సభ మినిట్సు యుర్కేవిచ్‌కి అందుబాటులో ఉండివుండాలి. ఎందుకంటే, అతను ప్లెహానొవ్ మాటల్ని — గోల్డ్‌బ్లాత్ పునరుచ్చరించిన రీతిలో — ఉల్లేఖిస్తున్నాడు. స్వయంనిర్ణయ హక్కంటే విడిపోయే హక్కేనన్న వాస్తవం తనకి తెలుసునన్న విషయాన్ని అతను కనపరచాడు. అయితే యిది, రష్యన్ మార్క్సిస్టులు రష్యా "రాజ్య సమగ్రత"కి అనుకూలురని చెప్పడం ద్వారా, ఉక్రేనియన్ పెటీబూర్జువావర్గంలో రష్యన్ మార్క్సిస్టులమీద అభాండాలు వ్యాపింపచేసేందుకు ఆటంకం కాలేదు (1913, సంచికలు 7–8, పేజి 83 వగైరాలు). సహజంగానే, మహా రష్యన్ డెమోక్రట్లనుంచి ఉక్రేనియన్ డెమోక్రట్లను వేరుచేసేందుకు అలాంటి అభాండాలకు మించి మరింత మెరుగైన పద్ధతిని యుర్కేవిచ్‌లు కనిపెట్టగలిగే వాళ్ళు కాదు. అలా విడదియ్యడమన్నది, ఉక్రేనియన్ కార్మికులు ఒక ప్రత్యేక జాతీయ సంఘంలో వేరుగా ఉండటాన్ని సమర్థించిన "ద్జ్వీన్" పత్రికారచయితల మొత్తం విధానానికి అనుగుణంగా వుంది!*

శ్రామికవర్గ శ్రేణులను చీల్చడంలో నిమగ్నమైవున్న జాతీయవాద కూపస్థమండూకాల ఒక గ్రూపు — "ద్జ్వీన్" పాత్ర యిదేననడం స్పష్టం — జాతుల సమస్యమీద యిలంటి దారుణమైన గందరగోళాన్ని వ్యాపింపచెయ్యడం సంపూర్తిగా సముచితమే. "దాదాపుగా పార్టీ వాళ్ళు" అని పిలవబడినప్పుడు "విపరీతంగా" కోపోన్మత్తులైన యుర్కేవిచ్‌లూ, లీబ్‌మన్‌లూ, కార్యక్రమంలో విడిపోయే హక్కు సమస్యను ఎలా పరిష్కరించాలని తాము కోరుకుంటున్నారో, ఒక్క మాట కూడా చెప్పరని ఒక్కగానొక్క మాట కూడా చెప్పరని ప్రత్యేకించి పేర్కొననక్కర్లేదు.

సరే యింక, మూడవవాడూ, ముఖ్యమైనవాడూ అయిన "దౌర్భాగ్యుడు" మిస్టర్

---

* *Outline of the Development of the Ukrainian Working-Class Movement in Galicia*, పేర లెవీన్‌స్కీ ఉక్రేనియన్ భాషలో రాసిన గ్రంథానికి (కీయెవ్‌నుంచి 1914లో ప్రచురింపబడింది) యుర్కేవిచ్ రాసిన ముందుమాటని ప్రత్యేకించి చూడండి.

సెమ్‌కోవ్‌స్కీ వున్నాడు. ఇతగాడు, ఒక రద్దువాద పత్రిక పేజీల్లో మహా రష్యన్ చదువరులను ఉద్దేశించిన తన రచనల ద్వారా కార్యక్రమంలోని 9వ క్లాజుమీద బాదులు బాదుతాడు, అదే సమయంలో యీ క్లాజును తొలగించాలన్న "ప్రతిపాదనను కొన్ని కారణాల మూలంగా తను ఆమోదించను" అని ప్రకటిస్తాడు!

ఇది నమ్మశక్యం కానిది, కాని ఇది నిజం.

1912 ఆగస్టులో, రద్దువాదుల కాన్ఫరెన్సు[105] జాతుల సమస్యను అధికారికంగా లేవదీసింది. సెమ్‌కోవ్‌స్కీ రాసిన వ్యాసం తప్ప, 18 నెలలపాటు 9వ క్లాజు సమస్యమీద ఒక్కగానొక్క వ్యాసం కూడా ప్రచురింపబడలేదు. మరి యీ వ్యాసంలో రచయిత, కార్యక్రమాన్ని సవరించాలన్న ప్రతిపాదనను "కొన్ని కారణాల మూలంగా" (యిది రహస్య గోపన వ్యాధి కాదు కదా?) "ఏకీభవించకుండా," దాన్ని తోసిపుచ్చుతున్నాడు! అవకాశవాదానికి సంబంధించిన యీ మాదిరి ఉదాహరణలు — లేక అంతకంటె అధ్వాన్నం — పార్టీని త్యజించడానికీ, దాన్ని రద్దుచెయ్యాలని కోరుకోవడానికీ ఉదాహరణలు ప్రపంచంలో మరెక్కడా దొరకబోవన్న విషయంలో మనకి అనుమానం ఎంతమాత్రం అక్కర్లేదు.

సెమ్‌కోవ్‌స్కీ వాదనలు ఎలా వుంటాయో చూపేందుకు యీకింది ఒక్క ఉదాహరణ చాలు:

అతను యిలా రాస్తాడు:

> "అఖిల రష్యా శ్రామికవర్గంతో భుజంభుజం కలిపి, ఒకే రాజ్యపు చట్టం లోపల, పోరాడాలని పోలిష్ శ్రామికవర్గం కోరుకుంటే — అందుకు భిన్నంగా, పోలిష్ సమాజంలో అభివృద్ధినిరోధక వర్గాలు పోలండును రష్యానుంచి వేరుజేసి, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా విడిపోయే హక్కుకి అనుకూలంగా మెజారిటీ ఓట్లు సంపాదించుకుంటే — మనం ఏం చెయ్యాలి? కేంద్ర పార్లమెంటులోని రష్యన్ సోషల్ డెమొక్రట్లమైన మనం, విడిపోయేందుకు హక్కుకి వ్యతిరేకంగా మన పోలిష్ కామ్రేడ్సుతో కలిసి వోటుచెయ్యాలా, లేక — "స్వయంనిర్ణయ హక్కు"ను అతిక్రమించకుండా ఉండేందుకుగాను — విడిపోయే హక్కుకి అనుకూలంగా వోటు చెయ్యాలా?" ("నోవయ రబోచయ గజేత," సంచిక 71.)

దీన్నిబట్టి, చర్చనీయాంశం ఏమిటో కూడా సెమ్‌కోవ్‌స్కీకి బోధపడలేదన్న విషయం స్పష్టమవుతుంది! విడిపోయే హక్కు లభించాలంటే, విడిపోయేందుకు సంబంధించిన సమస్యను కేంద్ర పార్లమెంటు కాక, విడిపోయే ప్రాంతపు పార్లమెంటు (శాసనసభ, ప్రజాభిప్రాయ సేకరణ, వగైరాలు) ముందు తేల్చాలన్న విషయం కూడ అతగాడికి తట్టలేదు.

ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకులు అభివృద్ధి నిరోధకత్వానికి అనుకూలంగా వుంటే "మనం ఏం చెయ్యాలి?" అన్న ప్రశ్నపై బాల్యసహజమైన విభ్రాంతి, పురిష్కేవిచ్‌లూ, కొకోష్కిన్‌లూ కూడా అసలు విడిపోయేందుకు సంబంధించిన భావాన్నే నేరంగా పరిగణించిన ప్పుడు, వాస్తవ, సజీవ సమస్యను మరుగుపరచేందుకు తోడ్పడుతుంది! బహుశా, అఖిల రష్యా శ్రామికులు పురిష్కేవిచ్‌లతోనూ, కొకోష్కిన్‌లతోనూ యీరోజున పోరాడక, వాళ్లని చూసీచూడకుండా పక్కకి తొలగిపోయి, పోలండు అభివృద్ధి నిరోధక వర్గాలతో పోరాడాలేమో!

రద్దువాదుల పత్రికలో ప్రచురింపబడిన వట్టి చెత్త యిది — ఈ వాదపు సైద్ధాంతిక నాయకుల్లో ఎల్. మార్తొవ్ ఒకడు. ఇతను మరెవరో కాదు, కార్యక్రమపు ముసాయిదాను రూపొందించి, దాన్ని ఆమోదించాలని 1903లో వాదించినవాడు, దరిమిలా సైతం విడిపోయే హక్కుకి అనుకూలంగా రాసినవాడు. ఎల్. మార్తొవ్ యిప్పుడు రూలు ప్రకారం వాదిస్తున్నాడనడం స్పష్టం:

తెలివి పరుడి అవసరం లేదక్కడ;
రెయాద్‌ని పంపిస్తే చాలు బాగుంటుంది,
నేనేమో వేచిచూస్తాను.[106]

అతను రెయాద్-సెమ్‌కోవ్‌స్కీని పంపి, అతనిచేత మన కార్యక్రమాన్ని ఒక దిన పత్రికలో — యీ పత్రిక కొత్త పాఠకులకి కార్యక్రమంతో పరిచయం లేదు — వక్రీకరించి, అంతు లేకుండా దాన్ని కలగాపులగంచెయ్యనిస్తాడు!

ఔను. రద్దువాదం చాలా దూరమే వెళ్లింది — తమలో పార్టీ ధోరణి బొత్తిగా మిగిలి లేని చాలామంది ప్రముఖ సోషల్ డెమోక్రట్లు సైతం అందులో వున్నారు.

రోజా లుక్సెంబుర్గ్‌ని, సహజంగానే లీబ్‌మన్‌లతోనూ, యుర్కేవిచ్‌లతోనూ, సెమ్‌కోవ్‌స్కీలతోనూ మనం జతచెయ్యలేము. కాని, యీ బాపతువాళ్లే ఆమె పొరపాటును దొరకపుచ్చుకున్నారన్న వాస్తవం ఆమె అవకాశవాదంలోకి ఎలా దిగజారిందో అన్న విషయాన్ని ప్రత్యేకించి స్పష్టంగా చూపిస్తుంది.

## 10. ముగింపు

విషయం ఒక్కసారి సమీక్షించుకుందాం.

మొత్తంగా మార్క్సిజం సిద్ధాంతానికి సంబంధించినంతవరకు, స్వయంనిర్ణయ హక్కు సమస్య క్లిష్టమైనదేమీ కాదు. 1896 నాటి లండన్ తీర్మానాలను గాని, స్వయంనిర్ణయ హక్కులో విడిపోయే హక్కు మాత్రమే యిమిడివుందన్న విషయాన్ని గాని, అన్ని బూర్జువా

ప్రజాతంత్ర విప్లవాల్లోనూ వున్న ధోరణి స్వతంత్ర జాతీయ రాజ్యాల స్థాపనే అన్న అంశాన్ని గాని ఏ ఒక్కరూ తీవ్రంగా సవాలుచెయ్యలేరు.

రష్యాలో పీడక, పీడిత జాతుల శ్రామికవర్గాలు రెండూ భుజంభుజం కలిపి పోరాడుతున్నాయి, పోరాడితీరాలి అన్న వాస్తవం మూలంగా కొంతమేరకు ఒక యిబ్బంది కలుగుతోంది. సోషలిజంకోసం శ్రామికవర్గం జరిపే పోరాట ఐక్యతను పదిలపరచడం, అన్ని రకాల బూర్జువా, నల్లనూర్ల జాతీయవాద ప్రభావాలనూ ఎదిరించడం – యిదీ కర్తవ్యం. పీడిత జాతులకు సంబంధించినంతవరకు, స్వతంత్రమైన ఒక పార్టీగా శ్రామికవర్గపు విడి సంఘటన కొన్ని సందర్భాల్లో ఆ జాతి జాతీయవాదంతో ఎంత తీవ్రమైన పోరాటానికి దారితీస్తుందంటే, భావిదర్శనం వక్రించడం, పీడక జాతి జాతీయవాదం కనుమరుగవడం సంభవిస్తూ వుంటుంది.

కాని యీ భావిదర్శనం వక్రించడం ఎక్కువ కాలం ఉండజాలదు. వివిధ జాతుల శ్రామికులు సాగించిన సంయుక్త పోరాటానుభవం, "క్రాకొవ్" దృక్పథంనుంచి కాక అఖిల రష్యా దృక్పథంనుంచి రాజకీయ సమస్యల్ని మనం సూత్రీకరించాలన్న విషయాన్ని మిక్కిలి స్పష్టంగా చూపింది. మరి అఖిల రష్యా రాజకీయాల్లో పైచెయ్యి పురిష్కేవిచ్‌లది, కొకోష్కిన్‌లది. వాళ్ల భావాలు ప్రబలంగా వున్నాయి. రష్యనేతరులు "వేర్పాటుతత్వం" కలిగి వున్నందుకూ, విడిపోవడం గురించి ఆలోచిస్తున్నందుకూ వాళ్లని వేధించాలన్న భావం దూమలో, స్కూళ్లలో, చర్చిల్లో, సైనిక బారకాసుల్లో, వందలూ వేలాది వార్తాపత్రికల్లో బోధింపబడుతోంది, ఆచరణలో పెట్టబడుతోంది. ఈ మహా రష్యన్ జాతీయవాద విషమే యావత్తు అఖిల రష్యా రాజకీయ వాతావరణాన్నీ కలుషితంచేస్తోంది. ఇదొక జాతి దురదృష్టం, ఈ జాతి యితర జాతుల్ని లోబరచుకోవడం ద్వారా రష్యా అంతటా అభివృద్ధి నిరోధక శక్తుల్ని బలపరుస్తోంది. 1849కీ, 1863కీ సంబంధించిన స్మృతులు సజీవమైన రాజకీయ సంప్రదాయాన్ని ఏర్పరుస్తాయి, ఆ సంప్రదాయం, పెను తుపానులు రేగితే గాని, రాబోయే కొన్ని దశాబ్దాలపాటు ప్రతిఒక్క ప్రజాస్వామిక ఉద్యమాన్నీ, ప్రత్యేకించి ప్రతిఒక్క సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్నీ కుంటుపరచే ప్రమాదం వుంది.

పీడిత జాతులకు చెందిన మార్క్సిస్టుల దృక్పథం (వీరి "దురదృష్టం" ఏమిటంటే, కొన్ని సందర్భాల్లో జనబాహుళ్యం తమ "స్వ" జాతీయ విముక్తి భావంతో అంధులవుతూ వుంటారు) అప్పుడప్పుడు ఎంత సహజమైనదిగా కనిపించినప్పటికీ, వాస్తవంలో రష్యాలోని వర్గశక్తుల వస్తుపరమైన పొందిక జాతుల స్వయంనిర్ణయ హక్కు ప్రతిపాదన తిరస్కృతికీ, శుద్ధ అవకాశవాదానికీ, కొకోష్కిన్‌ల భావాలతో శ్రామికవర్గాన్ని కలుషితంచెయ్యడానికీ సమానమైనది. ఈ భావాలు ప్రధానంగా, పురిష్కేవిచ్‌ల భావాలూ, విధానమే.

అందుచేత, రోజా లుక్సెంబుర్గ్ దృక్పథాన్ని మొదట్లో, విశిష్టమైన పోలిష్ విధానంగానూ, "క్రాకోవ్" సంకుచితత్వం*గానూ పరిగణించి మన్నించగలిగినప్పటికీ, జాతీయవాదం, అన్నింటికన్న ముఖ్యంగా ప్రభుత్వపరమైన మహా రష్యన్ జాతీయవాదం సర్వత్రా పైచెయ్యి సంపాదించుకొని, ఆ మహా రష్యన్ జాతీయవాదమే విధానాన్ని రూపొందిస్తున్న యీరోజున, అది క్షమింపరానిది. వాస్తవంలో, యీ విధానాన్ని "తుపానుల," "లంఘనల" భావంనుంచి తప్పించుకు తిరిగే, బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ముగిసిపోయిందని నమ్మే, కొకోష్కిన్‌ల ఉదారవాదం పంథాలో పయనించే అన్ని జాతుల అవకాశవాదులూ ఆలంబనగా చేసుకుంటున్నారు.

ఏ యితర జాతీయవాదం మాదిరిగానే మహా రష్యన్ జాతీయవాదం కూడా, ఆయా నిర్దిష్ట కాలాల్లో ఆయా బూర్జువా దేశాల్లో ప్రాబల్యంలో వున్న వర్గాలనుబట్టి, వివిధ దశలగుండా సాగుతోంది. 1905దాకా, దాదాపు తనీగా జాతీయ అవకాశవాదుల్నే మనం ఎరుగుదుం. విప్లవం తర్వాత మన దేశంలో జాతీయవాద ఉదారవాదులు అవతరించారు.

మన దేశంలో అటు అక్టోబరిస్టులూ, యిటు కాడెట్లూ (కొకోష్కిన్), అంటే, యీనాటి బూర్జువావర్గం యావత్తూ అనుసరించిన వైఖరి దాదాపుగా యిదే.

తర్వాత, మహా రష్యన్ జాతీయ ప్రజాస్వామ్యవాదులు తప్పనిసరిగా రంగంమీదకి వస్తారు. "ప్రజా సోషలిస్టు" పార్టీ[107] సంస్థాపకుల్లో ఒకడైన పెషెహోనోవ్, రైతుల జాతీయవాద దురభిప్రాయాలకు వ్యతిరేకంగా జాగ్రత్తగా వుండాలని హెచ్చరిక చెయ్యడం ద్వారా యీ వైఖరిని యింతకుముందే ("రూస్కాయె బొగాత్‌స్త్వొ,"[108] 1906 ఆగస్టు సంచికలో) యీ దృక్పథాన్ని వ్యక్తంచేశాడు. ఇతరులు బోల్షెవిక్కులమైన మనమీద ఎంత ఎక్కువగా అభాండాలు వేసినప్పటికీ, రైతులను మనం "ఆదర్శీకరిస్తున్నామని" మనమీద ఆరోపణలు చేసినప్పటికీ, రైతుల సహజ వివేకానికీ రైతుల దురభిప్రాయాలకీ మధ్యా, ప్రజాస్వామ్యం

---

* యావత్తు రష్యా మార్క్సిస్టులూ, అందునా ప్రథమంగానూ ప్రధానంగానూ మహా రష్యన్లు జాతుల విడిపోయే హక్కును గుర్తించడమన్నది, విడాకుల హక్కు గుర్తింపు ఏదైనా ఒక ప్రత్యేక సందర్భంలో విడాకులకు వ్యతిరేకంగా ఆందోళనకు ప్రతిబంధకం కానట్లే, ఒకానొక పీడిత జాతికి చెందిన మార్క్సిస్టులు విడిపోయేందుకు వ్యతిరేకంగా ఆందోళన జరపడానికి ఏవిధంగానూ ప్రతిబంధకం కాదన్న విషయాన్ని అర్థంచేసుకోవడం కష్టమేమీ కాదు. అందుచేత, సెమ్‌కోవ్‌స్కీ, ట్రాట్స్కీలు యీనాడు ప్రోత్సహిస్తున్న లేని "వైరుధ్యం" పట్ల హేళన చేసే పోలిష్ మార్క్సిస్టుల సంఖ్య విధిగా పెరుగుతుందని మేము అనుకుంటున్నాం.

కోసమూ, పురిష్కేవిచ్‌కి వ్యతిరేకంగానూ రైతులు చేసే కృషికీ, మతగురువుతోనూ, భూస్వామితోనూ రాజీపడాలన్న రైతుల వాంఛకీ మధ్యా మనం ఎప్పుడూకూడా విస్పష్టమైన విభజన రేఖను గీశాం, యిక ముందూ అలాగే గీస్తాం.

ఇప్పుడు సైతం, బహుశా రాబోయే చాలా కాలం కూడా, శ్రామికవర్గ ప్రజాస్వామ్యం మహా రష్యన్ రైతుల జాతీయవాదాన్ని (దానికి రాయితీలు యిచ్చే లక్ష్యంతో గాక, దానికి వ్యతిరేకంగా పోరాడేందుకు) పరిగణనలోకి తీసుకోవలసివస్తుంది.* పీడిత జాతుల్లో 1905 తర్వాత మిక్కిలి ప్రస్ఫుటంగా వ్యక్తమైన జాతీయవాద జాగృతి (ఉదాహరణకు, మొదటి దూమలో "సమాఖ్యవాద స్వయంపాలనవాదులు," ఉక్రేనియన్, ముస్లిం ఉద్యమాల పెరుగుదల, వగైరాలను మనం గుర్తుచేసుకోవలసివుంటుంది), పట్టణ, పల్లె ప్రాంతాల్లోని మహా రష్యన్ పెటీబూర్జువావర్గంలో జాతీయవాదం మరింతగా పెరిగేందుకు అనివార్యంగా దారితీస్తుంది. రష్యా ప్రజాస్వామ్యకరణ ఎంత నెమ్మదిగా జరిగితే, జాతుల వేధింపూ, వివిధ జాతుల బూర్జువావర్గాల మధ్య జగడాలూ అంత ఎక్కువ పట్టుదలగా, పాశవికంగా, తీవ్రంగా వుంటాయి. రష్యన్ పురిష్కేవిచ్‌ల ప్రత్యేకించి అభివృద్ధినిరోధక స్వభావం, యిరుగుపొరుగు రాజ్యాల్లో కొన్ని సమయాల్లో చాలా ఎక్కువ స్వేచ్ఛను అను

---

* ఉదాహరణకు, పోలిష్ జాతీయవాదం భూస్వామ్య జాతీయవాదంలోంచి బూర్జువా జాతీయవాదంలోకీ, అటు తర్వాత రైతాంగ జాతీయవాదంలోకీ పరివర్తనచెందే క్రమంలో దానిలో సంభవించే మార్పులను గమనించడం ఆసక్తిదాయకంగా వుంటుంది. జర్మన్ కొకోష్కిన్ అభిప్రాయాన్ని కలిగివున్న లుడ్విగ్ బెర్న్‌హార్ట్, తన పుస్తకం *Das polnische Gemeinwesen im preussischen Staat* ("ప్రష్యన్ రాజ్యంలో పోలిష్ ప్రజలు;" దీనికి రష్యన్ అనువాదం వుంది)లో అత్యంత విశిష్టమైన ఒక విషయాన్ని యిలా వర్ణిస్తాడు: జర్మనీలోని పోలులచేత ఒకరకమైన "రైతు రిపబ్లిక్" స్థాపన; ఇది, జాతీయతకోసం, మతంకోసం, "పోలిష్" భూమికోసం జరిపే పోరాటంలో, వివిధ సహకార సంస్థల, పోలిష్ రైతుల యితర సంఘాల సన్నిహితమైన పొత్తు రూపంలో వుంటుంది. జర్మన్ పీడన పోలులను సన్నిహితులను చేసి జతగూర్చి, వారిని వేరుచేసింది. మొదట అది భూస్వాముల, తర్వాత బూర్జువాల, చివరకు రైతు జనబాహుళ్యపు జాతీయవాదాన్ని జాగృతంచేసింది (ప్రత్యేకించి యిది, స్కూళ్లలో పోలిష్ భాష వాడటానికి వ్యతిరేకంగా జర్మన్లు 1873లో సాగించిన ఉద్యమం తర్వాత జరిగింది). రష్యాలో కూడా — ఒక్క పోలండుకి సంబంధించే కాకుండా — ఘటనలు యీ దిశలోనే జరుగుతున్నాయి.

భవించే వివిధ పీడిత జాతుల్లో "వేర్పాటు" ధోరణులను ఏక కాలంలో ఉత్పన్నంచేస్తాయి (పటిష్ఠంచేస్తాయి).

ఈ పరిస్థితిలో, రష్యా శ్రామికవర్గం ద్విగుణీకృత, లేక ద్విముఖ కర్తవ్యాన్ని ఎదుర్కొంటోంది: అన్ని రకాల జాతీయవాదంపైనా, అన్నింటికంటె ముఖ్యంగా మహా రష్యన్ జాతీయ వాదంపైనా పోరాటం జరపడం; మొత్తంగా అన్ని జాతుల పూర్తి సమాన హక్కులనూ గుర్తించడమే కాకుండా, రాజ్యనిర్మాణానికి సంబంధించి కూడా సమాన హక్కులను, అంటే, జాతుల స్వయంనిర్ణయ హక్కునీ, విడిపోయే హక్కునీ గుర్తించడం. మరి అదే సమయంలో, అన్ని జాతుల్లోనూ అన్ని రకాల, ప్రతిఒక్కరకం జాతీయవాదానికీ వ్యతిరేకంగా జరిపే విజయ వంతమైన పోరాట ప్రయోజనాల దృష్ట్యా, శ్రామికవర్గ పోరాటపు, శ్రామికవర్గ సంఘాల ఐక్యతను కాపాడేందుకూ, బూర్జువావర్గం జాతీయ వేర్పాటుతత్వంకోసం ఎంతగా ప్రయత్నాలు జరుపుతున్నా కూడా, యీ శ్రామికవర్గ సంఘాలను సన్నిహితంగా ముడివడిన ఒక అంతర్జాతీయ సంఘంలో విలీనం చేసేందుకూ కృషిచెయ్యడం వాళ్ల కర్తవ్యం.

అన్ని జాతులకూ పూర్తి సమాన హక్కులు; జాతుల స్వయంనిర్ణయ హక్కు; అన్ని జాతుల కార్మికుల ఐక్యత — ఇదీ, మార్క్సిజమూ, యావత్ప్రపంచపు అనుభవమూ, రష్యా అనుభవమూ కార్మికులకు బోధించే జాతీయ కార్యక్రమం.

---

నా యీ వ్యాసం కంపోజుచెయ్యబడే సరికే "నాష రబోచయ గజేత" పత్రిక 3వ సంచిక నాకు అందింది. ఆ సంచికలో అన్ని జాతుల స్వయంనిర్ణయ హక్కు గుర్తింపు గురించి వ్ల. కొసోవ్‌స్కీ యీకింది విధంగా రాశాడు:

"పార్టీ ప్రథమ మహాసభ (1898) తీర్మానంనుంచి — అది తన వంతులో యీ భావాన్ని అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలనుంచి తీసుకుంది — యాంత్రికంగా తీసుకోబడిన జాతుల స్వయంనిర్ణయ హక్కు భావానికి, చర్చల్లో స్పష్టమైన రీతిగా, సోషలిస్టు ఇంటర్నేషనల్ యిచ్చిన అర్థాన్నే, అంటే, రాజకీయ స్వయంనిర్ణయ హక్కు, రాజకీయ స్వాతంత్ర్య రంగంలో జాతుల స్వయంనిర్ణయ హక్కు అనే అర్థాన్నే 1903 నాటి మహాసభ కూడా ఆపాదించింది. ఈ విధంగా యీకింది సూత్రీకరణ రూపొందింది: జాతుల స్వయంనిర్ణయ హక్కు — ప్రాంతాలు విడిపోయే హక్కు కూడా యిందులో యిమిడివుందని దీని అర్థం — అన్నది ఒకానొక నిర్దిష్ట రాజ్యయంత్రాంగంలోపల, జాతుల మధ్య సంబంధాలు, ఉన్న రాజ్యంనుంచి

విడిపోజాలని లేక విడిపోవాలన్న కోర్కెలేని జాతుల విషయంలో ఎలా నియంత్రితం చెయ్యబడాలి అన్న సమస్యను ఏవిధంగానూ ప్రభావితం చెయ్యవు."

దీన్నిబట్టి, వ్ల. కొసోవ్‌స్కీ 1903లో జరిగిన రెండవ మహాసభ మినిట్సు చూశాడనీ, జాతుల స్వయంనిర్ణయ హక్కు అనే పదబంధానికి వున్న అసలైన (ఒకే ఒక) అర్థాన్ని పూర్తి బాగా అర్థంచేసుకున్నాడనీ సుస్పష్టం. దీన్ని, బుంద్ పత్రిక "Zeit"[109] సంపాదకులు కార్యక్రమాన్ని తిరస్కార భావంతో చూసేందుకూ, అది అస్పష్టంగా ఉందని ప్రకటించేందుకూ లీబ్‌మన్‌ని ఉసిగొల్పిన వాస్తవంతో పోల్చిచూడండి! ఈ బుందిస్టుల్లో విడ్డూరమైన "పార్టీ" నైతిక ప్రవర్తనే.... స్వయంనిర్ణయ సూత్రాన్ని మహాసభ యాంత్రికంగా స్వీకరించిందని కొసోవ్‌స్కీ ఎందుకు ప్రకటించవలసివచ్చిందో "దేవుడికే తెలియాలి." కొందరు దీనికి "అభ్యంతరం చెప్పాలని" అనుకుంటారు, కాని, అభ్యంతరం చెప్పడం ఎలాగో, ఎందుకో, ఏ కారణంగానో వాళ్లకి తెలియదు.

1914 ఫిబ్రవరి – మే మధ్య రచింపబడింది

# యుద్ధమూ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ

సకల దేశాల ప్రభుత్వాలూ, బూర్జువా పార్టీలూ దశాబ్దాలుగా సన్నాహాలు చేసుకుంటూ వుండిన యూరపియన్ యుద్ధం ప్రజ్వరిల్లింది. ఆయుధాల పెరుగుదలా, పురోగామి దేశాల పెట్టుబడిదారీ అభివృద్ధిలోని ఆధునిక – సామ్రాజ్యవాద – దశలో మార్కెట్లకొరకు పోరాటం అత్యంత తీవ్రం కావడమూ, మరీ వెనుకబడిన తూర్పు యూరపియన్ రాజరికాల రాజవంశ ప్రయోజనాలూ యుద్ధాన్ని అనివార్యంగా తెచ్చిపెట్టక తప్పదు, అలాగే తెచ్చిపెట్టినాయి. భూభాగాలను సంగ్రహించడమూ, యితర జాతులను లోబరుచుకోవడమూ, పోటీ జాతులను ఆర్థికంగా నాశనం చేసి, వాటి ఐశ్వర్యాన్ని కొల్లగొట్టడమూ, రష్యా, జర్మనీ, బ్రిటన్ మొదలైన దేశాల ఆంతరంగిక రాజకీయ సంక్షోభాలనుండి కార్మికజనాల దృష్టిని పక్కకు మళ్లించడమూ, కార్మికులను అనైక్యపరిచి జాతీయవాదంతో నిర్వీర్యులను చేయడమూ, కార్మికవర్గ విప్లవోద్యమాన్ని బలహీనపరచడానికి కార్మికుల అగ్రదళాన్ని హతమార్చడమూ – యివి ప్రస్తుత యుద్ధపు సంపూర్ణ యదార్థ వస్తువూ, ప్రాముఖ్యమూ, తాత్పర్యమూ.

యుద్ధపు నిజమైన అర్థాన్ని వెల్లడించే బాధ్యతా, యుద్ధాన్ని సమర్థించడానికి పాలక వర్గాలు – భూస్వాములూ, బూర్జువావర్గమూ – వ్యాపింపజేసే బూటకాన్నీ, కూట పాండిత్యాన్నీ, "దేశభక్తియుత" వాగాడంబరాన్నీ నిర్దాక్షిణ్యంగా బహిర్గతంచేసే బాధ్యతా ప్రధానంగా సోషల్ డెమోక్రటిక్ పార్టీమీద వుంది.

యుద్ధమగ్న దేశాలలో ఒక బృందానికి అగ్రభాగాన జర్మన్ బూర్జువావర్గం వుంది. యీ యుద్ధం మాతృదేశాన్నీ, స్వేచ్ఛనూ, నాగరికతనూ రక్షించడానికి అనీ, జారిజంచేత పీడింపబడే జాతుల విమోచనకు అనీ, ప్రగతి వ్యతిరేక జారిజంను ధ్వంసం చేయడానికి అనీ ఉద్ఘాటించడం ద్వారా జర్మన్ బూర్జువావర్గం కార్మికవర్గాన్నీ, శ్రామికజనాలనూ మోసగిస్తున్నది. కానీ వాస్తవంలో, రెండవ విల్‌హెల్మ నాయకత్వాన వున్న ప్రష్యన్ భూస్వాము

లకు నీచంగా అడుగులకు మడుగులొత్తే యీ బూర్జువావర్గం యెల్లప్పుడూ జారిజంకు విశ్వాసంగల మిత్రంగా, రష్యన్ కార్మిక, కర్షక విప్లవోద్యమానికి శత్రువుగా వుండింది. నిజానికి, యుద్ధ ఫలితం యేవిధంగా వున్నా, యీ బూర్జువావర్గం, జర్మన్ భూస్వాములతో కలిసి, రష్యాలో విప్లవానికి వ్యతిరేకంగా జారిస్టు రాజరికానికి మద్దతు యివ్వడానికి శాయశక్తులా కృషిచేస్తుంది.

వాస్తవంలో, సెర్బియాను లోబరచుకొని, దక్షిణ స్లావుల జాతీయ విప్లవాన్ని గొంతు నొక్కే లక్ష్యంతో జర్మన్ బూర్జువావర్గం సెర్బియామీద దోపిడీ దాడి చేసింది; అదే సమయంలో తన సైన్యంలో అధిక భాగాన్ని తనకంటె స్వేచ్ఛగల దేశాలైన బెల్జియం, ఫ్రాన్సుల మీదికి పంపింది, తనకంటె ఐశ్వర్యవంతమైన దేశాలను కొల్లగొట్టడానికి. వాస్తవంలో, ఆత్మరక్షణ యుద్ధం చేస్తున్నాననే కట్టుకథను వ్యాప్తిచేసే జర్మన్ బూర్జువావర్గం యుద్ధానికి తనకు అత్యంత అనుకూలమైన తరుణం యెన్నుకుని, మిలిటరీ సామగ్రిలో తాను సాధించిన సరికొత్త మెరుగుదలలను వినియోగించుకుంటూ, రష్యా ఫ్రాన్సులు పథకం వేసుకొని నిర్ణయించిన పునరాయుధీకరణను పురిటిలోనే అడ్డగించింది.

యుద్ధమగ్న దేశాలలో మరొక బృందానికి అగ్రభాగాన బ్రిటిష్, ఫ్రెంచి బూర్జువా వర్గాలు వున్నాయి. అవి తమ దేశాల రక్షణకొరకూ, స్వేచ్ఛా నాగరికతలకొరకూ, జర్మన్ సైనికవాదానికీ, నియంతృత్వానికీ వ్యతిరేకంగానూ యుద్ధం చేస్తున్నామని ఉద్ఘాటించడం ద్వారా కార్మికవర్గాన్నీ, శ్రామికజనాలనూ మోసగిస్తున్నాయి. వాస్తవంలో యీ బూర్జువా వర్గాలు యూరప్‌లో అత్యంత ప్రగతి వ్యతిరేక, ఆటవిక రాజరికమైన రష్యన్ జారిజంయొక్క సైన్యాలను కిరాయికి, వాటిని జర్మనీమీద దాడికి సన్నద్ధం చేయడానికి చాలా కాలంగా వందల కోట్లు ఖర్చుపెడుతున్నాయి.

వాస్తవంలో బ్రిటిష్, ఫ్రెంచి బూర్జువావర్గాల పోరాట లక్ష్యం జర్మన్ వలసలను సంగ్రహించుకోవడమూ, తమకంటె వేగంగా ఆర్థికాభివృద్ధి చెందుతున్న పోటీ దేశాన్ని ఆర్థికంగా నాశనం చేయడమూ. యీ ఉదాత్త లక్ష్య సాధనలో "పురోగామి" "ప్రజాతంత్ర" జాతులు పోలండు, ఉక్రెయిన్, వగైరాలను యింకా గొంతు నొక్కడానికీ, రష్యాలో విప్లవాన్ని మరింత కట్టుదిట్టంగా నలిపివేయడానికీ కిరాతక జారిస్టు ప్రభుత్వానికి సహాయపడుతున్నాయి.

యుద్ధపు విధ్వంసకాండలోనూ, క్రూర కర్మలలోనూ, హద్దులులేని పశుత్వంలోనూ యుద్ధమగ్న బృందాలలో ఒకదానికంటె మరొకటి యేదీ తక్కువది కాదు. కానీ కార్మిక వర్గాన్ని మోసగించడానికీ, ఒకే ఒక నిజమైన విమోచన యుద్ధంనుండి – అనగా తన "సొంత" దేశపు, "పరాయి" దేశాల బూర్జువావర్గాలకు వ్యతిరేకమైన అంతర్యుద్ధంనుండి –

కార్మికవర్గ దృష్టిని మళ్లించడానికీ — యింత ఉన్నతమైన లక్ష్యం సాధించడానికి — ప్రతి దేశపు బూర్జువావర్గమూ, దేశభక్తిని గురించిన బూటకపు మాటల సహాయంతో, తన "సొంత" జాతీయ యుద్ధ ప్రాముఖ్యాన్ని ప్రస్తుతించడానికి ప్రయత్నిస్తున్నది; ప్రతి దేశపు బూర్జువావర్గమూ ఉద్ఘాటించే దేమంటే తాను శత్రువును ఓడించబూనుకున్నది కొల్లగొట్టడానికీ, భూభాగాలను సంగ్రహించడానికీ కాదట, సకల ప్రజలనూ "విమోచన" చేయడానికట — తన ప్రజలను తప్ప అందరినీ.

కానీ, సకల దేశాల ప్రభుత్వాలూ, బూర్జువావర్గాలూ కార్మికులను అనైక్యపరచడానికీ, ఒకరిమీదికి ఒకరిని ఉసికొల్పడానికీ మరింత తీవ్రంగా ప్రయత్నించే కొద్దీ, యీ ఉన్నత లక్ష్యంకొరకు మార్షల్ చట్టాన్నీ, మిలిటరీ సెన్సార్‌షిప్‌నూ (యిప్పుడు కూడా, యుద్ధ కాలంలో, బాహ్య శత్రువుకంటె "అంతరంగిక" శత్రువుమీద యెక్కువ కఠినంగా అమలు పరిచే చర్యలను) మరింత కిరాతకంగా అమలుపరిచే కొద్దీ, సకల దేశాలలోని "దేశభక్తి యుత" బూర్జువా ముఠాల అదుపులేని జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా తన వర్గ సంఘీభావాన్నీ, తన అంతర్జాతీయతనూ, తన సోషలిస్టు విశ్వాసాలనూ రక్షించుకోవలసిన బాధ్యత వర్గచైతన్యంగల కార్మికవర్గంమీద మరింత యెక్కువగా వుంటుంది. వర్గచైతన్యం గల కార్మికులు యీ లక్ష్యాన్ని విసర్జిస్తే, తమ స్వేచ్ఛా ప్రజాస్వామ్య ఆశయాలనూ విసర్జిం చడమౌతుంది, సోషలిస్టు ఆశయాల మాట అటుంచి.

అత్యంత గాఢమైన విచారంతో చెప్పవలసిన విషయం యేమంటే, ప్రముఖ యూర పియన్ దేశాల సోషలిస్టు పార్టీలు యీ కర్తవ్యాన్ని నిర్వహించలేదు; అంతేకాక, ఆ పార్టీల నాయకుల (ముఖ్యంగా జర్మనీ నాయకుల) ప్రవర్తన సోషలిజంపట్ల పచ్చి ద్రోహానికి దగ్గ రలో వుంది. అత్యున్నత, ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యంగల యీనాడు, ప్రస్తుత సోషలిస్టు ఇంటర్నేషనల్, రెండవ ఇంటర్నేషనల్ (1889–1914) నాయకులలో అత్యధిక భాగం సోషలిజం స్థానంలో జాతీయతను పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ల ప్రవర్తన ఫలి తంగా, యీ దేశాల కార్మిక పార్టీలు ప్రభుత్వాల దుష్ట ప్రవర్తనను వ్యతిరేకించలేదు; కార్మికవర్గాన్ని అవి సామ్రాజ్యవాద ప్రభుత్వాల వైఖరితో తన వైఖరిని ఏకం చేయమని ఉద్బోధించినాయి. యుద్ధ రుణాలకు వోటు చేయడం ద్వారా, తమ "స్వ" దేశాల బూర్జువా వర్గపు జాతీయ దురహంకార ("దేశభక్తియుత") నినాదాలను పునరుద్ఘాటించడం ద్వారా, యుద్ధాన్ని న్యాయమైనదంటూ సమర్థించడం ద్వారా, యుద్ధమగ్న దేశాల బూర్జువా ప్రభుత్వాలలో చేరడం ద్వారా, యింకా యిలాంటి అనేక చర్యల ద్వారా ఇంటర్నేషనల్ నాయ కులు సోషలిజానికి ద్రోహం చేసినారు. యీనాటి యూరప్‌లోని అత్యంత పలుకుబడిగల సోషలిస్టు నాయకులు, అత్యంత పలుకుబడిగల సోషలిస్టు పత్రికలు జాతీయ దురహంకార,

బూర్జువా, ఉదారవాద వైఖరి తీసుకుంటున్నారు, యేవిధంగానూ సోషలిస్టు వైఖరి తీసుకోవడంలేదు. సోషలిజంను పరాభవించినందుకు బాధ్యత ప్రధానంగా జర్మన్ సోషల్ డెమోక్రట్లమీద వుంది; వాళ్లు రెండవ ఇంటర్నేషనల్‌లో అత్యంత బలమైన, అత్యంత పలుకుబడిగల పార్టీగా వుండినారు. ఫ్రెంచి సోషలిస్టులను కూడా యెవరూ సమర్థించలేరు; యే బూర్జువావర్గం తన దేశానికి ద్రోహం చేసిందో, కమ్యూన్‌ను[110] అణచడానికి బిస్మార్కుతో పొత్తు కలిసిందో ఆ బూర్జువావర్గపు ప్రభుత్వంలోనే వాళ్లు మంత్రి పదవులు అంగీకరించినారు.

యుద్ధానికి అండదండలు యివ్వడం ద్వారా రష్యన్ జారిజంతో పోరాడుతున్నామనే వాదంతో జర్మన్, ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రట్లు తమ చర్యను సమర్థించుకో జూస్తున్నారు. యీ సమర్థనను కేవలం కూట పాండిత్యంగా పరిగణిస్తున్నామని రష్యన్ సోషల్ డెమోక్రట్లమైన మనం ప్రకటిస్తున్నాము. మన దేశంలో గత కొద్ది సంవత్సరాల కాలంలో జారిజంకు వ్యతిరేకమైన విప్లవోద్యమం మళ్లీ ప్రచండమైన పరిమాణాలు అందుకుంది. సర్వదా యీ వుద్యమానికి అగ్రభాగాన రష్యా కార్మికవర్గం వుండింది. గత కొద్ది సంవత్సరాలలో కోట్లాది కార్మికులు పాల్గొన్న రాజకీయ సమ్మెలకు జారిజంను కూలదోయడమూ, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను స్థాపించడమూ నినాదంగా వుంది. సరిగా యుద్ధానికి ముందు, రెండవ నీకొలస్‌ను దర్శించడానికి ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడు పుయన్‌కరే వచ్చినప్పుడు, సెంట్ పీటర్స్‌బుర్గ్ వీధుల్లో రష్యన్ కార్మికులు నిర్మించిన మార్గావరోధాలను అతను స్వయంగా చూడగలిగినాడు. జారిస్టు రాజరికపు అవమానంనుండి మానవ జాతిని విముక్తి చేయడానికి రష్యన్ కార్మికవర్గం యే త్యాగానికైనా వెనుకాడడంలేదు. కానీ, ఒక విషయం మేము చెప్పక తప్పదు: కొన్ని పరిస్థితుల్లో జారిజంయొక్క పతనాన్ని ఆలస్యం చేయగలిగేది యేదైనా వుంటే, రష్యా ప్రజాస్వామ్యాని కంతటికీ వ్యతిరేకంగా జారిజం చేసే పోరాటంలో దానికి తోడ్పడగలది యేదైనా వుంటే, అది ప్రస్తుత యుద్ధమే; యీ యుద్ధం బ్రిటిష్, ఫ్రెంచి, రష్యన్ బూర్జువాల డబ్బు సంచులను జారిజం వశంలో పెట్టింది, దాని ప్రగతి వ్యతిరేక లక్ష్యాలకు తోడ్పడడానికి. జారిజానికి వ్యతిరేకంగా రష్యా కార్మికవర్గపు విప్లవ పోరాటాన్ని అడ్డగించగలది యేదైనా వుంటే, అది జర్మన్, ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రటిక్ నాయకుల ప్రవర్తనే; యీ ప్రవర్తనను రష్యా జాతీయ దురహంకార పత్రికలు నిత్యం మాకు ఆదర్శంగా చూపిస్తున్నాయి.

జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ సమస్త విప్లవ చర్యను మానుకోక తప్పనంత బలహీనంగా వుండిందని అనుకున్నప్పటికీ, అది జాతీయ దురహంకార శిబిరంలో చేరివుండ కూడదు; కార్మికవర్గ ఇంటర్నేషనల్ జండాను జర్మన్ సోషల్ డెమోక్రటిక్ నాయకులు

అవమానిస్తున్నారని యిటాలియన్ సోషలిస్టులు చెప్పడానికి కారణమైన చర్యలు అది చేసి వుండకూడదు.

మన పార్టీ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, యుద్ధ సంబంధంగా గొప్ప త్యాగాలు చేసింది, చేస్తూ వుంటుంది. చట్టబద్ధమైన కార్మికవర్గ పత్రికలన్నీ అణచి వేయబడినాయి. కార్మికవర్గ సంఘాలలో అత్యధిక భాగం రద్దు అయినాయి, మన కామ్రేడ్లలో చాలామంది అరెస్టు చేయబడి, వాళ్లకు ప్రవాస శిక్ష విధించబడింది. కానీ మన పార్లమెంటు ప్రతినిధులు – దూమలోని రష్యన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక బృందం – యుద్ధ రుణాలకు వోటుచేయకపోవడం తమ విధాయక సోషలిస్టు కర్తవ్యమని భావించినారు, తమ నిరసనను మరింత చురుకుగా వ్యక్తంచేయడానికి దూమనుండి వాకౌట్ కూడా చేయడం తమ కర్తవ్యమని భావించినారు; యూరపియన్ ప్రభుత్వాల విధానాన్ని సామ్రాజ్యవాద విధానమని ప్రకటించడం తమ కర్తవ్యమని వాళ్లు భావించినారు.[111] జారు ప్రభుత్వం తన క్రూర నియంతృత్వాన్ని పదంతలు పెంచినా, రష్యా సోషల్ డెమోక్రటిక్ కార్మికులు యుద్ధానికి వ్యతిరేకంగా తమ మొదటి రహస్య విజ్ఞప్తులు యిప్పటికే ప్రచురిస్తున్నారు, ఆవిధంగా ప్రజాస్వామ్యంపట్లా, ఇంటర్నేషనల్‌పట్లా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు.

రెండవ ఇంటర్నేషనల్ పతనం విప్లవ సోషల్ డెమోక్రట్లలో – జర్మన్ సోషల్ డెమోక్రట్లలో అల్పసంఖ్యాకులలోనూ, తటస్థ దేశాలలోని అత్యుత్తమ సోషల్ డెమోక్రట్ల లోనూ – అవమాన జ్వాలలు రగిలించగా, బ్రిటన్, ఫ్రాన్సులలోని సోషలిస్టులు అత్యధిక సోషల్ డెమోక్రటిక్ పార్టీల జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా మాట్లాడుతుండగా, అవకాశవాదులు, ఉదాహరణకు జర్మన్ "సోషలిస్టు మాసపత్రిక" ("Sozialistische Monatshefte")[112] లాంటివి యెవరికి ప్రాతినిధ్యం వహిస్తాయో వాళ్లు, చాలా కాలంగా జాతీయ ఉదారవాద అభిప్రాయాలు కలిగినవాళ్లు, యూరపియన్ సోషలిజంమీద తమ విజయానికి సకారణంగానే ఉత్సవం చేసుకుంటుండగా – అవకాశవాదానికీ, విప్లవ సోషల్ డెమోక్రటిక్ పార్టీకీ మధ్య (జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని "మధ్యస్థ వర్గం"లాగా) ఊగిసలాడేవాళ్లూ, రెండవ ఇంటర్నేషనల్ పతనాన్ని గోప్యంగా పెట్టడా నికీ, కుయుక్తి మాటలతో మునుగువేయడానికీ ప్రయత్నించేవాళ్లూ కార్మికవర్గానికి యెనలేని అపచారం చేస్తున్నారు.

యిందుకు భిన్నంగా, యీ పతనాన్ని మొహమాటం లేకుండా గుర్తించి, దీని కారణాలు గ్రహించాలి; తద్వారా సకల దేశాల కార్మికుల సోషలిస్టు సమైక్యతను కొత్తగా, మరింత చిరస్థాయిగా నిర్మించడం సాధ్యమౌతుంది.

అవకాశవాదులు ష్టుట్‌గార్ట్,[113] కోపెన్‌హాగెన్,[114] బాసెల్ మహాసభల[115] నిర్ణయాలను

భగ్నం చేసినారు; ఆ నిర్ణయాలు సకల పరిస్థితులలోనూ, యెట్టి పరిస్థితులలోనూ జాతీయ దురహంకారంతో పోరాడడాన్ని సకల దేశాల సోషలిస్టులకూ విధాయకం చేసినాయి; బూర్జువా వర్గమూ, ప్రభుత్వాలూ ప్రారంభించే యే యుద్ధానికైనా జవాబుగా అంతర్యుద్ధాన్నీ, సాంఘిక విప్లవాన్నీ ఉద్ధృతం చేయడాన్ని సోషలిస్టులకు విధాయకం చేసినాయి. రెండవ ఇంటర్నేషనల్ పతనం అవకాశవాదపు పతనం; యీ అవకాశవాదం యిప్పుడు గతించిపోయిన ("శాంతియుత" అనబడే) చారిత్రక దశనుండి అభివృద్ధిచెంది, యిటీవలి సంవత్సరాలలో ఇంటర్నేషనల్‌మీద దాదాపు పెత్తనం వహిస్తూ వుండింది. సోషలిస్టు విప్లవాన్ని నిరాకరించి దాని స్థానంలో బూర్జువా సంస్కరణవాదాన్ని వుంచడం ద్వారానూ, వర్గపోరాటాన్నీ, కొన్ని తరుణాల్లో అది అనివార్యంగా అంతర్యుద్ధంగా మారడాన్నీ నిరాకరించి, వర్గ సహకారాన్ని బోధించడం ద్వారానూ, దేశభక్తి ముసుగులో, మాతృదేశ రక్షణ ముసుగులో బూర్జువా జాతీయ దురహంకారాన్ని బోధిస్తూ, కార్మికులకు దేశం అనేది లేదు అని "కమ్యూనిస్టు ప్రణాళిక"లో యేనాడో చెప్పబడిన మౌలిక సోషలిస్టు సత్యాన్ని విస్మరించడం, లేక నిరాకరించడం ద్వారానూ, సైనికతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో, సకల దేశాల బూర్జువావర్గానికీ వ్యతిరేకంగా సకల దేశాల కార్మికులూ విప్లవ యుద్ధం చేయవలసిన అవసరాన్ని గుర్తించడానికి బదులు మమతాపూర్వక, కూపస్థమండూక సహజమైన దృక్పథానికి పరిమితం కావడం ద్వారానూ, బూర్జువా పార్లమెంటరీ విధానాన్నీ, బూర్జువా చట్టబద్ధతనూ తప్పక వినియోగించుకోవలసిన అవసరాన్ని మాత్రం నియమంగా మార్చి, చట్ట వ్యతిరేకమైన సంఘ రూపాలూ, ప్రచార రూపాలూ సంక్షోభ సమయాల్లో విధాయకమనే విషయాన్ని మరిచిపోవడం ద్వారానూ అవకాశవాదులు ఈ పతనానికి చాలా కాలంగా భూమిక తయారుచేస్తూవుండినారు. అవకాశవాదానికి సహజమైన "తోక" – పైవాటిలాగే బూర్జువాలకు సహజమూ, కార్మికవర్గ, అంటే మార్క్సిస్టు దృక్పథానికి వ్యతిరేకమూ అయినది – అనగా అరాజకవాద సిండికలిస్టు ధోరణి,[116] ప్రస్తుత సంక్షోభ కాలంలో జాతీయ దురహంకార నినాదాలను పైవాటిలాగే అవమానకరమైన ఆత్మ సంతృప్తితో పునరుద్ఘాటిస్తూ వుండింది.

అవకాశవాదంతో తిరుగులేని విధంగా తెగతెంపులు చేసుకోకుండా, దాని అనివార్యమైన వైఫల్యాన్ని ప్రజలకు వివరించకుండా, యీనాడు సోషలిజంయొక్క లక్ష్యాలను నెరవేర్చడం గానీ, కార్మికుల అంతర్జాతీయ ఐక్యతను సాధించడం గానీ సాధ్యం కాదు.

ప్రతి దేశంలోనూ ఆ దేశపు జాతీయ దురహంకారంతో పోరాడడం సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రధాన కర్తవ్యం. రష్యాలో యీ జాతీయ దురహంకారం బూర్జువా ఉదారవాదులను ("కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రట్లను") లోబరచుకుంది, "నరోద్నిక్కుల"లో కొంత భాగాన్ని – సోషలిస్టు రివల్యూషనరీలదాకా, "దక్షిణ పక్ష" సోషల్ డెమోక్రట్లదాకా –

లోబరచుకుంది. (ప్రత్యేకంగా ఇ. స్మిర్నోవ్, పి. మాస్లోవ్, జి. ప్లెహానొవ్ లాంటివాళ్ల జాతీయ దురహంకార ప్రకటనలను ఖండించాలి; బూర్జువా "దేశభక్తి" పత్రికలు వాటిని పట్టుకొని, విస్తృతంగా ఉపయోగించుకున్నాయి.)

యుద్ధమగ్న దేశాల బృందాలు రెండిటిలో యేది ఓడిపోతే సోషలిజంకు తక్కువ హానిగా వుంటుందో, అంతర్జాతీయ కార్మికవర్గ దృక్పథంనుండి నిర్ణయించడం ప్రస్తుత సన్నివేశంలో అసాధ్యం. కానీ, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీకి అణుమాత్రం కూడా సందేహంలేని విషయమేమంటే: యూరప్, ఆసియాలలో అత్యధిక జాతులనూ, అత్యధిక జనాభానూ పీడిస్తూ, ప్రభుత్వాలలోకెల్ల అత్యంత ప్రగతి వ్యతిరేకమూ, అత్యంత ఆట వికమూ అయిన జారిస్టు రాజరికం ఓడిపోవడం, రష్యాలోని సకల జాతుల కార్మికవర్గ, శ్రామిక జనుల దృక్పథంనుండి, తక్కువ హానికరం.

రిపబ్లికన్ యూరప్ సంయుక్త రాష్ట్రాలు యేర్పడడం యూరప్‌లోని సోషల్ డెమొక్రట్ల తక్షణ రాజకీయ నినాదం కావాలి. కార్మికవర్గాన్ని జాతీయ దురహంకార ప్రవాహంలోకి లాగడానికి బూర్జువావర్గం యేదైనా "వాగ్దానం చేస్తుంది;" యిందుకు వ్యతిరేకంగా, సోషల్ డెమొక్రట్లు జర్మన్, ఆస్ట్రియన్, రష్యన్ రాజరికాలను విప్లవం ద్వారా కూలదోస్తే తప్ప యీ నినాదం (యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం) పరమ బూటకమనీ, అర్థరహితమనీ వివరిస్తారు.

రష్యా అత్యంత వెనుకబడిన దేశం గనుక, దాని బూర్జువా విప్లవం యింకా పూర్తికాలేదు గనుక, మినహాయింపులు లేని ప్రజాస్వామ్య సంస్కరణకు వున్న మూడు మౌలిక షరతులను నెరవేర్చడం — ప్రజాస్వామ్య రిపబ్లిక్ (సకల జాతులకూ సంపూర్ణ సమానత్వంతో, స్వయంనిర్ణయంతో సహా), ఎస్టేట్లను స్వాధీనం చేసుకోవడం, యెనిమిది గంటల పనిదినం అనే యీ మూటినీ సాధించడం — యింకా ఆ దేశపు సోషల్ డెమొక్రట్ల కర్తవ్యంగా మిగిలి వుంది. కానీ పురోగామి దేశాలన్నిటిలోనూ యుద్ధం సోషలిస్టు విప్లవ నినాదాన్ని యీనాటి దినచర్యలో చేర్చింది. కార్మికవర్గపు భుజాలమీద యుద్ధభారం మరింత తీవ్రమయ్యేకొద్దీ, భారీ పెట్టుబడిదారీ విధానపు బ్రహ్మాండమైన సాంకేతిక పురోగతి జరుగుతున్న ప్రస్తుత "దేశభక్తియుత" ఆటవిక తత్వపు బీభత్స అనంతరం యూరప్ పునస్సృష్టిలో ఆ నినాదపు భవిష్యత్ పాత్ర మరింత చురుకుగా మారడం తప్పనిసరి అయ్యేకొద్దీ, ఆ నినాదం మరింత తక్షణావసర మౌతున్నది. బూర్జువావర్గం యుద్ధకాలపు శాసనాలను కార్మికవర్గపు నోరు నొక్కడానికి వుపయోగించడంవలన, చట్ట వ్యతిరేకమైన ఆందోళన ప్రచార రూపాలనూ, సంఘటన రూపాలనూ సృష్టించుకోవడం కార్మికవర్గానికి విధాయక మౌతున్నది. తమ విశ్వాసాలకు ద్రోహం అనే మూల్యం చెల్లించి అవకాశవాదులు చట్టబద్ధ సంస్థలను

“నిలబెట్టుకో”వచ్చు గాక — విప్లవ సోషల్ డెమొక్రట్లు సోషలిజంకొరకు చట్ట వ్యతిరేక పోరాట రూపాలను, సంక్షోభ కాలానికి అనువైన రూపాలను, సృష్టించడానికీ, కార్మికులను ఆయా దేశాల జాతీయ దురహంకారపు బూర్జువావర్గాలతో గాక, సకల దేశాల కార్మికులతో సమైక్యం చేయడానికీ కార్మికవర్గపు సంఘటనాత్మక అనుభవాన్నీ, సంబంధాలనూ వినియోగించుకుంటారు. కార్మికవర్గ ఇంటర్నేషనల్ నాశనం కాలేదు, కాదు. యెన్ని అడ్డంకులు వున్నప్పటికీ, కార్మికజనులు కొత్త ఇంటర్నేషనల్‌ను సృష్టిస్తారు. అవకాశవాదపు ప్రస్తుత విజయం అల్పాయుష్కమైంది. యుద్ధం మోపే త్యాగాలు యెక్కువయే కొద్దీ, అవకాశవాదులు కార్మిక లక్ష్యానికి ద్రోహంచేసినారనీ, ప్రతి దేశపు ప్రభుత్వంమీదికీ, బూర్జువా వర్గంమీదికీ ఆయుధాలు మళ్లించాలనీ కార్మికజనులకు మరింత స్పష్టమౌతుంది.

ప్రస్తుత సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంలోకి మార్చడం ఒక్కటే సరియైన కార్మికవర్గ నినాదం; కమ్యూన్ అనుభవంనుండి ఉత్పన్నమయ్యేదీ, బాసెల్ తీర్మానం (1912) సూచించేదీ అదే. యెంతో అభివృద్ధిచెందిన బూర్జువా దేశాల మధ్య జరిగే సామ్రాజ్యవాద యుద్ధపు సకల పరిస్థితులూ శాసించేది అదే. అలా మార్చడం యే నిర్దిష్ట సమయంలోనైనా యెంత కష్టంగా కనపడినా, యుద్ధం యిప్పుడొక యధార్థమయింది గనుక, యీ దిశలో క్రమబద్ధంగా, పట్టుదలగా, దారినుండి వైదొలగకుండా సన్నాహక కృషి చేయడం సోషలిస్టులు యెన్నడూ మానుకోరు.

యీ మార్గంలో పయనించినప్పుడే కార్మికవర్గం తాను జాతీయ దురహంకార బూర్జువా వర్గంమీద ఆధారపడే పరిస్థితినుండి బయటపడగలదు, జాతుల నిజమైన స్వేచ్ఛవైపూ, సోషలిజంవైపూ యేదో ఒక రూపంలో, దాదాపు వేగంగా నిర్ణయాత్మకమైన అడుగులు వేయగలదు.

సకల దేశాల బూర్జువావర్గాల జాతీయ దురహంకారానికీ, దేశభక్తికీ వ్యతిరేకంగా కార్మికుల అంతర్జాతీయ సౌభ్రాతృత్వం వర్ధిల్లాలి!

అవకాశవాదంనుండి విముక్తి చెంది, కార్మికవర్గ ఇంటర్నేషనల్ వర్ధిల్లాలి!

రష్యన్ సోషల్ డెమోక్రటిక్
లేబర్ పార్టీ కేంద్ర కమిటీ

1914, సెప్టెంబర్ 28
(అక్టోబర్ 11)కు ముందు
రచింపబడింది

# మహా రష్యన్ల జాతీయ గర్వం గురించి

జాతీయతని గురించీ, మాతృదేశం గురించీ యెన్ని యెన్ని మాటలు, యెన్ని వాదాలు, యెన్ని కేకలు! ఇంగ్లండులో ఉదారవాద, తీవ్రవాద మంత్రులూ, ఫ్రాన్సులో "పురోగామి" పత్రికా రచయితల సమూహమూ (వీళ్లు చివరకు ప్రగతి వ్యతిరేక పత్రికా రచయితలతో నూటికి నూరు పాళ్లూ ఏకీభవిస్తారు), రష్యాలో బోలెడు అధికార, కాడెట్, ప్రగతిశీల రాతగాళ్లు (కొంతమంది "నరోద్నిక్," "మార్క్సిస్టు" రాతగాళ్లతో సహా) — అందరూ వెయ్యి రకాల శ్రుతులలో "మాతృదేశ" స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనూ, జాతీయ స్వాతంత్ర్య సూత్రపు ఉత్కృష్టతనూ కీర్తిస్తున్నారు. గొంతులు కోసే నికొలస్ రొమానొవ్‌నూ, లేక నీగ్రోలనూ, భారతీయులనూ హింసించే వాళ్లనూ స్వార్థంకోసం పొగిడే నీచపు భట్రాజులు యెక్కడ అంతమయ్యేదీ, తెలివితక్కువవల్లనో "ప్రవాహంలో" కొట్టుకపోయే పచ్చి పశుబుద్ధులు యెక్కడ మొదలయ్యేదీ తెలుసుకోవడం కష్టం. యిదంత ముఖ్యమైన విషయం కూడా కాదు. చాలా విశాలమైన, చాలా లోతైన సిద్ధాంత ధోరణి ఒకటి కనపడుతూ వుంది; దీని వేర్లు బలమైన జాతులలోని భూస్వాముల, పెట్టుబడిదార్ల ప్రయోజనాలతో గట్టిగా ముడివడి వున్నాయి. యీ వర్గాలకు అనుకూలమైన భావాల ప్రచారానికి యేటా కోటానుకోట్ల ధనం ఖర్చు పెట్టబడుతూ వుంది. యీ మిల్లు అన్ని చోట్లనుండీ నీళ్లు తీసుకుంటుంది — కరుడుగట్టిన జాతీయ దురహంకారి మేన్షికొవ్ మొదలుకొని, అవకాశవాదంవల్లనో పిరికితనంవల్లనో జాతీయ దురహంకారులైన ప్లెహానొవ్, మాస్లొవ్, రుబనోవిచ్, స్మిర్నోవ్, క్రొపోత్కిన్, బూర్‌త్సెవ్‌లదాకా.

మహా రష్యన్ సోషల్ డెమోక్రట్లమైన మనం కూడా యీ సిద్ధాంత ధోరణిపట్ల మన వైఖరి యేమిటో నిర్వచించడానికి ప్రయత్నిద్దాం. యూరప్‌లోని దూరప్రాచ్యంలోనూ, ఆసియాలో సుమారైన భాగంలోనూ ఒక బలమైన జాతికి ప్రతినిధులమైన మనం జాతీయ

సమస్య – ముఖ్యంగా "జాతుల బందిఖానా" అని సముచితంగా పిలువబడే దేశంలో జాతీయ సమస్య – ప్రాముఖ్యాన్ని విస్మరించడం ఉచితంగా వుండదు. యూరప్‌లోని దూరప్రాచ్యంలోనూ, ఆసియాలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ అనేక "నూతన" పెద్ద చిన్న జాతులను సజీవత్వంలోకీ, చైతన్యంలోకీ మేల్కొల్పుతున్న కాలంలో, జారిస్టు రాజరికం సమైక్య ప్రభు వర్గ సమితి[117] ప్రయోజనాలకూ, గుచ్‌కోవ్‌ల, క్రెస్తోవ్నికొవ్, దొల్గొరూకొవ్‌ల, కూటెర్ల్, రోదిచెవ్‌ల ప్రయోజనాలకూ అనుకూలంగా అనేక జాతీయ సమస్యలు "పరిష్కరించ"డానికి లక్షలాది మహా రష్యన్లనూ, "పరాయివాళ్ల"నూ ఆయుధధారులను చేసిన తరుణంలో మనం అలా విస్మరించడం ఉచితంగా వుండదు.

జాతీయ గర్వం అనే భావం మనకు, వర్గచైతన్యంగల మహా రష్యన్ కార్మికులకు, పరాయిదా? కానే కాదు! మనం మన భాషను ప్రేమిస్తాం, మన దేశాన్ని ప్రేమిస్తాం, దాని శ్రామికజన సమూహాలను (అనగా దాని జనాభాలో నూటికి తొంబై వంతులను) ప్రజాస్వామ్యవాదుల సోషలిస్టుల చైతన్య స్థాయికి లేవనెత్తడానికి మనకు చేతనైనంతా చేస్తున్నాము. మన మహోజ్వలమైన దేశంపట్ల జారిస్టు కసాయివాళ్లూ, ఫ్యూడల్ ప్రభువులూ, పెట్టుబడిదార్లూ చేస్తున్న అపచారాలూ, పీడనా, అవమానాలూ చూసి మనం బాధపడినంతగా యెవరూ బాధపడరు. యీ అపచారాలకు మన మధ్యనుండి, మహా రష్యన్ల మధ్య నుండి, ప్రతిఘటన యెదురైనందుకు మేము గర్విస్తున్నాము; యీ మన మధ్యనుండే రదీష్చెవూ, "డిసెంబరిస్టులూ," 70ల నాటి రజ్నోచీంత్సీ[34] ఉద్భవించినందుకు మేము గర్విస్తున్నాము; మహా రష్యన్ కార్మికవర్గం 1905లో సామాన్యజనుల మహత్తర విప్లవకర పార్టీని సృష్టించినందుకు గర్విస్తున్నాము; అదే సమయంలో మహా రష్యన్ రైతు ప్రజాతంత్రవాది కావడం ప్రారంభించినందుకూ, మతగురువునూ, భూస్వామినీ కూలదోయడం ప్రారంభించినందుకూ గర్విస్తున్నాము.

అర్ధశతాబ్ది క్రితం తన జీవిత మంతా విప్లవానికి అంకితం చేసిన మహా రష్యన్ ప్రజాతంత్రవాది చెర్నిషేవ్‌స్కీ "దౌర్భాగ్య జాతి, బానిసల జాతి, పైనుండి కిందిదాకా – అందరూ బానిసలే"[118] అన్నమాటలు మనకు జ్ఞాపకం వున్నాయి. బాహాటపు బానిసలూ, ప్రచ్ఛన్న బానిసలూ (జారిస్టు రాజరికపు బానిసలు) యీ మాటలు జ్ఞాపకం చేసుకోడానికి యిష్టపడరు. కానీ, మన అభిప్రాయంలో, యీ మాటలలో నిజమైన దేశభక్తి వుంది – మహా రష్యన్ ప్రజా సమూహాలలో విప్లవతత్వం లేదనే విచారంతో కూడిన దేశభక్తి. విప్లవతత్వం ఆనాడు లేదు. యీనాడు యేకొంచెమో వుంది; కానీ వుంది. యీనాడు జాతీయ గర్వం మననిండా వుంది; యెందుకంటే, మహా రష్యన్ జాతి కూడా ఒక విప్లవ వర్గాన్ని సృష్టించింది, గొప్ప హత్యాకాండలూ, అసంఖ్యాకమైన ఉరికొయ్యలూ, చీకటి బందిఖానాలూ,

పెద్ద కరువులూ మాత్రమే కాక, మతగురువులకూ, జారులకూ, భూస్వాములకూ, పెట్టుబడిదార్లకూ చేసే నీచదాస్యం మాత్రమే కాక, స్వేచ్ఛకొరకూ, సోషలిజంకొరకూ జరిగే పోరాటాల మహోదాహరణలు మహా రష్యన్ జాతి కూడా మానవజాతికి యివ్వగలనని నిరూపించింది.

మనం జాతీయ గర్వభావంతో నిండి వున్నాం; సరిగ్గా ఆ కారణంవల్లనే మనం మన బానిసత్వపు గతాన్ని (హంగెరీ, పోలండు, పర్షియా, చైనాల స్వాతంత్ర్యాన్ని నలిపివేయడానికి ప్రభువర్గ భూస్వాములు రైతులను యుద్ధరంగంలోకి నడిపించిన గతాన్ని) ప్రత్యేకంగా ద్వేషిస్తున్నాం; ఆ కారణంవల్లనే మనం మన బానిసత్వపు వర్తమానాన్ని – అదే భూస్వాములు, పెట్టుబడిదార్ల అండదండలతో, పోలండునూ, ఉక్రెయిన్‌నూ గొంతు పిసకడానికీ, పర్షియాలోనూ, చైనాలోనూ ప్రజాతంత్ర ఉద్యమాన్ని నలిపివేయడానికీ, మన మహా రష్యన్ జాతీయ గౌరవానికి అవమానంగా వున్న రొమానొవ్‌ల, బొబ్రిన్‌స్కీల, పురిష్కేవిచ్‌ల ముఠాను బలపరచడానికీ మనలను యుద్ధరంగంలోకి నడిపిస్తున్న వర్తమానాన్ని – ప్రత్యేకంగా ద్వేషిస్తున్నాం. ఒక మనిషి బానిసగా పుట్టినందుకు నిందార్హుడు కాడు. కానీ ఒక బానిస స్వేచ్ఛా ప్రయత్నంనుండి తప్పుకోవడమే గాక, తన బానిసత్వాన్ని సమర్థించుకుంటూ, దానికి మెరుగులు పెడుతూ (ఉదాహరణకు పోలండునూ, ఉక్రెయిన్‌నూ గొంతు పిసకడాన్ని మహా రష్యన్‌ల "మాతృదేశ రక్షణ" అంటూ) వుంటే, అలాంటి బానిస నీచుడు, క్షుద్రుడు, మన ఆగ్రహానికీ, అసహ్యానికీ, ఏహ్యాభావానికీ న్యాయంగా అర్హుడు.

19వ శతాబ్దపు సుసంగతమైన ప్రజాతంత్ర ఉద్యమానికి మహోన్నత ప్రతినిధులైన మార్క్స్ ఎంగెల్సులు, విప్లవ కార్మికవర్గానికి గురువులైనవాళ్లు, "యితర జాతులను పీడించే జాతి యేదీ స్వేచ్ఛాయుతంగా వుండజాలదు"[119] అన్నారు. మహా రష్యన్ కార్మికులమైన మనం, జాతీయ గర్వభావంతో నిండినవాళ్లం, యెంత కష్టమైనా సరే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గల, స్వాభిమానపూరిత, ప్రజాతంత్ర, రిపబ్లికన్ మహా రష్యా కావాలని కోరుతాం; యిరుగుపొరుగు దేశాలతో మన దేశ సంబంధాలు సమానత్వ మనే మానవత్వ సూత్రంమీద ఆధారపడాలనీ, యే మహా జాతికైనా అవమానకరమైన అధికహక్కు అనే ఫ్యూడల్ సూత్రంమీద కాదనీ, కోరుతాం. మనం యిలా కోరుతాం గనుకనే, యిలా అంటాం: మన మాతృదేశపు రాజరికంతోనూ, భూస్వాములతోనూ, పెట్టుబడిదార్లతోనూ, అనగా మనదేశపు పరమ శత్రువులతో, పోరాడడానికి విప్లవ సాధనాల నన్నిటినీ ఉపయోగించడం ద్వారా తప్ప, 20వ శతాబ్దిలో, యూరప్‌లో (యూరప్‌లోని దూరప్రాచ్యంలో కూడా), "మాతృదేశ రక్షణ" సాధ్యం కాదు. మహా రష్యా జనాభాలో తొంభై వంతులమందికి తక్కువ హానికరమైన జారిజం ఓటమిని యేదో ఒక విధంగా కోరితే తప్ప, మహా రష్యన్లు "మాతృ

దేశ రక్షణ'' చేయజాలరని మనం అంటాం. జారిజం యీ తొంబై వంతులమందిని ఆర్థికంగా, రాజకీయంగా పీడించడమే కాదు; అది వాళ్లకు యితర జాతులను పీడించడం నేర్పి, ఆ అవమానాన్ని మోసపు కుహనా దేశభక్తి మాటలతో కప్పిపుచ్చడం నేర్పి, తద్వారా వాళ్లను కలుషితం చేస్తున్నది, నీచపరుస్తున్నది, అవమానపరుస్తున్నది, సానితనానికి దిగ లాగుతున్నది.

జారిజమే కాక, దాని నీడకింద మహా రష్యన్ పెట్టుబడిదారీ వ్యవస్థ అనే మరొక చారిత్రక శక్తి ఉద్భవించి బలపడిందనీ, అది విస్తారమైన ప్రాంతాలను ఆర్థికంగా కేంద్రీకరించి, సమైక్యపరచడం అనే అభ్యుదయకర కార్యం నెరవేరుస్తున్నదనీ మనకు చెప్పవచ్చు. కానీ యీ అభ్యంతరం మన సోషలిస్టు జాతీయ దురహంకారుల నేరాన్ని రద్దుచేయదు సరికదా, యింకా తీవ్రతరం చేస్తుంది (లాసాల్ అనుయాయులను మార్క్స్ రాయల్ ప్రష్యన్ సోషలిస్టులు[120] అన్నట్లు); వీళ్లను జారిస్టు పురిష్కేవిచ్ సోషలిస్టులు అనాలి. మహా రష్యన్ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానానికి అనుకూలంగానూ, శతాధికంగా వున్న చిన్న జాతులకు వ్యతిరేకంగానూ చరిత్ర తీర్పు చెప్పుతుందని అనుకుందాం. యిది అసంభవం కాదు; యెందుకంటే పెట్టుబడియొక్క మొత్తం చరిత్ర అంతా హింసతో, దోపిడీతో నిండిన చరిత్ర, నెత్తురుతో, బురదతో నిండిన చరిత్ర. యేమైనా సరే చిన్న జాతులను నిలబెట్టాలనే దానికి మనం అనుకూలం కాదు; యితర పరిస్థితులు సమానంగా వుంటే, కేంద్రీకరణకు మనం అనుకూలం, కూపస్థమండూకాల ఆదర్శమైన ఫెడరల్ సంబంధాలకు మనం వ్యతిరేకం. మనం అనుకున్నట్లు జరిగినా, మొదటి విషయం యేమంటే: ఉక్రెయిన్‌ను గొంతు నులమడం వగైరా పనులలో రొమానొవ్, బోబ్రిన్‌స్కీ, పురిష్కేవిచ్‌లకు సహాయపడడం మన కర్తవ్యం కాదు (సోషలిస్టులను అటుంచి), ప్రజాతంత్రవాదుల కర్తవ్యం కూడా కాదు. బిస్మార్కు తన ఫ్యూడల్ ప్రభుపద్ధతిలో ఒక అభ్యుదయకర చారిత్రక కర్తవ్యం నెరవేర్చినాడు. కానీ యీ కారణాలవల్ల బిస్మార్కుకు సోషలిస్టుల సహాయాన్ని సమర్థించేవాడు చాలా గొప్ప "మార్క్సిస్టు" ఔతాడు! అంతే కాక, యితర జాతులచేత పీడింపబడుతూ, చెల్లాచెదరుగా వున్న జర్మన్లను బిస్మార్కు ఐక్యపరిచి, ఆర్థికాభివృద్ధికి దోహదం చేసినాడు. కానీ, మహా రష్యా ఆర్థిక సౌభాగ్యమూ, సత్వరాభివృద్ధీ జరగాలంటే, మహా రష్యన్లు యితర జాతులమీద సాగించే హింసాకాండనుండి దేశం విముక్తి చెందాలి. మన అసలు రష్యన్ బిస్మార్కు ప్రాయుల భజనపరులు యీ తేడాను గమనించడం లేదు.

రెండవ విషయం యేమంటే: యీ సమస్యమీద చరిత్ర మహా రష్యన్ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలంగా తీర్పు యిస్తే, దాని పర్యవసానం యేమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థవల్ల ఉత్పన్నమయ్యే కమ్యూనిస్టు విప్లవానికి ప్రధాన చోదక శక్తిగా

మహా రష్యన్ కార్మికవర్గపు సోషలిస్టు పాత్ర మరింత యెక్కువగా వుంటుంది. కార్మికులకు పరిపూర్ణ జాతీయ సమానతా స్వాతంత్ర్యాలలో తరిఫీదు యివ్వడం కార్మికవర్గ విప్లవానికి అవసరం. కనుక, మహా రష్యన్లచేత పీడింపబడే సకల జాతులకూ సంపూర్ణ సమానత్వమూ, స్వయంనిర్ణయ హక్కూ కావాలని అత్యంత దీక్షాపూరితంగా, మినహాయింపులు లేకుండా, ధైర్యంగా, విప్లవకర పద్ధతిలో పోరాడడం సామాన్య ప్రజలకు క్రమబద్ధంగా నేర్పడం మహా రష్యన్ కార్మికవర్గ ప్రయోజనాలకే అవసరం. మహా రష్యన్ల జాతీయ గర్వపు ప్రయోజనాలు (బానిసత్వపు అర్థంలో కాదు) మహా రష్యన్ కార్మికుల (అలాగే సకల యితర కార్మికుల) సోషలిస్టు ప్రయోజనాలతో ఏకీభవిస్తాయి. యెల్లప్పుడూ మన ఆదర్శం కార్ల్ మార్క్స్; ఆయన దశాబ్దాల తరబడి యింగ్లండులో వుండి, సగం యింగ్లీషువాడై, యింగ్లీషు కార్మికుల సోషలిస్టు ఉద్యమ ప్రయోజనాల దృష్ట్యా ఐర్లండుకు స్వేచ్ఛా, జాతీయ స్వాతంత్ర్యమూ డిమాండు చేసినాడు.

మనం అనుకున్నట్లు జరిగితే, యీ రెండవ పరిస్థితి దృష్ట్యా, ప్లెహానొవ్ వగైరా వగైరాలలాంటి స్వదేశీ సోషలిస్టు జాతీయ దురహంకారులు తమ దేశమైన స్వతంత్ర ప్రజాతంత్ర మహా రష్యాకు ద్రోహులు కావడమే గాక, రష్యాలోని సకల జాతుల కార్మికవర్గ స్వాతంత్ర్యానికి, అనగా సోషలిజానికి, కూడా ద్రోహులు ఔతారు.

"సోత్సియాల్ డెమొక్రట్,"
35వ సంచికలో 1914, డిసెంబర్ 12న
ప్రచురింపబడింది

# యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం గురించి

"యూరప్ సంయుక్త రాష్ట్రాల" నినాదం గురించిన సమస్యను, దాని ఆర్థిక పార్శ్వం మీద పత్రికల్లో చర్చ జరిగిందాకా వాయిదావేయాలని మన పార్టీ దేశాంతర శాఖల కాన్ఫరెన్సు[121] నిర్ణయించిందని "సోత్సియాల్ డెమోక్రట్"[122] పత్రిక 40వ సంచికలో తెలియజేసినాం.

మన కాన్ఫరెన్సులో యీ సమస్యమీద చర్చ రాజకీయాలకు మాత్రమే పరిమితమైనందున పాక్షికంగా వుండింది. యీ నినాదాన్ని కేంద్ర కమిటీ ప్రణాళిక ప్రత్యక్షంగా రాజకీయ నినాదంగా రూపొందించడం దీనికి కొంతవరకు కారణం కావచ్చు ("తక్షణ రాజకీయ నినాదం..." అని ప్రణాళికలో వుంది); అది యూరప్ సంయుక్త రాష్ట్రాల రిపబ్లిక్ అనే నినాదం ప్రతిపాదించడమే గాక, "జర్మన్, ఆస్ట్రియన్, రష్యన్ రాజరికాలను విప్లవం ద్వారా కూలదోస్తే తప్ప" యిది అవివేకపు నినాదమూ, మోసపు నినాదమూ ఔతుందని కూడా అది నొక్కిచెప్పింది.*

యీ నిర్దిష్ట నినాదపు రాజకీయ అంచనా దృష్ట్యా ఆక్షేపించడం – ఉదాహరణకు, యిది సోషలిస్టు విప్లవ నినాదాన్ని మరుగుపరుస్తుందనీ, బలహీనపరుస్తుందనీ ఆక్షేపించడం – పూర్తిగా తప్పు. నిజమైన ప్రజాస్వామిక దిశలో వచ్చే రాజకీయ పరివర్తనలు, అంతకంటె ముఖ్యంగా రాజకీయ విప్లవాలు, ఎన్నడూ, యెట్టి పరిస్థితులలోనూ సోషలిస్టు విప్లవ నినాదాన్ని మరుగుపరచనూ లేవు, బలహీనపరచనూ లేవు. పైగా యెల్లప్పుడూ అవి దాన్ని సమీపానికి తెచ్చి, దాని ఆధార భూమిని విస్తృతపరచి, సోషలిస్టు పోరాటంలోకి పెటీబూర్జువా వర్గంనుండీ అర్ధనిరాస్తిపరులనుండీ నూతన భాగాలను ఆకర్షిస్తాయి. అంతే గాక, సోషలిస్టు విప్లవ గతిలో రాజకీయ విప్లవాలు అనివార్యంగా వుంటాయి; సోషలిస్టు విప్ల

---

* ఈ సంపుటంలో 137వ పేజి చూడండి. – సం.

వాన్ని ఒకే ఒక ఘటనగా కాక, సంక్షుభిత ఆర్థిక, రాజకీయ కల్లోలాల యుగంగా, అత్యంత తీవ్రమైన వర్గపోరాటమూ, అంతర్యుద్ధమూ, విప్లవాలూ, విప్లవ ప్రతిఘాతాలూ నిండిన యుగంగా గ్రహించవలసివుంటుంది.

రష్యన్ అగ్రేసరత్వంకింద వున్న యూరప్‌లోని మూడు అత్యంత ప్రగతి వ్యతిరేక రాజరికాలను విప్లవాత్మకంగా కూలదోసే సందర్భంగా ముందుకు తెచ్చిన యూరప్ సంయుక్త రాష్ట్రాల రిపబ్లిక్ అనే నినాదం, రాజకీయ నినాదంగా, దోషరహితమైంది. కానీ, దాని ఆర్థిక సారమూ, ప్రాముఖ్యమూ యేమిటనే ముఖ్యమైన సమస్య యింకా మిగిలి వుంది. సామ్రాజ్యవాదపు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా—అనగా, పెట్టుబడి యెగుమతీ, ప్రపంచం "పురోగామి," "నాగరిక" వలసలుగల రాజ్యాల మధ్య పంపకం కావడమూ, అనేవాటి దృష్ట్యా—పెట్టుబడిదారీ విధానంలో యూరప్ సంయుక్త రాష్ట్రాలు అనేది అసంభవమైనా ఔతుంది, లేదా ప్రగతి వ్యతిరేకమైనా ఔతుంది.

పెట్టుబడికి అంతర్జాతీయ స్వభావమూ, గుత్త స్వభావమూ వచ్చినాయి. ప్రపంచం కొన్ని గొప్ప రాజ్యాల మధ్య, అనగా జాతులను గొప్పగా కొల్లగొట్టడంలోనూ, పీడించడంలోనూ విజయం పొందిన రాజ్యాల మధ్య, పంపక మయింది. 25 కోట్లనుండి 30 కోట్ల వరకు జనాభా, 70 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణమూ గల నాలుగు గొప్ప యూరపియన్ రాజ్యాలకు—బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, జర్మనీ—దాదాపు 50 కోట్ల (49,45,00,000) జనాభా, 646 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణమూ గల, అనగా ప్రపంచ విస్తీర్ణంలో దాదాపు సగం (ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలను మినహాయించి 1,330 లక్షల చదరపు కిలోమీటర్లు) వున్న, వలసలు వున్నాయి. దీనికి చైనా, టర్కీ, పర్షియా అనే మూడు ఆసియా రాజ్యాలను కలపండి; వీటిమీద జపాన్, రష్యా, యింగ్లండు, ఫ్రాన్సులు "విమోచన" యుద్ధం సాగిస్తూ, దోపిడీదొంగల్లాగా వీటిని ముక్కలు ముక్కలు చేస్తున్నాయి. అర్ధవలసలు అనదగిన (నిజానికివి యిప్పుడు నూటికి 90 వంతులు వలసలు) యీ మూడు ఆసియా రాజ్యాలలో 36 కోట్ల ప్రజలు వున్నారు; వీటి విస్తీర్ణం 145 లక్షల చదరపు కిలోమీటర్లు (మొత్తం యూరప్‌కు దాదాపు ఒకటిన్నర రెట్లు).

యింతేగాక, యింగ్లండు, ఫ్రాన్సు, జర్మనీలు 7,000 కోట్ల రూబుళ్లకు తక్కువ గాకుండా విదేశాల్లో పెట్టుబడి పెట్టినాయి. యీ తగుపాటి మొత్తంమీద "న్యాయమైన" లాభాన్ని, సంవత్సరానికి 300 కోట్ల రూబుళ్లకుపైగా, భద్రపరిచే కర్తవ్యాన్ని కోటీశ్వరుల జాతీయ కమిటీలు నిర్వహిస్తాయి; యీ కమిటీలనే ప్రభుత్వాలు అంటారు; వీటికి సైన్యాలూ, నౌకాదళాలూ వున్నాయి; యివి వలసదేశాల్లోనూ, అర్ధవలసదేశాల్లోనూ కోటీశ్వరుల కొడు

కులనూ, తమ్ముళ్లనూ "నియమిస్తాయి" వైస్రాయిలూ, కాన్సళ్లూ, రాయబారులూ, రక రకాల అధికార్లూ, మతగురువులూ మొదలైన జలగలుగా.

పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశకు చెందిన యుగంలో కొద్దిపాటి గొప్ప రాజ్యాలు ప్రపంచ జనాభాలో సుమారు నూరు కోట్లమందిమీద దోపిడీ సాగించే పద్ధతి యిది. యీ పద్ధతి కాక మరొక పద్ధతి పెట్టుబడిదారీ వ్యవస్థలో అసాధ్యం. వలసలూ, "పలుకుబడి ప్రాంతాలూ," పెట్టుబడి యెగుమతీ విసర్జించడమా? యిది సాధ్యమని అను కునేవాడు ప్రతి ఆదివారమూ ధనికులకు క్రైస్తవమత ఉదాత్త సూత్రాలు బోధిస్తూ, బీదలకు యేటా కొన్ని కోట్లు కాకున్నా, కనీసం కొన్ని వందల రూబుళ్లు యివ్వమని హిత వచనాలు చెప్పే సాదా మతగురువుతో సమానం.

పెట్టుబడిదారీ విధానంలో యూరప్ సంయుక్త రాష్ట్రాలు అంటే వలసలను పంచు కోడానికి ఒప్పందం అన్నమాట. కానీ, పంచుకోడానికి బలం తప్ప మరొక ప్రాతిపదిక, మరొక సూత్రం యేదీ పెట్టుబడిదారీ వ్యవస్థలో లేదు. ఒక పెట్టుబడిదారీ దేశపు "జాతీయ ఆదాయా"న్ని ఒక కోటీశ్వరుడు "పెట్టుబడినిబట్టి" తప్ప యితరులతో పంచుకోడానికి అంగీకరించడు. (అదనంగా బోనస్ కూడా కావాలంటాడు, అందరికంటె యెక్కువ పెట్టు బడి గలవానికి అతని వాటాను మించి వచ్చేటట్లు.) పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే, ఉత్పత్తి సాధనాలమీద వ్యక్తి స్వామ్యం, ఉత్పత్తిలో అరాజకం. యీ ప్రాతిపదికమీద ఆదాయాల "న్యాయమైన" పంపకం బోధించడం ప్రూడనిజం[123] ఔతుంది, తెలివిలేని కూపస్థమండూ కత్వం ఔతుంది. "బలాన్నిబట్టి" పంపకం జరుగుతుంది; మరొక విధంగా జరగడానికి వీలులేదు. మరి, ఆర్థికాభివృద్ధి పెరిగేకొద్దీ బలం మారుతుంది. 1871 తర్వాత జర్మనీ బలం ఇంగ్లండు, ఫ్రాన్సులకంటె మూడు నాలుగు రెట్లు వేగంగా పెరిగింది; జపాన్ బలం రష్యాకంటె సుమారు పది రెట్లు వేగంగా పెరిగింది. పెట్టుబడిదారీ దేశపు బలాన్ని పరీ క్షించడానికి యుద్ధం తప్ప మరొక మార్గం లేదు, మరొక మార్గం వుండజాలదు. యుద్ధానికీ, వ్యక్తిగత ఆస్తి సూత్రాలకూ వైరుధ్యం లేకపోవడమే గాక అది వాటినుండి అని వార్యంగా నేరుగా ఉత్పన్నమయ్యే ఫలితం. పెట్టుబడిదారీ వ్యవస్థలో వివిధ పారిశ్రామిక సంస్థల అభివృద్ధి గానీ, వివిధ దేశాల అభివృద్ధి గానీ సమానంగా జరగడం అసంభవం. అప్పుడప్పుడు చెదిరిపోయే సమస్థితిని తిరిగి నెలకొల్పడానికి పరిశ్రమల్లో సంక్షోభాలూ, రాజ కీయాల్లో యుద్ధాలూ తప్ప పెట్టుబడిదారీ వ్యవస్థలో యితర మార్గాలు లేవు.

పెట్టుబడిదార్ల మధ్యా, రాజ్యాల మధ్యా తాత్కాలిక ఒప్పందాలు సాధ్యమయ్యే మాట నిజమే. యీ అర్థంలో యూరప్ సంయుక్త రాష్ట్రాలు సాధ్యమే, యూరపియన్ పెట్టుబడిదార్ల మధ్య ఒప్పందంగా. కానీ దేనికొరకు? యూరప్‌లో సంయుక్తంగా సోషలి

జాన్ని అణచడానికి మాత్రమే, లేదా జపాన్, అమెరికాలనుండి వలసల కొల్లసొమ్మును సంయుక్తంగా రక్షించుకోడానికి. జపాన్, అమెరికాలు యీనాటి వలసల పంపకంలో తమకు వాటా లేకుండా మోసం జరిగిందని భావిస్తున్నాయి; గత అర్ధశతాబ్దిగా యివి వయోభారంతో క్షీణ ముఖం పట్టిన తిరోగామి రాజరికపు యూరప్‌కంటె అపరిమితమైన వేగంతో బలపడినాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పోలిస్తే మొత్తం యూరప్ అంతా ఆర్థిక జడత్వాన్ని సూచిస్తుంది. ప్రస్తుత ఆర్థిక ప్రాతిపదికమీద, అనగా పెట్టుబడిదారీ వ్యవస్థలో, యూరప్ సంయుక్త రాష్ట్రాలు అంటే వేగవంతమైన అమెరికా ఆర్థికాభివృద్ధిని అరికట్టడానికి ప్రగతి వ్యతిరేక కూటమి మాత్రమే. ప్రజాస్వామ్యమూ, సోషలిజమూ యూరప్‌తో మాత్రమే ముడివడివుండిన కాలం శాశ్వతంగా గడిచిపోయింది.

కమ్యూనిజం సంపూర్ణ విజయం పొంది, రాజ్యం అనేది, ప్రజాతంత్ర రాజ్యంతో సహా, పూర్తిగా అదృశ్యమయ్యేదాకా మనం సోషలిజంతో ముడివేసే రాజ్యరూపం – వివిధ జాతుల సంయోగాన్నీ, స్వేచ్ఛనూ ప్రతిబింబించేది – యేదంటే ప్రపంచ సంయుక్త రాష్ట్రాలు (యూరప్‌ది మాత్రమే కాదు). కానీ ప్రపంచ సంయుక్త రాష్ట్రాలు అనేది ప్రత్యేక నినాదంగా యెంతమాత్రమూ సరైనది కాదు. యెందుకంటే, ఒకటి: అది సోషలిజంలో లీనమౌతున్నది; రెండు: ఒకే ఒక దేశంలో సోషలిజం విజయం పొందడం అసాధ్యం అనే దుర్వ్యాఖ్యానం చేయడానికీ, అలాంటి దేశానికి యితర దేశాలతో వుండే సంబంధాల గురించి పొరపాటు అభిప్రాయాలు కలగడానికీ అవకాశం వుంది.

అసమానమైన ఆర్థిక రాజకీయ అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక పరమ నియమం. కనుక మొదట కొన్ని పెట్టుబడిదారీ దేశాలలో, ఒకే ఒక పెట్టుబడిదారీ దేశంలో కూడా, సోషలిజం విజయం పొందడం సాధ్యమే. ఆ దేశంలో విజయం పొందిన కార్మికవర్గం, పెట్టుబడిదార్ల ఆస్తులు స్వాధీనం చేసుకొని తన సొంత సోషలిస్టు ఉత్పత్తిని యేర్పాటుచేసిన కార్మికవర్గం, మిగతా ప్రపంచాన్ని, పెట్టుబడిదారీ ప్రపంచాన్ని, యెదిరించి నిలబడుతుంది, యితర దేశాల పీడిత వర్గాలను తన ఆశయానికి ఆకర్షిస్తుంది, ఆ దేశాలలో పెట్టుబడిదార్లకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు లేవదీస్తుంది, అవసరమైతే పీడక వర్గాలకూ, వాటి రాజ్యాలకూ వ్యతిరేకంగా ఆయుధాలు ధరించి ముందుకు వస్తుంది. బూర్జువావర్గాన్ని కూలదోసి కార్మికవర్గం విజయం పొందిన సమాజపు రాజకీయ రూపం ప్రజాతంత్ర రిపబ్లిక్‌గా వుంటుంది. సోషలిజంలోకి యింకా పరివర్తన చెందని రాజ్యాలమీద చేసే పోరాటంలో ఆ ప్రజాతంత్ర రిపబ్లిక్ తన జాతిలోని (లేక జాతులలోని) కార్మికవర్గ బలాలను అంతకంతకూ కేంద్రీకరిస్తుంది. పీడిత వర్గ, అనగా కార్మికవర్గం నియంతృత్వం లేకుండా వర్గాలను రద్దుచేయడం సాధ్యం కాదు. వెనుకబడిన రాజ్యాలతో సోషలిస్టు రిపబ్లిక్కులు అంతో

యింతో దీర్ఘమైన మొండి పోరాటం చేయకుండా సోషలిజంలో జాతుల స్వేచ్ఛాయుత సంయోగం సాధ్యం కాదు.

యీ కారణాలవల్ల, ఆర్.ఎస్.డి.ఎల్.పి. దేశాంతర శాఖల కాన్ఫరెన్సులో పదేపదే జరిగిన చర్చల ఫలితంగా యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం తప్పు అనే నిర్ణయానికి వచ్చినారు కేంద్ర పత్రిక సంపాదకులు.

"సోత్సియాల్ డెమోక్రట్," సంచిక 44,
ఆగస్టు 23, 1915

# ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ యుద్ధం గురించి విడుదలచేసిన ప్రణాళికమీద "సోత్సియాల్ డెమోక్రట్" సంపాదకీయ వ్యాఖ్య

## యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం గురించి 124

యూరప్ సంయుక్త రాష్ట్రాలకోసం కేంద్ర కమిటీ ప్రణాళిక ముందుకు తెచ్చిన డిమాండు – దీనికి అది, రష్యా, ఆస్ట్రియా, జర్మనీలలోని రాజరికాలను కూలదొయ్యాలన్న విజ్ఞప్తిని జోడించింది – కౌట్స్కీ ప్రభృతులు ఆ నినాదానికి యిచ్చిన యుద్ధ వ్యతిరేక శాంతివాద భాష్యానికి భిన్నమైనది.

మన పార్టీ కేంద్ర పత్రిక అయిన "సోత్సియాల్ డెమోక్రట్" 44వ సంచికలో "యూరప్ సంయుక్త రాష్ట్రాల" నినాదం ఆర్థికంగా ఎంత తప్పైనదో నిరూపించే ఒక సంపాదకీయం వెలువడింది.* ప్రణాళికాబద్ధమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, విడి దేశాల మధ్య వలసలు, పలుకుబడి ప్రాంతాలు మొదలైనవాటి పంపిణీ జరగవలసివున్న దృష్ట్యా, యిది పెట్టుబడిదారీ విధానంకింద అమలుజరపబడజాలని డిమాండైనా అయివుండాలి, లేకపోతే, వలసల పీడననూ, మరింత వేగంగా అభివృద్ధిచెందుతున్న జపాన్, అమెరికాల కొల్లనీ విస్తృతంచేసే లక్ష్యంతో యూరప్‌లోని బడా రాజ్యాల తాత్కాలిక ఏకీకరణను తెలిపే అభివృద్ధినిరోధక నినాదమైనా అయివుండాలి.

1915 ఆగస్టులో రచింపబడింది

---

* ఈ సంపుటిలోని 144–148 పేజీలు చూడండి. – సం.

# సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ

## (సులభశైలి స్థూల చిత్రం)

## ముందుమాట

పాఠకునికి యిక్కడ సమర్పించే పుస్తకం 1916 వసంతంలో, జూరిచ్‌లో రచించ బడింది. నేను పనిచేయవలసివచ్చిన పరిస్థితులలో, సహజంగా, నాకు ఫ్రెంచి, ఇంగ్లీషు సారస్వతాలలో కాస్త కొరతా, రష్యన్ సారస్వతంలో తీవ్రమైన కొరతా వుండింది. అయినా, జె. ఎ. హాబ్సన్ సామ్రాజ్యవాదంమీద రచించిన ప్రధానమైన యింగ్లీషు పుస్తకాన్ని, నా అభిప్రాయంలో దానికి యోగ్యమైనంత శ్రద్ధతో, ఉపయోగించుకున్నాను.

జారిస్టు సెన్సార్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని యీ పుస్తకం రచింపబడింది కనుక, వాస్తవాల కేవల సిద్ధాంత పరిశీలనకు, ప్రత్యేకంగా ఆర్థిక పరిశీలనకు, నేను పరిమితం కావలసిరావడమే కాక, రాజకీయాలమీద అవసరమైన కొద్ది అభిప్రాయాలను నేను అత్యంత అప్రమత్తతతో, సూచనల ద్వారా, పంచతంత్ర కథల భాషలో – విప్లవకారులు "చట్టబద్ధ" రచన చేయడానికి పూనుకున్నప్పుడల్లా వాళ్ళందరూ యే భాషను వాడేటట్లు జారిజం నిర్బంధించిందో ఆ పాపిష్ఠి పంచతంత్ర కథల భాషలో – రాయవలసివచ్చింది.

సెన్సార్ మూలంగా యినప పట్టుకారులో వికృతీకరింపబడిన, అణచిపెట్టబడిన, కుదింపబడిన పుస్తక భాగాలను యీ స్వేచ్ఛాదినాలలో మళ్లీ చదవడం బాధాకరంగా వుంది. సామ్రాజ్యవాదం సోషలిస్టు విప్లవ ప్రాంగణ మనేదీ, సోషల్ జాతీయ దురహంకారం (మాటలలో సోషలిజమూ, చేతలలో జాతీయ దురహంకారమూ) సోషలిజంకు పచ్చి ద్రోహం, బూర్జువావర్గ పక్షానికి పూర్తిగా తిరిగిపోవడం అనేదీ, కార్మికవర్గ ఉద్యమంలోని యీ చీలిక సామ్రాజ్యవాదపు వస్తుగత పరిస్థితులతో ముడివడి వుందనేదీ, వగైరా – యీ విషయాలమీద నేను "బానిస" భాషలో మాట్లాడవలసివచ్చింది; యీ యితివృత్తంలో ఆసక్తి గల పాఠకునికి నేను విదేశాలలో 1914–1917లో రాసిన వ్యాసాలు చూడమని

చెప్పాలి; వాటి కొత్త కూర్పు త్వరలో వస్తుంది. 119–120 పేజీలలోని* ఖండికకు ప్రత్యేకంగా పాఠకుని దృష్టి నాకర్షించాలి. పెట్టుబడిదారులూ, వాళ్ల పక్షానికి తిరిగిన సోషల్ జాతీయ దురహంకారులూ (కౌట్స్కీ అంత అస్థిరంగా యెవరిని వ్యతిరేకిస్తాడో వాళ్లూ) పరదేశ స్వాధీనాల సమస్యమీద యెంత లజ్జారహితమైన అసత్యవాదులుగా వున్నదీ సెన్సార్లకు అంగీకార యోగ్యమైన ముసుగులో పాఠకునికి చూపించడానికి, తమ పెట్టుబడిదార్ల పరదేశ స్వాధీనాలను వాళ్లు యెంత లజ్జారహితంగా మరుగుపరుస్తున్నదీ చూపించడానికి, నేను ఒక ఉదాహరణను ఉటంకించవలసివచ్చింది – జపాన్‌ను! జాగరూకుడైన పాఠకుడు సులభంగా జపాన్‌కు బదులు రష్యానూ, కొరియాకు బదులు ఫిన్లండునూ, పోలండునూ, కూర్లండునూ, ఉక్రెయిన్‌నూ, హీవనూ, బుఖారానూ, ఎస్ట్లండ్‌నూ, మహా రష్యనేతర ప్రజలు వుండే ప్రాంతాలనూ పెట్టుకుంటాడు.

పాఠకుడు మౌలిక ఆర్థిక సమస్యను, సామ్రాజ్యవాదపు ఆర్థిక సారపు సమస్యను, అర్థం చేసుకోడానికి యీ పుస్తకం తోడ్పడుతుందని నేను ఆశిస్తున్నాను; యెందుకంటే, యీ సమస్యను అధ్యయనం చేస్తే తప్ప, ఆధునిక యుద్ధాన్నీ, ఆధునిక రాజకీయాలనూ అర్థం చేసుకోవడమూ, అంచనావేయడమూ అసాధ్యం.

రచయిత

పెట్రోగ్రాడ్, ఏప్రిల్ 26, 1917

---

* యీ సంపుటిలో 271–272 పేజీలు చూడండి. -- సం.

# ఫ్రెంచి, జర్మన్ కూర్పులకు ముందుమాట

## I

రష్యన్ కూర్పుకు రాసిన ముందుమాటలో సూచింపబడినట్లు, 1916లో, జారిస్టు సెన్సార్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని యీ పుస్తకం రచింపబడింది. మొత్తం పాఠాన్ని ప్రస్తుతం నేను తిరగరాయలేను; బహుశా అది ఉచితం కాదు కూడా; యెందుకంటే, తిరుగులేని బూర్జువా గణాంకలెక్కల సారాంశపు ఫలితాల ఆధారంమీదా, సకల దేశాల బూర్జువా విద్వాంసుల ఒప్పుదలల ఆధారంమీదా, 20వ శతాబ్ది ప్రారంభంలో – మొదటి ప్రపంచ సామ్రాజ్యవాద యుద్ధ ప్రాంగణంలో – ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సమగ్ర చిత్రాన్ని యివ్వడం యీ పుస్తకంయొక్క ప్రధాన ప్రయోజనంగా వుండింది, వుంటున్నది.

అన్నట్లు సమకాలిక అమెరికాలో గానీ, ఫ్రాన్సులో గానీ, యిటీవల కమ్యూనిస్టులను దాదాపు మొత్తంగా అరెస్టుచేసిన తర్వాత, కమ్యూనిస్టుల వశంలో యింకా వున్న చట్టబద్ధతయొక్క స్వల్ప అవశేషాలను కూడా, సోషల్ శాంతివాదపు అభిప్రాయాలూ, "ప్రపంచ ప్రజాస్వామ్యం" గురించిన ఆశలూ వట్టి బూటకమని వివరించడానికి, ఉపయోగించుకునే అవకాశాన్ని గురించీ, అవసరాన్ని గురించీ, జారిస్టు సెన్సార్ దృక్పథంనుండి చట్టబద్ధమైన యీ పుస్తకపు ఉదాహరణ ద్వారా, తమ్ము తాము ఒప్పించుకోడానికి పురోగామి పెట్టుబడిదారీ దేశాలలోని అనేక కమ్యూనిస్టులకు కొంతవరకు యిది ఉపయోగకరంగా కూడా వుంటుంది. సెన్సార్ చేయబడిన యీ పుస్తకానికి కలపవలసినదానిలో అత్యంత ముఖ్యమైనది యీ ముందుమాటలో చెప్పడానికి ప్రయత్నిస్తాను.

## II

1914–18 యుద్ధం యిరు పక్షాల విషయంలోనూ సామ్రాజ్యవాద యుద్ధం (అనగా, దురాక్రమణ, పరభక్షణాత్మక, కొల్ల యుద్ధం) అని యీ పుస్తకంలో రుజువు చేయబడింది; అది ప్రపంచ విభజనకొరకూ, వలసలూ, ఫైనాన్స్ పెట్టుబడి "పలుకు

బడి ప్రాంతాలూ," వగైరాల పంపకంకొరకూ, పునఃపంపకంకొరకూ జరిగిన యుద్ధం.

యుద్ధంయొక్క నిజమైన సాంఘిక స్వభావం, లేదా నిజమైన వర్గ స్వభావం, యేమిటనేదానికి రుజువు, సహజంగా, యుద్ధపు దౌత్య చరిత్రలో కాక, సకల యుద్ధమగ్న దేశాలలోని పాలక వర్గాల వస్తుపరమైన పరిస్థితి పరిశీలనలో కనపడుతుంది. యీ వస్తుపరమైన పరిస్థితిని చిత్రించడానికి ఉదాహరణలూ, విడివిడి విషయాలూ తీసుకోకూడదు (సామాజిక జీవిత ఘటనల తీవ్ర సంక్లిష్టత దృష్ట్యా, యే ప్రతిపాదననైనా రుజువు చేయడానికి యెన్ని ఉదాహరణలైనా, యెన్ని విడివిడి విషయాలైనా యెన్నుకోవడం యెప్పుడూ సాధ్యమే), సకల యుద్ధమగ్న దేశాలలోనూ, సమస్త ప్రపంచంలోనూ వున్న ఆర్థిక జీవితపు ఆధారం మీద అన్ని విషయాలనూ తీసుకోవాలి.

1876లోనూ, 1914లోనూ ప్రపంచ విభజననూ (ప్రకరణం 6లో), 1890లోనూ, 1913లోనూ ప్రపంచ రైల్వేల విస్తరణా (ప్రకరణం 7లో) వర్ణించడంలో నేను ఉల్లేఖించింది సరిగ్గా యిలాంటి తిరుగులేని విషయాల సారాంశమే. రైల్వేలు మౌలిక పెట్టుబడిదారీ పరిశ్రమలైన బొగ్గు, యినుము, ఉక్కు పరిశ్రమల ఫలితం; ప్రపంచ వాణిజ్య అభివృద్ధియొక్కా, బూర్జువా ప్రజాతంత్ర నాగరికతయొక్కా ఫలితమూ, కన్నులకు కట్టినట్లుండే సూచికా. రైల్వేలు భారీ పరిశ్రమలతోనూ, గుత్తసంస్థలతోనూ, సిండికేట్లతోనూ, కార్టెళ్లతోనూ, ట్రస్టులతోనూ, బాంకులతోనూ, ఫైనాన్సల్ ప్రభుమండలితోనూ యెలా లంకింపబడి వుండేదీ 6కి ముందు ప్రకరణాలలో చూపించబడింది. రైల్వేల అసమ విస్తరణ, వాటి అసమ అభివృద్ధి — ప్రపంచ ప్రమాణంలో ఆధునిక గుత్త పెట్టుబడిదారీ విధానపు చెప్పవచ్చు. అలాంటి ఆర్థిక వ్యవస్థలో, ఉత్పత్తి సాధనాల మీద వ్యక్తిగత స్వామ్యం అనేది వున్నంత కాలం, సామ్రాజ్యవాద యుద్ధాలు పరమ అనివార్యమని యీ ఫలితాలు ఫలితమని రుజువుచేస్తాయి.

రైల్వేల నిర్మాణం సరళమైన, సహజమైన, ప్రజాస్వామిక, సాంస్కృతిక, నాగరికతా ప్రవర్ధక కృషిగా కనిపిస్తుంది; పెట్టుబడిదారీ బానిసత్వాన్ని ఉజ్వలమైన రంగులలో చిత్రించడానికి యెవరికైతే జీతాలు యిస్తారో ఆ బూర్జువా ప్రొఫెసర్ల అభిప్రాయంలోనూ, పెటీబూర్జువా కూపస్థమండూకాల అభిప్రాయంలోనూ అది అలాంటిదే. కానీ, వాస్తవంలో, దరహంమీద ఉత్పత్తి సాధనాలలో వున్న సొంత ఆస్తితో యీ కృషులను భిన్న భిన్నమైన వెయ్యి ముడులతో బంధించే పెట్టుబడిదారీ దారాలు యీ రైల్వే నిర్మాణాన్ని వంద కోట్ల ప్రజలను (వలసలలోనూ, అర్ధవలసలలోనూ) — అనగా పరాధీన దేశాలలో నివసించే అర్ధ ప్రపంచ జనాభాలో సగానికిపైగా జనాన్నీ "నాగరిక" దేశాలలోని పెట్టుబడి బానిసలన్నూ — పీడించడానికి పరికరంగా మార్చినాయి,

చిన్న ఆస్తిపరుని శ్రమమీద ఆధారపడిన వ్యక్తిగత ఆస్తీ, స్వేచ్ఛాయుత పోటీ, ప్రజాస్వామ్యమూ — పెట్టుబడిదార్లూ, వాళ్ల పత్రికలూ నేటితో కార్మికులనూ, కర్షకులనూ మోసగిస్తారో ఆ పడికట్టు పదాలన్నీ — సుదూర గతానికి చెందిన విషయాలు. కొద్దిపాటి "పురోగామి" దేశాలు ప్రపంచ ప్రజానీకంలో అపారమైన మెజారిటీమీద వలస పీడనా, ఫైనాన్షల్‌గా గొంతు నొక్కడమూ సాగించే ప్రపంచ వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం పెరిగింది. ఆపాదమస్తకం ఆయుధాలు ధరించిన యిద్దరు ముగ్గురు శక్తివంతులైన కొల్లకాండ్రు (అమెరికా, గ్రేట్ బ్రిటన్, జపాన్) యీ కొల్ల సొమ్మును పంచుకున్నారు; వాళ్లు తమ కొల్ల సొమ్ము పంపకంకొరకు జరిగే తమ యుద్ధంలోకి ప్రపంచ మంతటినీ లాగుతున్నారు.

## III

రాజరికవాద జర్మనీ విధించిన బ్రెస్ట్-లితోవ్స్క్ సంధీ,[125] తరువాత "ప్రజాతంత్ర" రిపబ్లిక్కులైన అమెరికా, ఫ్రాన్సూ, "స్వేచ్ఛాయుత" బ్రిటనూ విధించిన, అంతకంటె పాశవికమైన, యేహ్యమైన వెర్సేల్స్ సంధీ[126] సామ్రాజ్యవాదపు కిరాయి రచయితలనూ, ప్రగతి వ్యతిరేక పెటీబూర్జువాలనూ — శాంతివాదులమనీ, సోషలిస్టులమనీ చెప్పుకుంటున్నప్పటికీ "విల్సనిజం"[127]ను కీర్తించి, సామ్రాజ్యవాదంలో శాంతీ, సంస్కరణలూ సాధ్యమని పట్టుబట్టినవాళ్లను — బహిర్గతం చేయడం ద్వారా, మానవజాతికి మహా ఉపయోగకరమైన సేవ చేసినాయి.

యుద్ధంలో — కొల్ల సొమ్ములో అత్యధిక భాగం బ్రిటిష్ ఫైనాన్షల్ కొల్లకాండ్ర బృందానికా, జర్మన్ ఫైనాన్షల్ కొల్లకాండ్ర బృందానికా యెవరికి చెందాలనేది నిర్ణయించడానికి జరిగిన యుద్ధంలో — హతులూ, వికలాంగులూ అయిన కోట్లమంది జనమూ, యీ రెండు "శాంతి సంధులూ" బూర్జువావర్గంచేత అణగదొక్కబడి, పీడింపబడి, మోసగింపబడి, దగా చేయబడిన కోటానుకోట్లమంది కళ్లను అపూర్వమైన వేగంతో తెరిపిస్తున్నాయి. కనుక, యుద్ధం కలిగించిన సార్వత్రిక విధ్వంసంనుండి ప్రపంచవ్యాప్తమైన విప్లవ సంక్షోభం ఉత్పన్నమౌతున్నది; ఆ సంక్షోభపు దశలు యెంత దీర్ఘంగా యెంత కష్టభరితంగా వుండినా, అది కార్మికవర్గ విప్లవంలోనూ, దాని విజయంలోనూ తప్ప మరొక విధంగా అంతం కాజాలదు.

రెండవ ఇంటర్నేషనల్‌యొక్క బాసెల్ ప్రణాళిక — దరహంమీద యుద్ధం గురించి కాక (యుద్ధాలలో భిన్న రకాలు వున్నాయి, విప్లవ యుద్ధాలతో సహా) 1914లో యే యుద్ధం మొదలైందో ఆ యుద్ధం గురించే 1912లో ఒక అంచనా యిచ్చిన ప్రణాళిక —

యిప్పుడు రెండవ ఇంటర్నేషనల్ వీరుల సిగ్గుచేటైన పతనాన్నీ, ద్రోహాన్నీ పూర్తిగా వెల్లడించే స్మారకం అయింది.

అందుకనే నేను యీ ప్రణాళికను యీ కూర్పుకు అనుబంధంగా ప్రచురిస్తున్నాను; ఆసన్న యుద్ధానికీ, కార్మికవర్గ విప్లవానికీ మధ్య గల సంబంధాన్ని కచ్చితంగా, స్పష్టంగా, నిశ్చితంగా చెప్పే యీ ప్రణాళికలోని భాగాలను రెండవ ఇంటర్నేషనల్ వీరులు దొంగ తన నేరస్థలాన్ని పరిహరించినట్లు పరిహరిస్తున్నారనే విషయం గమనించమని నేను పాఠకుని పదేపదే కోరుతున్నాను.

## IV

ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ "అత్యంత ప్రముఖ సిద్ధాంతవేత్తల"చేతా, రెండవ ఇంటర్నేషనల్ నాయకుల (ఆస్ట్రియాలో ఒట్టో బౌవర్ అండ్ కంపెనీ, బ్రిటన్‌లో రామ్సే మెక్‌డోనల్డ్, తదితరులూ, ఫ్రాన్సులో అల్‌బేర్ టోమా, వగైరా, వగైరాల)చేతా, యింకా బోలెడుమంది సోషలిస్టుల, సంస్కరణవాదుల, శాంతివాదుల, బూర్జువా ప్రజాతంత్ర వాదుల, మతగురువులచేతా ప్రాతినిధ్యం వహించబడే అంతర్జాతీయ సిద్ధాంత ధోరణి అయిన "కాట్స్కీయిజం"మీద విమర్శకు యీ పుస్తకంలో ప్రత్యేక శ్రద్ధ అర్పించబడింది.

యీ సిద్ధాంత ధోరణి, ఒకవైపున, రెండవ ఇంటర్నేషనల్ విచ్ఛిత్తి, క్షీణతల ఫలితం, మరొకవైపున, యెవరిని తమ యావత్తు జీవిత విధానమూ బూర్జువా, ప్రజాతంత్ర దురభిప్రాయాలకు బందీగా చేస్తుందో ఆ పెటీబూర్జువావర్గంయొక్క భావజాలపు అనివార్య ఫలితం.

కాట్స్కీకీ, అతనిలాంటివాళ్లకూ వున్న అభిప్రాయాలు ఆ రచయిత దశాబ్దాలుగా, అన్నట్లు ముఖ్యంగా సోషలిస్టు అవకాశవాదం (బెర్న్‌స్టైన్, మిలెరాన్, హైండ్‌మన్, గోంపెర్స్ వగైరాల)మీద అతను చేసిన పోరాటంలో, యే సూత్రాలను వెనకేసుకవచ్చినాడో అవే విప్లవ మార్క్సిస్టు సూత్రాలకు సంపూర్ణ తిలోదకాలు. కనుక, ప్రపంచ మంతటా కాట్స్కీ అనుచరులు యిప్పుడు తీవ్ర అవకాశవాదులతోనూ (రెండవ, లేక రాజీపడే ఇంటర్నేషనల్[128] ద్వారా), బూర్జువా ప్రభుత్వాలతోనూ (సోషలిస్టులు పాల్గొనే బూర్జువా మిశ్రమ ప్రభుత్వాల ద్వారా) ఆచరణాత్మక రాజకీయాలలో ఐక్యం కావడం కేవలం యాదృచ్ఛికం కాదు.

ప్రపంచమంతటా పెరుగుతున్న శ్రామికవర్గ విప్లవోద్యమమూ, ప్రత్యేకంగా కమ్యూనిస్టు ఉద్యమమూ "కాట్స్కీయిజం"యొక్క సిద్ధాంత దోషాల పరిశీలననూ, వెల్లడినీ విసర్జించజాలవు. శాంతివాదమూ, ధరహంమీద "ప్రజాస్వామ్యమూ," మార్క్సిజంతో

యేమాత్రమైనా సంబంధం వున్నట్లు చెప్పకోనట్టివి, కానీ కౌట్స్కీ అండ్ కంపెనీ వాళ్ల లాగే సామ్రాజ్యవాదపు అంతర్వైరుధ్యాల ప్రగాఢతనూ, అది ఉత్పన్నంచేసే అనివార్య విప్లవ సంక్షోభాన్ని మరుగుపరుస్తున్నట్టివి, ప్రపంచమంతటా యింకా చాలా వ్యాప్తిలో వున్నాయి గనుక అది మరింత నిజం. యీ ధోరణులతో పోరాడడం శ్రామికవర్గ పార్టీకి విధ్యుక్త ధర్మం; ఆ పార్టీ బూర్జువావర్గంచేత దగా చేయబడిన చిన్న ఆస్తిపరులనూ, దాదాపు పెటీ బూర్జువా జీవిత పరిస్థితులను అనుభవిస్తున్న లక్షలాది శ్రామిక ప్రజలనూ బూర్జువావర్గం నుండి తనవైపుకు తిప్పకోవాలి.

## V

"పెట్టుబడిదారీ విధానపు పరభాగ్యోప జీవనమూ, శైథిల్యమూ" అనే ప్రకరణం 8 గురించి కొద్ది మాటలు చెప్పాలి. పాఠంలో యిప్పటికే గుర్తుచేయబడినట్లు, మాజీ "మార్క్సిస్టూ," యిప్పుడు కౌట్స్కీకి సహయోధుడూ, జర్మన్ స్వతంత్ర సోషల్ డెమోక్రటిక్ పార్టీలో[129] బూర్జువా సంస్కరణవాద విధానపు ముఖ్య వ్యాఖ్యాతల్లో ఒకడూ అయిన హిల్ఫర్డింగ్ యీ సమస్యమీద, బాహాటమైన శాంతివాదపు, సంస్కరణవాదపు ఆంగ్లేయుడు హాబ్సన్‌తో పోలిస్తే, ఒక అడుగు వెనక్కి వేసినాడు. మొత్తం కార్మికవర్గ ఉద్యమంలోని అంతర్జాతీయ చీలిక యిప్పుడు బాగా వెల్లడిగా వుంది (రెండవ ఇంటర్నేషనలూ, మూడవ ఇంటర్నేషనలూ[130]). యీ రెండు ధోరణుల మధ్య సాయుధ పోరాటమూ, అంతర్యుద్ధమూ జరుగుతున్న విషయం కూడా వెల్లడిగా వుంది – రష్యాలో బోల్షివిక్కులకు వ్యతిరేకంగా మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ కొల్చాక్‌కూ, దెనీకిన్‌కూ యిచ్చిన అండదండలూ, జర్మనీలో షైడెమన్‌లూ, నోస్కేలూ బూర్జువావర్గంతో కలిసి స్పార్టకిస్టుల[131]మీద జరిపిన పోరాటమూ, ఫిన్లండు, పోలండు, హంగెరీ, వగైరాలలో అదే విషయమూ. యీ ప్రపంచ చారిత్రక ఘటనయొక్క ఆర్థిక ఆధారం యేమిటి?

యేమిటంటే, సరిగ్గా పెట్టుబడిదారీ విధానపు పరభాగ్యోప జీవనమూ, క్షీణించడమూ – దాని అత్యున్నత చారిత్రక అభివృద్ధి దశకు, అనగా సామ్రాజ్యవాదానికి, విలక్షణమైనట్టివి. యీ పుస్తకం తెలియజేస్తున్నట్లు, కేవలం "కూపన్లు చించుకోవడం" ద్వారా యావత్తు ప్రపంచాన్నీ కొల్లగొట్టే కొద్దిపాటి (భూమండలంమీద జీవించేవాళ్లలో పదింట ఒక భాగంకంటె తక్కువ; మహా "ధారాళమైన," ఉదారమైన లెక్క ప్రకారం కూడా అయిదింట ఒక భాగంకంటె తక్కువ) అసాధారణంగా ధనికమైన, శక్తివంతమైన దేశాలను పెట్టుబడిదారీ విధానం యిప్పుడు యేరిపెట్టింది. పెట్టుబడి యెగుమతులు యుద్ధపూర్వపు ధరల ప్రకారం, యుద్ధపూర్వపు బూర్జువా గణాంక లెక్కల ప్రకారం యేటా యెని

మిది వందల కోట్లనుండి వెయ్యికోట్ల ఫ్రాంకులదాకా ఆదాయం యిస్తున్నాయి. సహజంగానే, యిప్పుడవి యింకా చాలా యెక్కువ ఆదాయం యిస్తున్నాయి.

స్పష్టంగా, అలాంటి అపారమైన అధిక లాభాలనుండి (పెట్టుబడిదార్లు తమ "సొంత" దేశపు కార్మికులనుండి పిండే లాభాలు కాక యివి అదనంగా వచ్చేవి) కార్మిక నాయకులనూ, కార్మిక అగ్రవర్ణంలోని పైపొరనూ లంచంతో లోబరచుకోవడం సాధ్యం. మరి, "పురోగామి" దేశాల పెట్టుబడిదారులు చేస్తున్నది సరిగ్గా అదే: వాళ్లు వెయ్యి భిన్న మార్గాలలో, ప్రత్యక్ష, పరోక్ష, బహిరంగ, ప్రచ్ఛన్న మార్గాలలో, వాళ్లను లంచంతో లోబరచుకుంటున్నారు.

బూర్జువాలుగా మారిన యీ కార్మికుల పొర, లేక కార్మిక అగ్రవర్ణం, తమ జీవిత విధానంలోనూ, తమ ఆదాయాలలోనూ, తమ మొత్తం దృక్పథంలోనూ కూపస్థమండూకాలు, రెండవ ఇంటర్నేషనల్ యొక్క ప్రధానమైన ప్రాపు, మన రోజుల్లో బూర్జువా వర్గంయొక్క ప్రధానమైన సాంఘిక (మిలిటరీ కాదు) ప్రాపు. యెందుకంటే వాళ్లు కార్మిక వర్గ ఉద్యమంలో బూర్జువావర్గపు నిజమైన యేజంట్లు, పెట్టుబడిదారీ వర్గపు కార్మిక దండనాయకులు (labour lieutenants of the capitalist class), సంస్కరణవాదానికీ, జాతీయ దురహంకారానికీ నిజమైన వాహనాలు. కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య జరిగే అంతర్యుద్ధంలో వాళ్లు అనివార్యంగా, తక్కువ సంఖ్యలో కూడా కాదు, బూర్జువావర్గ పక్షం వహిస్తారు – "కమ్యూనార్డుల"కు వ్యతిరేకంగా "వెర్సేల్స్" పక్షం[132].

యీ ఘటనయొక్క ఆర్థిక మూలాలను గ్రహించి, దీని రాజకీయ, సామాజిక ప్రాముఖ్యాన్ని గుర్తిస్తే తప్ప, కమ్యూనిస్టు ఉద్యమంయొక్క, ఆసన్న సాంఘిక విప్లవంయొక్క ఆచరణాత్మక సమస్యల పరిష్కారంవైపు ఒక్క అడుగు కూడా వేయడం సాధ్యం కాదు.

సామ్రాజ్యవాదం కార్మికవర్గ సాంఘిక విప్లవపు ప్రాంగణం. యిది 1917నుండి ప్రపంచ పరిమాణంలో ధ్రువపడింది.

యన్. లెనిన్

జూలై 6, 1920

గత పద్దైదు, యిరవై సంవత్సరాలలో, ముఖ్యంగా స్పానిష్-అమెరికన్ యుద్ధం (1898)[133]నుండీ, ఆంగ్లో-బోయర్ల యుద్ధం (1899–1902)[134]నుండీ, రెండు అర్ధగోళాల ఆర్థిక, రాజకీయ సారస్వతమూ ప్రస్తుత యుగాన్ని వర్ణించడానికి అంతకంతకూ తరుచుగా "సామ్రాజ్యవాదం" అనే మాటను ఉపయోగిస్తోంది. ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞుడు జె. ఎ. హాబ్సన్ రచించిన "సామ్రాజ్యవాదం" అనే పుస్తకం 1902లో లండన్‌లోనూ, న్యూయార్కులోనూ ప్రచురింపబడింది. యీ రచయితది బూర్జువా సంఘ సంస్కరణవాద, శాంతివాద దృక్పథం; యిది, సారంలో, మాజీ మార్క్సిస్టు అయిన కార్ల్ కౌట్స్కీయొక్క ప్రస్తుత దృక్పథానికి అభిన్నమైనది; అలాంటి యీ రచయిత సామ్రాజ్యవాదపు ప్రధాన ఆర్థిక, రాజకీయ లక్షణాలను చాలా బాగా, సమగ్రంగా వర్ణిస్తాడు. ఆస్ట్రియన్ మార్క్సిస్టు రూడొల్ఫ్ హిల్ఫెర్‌డింగ్ రచన "ఫైనాన్స్ పెట్టుబడి" (రష్యన్ అనువాదం: మాస్కో, 1912) 1910లో వెలువడింది. డబ్బు సిద్ధాంతం గురించి ఆ రచయిత పొరపాటు చేసినప్పటికీ, మార్క్సిజంను అవకాశవాదంతో రాజీచేసే ధోరణి అతనిలో కొంత వున్నప్పటికీ, యీ రచన, దీని ఉపశీర్షిక చెప్పినట్లు, "పెట్టుబడిదారీ అభివృద్ధియొక్క తాజా దశ"మీద చాలా విలువైన సిద్ధాంత పరిశీలన యిస్తుంది. నిజంగా, సామ్రాజ్యవాదం గురించి గత కొద్ది సంవత్సరాలలో చెప్పింది, ముఖ్యంగా అపార సంఖ్యాక పత్రికా వ్యాసాలలోనూ, 1912 శరదృతువులో జరిగిన హెమ్నిట్స్,[135] బాసెల్ మహాసభల లాంటివాటి తీర్మానాలలోనూ చెప్పింది, పై యిద్దరు రచయితలు వివరించిన భావాలను, మరింత కచ్చితంగా చెప్పాలంటే క్రోడీకరించిన భావాలను, దాటిపోలేదు....

సామ్రాజ్యవాదపు ప్రధాన ఆర్థిక లక్షణాల మధ్య గల సంబంధ బాంధవ్యాలను నేను తరువాత, సంక్షేపంగా, సాధ్యమైనంత సరళంగా చూపడానికి ప్రయత్నిస్తాను. యీ సమస్య ఆర్థికేతర పార్శ్వాలను **వివరించదగిన** పద్ధతిలో **వివరించడం** నాకు సాధ్యం కాదు. సార

స్వతానికి ప్రస్తావనలూ, యితర వివరణలూ, బహుశా పాఠకు లందరికీ ఆసక్తికరం కానట్టివి, యీ పుస్తకం చివరన వున్నాయి.

# 1. ఉత్పత్తి సాంద్రీకరణా, గుత్తసంస్థలూ

పరిశ్రమల అపారమైన పెరుగుదలా, అంతకంతకూ పెద్ద సంస్థలలో అసాధారణ వేగంతో ఉత్పత్తి సాంద్రీకరింపబడడమూ పెట్టుబడిదారీ విధానపు అత్యంత విలక్షణ గుణాలలో ఒకటి. ఆధునిక పారిశ్రామిక సంస్థల లెక్కలు యీ క్రమాన్ని గురించి అత్యంత సంపూర్ణమైన, అత్యంత కచ్చితమైన వివరాలు యిస్తాయి.

ఉదాహరణకు జర్మనీలో, ప్రతి 1000 పారిశ్రామిక సంస్థలలోనూ పెద్ద సంస్థలు, అనగా 50కంటె యెక్కువమంది కార్మికులను వినియోగించుకునేవి, 1882లో 3, 1895లో 6, 1907లో 9 వుండినాయి. వినియుక్తులైన ప్రతి 100 కార్మికులలోనూ యీ సంస్థల బృందం వరుసగా 22మందినీ, 30మందినీ, 37మందినీ వినియోగించుకుంది. కానీ, కార్మికుల సాంద్రీకరణకంటె ఉత్పత్తి సాంద్రీకరణ మరింత ఎక్కువగా వుంది, యెందుకంటే పెద్ద సంస్థలలో శ్రమ చాలా యెక్కువ ఉత్పాదకంగా వుంది. ఆవిరి ఇంజన్లకూ, యెలెక్ట్రిక్ మోటార్లకూ సంబంధించిన లెక్కలు యీ విషయాన్ని తెలుపుతాయి. జర్మనీలో విశాలమైన అర్థంలో పరిశ్రమలు అనబడేదాన్ని, అనగా వాణిజ్యమూ, రవాణా, వగైరాతో సహా, తీసుకుంటే, మనకు యీకింది చిత్రం లభిస్తుంది. భారీ సంస్థలు మొత్తం 32,65,623లో 30,588 వున్నాయి, అనగా 0.9 శాతం. యీ సంస్థలు మొత్తం 144 లక్షల కార్మికులలో 57 లక్షలమందిని వినియోగించుకుంటాయి, అనగా 39.4 శాతం; యివి మొత్తం 88 లక్షల ఆవిరి హార్స్‌పవర్‌లో 66 లక్షల హార్స్‌పవర్‌ను ఉపయోగిస్తాయి, అనగా 75.3 శాతం; మొత్తం 15 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తిలో 12 లక్షల కిలోవాట్లు ఉపయోగిస్తాయి, అనగా 77.2 శాతం.

మొత్తం సంస్థలలో నూరింట ఒక భాగంకంటె తక్కువగా వున్న సంస్థలు మొత్తం ఆవిరి, విద్యుత్‌శక్తిలో ముప్పాతికకంటె యెక్కువ భాగాన్ని ఉపయోగిస్తున్నాయి! 29.7 లక్షల చిన్న సంస్థలు (5మందివరకు కార్మికులను వినియోగించేవి) మొత్తం సంస్థలలో 91 శాతంగా వున్నట్టివి, మొత్తం ఆవిరి, విద్యుత్‌శక్తిలో 7 శాతం మాత్రం ఉపయోగి

స్తున్నాయి! పదుల వేల అతి పెద్ద సంస్థలే సమస్తం; పదుల లక్షల చిన్న సంస్థలు యేమీ కావు.

1907లో, జర్మనీలో వెయ్యిమంది కార్మికులనూ, అంతకంటె యెక్కువమందినీ వినియోగించుకునేవి 586 సంస్థలు వుండినాయి. అవి పరిశ్రమలలో వినియుక్తమైన మొత్తం కార్మికులలో దాదాపు పదింట ఒక భాగాన్ని (13,80,000మందిని) వినియోగించుకున్నాయి; అవి మొత్తం ఆవిరి, విద్యుత్‌శక్తిలో దాదాపు మూడింట ఒక భాగాన్ని (32 శాతం) వాడుకున్నాయి.* మనం ముందు చూడబోయేటట్లు, డబ్బు పెట్టుబడి, బాంకులూ కొద్దిపాటి అతి పెద్ద సంస్థల యీ ఆధిక్యాన్ని మరింత సర్వదమనంగా చేస్తాయి, అత్యంత శాబ్దికార్థంలో – అనగా, లక్షలాది చిన్న, మధ్యరకం, కొందరు పెద్ద "సొంతదార్లు" కూడా వాస్తవంగా కొద్ది వందల కోటీశ్వర ఫైనాన్సర్లకు పూర్తిగా లోబడివున్నారు.

ఆధునిక పెట్టుబడిదారీ విధానపు మరొక పురోగామి దేశమైన అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉత్పత్తి సాంద్రీకరణ పెరుగుదల యింకా యెక్కువగా వుంది. యిక్కడ గణాంక లెక్కలు పరిశ్రమలను సంకుచిత అర్థంలో యేరుకొని, సంస్థలను వాటి సాలుసరి ఉత్పత్తియొక్క విలువనుబట్టి వర్గీకరిస్తాయి. 1904లో పది లక్షల డాలర్లూ, అంతకు పైనా విలువ కలిగిన ఉత్పత్తి చేసే అతిపెద్ద సంస్థలు 1900 వుండినాయి (2,16,180లో – అనగా 0.9 శాతం); యివి 14,00,000 కార్మికులను (55 లక్షలమందిలో – అనగా 25.6 శాతం) వినియోగించుకున్నాయి; వాళ్ల ఉత్పత్తి విలువ 560 కోట్ల డాలర్లు (1480 కోట్ల డాలర్లలో – అనగా 38 శాతం) వుండింది. అయిదేండ్ల తర్వాత, 1909లో, తదనురూపమైన అంకెలు యివి: 3,060 సంస్థలు (2,68,491లో – అనగా 1.1 శాతం) 20,00,000 కార్మికులను (66 లక్షలమందిలో – అనగా 30.5 శాతం) వినియోగించుకొని, 900 కోట్ల డాలర్ల (2,070 కోట్ల డాలర్లలో – అనగా 43.8 శాతం) విలువ గల సరుకులు ఉత్పత్తిచేసినాయి.**

మొత్తం సంస్థల మొత్తం ఉత్పత్తిలో దాదాపు అర్ధభాగాన్ని యీ సంస్థలలో నూరింట ఒక భాగం నిర్వహించింది! యీ 3,000 బ్రహ్మాండమైన సంస్థలు 258 పరిశ్రమ శాఖలను ఆవరిస్తాయి. దీన్నిబట్టి తెలిసే దేమిటంటే – సాంద్రీకరణ అనేదే,

---

* లెక్కలు *Annalen des deutschen Reichs* ("జర్మన్ రాజ్యంయొక్క సంచికలు"), 1911, Zahn నుండి గ్రహించబడినాయి.

** *Statistical Abstract of the United States, 1912* ("సంయుక్త రాష్ట్రాల గణాంక లెక్కల సంగ్రహం, 1912"), p. 202.

దాని ఒకానొక అభివృద్ధి దశలో, నేరుగా గుత్తాధిపత్యానికి దారితీస్తుందనవచ్చు. యెందుకంటే, యే యిరవయ్యో బ్రహ్మాండమైన సంస్థలు సులభంగా ఒప్పందానికి రాగలవు; మరొకవైపున, సంస్థల బ్రహ్మాండమైన పరిమాణంనుండి పోటీకి ఆటంకం, గుత్తాధిపత్యానికి అభిముఖ్యం, ఉత్పన్నమౌతుంది. పోటీనుండి గుత్తాధిపత్యానికి జరిగే యీ పరివర్తన తాజా ఆర్థిక పెట్టుబడిదారీ విధానపు అత్యంత ముఖ్యమైన ఘటనలలో ఒకటి — అదే అత్యంత ముఖ్యమైనది కాకపోయినా; దీన్ని మనం మరింత వివరంగా పరిశీలించాలి. కానీ మొదట, సంభావ్యమైన ఒక అపార్థాన్ని తొలగించాలి.

అమెరికన్ గణాంక లెక్కలు 250 పరిశ్రమల శాఖలలో 3,000 బ్రహ్మాండమైన సంస్థలు వున్నట్లు చెప్తాయి, ప్రతి పరిశ్రమ శాఖకూ అతి పెద్ద సంస్థలు 12 మాత్రమే వున్నట్లు.

కానీ పరిస్థితి యిది కాదు. ప్రతి పరిశ్రమ శాఖలోనూ భారీ సంస్థలు లేవు; అంతే కాక, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత అభివృద్ధి దశలో దాని ఒక అతి ముఖ్య లక్షణం ఉత్పత్తి సంయోజనం అనేది, అనగా భిన్న పరిశ్రమ శాఖలను ఒకే సంస్థలో జతచేయడం, ముడి సరుకుల తయారీలో వరుస దశలకు (ఉదాహరణకు ముడియినుమును దుక్క యినుముగా కరిగించడమూ, దుక్క యినుమును ఉక్కుగా మార్చడమూ, ఆ తర్వాత, బహుశా, ఉక్కు సరుకులు తయారుచేయడమూ) సంబంధించేవాటిని, లేదా ఒకదానికొకటి అనుబంధంగా వుంచేవాటిని (ఉదాహరణకు తుక్కును గానీ, ఉపపదార్థాలను గానీ వినియోగించుకోవడమూ, పాకింగు వస్తువుల ఉత్పత్తీ, వగైరా).

హిల్ఫెర్డింగ్ యిలా రాస్తాడు: "సంయోజనం వర్తకపు ఆటుపోటులను చదును చేస్తుంది, కనుక అది సంయుక్త సంస్థలకు మరింత స్థిరమైన లాభపు రేటును కట్టుదిట్టం చేస్తుంది. రెండవది, సంయోజనానికి వర్తకాన్ని తొలగించే ఫలితం వుంది. మూడవది, సాంకేతిక మెరుగుదలలనూ, తత్ఫర్యవసానంగా, 'శుద్ధ' (అనగా, అసంయుక్త) సంస్థలు సంపాయించే లాభాలు కాక అదనపు లాభాల సంపాదననూ సాధ్యం చేసే ఫలితం వుంది దానికి. నాల్గవది, అది 'శుద్ధ' సంస్థతో పోలిస్తే సంయుక్త సంస్థ స్థితిని పటిష్ఠపరుస్తుంది, తీవ్రమైన ఆర్థిక మాంద్యపు కాలాలలో, ముడి సరుకుల ధరల పతనం పారిశ్రామిక సరుకుల ధరల పతనానికి సమానంగా లేనప్పుడు, పోటీ పోరాటంలో వాటిని పటిష్ఠపరుస్తుంది."*

ప్రత్యేకంగా జర్మన్ యినుము పరిశ్రమలో "మిశ్రమ," అనగా సంయుక్త సంస్థలను గురించి పుస్తకం రాసిన జర్మన్ బూర్జువా అర్థశాస్త్రజ్ఞుడు హైమన్ యిలా అంటాడు:

* "ఫైనాన్స్ పెట్టుబడి," రష్యన్ అనువాదం, పేజీలు 286–287.

"శుద్ధ సంస్థలు నశిస్తాయి, ముడి సరుకుల యెక్కువ ధరకూ, పారిశ్రామిక సరుకుల తక్కువ ధరకూ మధ్యన అవి నలిగిపోతాయి." ఆవిధంగా మనకు యీ చిత్రం లభిస్తుంది:

"ఒకవైపున, యేటా దశలక్షల టన్నులు ఉత్పత్తిచేస్తూ, తమ బొగ్గు సిండికేట్‌లో బలంగా సంఘటితమై, పెద్ద బొగ్గు కంపెనీలు నిలచివున్నాయి; మరొకవైపున, బొగ్గు గనులతో సన్నిహితమైన పొత్తు గలిగి, తమ సొంత ఉక్కు సిండికేట్‌తో, పెద్ద ఉక్కు కర్మాగారాలు నిలిచివున్నాయి. యీ బ్రహ్మాండమైన సంస్థలు, యేటా 4,00,000 టన్నుల ఉక్కు ఉత్పత్తిచేస్తూ, బ్రహ్మాండమైన ముడియినుము, బొగ్గు ఉత్పత్తితో, అంతిమ ఉక్కు సరుకులు తయారుచేస్తూ, కంపెనీ యిండ్లలో నివసించే 10,000 కార్మికులను వినియోగిస్తూ, ఒకొకసారి తమ సొంత రైల్వేలూ, రేవులూ గలిగినట్టివి, జర్మన్ యినుము, ఉక్కు పరిశ్రమయొక్క విలక్షణ ప్రతినిధులు. యిక సాంద్రీకరణ యింకా, యింకా పెరుగుతూ వుంటుంది. విడివిడి సంస్థలు అంతకంతకూ పెద్ద వౌతున్నాయి. ఒక పరిశ్రమలోని, లేదా కొన్ని భిన్న పరిశ్రమలలోని సంస్థలు, అంతకంతకూ పెరుగుతున్న సంఖ్యలో, అరడజను పెద్ద బెర్లిన్ బాంకుల అండదండలూ, దర్శకత్వమూ గల బ్రహ్మాండ మైన సంస్థలుగా యేకమౌతాయి. జర్మన్ గని పరిశ్రమ విషయంలో, సాంద్రీకరణమీద కార్ల్ మార్క్స్ బోధన సరియైనదని నిశ్చితంగా రుజువైంది; నిజమే, రక్షణ సుంకాల చేతా, రవాణా చార్జీలచేతా రక్షించబడిన పరిశ్రమలుగల దేశానికి యిది వర్తిస్తుంది. జర్మన్ గని పరిశ్రమ ప్రభుత్వ స్వాధీనానికి పక్వంగా వుంది."*

అరుదైన చిత్తశుద్ధిగల ఒక బూర్జువా అర్థశాస్త్రజ్ఞుడు చేయవలసివచ్చిన నిర్ధారణ యిది. జర్మన్ పరిశ్రమలు పెద్ద రక్షణ సుంకాలచేత రక్షింపబడినందున, అతను జర్మనీని ప్రత్యేక వర్గంలో పెట్టినట్లుంది. కానీ, యిది సాంద్రీకరణనూ, గుత్త ఉత్పత్తిదారుల సంఘాలూ, కార్టెళ్లూ, సిండికేట్లూ, వగైరాల నిర్మాణాన్ని త్వరపరచడం మాత్రం చేసే ఒక పరిస్థితి. స్వేచ్ఛాయుత వర్తకంగల బ్రిటన్‌లో కూడా, సాంద్రీకరణ కొంత ఆల స్యంగా, బహుశా మరొక రూపంలో అయినప్పటికీ, గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. బ్రిటిష్ ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన సమాచారంమీద ఆధారపడిన "గుత్త సంస్థలూ, కార్టెళ్లూ, ట్రస్టులూ" అనే తన ప్రత్యేక పరిశోధన గ్రంథంలో ప్రొఫెసర్ హెర్మన్ లెవీ యిలా రాస్తాడు:

"బ్రిటన్‌లో గుత్త ధోరణికి దారితీసే సంస్థయొక్క పెద్ద పరిమాణమూ, దాని

---

* Hans Gideon Heymann, *Die gemischten Werke im deutschen Großeisengewerbe* ("జర్మన్ భారీ యినుము పరిశ్రమలో సంయుక్త సంస్థలు"), Stuttgart, 1904, SS. 256, 278—79.

ఉన్నత సాంకేతిక స్థాయీ. ఒక్కొక్క సంస్థకు గొప్ప పెట్టుబడి పెట్టవలసివున్న కారణంగా, కొత్త సంస్థలకు కొత్త పెట్టుబడి డిమాండ్లు పెరిగి, కొత్త సంస్థలు ప్రారంభించడం కష్టతరమైంది. అంతే కాక (యిది యెక్కువ ముఖ్యమైన అంశంగా మాకు కనిపిస్తుంది), సాంద్రీకరణ ద్వారా యేర్పడిన బ్రహ్మాండమైన సంస్థలతో సరితూగ దలచుకొన్న ప్రతి కొత్త సంస్థా యెంత బృహత్ పరిమాణంలో అదనపు సరుకులు ఉత్పత్తి చేస్తుందంటే, డిమాండులో అసాధారణమైన పెరుగుదల ఫలితంగా వాటిని లాభానికి అమ్ముకోగలగడం ద్వారా మాత్రమే వాటిని అది ఖర్చుచేయగలదు; లేకపోతే, యీ అదనపు సరుకులు కొత్త సంస్థకూ, గుత్త సంయుక్త సంస్థలకూ లాభదాయకం కాని స్థాయికి ధరలను దిగదోస్తాయి." బ్రిటన్‌కూ, రక్షణ సుంకాలు కార్టెళ్ల నిర్మాణాన్ని సుకరంచేసే యితర దేశాలకూ మధ్య భేదం యేమిటంటే, అధికసంఖ్యాక సందర్భాలలో గుత్త ఉత్పత్తిదారుల సంఘాలూ, కార్టెళ్లూ, ట్రస్టులూ ఉత్పన్నమయ్యేది ప్రధాన పోటీ సంస్థల సంఖ్య "యే రెండు డజన్ల"కో తగ్గినప్పుడు. "యిక్కడ ఒక మొత్తం పరిశ్రమ రంగంలో పెద్ద పారిశ్రామిక గుత్త సంస్థల నిర్మాణంమీద సాంద్రీకరణయొక్క ప్రభావం అత్యంత స్పష్టంగా కనపడుతుంది."*

అర్ధశతాబ్ది క్రితం, మార్క్స్ "పెట్టుబడి" రాస్తూ వుండినప్పుడు, అర్థశాస్త్రజ్ఞులలో అధిక మెజారిటీకి స్వేచ్ఛాయుత పోటీ "సహజనియమం"గా కనిపించింది. ఆధికారిక విజ్ఞాన శాస్త్రం, మౌనం అనే కుట్ర ద్వారా మార్క్స్ రచనలను చంపడానికి ప్రయత్నించింది; పెట్టుబడిదారీ విధానపు సైద్ధాంతిక, చారిత్రక పరిశీలన ద్వారా మార్క్స్ స్వేచ్ఛాయుత పోటీ ఉత్పత్తి సాంద్రీకరణను ఉత్పన్నం చేస్తుందనీ, అది మళ్లీ, ఒకానొక అభివృద్ధి దశలో, గుత్తాధిపత్యానికి దారితీస్తుందనీ రుజువుచేసినాడు. యీనాడు గుత్తాధిపత్యం వాస్తవమయింది. అర్థశాస్త్రజ్ఞులు గుట్టలు గుట్టలు పుస్తకాలు రాసి, గుత్త వ్యవస్థయొక్క విడి వ్యక్తీకరణలను వర్ణించి, "మార్క్సిజం పూర్వపక్షం చేయబడింది" అని ఒకే గొంతుతో పాట పాడడం కొనసాగిస్తున్నారు. కానీ, యింగ్లీషు సామెత చెప్పినట్లు, వాస్తవాలు మొండి విషయాలు, మనకు యిష్టమున్నా, లేకపోయినా వాటిని లెక్కలోకి తీసుకోవాలి. వాస్తవాలు తెలిపేదేమంటే: రక్షణ విధానం[136] వుందా, స్వేచ్ఛాయుత వర్తకం వుందా అనే విషయంలో పెట్టుబడిదారీ దేశాల మధ్యగల భేదాలు గుత్తసంస్థల రూపంలో, లేదా అవి అవతరించే సమయంలో, తృణప్రాయమైన భేదాలను మాత్రం ఉత్పన్నం చేస్తాయి; ఉత్పత్తి

* Hermann Levy, *Monopole, Kartelle und Trusts* ("గుత్తసంస్థలూ, కార్టెళ్లూ, ట్రస్టులూ"), Jena, 1909, SS. 286, 290, 298.

సాంద్రీకరణ మూలంగా గుత్తసంస్థల ఉద్భవం పెట్టుబడిదారీ విధానపు ప్రస్తుత అభివృద్ధి దశలో సాధారణ, మౌలిక నియమం.

యూరప్‌లో కొత్త పెట్టుబడిదారీ విధానం పాతదానిని పూర్తిగా తొలగించిన కాలాన్ని తగిన కచ్చితత్వంతో నిర్ణయించవచ్చు: అది 20వ శతాబ్ది ప్రారంభం. "గుత్తసంస్థల స్థాపన" చరిత్రమీద ఒక తాజా గ్రంథంలో యిలా రాయబడివుంది:

"పెట్టుబడిదారీ గుత్త వ్యవస్థకు విడివిడి ఉదాహరణలు 1860కి పూర్వపు కాలం నుండి ఉటంకించవచ్చు; వాటిలో యీనాడు చాలా మామూలుగా వున్న రూపాల బీజాన్ని కనిపెట్టవచ్చు; కానీ యిదంతా నిస్సందేహంగా కార్టెళ్ల ఆదిమ చరిత్ర. ఆధునిక గుత్త వ్యవస్థయొక్క నిజమైన ప్రారంభం, మహా అయితే, అరవైల నాటికి పోతుంది. గుత్త వ్యవస్థ అభివృద్ధియొక్క మొదటి ముఖ్యమైన దశ డెబ్బైలనాటి అంతర్జాతీయ పారిశ్రామిక మాంద్యంతో ప్రారంభమై, తొంబైల ప్రారంభందాకా వుండింది." "యూరపియన్ ప్రమాణంలో యీ సమస్యను పరిశీలిస్తే, స్వేచ్ఛాయుత పోటీ అభివృద్ధి అరవైలలోనూ, డెబ్బైలలోనూ శిఖరదశ అందుకుందని కనపడుతుంది. బ్రిటన్ తన పాత పద్ధతి పెట్టుబడిదారీ నిర్మాణాన్ని పూర్తిచేసింది అప్పుడే. జర్మనీలో యీ నిర్మాణం చేతి పరిశ్రమలతోనూ, గృహ పరిశ్రమలతోనూ భీషణ పోరాటంలోకి దిగి, తన సొంత రూపాలను తాను సృష్టించుకోవడం ప్రారంభించింది."

"మహా విప్లవం 1873 నాటి ఆర్థిక విలయంతో, లేదా దాని వెనువెంట వచ్చిన ఆర్థిక మాంద్యంతో ప్రారంభమైంది; యీ మాంద్యం, తొలి యెనబైలలో కనిపించీ కనిపించని విరామాలు కలిగి, 1889 ప్రాంతంలో మహా ప్రచండమైన, కానీ అల్పాయుష్కమైన ఆర్థిక వికాసం కలిగినట్టిది, యిరవై రెండేండ్ల యూరపియన్ ఆర్థిక చరిత్రకు గుర్తుగా వుంది." "1889–1890 ఆర్థిక వికాస కాలంలో, అనుకూలమైన వర్తక పరిస్థితులను వినియోగించుకోడానికి కార్టెళ్ల పద్ధతికి విస్తృతంగా పూనుకున్నారు. కార్టెళ్లు లేకపోతే జరిగేటంతకంటె వేగంగానూ, తీవ్రంగానూ అవివేకపు విధానం మూలంగా ధరలు పెరిగినాయి; యీ కార్టెళ్లు దాదాపు అన్నీ ఆర్థిక ప్రళయంలో అపకీర్తికరంగా నశించినాయి. హీన వర్తకమూ, హీన ధరలూ గల మరొక అయిదేండ్ల దశ వచ్చింది, కానీ పరిశ్రమలలో కొత్త తత్వం రాజ్యం చేసింది. ఆర్థిక మాంద్యం ఆర్థిక మాంద్యంగా యిక యెంత మాత్రమూ పరిగణింపబడలేదు, మరొక ఆర్థిక వికాసానికి ముందు వచ్చే విరామం తప్ప మరేమీ కానట్లు అది పరిగణింపబడింది.

"కార్టెల్ ఉద్యమం తన రెండవ యుగంలో ప్రవేశించింది. క్షణిక ఘటనగా వుండే బదులు, కార్టెళ్లు ఆర్థిక జీవితపు పునాదులలో ఒకటి అయినాయి. అవి ఒక పరిశ్రమవెంట

మరొక పరిశ్రమను గెలుచుకుంటున్నాయి, ప్రధానంగా ముడి సరుకుల పరిశ్రమలను. తొం బైల ప్రారంభంలో కార్టెల్ వ్యవస్థ – కోక్ సిండికేట్ నిర్మాణంలో (దీని నమూనామీద తరువాత బొగ్గు సిండికేట్ నిర్మించబడింది) – కార్టెల్ సంవిధానాన్ని సంతరించుకుంది; ఆ సంవిధానం యిప్పటికీ అలాగే వుంది, మెరుగుదల లేకుండా. మొట్టమొదటి సారిగా పందొమ్మిదవ శతాబ్ది అంతంలోని మహా వికాసమూ, 1900–03 నాటి సంక్షోభమూ పూర్తిగా – కనీసం గని, యినుము పరిశ్రమలలో – కార్టెళ్ల ఆధ్వర్యాన జరిగినాయి. అప్పు డది యేదో కొత్తగా కనిపించినా, ఆర్థిక జీవితపు విస్తారమైన రంగాలు, సాధారణంగా స్వేచ్ఛాయుత పోటీ ప్రపంచంనుండి తొలగించబడడాన్ని సాధారణ జనం యిప్పుడు మామూలు విషయంగా చూస్తున్నారు."*

యీవిధంగా, గుత్తసంస్థల చరిత్రలోని ప్రధానమైన దశలు యివి: (1) 1860, 1870 దశకాలలో స్వేచ్ఛాయుత పోటీ అభివృద్ధియొక్క అత్యున్నత శిఖర దశ. గుత్తసం స్థలు కనపడీ కనపడని పిండ దశలో వుండినాయి. (2) 1873 ఆర్థిక సంక్షోభం తర్వాత, కార్టెళ్ల అభివృద్ధి విస్తారంగా జరిగిన దశ; కానీ అవి యింకా అపవాదంగా వున్నాయి. అవి స్థిరమైనవి కావు. అవి యింకా తాత్కాలికమైనవిగా వున్నాయి. (3) 19వ శతాబ్ది అంతం నాటి ఆర్థిక వికాసమూ, 1900–03 నాటి ఆర్థిక సంక్షోభమూ: కార్టెళ్లు ఆర్థిక జీవిత సమస్తంయొక్క పునాదులలో ఒకటి అయినాయి. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా రూపాంతరం చెందింది.

కార్టెళ్లు అమ్మకం షరతులూ, చెల్లింపు తేదీలూ, వగైరాల గురించి ఒప్పందం చేసు కుంటాయి. అవి మార్కెట్లను తమలో తాము పంచుకుంటాయి. అవి ఉత్పత్తి చేయవల సిన సరుకుల పరిమాణాన్ని నిర్ణయిస్తాయి, ధరలను నిర్ణయిస్తాయి. అవి వివిధ సంస్థల మధ్య లాభాలను పంచుతాయి, వగైరా.

జర్మనీలోని కార్టెళ్ల సంఖ్య 1896లో 250గానూ, 1905లో 385గానూ

---

* Th. Vogelstein, *Grundriß der Sozialökonomik* లోని *Die finanzielle Organisation der kapitalistischen Industrie und die Monopolbildungen* ("సాంఘిక అర్థశాస్త్రంయొక్క పునాదులు" అనే రచనలోని "పెట్టుబడిదారీ పరిశ్రమల ఆర్థిక నిర్మాణమూ, గుత్తసంస్థలు యేర్పడడమూ"), VI Abt., Tüb., 1914. అదే రచయిత *Organisationsformen der Eisenindustrie und Textilindustrie in England und Amerika* ("ఇంగ్లండు, అమెరికాలలో యినుము, జౌళి పరిశ్రమల సంస్థానిర్మాణ రూపాలు"), Bd. I, Lpz., 1910 అనే పుస్తకం కూడా చూడండి.

అంచనా వేయబడింది; వాటిలో సుమారు 12,000 కంపెనీలు పాల్గొన్నాయి.* కానీ, యీ అంకెలు తక్కువ అంచనాలని సాధారణంగా గుర్తింపబడింది. పైన ఉల్లేఖించిన 1907 నాటి జర్మన్ పరిశ్రమల గణాంక లెక్కలనుబట్టి, యీ 12,000 అతి పెద్ద సంస్థలు కూడా దేశంలో వినియోగింపబడే ఆవిరి, విద్యుత్‌శక్తిలో బహుశా సగానికిపైగా వినియోగిస్తాయని స్పష్టమౌతుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ట్రస్టుల సంఖ్య 1900లో 185గానూ, 1907లో 250గానూ అంచనా వేయబడింది. అమెరికన్ గణాంక లెక్కలు పారిశ్రామిక సంస్థల నన్నిటినీ విడి వ్యక్తులకు చెందినవిగానూ, ప్రైవేటు ఫర్ములకు చెందినవిగానూ, కార్పొరేషన్‌లకు చెందినవిగానూ విభజిస్తుంది. చివరివి 1904లో దేశంలోని మొత్తం పారిశ్రామిక సంస్థలలో 23.6 శాతంగా వుండినాయి, 1909లో 25.9 శాతంగా, అనగా పాతిక భాగంకంటె యెక్కువగా, వుండినాయి. యివి 1904లో మొత్తం వేతన ఆర్జకులలో 70.6 శాతాన్ని వినియోగించుకొన్నాయి, 1909లో 75.6 శాతాన్ని, అనగా ముప్పాతిక భాగానికిపైగా, వినియోగించుకున్నాయి. వీటి ఉత్పత్తి విలువ యీ రెండు సంవత్సరాలలోనూ వరుసగా 1090 కోట్ల డాలర్లూ, 1630 కోట్ల డాలర్లూ వుండింది, అనగా మొత్తం ఉత్పత్తిలో 73.7 శాతమూ, 79 శాతమూ.

ఒకోసారి కార్టెళ్లూ, ట్రస్టులూ ఒక పరిశ్రమ శాఖయొక్క మొత్తం ఉత్పత్తిలో పదింట యేడు, యెనిమిది భాగాలను తమ చేతుల్లో సాంద్రీకరించుకుంటాయి. రైన్-వెస్ట్‌ఫాలియన్ బొగ్గు సిండికేటు 1893లో తన స్థాపన సమయంలో, ఆ ప్రాంతపు మొత్తం బొగ్గు ఉత్పత్తిలో 86.7 శాతాన్ని సాంద్రీకరించుకొంది, 1910లో అప్పటికే 95.4 శాతాన్ని సాంద్రీకరించుకొంది.** అలా సృష్టింపబడిన గుత్తాధిపత్యం అపారమైన లాభాలను

---

* Dr. Riesser, *Die deutschen Großbanken und ihre Konzentration im Zusammenhange mit der Entwicklung der Gesamtwirtschaft in Deutschland* ("జర్మనీ సాధారణ ఆర్థిక అభివృద్ధి సందర్భంలో జర్మన్ పెద్ద బాంకులూ, వాటి సాంద్రీకరణా"), 4. Aufl., 1912, S. 149. — R. Liefmann, *Kartelle und Trusts und die Weiterbildung der volkswirtschaftlichen Organisation* ("కార్టెళ్లూ, ట్రస్టులూ, ఆర్థికాభివృద్ధీ"), 2 Aufl., 1910, S. 25.

** Dr. Fritz Kestner, *Der Organisationszwang. Eine Untersuchung über die Kämpfe zwischen Kartellen und Außenseitern* ("నిర్బంధ సంస్థానిర్మాణం. కార్టెళ్లకూ బయటివాళ్లకూ మధ్య పోరాటంమీద పరిశీలన"), Brl., 1912, S. 11.

కట్టుదిట్టం చేసి, బృహత్ పరిమాణంగల సాంకేతిక ఉత్పత్తి సంస్థల నిర్మాణానికి దారి తీస్తుంది. అమెరికాలోని ప్రసిద్ధమైన శ్టాండర్డ్ ఆయిల్ కంపెనీ (Standard Oil Company) 1900లో స్థాపించబడింది. "15 కోట్ల డాలర్ల ఆథరైజ్డ్ పెట్టుబడివుంది. అది 10 కోట్ల డాలర్ల సాధారణ షేర్లనూ, 10 కోట్ల 60 లక్షల డాలర్ల ప్రిఫర్డ్ షేర్లనూ జారీ చేసింది. అది 1900నుండి 1907వరకు ప్రిఫర్డ్ షేర్లమీద వరుసగా 48, 48, 45, 44, 36, 40, 40, 40 శాతం డివిడెండ్లు చెల్లించింది, అనగా మొత్తం 3670 లక్షల డాలర్లు. 1882నుండి 1907వరకు వచ్చిన మొత్తం 8,890 లక్షల డాలర్ల లాభంలో 6,060 లక్షల డాలర్లు డివిడెండ్లుగా పంచబడింది, తక్కింది రిజర్వు పెట్టుబడికి పోయింది."* 1907లో "సంయుక్త రాష్ట్రాల ఉక్కు కార్పొరేషన్" (United States Steel Corporation)కు చెందిన వివిధ కర్మాగారాలు 2,10,180మందిని వినియోగించుకున్నాయి. జర్మన్ గని పరిశ్రమలో అన్నిటికంటె పెద్ద సంస్థ అయిన గెల్జెన్ కిర్హెన్‌లోని గని కంపెనీకి (Gelsenkirchener Bergwerksgesellschaft) 1908లో కార్మికులూ, ఆఫీసు ఉద్యోగులూ కలిసి 46,048మంది వుండినారు"**. 1902లో "సంయుక్త రాష్ట్రాల ఉక్కు కార్పొరేషన్" అప్పటికే 90 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేసింది.*** దాని ఉత్పత్తి 1901లో, అమెరికా సంయుక్త రాష్ట్రాల మొత్తం ఉక్కు ఉత్పత్తిలో 66.3 శాతంగానూ, 1908లో 56.1 శాతంగానూ వుండింది.**** ముడి యినుము ఉత్పత్తి వరుసగా 43.9 శాతంగానూ, 46.3 శాతంగానూ వుండింది.

ట్రస్టులమీద అమెరికన్ ప్రభుత్వ కమిషన్ యిలా అంటుంది: "పోటీదార్లమీద వాటి ఆధిక్యానికి కారణం వాటి సంస్థల పరిమాణమూ, వాటి శ్రేష్ఠమైన సాంకేతిక యంత్రావళీ. పొగాకు ట్రస్టు పుట్టినప్పటినుండి సార్వత్రికంగా శరీర శ్రమ స్థానంలో యాంత్రిక శ్రమను పెట్టడానికి సర్వ ప్రయత్నాలూ చేసింది. అది యీ ఉద్దేశంతో పొగాకు ఉత్ప

---

* R. Liefmann, *Beteiligungs- und Finanzierungsgesellschaften. Eine Studie über den modernen Kapitalismus und das Effektenwesen* ("హోల్డింగు, ఫైనాన్సు కంపెనీలు. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క, దాని ఫలితాలయొక్క పరిశీలన"), 1. Aufl., Jena, 1909, S. 212.

** పూర్వోక్త గ్రంథం, పేజి 218.

*** Dr. S. Tschierschky, *Kartell und Trust* ("కార్టెల్, ట్రస్టు"), Gött., 1903, S. 13.

**** Th. Vogelstein, *Organisationsformen*, S. 275.

త్తితో యేమాత్రమైనా సంబంధం వున్న పేటెంట్ల నన్నిటినీ కొనేసి, యీ లక్ష్యానికి అపార మైన మొత్తాలు ఖర్చుపెట్టింది. యీ పేటెంట్లలో అనేకం మొదట నిరుపయోగమని తేలింది, ట్రస్టుయొక్క యింజనీర్లు వాటిని మార్పు చేయవలసివచ్చింది. 1906 అంతంలో కేవలం పేటెంట్లు సంపాయించడానికి రెండు ఉపకంపెనీలు యేర్పాటు చేయబడినాయి. అదే ఉద్దేశంతో ట్రస్టు తన సొంత ఫౌండ్రీలనూ, యంత్రశాలలనూ, మరమ్మత్తు శాల లనూ నిర్మించింది. యీ సంస్థలలో ఒకటి, బ్రూక్లిన్‌లోనిది, సగటున 300 కార్మికులను వినియోగించుకుంటుంది. సిగరెట్లూ, చుట్టలూ, నశ్యమూ, పొకింగుకు తగరం రేకూ, పెట్టెలూ, వగైరాకు సంబంధించిన సృజనలమీద యిక్కడ ప్రయోగాలు జరుగుతాయి. సృజనలను యిక్కడ ఉత్కృష్టపరుస్తారు కూడా."* "యితర ట్రస్టులు కూడా development engineers (అభివృద్ధి యింజనీర్లు) అనబడేవాళ్లను వినియోగించుకుంటాయి; వాళ్ల పని కొత్త ఉత్పత్తి పద్ధతులను రూపొందించడమూ, సాంకేతిక మెరుగుదలలను పరీక్షించి చూడడమూ. సాంకేతిక సామర్థ్యాన్ని పెంచేవీ, ఉత్పత్తి ఖర్చును తగ్గించేవీ అయిన సృజన లన్నిటికీ గాను సంయుక్త రాష్ట్రాల ఉక్కు కార్పొరేషన్ తన కార్మికులకూ, యింజనీర్లకూ పెద్ద బోనస్‌లు యిస్తుంది."**

జర్మన్ భారీ పరిశ్రమలో, ఉదాహరణకు గత కొద్ది దశాబ్దాలలో అంత అపారంగా అభివృద్ధి అయిన రసాయన పరిశ్రమలో, సాంకేతిక అభివృద్ధి పెంపుదల యిదే విధంగా కట్టుదిట్టం చేయబడింది. 1908 నాటికి ఉత్పత్తి సాంద్రీకరణ క్రమం అప్పటికే రెండు ప్రధాన "బృందా"లను ఉత్పన్నం చేసింది; అవి ఒక విధంగా గుత్తసంస్థలు కూడా. మొదట యీ బృందాలు ఒక్కొక్కటి యిరవై ఒక్క మిలియన్ల మార్కుల పెట్టుబడిగల రెండు జతల "ద్వంద్వ కూటములు"గా వుండినాయి — ఒకవైపున, హోఖ్స్టలోని పూర్వపు మైస్టర్ ఫాక్టరీ, ఫ్రాంక్‌ఫుర్ట్-అమ్-మెయిన్‌లోని కాస్సెల్ ఫాక్టరీ; మరొకవైపున లుడ్విగ్స్ హాఫెన్‌లోని అనిలైన్, సోడా ఫాక్టరీ, ఎల్బర్‌ఫెల్డ్‌లోని పూర్వపు బైయర్ ఫాక్టరీ. తరువాత

---

* *Report of the Commissioner of Corporations on the Tobacco Industry* ("పొగాకు పరిశ్రమమీద కార్పొరేషన్ల కమిషనర్ నివేదిక"), Washington, 1909, p. 266. Dr. Paul Tafel, *Die nordamerikanischen Trusts und ihre Wirkungen auf den Fortschritt der Technik* ("ఉత్తర అమెరికా ట్రస్టులూ, సాంకేతిక అభివృద్ధిమీద వాటి ప్రభావమూ"), Stuttgart, 1913, S. 48 నుంచి ఉటంకించబడింది.

** పూర్వోక్త గ్రంథం, పేజీలు 48–49.

1905లో యీ బృందాలలో ఒకటీ, 1908లో మరొకటీ యింకొక పెద్ద ఫాక్టరీతో ఒప్పందం చేసుకున్నాయి. ఫలితంగా ఒక్కొక్కదానికి నలభై, యాభై మిలియన్ల మార్కుల పెట్టుబడిగల రెండు "త్రితయ కూటములు" యేర్పడినాయి. యిక యీ కూటములు యిప్పటికే ఒకదాని నొకటి "సమీపించడం" ప్రారంభించినాయి, ధరలను గురించి "ఒక అవగాహన"కు రావడానికీ, వగైరా.*

పోటీ అనేది గుత్తాధిపత్యంగా రూపాంతరం చెందుతుంది. ఫలితం యేమిటంటే, ఉత్పత్తి సామాజికీకరణంలో బ్రహ్మాండమైన పురోగతి. ప్రత్యేకంగా, సాంకేతిక సృజన, మెరుగుదలల క్రమం సామాజికీకరింపబడుతుంది.

అజ్ఞాత మార్కెట్‌కోసం ఉత్పత్తిచేస్తూ చెదరుమదరుగానూ, పరస్పర సంబంధం లేకుండానూ వున్న ఉత్పత్తిదార్ల మధ్య గల పాత స్వేచ్ఛాయుత పోటీకంటె యిది బాగా భిన్నమైనది. సాంద్రీకరణ యే దశకు చేరిందంటే, ఒక దేశంయొక్క, మనం ముందు చూడ బోయేటట్లు, కొన్ని దేశాలయొక్క, లేదా మొత్తం ప్రపంచంయొక్క కూడా ముడి సరుకుల మూలాల నన్నిటినీ (ఉదాహరణకు ముడి యినుము నిధులను) అంచనా వేయడం సాధ్యమౌతున్నది. యిలాంటి అంచనాలు వేయబడడమే కాదు, బ్రహ్మాండమైన గుత్త సంఘాలు యీ మూలాలను చేజిక్కించుకున్నాయి కూడా. మార్కెట్ల శక్తి కూడా రమారమిగా అంచనా వేయబడుతుంది, సంఘాలు ఒప్పందం ద్వారా వాటిని తమ మధ్య "పంచుకుంటాయి." నిపుణ శ్రమ గుత్తగొనబడుతుంది, అత్యుత్తమ యింజనీర్లు వినియోగింపబడతారు; రవాణా సాధనాలు కైవసం చేసుకోబడతాయి – అమెరికాలో రైల్వేలూ, యూరప్‌లోనూ, అమెరికాలోనూ ఓడల కంపెనీలూ. పెట్టుబడిదారీ విధానం తన సామ్రాజ్యవాద దశలో, అత్యంత సమగ్రమైన ఉత్పత్తి సామాజికీకరణకు సూటిగా దారితీస్తుంది; అది పెట్టుబడిదార్లను, వాళ్ల యిచ్ఛకూ, చైతన్యానికీ వ్యతిరేకంగా, ఒక విధమైన కొత్త సామాజిక వ్యవస్థకు, సంపూర్ణ స్వేచ్ఛాయుత పోటీనుండి సంపూర్ణ సామాజికీకరణకు పరివర్తన జరిగే సంధి వ్యవస్థకు, లాక్కుపోతుందనవచ్చు.

ఉత్పత్తి సామాజిక మౌతుంది, కానీ సొంతపరుచుకోవడం వ్యక్తిగతంగా నిలుస్తుంది. సామాజిక ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది సొంత ఆస్తిగా నిలుస్తాయి. లాంఛనంగా గుర్తించబడిన స్వేచ్ఛాయుత పోటీయొక్క సాధారణ చట్టం నిలిచివుంటుంది, కొద్దిమంది గుత్తా

* Riesser, పూర్వోక్త గ్రంథం, 3వ కూర్పు, పేజి 547నుండి. జర్మన్ రసాయన పరిశ్రమను యేకంచేసే బ్రహ్మాండమైన కొత్త ట్రస్టు యేర్పడినట్లు వార్తాపత్రికలు (1916 జూన్) చెప్తున్నాయి.

ధిపతుల పెత్తనం తక్కిన ప్రజానీకంమీద నూరు రెట్లు భారమూ, దుర్భరమూ, దుస్స హమూ అవుతుంది.

కెస్ట్నెర్ అనే జర్మన్ అర్థశాస్త్రజ్ఞుడు ప్రత్యేకంగా "కార్టెళ్లకూ బయటివాళ్లకూ" (అనగా కార్టెళ్లకు బయట వున్న పెట్టుబడిదార్లకూ) "మధ్య పోరాటా"నికి అంకితమైన గ్రంథం రాసినాడు. అతను తన గ్రంథానికి "నిర్బంధంగా సంఘటితం చేయడం" అని పేరుపెట్టినాడు; కానీ పెట్టుబడిదారీ విధానాన్ని అసలైన రూపంలో ప్రదర్శించడానికి అతను, సహజంగా, గుత్త సంఘాలకు నిర్బంధ దాసోహం గురించి రాసివుండవలసింది. కనీసం, "సంఘటితం చేయడం"కొరకు యీనాటి, తాజా, నాగరిక పోరాటంలో గుత్త సంఘాలు ఉపయోగించే పద్ధతుల పట్టీని ఒకసారి చూడడం జ్ఞానదాయకంగా వుంటుంది: (1) ముడిసరుకుల సరఫరాలు ఆపివేయడం ("... కార్టెల్‌కు అంటిపెట్టుకునేటట్లు నిర్బంధించే ఒక అత్యంత ముఖ్యమైన పద్ధతి"); (2) "పొత్తుల" ద్వారా శ్రామికుల సరఫరాను ఆపివేయడం (అనగా, పెట్టుబడిదార్లకూ, ట్రేడ్‌యూనియన్లకూ మధ్య ఒప్పందాల ద్వారా — వీటి ద్వారా ట్రేడ్‌యూనియన్లు కార్టెల్‌లో చేరిన సంస్థలకు మాత్రమే పనిచేయడానికి తమ సభ్యులకు అనుమతి యిస్తాయి); (3) సరుకుల సరఫరాలు ఆపివేయడం; (4) వర్తక మార్గాలు మూసివేయడం; (5) కొనుగోలుదార్లతో ఒప్పందాలు — వీటి ద్వారా వాళ్లు కార్టెల్‌తో మాత్రమే వర్తకం చేయడానికి ఒప్పుకుంటారు; (6) క్రమపద్ధతిగా ధరల తగ్గింపు ("బయటి" సంస్థలను, అనగా గుత్తాధిపతులకు లొంగనివాటిని, నాశనం చేయడానికి. కొంత కాలంపాటు సరుకులను ఉత్పత్తి ఖరీదుకంటె తక్కువకు అమ్మడానికి మిలియన్లు ఖర్చుపెడతారు; పెట్రోలు ఖరీదు 40 మార్కులనుండి 22 మార్కులకు, అనగా దాదాపు అర్థం, తగ్గించబడిన ఘటనలు వుండినాయి!); (7) రుణాలు ఆపివేయడం; (8) బహిష్కరణ.

యిక్కడున్నది చిన్న సంస్థలకూ, పెద్ద సంస్థలకూ మధ్య, సాంకేతికంగా అభివృద్ధి అయినవాటికీ, వెనుకబడినవాటికీ మధ్య, పోటీ యిక యెంతమాత్రమూ కాదు. గుత్తాధిపతులు తమకు, తమ పెత్తనానికి, తమ ఆజ్ఞలకు లొంగనివాళ్లను గొంతు నొక్కడం యిక్కడ కనపడుతుంది. యీ క్రమం ఒక బూర్జువా అర్థశాస్త్రజ్ఞుని బుర్రలో యిలా ప్రతిబింబింపబడింది:

కెస్ట్నెర్ యిలా రాస్తాడు: "శుద్ధ ఆర్థిక రంగంలో కూడా, పాత అర్థంలోని వర్తక కార్యకలాపాలనుండి సంఘటితమైన సట్టా కార్యకలాపాలవైపు ఒకానొక మార్పు జరుగుతున్నది. తన సాంకేతిక, వర్తక అనుభవం మూలంగా కొలుగోలుదారుని అవసరాలను అందరి కంటె బాగా అంచనా వేయగలిగి, గుప్త డిమాండును ఆవిష్కరించగలిగి, ఒక విధంగా

చెప్పాలంటే, 'మేల్కొల్పు' గలిగిన వర్తకునికి విజయం యిక యెంత మాత్రమూ కలగడం లేదు. నిర్మాణాత్మక అభివృద్ధినీ, విడివిడి సంస్థలకూ, బాంకులకూ మధ్య గల కొన్ని లంకెల అవకాశాలనూ అంచనావేయడం, లేదా ముందుగా పసిగట్టడం కూడా తెలిసిన సట్టా ప్రతిభాశాలికి (?!) విజయం కలుగుతున్నది...."

మామూలు మానవ భాషలోకి అనువదిస్తే దీని అర్థం యేమిటంటే: విక్రయ సరుకుల ఉత్పత్తి యింకా "రాజ్యం చేస్తూ" వున్నప్పటికీ, ఆర్థిక జీవితపు ఆధారంగా పరిగణింపబడుతూనే వున్నప్పటికీ, వాస్తవంలో అది బలహీనపరచబడి, లాభాలలో అధిక భాగం ఫైనాన్షల్ పన్నాగాల "ప్రతిభాశాలుర"కు పోయే దశకు పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి చేరుకుంది. యీ పన్నాగాల, మోసాల మూలంలో సామాజికీకృత ఉత్పత్తి వుంది; కాని, మానవజాతియొక్క బ్రహ్మాండమైన పురోగతి, యీ సామాజికీకరణాన్ని సాధించినట్టిది, యెవరికి లాభం చేకూరుస్తున్నదంటే... సట్టా వ్యాపారస్తులకు. పెట్టుబడిదారీ సామ్రాజ్య వాదపు ప్రగతి వ్యతిరేక, పెటీబూర్జువా విమర్శకులు "యీ ఆధారాలమీద" "స్వేచ్ఛాయుత," "శాంతియుత," "నిష్కపట" పోటీకి తిరిగి పోవడం గురించి యెలా కలలు గనేదీ మనం ముందు చూస్తాం.

"కార్టెళ్ల ఆవిర్భావం ఫలితంగా దీర్ఘకాలం ధరలు పెంచడం అత్యంత ముఖ్యమైన ఉత్పత్తి సాధనాల, ప్రత్యేకంగా బొగ్గు, యినుము, పొటాషియంల, విషయంలో మాత్రమే యింతకుముందు కనిపించింది, కానీ పారిశ్రామిక సరుకుల విషయంలో యెప్పుడూ కనిపించ లేదు. అలాగే, యీ ధరలు పెంచడం మూలంగా కలిగే లాభాల పెరుగుదల ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తిచేసే పరిశ్రమలకు పరిమితమై వుండింది. యీ మాటకు మరొకటి కలపాలి: ముడి సరుకులను (అర్ధపారిశ్రామిక సరుకులను కాదు) ప్రోసెస్‌చేసే పరిశ్రమలు కార్టెల్ ఆవిర్భావంనుండి, అంతిమ సరుకుల పరిశ్రమలకు హానికరంగా, అధిక లాభాల రూపంలో సౌకర్యాలు పొందడమే కాక, యీ రెండవ పరిశ్రమలమీద ఆధిపత్యపు స్థానాన్ని, స్వేచ్ఛాయుత పోటీలో లేనట్టిదాన్ని, పొందుతాయి"* అని కెస్ట్నెర్ అంటాడు.

బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు ఎంతో అయిష్టంగా, అంత అరుదుగా ఒప్పుకునేదీ, కౌట్స్కీ నాయకత్వంకింద వున్న యీనాటి అవకాశవాద సమర్థకులు తప్పకోడానికీ, తోసి పారవేయడానికీ ఎంతో పట్టుదలతో ప్రయత్నించేదీ అయిన యీ విషయంయొక్క సారాన్ని నేను కిందిగీత గీసిన పదాలు వెల్లడిస్తాయి. ఆధిపత్యమూ, దానితో కలిసివుండే దౌర్జన్యమూ — యివి "పెట్టుబడిదారీ అభివృద్ధియొక్క తాజా దశ"కు విలక్షణమైన సంబంధాలు.

---

* కెస్ట్నెర్, పై గ్రంథం, పేజి 254.

సర్వశక్తివంతమైన ఆర్థిక గుత్తసంస్థల ఏర్పాటునుండి అనివార్యంగా ఫలించవలసివుండిందీ, ఫలించిందీ యిది.

కార్టెళ్లు ఉపయోగించే పద్ధతులకు మరొక ఉదాహరణ యిస్తాను. ముడిపదార్థాల మూలాల నన్నిటినీ గానీ, ప్రధానమైనవాటిని గానీ కైవసం చేసుకోవడం సాధ్యమైనచోట కార్టెళ్ల ఉద్భవమూ, గుత్తసంస్థల ఏర్పాటూ మరీ సులభం. కానీ, ముడిపదార్థాల మూలాలను చేజిక్కించుకోవడం అసాధ్యమైనచోట యితర పరిశ్రమలలో గుత్తసంస్థలు ఉద్భవించవని అనుకోవడం తప్పు. ఉదాహరణకు సిమెంటు పరిశ్రమకు ముడిసరుకులు అన్నిచోట్లా దొరుకుతాయి. కానీ జర్మనీలో యీ పరిశ్రమ బాగా కార్టెలీకృతం అయింది. సిమెంటు ఫాక్టరీలు ప్రాంతీయ సిండికేట్లు నిర్మించుకున్నాయి: దక్షిణ జర్మన్, రైన్-వెస్ట్‌ఫాలియన్, వగైరా. నిర్ణయించబడిన ధరలు గుత్త ధరలు: వాగెన్‌కు 230నుండి 280 మార్కుల వరకు, ఉత్పత్తి ఖరీదు 180 మార్కులు వున్నప్పుడు! సంస్థలు 12నుండి 16 శాతందాకా డివిడెండు యిస్తాయి — ఆధునిక సట్టా "ప్రతిభాశాలుర"కు డివిడెండ్లలో సంపాయించేది కాక, పెద్ద లాభాలు సంపాయించడం యెలాగో తెలుసుననేది మరవకూడదు. అలాంటి లాభదాయకమైన పరిశ్రమలో పోటీని నివారించడానికి గుత్తాధిపతులు వివిధ జిత్తులకు కూడా పూనుకుంటారు: తమ పరిశ్రమలోని దుస్థితిని గురించి వాళ్లు తప్పుడు పుకార్లు వ్యాపింపజేస్తారు; పత్రికలలో ఆకాశరామన్న హెచ్చరికలు ప్రచురింపబడతాయి, యిలాంటివి: "పెట్టుబడిదారులారా, సిమెంటు పరిశ్రమలో పెట్టుబడి పెట్టకండి!"; చివరన, వాళ్లు "బయటివాళ్లను" (సిండికేట్లకు బయట వున్నవాళ్లను) కొనేసి, వాళ్లకు 60,000 మార్కులూ, 80,000 మార్కులూ, 1,50,000 మార్కులు సైతం నష్టపరిహారం చెల్లిస్తారు.* గుత్తాధిపత్యం ప్రతిచోటా తనకు దారి మలచుకుంటుంది, సాధనాల గురించి యే పట్టింపూ లేకుండా — పోటీదార్లను కొనేయడానికి "చిన్న" మొత్తం చెల్లించడం మొదలుకొని, వాళ్లమీద డైనమైట్ ప్రయోగించే అమెరికన్ పద్ధతిదాకా.

కార్టెళ్లు ఆర్థిక సంక్షోభాలను నివారించగలవనే మాట, యెలాగైనా పెట్టుబడిదారీ విధానాన్ని మంచిగా చూపించాలని కాంక్షించే బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు వ్యాపింపజేసిన కట్టుకథ. తద్వ్యతిరేకంగా, కొన్ని పరిశ్రమల శాఖలలో సృష్టింపబడిన గుత్తాధిపత్యం మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తిలో సహజంగా వున్న అరాజకత్వాన్ని పెంచి, తీవ్రంచేస్తుంది. వ్యవసాయ అభివృద్ధికీ, పారిశ్రామిక అభివృద్ధికీ మధ్య అంతరం, దరహంమీద పెట్టు

---

* L. Eschwege, *Zement*, "Die Bank"[137] ("సిమెంటు," "ది బాంక్"), 1909, 1, పేజి 115, వగైరా.

బడిదారీ విధానానికి విలక్షణమైనట్టిది, పెరుగుతుంది. అన్నిటికంటె యెక్కువగా కార్టెలీ కృతమైన, భారీ పరిశ్రమలు అనబడేవాటియొక్క, ముఖ్యంగా బొగ్గు, యినుము పరిశ్రమల యొక్క, అధిక సౌకర్యయుత స్థానం యితర పరిశ్రమల శాఖలలో "యింకా యెక్కువ సమ న్వయ రాహిత్యం" కలిగిస్తుంది — "పరిశ్రమలతో జర్మన్ పెద్ద బాంకుల సంబంధం"మీద అత్యుత్తమ రచనలలో ఒకటి రాసిన ఎయ్‌డెల్స్ యీ విషయం అంగీకరిస్తాడు.*

పెట్టుబడిదారీ విధానానికి సిగ్గుపడని సమర్థకుడైన లీఫ్మన్ యిలా రాస్తాడు: "ఆర్థిక వ్యవస్థ యెంతగా అభివృద్ధి అయితే అంతగా అది నష్టసంభావ్యత వున్న వ్యాపారాలకు, లేదా యితర దేశాల్లో వ్యాపారాలకు, అభివృద్ధి చేయడానికి చాలా కాలం పట్టేవాటికి, లేదా చివరన, స్థానిక ప్రాముఖ్యం మాత్రం గలవాటికి పూనుకుంటుంది."** పెరిగిన నష్ట ప్రమాదం నిడివిమీద బ్రహ్మాండంగా పెరిగిన పెట్టుబడితో సంబంధం కలిగివుంది; యీ పెట్టుబడి అంచులు పొంగిపొరుతుంది, విదేశాలకు ప్రవహిస్తుంది, వగైరా అనవచ్చు. అదే సమయంలో సాంకేతిక ప్రగతియొక్క అపారమైన వేగం జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క వివిధ రంగాల మధ్య పెరుగుతున్న అంతరపు అంశాలనూ, అరాజకత్వాన్నీ, సంక్షోభాలనూ ఉత్పన్నం చేస్తుంది. లీఫ్మన్ యిలా ఒప్పుకోవలసివచ్చింది: "బహుశా మానవజాతి సమీప భవిష్యత్తులో ముఖ్య మైన సాంకేతిక విప్లవాలు యింకా చూస్తుంది, అవి ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని కూడా మారు స్తాయి".... విద్యుచ్ఛక్తి, ఆకాశయానమూ.... "సాధారణంగా, అలాంటి మౌలిక ఆర్థిక మార్పుల కాలాలలో సట్టా వ్యాపారం విస్తృతమైన ప్రమాణంలో అభివృద్ధి అవుతుంది...."***

అన్ని రకాల సంక్షోభాలూ — అత్యంత తరుచుగా ఆర్థిక సంక్షోభాలు, కానీ యివి మాత్రమే కాదు — తమ వంతుకు మళ్లీ సాంద్రీకరణవైపూ, గుత్తాధిపత్యంవైపూ ఆభిముఖ్యాన్ని చాలా గణనీయంగా పెంచుతాయి. యీ సందర్భంలో, మన మింతకుముందే గమనించినట్లు, ఆధునిక గుత్త వ్యవస్థ చరిత్రలో మలుపుగా వుండిన 1900 నాటి సంక్షోభంయొక్క ప్రాము ఖ్యంమీద ఎయ్‌డెల్స్‌యొక్క యీకింది అభిప్రాయాలు చాలా జ్ఞానదాయకమైనవి:

"1900 నాటి సంక్షోభంలో, మౌలిక పరిశ్రమలలోని బ్రహ్మాండమైన సంస్థలతో

---

* Jeidels, *Das Verhältnis der deutschen Großbanken zur Industrie mit besonderer Berücksichtigung der Eisenindustrie* ("పరిశ్రమలతో జర్మన్ పెద్ద బాంకుల సంబంధం, ప్రత్యేకంగా లోహోత్పత్తి పరిశ్రమతో"), Lpz., 1905, S. 271.

** Liefmann, *Beteiligungs- und Finanzierungsgesellschaften*, S. 434.

*** Liefmann, పైగ్రంథం, పేజీలు 465–466.

పాటు, యీనాడు పాతబడినవిగా పరిగణింపబడే సంస్థలు, 'శుద్ధ' (అసంయుక్త) సంస్థలు, పారిశ్రామిక వికాసపు శిఖరదశలో పుట్టినట్టివి, యింకా చాలా వుండినాయి. ధరల తగ్గుదలా, డిమాండు పతనమూ యీ 'శుద్ధ' సంస్థలను ఒరగడ్డపు స్థితిలో పెట్టినాయి; యిది బ్రహ్మాండమైన సంయుక్త సంస్థలను బొత్తిగా మార్చలేదు, లేదా చాలా స్వల్ప కాలం పాటు మార్చింది. దీని పర్యవసానంగా 1900 నాటి సంక్షోభం 1873 నాటి సంక్షోభం కంటె చాలా యెక్కువ పారిశ్రామిక సాంద్రీకరణకు దారితీసింది: పాత సంక్షోభం కూడా ఉత్తమ యంత్రాలుగల సంస్థల యెంపిక లాంటిదాన్ని ఉత్పన్నంచేసింది, కానీ ఆనాటి సాంకేతిక అభివృద్ధి స్థాయి మూలంగా, సంక్షోభంనుండి విజయవంతంగా బయటపడిన సంస్థలను యీ యెన్నిక గుత్త స్థానంలో పెట్టజాలకపోయింది. అలాంటి స్థిరమైన గుత్తాధిపత్యం ఆధునిక యినుము, ఉక్కు, విద్యుత్ పరిశ్రమలలోని బ్రహ్మాండమైన సంస్థలలోని జటిల సంవిధానం, దూరవ్యాప్త సంఘటన, పెట్టుబడి పరిమాణాల మూలంగా, ఆ సంస్థలలో ఉన్నత ప్రమాణంలో వుంది, యింజనీరింగు పరిశ్రమలలోనూ, లోహ పరిశ్రమలో కొన్ని శాఖలలోనూ, రవాణా, వగైరాలలోనూ తక్కువ ప్రమాణంలో వుంది."*

గుత్తాధిపత్యం – యిది "పెట్టుబడిదారీ అభివృద్ధి తాజా దశ"కు పరిపూర్ణత. కానీ, బాంకులు నిర్వహించే పాత్రను మనం లెక్కలోకి తీసుకోకపోతే, ఆధునిక గుత్తసంస్థల నిజమైన శక్తిని గురించీ, ప్రాముఖ్యం గురించీ అరకొర, అసంపూర్ణ, హీన అభిప్రాయం మాత్రమే మనకు వుంటుంది.

## 2. బాంకులూ, వాటి కొత్త పాత్రా

బాంకుల ప్రధాన, ప్రాథమిక చర్య డబ్బు చెల్లించడంలో దళారీలుగా వ్యవహరించడం. అలా చేయడంలో అవి జడ డబ్బు పెట్టుబడిని క్రియాశీలమైన డబ్బు పెట్టుబడిగా, అనగా లాభం యిచ్చే పెట్టుబడిగా, మారుస్తాయి; అవి రకరకాల డబ్బు ఆదాయాలను ప్రోగుచేసి, పెట్టుబడిదారీ వర్గం వశంలో వుంచుతాయి.

బాంకింగు అభివృద్ధి అయి, కొద్ది సంస్థలలో సాంద్రీకృత మయ్యేకొద్దీ, బాంకులు చిన్న మధ్యవర్తులనుండి శక్తివంతమైన గుత్తసంస్థలుగా పెరుగుతాయి, వాటి పెత్తనం

* Jeidels, పూర్వోక్త గ్రంథం, పేజి 108.

కింద మొత్తం పెట్టుబడిదార్ల, చిన్న వ్యాపారస్తుల దాదాపు మొత్తం పెట్టుబడీ, యేదో ఒక్క దేశంయొక్కా, పలు దేశాలయొక్కా ఉత్పత్తి సాధనాలలోనూ, ముడిపదార్థాల మూలాల లోనూ అధిక భాగమూ వుంటాయి. అనేక చిన్న మధ్యవర్తులు కొద్దిపాటి గుత్తాధిపతు లుగా మారే యీ పరివర్తన పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిదారీ సా(మాజ్యవాదం అయ్యే యీ పెరుగుదలలోని మౌలిక (క్రమాల్లో ఒకటి; యీ కారణంవలన మనం మొట్టమొదట బాంకింగు సాం(దీకరణను పరీక్షించాలి.

1907–08లో ఒక్కొక్కదానికి పది లక్షల మార్కులకుపైగా పెట్టుబడిగల జర్మన్ జాయింటు స్టాక్ బాంకుల సంయుక్త డిపాజిట్లు 700 కోట్ల మార్కులు వుండి నాయి; 1912–13 నాటికి అవ్వడే 980 కోట్లు అయినాయి – అయిదేండ్లలో 40 శాతం పెరుగుదల. యీ 280 కోట్ల పెరుగుదలలో 275 కోట్లు ఒక్కొక్కదానికి ఒక కోటి మార్కులకుపైగా పెట్టుబడిగల 57 బాంకుల మధ్య పంపకమైంది. పెద్ద బాంకు లకూ, చిన్న బాంకులకూ మధ్య డిపాజిట్ల పంపకం యీకింది విధంగా వుండింది:*

| | మొత్తం డిపాజిట్ల శాతం | | | |
|---|---|---|---|---|
| | 9 పెద్ద బెర్లిన్ బాంకులలో | కోటి మార్కులకు పైగా పెట్టుబడిగల 48 యితర బాంకులలో | పది లక్షలు – కోటి మార్కుల పెట్టుబడిగల 115 బాంకులలో | పది లక్షలకు లోపల పెట్టు బడిగల చిన్న బాంకులలో |
| 1907–1908 | 47 | 32.5 | 16.5 | 4 |
| 1912–1913 | 49 | 36 | 12 | 3 |

చిన్న బాంకులను పెద్ద బాంకులు వెనక్కి నెట్టేశాయి; యీ పెద్ద బాంకులలో తొమ్మిది మాత్రమే మొత్తం డిపాజిట్లలో దాదాపు సగాన్ని తమ చేతుల్లో సాం(దీకరించు కున్నాయి. కానీ, మనం అనేక ముఖ్య వివరాలను లెక్కలోకి తీసుకోకుండా వదలేసినాము, ఉదా

---

* Alfred Lansburgh, *Fünf Jahre deutsches Bankwesen*, "Die Bank" ("జర్మన్ బాంకుల అయిదేండ్ల వ్యవహారం," "ది బాంక్"), 1913, సంచిక 8, పేజి 728.

హరణకు, పలు చిన్న బాంకులు వాస్తవంగా పెద్ద బాంకుల శాఖలుగా మారడం, వగైరా. దీన్ని గురించి నేను తరువాత చెప్తాను.

1913 సం॥ అంతంలో, తొమ్మిది బెర్లిన్ పెద్ద బాంకుల డిపాజిట్లు సుమారు 1,000 కోట్ల మార్కుల మొత్తం డిపాజిట్లలో 510 కోట్లు వున్నట్లు షుల్జె-గేవెర్నిట్జ్ అంచనా వేసినాడు. డిపాజిట్లను మాత్రం కాక, మొత్తం బాంకి పెట్టుబడిని లెక్కలోకి తీసుకొని, ఆ రచయిత యిలా రాసినాడు: "1909 సం॥ అంతంలో, తొమ్మిది పెద్ద బెర్లిన్ బాంకులు, వాటి అనుబంధ బాంకులతో కలిసి, 1,130 కోట్ల మార్కులను అజమాయిషీ చేసినాయి, అనగా మొత్తం జర్మన్ బాంకి పెట్టుబడిలో 83 శాతాన్ని. 'డోయిచె బాంక్' ('Deutsche Bank') దాని అనుబంధ సంస్థలతో కలిసి, దాదాపు 300 కోట్ల మార్కులను అజమాయిషీ చేస్తుంది; అది ప్రష్యన్ ప్రభుత్వ రైల్వే అడ్మినిస్ట్రేషన్‌కు సమాంతరంగా, పాత ప్రపంచంలో కెల్ల పెద్దదీ, అత్యంత వికేంద్రీకృతమూ అయిన పెట్టుబడి సంచయంగా వుంది."*

"అనుబంధ" బాంకుల ప్రస్తావనను నేను యెందుకు నొక్కిచెప్పినానంటే, అది ఆధునిక పెట్టుబడిదారీ సాంద్రీకరణయొక్క అత్యంత ముఖ్యమైన విలక్షణ గుణాలలో ఒకటి. పెద్ద సంస్థలు, ముఖ్యంగా బాంకులు, చిన్నవాటిని పూర్తిగా లీనం చేసుకోవడమే కాక, వాటి పెట్టుబడిలో "హోల్డింగులు" సంపాయించడం ద్వారా, షేర్లను కొనడం, లేక సాటా చేసుకోవడం ద్వారా, ఖాతాల వ్యవస్థ ద్వారా, వగైరా, వగైరాల ద్వారా వాటిని "కలుపుకుంటాయి," లోబరచుకుంటాయి, "సొంత" బృందంలోకి, లేదా (సాంకేతిక పదం ఉపయోగించాలంటే) "కన్సర్న్"లోకి తెచ్చుకుంటాయి. ప్రొఫెసర్ లీఫ్మన్ ఆధునిక "హోల్డింగు ఫైనాన్స్ కంపెనీల"ను వర్ణించే సుమారు 500 పేజీల పెద్ద గ్రంథం రాసినాడు;** దురదృష్టవశాత్తు అతను తరుచుగా జీర్ణం చేసుకోని సమాచారానికి చాలా సందేహాస్పదమైన "సిద్ధాంత" అభిప్రాయాలు జోడించినాడు. యీ "హోల్డింగు" వ్యవస్థ సాంద్రీకరణ విషయంలో యే ఫలితాలకు దారితీసేదీ పెద్ద జర్మన్ బాంకుల గురించి, స్వయంగా బాంకర్ అయిన రీసర్ రాసిన పుస్తకంలో అత్యుత్తమంగా నిరూపించబడింది. కానీ, అతని సమాచారాన్ని పరీక్షించే ముందు, "హోల్డింగు" వ్యవస్థకు ఒక నిర్దిష్ట ఉదాహరణ యివ్వనివ్వండి.

---

* *Grundriß der Sozialökonomik* ("సాంఘిక అర్థశాస్త్రంయొక్క పునాదులు")లో Schulze-Gaevernitz, *Die deutsche Kreditbank* ("జర్మన్ క్రెడిట్ బాంక్"), Tüb., 1915, SS. 12, 137.

** R. Liefmann, పూర్వోక్త గ్రంథం, పేజి 212.

''డోయిచె బాంక్'' ''బృందం'' పెద్ద బాంకింగు బృందాలలో అన్నిటికంటె పెద్దది కాకపోయినా, అన్నిటికంటె పెద్దవాటిలో ఒకటి. యీ బృందంలోని అన్ని బాంకులనూ లంకించే ప్రధాన దారాలను గుర్తుపట్టడానికి, మొదటి, రెండవ, మూడవ స్థాయి హోల్డింగుల మధ్యగల భేదాన్ని, లేదా అదే అర్థంగల వేరు మాటల్లో చెప్పాలంటే, (''డోయిచె బాంక్'' యెడల చిన్న బాంకుల) మొదటి, రెండవ, మూడవ స్థాయి పరాధీనతల మధ్యగల భేదాన్ని, గమనించాలి. అప్పుడు మనకీ కింది చిత్రం లభిస్తుంది:*

| | | ప్రత్యక్ష, లేక మొదటి స్థాయి పరాధీనత | రెండవ స్థాయి పరాధీనత | మూడవ స్థాయి పరాధీనత |
|---|---|---|---|---|
| ''డోయిచె బాంక్''కు హోల్డింగులు యిలా వున్నాయి: | శాశ్వతంగా | 17 యితర బాంకులలో | 17లో 9కి 34 యితర బాంకులలో హోల్డింగులు వున్నాయి | 9లో 4కు 7 యితర బాంకులలో హోల్డింగులు వున్నాయి |
| | అనిశ్చిత కాలంపాటు | 5 యితర బాంకులలో | — | — |
| | అప్పుడప్పుడు | 8 యితర బాంకులలో | 8లో 5కు 14 యితర బాంకులలో హోల్డింగులు వున్నాయి | 5లో 2కి 2 యితర బాంకులలో హోల్డింగులు వున్నాయి |
| | మొత్తం | 30 యితర బాంకులలో | 30లో 14కు 48 యితర బాంకులలో హోల్డింగులు వున్నాయి | 14లో 6కు 9 యితర బాంకులలో హోల్డింగులు వున్నాయి |

* Alfred Lansburgh, *Das Beteiligungssystem im deutschen Bankwesen*, "Die Bank" (''జర్మన్ బాంకింగు హోల్డింగు వ్యవస్థ,'' ''ది బాంక్''), 1910, 1, పేజి 500.

"మొదటి స్థాయి" పరాధీనతతో "అప్పుడప్పుడు" "డోయిచె బాంక్"మీద ఆధారపడే యెనిమిది బాంకులలో మూడు విదేశ బాంకులు వున్నాయి: ఒక ఆస్ట్రియన్ బాంకీ ("The Wiener Bankverein"), రెండు రష్యన్ బాంకులూ (సైబీరియన్ కమర్షియల్ బాంకీ, రష్యన్ విదేశ వాణిజ్య బాంకీ). మొత్తంమీద, "డోయిచె బాంక్" బృందంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, పాక్షికంగానూ, పూర్తిగానూ 87 బాంకులు వున్నాయి; మొత్తం పెట్టుబడి – దాని సొంతదీ, అది అజమాయిషీ చేసే యితరవాటిదీ రెండు వందల కోట్ల మార్కులకూ, మూడు వందల కోట్ల మార్కులకూ మధ్యన వున్నట్లు అంచనా వేయబడింది.

అలాంటి బృందానికి ఆధిపత్యం వహిస్తూ, ప్రభుత్వ రుణాలు ప్రారంభించడం లాంటి అసాధారణంగా పెద్దవైన, లాభదాయకమైన ఫైనాన్షల్ చర్యలు నడపడానికి తనకంటె కొద్దిగా మాత్రమే చిన్నవైన అరడజన్ యితర బాంకులతో ఒప్పందం చేసుకునే బాంకి యిప్పటికే "దళారీ" పాత్రను అధిగమించి, కొద్దిమంది గుత్తాధిపతుల సంఘం అయిందనేది తేటతెల్లం.

19వ శతాబ్ది అంతంలోనూ 20వ శతాబ్ది ప్రారంభంలోనూ జర్మనీలో బాంకింగు సాంద్రీకరణ యెంత వేగంగా జరిగిందీ రీసర్‌నుండి సంక్షిప్త రూపంలో నేను ఉల్లేఖిస్తున్న యీకింది సమాచారంవల్ల తెలుస్తుంది:

| ఆరు పెద్ద బెర్లిన్ బాంకులు | | | | |
|---|---|---|---|---|
| సంవత్సరం | జర్మనీలో శాఖలు | డిపాజిట్ బాంకులూ, మారకం ఆఫీసులూ | జర్మన్ జాయింటు స్టాక్ బాంకులలో నిత్య హోల్డింగులు | మొత్తం సంస్థలు |
| 1895 | 16 | 14 | 1 | 42 |
| 1900 | 21 | 40 | 8 | 80 |
| 1911 | 104 | 276 | 63 | 450 |

మొత్తం దేశాన్ని ఆవరిస్తూ, సమస్త పెట్టుబడినీ, సకల ఆదాయాలనూ కేంద్రీకరిస్తూ, చెల్లాచెదరుగా వున్న వేనవేల ఆర్థిక సంస్థలను యేకైక జాతీయ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగానూ, తరువాత ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగానూ మార్చే

వాహికల గాఢ సమాహారంయొక్క సత్వర విస్తరణ మనకు కనపడుతుంది. యీనాటి బూర్జువా ఆర్థిక వ్యవస్థకు వ్యాఖ్యాత అయిన షుల్జె-గేవెర్నిట్జ్ యింతకుముందు ఉల్లేఖించిన ఖండికలో చెప్పిన వికేంద్రీకరణకు నిజమైన అర్థం యేమిటంటే, యింతకుముందు సాపేక్షంగా "స్వతంత్రంగా" వుండిన, లేదా కచ్చితంగా స్థానికమైన ఆర్థిక సంస్థలు అంతకంతకూ యెక్కువ సంఖ్యలో ఒకేఒక కేంద్రానికి లోబడడం. వాస్తవానికి యిది కేంద్రీకరణ, గుత్త మహాకాయుల పాత్రా, ప్రాముఖ్యమూ, శక్తీ పెరగడం.

పాత పెట్టుబడిదారీ దేశాలలో యీ "బాంకింగు సమాహారం" యింకా గాఢంగా వుంది. గ్రేట్ బ్రిటన్, ఐర్లండులలో, 1910లో బాంకుల శాఖలు మొత్తం 7,151 వుండినాయి. నాలుగు పెద్ద బాంకులకు తలా 400 శాఖలకుపైగా (447నుండి 689 దాకా) వుండినాయి; నాలుగింటికి తలా 200 శాఖలకుపైగా వుండినాయి; పదకొండింటికి తలా 100కిపైగా వుండినాయి.

ఫ్రాన్సులో మూడు చాలా పెద్ద బాంకులు, "Crédit Lyonnais," "Comptoir National," "Société Générale"* అనేవి, యీకింది విధంగా తమ చర్యలనూ, తమ శాఖల సమాహారాన్నీ విస్తృతపరచినాయి:**

| | శాఖల, ఆఫీసుల సంఖ్య | | | పెట్టుబడి (లక్షల ఫ్రాంకులు) | |
|---|---|---|---|---|---|
| | రాష్ట్రాలలో | పారిస్‌లో | మొత్తం | సొంత పెట్టుబడి | పెట్టుబడిగా ఉపయోగించబడిన డిపాజిట్లు |
| 1870 | 47 | 17 | 64 | 2,000 | 4,270 |
| 1890 | 192 | 66 | 258 | 2,650 | 12,450 |
| 1909 | 1,033 | 196 | 1,229 | 8,870 | 43,630 |

* "లియొన్ క్రెడిట్," "జాతీయ అకౌంటింగ్ కంపెనీ," "ప్రధాన సంఘం." – సం.

** Eugen Kaufmann, *Das französische Bankwesen* ("ఫ్రాన్సులోని బాంకింగు"), Tüb., 1911, SS. 356, 362.

ఒక పెద్ద ఆధునిక బాంకియొక్క "లంకెల"ను చూపడానికి రీసర్ జర్మనీలోనూ, ప్రపంచంలోనూ అత్యంత పెద్ద బాంకులలో ఒకటైన "డిస్కాంటొ గెసెల్‌షాఫ్ట్" ("Disconto-Gesellschaft") (1914లో దాని పెట్టుబడి 30 కోట్ల మార్కులు) పంపిన, అందుకున్న ఉత్తరాల సంఖ్యకు సంబంధించిన యీకింది అంకెలు యిస్తాడు:

| | అందిన ఉత్తరాలు | పంపిన ఉత్తరాలు |
|---|---|---|
| 1852 | 6,135 | 6,292 |
| 1870 | 85,800 | 87,513 |
| 1900 | 533,102 | 626,043 |

"లియోన్ క్రెడిట్" అనే పెద్ద పారిస్ బాంకియొక్క ఖాతాల సంఖ్య 1875లోని 28,535నుండి 1912లోని 6,33,539కి పెరిగింది.*

పెట్టుబడి సాంద్రీకరణా, బాంకి టర్నోవర్ పెరుగుదలా బాంకుల ప్రాముఖ్యాన్ని యెలా మౌలికంగా మారుస్తున్నదీ దీర్ఘ వివరణలకంటె యీ సూక్ష్మమైన అంకెలు బహుశా బాగా తెలియజేస్తాయి. చెల్లాచెదరుగా వున్న పెట్టుబడిదార్లు ఒకేఒక సమష్టి పెట్టుబడిదారుగా మారినారు. కొద్దిమంది పెట్టుబడిదార్ల కరెంట్ అకౌంట్లను నిర్వహించేటప్పుడు, ఒక బాంకి శుద్ధ సాంకేతిక, కేవల సహాయక చర్య నిర్వహిస్తున్నదని అనవచ్చు. కానీ, యీ చర్య బ్రహ్మాండమైన ప్రమాణాలకు పెరిగినప్పుడు, కొద్దిమంది గుత్తాధిపతులు మొత్తం పెట్టుబడిదారీ సమాజపు వాణిజ్య, పారిశ్రామిక చర్యల నన్నిటినీ తమ యిచ్ఛకు లోబరుచుకోవడం మనకు కనపడుతుంది; వాళ్లు — తమ బాంకింగు లంకెల ద్వారా, తమ కరెంట్ అకౌంట్ల ద్వారా, యితర ఫైనాన్షల్ చర్యల ద్వారా — మొదట, వివిధ పెట్టుబడిదార్ల ఫైనాన్షల్ స్థితిని కచ్చితంగా తెలుసుకోడానికీ, తరువాత వాళ్లను అజమాయిషీ చేయడానికీ, అనగా ఖాతాలను పరిమితపరచడం, విస్తృతపరచడం, సుకరం చేయడం, ఆటంకపరచడం ద్వారా వాటిని ప్రభావితం చేయడానికీ, చివరన వాళ్ల భవితవ్యాన్ని పూర్తిగా నిర్ణయించడానికీ, అనగా వాళ్ల ఆదాయాన్ని నిర్ణయించడానికీ, వాళ్లకు పెట్టుబడి లేకుండా

---

* Jean Lescure, *L'épargne en France* ("ఫ్రాన్సులో సేవింగ్స్"), P., 1914, p. 52.

చేయడానికీ, లేదా వాళ్ల పెట్టుబడిని వేగంగానూ, అపారమైన ప్రమాణాలకూ పెంచుకోనివ్వడానికీ, వగైరాలకు సమర్థులౌతారు.

బెర్లిన్ బాంకి "డిస్కాంటొ గెసెల్‌షాఫ్ట్"యొక్క 30 కోట్ల మార్కుల పెట్టుబడిని నేను యిప్పుడే ప్రస్తావించినాను. బాంకియొక్క యీ పెట్టుబడి పెరుగుదల అన్నిటి కంటె పెద్ద బెర్లిన్ బాంకులలో రెండిటి మధ్య — "డోయిచె బాంక్," "డిస్కాంటొ గెసెల్‌షాఫ్ట్"ల మధ్య — ఆధిపత్యంకొరకు జరిగిన పోరాటంలోని ఘటనలలో ఒకటి. 1870లో మొదటిది యింకా కొత్తది; దానికి 150 లక్షల మార్కుల పెట్టుబడి మాత్రమే వుండింది, రెండవదానికి 3 కోట్ల మార్కుల పెట్టుబడి వుండింది. 1908లో మొదటి దానికి 20 కోట్లూ, రెండవదానికి 17 కోట్లూ పెట్టుబడి వుంది. 1914లో మొదటిది తన పెట్టుబడిని 25 కోట్లకు పెంచుకోగా, రెండవది మరొక ప్రథమ శ్రేణి పెద్ద బాంకితో, "షాఫ్‌హౌసెన్ షర్"తో, లీనమై, తన పెట్టుబడిని 30 కోట్లకు పెంచుకుంది. యిక, సహజంగానే, ఆధిపత్యంకొరకు జరిగిన యీ పోరాటం యీ రెండు బాంకుల మధ్య అంతకంతకూ తరుచుగా జరిగిన అంతకంతకూ స్థిరమైన "ఒప్పందాల"తోపాటు సాగింది. అత్యంత మితవాదపుదీ, వెనుక ముందులు చూసుకునేదీ అయిన బూర్జువా సంస్కరణవాదపు హద్దులను యేమాత్రమూ దాటని దృక్పథంనుండి ఆర్థిక సమస్యలను పరిగణించే బాంకింగు నిపుణులమీద యీ ఘటన బలవంతంగా రుద్దే నిర్ణయాలు యీకిందివి:

"డిస్కాంటొ గెసెల్‌షాఫ్ట్" పెట్టుబడి 30 కోట్ల మార్కులకు పెరగడంమీద వ్యాఖ్యానిస్తూ జర్మన్ పత్రిక "ది బాంక్" యిలా రాసింది: "యితర బాంకులు యిదే మార్గాన్ని అనుసరిస్తాయి, యీనాడు జర్మనీని ఆర్థికంగా పరిపాలించే మున్నూరుమంది మనుషులు కొంత కాలానికి క్రమక్రమంగా యాభైమందికీ, యిరవై అయిదుమందికీ, లేదా యింకా తక్కువకూ తగ్గుతారు. సాంద్రీకరణవైపు జరిగే యీ తాజా చర్య బాంకింగుకు పరిమితమౌతుందని ఊహించలేము. విడివిడి బాంకుల మధ్య వున్న సన్నిహిత సంబంధాలు పారిశ్రామిక సిండికేట్ల సమ్మేళనానికి, యీ బాంకులు అభిమానించేదానికి, సహజంగా దారితీస్తాయి.... ఒక శుభోదయాన నిద్రలేచేసరికి ఆశ్చర్యకరంగా మన కనులముందు ట్రస్టులు తప్ప యేమీ కనపడవు, సొంత గుత్తసంస్థల స్థానంలో ప్రభుత్వ గుత్తసంస్థలను పెట్టే అవసరం మనకు యెదురౌతుంది. అయినప్పటికీ, మనల్ని మనం నిందించుకోవలసిందేమీ లేదు, కాకపోతే, పరిస్థితులు షేర్ల పితలాటకంచేత కొద్దిగా త్వరపరచబడి తమ మార్గం తాము అనుసరించడానికి మనం అనుమతించినామనేది తప్ప."*

---

* A. Lansburgh, *Die Bank mit den 300 Millionen*, "Die Bank" ("30 కోట్లుగల బాంకి," "ది బాంక్"), 1914, 1, S. 426.

బూర్జువా జర్నలిజంయొక్క నిర్వీర్యతకు యిది ఉదాహరణ; బూర్జువా జర్నలిజంకూ, బూర్జువా శాస్త్రవిజ్ఞానానికీ గల ఒకేఒక భేదం యేమిటంటే, రెండవది తక్కువ చిత్త శుద్ధి గలిగి, విషయంయొక్క సారాన్ని మరుగుపరచడానికి, చెట్ల చాటున అరణ్యాన్ని దాచి పెట్టడానికి, ప్రయత్నిస్తుంది. సాంద్రీకరణ ఫలితాలకు "ఆశ్చర్యపడడం," పెట్టుబడిదారీ జర్మన్ ప్రభుత్వాన్ని, లేక పెట్టుబడిదారీ "సమాజాన్ని" ("మనల్ని") నిందించడం, జర్మన్ కార్టెల్ నిపుణుడు చిర్స్కి అమెరికన్ ట్రస్టులకు భయపడి, జర్మన్ కార్టెళ్ల "ట్రస్టులలాగ సాంకేతిక, ఆర్థిక పురోగతిని మితిమీరి త్వరపరచకపోవచ్చు"*ననే కారణాలతో జర్మన్ కార్టెళ్లను అభిమానించినట్లే, స్టాకులనూ, షేర్లనూ ప్రవేశపెట్టడం సాంద్రీకరణను "త్వరపరచ"వచ్చునని భయపడడం — యిదంతా నిర్వీర్యతకు చిహ్నం కాదా?

కానీ యధార్థాలు యధార్థాలుగానే వుంటాయి. జర్మనీలో ట్రస్టులు లేవు, కార్టెళ్ల "మాత్రం" వున్నాయి, కానీ జర్మనీ మూడు వందలమందికంటె యెక్కువ కాని పెట్టుబడి ప్రభువులచేత పరిపాలింపబడుతోంది. వీళ్ల సంఖ్య నిత్యం తగ్గుతోంది. యేమైనప్పటికీ, బాంకులు అన్ని పెట్టుబడిదారీ దేశాలలోనూ, వాటి బాంకింగు చట్టాలలో యెన్ని భేదాలు వున్నా, పెట్టుబడి సాంద్రీకరణ, గుత్తసంస్థల ఏర్పాటు క్రమాన్ని చాలా తీవ్రపరచి, త్వరపరుస్తాయి.

"బాంకింగు వ్యవస్థకు నిజంగా, సామాజిక ప్రమాణంలో ఉత్పత్తి సాధనాల సార్వత్రిక లెక్కాచారంయొక్క, పంపకంయొక్క రూపం వుంది, కానీ రూపం ఒక్కటే" అని అర్ధశతాబ్ది క్రితం మార్క్సు "పెట్టుబడి"లో రాసినాడు (రష్యన్ అనువాదం, సంపుటం III, భాగం II, పేజి 144). బాంకి పెట్టుబడి పెరుగుదలమీదా, అన్నిటికంటె పెద్ద బాంకుల శాఖల, ఆఫీసుల సంఖ్యావృద్ధిమీదా, వాటి ఖాతాల సంఖ్యావృద్ధి, వగైరాలమీదా నేను పైన ఉల్లేఖించిన అంకెలు మొత్తం పెట్టుబడిదారీ వర్గపు యీ "సార్వత్రిక లెక్కాచార"పు నిర్దిష్ట చిత్రాన్ని సమర్పిస్తాయి; పెట్టుబడిదార్లది మాత్రమే కాదు, యెందుకంటే, బాంకులు, తాత్కాలికంగానే అయినా, రకరకాల ఆదాయాలను ప్రోగుచేస్తాయి — చిన్న వ్యాపారస్తులవీ, ఆఫీసు గుమాస్తాలవీ, కార్మికవర్గంలోని చిన్న పైపొరవీ. "ఉత్పత్తి సాధనాల సార్వత్రిక పంపకం" — అదీ, లాంఛనప్రాయంగా ఆధునిక బాంకులనుండి పెరిగేది; యీ బాంకులు, ఫ్రాన్సులో సుమారు మూడునుండి ఆరుదాకానూ, జర్మనీలో ఆరునుండి యెనిమిది దాకానూ వున్న అత్యంత పెద్దవి, కోటానుకోట్ల డబ్బును అజమాయిషీ చేస్తున్నాయి. కానీ, సారంలో, ఉత్పత్తి సాధనాల పంపకం యేమాత్రమూ "సార్వత్రికం" కాదు, ప్రైవే

* S. Tschierschky, పూర్వోక్త గ్రంథం, పేజి 128.

టుగా వుంది, అనగా అది బడా పెట్టుబడి ప్రయోజనాలకు అనుగుణంగా వుంది, ప్రధానంగా బ్రహ్మాండమైన గుత్త పెట్టుబడికి – జనాలు లేమిడిలో బతుకుతూ, వ్యవసాయి అభివృద్ధి యావత్తూ దరిద్రంగా పారిశ్రామిక అభివృద్ధికంటె వెనుకబడి వుంటూ, "భారీ పరిశ్రమలు" యితర పరిశ్రమల శాఖలనుండి కప్పం గుంజుకునే పరిస్థితులలో పనిచేసే గుత్త పెట్టుబడికి.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సామాజికీకరించడంలో సేవింగ్సు బాంకులూ, పోస్టాఫీసులూ బాంకులతో పోటీపడడం ప్రారంభిస్తున్నాయి; యివి యెక్కువ "వికేంద్రీకృత" మైనాయి; అనగా వాటి ప్రభావం యింకా యెక్కువ చోట్లకూ, మరింత మారుమూల స్థలాలకూ, ప్రజానీకంలో మరింత విస్తృత విభాగాలకూ విస్తరిస్తున్నది. బాంకులలోనూ, సేవింగ్సు బాంకులలోనూ డిపాజిట్ల తారతమ్య వృద్ధిమీద ఒక అమెరికన్ కమిషన్ సేకరించిన సమాచారం యిది:*

| పెట్టుబడులు (శత కోట్ల మార్కులు) | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | బ్రిటన్ | | ఫ్రాన్సు | | జర్మనీ | | |
| | బాంకులు | సేవింగ్సు బాంకులు | బాంకులు | సేవింగ్సు బాంకులు | బాంకులు | క్రెడిట్ సొసైటీలు | సేవింగ్సు బాంకులు |
| 1880 | 8.4 | 1.6 | ? | 0.9 | 0.5 | 0.4 | 2.6 |
| 1888 | 12.4 | 2.0 | 1.5 | 2.1 | 1.1 | 0.4 | 4.5 |
| 1908 | 23.2 | 4.2 | 3.7 | 4.2 | 7.1 | 2.2 | 13.9 |

సేవింగ్సు బాంకులు డిపాజిట్లమీద 4 శాతం, $4^1/_4$ శాతం వడ్డీ చెల్లిస్తాయి గనుక, అవి తమ పెట్టుబడిని "లాభదాయకంగా" పెట్టడానికి ప్రయత్నించాలి, అవి బిల్లులు, తనఖాలు, వగైరాలతో వ్యవహరించాలి. బాంకులకూ, సేవింగ్సు బాంకులకూ మధ్య సరి

* "Die Bank"లో అమెరికన్ *Statistics of the National Monetary Commission* ("జాతీయ ద్రవ్య కమిషన్ గణాంక లెక్కలు," "ది బాంక్"లో ఉల్లేఖించబడిన సమాచారం), 1910, 2, పేజి 1200.

హద్దులు "అంతకంతకూ చెరిగిపోతాయి." బిల్లులు డిస్కౌంటు చేయడంలాంటి "శుద్ధ" బాంకింగు లావాదేవీలు చేయకుండా సేవింగ్సు బాంకులను "నిషేధించా"లని ఉదాహరణకు బోకుమ్, ఏర్‌ఫుర్ట్ వాణిజ్య మండలులు డిమాండు చేస్తున్నాయి; పోస్టాఫీసుయొక్క "బాంకింగు" చర్యలను పరిమితపరచాలని అవి డిమాండు చేస్తున్నాయి.* ప్రభుత్వ గుత్తాధిపత్యం ఊహించని చోటునుండి దొంగచాటుగా తమమీద పడుతుందని బాంకింగు ప్రభువులు భయపడినట్లుంది. అయినా, యిది ఒకే ఆఫీసులోని రెండు డిపార్టుమెంటుల మేనేజర్ల మధ్య గల పోటీలాంటిదాని వ్యక్తీకరణ తప్ప మరేమీ కాదని చెప్పనక్కర లేదు. యెందుకంటే, ఒకవైపున, సేవింగ్సు బాంకులకు అప్పగించబడిన కోట్లు అంతిమ పరిశీలనలో యిదే బాంకి పెట్టుబడి ప్రభువులచేతనే అజమాయిషీ చేయబడుతాయి, మరొకవైపున, పెట్టుబడిదారీ సమాజంలో ప్రభుత్వ గుత్తాధిపత్యం అనేది యేదో ఒక పరిశ్రమ శాఖలో దివాలా తీయడానికి సిద్ధంగా వున్న కోటీశ్వరుల ఆదాయాన్ని పెంచడానికీ, ఆదాయానికి హామీ యివ్వడానికీ సాధనం మాత్రమే.

స్వేచ్ఛాయుత పోటీ ఆధిపత్యం వహించిన పాత రకం పెట్టుబడిదారీ విధానంనుండి గుత్తాధిపత్యం రాజ్యంచేసే కొత్త పెట్టుబడిదారీ విధానానికి జరిగిన మార్పు, యితరవాటితోపాటు, స్టాక్ యెక్స్చేంజి ప్రాముఖ్యపు తగ్గుదలచేత వ్యక్తీకరింపబడుతుంది. "ది బాంక్" పత్రిక యిలా రాస్తుంది: "యింతకు మునుపు బాంకులు కొత్తగా జారీ అయిన షేర్లలో అత్యధిక భాగాన్ని తమ ఖాతాదార్లకు అప్పగించలేనప్పుడు అవిసర్జనీయమైన పంపిణీ వాహికగా వుండిన స్టాక్ యెక్స్చేంజి అలా వుండడం యెప్పుడో ఆగిపోయింది."**

"'ప్రతి బాంకీ ఒక స్టాక్ యెక్స్చేంజీ'; బాంకి పెద్దదిగా వుండే కొద్దీ, బాంకింగు సాంద్రీకరణ విజయవంతంగా వుండే కొద్దీ, యీ ఆధునిక నానుడి మరింత సత్యంగా ధ్వనిస్తుంది."*** "మునుపు, డెబ్బైలలో, స్టాక్ యెక్స్చేంజి యువ్వనోత్సేకంతో పొంగిపోయి" (1873 నాటి స్టాక్ ఎక్స్చేంజి దివాళాకీ,[138] కంపెనీల స్థాపన కుంభకోణాలకూ,[139] వగైరాలకు "గూఢ" ప్రస్తావన), "జర్మనీయొక్క పారిశ్రామికీకరణ యుగాన్ని ప్రారంభించగా, యిప్పుడు బాంకులూ, పరిశ్రమలూ 'తామే ఆ పనిని నిర్వహించ'గలుగుతున్నాయి.

---

* "Die Bank"లో సమాచారం, 1913, పేజీలు 811, 1022; 1914, పేజి 713.

** "Die Bank," 1914, 1, పేజి 316.

*** Dr. Oscar Stillich, *Geld- und Bankwesen* ("డబ్బూ, బాంకింగూ"), Berlin, 1907, S. 169.

స్టాక్ యెక్స్చేంజిమీద మన పెద్ద బాంకుల ఆధిపత్యం... పూర్తిగా సంఘటితమైన జర్మన్ పారిశ్రామిక రాజ్యంయొక్క వ్యక్తీకరణ తప్ప మరేమీ కాదు. తమంతకు తామే పనిచేసే ఆర్థిక నియమాల హద్దులు యీవిధంగా పరిమితపరచబడినాయంటే, బాంకుల చైతన్యపూరిత నియంత్రణ హద్దులు గణనీయంగా విస్తృతమైనాయంటే, కొద్దిమంది మార్గదర్శకుల జాతీయ ఆర్థిక బాధ్యత అపారంగా పెరిగింది'' అని జర్మన్ ప్రొఫెసర్ షుల్జె-గేవెర్నిట్జ్ రాసినాడు* — జర్మన్ సామ్రాజ్యవాదపు సమర్థకుడూ, సకల దేశాల సామ్రాజ్యవాదులచేతా ప్రామాణికుడుగా పరిగణింపబడేవాడూ, బాంకులు ఆర్థిక జీవితాన్ని "చైతన్యపూరిత నియంత్రణ'' చేయడం కొద్దిమంది "పూర్తిగా సంఘటితమైన'' గుత్తాధిపతులు ప్రజలను పిండడంలో వుందనే "కేవల వివరా''న్ని దాటవేయడానికి ప్రయత్నించేవాడూ అయిన షుల్జె-గేవెర్నిట్జ్. బూర్జువా ప్రొఫెసర్ కర్తవ్యం మొత్తం యంత్రాంగాన్ని విప్పి చూపడం కాదు, బాంకి గుత్తాధిపతుల జిత్తుల నన్నిటినీ వెల్లడి చేయడం కాదు, వాటిని అనుకూలంగా చిత్రించడం.

అంతకంటె ప్రామాణిక అర్థశాస్త్రజ్ఞుడూ, స్వయంగా బాంకరూ అయిన రీసర్, అదే విధంగా, సందర్భరహితమైన మాటలు చెప్పి కాదనరాని వాస్తవాలను దాట వేస్తాడు: "...మొత్తం జాతీయ ఆర్థిక వ్యవస్థకూ, ప్రత్యేకంగా సెక్యూరిటీల పంపిణీకీ పరమ అవసరమైన లక్షణాన్ని స్టాక్ యెక్స్చేంజి స్థిరంగా కోల్పోతున్నది — తనవద్దకు చేరే ఆర్థిక చర్యలకు అత్యంత కచ్చితమైన కొలతబద్దగా వుండడమే కాక, దాదాపు స్వయంచలితమైన నియంత్రణకర్తగా కూడా వుండే లక్షణాన్ని.''**

మరొక విధంగా చెప్పాలంటే, పాత పెట్టుబడిదారీ విధానం, స్వేచ్ఛాయుత పోటీనీ, దాని అవిసర్జనీయమైన నియంత్రణకర్త స్టాక్ యెక్స్చేంజినీ గల పెట్టుబడిదారీ విధానం, గతిస్తున్నది. దాని స్థానంలోకి కొత్త పెట్టుబడిదారీ విధానం వస్తున్నది — స్వేచ్ఛాయుత పోటీ, గుత్తాధిపత్యమూ రెండూ కలిసిన యేదో తాత్కాలికమైనదాని స్పష్ట లక్షణాలు కలిగి. యీ ప్రశ్న సహజంగా ఉత్పన్న మౌతుంది: యీ కొత్త పెట్టుబడిదారీ వ్యవస్థ యేమిగా "అభివృద్ధి'' అవుతున్నది? కానీ బూర్జువా విద్వాంసులు యీ ప్రశ్నను యెత్తడానికి భయ పడుతారు.

"ముప్పై యేండ్ల క్రితం వ్యాపారస్తులు, ఒకరితో ఒకరు స్వేచ్ఛగా పోటీచేసుకుంటూ,

---

* Schulze-Gaevernitz, *Grundriß der Sozialökonomik*లో *Die deutsche Kreditbank*, Tüb., 1915, S. 101.

** రీసర్, పూర్వోక్త గ్రంథం, నాల్గవ ముద్రణ, పేజి 629.

తమ వ్యాపారానికి సంబంధించిన పనిలో, శరీర శ్రమ తప్ప తక్కినదానిలో, పదింట తొమ్మిది వంతులు చేసినారు. ప్రస్తుతం యీ 'ఆర్థిక మెదడు పని'లో పదింట తొమ్మిది వంతులు ఉద్యోగులు చేస్తున్నారు. బాంకింగు యీ పరిణామంలో అగ్రభాగాన వుంది."* షుల్జె-గేవెర్నిట్జ్ యీ ఒప్పదల మనల్ని మళ్లీ యీ ప్రశ్నవద్దకు తెస్తుంది: యీ కొత్త పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ విధానం, యేమిగా అభివృద్ధి అవుతున్నది?

సాంద్రీకరణ క్రమం ఫలితంగా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అగ్రభాగాన మిగిలిన కొద్ది బాంకులలో గుత్త ఒప్పందాలవైపు, బాంకి ట్రస్టువైపు అంతకంతకూ స్పష్టమైన ధోరణిని సహజంగా గమనించవచ్చు. అమెరికాలో తొమ్మిది కాదు, రెండు అతి పెద్ద బాంకులు, కోటీశ్వరులైన రాక్‌ఫెల్లర్‌కూ, మోర్గన్‌కూ చెందినవి, పదకొండునూర్ల కోట్ల మార్కుల పెట్టుబడిపై అజమాయిషీ చేస్తున్నాయి.** జర్మనీలో "షాఫ్‌హౌసెన్ షర్ బాంక్‌వెరైన్"ను "డిస్కాంటో గెసెల్‌షాఫ్ట్" లీనం చేసుకోవడంమీద, నేను పైన ప్రస్తావించినదానిమీద, స్టాక్ యెక్స్చేంజి ప్రయోజనాల పత్రిక అయిన "Frankfurter Zeitung"[140] యీకింది విధంగా వ్యాఖ్యానించింది:

"బాంకుల సాంద్రీకరణ పెరిగే కొద్దీ యే సంస్థలనుండి ఋణాలు పొందడానికి వీలుందో ఆ సంస్థల బృందాన్ని కుదిస్తున్నది, పర్యవసానంగా స్వల్ప సంఖ్యలో వున్న బాంకింగు బృందాల మీద పెద్ద పరిశ్రమలు ఆధారపడడాన్ని యెక్కువ చేస్తున్నది. పరిశ్రమలకూ, ఫైనాన్సల్ ప్రపంచానికీ మధ్యగల సన్నిహిత సంబంధం దృష్ట్యా, బాంకింగు పెట్టుబడి అవసరమైన పారిశ్రామిక కంపెనీల గమన స్వేచ్ఛ కుదించబడింది. యీ కారణంగా, బాంకుల ట్రస్టీకరణ యెక్కువ కావడాన్ని భారీ పరిశ్రమలు మిశ్రమ అనుభూతులతో గమనిస్తున్నాయి. నిజంగా, పోటీని తగ్గించే లక్ష్యంతో, విడివిడి పెద్ద బాంకింగు సంస్థల మధ్య కొన్ని ఒప్పందాల ప్రారంభాలు మనం పదేపదే చూసినాం."***

మళ్లీ మళ్లీ, బాంకింగు అభివృద్ధిలో చివరి మాట యేమిటంటే, గుత్తాధిపత్యం.

బాంకులకూ పరిశ్రమలకూ మధ్యగల సన్నిహిత సంబంధం గురించి చెప్పుకోవలసింది యేమిటంటే, సరిగ్గా యీ రంగంలోనే బాంకుల కొత్త పాత్ర బహుశా అత్యంత స్పష్టంగా వ్యక్త మయ్యేది. ఒక బాంకి ఒక ఫర్మకుగాను ఒక బిల్లు డిస్కాంటు చేయడం, కరెంటు

* Schulze-Gaevernitz, పూర్వోక్త గ్రంథం, పేజి 151.

** "Die Bank," 1912, 1, పేజి 435.

*** షుల్జె-గేవెర్నిట్జ్‌చేత *Grdr. d. S.-Oek.*లో ఉల్లేఖించబడింది, పేజి 155.

అకౌంటు ప్రారంభించడం, వగైరాలు చేసినప్పుడు, యీ చర్యలు, విడివిడిగా తీసుకుంటే, దాని స్వాతంత్ర్యాన్ని యేమాత్రమూ తగ్గించవు, బాంకి చిన్న దళారి పాత్ర తప్ప మరే పాత్రా నిర్వహించడం లేదు. కానీ, అలాంటి చర్యలు పెరిగి పెరిగి సుప్రతిష్ఠిత ఆచారం అయినప్పుడు, బాంకి తన సొంత చేతుల్లో అపారమైన పెట్టుబడి మొత్తాలను "ప్రోగు చేసి"నప్పుడు, ఒక ఫర్మ్కుగాను కరెంటు అకౌంటు నడపడం ద్వారా ఆ బాంకికి తన ఖాతాదారుని ఆర్థిక స్థితిని గురించి మరింత సంపూర్ణమైన, మరింత సవివరమైన సమాచారం సంపాయించే సామర్థ్యం కలిగినప్పుడు — జరిగేది అంతే — అప్పుడు ఫలితం యేమిటంటే, పారిశ్రామిక పెట్టుబడిదారుడు మరింత పూర్తిగా బాంకికి అధీనుడౌతాడు.

అదే సమయంలో, బాంకులకూ, అత్యంత పెద్ద పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకూ మధ్య వ్యక్తిగత లంకెలాంటిది నెలకొల్పబడుతుంది — షేర్లు స్వాయత్తం చేసుకోవడం ద్వారా, పారిశ్రామిక, వాణిజ్య సంస్థల సూపర్వైజరీ బోర్డులకు (లేదా డైరెక్టర్ల బోర్డులకు) బాంకి డైరెక్టర్లనూ, వాటి డైరెక్టర్లను వీటి బోర్డులకూ నియమించడం ద్వారా ఒకదానితో ఒకటి లీనం కావడం. పెట్టుబడియొక్కా, వ్యాపారసంస్థలయొక్కా యీ రూపపు సాంద్రీకరణమీద జర్మన్ అర్థశాస్త్రజ్ఞుడు ఎయ్‌డెల్స్ అత్యంత వివరమైన సమాచారం పోగుచేసినాడు. అత్యంత పెద్ద బెర్లిన్ బాంకులలో ఆరింటికి తమ డైరెక్టర్ల ద్వారా 344 పారిశ్రామిక కంపెనీలలోనూ, తమ బోర్డు సభ్యుల ద్వారా 407 యితర పారిశ్రామిక కంపెనీలలోనూ, మొత్తం 751 కంపెనీలలో ప్రాతినిధ్యం వుండింది. యీ కంపెనీలలో 289లో ప్రతిదాని సూపర్వైజరీ బోర్డులోనూ యీ బాంకులకు యిద్దరు ప్రతినిధులు గానీ, బోర్డు అధ్యక్షపదవి గానీ వుండింది. యీ పారిశ్రామిక, వాణిజ్య కంపెనీలు అత్యంత వివిధమైన పరిశ్రమల శాఖల్లో వున్నాయి: ఇన్సూరెన్స్, రవాణా, హోటళ్లూ, నాటకశాలలూ, కళా పరిశ్రమా, వగైరా. మరొకవైపున యీ ఆరు బాంకుల సూపర్వైజరీ బోర్డులలో (1910లో) అందరికంటె పెద్ద పారిశ్రామికులలో యాభై ఒక్కమంది వుండినారు; వాళ్లలో క్రుప్, శక్తివంతమైన "Hapag" (Hamburg–Amerika Line), వగైరా కంపెనీల డైరెక్టర్లు వుండినారు. 1895నుండి 1910వరకు యీ ఆరు బాంకులలో ప్రతిఒకటీ కొన్ని వందల (281నుండి 419దాకా) పారిశ్రామిక కంపెనీలు జారీచేసిన షేర్లలోనూ, బాండ్లలోనూ పాల్గొన్నాయి.*

బాంకులకూ, పరిశ్రమలకూ మధ్య గల "వ్యక్తిగత లంకె"కు అనుబంధంగా ఆ రెండిటికీ, ప్రభుత్వానికీ మధ్య "వ్యక్తిగత లంకె" వుంది. ఎయ్‌డెల్స్ యిలా రాస్తున్నాడు: "సూప

---

* ఎయ్‌డెల్స్, రీసర్, పూర్వోక్త గ్రంథాలు.

ర్వైజరీ బోర్డులలోని సీట్లు గొప్పవాళ్లకూ, మాజీ ప్రభుత్వ ఉద్యోగులకూ ధారాళంగా యివ్వబడతాయి; వాళ్లు అధికార్లతో సంబంధాలను సుకరం చేయడానికి (!!) చాలా తోడ్పడుతారు"... "మామూలుగా ఒక పెద్ద బాంకి సూపర్వైజరీ బోర్డులో ఒక పార్లమెంటు సభ్యుడు గానీ, బెర్లిన్ నగర కౌన్సిలర్ గానీ అయి వుంటాడు."

కనుక, పెద్ద పెట్టుబడిదారీ గుత్తసంస్థల నిర్మాణమూ, అభివృద్ధీ సకల "సహజ" మార్గాలలోనూ, "సహజాతీత" మార్గాలలోనూ పూర్తి వేగంతో పురోగమిస్తున్నాయని చెప్పవచ్చు. ఆధునిక పెట్టుబడిదారీ సమాజాన్ని పాలించే కొన్ని వందల ఫైనాన్స్ రాజులలో ఒక విధమైన శ్రమవిభజన పద్ధతి రూపొందుతోంది:

"కొందరు పెద్ద పారిశ్రామికుల కార్యకలాపాల రంగం విస్తరించడం" (బాంకుల బోర్డులలో చేరడం, వగైరా) "తోపాటు, రాష్ట్ర బాంకి మేనేజర్లను నిర్ణీత పారిశ్రామిక ప్రాంతాలకు కేటాయించడంతోపాటు, పెద్ద బాంకుల డైరెక్టర్లలో స్పెషలైజేషన్ పెరుగుతున్నది. సాధారణంగా, బాంకింగు విస్తృత ప్రమాణంలో వున్నప్పుడూ, ప్రత్యేకంగా దానికి పరిశ్రమలతో విస్తృత సంబంధాలు వున్నప్పుడూ మాత్రమే యీ స్పెషలైజేషన్ ఊహాకందుతుంది. యీ శ్రమవిభజన రెండు పద్ధతులలో సాగుతుంది: ఒకవైపున, మొత్తం పరిశ్రమలతో సంబంధాలు ఒక డైరెక్టర్‌కు, అతని ప్రత్యేక కర్తవ్యంగా, అప్పగించబడతాయి; మరొక వైపున, ప్రతి డైరెక్టరూ పలు విడివిడి సంస్థలమీద, లేదా ఒకే పరిశ్రమ శాఖలోని, లేక ఒకే విధమైన ప్రయోజనాలు గల సంస్థల బృందంమీద తనిఖీ స్వీకరిస్తాడు"... (విడివిడి సంస్థల సంఘటిత తనిఖీ దశకు పెట్టుబడిదారీ విధానం యిప్పటికే చేరుకుంది).... "ఒకడు జర్మన్ పరిశ్రమలలో స్పెషలైజేషన్ సంపాయిస్తాడు, ఒకోసారి పశ్చిమ జర్మన్ పరిశ్రమలలో మాత్రమే కూడా" (జర్మనీలో అత్యంత పారిశ్రామికీకృత భాగం పశ్చిమం); "యితరులు పరాయి రాజ్యాలతో, పరాయి పరిశ్రమలతో సంబంధాలూ, పారిశ్రామికులయొక్క, యితరుల యొక్క వ్యక్తిత్వాల సమాచారమూ, స్టాక్ యెక్స్‌చేంజి సమస్యలూ, వగైరాలలో స్పెషలైజేషన్ సంపాయిస్తారు. అంతే కాక, ప్రతి బాంకి డైరెక్టరుకూ తరుచుగా ఒక ప్రత్యేక ప్రాంతం గానీ, ఒక ప్రత్యేక పరిశ్రమ శాఖ గానీ అప్పగించబడుతుంది. ఒకడు ప్రధానంగా యెలెక్ట్రిక్ కంపెనీల సూపర్వైజరీ బోర్డులలో పనిచేస్తాడు, మరొకడు రసాయనిక, సారా, లేదా బీట్ చక్కెర కర్మాగారాలలో పనిచేస్తాడు, యింకొకడు కొద్దిపాటి యేకాకి పారిశ్రామిక సంస్థలలో పనిచేస్తాడు, కానీ అదే సమయంలో ఇన్సూరెన్స్ కంపెనీల సూపర్వైజరీ బోర్డులలో పనిచేస్తాడు.... టూకీగా చెప్పాలంటే, పెద్ద బాంకుల చర్యల పరిమాణంలోనూ, వైవిధ్యంలోనూ పెరుగుదల వెంట డైరెక్టర్లలో శ్రమవిభజన పెరుగుదల నిస్సందేహంగా వచ్చింది; దీని లక్ష్యం (ఫలితమూ) యేమిటంటే, వాళ్లను శుద్ధ బాంకింగునుండి కొద్దిగా

పైకెత్తడమూ, వాళ్లను మేలైన నిపుణులుగా, పరిశ్రమలయొక్క సాధారణ సమస్యల గురించీ, ప్రతి పరిశ్రమ శాఖయొక్క ప్రత్యేక సమస్యల గురించీ మేలైన తీర్పరులుగా చేయడమూ, తత్ఫలితంగా ఆ బాంకియొక్క పారిశ్రామిక పలుకుబడి రంగంలోపల పనిచేయడానికి వాళ్లను మరింత సమర్థులనుగా చేయడమూ. యీ పద్ధతికి తోడుగా పారిశ్రామికులూ, మాజీ ప్రభుత్వోద్యోగులూ, ముఖ్యంగా ముందు రైల్వేలోనూ, గనులలోనూ పనిచేసిన వాళ్లూ లాంటి పారిశ్రామిక వ్యవహారాల నిపుణులను తమ సూపర్వైజరీ బోర్డులకు యెన్నుకోడానికి బాంకులు ప్రయత్నిస్తాయి," వగైరా.*

ఫ్రెంచి బాంకింగులో యిదే పద్ధతి, కాస్త భిన్న రూపంలో, కనపడుతుంది. ఉదాహరణకు, మూడు అత్యంత పెద్ద ఫ్రెంచి బాంకులలో ఒకటైన "లియోన్ క్రెడిట్" ఒక "ఫైనాన్షల్ పరిశోధన శాఖ" (service des études financières) యేర్పాటు చేసింది. ఆ శాఖ యింజనీర్లనూ, గణాంక నిపుణులనూ, అర్థశాస్త్రజ్ఞులనూ, లాయర్లనూ, వగైరాలను యాభైమందికిపైగా శాశ్వతంగా వినియోగించుకుంటుంది. దీనికి యేడాదికి ఆరు, యేడు లక్షల ఫ్రాంకులు ఖర్చౌతుంది. యీ శాఖ మళ్లీ యెనిమిది ఉపశాఖలుగా విభజింపబడింది: ఒకటి పారిశ్రామిక సంస్థల సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేక కృషి చేస్తోంది, మరొకటి సాధారణ గణాంక లెక్కలు అధ్యయనం చేస్తుంది, మూడవది రైల్వే, స్టీమర్ కంపెనీలను, నాల్గవది సెక్యూరిటీలను, అయిదవది ఫైనాన్షల్ నివేదికలను, వగైరా, అధ్యయనం చేస్తాయి.**

ఫలితం యేమిటంటే, ఒకవైపున, బాంకి, పారిశ్రామిక పెట్టుబడుల నిత్యప్రవర్ధమాన సంలీనం, లేక ఎన్. ఐ. బుహారిన్ సముచితంగా అన్నట్లు, సంయోగం, మరొకవైపున, బాంకులు నిజంగా "సార్వత్రిక స్వభావం"గల సంస్థలుగా పెరగడం. యీ సమస్యమీద ఎయ్‌డెల్స్ ఉపయోగించిన కచ్చితమైన పదాలను ఉల్లేఖించడం అవసరం; అతను యీ విషయాన్ని అందరికంటె బాగా అధ్యయనం చేసినాడు:

"పారిశ్రామిక సంబంధాలన్నింటినీ పరిశీలిస్తే, పరిశ్రమల తరఫున పనిచేసే ఫైనాన్షల్ సంస్థల సార్వత్రిక స్వభావం వెల్లడౌతుంది. యితర రకాల బాంకులకు భిన్నంగానూ, తమ కాలికింది పట్టు జారిపోకుండా వుండడానికి బాంకులు ఒక్క రకం వ్యాపారంలో, లేదా ఒక్క పరిశ్రమ శాఖలో స్పెషలైజేషన్ చేయాలని సారస్వతంలో ఒకోసారి చేయబడే డిమాం

---

* ఎయ్‌డెల్స్, పూర్వోక్త గ్రంథం, పేజీలు 156–57.

** ఫ్రెంచి బాంకులమీద Eug. Kaufmann వ్యాసం, "Die Bank," 1909, 2, పేజి 851.

డుకు వ్యతిరేకంగానూ, పెద్ద బాంకులు పరిశ్రమల స్థానం విషయంలోనూ, శాఖల విషయం లోనూ పారిశ్రామిక సంస్థలతో తమ సంబంధాలను సాధ్యమైనంత వైవిధ్యపూరితం చేసు కోడానికి కృషి చేస్తున్నాయి, విడివిడి సంస్థల చారిత్రక అభివృద్ధి ఫలితంగా పరిశ్రమల స్థానాల లోనూ, శాఖలలోనూ యేర్పడిన పెట్టుబడి పంపిణీలోని అసమత్వాన్ని తొలగించడానికి కృషి చేస్తున్నాయి." "ఒక ధోరణి యేమిటంటే, పరిశ్రమలతో సంబంధాలను సాధారణం చేయడం; మరొక ధోరణి యేమిటంటే, వాటిని స్థిరంగా, సన్నిహితంగా చేయడం. ఆరు పెద్ద బాంకుల లోనూ యీ ఉభయ ధోరణులూ అమలులో పెట్టబడినాయి, పూర్తిగా కాదు, కానీ గణ నీయమైన మేరకు, ఒక సమాన స్థాయిలో."

బాంకుల "టెరరిజం" గురించి తరుచుగా పారిశ్రామిక, వాణిజ్య బృందాలు ఫిర్యా దులు చేస్తాయి. అలాంటి ఫిర్యాదులు వినపడడం ఆశ్చర్యకరం కాదు, యెందుకంటే, కింది ఉదాహరణలో కనపడేటట్లు, పెద్ద బాంకులు "హుకుం యిస్తాయి." 1901 నవంబర్ 19న, బెర్లిన్ "డి" బాంకు లనబడే (నాలుగు అత్యంత పెద్ద బాంకుల పేర్లూ "డి" అనే అక్షరంతో మొదలౌతాయి) పెద్ద బాంకులలో ఒకటి "జర్మన్ మధ్య వాయవ్య సిమెంటు సిండికేట్" డైరెక్టర్ల బోర్డుకు యీకింది విధంగా రాసింది: "మీరు 18వ తేదీనాడు ఒకా నొక వార్తాపత్రికలో ప్రచురించిన నోటీసు ద్వారా మాకు అర్థమయ్యేదాన్నిబట్టి, యీనెల 30వ తేదీన జరగబోయే మీ సిండికేటుయొక్క వచ్చే సాధారణ సమావేశం మీ సంస్థలో మాకు అంగీకారయోగ్యం కాని మార్పులు చేసే అవకాశాన్ని మేము లెక్కలోకి తీసుకోక తప్పదు. యీ కారణాలవల్ల, మేము యింతకుముందు మీకు అనుమతించిన ఖాతాను యిప్పటి నుండి మేము ఉపసంహరించుకోవలసివున్నందుకు గాఢంగా విచారపడుతున్నాము.... కానీ, ఆ వచ్చే సాధారణ సమావేశం మాకు అంగీకారయోగ్యం కాని చర్యలను నిర్ణయించకపోతే, భవిష్యత్తును గురించి యీ విషయంమీద మాకు తగిన హామీలు అందితే, కొత్త ఖాతాను యిచ్చే విషయంమీద మీతో సంప్రదింపులు ప్రారంభించడానికి మేము సిద్ధంగా వుంటాము."*

వాస్తవంలో యిది పెద్ద పెట్టుబడి పీడన గురించి చిన్న పెట్టుబడి చేసే పాత ఫిర్యాదే, కానీ యీ సందర్భంలో మొత్తం ఒక సిండికేటే "చిన్న" పెట్టుబడి జాతిలో పడింది! చిన్న, పెద్ద పెట్టుబడి మధ్య వుండే పాత పోరాటం కొత్త, అమేయంగా ఉన్నతమైన అభివృద్ధి దశలో పునరుద్ధరింపబడుతున్నది. పెద్ద బాంకుల సంస్థలు, అనేక మిలియన్ల విలువగలవి, గతకాలపు సాధనాలతో పోల్చజాలని సాధనాలతో సాంకేతిక ప్రగతిని త్వర పరచగలవని స్పష్టం. ఉదాహరణకు బాంకులు ప్రత్యేక సాంకేతిక పరిశోధన సంఘాలు స్థాపి

* Dr. Oscar Stillich, పూర్వోక్త గ్రంథం, పేజి 147.

స్తాయి; సహజంగానే, వాటి కృషి ద్వారా "మిశ్రిత" పారిశ్రామిక సంస్థలు మాత్రమే లాభ పడతాయి. "యెలెక్ట్రిక్ రైల్వే పరిశోధన సంఘం," "కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిశోధన నిలయం" వగైరాలు యీ జాతికి చెందినవి.

జాతీయ ఆర్థిక వ్యవస్థలో నూతన పరిస్థితులు సృష్టింపబడుతున్నాయని పెద్ద బాంకుల డైరెక్టర్లే గమనించకుండా వుండలేరు; కానీ యీ ఘటనల ముందర వాళ్లు శక్తిహీనులు.

ఎయ్‌డెల్స్ యిలా రాస్తాడు: "పరిశ్రమల సాధారణ అభివృద్ధిలో పెద్ద బాంకుల చురుకైన జోక్యం అవసరమనీ, పెరుగుతున్న ప్రాముఖ్యం గలదనీ భావించేవాళ్ల చేతుల్లోకి అధికారం క్రమక్రమంగా పోతున్నదని పెద్ద బాంకుల డైరెక్టర్లలోనూ, సూపర్వైజరీ బోర్డుల సభ్యులలోనూ జరిగే మార్పులను యిటీవలి సంవత్సరాలలో గమనించేవాళ్లెవరైనా గుర్తించకుండా వుండలేరు. యీ కొత్తవాళ్లకూ, పాత బాంకి డైరెక్టర్లకూ మధ్య యీ విషయం మీద అభిప్రాయభేదాలు, తరుచుగా వ్యక్తిగత స్వభావంగలవి ఉత్పన్నమౌతున్నాయి. పరిశ్రమలలో యీ జోక్యం ద్వారా, రుణ సంస్థలుగా బాంకులు నష్టపడతాయా, నష్టపడవా, రుణం సమకూర్చడంలో తమ దళారి పాత్రతో యేమీ సంబంధం లేనిదీ, వర్తకపు యెగుడు దిగుడుల గుడ్డి శక్తులకు యెప్పుడూ లేనంతగా బాంకులను లోబరచే రంగంలోకి వాటిని తీసుకపోతున్నదీ అయిన కార్యకలాపాల రంగంలో నిమగ్నం కావడానికి బాంకులు పరీక్షల కాగిన సూత్రాలనూ, నమ్మకమైన లాభాన్నీ పరిత్యజిస్తున్నాయా అనేది సమస్య. ఔననేది పాత బాంకి డైరెక్టర్లలో చాలామంది అభిప్రాయం; కానీ, పెద్ద ఆధునిక పరిశ్రమలతోపాటు పెద్ద బాంకులనూ, ఆధునిక పారిశ్రామిక బాంకింగునూ ఉత్పన్నం చేసిన అవసరం యెంత గొప్పదో పరిశ్రమలలో చురుకైన జోక్యం అంత గొప్ప అవసరమని యువకులలో అత్యధికులు భావిస్తారు. ఒక్క విషయంమీద మాత్రమే యిరు పక్షాలకూ అంగీకారం వుంది: పెద్ద బాంకుల కొత్త కార్యకలాపాలలో స్థిరమైన సూత్రాలు గానీ, నిర్దిష్టమైన లక్ష్యం గానీ లేవనే విషయంమీద."*

పాత పెట్టుబడిదారీ విధానపు రోజులు పోయినాయి. కొత్త పెట్టుబడిదారీ విధానం దేనివైపో జరిగే పరివర్తనకు ప్రాతినిధ్యం వహిస్తుంది. గుత్త వ్యవస్థను స్వేచ్ఛాయుత పోటీతో "రాజీచేయడం"కొరకు "స్థిరమైన సూత్రాలనూ, నిర్దిష్టమైన లక్ష్యాన్నీ" వెదకడం, సహజంగానే, నిష్ఫలం. "సంఘటిత" పెట్టుబడిదారీ విధానపు ఆకర్షణల గురించి దాని సమర్థకులైన షుల్జె-గేవెర్నిట్జ్, లీఫ్మన్, అలాంటి "సిద్ధాంతవేత్తలూ"141 చేసే అధికారిక కీర్తిగానాలకంటె భిన్నంగా ధ్వనిస్తుంది కార్యవాదుల ఒప్పుదల.

---

* ఎయ్‌డెల్స్, పూర్వోక్త గ్రంథం, పేజీలు 183–184.

సరిగ్గా యే కాలంలో పెద్ద బాంకుల "కొత్త కార్యకలాపాలు" అంతిమంగా స్థిరపడి నాయి? యీ ముఖ్య ప్రశ్నకు ఎయ్‌డెల్స్ చాలావరకు కచ్చితమైన జవాబు యిస్తాడు:

"బాంకులకూ, కొత్త సారమూ, కొత్త రూపాలూ, కొత్త అంగాలూ గల పారిశ్రామిక సంస్థలకూ గల సంబంధాలు, అనగా, కేంద్రీకృత ఆధారంమీదా, వికేంద్రీకృత ప్రాతిపదికమీదా యేర్పరచబడిన పెద్ద బాంకులు, తొంభైలకు పూర్వం విలక్షణమైన ఆర్థిక అంశంగా లేవు. నిజానికి, ఒక అర్థంలో, యీ ప్రారంభ తేదీని 1897కు తీసుకపోవచ్చు— అప్పుడు ముఖ్యమైన 'సంలీనాలు' జరిగినాయి, అప్పుడు, మొదటిసారి, బాంకుల పారిశ్రామిక విధానానికి అనుకూలంగా వుండడానికి కొత్త వికేంద్రీకృత సంస్థానిర్మాణ రూపం ప్రవేశపెట్టబడింది. యీ ప్రారంభ సమయాన్ని బహుశా యింకా తదనంతర కాలంలో పెట్టవచ్చు, యెందుకంటే, పరిశ్రమలయొక్క, బాంకింగుయొక్క సాంద్రీకరణ క్రమాన్ని బ్రహ్మాండంగా త్వరపరచి, తీవ్రపరచిందీ, ఆ క్రమాన్ని దృఢపరచిందీ, పరిశ్రమలతో సంబంధాన్ని పెద్ద బాంకుల వాస్తవ గుత్తాధిపత్యంగా మొదటిసారి మార్చిందీ, యీ సంబంధాన్ని మరింత సన్నిహితమూ, మరింత చురుకూ చేసిందీ 1900 నాటి సంక్షోభమే."*

యీవిధంగా, 20వ శతాబ్ది పాత పెట్టుబడిదారీ విధానంనుండి కొత్తదానికి, దరహంమీద పెట్టుబడి పెత్తనంనుండి ఫైనాన్స్ పెట్టుబడికి, మలుపుగా వుంది.

## 3. ఫైనాన్స్ పెట్టుబడీ, ఫైనాన్షల్ ప్రభుమండలీ

"పరిశ్రమలలోని పెట్టుబడిలో స్థిరంగా పెరుగుతున్న భాగం దానిని వినియోగించే పెట్టుబడిదార్లకు చెందడంలేదు" అని హిల్ఫెర్‌డింగ్ రాస్తాడు. "వాళ్ళు బాంకుల మాధ్యమం ద్వారా మాత్రమే దాని ఉపయోగాన్ని పొందుతారు; ఆ బాంకులు, పారిశ్రామికులకు సంబంధించినంతవరకు, ఆ పెట్టుబడియొక్క సొంతదారులు. మరొకవైపున బాంకి తన నిధులలో అంతకంతకూ యెక్కువ భాగాన్ని పరిశ్రమలలో పెట్టవలసివస్తున్నది. యీవిధంగా బాంకర్ అంతకంతకూ యెక్కువగా పారిశ్రామిక పెట్టుబడిదారుడుగా మారుతున్నాడు. యీ బాంకి పెట్టుబడిని, అనగా, డబ్బు రూపంలో వుండి, వాస్తవంగా పారిశ్రామిక పెట్టుబడిగా మారిన పెట్టుబడిని, నేను 'ఫైనాన్స్ పెట్టుబడి' అంటున్నాను." "ఫైనాన్స్ పెట్టుబడి —

* ఎయ్‌డెల్స్, పూర్వోక్త గ్రంథం, పేజి 181.

బాంకులచేత అజమాయిషీ చేయబడి, పారిశ్రామికులచేత వినియోగించుకోబడే పెట్టుబడి.''*

అతి ముఖ్యమైన ఒక విషయంమీద — ఉత్పత్తియొక్క, పెట్టుబడియొక్క సాంద్రీకరణ గుత్తాధిపత్యానికి దారితీస్తున్నంతగా, దారితీసినంతగా పెరగడంమీద — మౌనంగా వున్నంత మేరకు యీ నిర్వచనం అసంపూర్ణంగా వుంది. కానీ మొత్తం తన రచనలో ఆద్యంతం, ప్రత్యేకించి, యీ నిర్వచనం తీసుకోబడిన ప్రకరణానికి ముందు వున్న రెండు ప్రకరణాలలో, హిల్ఫెర్‌డింగ్ పెట్టుబడిదారీ గుత్తసంస్థలు నిర్వహించే పాత్రను నొక్కిచెప్తాడు.

ఉత్పత్తి సాంద్రీకరణ; వాటినుండి ఉద్భవించే గుత్తసంస్థలు; పరిశ్రమలతో బాంకుల సంలీనం, లేదా సంయోగం — ఫైనాన్స్ పెట్టుబడి పెరుగుదల చరిత్ర అది, ఆ భావం యొక్క సారం అది.

యిక, విక్రయ సరుకుల ఉత్పత్తియొక్క, సొంత ఆస్తియొక్క సాధారణ పరిస్థితులలో పెట్టుబడిదారీ గుత్తసంస్థల ''వ్యాపార చర్యలు'' యెలా అనివార్యంగా ఫైనాన్షల్ ప్రభుమండలి పెత్తనానికి దారితీసేదీ వర్ణించవలసివుంది. రీసర్, షుల్జె-గేవెర్నిట్జ్, లీఫ్మన్ తదితర జర్మన్ బూర్జువా పండితులు — జర్మన్లు మాత్రమే కాదు — అందరూ స్రామాజ్యవాదంయొక్క, ఫైనాన్స్ పెట్టుబడియొక్క సమర్థకులని గమనించాలి. ప్రభుమండలి ఏర్పడే ''సంవిధానమూ,'' దాని పద్ధతులూ, దాని ''నిష్కల్మషపు, కల్మషపు'' ఆదాయాల పరిమాణమూ, పార్లమెంట్లతో దాని సంబంధాలూ, వగైరా, వగైరాలను వెల్లడించడానికి బదులు వాళ్లు వాటికి మేలిపూత పూస్తారు. గంభీర, అస్పష్ట నుడికారాలతో, బాంకి డైరెక్టర్ల ''బాధ్యతా భావా''నికి విజ్ఞప్తులతో, ప్రష్యన్ ఉద్యోగుల ''విధి భావా''న్ని పొగడడంతో, గుత్తసంస్థల ''తనిఖీ''కొరకూ, ''నియంత్రణ''కొరకూ చేసే పరమ అపహాస్యకరమైన పార్లమెంటరీ బిల్లుల చిల్లర వివరాలను తీవ్రంగా అధ్యయనం చేయడంతో, ప్రొఫెసర్ లీఫ్మన్ చేసిన యీకింది ''విద్వత్'' నిర్వచనంలాగ సిద్ధాంతాలతో ఆడుకుంటూ వాళ్లు యీ ''తలనొప్పి'' సమస్యలను తప్పుకుంటారు: ''వా ణి జ్యం స రు కు ల ను ప్రో గు చే య డం, ని లు వ చే య డం, స ర ఫ రా చే య డం ల క్ష్యం గా గ ల వృ త్తి.''** (కింది గీతలు ప్రొఫెసర్‌వే.) ...దీన్నిబట్టి తెలిసే దేమంటే, మారకం గురించి యేమీ తెలియని ఆదిమ మానవుని కాలంలో వాణిజ్యం వుండిందనీ, సోషలిజంలో కూడా అది వుంటుందనీ!

---

* ఆర్. హిల్ఫెర్‌డింగ్, ''ఫైనాన్స్ పెట్టుబడి,'' మాస్కో, 1912 (రష్యన్‌లో), పేజీలు 338–339.

** R. Liefmann, పూర్వోక్త గ్రంథం, పేజి 476.

కానీ ఫైనాన్షల్ ప్రభుమండలి వికృత ప్రభుత్వం గురించిన వికృత వాస్తవాలు యెంత కన్నులకు కట్టినట్లు వున్నాయంటే, పెట్టుబడిదారీ దేశా లన్నిటిలోనూ, అమెరికా, ఫ్రాన్సు, జర్మనీలలో, మొత్తం సారస్వతం ఉద్భవించింది; అవి బూర్జువా దృక్పథంనుండి రాయబడినవి, అయినప్పటికీ యీ ప్రభుమండలిని గురించి బాగా నిజమైన చిత్రాన్నీ, విమర్శనూ – పెటీబూర్జువా విమర్శే, సహజంగా – యిస్తాయి.

యిప్పటికే టూకీగా ప్రస్తావించిన "భాగస్వామ్య పద్ధతి"కి అత్యధిక ప్రాముఖ్యం వుంది. జర్మన్ అర్థశాస్త్రజ్ఞుడు హైమన్, బహుశా యీ విషయాన్ని దృష్టిలోకి తెచ్చిన మొదటివాడు, దాని సారాన్ని యీవిధంగా వర్ణిస్తాడు:

"సంస్థ అధిపతి ప్రధాన కంపెనీని (శాబ్దికంగా: "తల్లి కంపెనీ"ని) అజమాయిషీ చేస్తాడు; యిది అనుబంధ కంపెనీల ("కూతురు కంపెనీ"ల)మీద రాజ్యం చేస్తుంది; యివి మళ్లీ యితర అనుబంధ కంపెనీలను ("మనుమరాలు కంపెనీ"లను) అజమాయిషీ చేస్తాయి, వగైరా. యీవిధంగా, సాపేక్షంగా చిన్న పెట్టుబడితో బ్రహ్మాండమైన ఉత్పత్తి రంగాలమీద పెత్తనం చేయడానికి వీలౌతుంది. నిజానికి, ఒక కంపెనీని అజమాయిషీ చేయడానికి 50 శాతం పెట్టుబడి యెప్పుడూ చాలునంటే, రెండవ అనుబంధ కంపెనీలలో యెనిమిది లక్షలను అజమాయిషీ చేయడానికి సంస్థ అధిపతికి ఒక లక్ష చాలు. యీ పరస్పర అనుబంధాన్ని పొడిగిస్తే ఒక లక్షతో 16 లక్షలనూ, 32 లక్షలనూ, వగైరాను అజమాయిషీ చేయడానికి వీలుంది."*

వాస్తవానికి, ఒక కంపెనీ వ్యవహారాలకు దర్శకత్వం వహించడానికి దాని షేర్లలో 40 శాతం కలిగివుంటే చాలునని అనుభవంలో తెలుస్తుంది;** యెందుకంటే, చెల్లాచెదరుగా వున్న కొంతమంది చిన్న షేర్‌హోల్డర్లకు సాధారణ సమావేశాలకూ, వగైరాలకు హాజరు కావడానికి ఆచరణలో అసాధ్యంగా వుంటుంది. షేర్ల స్వామ్యపు "ప్రజాస్వామ్యకరణ," దేని నుండి అయితే బూర్జువా కూటతార్కికులూ, అవకాశవాదులైన "సోషల్ డెమోక్రట్లు" అనబడేవాళ్లూ "పెట్టుబడి ప్రజాస్వామీకరణ" సన్నకారు ఉత్పత్తియొక్క పాత్రా, ప్రాముఖ్యమూ బలపడడాన్నీ, వగైరాలను ఆశిస్తారో (లేక, ఆశిస్తామని అంటారో) అది వాస్తవంలో ఫైనాన్షల్ ప్రభుమండలి శక్తిని పెంచే మార్గాలలో ఒకటి. అన్నట్లు, యీ కారణం వల్లనే, యెక్కువ పురోగామి అయిన, లేదా యెక్కువ వయసూ, "అనుభవమూ"గల పెట్టు

---

* Hans Gideon Heymann, *Die gemischten Werke im deutschen Großeisengewerbe*, St., 1904, SS. 268—69.

** Liefmann, *Beteiligungsges. etc.*, 1 కూర్పు, పేజి 258.

బడిదారీ దేశాలలో, చిన్న విలువగల షేర్లు జారీచేయడానికి చట్టం అనుమతిస్తుంది. జర్మనీలో వెయ్యి మార్కులకు తక్కువ విలువగల షేర్లు జారీచేయడానికి చట్టం అనుమతించదు; ఒక్క పౌండు (=20 మార్కులు, సుమారు 10 రూబుళ్ళు) విలువగల షేర్లు జారీ చేయడానికి అనుమతించిన బ్రిటన్‌ను జర్మన్ ఫైనాన్స్ ప్రభువులు అసూయతో చూస్తారు. "ఒక్క పౌండు షేరు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఆధారం" అని జర్మనీలో అందరికంటె పెద్ద పారిశ్రామికులలోనూ, "ఫైనాన్సల్ రాజుల"లోనూ ఒకడైన సీమెన్స్ 1900 జూన్ 7న రైహ్‌స్టాగ్‌లో చెప్పినాడు.* రష్యన్ మార్క్సిజం స్థాపకుల్లో ఒకడుగా పరిగణింపబడే వాడూ, సామ్రాజ్యవాదం ఒకానొక దేశపు దురలవాటు అని నమ్మేవాడూ అయిన ఒకానొక అప్రతిష్ఠాకర రచయితకంటె,[142] యీ వర్తకునికి సామ్రాజ్యవాదం గురించి చాలా గాఢమైన, అధికమైన "మార్క్సిస్టు" పరిజ్ఞానం వుంది....

కానీ, "భాగస్వామ్య పద్ధతి" గుత్తాధిపతుల శక్తిని బ్రహ్మాండంగా పెంచడానికి ఉపయోగపడడమే కాక, శిక్షకు గురికాకుండా ప్రజలను మోసగించడానికి రకరకాల మోసపు జిత్తులకు దిగడానికి కూడా వాళ్ళకు వీలు కలిగిస్తుంది; యెందుకంటే, లాంఛనగతంగా "తల్లి కంపెనీ" "కూతురు కంపెనీ" విషయంలో శాసనరీత్యా బాధ్యురాలు కాదు; "కూతురు కంపెనీ" స్వతంత్రమైనదిగా ఊహించబడుతుంది, దీని మధ్యస్థం ద్వారా వాళ్ళు యే ఆట అయినా ఆడగలరు. జర్మన్ పత్రిక "ది బాంక్" 1914 మే సంచికనుండి గ్రహించబడిన ఉదాహరణ యిది:

"కాస్సెల్‌లోని 'స్ప్రింగ్ స్టీల్ కంపెనీ' జర్మనీలోని అత్యంత లాభదాయకమైన సంస్థలలో ఒకటిగా కొన్ని యేండ్ల క్రితం పరిగణింపబడేది. మేనేజిమెంటు బాగా లేక దాని డివిడెండ్లు 15 శాతంనుండి సున్నకు పడిపోయినాయి. దాని బోర్డు, షేర్‌హోల్డర్లను సంప్రదించకుండా, తన 'కూతురు కంపెనీల'లో ఒకటైన 'హస్సియ కంపెనీ'కి, కొన్ని లక్షల మార్కులు మాత్రమే నామకార్థపు పెట్టుబడిగా గల దానికి, అరవై లక్షల మార్కులు అప్పు యిచ్చినట్టుంది. 'తల్లి కంపెనీ' పెట్టుబడికి దాదాపు మూడు రెట్లున్న యీ అప్పు దాని బాలన్స్ షీట్లలో యెప్పుడూ ప్రస్తావించబడలేదు. యీ లోపం చట్ట సమ్మతమైనది; కంపెనీ చట్టంలో యే అంశాన్నీ యిది ఉల్లంఘించలేదు గనుక, రెండు పూర్తి సంవత్సరాలు దీన్ని మూసిపెట్టడం సాధ్యమైంది. బాధ్యతాయుత అధిపతిగా తప్పుడు బాలన్స్ షీట్ల మీద సంతకంచేసిన సూపర్వైజరీ బోర్డు అధ్యక్షుడు కాస్సెల్ వాణిజ్య మండలి అధ్యక్షుడుగా వుండినాడు, యిప్పటికీ వున్నాడు. షేర్‌హోల్డర్లు 'హస్సియ కంపెనీ' కిచ్చిన రుణం

* Schulze-Gaevernitz, *Grundriß der Sozialökonomik*, V, 2, S. 110.

గురించి ఆ తర్వాత చాలా కాలానికి, అది పొరపాటు..." (యీ పదాన్ని రచయిత కొటేషన్ మార్కులలో పెట్టాలి)... "అని రుజువైనప్పుడు, విషయజ్ఞులు 'స్ప్రింగ్ స్టీల్' షేర్లను అమ్ముతూ వుండినారు గనుక అవి దాదాపు 100 శాతం పడిపోయినప్పుడు, విన్నారు"....

జాయింటు స్టాక్ కంపెనీలలో అతి సాధారణమైన బాలన్స్ షీటు గారడీయొక్క యీ విలక్షణమైన ఉదాహరణ వివరిస్తుంది యెందుకు వాటి డైరెక్టర్ల బోర్డులు ఒంటరి వ్యాపారస్తులకంటె యెంతో నిర్భయంగా నష్టసంభావ్యత వున్న బేరాలకు పూనుకోడానికి యిష్టపడేదీ. బాలన్స్ షీట్లు తయారుచేసే ఆధునిక పద్ధతులు సందేహాస్పద బేరాలను మామూలు షేర్‌హోల్డరుకు తెలియకుండా మూసిపెట్టడాన్ని సాధ్యం చేయడమే కాక, అందరికంటె యెక్కువ సంబంధం వున్నవాళ్లు అపజయకర బేరపు పర్యవసానాన్ని తప్పించుకోడానికి అనుమతిస్తాయి; ఒంటరి వ్యాపారస్తుడు తాను చేసే ప్రతి పనిలోనూ తానే ప్రమాదాన్నీ యెదుర్కొనగా, వాళ్లు తమ షేర్లను సకాలంలో అమ్ముకోవడం ద్వారా తప్పించుకుంటారు....

అనేక జాయింటు స్టాక్ కంపెనీల బాలన్స్ షీట్లు మధ్యయుగాల పాలింప్సెస్టులను జ్ఞాపకం చేస్తాయి; వాటిమీద కనపడే లేఖనాన్ని మొదట చెరిపేస్తే, దానికింద కనపడుతుంది మరొక లేఖనం, ఆ పత్రంయొక్క అసలైన అర్థాన్ని తెలియజేసేది. (మొదటి లేఖనాన్ని చెరిపేసి, పైన మరొక లేఖనం రాసిన చర్మ పత్రాలను పాలింప్సెస్టు లంటారు.)

"కనుక, బాలన్స్ షీట్లను దుర్గ్రాహ్యం చేసే అత్యంత సూక్ష్మమైన, అత్యంత సాధారణమైన పద్ధతి యేమిటంటే, 'కూతురు కంపెనీల'ను నెలకొల్పడం ద్వారా — లేదా, కలుపుకోవడం ద్వారా — ఒకే వ్యాపారాన్ని పలు భాగాలుగా విభజించడం. వివిధ ప్రయోజనాలకు — చట్టబద్ధమైనవాటికీ, చట్టవ్యతిరేకమైనవాటికీ — యీ పద్ధతియొక్క సౌకర్యాలు యెంత తేటతెల్లంగా వున్నాయంటే, దీనిని ఉపయోగించని పెద్ద కంపెనీలు అపవాదంగా వున్నాయి."*

యీ పద్ధతిని ఉపయోగించే బ్రహ్మాండమైన గుత్త కంపెనీకి ఉదాహరణగా రచయిత ప్రసిద్ధమైన "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ"ని (A.E.G., నేను దీనిని మళ్లీ ప్రస్తావిస్తాను) ఉటంకిస్తాడు. 1912లో యీ కంపెనీ 175నుండి 200దాకా యితర కంపెనీలలో షేర్లు కలిగి, సహజంగా వాటిమీద పెత్తనంచేస్తూ, తద్వారా సుమారు 150 కోట్ల మార్కుల పెట్టుబడిని అజమాయిషీ చేస్తూవుండిందని లెక్క వేయబడింది.**

---

* L. Eschwege, *Tochtergesellschaften* ("కూతురు కంపెనీలు"), "Die Bank," 1914, 1, పేజి 545.

** Kurt Heinig, *Der Weg des Elektrotrusts*, "Neue Zeit" ("ఎలెక్ట్రో ట్రస్టుల మార్గం," "నోయె సైట్"), 1912, 30. Jahrg., 2, పేజి 484.

సదుద్దేశాలు గల ప్రొఫెసర్లూ, ఉద్యోగులూ — అనగా, పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించి, ముస్తాబుచేసే సదుద్దేశం గలవాళ్ళ — ప్రజలకు ఉపన్యసించే విషయాలైన అజమాయిషీ నిబంధనలూ, బాలన్స్ షీట్ల ప్రచురణా, బాలన్స్ షీట్లు ఒక నిర్ణీత రూపంలో తయారుచేయడమూ, లెక్కల బహిరంగ తనిఖీ, వగైరాలలో యేదీ ఉపయోగం లేదు; యెందుకంటే, సొంత ఆస్తి పవిత్రమైనది, షేర్లను అమ్మడం, కొనడం, సాటా చేసుకోవడం, పరాధీనం చేయడం, వగైరాలనుండి యెవరూ నిషేధించబడజాలరు.

పద్దైదేండ్లు "రష్యన్-చైనీస్ బాంకి"లో ఉద్యోగిగా వుండినవాడూ, 1914 మేలో, అంత సరిగా పేరు పెట్టబడని "పెద్ద బాంకులూ, ప్రపంచ మార్కెటూ" అనే పుస్తకం ప్రచురించినవాడూ అయిన ఇ. అగాడ్ యిచ్చిన అంకెల* ద్వారా, పెద్ద రష్యన్ బాంకులలో "భాగస్వామ్య పద్ధతి" యే మేరకు అభివృద్ధి అయిందీ చూడవచ్చు. రచయిత పెద్ద రష్యన్ బాంకులను రెండు ప్రధాన బృందాలుగా విభజిస్తాడు: (అ) "భాగస్వామ్య పద్ధతి"కిందికి వచ్చే బాంకులు, (ఆ) "స్వతంత్ర" బాంకులు — "స్వాతంత్ర్యం" అంటే విదేశ బాంకుల నుండి స్వాతంత్ర్యం అనే అర్థం చిత్తంవచ్చినట్లు తీసుకోబడింది. మొదటి బృందాన్ని రచయిత మూడు ఉపబృందాలుగా విభజిస్తాడు: (1) జర్మన్ భాగస్వామ్యం, (2) బ్రిటిష్ భాగస్వామ్యం, (3) ఫ్రెంచి భాగస్వామ్యం — ఆయా దేశానికి చెందిన పెద్ద విదేశ బాంకి యొక్క భాగస్వామ్యాన్నీ, పెత్తనాన్నీ దృష్టిలో పెట్టుకొని రచయిత యీ విభజన చేసినాడు. రచయిత బాంకుల పెట్టుబడిని "ఉత్పాదకంగా" పెట్టబడిన పెట్టుబడిగానూ (పారిశ్రామిక, వాణిజ్య సంస్థలలో), "సట్టా దృష్టితో" పెట్టబడిన పెట్టుబడిగానూ (స్టాక్ యెక్స్చేంజిలోనూ, ఫైనాన్షల్ లావాదేవీలలోనూ) విభజిస్తాడు — పెట్టుబడిదారీ విధానంలో మొదటి పెట్టుబడి రూపాన్ని రెండవదానినుండి వేరుచేయడమూ, రెండవదానిని రద్దు చేయడమూ సాధ్యమనే తన పెటీబూర్జువా సంస్కరణవాద దృక్పథంనుండి.

అతను యిచ్చే అంకెలు యివి:

---

* E. Agahd, *Großbanken und Weltmarkt. Die wirtschaftliche und politische Bedeutung der Großbanken im* Weltmarkt *unter Berücksichtigung ihres Einflusses auf Rußlands Volkswirtschaft und die deutsche-russischen Beziehungen* ("పెద్ద బాంకులూ, ప్రపంచ మార్కెటూ. రష్యా ఆర్థిక వ్యవస్థమీదా, రష్యా జర్మనీల మధ్య సంబంధాలమీదా ప్రభావం దృష్ట్యా ప్రపంచ మార్కెటులో పెద్ద బాంకుల ఆర్థిక, రాజకీయ ప్రాముఖ్యం"), Berl., 1914.

బాంకుల అస్తులు

(1913 అక్టోబర్–నవంబర్‌కు చెందిన నివేదికలనుబట్టి)

లక్షల రూబుళ్లు

| రష్యన్ బాంకుల బృందాలు | పెట్టబడిన పెట్టుబడి | | |
|---|---|---|---|
| | ఉత్పాదకంగా | సట్టా రూపంలో | మొత్తం |
| అ 1) నాలుగు బాంకులు: సైబీరియన్ కమర్షియల్ బాంకి, రష్యన్ బాంకి, ఇంటర్నేషనల్ బాంకి, డిస్కౌంటు బాంకి . . . . . . . | 4,137 | 8,591 | 12,728 |
| అ 2) రెండు బాంకులు: కమర్షియల్ అండ్ ఇండస్ట్రియల్ బాంకి, రష్యన్-బ్రిటిష్ బాంకి . . . . . . . . | 2,393 | 1,691 | 4,084 |
| అ 3) అయిదు బాంకులు: రష్యన్-ఏషియాటిక్ బాంకి, సెంట్ పీటర్స్‌బుర్గ్ ప్రైవేటు బాంకి, అజోవ్-దోన్ బాంకి, యూనియన్ మాస్కో బాంకి, రష్యన్-ఫ్రెంచి కమర్షియల్ బాంకి . . | 7,118 | 6,612 | 13,730 |
| (11 బాంకులు) మొత్తం . . అ) = | 13,648 | 16,894 | 30,542 |
| ఆ) యెనిమిది బాంకులు: మాస్కో మర్చంట్స్ బాంకి, వోల్గ-కామ బాంకి, జంకర్ అండ్ కో బాంకి, సెంట్ పీటర్స్‌బుర్గ్ కమర్షియల్ (మాజీ వావెల్‌బెర్గ్) బాంకి, బాంక్ ఆఫ్ | | | |

| రష్యన్ బాంకుల బృందాలు | పెట్టబడిన పెట్టుబడి | | |
|---|---|---|---|
| | ఉత్పాదకంగా | సట్టా రూపంలో | మొత్తం |
| మాస్కో (మాజీ ర్యబుష్కిన్‌స్కి బాంకి), మాస్కో డిస్కౌంటు బాంకి, మాస్కో కమర్షియల్ బాంకి, మాస్కో ప్రైవేటు బాంకి . . . . . . . | 5,042 | 3,911 | 8,953 |
| (19 బాంకులు) మొత్తం . . . | 18,690 | 20,805 | 39,495 |

యీ అంకెల ప్రకారం, సుమారు 400 కోట్ల రూబుళ్లు వున్న పెద్ద బాంకుల "వర్కింగు" పెట్టుబడిలో ముప్పాతిక భాగానికిపైగా, 300 కోట్లకుపైగా, వాస్తవంలో విదేశ బాంకులకు, ప్రధానంగా పారిస్ బాంకులకూ (ప్రసిద్ధ త్రికం: "యూనియన్ పారిసియెన్," "పారిస్ ఎట్ పాయ్ బా," "సొసైటీ జెనెరాల్"), బెర్లిన్ బాంకులకూ (ప్రత్యేకంగా "డోయిచె బాంక్," "డిస్కౌంటొ గెసెల్‌షెఫ్ట్") "కూతురు కంపెనీలు" మాత్రమే అయిన బాంకులకు చెందినది. అత్యంత పెద్ద రష్యన్ బాంకులలో రెండు – "రష్యన్ బాంకి" ("విదేశ వర్తక రష్యన్ బాంకి"), "ఇంటర్నేషనల్ బాంకి" ("సెంట్ పీటర్స్‌బుర్గ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ బాంకి") – 1906కూ 1912కూ మధ్య, "ముప్పాతిక భాగం జర్మన్ పెట్టుబడిని వినియోగించుకొని," తమ పెట్టుబడిని 440నుండి 980 లక్షల రూబుళ్లకూ, తమ రిజర్వులను 150నుండి 390 లక్షల రూబుళ్లకూ పెంచుకున్నాయి. మొదటి బాంకి బెర్లిన్ "డోయిచె బాంక్" "సంస్థ"కు చెందినది, రెండవది బెర్లిన్ "డిస్కౌంటొ గెసెల్‌షెఫ్ట్"కు చెందినది. షేర్లలో అధిక భాగం బెర్లిన్ బాంకుల వశంలో వుండడమూ, అందువలన రష్యన్ షేర్‌హోల్డర్లు అశక్తులుగా వుండడమూ యోగ్యుడైన అగాడ్‌కు గాఢమైన ఆగ్రహం కలిగించింది. సహజంగా, పెట్టుబడిని యెగుమతిచేసే దేశం మీగడ లాక్కుంటుంది; ఉదాహరణకు బెర్లిన్ "డోయిచె బాంక్" "సైబీరియన్ కమర్షియల్ బాంకి" షేర్లను బెర్లిన్ మార్కెట్‌లో పెట్టకుండా, పూర్తిగా ఒక యేడాది పాటు తన పెట్టెలో వుంచుకొని, తరువాత 100కి 193 వంతున అమ్మింది, అనగా వాటి నామకపు విలువకు

దాదాపు రెండు రెట్లు వంతున అమ్మింది, దాదాపు అరవై లక్షల రూబుళ్ల లాభంతో; దీనిని "ప్రమోటర్ లాభం" అంటాడు హిల్ఫెర్‌డింగ్.

మన రచయిత ప్రధానమైన సెంట్ పీటర్స్‌బుర్గ్ బాంకుల మొత్తం "శక్తి"ని 823.5 కోట్ల రూబుళ్లుగా అంచనావేస్తాడు, 800 కోట్లకుపైగా; భాగస్వామ్యాన్ని, లేదా విదేశ బాంకులు వాటిమీద యేమేరకు పెత్తనం చేసేదీ, అతను యీకింది విధంగా అంచనావేస్తాడు: ఫ్రెంచి బాంకులు 55 శాతం, బ్రిటిష్ బాంకులు 10 శాతం, జర్మన్ బాంకులు 35 శాతం. రచయిత లెక్కాచారం ప్రకారం మొత్తం 823.5 కోట్ల పనిచేసే పెట్టుబడిలో 368.7 కోట్ల రూబుళ్లు, లేక 40 శాతానికిపైగా, "ప్రొదుగొల్," "ప్రొదమెత్" సిండికేట్ల భాగానికీ, నూనె, లోహోత్పత్తి, సిమెంటు పరిశ్రమలలోని సిండికేట్ల భాగానికీ పోతుంది. యీవిధంగా, పెట్టుబడిదారీ గుత్తసంస్థల నిర్మాణం మూలంగా, బాంకి పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడుల సంలీనం రష్యాలో బ్రహ్మాండంగా ముందుకు పోయింది.

కొద్దిమంది చేతుల్లో సాంద్రీకృతమై, అర్థాత్తు గుత్తాధిపత్యం చలాయించే ఫైనాన్స్ పెట్టుబడి కంపెనీలను ప్రారంభించడమూ, షేర్లూ, ప్రభుత్వ రుణాలూ జారీచేయడమూ, వగైరాలనుండి బ్రహ్మాండమైన, నిత్యప్రవర్ధమానమైన లాభాలు గుంజుతుంది, ఫైనాన్షల్ ప్రభుమండలి పెత్తనాన్ని పటిష్ఠపరుస్తుంది, గుత్తాధిపతుల లాభానికి మొత్తం సమాజం మీద కప్పం విధిస్తుంది. అమెరికన్ ట్రస్టుల "వ్యాపార" పద్ధతులకు గల బోలెడు ఉదాహరణలలో హిల్ఫెర్‌డింగ్ ఉటంకించిన ఒక ఉదాహరణ యిస్తాను. 1887లో, హవెమెయర్ 65 లక్షల డాలర్ల మొత్తం పెట్టుబడిగల పదిహేదు సంస్థలను సంలీనం చేసి చక్కెర ట్రస్టును నెలకొల్పినాడు. అమెరికన్లు అనేటట్లు తగినంతగా "నీళ్లు కలిపి," ట్రస్టుయొక్క పెట్టుబడి 5 కోట్ల డాలర్లుగా ప్రకటింపబడింది. యీ "అధిక పెట్టుబడీకరణ" గుత్త లాభాలను ఊహించింది – సంయుక్త రాష్ట్రాల ఉక్కు కార్పొరేషన్ సాధ్యమైనన్ని ముడి యినుము క్షేత్రాలను కొనేయడంలో తన గుత్త లాభాలను ఊహించే విధంగానే. వాస్తవంలో చక్కెర ట్రస్టు గుత్త ధరలు నెలకొల్పి, యెంత లాభాలు సంపాయించిందంటే, యేడురెట్లు "నీళ్లు కలిపిన" పెట్టుబడిమీద అది 10 శాతం, లేక ట్రస్టు నెలకొల్పబడినప్పుడు వాస్తవంగా పెట్టబడిన పెట్టుబడిమీద సుమారు 70 శాతం, డివిడెండు చెల్లించగలిగింది! 1909లో చక్కెర ట్రస్టు పెట్టుబడి 9 కోట్ల డాలర్లు వుండింది. యిరవై రెండేండ్లలో అది తన పెట్టుబడిని పది రెట్లకుపైగా పెంచుకుంది.

ఫ్రాన్సులో "ఫైనాన్షల్ ప్రభుమండలి" పెత్తనం ("ఫ్రాన్సులో ఫైనాన్షల్ ప్రభుమండలికి వ్యతిరేకంగా" అనేది లిసిస్ రచించిన సుప్రసిద్ధ గ్రంథం పేరు – దీని అయిదవ

కూర్పు 1908లో ప్రచురించబడింది) కొద్దిగా మాత్రమే భిన్నమైన రూపం ధరించింది. అత్యంత శక్తివంతమైన బాంకులలో నాలుగు బాండ్లు జారీచేయడంలో సాపేక్షమైన గుత్తాధిపత్యం కాదు, "పరమమైన గుత్తాధిపత్యం" కలిగివున్నాయి. వాస్తవానికి యిది "పెద్ద బాంకుల ట్రస్టు." గుత్తాధిపత్యం బాండ్ల జారీనుండి గుత్త లాభాలను కట్టుదిట్టం చేస్తుంది. మామూలుగా రుణంచేసే దేశానికి రుణం మొత్తంలో 90 శాతంకంటె యెక్కువ రాదు, తక్కిన 10 శాతం బాంకులకూ, యితర దళారీలకూ పోతుంది. బాంకులు 40 కోట్ల ఫ్రాంకుల రష్యన్-చైనీస్ రుణంనుండి సంపాయించిన లాభం 8 శాతం; 80 కోట్ల ఫ్రాంకుల రష్యన్ (1904) రుణంనుండి సంపాయించిన లాభం 10 శాతం; 625 లక్షల ఫ్రాంకుల మొరాకో (1904) రుణంనుండి సంపాయించిన లాభం 18.75 శాతం. చిల్లర వడ్డీవ్యాపారపు పెట్టుబడితో తన అభివృద్ధిని ప్రారంభించిన పెట్టుబడిదారీ విధానం బ్రహ్మాండమైన వడ్డీవ్యాపారపు పెట్టుబడితో తన అభివృద్ధిని ముగిస్తున్నది. "ఫ్రెంచి వాళ్లు యూరప్‌లోని వడ్డీవ్యాపారులు" అంటాడు లిసిస్. పెట్టుబడిదారీ విధానపు యీ రూపాంతరీకరణ వలన ఆర్థిక జీవితపు పరిస్థితులన్నీ ప్రగాఢంగా మారుతున్నాయి. నిలకడగా వున్న జనాభాతో, స్తబ్ధంగా వున్న పరిశ్రమలూ, వాణిజ్యం, సముద్రయానాలతో, "దేశం" వడ్డీవ్యాపారం ద్వారా సంపన్నం కాగలదు. "80 లక్షల ఫ్రాంకుల పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే యాభైమంది వ్యక్తులు నాలుగు బాంకులలో డిపాజిట్ చేయబడిన 200 కోట్ల ఫ్రాంకులపై అజమాయిషీ చేయగలరు." యిప్పటికే మనకు పరిచయమైన "భాగస్వామ్య పద్ధతి" యిదే ఫలితానికి దారితీస్తుంది. ఉదాహరణకు అత్యంత పెద్ద బాంకులలో ఒకటైన "సొసైటీ జెనెరాల్" (Société Générale) తన "కూతురు కంపెనీ" అయిన "ఈజిప్షన్ షుగర్ రిఫైనరీస్"కుగాను 64,000 బాండ్లు జారీచేస్తుంది. 150 శాతం వంతున బాండ్లు జారీచేయబడతాయి, అనగా బాంకి ఒక్కొక ఫ్రాంకుమీద 50 సెంటైమ్స్ సంపాయిస్తుంది. ఈ కంపెనీ డివిడెండ్లు బూటకమని తేలింది, "ప్రజలు" 9–10 కోట్ల ఫ్రాంకులు నష్టపడినారు. "'సొసైటీ జెనెరాల్' డైరెక్టర్లలో ఒకడు 'షుగర్ రిఫైనరీస్' డైరెక్టర్ల బోర్డులో సభ్యుడుగా వుండినాడు." "ఫ్రెంచి రిపబ్లిక్ ఫైనాన్షల్ రాజరికం" అనీ, "అది ఫైనాన్షల్ ప్రభుమండలియొక్క పూర్తి పెత్తనం, యీ ప్రభుమండలి పత్రికలమీదా, ప్రభుత్వంమీదా పెత్తనం చేస్తుంది"* అనీ రచయిత నిర్ణయం చేయవలసి రావడంలో ఆశ్చర్యం లేదు.

---

* Lysis, *Contre l'oligarchie financière en France* ("ఫ్రాన్సులో ఫైనాన్షల్ ప్రభుమండలికి వ్యతిరేకంగా"), 5 éd., P., 1908, pp. 11, 12, 26, 39, 40, 48.

ఫైనాన్స్ పెట్టుబడియొక్క ప్రధాన కర్తవ్యాలలో ఒకటైన బాండ్ల జారీనుండి వచ్చే అసాధారణంగా ఉన్నతమైన లాభాల రేటు ఫైనాన్షల్ ప్రభుమండలి అభివృద్ధిలోనూ, స్థిర పరచుకోవడంలోనూ చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. "విదేశ రుణాలు జారీచేయ డంనుండి వచ్చే లాభాలకు రమారమిగా కూడా సమానమైన లాభాలు యిచ్చేది యిలాంటి రకానికి చెందిన బేరం దేశంలోపల ఒక్కటి కూడా లేదు" అని "ది బాంక్" అంటుంది.*

"సెక్యూరిటీల జారీనుండి వచ్చే లాభాలతో పోల్చదగిన లాభాలు యే బాంకింగు లావా దేవీ యివ్వదు." "Deutsche Ökonomist"[143] ప్రకారం పారిశ్రామిక స్టాక్‌మీద సంపాయించబడిన సగటు సాలుసరి లాభాలు యీకింది విధంగా వుండినాయి:

| | శాతం | | శాతం |
|---|---|---|---|
| 1895 . . . . | 38.6 | 1898 . . . | 67.7 |
| 1896 . . . . | 36.1 | 1899 . . . | 66.9 |
| 1897 . . . . | 66.7 | 1900 . . . | 55.2 |

"1891నుండి 1900కు జరిగిన పదేండ్లలో, జర్మన్ పారిశ్రామిక స్టాక్ జారీ చేయడం ద్వారా వంద కోట్ల మార్కులకుపైగా 'సంపాయించబడినాయి.' "**

పారిశ్రామిక వికాసపు కాలాలలో ఫైనాన్స్ పెట్టుబడిమీద లాభాలు విపరీతంగా వుంటాయి, కానీ మాంద్యపు కాలాలలో చిన్న, అసాష్ఠవ వ్యాపారాలు నశిస్తాయి, పెద్ద బాంకులు వాటిని నామకార్థపు ధరకు కొనేయడం ద్వారా వాటిలో "హోల్డింగులు" సంపా యిస్తాయి, లేదా వాటి "కాయకల్ప చికిత్స"కూ, "పునర్వ్యవస్థీకరణ"కూ లాభదాయక మైన పథకాలలో "పాల్గొంటాయి." నష్టంతో నడిచే సంస్థల "కాయకల్ప చికిత్స"లో "షేర్ పెట్టుబడి తగ్గించి రాయబడుతుంది, అనగా తక్కువ పెట్టుబడిమీద లాభాలు పంపకం చేయబడి, యీ తక్కువ పెట్టుబడి ప్రాతిపదికమీద లెక్కించబడడం కొనసాగు తుంది. లేక, ఆదాయం సున్నకు పడిపోతే, కొత్త పెట్టుబడిని తీసుకుంటారు; అది తక్కువ

* "Die Bank," 1913, 7, S. 630.

** Stillich, పూర్వోక్త గ్రంథం, పేజి 143; W. Sombart, *Die deutsche Volkswirtschaft im 19. Jahrhundert* ("19వ శతాబ్దిలో జర్మన్ ఆర్థిక వ్యవస్థ"), 2. Aufl., 1909, S. 526, Anlage 8.

లాభదాయకమైన పాత పెట్టుబడితో కలిసి, తగినంత ఆదాయాన్ని యిస్తుంది.'' హిల్ఫెర్‌డింగ్ యీ మాట కలిపినాడు: "అన్నట్లు, యీ పునర్నిర్మాణ, పునర్వ్యవస్థీకరణలన్నీ బాంకులకు ద్విముఖ ప్రాముఖ్యం కలిగి వున్నాయి: మొదటిది, లాభదాయకమైన బేరాలుగానూ; రెండవది, కష్టాలలో వున్న కంపెనీలమీద అజమాయిషీ సంపాయించే అవకాశాలుగానూ.''*

ఒక ఉదాహరణ యిది: దొర్ట్‌మున్డ్ "యూనియన్'' గని పారిశ్రామిక కంపెనీ 1872లో స్థాపించబడింది. దాదాపు 4 కోట్ల మార్కుల మొత్తానికి షేర్ పెట్టుబడి జారీచేయబడింది; మొదటి సంవత్సరానికి 12 శాతం డివిడెండు చెల్లించిన తర్వాత దాని షేర్ల మార్కెట్ ధర 170కి పెరిగింది. ఫైనాన్స్ పెట్టుబడి పైపై మీగడ తీసుకొని, సుమారు 280 లక్షల మార్కుల స్వల్ప మొత్తాన్ని జేబులో వేసుకొంది. యీ కంపెనీ ప్రధాన స్పాన్సరు 30 కోట్ల మార్కుల పెట్టుబడిని అంత విజయవంతంగా పొందిన ఆ మహా పెద్ద జర్మన్ బాంకి "డిస్కాంటొ గెసెల్‌షాఫ్ట్.'' తదనంతరం "యూనియన్'' డివిడెండ్లు సున్నకు పడిపోయినాయి. పెట్టుబడిని "తగ్గించి రాయడానికి,'' అనగా అంతా నష్టపడకుండా వుండడానికి గాను కొంత భాగాన్ని నష్టపడడానికి, షేర్‌హోల్డర్లు ఒప్పుకోవలసివచ్చింది. "కాయకల్ప చికిత్స''ల పరంపర ద్వారా ముప్పై యేండ్ల కాలంలో "యూనియన్'' దస్త్రాల నుండి 730 లక్షల మార్కులు రద్దుచేయబడినాయి. "కంపెనీ మొదటి షేర్‌హోల్డర్లకు ప్రస్తుతం తమ షేర్ల నామకపు విలువలో 5 శాతం మాత్రమే వుంది'';** కానీ బాంకులు ప్రతి "కాయకల్ప చికిత్స''నుండి "సంపాయించుకొన'' సాగినాయి.

వేగంగా పెరుగుతున్న పెద్ద పట్టణాల శివార్లలోని భూములలో లాభార్జన వ్యాపారం ఫైనాన్స్ పెట్టుబడికి ప్రత్యేకంగా లాభదాయకమైన లావాదేవీ. యిక్కడ బాంకుల గుత్తాధిపత్యం భూమి కౌలు గుత్తాధిపత్యంతోనూ, రవాణా సాధనాల గుత్తాధిపత్యంతోనూ సంలీనం చెందుతుంది; యెందుకంటే, భూమి ధర పెరుగుదలా, దానిని భాగాలుగా లాభానికి అమ్మే అవకాశమూ, వగైరా ప్రధానంగా, పట్టణ కేంద్రానికి గల మంచి రవాణా సాధనాలమీద ఆధారపడుతుంది; యీ రవాణా సాధనాలు భాగస్వామ్య పద్ధతి ద్వారానూ, బోర్డులలో స్థానాల పంపకం ద్వారానూ యీ పెద్ద బాంకులతోనే సంబంధంగల పెద్ద కంపెనీల చేతుల్లో వున్నాయి. ఫలితంగా, జర్మన్ రచయిత ఎల్. ఎష్‌వేగె "ఊబి'' అనేది మనకు లభిస్తుంది — యీ రచయిత "ది బాంక్'' వ్యాస రచయిత, భూముల వ్యాపారమూ, కుదువలూ, వగైరాల గురించి ప్రత్యేక అధ్యయనం చేసినవాడు. శివార్ల నివేశన

---

* "ఫైనాన్స్ పెట్టుబడి,'' పేజి 172.

** Stillich, పూర్వోక్త గ్రంథం, పేజి 138; Liefmann, పేజి 51.

స్థలాలలో ఆదుర్దాతో కూడిన సట్టా వ్యాపారమూ; "బోస్వా ఉంద్ క్నావర్" అనే బెర్లిన్ కంపెనీలాగ గృహ నిర్మాణ సంస్థలు కూలిపోవడమూ — యీ కంపెనీ "భద్రమైన" "డోయిచె బాంక్" (Deutsche Bank) సాయంతో 10 కోట్ల మార్కుల పెట్టుబడి సంపాయించింది; యీ బాంకి, సహజంగానే, భాగస్వామ్య పద్ధతి ద్వారా వ్యవహరించింది, అనగా, రహస్యంగా, తెర చాటున; కంపెనీ 120 లక్షల మార్కుల నష్టం "మాత్రం"తో బయటపడింది — తరువాత చిన్న ఆస్తిపరులూ, కార్మికులూ నాశనం కావడమూ; వీళ్ల బూటకపు గృహ నిర్మాణ కంపెనీలనుండీ యేమీ పొందరు, తర్వాత భూమి సర్టిఫికెట్లూ, నిర్మాణ లైసెన్సులూ, జారీలమీద అజమాయిషీ సంపాయించడానికి "చిత్తశుద్ధిగల" బెర్లిన్ పోలీసులతోనూ, ప్రభుత్వాధికార్లతోనూ చేసుకునే మోసపు ఒప్పందాలూ, వగైరా, వగైరా.*

యూరపియన్ ప్రొఫెసర్లూ, సదుద్దేశాలు గల బూర్జువాలూ ఎంతో కపటంగా అభిశంసించే "అమెరికన్ నీతి," ఫైనాన్స్ పెట్టుబడి యుగంలో యే దేశంలోనైనా ప్రతి పెద్ద నగరంలోనూ నీతి అయింది.

1914 ప్రారంభంలో, బెర్లిన్‌లో, "రవాణా ట్రస్టు" నిర్మాణం గురించి పుకారు వుండింది — అనగా, నగర యెలెక్ట్రిక్ రైల్వే, ట్రామ్ కంపెనీ, బస్ కంపెనీ అనే యీ మూడు బెర్లిన్ రవాణా సంస్థల మధ్య "ప్రయోజనాల ఐక్యత"ను నెలకొల్పడం గురించి. "ది బాంక్" యిలా రాసింది: "బస్ కంపెనీ షేర్లలో అధిక భాగం యితర రెండు రవాణా కంపెనీలు పొందినాయని తెలియవచ్చినప్పటినుండి యీ పథకం ఆలోచనలో వుందని మనకు తెలుసు. ...రవాణా సేవలను ఐక్యం చేయడం ద్వారా పొదుపు సాధిస్తామనీ, అందులో కొంత భాగం కాలక్రమేణ ప్రజలకు లాభకరంగా వుంటుందనీ, యీ లక్ష్యాన్ని అనుసరించేవాళ్లు చెప్పినప్పుడు, మనం పూర్తిగా నమ్మవచ్చు. కానీ యీ సమస్యలో ఒక చిక్కు వుంది: నిర్మించబోయే రవాణా ట్రస్టు వెనుక బాంకులు వున్నాయి; యివి, తాము కోరుకుంటే, తమ గుత్తాధిపత్యంకింద వున్న రవాణా సాధనాలను తమ భూవ్యాపార ప్రయోజనాలకు లోబరచగలవు. యీ ఊహ ఉచితమైనదని నమ్మడానికి ఒక విషయం గుర్తుకు తెచ్చుకుంటే చాలు: యెలెక్ట్రిక్ రైల్వే కంపెనీ నిర్మాణాన్ని ప్రోత్సహించిన పెద్ద బాంకియొక్క ప్రయోజనాలు ఆ కంపెనీ నిర్మాణం జరిగిన నాటికే అందులో యిమిడివుండినాయి. అనగా: రవాణా సంస్థ ప్రయోజనాలు భూమి ప్రయోజనాలతో ముడివడి వుండినాయి. అసలు విషయం యేమిటంటే, యీ రైల్వేయొక్క తూర్పు మార్గం యీ బాంకి అమ్మిన భూమిలో పోవలసివుంది;

* "Die Bank," 1913, పేజి 952; L. Eschwege, *Der Sumpf* ("ఊబి"), యిదే గ్రంథం, 1912, 1, పేజి 223, తరువాతి పేజీలు.

ఆ మార్గం వేయడం నిశ్చయమని తెలిసినప్పుడు యీ బాంకి తనకూ, యీ వ్యాపారంలోని పలువురు భాగస్తులకూ బ్రహ్మాండమైన లాభాలతో ఆ భూమిని అమ్మింది..."*

ఒక గుత్తసంస్థ, ఒకసారి యేర్పడి వందల కోట్లతో వ్యవహరిస్తున్నప్పుడు, పౌర జీవితపు ప్రతి రంగంలోనూ అనివార్యంగా చొచ్చుకపోతుంది, ప్రభుత్వ రూపమూ, సకల యితర "వివరాలూ" యెలా వున్నా సరే. జర్మన్ అర్థిక సారస్వతంలో మామూలుగా ప్రష్యన్ బ్యురాక్రసీ నిజాయితీకి బట్టు పొగడ్తలూ, ఫ్రెంచి పనామా కుంభకోణానికీ,[144] అమెరికాలోని రాజకీయ లంచగొండితనానికీ ప్రస్తావనలూ కనిపిస్తుంటాయి. కానీ, వాస్తవం యేమిటంటే, జర్మన్ బాంకింగు వ్యవహారాలకు అంకితమైన బూర్జువా సారస్వతం కూడా నిత్యం శుద్ధ బాంకింగు లావాదేవీల రంగాన్ని దాటి చాలా దూరం పోవలసివస్తుంది; ఉదాహరణకు అది "బాంకుల ఆకర్షణ" గురించి మాట్లాడుతుంది, ప్రభుత్వ ఉద్యోగులు అంతకంతకూ తరచుగా బాంకులలో ఉద్యోగాలు సంపాయించడాన్ని, యీకింది విధంగా, ప్రస్తావిస్తూ: "తన అంతరాంతరంలో బెరెన్‌స్ట్రాసెలో సుఖమైన ఉద్యోగానికి అర్రులుసాచే ప్రభుత్వోద్యోగి నిజాయితీ మాట యేమిటి?"** ("డోయిచె బాంక్" ప్రధాన కార్యాలయం వున్న బెర్లిన్ వీధి పేరు బెరెన్‌స్ట్రాసె.) 1909లో, "ది బాంక్" ప్రచురణకర్త ఆల్‌ఫ్రెడ్ లాన్స్‌బుర్గ "బైజాంటైనిజంయొక్క ఆర్థిక ప్రాముఖ్యం" అనే వ్యాసం రాసినాడు; అందులో అతను సందర్భవశాత్తు రెండవ విల్‌హెల్మ్‌యొక్క పాలెస్తీన్ యాత్రనూ, "యీ ప్రయాణంయొక్క తక్షణ ఫలితాన్ని, బాగ్దాద్ రైల్వే నిర్మాణాన్ని, ఆ మరణాంతకమైన 'జర్మన్ వర్తకపు మహా ఉత్పత్తి'ని, 'దిగ్బంధనా'నికి మన సకల రాజకీయ దోషాల మొత్తంకంటే యెక్కువ కారణమైనదాన్ని,"*** ప్రస్తావించినాడు. (దిగ్బంధనమంటే జర్మనీని యేకాకిని చేసి, సామ్రాజ్యవాద, జర్మన్ వ్యతిరేక కూటమిచే దానిని చుట్టుముట్టడానికి ఏడవ ఎడ్వర్డు విధానం.) నేను యింతకుముందు ప్రస్తావించిన పత్రికలోనే 1911లో ఎష్‌వేగె "ధనస్వామ్యమూ, బ్యురాక్రసీ" అనే వ్యాసం రాసినాడు; అతను అందులో, ఉదాహరణకు, కార్టెల్ కమిటీలో కార్యదీక్షగల సభ్యుడుగా వుండి, తరువాత అన్నిటికంటె పెద్ద కార్టెల్ అయిన స్టీల్ సిండికేట్‌లో లాభదాయకమైన ఉద్యోగం సంపాయించిన ఫోల్కెర్ అనే జర్మన్ ప్రభుత్వోద్యోగి విషయాన్ని వెల్లడిచేసినాడు. యేమాత్రమూ యాదృచ్ఛికం కాని యిలాంటి విష

---

* *Verkehrstrust* ("రవాణా ట్రస్టు"), "Die Bank," 1914, 1, పేజి 89.

** *Der Zug zur Bank* ("బాంకికోసం ఆకర్షణ"), "Die Bank," 1909, 1, పేజి 79.

*** పై రచన, పేజి 301.

యాలనుబట్టి యీ బూర్జువా రచయిత ఒప్పుకోవలసివచ్చింది, "జర్మన్ రాజ్యాంగం గ్యారంటీ చేసిన ఆర్థిక స్వాతంత్ర్యం ఆర్థిక జీవితపు అనేక శాఖలలో అర్థరహితమైన నుడికారం అయింది" అనీ, ప్రస్తుత ధనస్వామ్య పరిపాలనలో "అత్యంత విస్తృతమైన రాజకీయ స్వేచ్ఛ కూడా మనల్ని అస్వతంత్ర ప్రజల జాతిగా మారకుండా రక్షించదు" అనీ.*

రష్యాను గురించి ఒక ఉదాహరణకు మాత్రం పరిమిత మౌతాను. ఖజానా క్రెడిట్ శాఖ డైరెక్టర్ దవీదొవ్ తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చి, ఒకానొక పెద్ద బాంకిలో ఉద్యోగం పుచ్చుకున్నాడనీ, ఒప్పందం ప్రకారం కొన్ని సంవత్సరాల కాలంలో అతని జీతం పది లక్షల రూబుళ్లకుపైగా అవుతుందనీ, కొన్ని సంవత్సరాల క్రితం పత్రికలన్నీ ప్రకటించినాయి. క్రెడిట్ శాఖ అనేది "దేశంలోని సకల రుణ సంస్థల కార్యకలాపాలను సమన్వయంచేసి," సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోనూ, మాస్కోలోనూ వున్న బాంకులకు మొత్తం 80, 100 కోట్ల రూబుళ్లను సబ్సిడీలుగా యిచ్చే సంస్థ.**

పెట్టుబడి స్వామ్యం పెట్టుబడిని ఉత్పత్తికి ప్రయోగించడంనుండి వేరుచేయడమూ, డబ్బు పెట్టుబడి పారిశ్రామిక, లేదా ఉత్పాదక పెట్టుబడినుండి వేరుచేయడమూ, పూర్తిగా డబ్బు పెట్టుబడిమీద వచ్చే ఆదాయంమీద జీవించే వడ్డీజీవి వ్యాపారస్తునినుండీ, పెట్టుబడి నిర్వహణతో ప్రత్యక్ష సంబంధం వున్నవాళ్లందరినుండీ వేరుచేయడమూ దరహంమీద పెట్టుబడిదారీ విధానపు విలక్షణ గుణం. సామ్రాజ్యవాదం, లేక ఫైనాన్స్ పెట్టుబడి పెత్తనం అనేది యీ వేర్పాటు బృహత్ ప్రమాణాలు అందుకునే పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ. యితర పెట్టుబడి రూపాలన్నిటిమీదా ఫైనాన్స్ పెట్టుబడియొక్క పెత్తనం అంటే వడ్డీజీవియొక్క, ఫైనాన్షల్ ప్రభుమండలియొక్క ఆధిక్యం అన్నమాట, ఫైనాన్షల్‌గా "శక్తివంతమైన" స్వల్ప సంఖ్యాక రాజ్యాలు అన్నిటికంటె మిన్నగా వుండడ మన్నమాట. యీ క్రమం యేమేరకు జరుగుతున్నదీ రకరకాల సెక్యూరిటీల జారీకి సంబంధించిన లెక్కలనుబట్టి నిర్ణయించవచ్చు.

"అంతర్జాతీయ గణాంక సంస్థ బులెటిన్"లో ఎ. నెయ్‌మార్క్*** ప్రపంచమంతటా జారీచేయబడిన సెక్యూరిటీలకు సంబంధించిన అతి సమగ్రమైన, సంపూర్ణమైన, తులనా

---

* పై రచన, 1911, 2, పేజి 825; 1913, 2, పేజి 962.

** E. Agahd, పేజి 202.

*** *Bulletin de l'institut international de statistique* ("అంతర్జాతీయ గణాంక సంస్థ బులెటిన్"), t. XIX, livr. II, La Haye, 1912. – చిన్న రాజ్యాలకు సంబంధించిన లెక్కలు, రెండవ కాలంలోనివి, 1902 అంకెలకు 20 శాతం కలపడం ద్వారా అంచనావేయబడినాయి.

త్మక అంకెలు యిచ్చినాడు; యివి పదేపదే పాక్షికంగా ఆర్థిక సారస్వతంలో ఉల్లేఖించబడినాయి. నాలుగు దశాబ్దాలకు అతను యిచ్చే మొత్తాలు యివి:

ఒక్కొక్క దశాబ్దికి ఫ్రాంకుల్లో మొత్తం జారీలు
(శత కోట్లు)

| | |
|---|---|
| 1871–1880 . . . . . . | 76.1 |
| 1881–1890 . . . . . . | 64.5 |
| 1891–1900 . . . . . . | 100.4 |
| 1901–1910 . . . . . . | 197.8 |

ముఖ్యంగా ఫ్రెంచి-ప్రష్యన్ యుద్ధ సందర్భంగా జారీచేయబడిన రుణాల మూలంగానూ, యుద్ధం తర్వాత జర్మనీలో వచ్చిన కంపెనీ ప్రమోషన్ వికాసం మూలంగానూ, 1870లలో యావత్ప్రపంచపు జారీల వెరసి మొత్తం యెక్కువగా వుండింది. మొత్తంమీద, 19వ శతాబ్దపు చివరి మూడు దశాబ్దులలో పెరుగుదల సాపేక్షంగా చాలా వేగంగా లేదు, 20వ శతాబ్దపు మొదటి పది సంవత్సరాలలో దాదాపు 100 శాతపు బ్రహ్మాండమైన పెరుగుదల కనిపిస్తుంది. యీవిధంగా, 20వ శతాబ్దపు ప్రారంభం యింతకుముందే చెప్పిన గుత్తసంస్థల (కార్టెళ్ల, సిండికేట్ల, ట్రస్టుల) పెరుగుదలలోనే కాక, ఫైనాన్స్ పెట్టుబడి పెరుగుదలలో కూడా మలుపు.

ప్రపంచంలో వున్న మొత్తం జారీచేయబడిన సెక్యూరిటీలు 1910లో సుమారు 81,500 కోట్ల ఫ్రాంకులని నెయ్‌మార్క్ అంచనా వేస్తాడు. యీ మొత్తంనుండి, రెండు సార్లు లెక్కించబడివుండే అవకాశం గల మొత్తాలను తీసివేసి అతను వెరసి మొత్తాన్ని 57,500–60,000 కోట్లకు తగ్గించినాడు. యీ మొత్తం వివిధ దేశాలలో యీకింది విధంగా పంపకమైంది (నేను 60,000 కోట్లను తీసుకుంటున్నాను):

1910లో అమలులో వున్న ఫైనాన్షల్ సెక్యూరిటీలు
(శత కోటి ఫ్రాంకులు)

| | | | | |
|---|---|---|---|---|
| గ్రేట్ బ్రిటన్ . . | 142 | 479 | హాలండు . . . . | 12.5 |
| సంయుక్త రాష్ట్రాలు . | 132 | | బెల్జియం . . . . | 7.5 |
| ఫ్రాన్సు . . . . | 110 | | స్పెయిన్ . . . . | 7.5 |
| జర్మనీ . . . . | 95 | | స్విట్జర్లండు . . . | 6.25 |
| రష్యా . . . . | 31 | | డెన్మార్క్ . . . . | 3.75 |
| ఆస్ట్రో-హంగెరీ . . | 24 | | స్వీడన్, నార్వే, రుమేనియా వగైరా . . . . . | 2.5 |
| ఇటలీ . . . . | 14 | | | |
| జపాన్ . . . . | 12 | | మొత్తం . . . . . | 600 |

అత్యంత ధనిక పెట్టుబడిదారీ దేశాలలో నాలుగు, ఒక్కొక్కటి రమారమిగా 10,000 కోట్లకూ, 15,000 కోట్ల ఫ్రాంకులకూ మధ్య సెక్యూరిటీలు గలవి, అన్నిటికంటె మిన్నగా వుండడం యీ అంకెలలో మనకు స్పష్టంగా కనపడుతుంది. యీ నాలుగు దేశాలలో రెండు – బ్రిటన్, ఫ్రాన్సు – అన్నిటికంటె పాత పెట్టుబడిదారీ దేశాలు; వీటికి, మనం ముందు చూడబోయేటట్లు, అన్నిటికంటె యెక్కువ వలసలు వున్నాయి. తక్కిన రెండు – అమెరికా సంయుక్త రాష్ట్రాలు, జర్మనీ – అభివృద్ధి వేగంలోనూ, పరిశ్రమలలో పెట్టుబడిదారీ గుత్తసంస్థల విస్తరణ ప్రమాణంలోనూ అగ్రశ్రేణి పెట్టుబడిదారీ దేశాలు. యీ నాలుగు దేశాలకూ కలిసి 47,900 కోట్ల ఫ్రాంకులు వున్నాయి, అనగా ప్రపంచపు ఫైనాన్స్ పెట్టుబడిలో 80 శాతం. యేదో ఒక విధంగా, తక్కిన ప్రపంచమంతా యీ అంతర్జాతీయ బాంకర్ దేశాలకు, ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడియొక్క యీ నాలుగు "స్తంభాల"కు రుణగ్రస్తంగానూ, కప్పం కట్టేదిగానూ వుంది.

ఫైనాన్స్ పెట్టుబడికి పరాధీనతా, ఫైనాన్స్ పెట్టుబడి సంబంధాల అంతర్జాతీయ సమాహారాన్ని సృష్టించడంలో పెట్టుబడి యెగుమతి నిర్వహించే పాత్రను పరీక్షించడం మరీ ముఖ్యం.

# 4. పెట్టుబడి యెగుమతి

స్వేచ్ఛాయుత పోటీ పూర్తిగా ప్రాబల్యంలో వున్న పాత పెట్టుబడిదారీ విధానానికి విలక్షణంగా వుండింది సరుకుల యెగుమతి. గుత్తసంస్థలు ప్రాబల్యంలో వున్న పెట్టుబడిదారీ విధానపు తాజా దశకు విలక్షణంగా వున్నది పెట్టుబడి యెగుమతి.

పెట్టుబడిదారీ విధానం అనేది అత్యున్నత అభివృద్ధి దశకు చేరిన, శ్రమశక్తి అనేదే విక్రయ సరుకు అయినప్పటి, విక్రయ సరుకుల ఉత్పత్తి వ్యవస్థ. ఆంతరంగిక మారకపు ముఖ్యంగా అంతర్జాతీయ మారకపు పెరుగుదల పెట్టుబడిదారీ విధానపు విలక్షణ గుణం. పెట్టుబడిదారీ విధానంలో విడివిడి పారిశ్రామిక సంస్థల, పరిశ్రమ శాఖల, దేశాల అసమ, ఎగుడుదిగుడు అభివృద్ధి అనివార్యం. ఇంగ్లండు అన్నిటికంటె ముందు పెట్టుబడిదారీ దేశమైంది; 19వ శతాబ్ది మధ్యనాటికి అది స్వేచ్ఛాయుత వర్తకాన్ని అవలంబించి, "ప్రపంచ వర్క్‌షాపు"గా, సకల దేశాలకూ పారిశ్రామిక సరుకుల సరఫరాదారుగా వున్నాననీ, ఆ సరు

కులకు సాటాగా ఆ దేశాలు తనకు ముడిసరుకులు సమకూర్చాలనీ చెప్పుకుంది. కానీ, 19వ శతాబ్ది చివరి పాదంనాటికి ఇంగ్లండుయొక్క యీ గుత్తాధిపత్యం అప్పుడే బలహీనపరచ బడింది; యెందుకంటే, యితర దేశాలు "రక్షణ సుంకాల" చాటున స్వతంత్ర పెట్టుబడి దారీ దేశాలుగా అభివృద్ధి అయినాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో కొత్త రకం గుత్తాధి పత్యం యేర్పడడం కనపడుతుంది: మొదటిది, పెట్టుబడిదారీ పద్ధతిలో అభివృద్ధి అయిన దేశాలన్నిటిలోనూ పెట్టుబడిదార్ల గుత్త సంఘాలు; రెండవది, పెట్టుబడి బ్రహ్మాండమైన ప్రమాణాలలో ప్రోగుపడిన కొద్దిపాటి మహా ధనిక దేశాల గుత్త స్థానం. పురోగామి దేశాలలో అపారమైన "అదనపు పెట్టుబడి" ఉత్పన్నమైంది.

పెట్టుబడిదారీ విధానం యీనాడు ప్రతిచోటా పరిశ్రమలకంటె విపరీతంగా వెనుకబడిన వ్యవసాయాన్ని అభివృద్ధిచేయగలిగితే, అచ్చెరువు కలిగించే సాంకేతిక పురోగతి జరిగినప్పటికీ యింకా ప్రతిచోటా అర్ధకడుపులతో, దారిద్ర్య పీడితులుగా వున్న జనాల జీవన ప్రమాణా లను అది పెంచగలిగితే, అదనపు పెట్టుబడి సమస్యే లేదనడం స్పష్టం. అతి తరుచుగా పెట్టుబడిదారీ విధానపు పెటీబూర్జువా విమర్శకులు యీ "వాదం" చేస్తారు. కానీ, పెట్టుబడిదారీ విధానం యీ పనులు చేస్తే అది పెట్టుబడిదారీ విధానంగా వుండదు; యెందు కంటే, అసమ అభివృద్ధీ, జనాల అర్ధకడుపుల జీవన ప్రమాణమూ అనేవి రెండూ యీ ఉత్పత్తి విధానానికి మౌలికమైన, అనివార్యమైన పరిస్థితులుగా, పూర్వావసరాలుగా వున్నాయి. పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిదారీ విధానంగా వున్నంత కాలం, అదనపు పెట్టుబడి ఆ దేశంలోని జనాల జీవన ప్రమాణాన్ని పెంచడానికి వినియోగించబడదు, యెందుకంటే ఆ పని పెట్టుబడిదార్ల లాభాలను తగ్గిస్తుంది; పెట్టుబడిని వెనుకబడిన దేశాలకు యెగు మతి చేయడం ద్వారా లాభాలను పెంచడానికి అది వినియోగించబడుతుంది. యీ వెనుక బడిన దేశాలలో లాభాలు మామూలుగా యెక్కువగా వుంటాయి, యెందుకంటే పెట్టుబడి అరుదుగా, భూమి ధర సాపేక్షంగా తక్కువగా, వేతనాలు తక్కువగా, ముడిసరుకులు చౌకగా వుంటాయి. పలు వెనుకబడిన దేశాలు యిప్పటికే ప్రపంచ పెట్టుబడిదారీ లావాదేవీలలోకి లాగబడి వున్నందున పెట్టుబడి యెగుమతికి వీలు కలిగింది; యీ దేశాలలో ప్రధాన రైలు మార్గాలు నిర్మాణమైనాయి, లేదా నిర్మాణమౌతున్నాయి; పారిశ్రామిక అభివృద్ధికి ప్రాథమిక పరిస్థితులు సృష్టించబడినాయి, వగైరా. కొద్ది దేశాలలో పెట్టుబడిదారీ విధానం "చెడ మాగి" (వ్యవసాయంయొక్క వెనుకబాటుతనం మూలంగానూ, జనాల బీదరికం మూలం గానూ) పెట్టుబడికి లాభదాయకమైన రంగం కనపడనందున, పెట్టుబడిని యెగుమతి చేసే అవసరం ఉత్పన్నమౌతుంది.

మూడు ప్రధాన దేశాలు విదేశాలలో పెట్టిన పెట్టుబడిని రమారమిగా చూపే అంకెలు యివి:*

విదేశాలలో పెట్టిన పెట్టుబడి
(శత కోట్ల ఫ్రాంకులు)

| సంవత్సరం | గ్రేట్ బ్రిటన్ | ఫ్రాన్సు | జర్మనీ |
|---|---|---|---|
| 1862 | 3.6 | — | — |
| 1872 | 15.0 | 10 (1869) | — |
| 1882 | 22.0 | 15 (1880) | ? |
| 1893 | 42.0 | 20 (1890) | ? |
| 1902 | 62.0 | 27–37 | 12.5 |
| 1914 | 75–100.0 | 60 | 44.0 |

* Hobson, *Imperialism* ("సామ్రాజ్యవాదం"), L., 1902, p. 58; Riesser, పూర్వోక్త గ్రంథం, పేజీలు 395, 404; P. Arndt, *Weltwirtschaftliches Archiv*,[145] Bd. 7, 1916, S. 35; Neymarck, *Bulletin*;[146] హిల్ఫెర్డింగ్, "ఫైనాన్స్ పెట్టుబడి," పేజి 492; Lloyd George, మే 4న, 1915 హౌస్ ఆఫ్ కామన్స్‌లో యిచ్చిన ఉపన్యాసం, "Daily Telegraph,"[147] మే 5న, 1915; B. Harms, *Probleme der Weltwirtschaft* ("ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సమస్యలు"), Jena, 1912, S. 235, తరువాతి పేజీలు; Dr. Siegmund Schilder, *Entwicklungstendenzen der Weltwirtschaft* ("ప్రపంచ వ్యవస్థ అభివృద్ధిలోని ధోరణులు"), Berlin, 1912, Bd. 1, S. 150; George Paish, *Great Britain's Capital Investments etc.* ("గ్రేట్ బ్రిటన్ పెట్టిన పెట్టుబడి, వగైరా"), "Journal of the Royal Statistical Society,"[148] vol. LXXIV, 1910–11, 167వ పేజినుండి; Georges Diouritch, *L'Expansion des banques allemandes à l'étranger, ses rapports avec le développement économique de l'Allemagne* ("విదేశాలలో జర్మన్ బాంకుల విస్తరణా, జర్మనీ ఆర్థికాభివృద్ధికి దానితో సంబంధమూ"), P., 1909, p. 84.

పెట్టుబడి యెగుమతి 20వ శతాబ్ది (ప్రారంభంలో మాత్రమే బృహత్తర (ప్రమాణాలు అందుకుందని యీ పట్టీ తెలుపుతుంది. మూడు (ప్రధాన దేశాలు యుద్ధానికి ముందు విదేశాలలో పెట్టిన పెట్టుబడి మొత్తం 17,500 కోట్ల (ఫ్రాంకులకూ, 20,000 కోట్ల (ఫ్రాంకులకూ మధ్య వుండింది. 5 శాతం స్వల్ప రేటు వంతున, యీ మొత్తంనుండి వచ్చే లాభం యేడాదికి 800 కోట్లనుండి 1000 కోట్ల (ఫ్రాంకులదాకా వుండాలి. (ప్రపంచంలోని అత్యధిక భాగం దేశాలమీదా, జాతులమీదా సా(మాజ్యవాద పీడనకూ, దోపిడీకీ, కొద్దిపాటి సంపన్న దేశాల పెట్టుబడిదారీ పరభాగ్యోపజీవనానికీ, మంచి ఆధారం!

విదేశాలలో పెట్టబడిన యీ పెట్టుబడి వివిధ దేశాల మధ్య యెలా పంపకమైంది? అది యెక్కడ మదుపు పెట్టబడింది? యీ (ప్రశ్నలకు రమారమి జవాబు మాత్రమే యివ్వగలం, కానీ ఆధునిక సా(మాజ్యవాదంయొక్క కొన్ని సాధారణ సంబంధాలనూ, లంకెలనూ తెలపడానికి అది చాలు.

(ప్రపంచంలోని వివిధ భాగాలలో విదేశ పెట్టుబడియొక్క
(రమారమి) పంపకం (1910 (ప్రాంతంలో)

| | (శత కోట్ల మార్కులు) | | | |
|---|---|---|---|---|
| | (గేట్ (బిటన్ | (ఫ్రాన్సు | జర్మనీ | వెరసి |
| యూరప్ . . . . . . | 4 | 23 | 18 | 45 |
| అమెరికా . . . . . . | 37 | 4 | 10 | 51 |
| ఆసియా, ఆ(ఫికా, ఆ(స్ట్రేలియా | 29 | 8 | 7 | 44 |
| వెరసి . . . . . | 70 | 35 | 35 | 140 |

(బిటిష్ పెట్టుబడి ఎగుమతి చేయబడిన (ప్రధాన రంగాలు (బిటిష్ వలసలు; ఆసియా, వగైరాల మాట అటుంచి, అమెరికాలో కూడా అవి చాలా విస్తారంగా వున్నాయి (ఉదాహరణకు కెనడా). (బిటన్ విషయంలో, అపారమైన పెట్టుబడులు బృహత్తరమైన వలసలతో అత్యంత సన్నిహితంగా లంకింపబడివున్నాయి; సా(మాజ్యవాదానికి యీ వలసల (ప్రాముఖ్యం గురించి తర్వాత చెప్తాను. (ఫ్రాన్సు విషయంలో పరిస్థితి భిన్నం. (ఫ్రెంచి పెట్టుబడి యెగుమతులు (ప్రధానంగా యూరప్‌లో పెట్టబడినాయి, (ప్రాథమికంగా రష్యాలో

(కనీసం వెయ్యి కోట్ల ఫ్రాంకులు). యిది ప్రధానంగా రుణం పెట్టుబడి, ప్రభుత్వ రుణాలు, పారిశ్రామిక సంస్థలలో పెట్టబడిన పెట్టుబడి కాదు. బ్రిటిష్ వలస సామ్రాజ్య వాదానికి భిన్నంగా, ఫ్రెంచి సామ్రాజ్యవాదాన్ని వడ్డీ సామ్రాజ్యవాదం అనవచ్చు. జర్మనీది మూడవ రకం: దానికి వలసలు స్వల్పంగా వున్నాయి; విదేశాలలో పెట్టబడిన పెట్టుబడి యూరప్‌కూ, అమెరికాకూ మధ్య అత్యంత సమానంగా పంచబడింది.

పెట్టుబడి యెగుమతి, అది యెగుమతి చేయబడిన దేశాలలో పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని ప్రభావితం చేసి, మిక్కిలి త్వరపరుస్తుంది. కనుక, పెట్టుబడి యెగుమతికి పెట్టుబడిని యెగుమతి చేసే దేశాలలో కొంతవరకు అభివృద్ధిని అరికట్టే ధోరణి వుండ వచ్చు గానీ, అది ప్రపంచ మంతటా పెట్టుబడిదారీ విధానపు యితోధిక అభివృద్ధిని విస్తృత పరచడం ద్వారా, ప్రగాఢపరచడం ద్వారానూ మాత్రమే అలా అరికట్టగలదు.

పెట్టుబడిని యెగుమతి చేసే దేశాలు దాదాపు సర్వదా కొన్ని "సౌకర్యాలు" పొంద గలవు; వీటి స్వభావం ఫైనాన్స్ పెట్టుబడికీ, గుత్తసంస్థలకూ చెందిన యుగంయొక్క విల క్షణత్వాన్ని తెలియజేస్తుంది. ఉదాహరణకు, బెర్లిన్ పత్రిక "ది బాంక్" 1913 అక్టోబర్ సంచికలో యీ ఖండిక వచ్చింది:

"అంతర్జాతీయ పెట్టుబడి మార్కెట్‌లో యిటీవల అరిస్టోఫనిస్ లేఖినికి యోగ్యమైన ప్రహసనం నడుస్తున్నది. పలు పరాయి దేశాలు, స్పెయిన్ మొదలుకొని బాల్కన్ రాజ్యాల దాకా, రష్యా మొదలుకొని అర్జెంటీనా, బ్రెజీల్, చైనాదాకా, బహిరంగంగా గానీ, రహస్యంగా గానీ, రుణాలకొరకు డిమాండ్లతో, ఒకోసారి పట్టువిడువని డిమాండ్లతో, బడా డబ్బు మార్కెట్‌కు వస్తున్నాయి. ప్రస్తుత సమయంలో డబ్బు మార్కెట్లు ఉత్సాహంగా లేవు, రాజకీయ పరిస్థితి ఆశాజనకంగా లేదు. కానీ ఒక్క డబ్బు మార్కెట్‌కు కూడా రుణం నిరాకరించే సాహసం లేదు — తన పొరుగుది తనకంటె ముందు రుణం యివ్వడానికి అంగీ కరించి, తద్వారా యేదైనా ప్రత్యుపకారం పొందవచ్చుననే భయంతో. యీ అంతర్జాతీయ లావాదేవీలలో రుణదాత దాదాపు సర్వదా యేదో ఒక అదనపు లాభం పొందగల్గుతాడు: వాణిజ్య ఒప్పందంలో ఒక అనుకూలమైన నిబంధన, లేదా ఒక బొగ్గు వేసుకునే స్టేషన్, లేదా ఓడరేవు నిర్మించే కాంట్రాక్టు, లేదా లాభదాయకమైన ఒప్పందం, లేదా తుపాకులకు ఆర్డరు."*

ఫైనాన్స్ పెట్టుబడి గుత్తసంస్థల యుగాన్ని సృష్టించింది. గుత్తసంస్థలు ప్రతి చోటా గుత్త సూత్రాలను ప్రవేశపెడతాయి: బహిరంగ మార్కెట్‌లోని పోటీ స్థానంలో

* "Die Bank," 1913, 2, పేజీలు 1024–1025.

లాభదాయకమైన "అంకెల"ను వినియోగించుకోవడం వచ్చింది. యిచ్చిన రుణంలో కొంత భాగం రుణదాత దేశంలో కొనుగోళ్లమీద — ముఖ్యంగా యుద్ధ సామగ్రి, లేదా ఓడలు, వగైరాలకొరకు ఆర్డర్లమీద — ఖర్చుపెట్టాలని షరతు పెట్టడం అత్యంత మామూలు విషయం. గత రెండు దశాబ్దుల కాలంలో (1890–1910) ఫ్రాన్సు చాలా తరుచుగా యీ పద్ధతికి దిగింది. పెట్టుబడి యెగుమతి యీవిధంగా సరుకుల యెగుమతిని ప్రోత్సహించే సాధనం అవుతుంది. యీ సందర్భంలో, మరీ పెద్ద సంస్థల మధ్య లావాదేవీలు, షిల్డెర్ "మృదువుగా" అన్నట్లు,* "అవినీతికి అంచున వున్నాయి." జర్మనీలో క్రుప్, ఫ్రాన్సులో ష్నైడెర్, బ్రిటన్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్‌లాంటి శక్తివంతమైన బాంకులతోనూ, ప్రభుత్వాలతోనూ సన్నిహితమైన సంబంధాలు కలిగి, రుణం యేర్పాటు చేయబడేటప్పుడు సులభంగా "ఉపేక్షింప"బడజాలని సంస్థలు.

ఫ్రాన్సు రష్యాకు రుణాలు యిస్తూ, 1917దాకా కొన్ని కన్సెషన్లు కొనసాగాలని షరతు పెట్టి, 1905 సెప్టెంబర్ 16 నాటి వాణిజ్య సంధిలో దానిని "పిండింది." 1911 ఆగస్టు 19 నాడు జపాన్‌తో చేసుకున్న వాణిజ్య సంధిలో అది అదే పని చేసింది. ఆస్ట్రియాకూ, సెర్బియాకూ మధ్య యేడు నెలల విరామంతో 1906నుండి 1911 దాకా సాగిన సుంకాల యుద్ధానికి పాక్షిక కారణం యేమిటంటే, సెర్బియాకు యుద్ధ సామగ్రి సరఫరా చేయడానికి ఆస్ట్రియా, ఫ్రాన్సులు పోటీపడడం. 1908నుండి 1911వరకు ఫ్రెంచి వ్యాపార సంస్థలు సెర్బియాకు 450 లక్షల ఫ్రాంకుల యుద్ధ సామగ్రి సరఫరా చేసినాయని 1912 జనవరిలో పాల్ డెషనేల్ ప్రతినిధుల సభలో చెప్పినాడు.

సాన్ పాలో (బ్రెజిల్)లోని ఆస్ట్రో-హంగేరియన్ కాన్సల్‌నుండి వచ్చిన ఒక రిపోర్టులో యిలా వుంది: "బ్రెజీలియన్ రైల్వేలు ప్రధానంగా ఫ్రెంచి, బెల్జియన్, బ్రిటిష్, జర్మన్ పెట్టుబడిచేత నిర్మింపబడుతున్నాయి. యీ రైల్వేల నిర్మాణానికి సంబంధించిన ఫైనాన్షల్ లావాదేవీలలో యీ దేశాలు అవసరమైన రైల్వే సామగ్రికి ఆర్డర్లు యివ్వాలని షరతు పెడతాయి."

యీవిధంగా, ఫైనాన్స్ పెట్టుబడి వాస్తవానికి ప్రపంచ దేశాలన్నిటిమీదా తన వలను వేస్తుందని చెప్పవచ్చు. యిందులో వలసలలోని బాంకులూ, వాటి శాఖలూ ఒక ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నాయి. యీ విషయంలో తమకు సౌకర్యాలు చేసుకోవడంలో మరీ "విజయవంతంగా" వున్న "పాత" వలసవాద దేశాలపట్ల జర్మన్ సామ్రాజ్యవాదులు అసూయగా వున్నారు. 1904లో బ్రిటన్‌కు 2,279 శాఖలతో 50 వలస బాంకులు వుండినాయి (1910లో 5,449 శాఖలతో 72 బాంకులు వుండినాయి); ఫ్రాన్సుకు

* Schilder, పూర్వోక్త గ్రంథం, పేజీలు 346, 350, 371.

136 శాఖలతో 20 బాంకులు వుండినాయి; హాలండుకు 68 శాఖలతో 16 బాంకులు వుండినాయి; జర్మనీకి 70 శాఖలతో 13 బాంకులు "మాత్రం" వుండినాయి.* అమెరికన్ పెట్టుబడిదార్లు, తమ వంతులో, ఇంగ్లీషువాళ్లసట్లా, జర్మన్లసట్లా అసూయగా వున్నారు. 1915లో వాళ్లు యిలా ఫిర్యాదు చేసినారు: "దక్షిణ అమెరికాలో 5 జర్మన్ బాంకులకు 40 శాఖలూ, 5 బ్రిటిష్ బాంకులకు 70 శాఖలూ వున్నాయి... బ్రిటన్, జర్మనీలు అర్జెంటీనాలో, బ్రెజిల్‌లో, ఉరుగ్వేలో గత పాతిక సంవత్సరాలలో సుమారు నాలుగు నూర్ల కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టినాయి; తత్ఫలితంగా అవి రెండూ కలిసి యీ మూడు దేశాల మొత్తం వర్తకంలో 46 శాతాన్ని అనుభవిస్తున్నాయి."**

పెట్టుబడిని యెగుమతి చేసే దేశాలు ఆలంకారికార్థంలో ప్రపంచాన్ని తమ మధ్య పంచుకున్నాయి. కానీ ఫైనాన్సల్ పెట్టుబడి ప్రపంచపు వాస్తవ పంపకానికి దారితీసింది.

## 5. పెట్టుబడిదారీ సంఘాల మధ్య ప్రపంచ విభజన

గుత్త పెట్టుబడిదారీ సంఘాలూ, కార్టెళ్లూ, సిండికేట్లూ, ట్రస్టులూ మొదట స్వదేశీ మార్కెట్‌ను తమలో తాము పంచుకొని, తమ స్వదేశ ఉత్పత్తిమీద దాదాపు సంపూర్ణ యాజమాన్యాన్ని సంపాయించినాయి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో స్వదేశ మార్కెట్ అనివార్యంగా విదేశ మార్కెట్‌తో లంకింపబడివుంటుంది. పెట్టుబడిదారీ విధానం చాలా కాలం క్రితమే ప్రపంచ మార్కెట్‌ను సృష్టించింది. పెట్టుబడి యెగుమతి పెరిగిన కొద్దీ,

---

* Riesser, పూర్వోక్త గ్రంథం, 4వ కూర్పు, పేజి 375; Diouritch, పేజి 283.

** *The Annals of the American Academy of Political and Social Science* ("రాజకీయ, సామాజిక శాస్త్ర విజ్ఞానపు అమెరికన్ అకాడెమీ వార్షిక సంచికలు"), vol. LIX, May 1915, p. 301. యిదే సంపుటంలో పేజి 331లో వుంది: బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు, బెల్జియం, హాలండులు యెగుమతి చేసిన పెట్టుబడి 4,000 కోట్ల డాలర్లు, అనగా 20,000 కోట్ల ఫ్రాంకులు వుంటుందని సుప్రసిద్ధ గణాంకశాస్త్రజ్ఞుడు పైష్ ఫైనాన్సల్ తిక ప "The Statist" చివరి సంచికలో అంచనావేసినాడని.

బడా గుత్త సంఘాల విదేశ, వలస సంబంధాలూ, "పలుకుబడి ప్రాంతాలూ" సకల విధాలా విస్తరించిన కొద్దీ, పరిస్థితులు "సహజంగా" యీ సంఘాల మధ్య అంతర్జాతీయ ఒప్పందంవైపూ, అంతర్జాతీయ కార్టెళ్ల నిర్మాణంవైపూ మొగ్గినాయి.

యిది పెట్టుబడియొక్కా, ఉత్పత్తియొక్కా ప్రపంచ వ్యాపిత సాంద్రీకరణలో కొత్త దశ, వెనుకటి దశలకంటె పోలికే లేనంత ఉన్నతమైన దశ. యీ అధి గుత్తవిధానం యెలా అభివృద్ధి అయ్యేదీ చూద్దాం.

విద్యుత్ పరిశ్రమ తాజా సాంకేతిక విజయాలకు, 19వ శతాబ్ది అంతంలోనూ, 20వ శతాబ్ది ప్రారంభంలోనూ పెట్టుబడిదారీ విధానానికి అత్యంత విలక్షణమైనది. కొత్త పెట్టుబడిదారీ దేశాలలోని రెండు అగ్రశ్రేణి దేశాలైన అమెరికాలోనూ, జర్మనీలోనూ అన్నిటికంటె యెక్కువగా యీ పరిశ్రమ అభివృద్ధి అయింది. జర్మనీలో 1900 నాటి సంక్షోభం దీని సాంద్రీకరణకు మరీ బలమైన వూపు యిచ్చింది. సంక్షోభ కాలంలో బాంకులు, అప్పటికి పరిశ్రమలతో బాగా సంయోగం చెందినట్టివి, సాపేక్షంగా చిన్నవైన సంస్థల వినాశనాన్నీ, పెద్ద బాంకులు వాటిని లీనంచేసుకోవడాన్నీ మిక్కిలి త్వరపరచి, తీవ్రపరచినాయి. ఎయ్‌డెల్స్ యిలా రాస్తాడు: "బాంకులు యే సంస్థలకు పెట్టుబడి అత్యంత అవసరమో సరిగ్గా వాటికే సహాయం నిరాకరించి, తమతో తగినంత సన్నిహిత సంబంధం లేని కంపెనీలకు మొదట ముమ్మరమైన వికాసాన్నీ, తరువాత దౌర్భాగ్యపు వైఫల్యాన్నీ కలిగించినాయి."*

ఫలితంగా, 1900 తర్వాత, సాంద్రీకరణ గొప్ప అంగలతో పురోగమించింది. 1900 వరకు విద్యుత్ పరిశ్రమలో యేడెనిమిది "బృందాలు" వుండినాయి. ప్రతిదానిలోనూ కొన్ని కంపెనీలు వుండినాయి (అన్నీ కలిసి 28 కంపెనీలు వుండినాయి), ప్రతిదానికీ 2నుండి 11దాకా బాంకుల మద్దతు వుండింది. 1908కీ 1912కూ మధ్య యీ బృందాలన్నీ రెండుగానో, ఒకటిగానో సంలీనం చెందినాయి. యీకింది చిత్రం యీ క్రమాన్ని తెలుపుతుంది (216వ పేజి చూడండి).

యీవిధంగా పెరిగిన ప్రసిద్ధ A.E.G. ("జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ") 175 నుండి 200దాకా కంపెనీలనూ ("భాగస్వామ్య" పద్ధతి ద్వారా), సుమారు 150 కోట్ల మార్కుల మొత్తం పెట్టుబడినీ అజమాయిషీ చేస్తున్నది. విదేశాలలో ప్రత్యక్ష యేజన్సీలు మాత్రమే దానికి 34 వున్నాయి, అందులో 12 జాయింటు స్టాక్ కంపెనీలు, యివి 10కిపైగా దేశాలలో వున్నాయి. 1904 నాటికే జర్మన్ విద్యుత్ పరిశ్రమ విదేశాలలో

---

* ఎయ్‌డెల్స్, పూర్వోక్త గ్రంథం, పేజి 232.

విద్యుత్ పరిశ్రమలో బృందాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1900కు ముందు | ఫెల్టెన్ అండ్ గిల్యోమ్ | లామెయర్ | యూనియన్ A.E.G. | సీమెన్స్ అండ్ హాల్స్కె | షూకెర్ట్ అండ్ కో | బెర్గ్మన్ | కుమ్మెర్ |
| | ఫెల్టెన్ అండ్ లామెయర్ | | A.E.G. (జి.ఇ.సి.) | సీమెన్స్ అండ్ హాల్స్కె—షూకెర్ట్ | | బెర్గ్మన్ | 1900లో దివాలా తీసింది |
| | A.E.G. (జి.ఇ.సి.) | | | సీమెన్స్ అండ్ హాల్స్కె—షూకెర్ట్ | | | |
| 1912 నాటికి | (1908నుండి సన్నిహిత "సహకారం" కలిగివున్నాయి) | | | | | | |

పెట్టిన పెట్టుబడి 233 మిలియన్ల మార్కులుగా అంచనావేయబడింది. యీ మొత్తంలో 62 మిలియన్లు రష్యాలో పెట్టబడింది. A.E.G. బ్రహ్మాండమైన "సంయోగం" అని చెప్పనక్కరలేదు – దాని ఉత్పాదక కంపెనీలు మాత్రమే 16కు తక్కువ లేవు; కేబుల్సు, ఇన్సులేటర్లు మొదలుకొని మోటారుకార్లు, విమానాలూ దాకా అత్యంత వివిధమైన వస్తువులు అది తయారుచేస్తుంది.

కానీ యూరప్‌లోని సాంద్రీకరణ యీకింది విధంగా అభివృద్ధి అయిన అమెరికాలోని సాంద్రీకరణ క్రమంలో ఒక భాగం కూడా:

| | | |
|---|---|---|
| | "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (General Electric C°) | |
| సంయుక్త రాష్ట్రాలు: | థాంప్సన్—హౌస్టన్ కంపెనీ యూరప్‌లో ఒక సంస్థను నెల కొల్పుతుంది | ఎడిసన్ కంపెనీ యూరప్‌లో "ఫ్రెంచి ఎడిసన్ కంపెనీ"ని నెలకొల్పుతుంది; అది తన పేటెంట్లను జర్మన్ సంస్థకు బదలాయిస్తుంది |
| జర్మనీ: | "యూనియన్ ఎలెక్ట్రిక్ కంపెనీ" | "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (A.E.G) |
| | "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (A.E.G) | |

యీవిధంగా రెండు విద్యుత్ "మహా శక్తులు" యేర్పడినాయి: "వీటినుండి సంపూర్ణంగా స్వతంత్రమైన యితర విద్యుత్ కంపెనీలు ప్రపంచంలో లేవు" అని హైనిగ్ "ఎలెక్ట్రిక్ ట్రస్టు మార్గం" అనే వ్యాసంలో రాసినాడు. యీ రెండు ట్రస్టులకు చెందిన సంస్థల టర్నోవరూ, పరిమాణమూ గురించిన ఒక అభిప్రాయం, సంపూర్ణమైనది కాక పోయినా, యీకింది అంకెల ద్వారా లభిస్తుంది:

| | టర్నోవర్ (మిలియన్ల మార్కులు) | ఉద్యోగుల సంఖ్య | నికర లాభాలు (మిలియన్ల మార్కులు) |
|---|---|---|---|
| అమెరికా: "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (G.E.C.) . . | 1907: 252<br>1910: 298 | 28,000<br>32,000 | 35.4<br>45.6 |
| జర్మనీ: "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (A.E.G.) . . | 1907: 216<br>1911: 362 | 30,700<br>60,800 | 14.5<br>21.7 |

తరువాత 1907లో జర్మన్, అమెరికన్ ట్రస్టులు ఒప్పందం చేసుకొని, ప్రపంచాన్ని తమ మధ్య పంచుకున్నాయి. వాటి మధ్య పోటీ ఆగిపోయింది. అమెరికన్ "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (G.E.C.) సంయుక్త రాష్ట్రాలనూ, కెనడానూ "పొందింది." జర్మన్ "జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ" (A.E.G.) జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, హాలెండు, డెన్మార్కు, స్విట్జర్లండు, టర్కీ, బాల్కన్లను "పొందింది." కొత్త పరిశ్రమల శాఖలలోకీ, లాంఛన గతంగా యింకా కేటాయించబడని కొత్త దేశాలలోకీ "కూతురు కంపెనీలు" చొరడం గురించి ప్రత్యేక ఒప్పందాలు, సహజంగా రహస్యమైనవి, చేసుకోబడినాయి. రెండు ట్రస్టులూ సృజనలూ, ప్రయోగాలూ యిచ్చిపుచ్చుకోవాలి.*

* Riesser, పూర్వోక్త గ్రంథం; Diouritch, పూర్వోక్త గ్రంథం, పేజి 239; Kurt Heinry, పూర్వోక్త వ్యాసం.

పలు వందల కోట్ల పెట్టుబడిమీద అజమాయిషీ చేస్తూ, ప్రపంచపు ప్రతి మూల లోనూ "శాఖలూ," యేజన్సీలూ, ప్రతినిధులూ, లంకెలూ, వగైరా కలిగి, వాస్తవంగా ఒకేఒక ప్రపంచ వ్యాప్త ట్రస్టు అయిన యీ ట్రస్టుతో పోటీ చేయడం యెంత కష్ట మైందీ స్వయంవ్యక్తం. కానీ, రెండు శక్తివంతమైన ట్రస్టుల మధ్య ప్రపంచ పంపకం — అసమ అభివృద్ధి, యుద్ధం, దివాలా, వగైరాల ఫలితంగా బలాబలాలు మారితే — పునః పంపకాన్ని కాదనదు.

అలాంటి పునఃపంపక ప్రయత్నానికి, పునఃపంపకంకొరకు పోరాటానికి, జ్ఞానదాయక మైన ఉదాహరణను నూనె పరిశ్రమ సమకూర్చింది.

1905లో ఎయ్‌డెల్స్ యిలా రాసినాడు: "ప్రపంచ నూనె మార్కెట్ యీనాడు కూడా రెండు గొప్ప ఫైనాన్షల్ బృందాల మధ్య పంపకమైంది — రాక్‌ఫెల్లర్‌కు చెందిన స్టాండర్డ్ ఆయిల్ కంపెనీకీ, బాకూలోని రష్యన్ నూనె క్షేత్రాలమీద అజమాయిషీ చేసే రోత్‌షిల్డ్, నోబెల్‌లకూ మధ్య. యీ రెండు బృందాలకూ సన్నిహితమైన లంకె వుంది. కానీ, కొన్ని సంవత్సరాలుగా అయిదు శత్రువులు వాటి గుత్తాధిపత్యానికి ప్రమాదకరంగా వున్నాయి:"* (1) అమెరికన్ నూనె క్షేత్రాలు ఇగిరిపోవడం; (2) బాకూకు చెందిన మాంతాషెవ్ సంస్థ పోటీ; (3) ఆస్ట్రియన్ నూనె క్షేత్రాలు; (4) రుమేనియన్ నూనె క్షేత్రాలు; (5) విదేశాల నూనె క్షేత్రాలు, ముఖ్యంగా డచ్చి వలసలలోనివి (తాము కూడా బ్రిటిష్ పెట్టుబడితో లంకింపబడిన మహా ధనిక సంస్థలు శామ్యూయెల్, షెల్). చివరి మూడు బృందాలూ బ్రహ్మాండమైన "డోయిచె బాంక్" అగ్రేసరత్వాన గల పెద్ద జర్మన్ బాంకులతో లంకింపబడివున్నాయి. యీ బాంకులు తమ "సొంత" కాలిపట్టు సంపాయించు కోడానికి, ఉదాహరణకు రుమేనియాలో నూనె పరిశ్రమను స్వతంత్రంగా, క్రమపద్ధతిగా అభివృద్ధి చేసినాయి. రుమేనియన్ నూనె పరిశ్రమలో విదేశీ పెట్టుబడి 1,850 లక్షల ఫ్రాంకులుగా 1907లో అంచనా వేయబడింది, అందులో 740 లక్షలు జర్మన్ పెట్టుబడి.**

ఆర్థిక సారస్వతంలో అనేటట్లు "ప్రపంచ పంపకం"కొరకు పోరాటం ప్రారంభ మైంది. ఒకవైపున, రాక్‌ఫెల్లర్ "స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ" ప్రతిదానినీ సంగ్రహించు కోదలచుకుంది; అది హాలండు గడ్డమీదనే "కూతురు కంపెనీ" నిర్మించి, తన ప్రధాన శత్రువైన డచ్చి-ఇంగ్లీష్ "షెల్" ట్రస్టును దెబ్బతీయడానికి డచ్చి ఇండీస్‌లోని నూనె క్షేత్రాలను కొనేసింది. మరొకవైపున, "డోయిచె బాంక్," యితర జర్మన్ బాంకులూ

* ఎయ్‌డెల్స్, పూర్వోక్త గ్రంథం, పేజీలు 192–193.

** Diouritch, పూర్వోక్త గ్రంథం, పేజీలు 245–246.

రుమేనియాను "తమకే" "నిలుపుకో"వాలనీ, రాక్‌ఫెల్లర్‌కు వ్యతిరేకంగా దానిని రష్యాతో సమైక్యం చేయాలనీ లక్షించినాయి. రాక్‌ఫెల్లర్‌కు యెంతో యెక్కువ పెట్టుబడీ, నూనె రవాణాకూ, పంపకానికీ శ్రేష్ఠమైన వ్యవస్థా వుండినాయి. పోరాటం అంతం కాక తప్పలేదు, 1907లో అంతం అయింది, "డోయిచె బాంక్" చిత్తుగా ఓడిపోయింది; దానికి వుండిన మార్గాంతరాలు యివి: తన "నూనె ప్రయోజనా"లను రద్దుచేసుకొని మిలియన్లు నష్టపడడం, లేదా లొంగిపోవడం. అది లొంగుబాటును ఎన్నుకొని, "నూనె ట్రస్టు"తో చాలా అనుకూలమైన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం "అమెరికన్ ప్రయోజనాలకు హాని కలిగించే పని యేదీ ప్రయత్నించకుండా వుండడానికి" "డోయిచె బాంక్" అంగీకరించింది. కానీ, జర్మనీ ప్రభుత్వ నూనె గుత్తసంస్థను నెలకొల్పే సందర్భంలో ఒప్పందాన్ని రద్దుచేయడానికి సౌకర్యం కలిగించబడింది.

తరువాత "నూనె ప్రహసనం" ప్రారంభమైంది. జర్మన్ ఫైనాన్స్ ప్రభువులలో ఒకడు, "డోయిచె బాంక్" డైరెక్టరు అయిన ఫన్ గ్విన్నర్, తన ప్రైవేటు సెక్రెటరీ షౌస్ ద్వారా ప్రభుత్వ నూనె గుత్తాధిపత్యంకొరకు ఉద్యమం ప్రారంభించినాడు. అతి పెద్ద జర్మన్ బాంకియొక్క బ్రహ్మాండమైన యంత్రాంగమూ, దాని విస్తృతమైన "లంకెలూ" పని ప్రారంభించినాయి. పత్రికావళి అమెరికన్ ట్రస్టు "పెత్తనం"మీద "దేశభక్తియుత" ఆగ్రహంతో కుతకుతలాడింది; నూనె గుత్తసంస్థను నెలకొల్పడానికి బిల్లు ప్రవేశపెట్టమని ప్రభుత్వాన్ని కోరే తీర్మానం 1911 మార్చి 15న రైహ్‌స్టాగ్‌చేత దాదాపు యేకగ్రీవంగా ఆమోదింపబడింది. ప్రభుత్వం యీ "ప్రజారంజకమైన" భావాన్ని వినియోగించుకుంది, తన అమెరికన్ అనురూప సంస్థను వంచించి, ప్రభుత్వ గుత్తసంస్థ ద్వారా తన వ్యాపారాన్ని మెరుగుపరుచుకోవాలని ఆశించిన "డోయిచె బాంక్" ఆట గెలిచినట్లు కనిపించింది. జర్మన్ నూనె ప్రభువులు అప్పుడే రష్యన్ చక్కెర ఉత్పత్తిదార్ల లాభాలకంటె తక్కువ కాని బ్రహ్మాండమైన లాభాలకోసం ఉవ్విళ్లూరారు.... కానీ, మొదటిది, బడా జర్మన్ బాంకులు కొల్లసొమ్ము పంపకం గురించి తమలో తాము కొట్లాడుకున్నాయి. "డోయిచె బాంక్" దురాశా లక్ష్యాలను "డిస్కాంటొ గెసెల్‌షాఫ్ట్" వెల్లడిచేసింది. రెండవది, రాక్‌ఫెల్లర్‌తో రాబోయే పోరాటానికి ప్రభుత్వం జడిసింది; యెందుకంటే, జర్మనీ యితర మూలాధారాలనుండి నమ్మకంగా నూనె సంపాయిస్తుందనేది (రుమేనియా ఉత్పత్తి స్వల్పం) సందేహాస్పదంగా వుండింది. మూడవది, సరిగ్గా ఆ సమయంలో, జర్మనీ యుద్ధసన్నాహాలకుగాను 1913 నాటి వంద కోట్ల మార్కుల రుణాలు వోటుచేయబడినాయి. నూనె గుత్తసంస్థ పథకం వాయిదాపడింది. పోరాటంనుండి రాక్‌ఫెల్లర్ "నూనె ట్రస్టు" తత్కాలానికి విజేతగా బయటపడింది.

విద్యుత్ గుత్తాధిపత్యాన్ని నెలకొల్పి, నీటిశక్తిని చౌక విద్యుచ్ఛక్తిగా మార్చడం ద్వారా మాత్రమే జర్మనీ "నూనె ట్రస్టు"తో పోరాడగలదని యీ సందర్భంలో జర్మన్ పత్రిక "ది బాంక్" రాసింది. అది యింకా యిలా అంది: "కానీ, విద్యుత్ గుత్తాధిపత్యం ఉత్పత్తిదారులకు అవసరమైనప్పుడు వస్తుంది, అనగా, విద్యుత్ పరిశ్రమలో వచ్చే విలయం ఆసన్నమైనప్పుడు, ప్రతిచోటా యిప్పుడు ప్రైవేటు విద్యుత్ సంస్థలచేత మహా ఖర్చుతో నిర్మించబడే బ్రహ్మాండమైన, వ్యయభరితమైన విద్యుత్ స్థావరాలు, యిప్పటికే పట్టణాలూ, రాజ్యాలూ, వగైరాలనుండి కొన్ని సౌకర్యాలు పొందుతున్నట్టివి, లాభంతో యిక యెంత మాత్రమూ పనిచేయజాలనప్పుడు, ఇక నీటి శక్తిని ఉపయోగించవలసివస్తుంది. కానీ ప్రభుత్వ ఖర్చుతో దానిని చౌక విద్యుచ్ఛక్తిగా మార్చడం అసాధ్యం; దానిని 'ప్రభుత్వ అజమాయిషీ కింద వున్న ప్రైవేటు గుత్తసంస్థకు అందజేయవలసివుంటుంది;' యెందుకంటే, ప్రైవేటు పరిశ్రమ యిప్పటికే పలు కాంట్రాక్టులు చేసుకొని, భారీ నష్టపరిహారానికి షరతు విధించింది.... నైట్రేట్ గుత్తాధిపత్యంలో యిదే జరిగింది, నూనె గుత్తాధిపత్యంలో యిదే జరుగుతున్నది, విద్యుచ్ఛక్తి గుత్తాధిపత్యంలో యిదే జరుగుతుంది. అందమైన సూత్రంచేత గుడ్డివాళ్లైన మన ప్రభుత్వ సోషలిస్టులు, జర్మనీలో గుత్తసంస్థలు వినియోగదారులకు లాభం కలిగించే లక్ష్యాన్ని యెన్నడూ పెట్టలేదనీ, వాటికి ఆ ఫలితం యెన్నడూ లేదనీ, ప్రమోటర్ల లాభాలలో కొంత భాగాన్ని ప్రభుత్వానికి యిచ్చే లక్ష్యాన్ని కూడా అవి పెట్టలేదనీ, చివరకు అర్థంచేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఆ గుత్తసంస్థలు, దివాలా తీయడానికి సిద్ధంగా వున్న ప్రైవేటు పరిశ్రమలు ప్రభుత్వ ఖర్చుతో కోలుకోవడానికి మాత్రమే ఉపయోగపడినాయి."*

యిలా వున్నాయి జర్మన్ బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు చేయకతప్పని విలువైన ఒప్పుదలలు. ఫైనాన్స్ పెట్టుబడి యుగంలో ప్రైవేటు గుత్తసంస్థలూ, ప్రభుత్వ గుత్తసంస్థలూ యెలా పెనవేసుకున్నదీ, ప్రపంచ విభజనకు బడా గుత్తాధిపతుల మధ్య జరిగే సామ్రాజ్యవాద పోరాటంలో యెలా యీ రెండూ విడివిడి లంకెలు మాత్రమే అయిందీ యిక్కడ మనకు స్పష్టంగా కనపడుతుంది.

వర్తక ఓడలలో సాంద్రీకరణ ప్రచండమైన అభివృద్ధి కూడా ప్రపంచ పంపకానికి దారితీసింది. జర్మనీలో రెండు శక్తివంతమైన కంపెనీలు ముందుకు వచ్చినాయి: "హాంబుర్గ్ – అమెరికా," "ఉత్తర జర్మనీ లాయిడ్" – ప్రతిదానికీ 20 కోట్ల మార్కుల పెట్టు

---

* "Die Bank," 1912, 2, పేజీలు 629, 1036; 1913, 1, పేజి 388.

బడి (స్టాకులలో, బాండ్లలో), 1,850 లక్షలనుండి 1,890 లక్షల మార్కులదాకా విలువగల ఓడలూ వున్నాయి. మరొకవైపున, అమెరికాలో 1903 జనవరి 1న మోర్గన్ ట్రస్టు అని పేరు కెక్కిన "ఇంటర్నేషనల్ మెర్కంటైల్ మెరీన్ కంపెనీ" యేర్పడింది. అది అమెరికన్, బ్రిటిష్ ఓడల కంపెనీలను తొమ్మిదింటిని యేకంచేసి, 12 కోట్ల డాలర్ల (48 కోట్ల మార్కుల) పెట్టుబడిని కలిగివుండింది. 1903 నాటికే జర్మన్ మహా కాయులూ, యీ అమెరికన్-బ్రిటిష్ ట్రస్టూ ప్రపంచాన్ని పంచుకోడానికి ఒప్పందం చేసుకున్నాయి, లాభాల పంపకపు పర్యవసానంతో. ఆంగ్లో-అమెరికన్ ఓడ ప్రయాణాలతో పోటీచేయకుండా జర్మన్ కంపెనీలు ఒప్పుకున్నాయి. యే రేవులు యెవరికి "కేటాయించిందీ" కచ్చితంగా నిర్ణయించబడినాయి; సంయుక్త అజమాయిషీ కమిటీ నెలకొల్పబడింది, వగైరా. యీ ఒప్పందం యిరవై యేండ్లకు చేసుకోబడింది, యుద్ధ సందర్భంలో దానిని రద్దుచేసుకోవాలనే వివేకవంతపు నిబంధనతో.*

అంతర్జాతీయ రైలు పట్టాల కార్టెల్ నిర్మాణపు కథ కూడా మహా విషయబోధకమైనది. బ్రిటిష్, బెల్జియన్, జర్మన్ రైలు పట్టాల ఉత్పత్తిదార్లు అలాంటి కార్టెల్‌ను నిర్మించడానికి చేసిన మొదటి ప్రయత్నం 1884లోనే జరిగింది, తీవ్ర పారిశ్రామిక మాంద్య కాలంలో. ఉత్పత్తిదార్లు స్వదేశ మార్కెట్లలో ఒకరితో ఒకరు పోటీచేయకుండా ఒప్పుకొని, విదేశ మార్కెట్లకు యీకింది కోటాల వంతున పంచుకున్నారు: గ్రేట్ బ్రిటన్ 66 శాతం, జర్మనీ 27 శాతం, బెల్జియం 7 శాతం. భారతదేశం పూర్తిగా గ్రేట్ బ్రిటన్‌కు రిజర్వుచేయబడింది. కార్టెల్‌కు వెలుపల వున్న ఒక బ్రిటిష్ సంస్థమీద సంయుక్త యుద్ధం ప్రకటింపబడింది; దీని ఖర్చుకుగాను అన్ని అమ్మకాలమీదా కొంత శాతం లెవీ విధించబడింది. కానీ, 1886లో రెండు బ్రిటిష్ సంస్థలు దీనిలోనుండి ఉపసంహరించుకొన్నప్పుడు, యిది కూలిపోయింది. తరువాతి వికాస కాలాలలో ఒప్పందం సాధింపబడజాలకపోవడం విలక్షణమైనది.

1904 ప్రారంభంలో జర్మన్ ఉక్కు సిండికేటు యేర్పడింది. 1904 నవంబరులో, యీకింది కోటాలతో అంతర్జాతీయ రైలు పట్టాల కార్టెల్ పునరుద్ధరించబడింది: బ్రిటన్ 53.5 శాతం, జర్మనీ 28.83 శాతం, బెల్జియం 17.67 శాతం. ఫ్రాన్సు తదనంతరం వచ్చి మొదటి, రెండవ, మూడవ సంవత్సరాలలో వరుసగా 4.8 శాతం, 5.8 శాతం, 6.4 శాతం పొందింది – 100 శాతపు పరిమితికిపైగా, అనగా మొత్తం 104.8 శాతం, వగైరా. 1905లో "సంయుక్త రాష్ట్రాల ఉక్కు కార్పొరేషన్" కార్టెల్‌లో చేరింది; తరువాత ఆస్ట్రియా, స్పెయిన్ చేరినాయి. 1910లో ఫొగెల్‌స్టైన్

* Riesser, పూర్వోక్త గ్రంథం, పేజి 125.

యిలా రాసినాడు: "ప్రస్తుతం ప్రపంచ పంపకం పూర్తి అయింది; పెద్ద వినియోగదారులు, ప్రధానంగా ప్రభుత్వ రైల్వేలు — వాటి ప్రయోజనాలను పరిగణించకుండా ప్రపంచం పంచుకోబడింది గనుక — యిప్పుడు కవి పుంగవునిలాగ స్వర్గ వీధుల్లో విహరించవచ్చు."*

1909లో స్థాపించబడిన "అంతర్జాతీయ తుత్తునాగం సిండికేట్"ను కూడా ప్రస్తావించనివ్వండి; అది అయిదు ఫాక్టరీ బృందాల మధ్య ఉత్పత్తిని కచ్చితంగా కేటాయించింది: జర్మన్, బెల్జియన్, ఫ్రెంచి, స్పానిష్, బ్రిటిష్. "అంతర్జాతీయ డైనమైట్ ట్రస్టు"ను కూడా ప్రస్తావించనివ్వండి; అది "అదే పద్ధతిలో సంఘటితమైన ఫ్రెంచి, అమెరికన్ డైనమైట్ ఉత్పత్తిదార్లలో కలిసి యావత్ప్రపంచాన్నీ తమ మధ్య పంచుకున్నారనదగిన సకల జర్మన్‌ల ప్రేలుడు పదార్థాల ఉత్పత్తిదార్ల ఆధునిక, సన్నిహిత కూటమి" అని లీఫ్మన్ అంటాడు.**

జర్మనీకి భాగం వుండిన అంతర్జాతీయ కార్టెళ్లు 1897లో మొత్తం సుమారు నలభై వుండినాయనీ, 1910లో సుమారు నూరు వుండినాయనీ లీఫ్మన్ లెక్కగట్టినాడు.

అంతర్జాతీయ కార్టెళ్లు, పెట్టుబడియొక్క అంతర్జాతీయకరణకు అత్యంత ప్రస్ఫుటమైన వ్యక్తీకరణలలో ఒకటిగా వున్నాయి గనుక, పెట్టుబడిదారీ విధానంలో జాతుల మధ్య శాంతికి ఆశ కల్పిస్తాయనే అభిప్రాయాన్ని కొందరు బూర్జువా రచయితలు వెలిబుచ్చినారు (కార్ల్ కౌట్స్కీ తాను, ఉదాహరణకు 1909లో, అవలంబించిన మార్క్సిస్టు వైఖరిని పూర్తిగా విసర్జించి యిప్పుడు వాళ్లలో కలిసినాడు). సిద్ధాంతరీత్యా యీ అభిప్రాయం పరమ అసంబద్ధం, కాగా, ఆచరణలో యిది కూటతర్కమూ, అత్యంత హీనమైన అవకాశవాదపు వంచక సమర్థనా. పెట్టుబడిదారీ గుత్తసంస్థలు యెంత పెద్దగా పెరిగినాయో, పెట్టుబడిదారీ సంఘాల పోరాటం *దేనికోసం* జరుగుతుందో అంతర్జాతీయ కార్టెళ్లు తెలుపుతాయి. యీ చివరి విషయం అత్యంత ముఖ్యమైనది; యిది మాత్రమే జరుగుతున్నదాని చారిత్రక ఆర్థిక అర్థాన్ని మనకు తెలుపుతుంది; యెందుకంటే, పోరాటపు *రూపం* మారవచ్చు, సాపేక్షంగా నిర్దిష్టమైన, తాత్కాలికమైన కారణాలనుబట్టి నిరంతరంగా మారుతుంది కూడా, కానీ పోరాటపు *సారం*, దాని వర్గ *సారం*, వర్గాలు వున్నంత కాలం *మారజాలదు*. ఉదాహరణకు, ప్రస్తుత ఆర్థిక పోరాటపు *సారాన్ని* (ప్రపంచ పంపకాన్ని) మసకపరచడానికీ, ఒకసారి ఒక పోరాట *రూపాన్నీ*, మరొకసారి మరొకదాన్నీ నొక్కి చెప్పడానికి చేసే వాదాలలో (యీ విషయాన్ని నేను తరువాత వివరిస్తాను) కౌట్స్కీ ఆచరణలో

* Vogelstein, *Organisationsformen*, పేజి 100.

** Liefmann, *Kartelle und Trusts*, 2. A., పేజి 161.

జర్మన్ బూర్జువావర్గ పక్షానికి మారడం, సహజంగానే, వాళ్ల ప్రయోజనాలకు అనుగుణంగా వుంది. కౌట్స్కీ అదే పొరపాటు చేస్తాడు. సహజంగానే, చెప్పేది జర్మన్ బూర్జువావర్గం గురించి మాత్రమే కాదు, ప్రపంచమంతటా వున్న బూర్జువావర్గం గురించి. పెట్టుబడిదార్లు ప్రపంచాన్ని పంచుకునేందుకు వాళ్ళ చెడ్డ ధర్మం కారణం కాదు, లాభాలు పొందడానికి చేరిన సాంద్రీకరణ స్థాయి వాళ్లచేత యిలా చేయిస్తుంది. యిక వాళ్లు పంచుకునేది "పెట్టుబడి అనుపాతంబట్టి," "బలం అనుపాతంబట్టి" యెందుకంటే, విక్రయ సరుకుల ఉత్పత్తి వ్యవస్థలోనూ, పెట్టుబడిదారీ విధానంలోనూ మరొక పంపకపు పద్ధతి యేదీ వుండజాలదు. కానీ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి స్థాయి మారినప్పుడు బలం మారుతుంది. యేమి జరుగుతున్నదీ అర్థంచేసుకోడానికి, బలంలోని మార్పులతో యే సమస్యలు పరిష్కరింపబడేదీ తెలుసుకోవడం అవసరం. యీ మార్పులు "శుద్ధ" ఆర్థికమైనవా, లేక ఆర్థికేతర (ఉదాహరణకు, సైనిక)మైనవా అనే సమస్య అప్రధానమైనది; యిది పెట్టుబడిదారీ విధానంలోని అధునాతన యుగం గురించిన మౌలిక అభిప్రాయాలను యేమాత్రమూ మార్చజాలదు. పెట్టుబడిదారీ సంఘాల మధ్య జరిగే పోరాటం ఒప్పందాల సారానికి సంబంధించిన సమస్య స్థానంలో, పోరాటం, ఒప్పందాల పోరాట రూపానికి (యీనాడు శాంతియుతంగా, రేపు సాయుధంగా, మరుదినం మళ్లీ సాయుధంగా వుండేదానికి) సంబంధించిన సమస్యను పెట్టడం కూటతర్కపు స్థాయికి దిగజారడ మౌతుంది.

పెట్టుబడిదారీ విధానంలోని అధునాతన దశకు చెందిన యుగం మనకు తెలియజేసేదే మంటే, ప్రపంచ ఆర్థిక పంపకం ప్రాతిపదికమీద పెట్టుబడిదారీ సంఘాల మధ్య కొన్ని సంబంధాలు కుదురుతాయి అనీ, దానికి సమాంతరంగానూ, దాని సంబంధంతోనూ, ప్రపంచ భౌగోళిక పంపకంయొక్క, వలసలకొరకు జరిగే పోరాటంయొక్క, "పలుకుబడి ప్రాంతాలకొరకు జరిగే పోరాటం"యొక్క ప్రాతిపదికమీద, రాజకీయ కూటముల మధ్యా, రాజ్యాల మధ్యా కొన్ని సంబంధాలు కుదురుతాయి అనీ.

## 6. గొప్ప రాజ్యాల మధ్య ప్రపంచ విభజన

"యూరపియన్ వలసల ప్రాదేశికాభివృద్ధి"* అనే తన పుస్తకంలో భూగోళ శాస్త్ర

* A. Supan, *Die territoriale Entwicklung der europäischen Kolonien* ("యూరపియన్ వలసల ప్రాదేశికాభివృద్ధి"), 1906, పేజి 254.

జ్ఞుడు ఎ. సుపాన్ 19వ శతాబ్దాంతంలో ఆ అభివృద్ధిని గురించి యీకింది సంక్షేప సారాంశం యిచ్చినాడు:

యూరపియన్ వలస రాజ్యాలకు
(అమెరికా సం. రా.తోసహా) చెందిన ప్రదేశాల శాతం

| | 1876 | 1900 | యెక్కువ లేక తక్కువ |
|---|---|---|---|
| ఆఫ్రికాలో . . . . . | 10.8% | 90.4% | +79.6% |
| పాలినీషియాలో . . . . | 56.8% | 98.9% | +42.1% |
| ఆసియాలో . . . . . | 51.5% | 56.6% | +5.1% |
| ఆస్ట్రేలియాలో . . . . | 100.0% | 100.0% | – |
| అమెరికాలో . . . . . | 27.5% | 27.2% | –0.3% |

"కనుక యీ దశయొక్క విలక్షణ గుణం ఆఫ్రికానూ, పాలినీషియానూ పంచుకోవడం" అని సుపాన్ తాత్పర్యం చెప్పినాడు. ఆసియాలోనూ, అమెరికాలోనూ అనాక్రమిత ప్రాంతాలు – అనగా యే రాజ్యానికీ చెందని ప్రాంతాలు – లేవు గనుక సుపాన్ తాత్పర్యాన్ని విస్తృతపరచవలసివుంది: యీ దశయొక్క విలక్షణ గుణం భూమండల అంతిమ విభజన, అంతిమం అంటే పునర్విభజన అసాధ్యమని కాదు; పునర్విభజనలు సాధ్యమే కాక అనివార్యం కూడా. అంతిమం అంటే, పెట్టుబడిదారీ దేశాల వలస విధానం మన భూమండలంమీది అనాక్రమిత ప్రాంతాల ఆక్రమణను పూర్తిచేసిందనే అర్థంలో. మొట్టమొదటి సారిగా ప్రపంచం సంపూర్ణంగా విభజింపబడింది; కనుక భవిష్యత్తులో పునర్విభజన మాత్రమే సాధ్యమౌతుంది, అనగా ప్రాంతాలు ఒక "యజమాని"నుండి మరొక "యజమాని"కిందికి మాత్రమే మారగలవు, యజమానిలేని ప్రాంతం ఒక "యజమాని"కిందికి మారడం అనేది వుండదు.

కనుక మన మిప్పుడు ప్రపంచ వలస విధానానికి చెందిన ఒక విలక్షణ యుగంలో వున్నాం; యిది "పెట్టుబడిదారీ విధానంయొక్క అధునాతన దశ"తో, ఫైనాన్స్ పెట్టుబడితో, అత్యంత సన్నిహితంగా ముడివడి వుంది. యీ కారణం వలన, గతించిన యుగాలలో లేని విలక్షణ గుణాలు యీ యుగంలో యేమి వున్నాయి అనేదీ, ప్రస్తుత సన్నివేశం యేమిటి అనేదీ తేల్చుకోడానికి, అన్నిటికంటె ముందుగా వాస్తవాలను యింకా చాలా సవివరంగా

పరిశీలించాలి. మొట్టమొదట వాస్తవాలకు సంబంధించిన ప్రశ్నలు రెండు ఉత్పన్నమౌతాయి: సరిగ్గా యీ ఫైనాన్సు పెట్టుబడి యుగంలోనే వలస విధానం తీవ్రం కావడం, వలసల కొరకు పోరాటం తీవ్రం కావడం, కనపడుతున్నదా? యీ విషయంలో, ప్రపంచం యీనాడు యేవిధంగా విభజింపబడి వుంది?

మోరిస్ అనే అమెరికన్ రచయిత వలసల చరిత్రమీద రాసిన గ్రంథంలో,* 19వ శతాబ్దపు వివిధ భాగాలలో బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీల వలస ఆస్తుల వివరాలను క్రోడీకరించే ప్రయత్నం చేసినాడు. అతను సాధించిన ఫలితాల సంక్షిప్త సారాంశం యిది:

వలస ఆస్తులు

| సంవత్సరం | గ్రేట్ బ్రిటన్ | | ఫ్రాన్సు | | జర్మనీ | |
|---|---|---|---|---|---|---|
| | వైశాల్యం (లక్ష చ. మైళ్ళు) | జనాభా (లక్ష) | వైశాల్యం (లక్ష చ. మైళ్ళు) | జనాభా (లక్ష) | వైశాల్యం (లక్ష చ. మైళ్ళు) | జనాభా (లక్ష) |
| 1815–1830 | ? | 1,264 | 0.2 | 5 | — | — |
| 1860 | 25 | 1,451 | 2 | 34 | — | — |
| 1880 | 77 | 2,679 | 7 | 75 | — | — |
| 1899 | 93 | 3,090 | 37 | 564 | 10 | 147 |

గ్రేట్ బ్రిటన్‌కు వలస విస్తరణ అపారంగా జరిగినది 1860నుండి 1880వరకు; 19వ శతాబ్దపు చివరి 20 సంవత్సరాలలో కూడా విస్తరణ గణనీయంగానే వుండింది. ఫ్రాన్సుకూ, జర్మనీకీ యీ విస్తరణ క్రమం సరిగ్గా యీ 20 సంవత్సరాలలోనే పడుతుంది. గత్త దశకు పూర్వపు పెట్టుబడిదారీ విధానంయొక్క, అనగా స్వేచ్ఛాయుత పోటీ ప్రబలంగా వుండిన పెట్టుబడిదారీ విధానంయొక్క, అభివృద్ధి 1860లలోనూ, 1870లలోనూ పరిపూర్ణ దశకు చేరుకుందని పైదాన్నిబట్టి తెలుసుకున్నాం. సరిగ్గా ఆ కాలం

* Henry S. Morris, *The History of Colonization* ("వలసవిధాన చరిత్ర"), N.Y., 1900, vol. II, pp. 88, 304.

తర్వాతనే వలసల ఆక్రమణలో బ్రహ్మాండమైన "శుక్ర మహా దశ" ప్రారంభమైందనీ, ప్రపంచ భౌగోళిక విభజనకొరకు జరిగే పోరాటం అతి తీవ్రమైందనీ తెలుస్తున్నది. కనుక, పెట్టుబడిదారీ విధానం గుత్త పెట్టుబడిదారీ దశకు, ఫైనాన్స్ పెట్టుబడికి, పరివర్తన చెందడం అనేది ప్రపంచాన్ని పంచుకోడానికి జరిగే పోరాటం తీవ్రంకావడంతో నిస్సందేహంగా ముడిపడి వుంది.

సామ్రాజ్యవాదంమీద హాబ్సన్ రాసిన గ్రంథంలో 1884–1900 సంవత్సరాలను ముఖ్య యూరపియన్ రాజ్యాల తీవ్ర "విస్తరణ" (భూభాగాల విస్తరణ) యుగంగా పేర్కొన్నాడు. అతని అంచనా ప్రకారం యీ సంవత్సరాలలో గ్రేట్ బ్రిటన్ 570 లక్షల జనాభా గల 37 లక్షల చదరపు మైళ్ల ప్రాంతాలను సంపాయించింది; ఫ్రాన్సు 365 లక్షల జనాభా గల 36 లక్షల చదరపు మైళ్ల ప్రాంతాలను సంపాయించింది; జర్మనీ 147 లక్షల జనాభా గల 10 లక్షల చదరపు మైళ్ల ప్రాంతాలను సంపాయించింది; బెల్జియం 300 లక్షల జనాభా గల 9 లక్షల చదరపు మైళ్ల ప్రాంతాలను సంపాయించింది; పోర్చుగల్ 90 లక్షల జనాభా కలిగిన 8 లక్షల చదరపు మైళ్ల ప్రాంతాలను సంపాయించింది. 19వ శతాబ్ది అంతంలో, ముఖ్యంగా 1880లనుండి, పెట్టుబడిదారీ రాజ్యాలన్నీ వలసలకొరకు ప్రయత్నించడం దౌత్య విషయాల చరిత్రలోనూ, విదేశ రాజకీయాల చరిత్రలోనూ సుప్రసిద్ధమైన విషయమే.

గ్రేట్ బ్రిటన్‌లో స్వేచ్ఛాయుత పోటీ మూడు పూవు లారుకాయలుగా వున్న కాలంలో, అనగా 1840కీ 1860కీ మధ్య, ప్రముఖ బ్రిటిష్ బూర్జువా రాజకీయవాదులు వలస విధానానికి వ్యతిరేకులుగా వుండినారు; వలసల విముక్తీ, బ్రిటన్‌నుండి అవి పూర్తిగా విడిపోవడమూ అనివార్యమనీ, వాంఛనీయమనీ అభిప్రాయపడినారు. సామ్రాజ్యవాదానికి సాధారణంగా సుముఖుడైన రాజ్యవ్యవహారవేత్త డిజ్రేలీ 1852లో "వలసలు మన మెడలకు గుదిబండలు" అని ప్రకటించినట్లు 1898లో ప్రచురింపబడిన "ఆధునిక బ్రిటిష్ సామ్రాజ్యవాదం" అనే వ్యాసంలో ఎమ్. బేర్ తెలియజేసినాడు.* కానీ 19వ శతాబ్ది అంతంలో యింగ్లండులో నాయకులైన సెసిల్ రోడ్స్, జోసెఫ్ చేంబర్లేన్‌లు సామ్రాజ్యవాదాన్ని బాహాటంగా బలపరిచి, సామ్రాజ్యవాద విధానాన్ని అత్యంత అమానుషంగా అమలుపరిచినారు!

అధునాతన సామ్రాజ్యవాదపు సాంఘిక రాజకీయ మూలాలకూ, కేవల ఆర్థిక మూలాలు అనదగిన వాటికీ గల సంబంధాన్ని ప్రముఖ బ్రిటిష్ బూర్జువా రాజకీయవాదులు ఆనాటికే గమనించి వుండడం ఆసక్తికరమైన విషయం. చేంబర్లేన్ సామ్రాజ్యవాదాన్ని "నిజమైన,

* "Die Neue Zeit," XVI, I, 1898, S. 302.

విజ్ఞతాయుతమైన ఆర్థిక విధానం''గా బలపరిచి, ప్రపంచ మార్కెట్‌లో గ్రేట్ బ్రిటన్‌కు యెదురౌతున్న పోటీని, ముఖ్యంగా జర్మన్, అమెరికన్, బెల్జియన్ పోటీని గుర్తు చేసినాడు. గుత్తసంస్థలలో మోక్షం వుంది అంటూ పెట్టుబడిదారులు కార్టెల్‌లూ, సిండికేట్‌లూ, ట్రస్టులూ స్థాపించినారు. గుత్తసంస్థలలో మోక్షం వుంది అని బూర్జువావర్గపు రాజకీయ నాయకులు ప్రతిధ్వనిస్తూ, ప్రపంచంలో యింకా పంపకం కాని భాగాలను స్వాధీనం చేసుకోడానికి త్వరపడినారు. సెసిల్ రోడ్స్ 1895లో తన సామ్రాజ్యవాద అభిప్రాయాలను యీవిధంగా వెలిబుచ్చినట్లు అతని మిత్రుడైన స్టెడ్ అనే పాత్రికేయుడు రాసినాడు: "నిన్న నేను లండన్ ఈస్టెండ్ (కార్మిక పేట)లో ఒక నిరుద్యోగుల సభకు హాజరైనాను. ఆ అనాగరిక ఉపన్యాసాల సారమంతా 'అన్నం! అన్నం!' అని కేకలు వేయడమే. యింటికి పోతూ నేను ఆ సంఘటన గురించి ఆలోచించగా, సామ్రాజ్యవాదంయొక్క ప్రాముఖ్యం మీద నాకు యెన్నడూ లేనంత విశ్వాసం కుదిరింది.... నా అభిమాన భావం సామాజిక సమస్యకు ఒక పరిష్కార మార్గం; అనగా మన దేశంలోని 4 కోట్లమంది ప్రజలను అంతర్యుద్ధపు రక్తపాతంనుండి రక్షించాలంటే వలసవాద రాజ్యవ్యవహారవేత్తలమైన మనం కొత్త ప్రదేశాలను సంపాయించి మన అదనపు జనాభాకు ఆవాసం కల్పించాలి, ఫాక్టరీలలోనూ, గనులలోనూ ఉత్పత్తి అయ్యే సరుకులకు కొత్త మార్కెట్లు చూపించాలి. నేను నిత్యం చెపుతూ వున్నట్లు, సామ్రాజ్యం అనేది తిండి బట్టల సమస్య. అంతర్యుద్ధాన్ని అరికట్టాలంటే మనం సామ్రాజ్యవాదులం కావాలి."*

కోటీశ్వరుడూ, ఫైనాన్స్ ప్రపంచపు రాజా, ఆంగ్లో-బోయర్ల యుద్ధానికి ప్రధాన కారకుడూ ఐన సెసిల్ రోడ్స్ 1895లో చెప్పింది యిది. సామ్రాజ్యవాదాన్ని అతను సమర్థించిన పద్ధతి మొరటుగానూ, అమానుషంగానూ వున్న మాట నిజమే. కానీ, సారాంశంలో అది మాస్లొవ్, స్యూడెకుమ్, పొత్రేసొవ్, డేవిడ్, రష్యన్ మార్క్సిజంను స్థాపించినవాడూ, తదితరులూ చెప్పే సిద్ధాంతంకంటె భిన్నమైంది కాదు. సెసిల్ రోడ్స్ వీళ్లకంటే కాస్త నిజాయితీ గల సోషల్ జాతీయ దురహంకారి....

ప్రపంచ ప్రదేశాల విభజననూ, ఆ విషయంలో గత దశాబ్దాలలో వచ్చిన మార్పులనూ వీలైనంత ఖచ్చితంగా చిత్రించడానికి సకల ప్రపంచ రాజ్యాల వలస ఆస్తుల గురించి సుపాన్ రాసిన పుస్తకంలోని వివరాలను వాడుకుందాం. సుపాన్ 1876వ సంవత్సరాన్నీ 1900నూ యెన్నుకున్నాడు. నేను 1876నూ 1914నూ తీసుకుంటాను. 1876ను యెన్నుకోవడం చాలా సముచితం; యెందుకంటే సరిగ్గా ఆనాటికి పశ్చిమ యూరపియన్

* "Die Neue Zeit," XVI, I, 1898, S. 304.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిలో గుత్త దశకు పూర్వపు దశ, ప్రధానంగా పూర్తి అయిందని చెప్పవచ్చు. 1914ను యెన్నుకోవడం ద్వారా, సుపాన్ యిచ్చిన అంకెలకు బదులు, నేను హూబ్నర్ రాసిన "భౌగోళిక గణాంక పట్టికలు" అనే గ్రంథంలోని యిటీవలి అంకెలు యిస్తున్నాను. సుపాన్ వలసలకు మాత్రమే అంకెలు యిచ్చినాడు. ప్రపంచ విభజనను పూర్తిగా చిత్రించడానికి, వలసేతర దేశాలకూ, అర్ధవలస దేశాలకూ సంబంధించిన అంకెలను నేను సంక్షేపంగా జతపరచడం ఉపయోగకరంగా వుంటుంది. అర్ధవలస దేశాల వర్గంలో నేను పర్షియా, చైనా, టర్కీలను చేరుస్తున్నాను. యిందులో మొదటిది యిప్పటికే దాదాపు పూర్తిగా వలసదేశం అయిపోయింది; రెండవదీ, మూడవదీ ఔతున్నాయి.

యీవిధంగా మనకు యీకింది పట్టిక లభిస్తుంది (229వ పేజి చూడండి).

19, 20 శతాబ్దాల మలుపులో ప్రపంచ పంపకం యెంత "పూర్తి"గా జరిగిపోయిందీ యీ అంకెలవల్ల తెలుస్తుంది. 1876 తర్వాత వలస ఆస్తులు బ్రహ్మాండంగా పెరిగినాయి, ఆరు గొప్ప రాజ్యాలకూ 400 లక్షల చదరపు కిలోమీటర్లనుండి 650 లక్షలకు పెరిగినాయి. అనగా 150 శాతంపైగా పెరిగినాయి. పెరుగుదల 250 లక్షల చదరపు కిలోమీటర్లు వుంది – (165 లక్షల చదరపు కిలోమీటర్లు వున్న) వలస రాజ్యాలకంటె 150 శాతం యెక్కువ. 1876లో మూడు రాజ్యాలకు వలసలు లేవు; నాల్గవ దానికి, ఫ్రాన్సుకు, దాదాపు లేవు. 1914 నాటికి యీ నాలుగు రాజ్యాలూ దాదాపు 1,000 లక్షల జనాభా గల 141 లక్షల చదరపు కిలోమీటర్ల – యూరప్ విస్తీర్ణంకంటె 150 శాతం యెక్కువ – వలసలు సంపాయించినాయి. వలస ఆస్తుల విస్తరణవేగంలో అసమత్వం చాలా యెక్కువగా వుంది. ఉదాహరణకు ఫ్రాన్సు, జర్మనీ, జపాన్‌లను పోలిస్తే, వాటి విస్తీర్ణంలోనూ, జనాభాలోనూ పెద్ద భేదాలు లేవు; కానీ ఫ్రాన్సు సంపాయించిన వలస ఆస్తి తక్కిన రెండూ సంపాయించిన ఆస్తుల మొత్తంకంటె దాదాపు మూడు రెట్లు యెక్కువ. ఫైనాన్సు పెట్టుబడి విషయంలో కూడా, మనం పరిశీలిస్తున్న కాలం ప్రారంభంలో, జర్మనీ, జపాన్ల మొత్తంకంటె ఫ్రాన్సు బహుశా కొన్ని రెట్లు సంపన్నంగా వుండింది. కేవల ఆర్థిక పరిస్థితులకు తోడు, కేవల ఆర్థిక పరిస్థితులమీద ఆధారపడి, భౌగోళికాది యితర పరిస్థితులు కూడా వలస ఆస్తుల పరిమాణాలను నిర్ణయిస్తాయి. భారీ పరిశ్రమలూ, మారకమూ, ఫైనాన్స్ పెట్టుబడీ, వీటి ఒత్తిడి మూలంగా గత దశాబ్దాలలో ప్రపంచాన్ని సమతలం చేసే క్రమం, వివిధ దేశాలలోని ఆర్థిక పరిస్థితులనూ, జీవన పరిస్థితులనూ ఏక మట్టం చేసే క్రమం, యెంత బలీయంగా వుండినప్పటికీ, గణనీయమైన భేదాలు యింకా వున్నాయి. పైన చెప్పిన ఆరు రాజ్యాలలో మూడు రకాలు వున్నాయి. మొదటి రకం, యువ పెట్టుబడిదారీ దేశాలు – అమెరికా, జర్మనీ, జపాన్; యివి అసాధారణమైన వేగంతో పురోగమించి

గొప్ప రాజ్యాల వలస ఆస్తులు
(విస్తీర్ణం లక్షల చదరపు కిలోమీటర్లలో; జనాభా లక్షల్లో)

| | వలసలు | | | | వలస రాజ్యాలు | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1876 | | 1914 | | 1914 | | 1914 | |
| | విస్తీర్ణం | జనాభా | విస్తీర్ణం | జనాభా | విస్తీర్ణం | జనాభా | విస్తీర్ణం | జనాభా |
| గ్రేట్ బ్రిటన్ . . . . . . | 225 | 2,519 | 335 | 3,935 | 3 | 465 | 338 | 4,400 |
| రష్యా . . . . . . . | 170 | 159 | 174 | 332 | 54 | 1,362 | 228 | 1,694 |
| ఫ్రాన్సు . . . . . . . | 9 | 60 | 106 | 555 | 5 | 396 | 111 | 951 |
| జర్మనీ . . . . . . . | — | — | 29 | 123 | 5 | 649 | 34 | 772 |
| అమెరికా సం. రా. . . . . . | — | — | 3 | 97 | 94 | 970 | 97 | 1,067 |
| జపాన్ . . . . . . . | — | — | 3 | 192 | 4 | 530 | 7 | 722 |
| ఆరు గొప్ప రాజ్యాలూ కలిసి . . | 404 | 2,738 | 650 | 5,234 | 165 | 4,372 | 815 | 9,606 |
| యితర రాజ్యాల (బెల్జియం, హాలండు వగైరాల) వలసలు . . . . . . . . . . | | | | | | | 99 | 453 |
| అర్ధవలసదేశాలు (పర్షియా, చైనా, టర్కీ) . . . . . . . . . . . . | | | | | | | 145 | 3,612 |
| యితర దేశాలు . . . . . . . . . . . . . . . . | | | | | | | 280 | 2,899 |
| ప్రపంచపు మొత్తం . . . . . . . . . . . . . | | | | | | | 1,339 | 16,570 |

నాయి. రెండవ రకం, పాత పెట్టుబడిదారీ అభివృద్ధి గల దేశాలు – ఫ్రాన్సు, గ్రేట్ బ్రిటన్; వీటి పురోగతి పైవాటికంటె యిటీవల చాలా మందంగా వుంది. మూడవ రకం, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన దేశం – రష్యా; యీ దేశంలో పెట్టుబడిదారీ పూర్వ సంబంధాల వలలో ఆధునిక పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం చిక్కుకుందని చెప్పవచ్చు.

గొప్ప రాజ్యాల వలస ఆస్తుల పక్కన చిన్న రాజ్యాల చిన్న వలసలు కూడా వున్నాయి; వలసల "పునర్విభజన"కు గురి కాబోయేవి యివే. గొప్ప రాజ్యాల మధ్య విరుద్ధ ప్రయోజనాలూ, ఘర్షణా, వగైరా వున్నాయి గనుక, అవి కొల్లసొమ్మును విభజించుకోవడంలో ఒక ఒప్పందానికి రాలేక పోతున్నాయి. అందువల్ల మాత్రమే చిన్న రాజ్యాలు తమ వలసలు నిలుపుకోగలుగుతున్నాయి. "అర్ధవలస" రాజ్యాలు ప్రకృతిలోనూ, సమాజంలోనూ అన్ని రంగాలలోనూ వుండే పరివర్తన రూపాలకు ఉదాహరణ. సకల ఆర్థిక సంబంధాలలోనూ, సకల అంతర్జాతీయ సంబంధాలలోనూ ఫైనాన్స్ పెట్టుబడి యెంత గొప్ప, యెంత నిర్ణాయక శక్తి అంటే, అది సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యం గల రాజ్యాలను కూడా తనకు లోబరుచుకోగలదు, వాస్తవంగా లోబరుచుకుంటుంది కూడా; దీనికి ఉదాహరణలు త్వరలో చూడగలం. తనకు లోబడిన దేశాలూ, ప్రజలూ రాజకీయ స్వాతంత్ర్యం కోల్పోయేటట్లు లోబడడం ఫైనాన్స్ పెట్టుబడికి "అనుకూలమూ," అత్యంత లాభదాయకమూ. యీ సందర్భంలో, అర్ధవలసదేశాలు "మధ్యంతర దశ"కు అసలైన ఉదాహరణగా వున్నాయి. ఫైనాన్స్ పెట్టుబడి యుగంలో, మిగత ప్రపంచమంతా యిప్పటికే విభజితమైపోయింది గనుక, యీ అర్ధ పరాధీన దేశాలకొరకు జరిగే పోరాటం మరీ ఘోరంగా వుండడం సహజమే.

పెట్టుబడిదారీ విధానం యీ అధునాతన దశకు పూర్వమే, పెట్టుబడిదారీ విధానానికి పూర్వమే కూడా, వలస విధానమూ సామ్రాజ్యవాదమూ వుండినాయి. బానిసత్వపు పునాదుల మీద నిర్మింపబడిన రోమ్ వలస విధానం అనుసరించింది, సామ్రాజ్యవాదం అమలుపరిచింది. కానీ, సామ్రాజ్యవాదంమీద "సాధారణ" చర్చలు – సామాజిక, ఆర్థిక వ్యవస్థల మధ్యగల మౌలిక భేదాలను నిర్లక్ష్యం చేసే, లేక మరుగుపరిచే చర్చలు – అనివార్యంగా అర్థం లేని చెత్తలోకి గానీ, వట్టి వాగుడులోకి గానీ "గ్రేటర్ రోమ్, గ్రేటర్ బ్రిటన్"* లాంటి పోల్చిచూడడంగా దిగజారుతాయి. పెట్టుబడిదారీ విధానం పాత దశలలోని పెట్టుబడిదారీ వలస విధానం కూడా ఫైనాన్స్ పెట్టుబడియొక్క వలస విధానంకంటె యెంతో భిన్నమైంది.

---

* C. P. Lucas, *Greater Rome and Greater Britain,* Oxf., 1912 లేక Earl of Cromer, *Ancient and Modern Imperialism* ("పురాతన సామ్రాజ్యవాదమూ, ఆధునిక సామ్రాజ్యవాదమూ"), L., 1910.

పెట్టుబడిదారీ విధానం అధునాతన దశలోని ప్రధాన లక్షణం యేమిటంటే పెద్ద పెట్టుబడిదార్ల గుత్త సంఘాల పెత్తనం. ముడి సరుకుల వనరులు అన్నీ ఒక బృందం స్వాధీనం చేసుకున్నప్పుడు గుత్తసంస్థలు అత్యంత దృఢంగా స్థిరపడినట్లే. అంతర్జాతీయ పెట్టుబడిదార్ల సంఘాలు ఖనిజ నిక్షేపాలూ, నూనె నిక్షేపాలూ మొదలైనవి కొనేసి, తమ పోటీదార్లు తమతో పోటీ చేసే అవకాశం లేకుండా చేసుకుంటారు. యీ పని చేయడానికి ఆ సంఘాలు యెంత దీక్షతో తమ శక్తినంతా వినియోగించేదీ మనకు తెలుసు. పోటీదార్లతో జరిగే పోరాటంలో గుత్తసంస్థలకు యెట్టి పరిస్థితులలోనైనా పూర్తి హామీ యిచ్చేది వలస యాజమాన్యం మాత్రమే. పోటీదార్లు ప్రభుత్వ గుత్తసంస్థను నిర్మించే శాసనం ద్వారా ఆత్మరక్షణ చేసుకోవచ్చు; అలాంటి ప్రతికూల పరిస్థితులను కూడా వలస యాజమాన్యం యెదుర్కోగలదు. పెట్టుబడిదారీ విధానం యెంత అభివృద్ధి ఐతే, ముడిసరుకుల కొరత యెంత తీవ్రంగా కనపడితే, ప్రపంచ మంతటా ముడిసరుకుల వనరులకొరకు పోటీ గానీ, వేట గానీ అంత తీవ్రంగా వుంటుంది, అంత భీషణంగా వుంటుంది వలసల సంపాదన కొరకు పోరాటం.

"కొంతమందికి విపరీతంగా కనపడవచ్చు గానీ, ముందు ముందు ఆహారపదార్థాల కొరత గాక, ముడిసరుకుల కొరతే పట్టణ పారిశ్రామిక జనాభా పెరగడానికి యెక్కువ అవరోధంగా వుండవచ్చు నని చెప్పవచ్చు" అని షిల్డర్ రాసినాడు. ఉదాహరణకు కలప కొరత పెరిగిపోతున్నది, దాని ధర క్రమంగా పెరిగిపోతున్నది; అలాగే చర్మం కొరతా, బట్టల పరిశ్రమకు కావలసిన ముడిపదార్థాల కొరతా పెరిగిపోతున్నాయి. "మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికీ, పరిశ్రమలకూ మధ్య సమస్థితి నెలకొల్పడానికి ఉత్పత్తిదార్ల సంఘాలు ప్రయత్నిస్తున్నాయి. దీనికి రెండు ఉదాహరణలు యివ్వవచ్చు: అనేక ముఖ్య పారిశ్రామిక దేశాల్లో 1904లో 'నూలు ఉత్పత్తిదార్ల సంఘాల అంతర్జాతీయ ఫెడరేషన్' స్థాపించబడింది; అదే పద్ధతులమీద 1910లో 'ఫ్లాక్స్ ఉత్పత్తిదార్ల సంఘాల యూరపియన్ ఫెడరేషన్' స్థాపించబడింది."*

యిలాంటి వాస్తవాల ప్రాముఖ్యాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తారు బూర్జువా సంస్కరణవాదులూ, వాళ్లలో భాగమైన యీనాటి కౌట్స్కీ అనుయాయులూ. "ఖరీదైన, ప్రమాదకరమైన" వలస విధానం లేకుండా బహిరంగ మార్కెట్‌లో ముడిసరుకులు సంపాయించడం "సాధ్యమౌతుంది" అనీ, "కేవలం" వ్యవసాయ పరిస్థితులు మెరుగుపరచడం ద్వారా ముడిసరుకుల సరఫరాను అపారంగా పెంచడం "సాధ్యమౌతుంది" అనీ వాళ్లు

* Schilder, పూర్వోక్త గ్రంథం, పేజీలు 38–42.

వాదిస్తారు. కానీ యిలాంటి వాదాలు సామ్రాజ్యవాదానికి సమర్థనలే, సామ్రాజ్యవాదాన్ని అలంకరించే ప్రయత్నమే ఔతాయి; యెందుకంటే పెట్టుబడిదారీ విధానపు అధునాతన దశయొక్క ప్రధాన లక్షణమైన గుత్తసంస్థలను వాళ్లు విస్మరిస్తున్నారు. స్వేచ్ఛాయుత మార్కెట్టు అంతకంతకూ భూతకాల విషయం ఐపోతున్నది; దానిని గుత్త సిండికేట్లూ, గుత్త ట్రస్టులూ రోజు రోజుకూ అంతకంతకూ పరిమితపరుస్తున్నాయి. "కేవలం" వ్యవసాయ పరిస్థితులు మెరుగుపరచడం అంటే సామాన్యప్రజల పరిస్థితులు మెరుగుపరచడమూ, వేతనాలు పెంచడమూ, లాభాలు తగ్గించడమూ ఔతుంది. వలసలను జయించుకోవడానికి బదులు, సామాన్యప్రజల పరిస్థితులపట్ల ఆసక్తి కలిగించుకోగల ట్రస్టులు యెక్కడున్నాయి — తీయటి మాటలు చెప్పే సంస్కరణవాదుల ఊహా లోకంలో తప్ప?

ముడిసరుకుల ప్రస్తుత వనరుల్లోనే కాక, సంభావ్య వనరుల్లో కూడా ఫైనాన్స్ పెట్టుబడికి ఆసక్తి వుంటుంది. యెందుకంటే యీనాడు సాంకేతికాభివృద్ధి చాలా వేగంగా జరుగుతున్నది; యీనాడు నిరుపయోగంగా వున్న భూమిని రేపు సారవంతమైన భూమిగా మార్చవచ్చు, కొత్త పద్ధతులు అమలులో పెట్టి (యీ పద్ధతులు నిర్ణయించడానికి ఇంజనీర్లూ, వ్యవసాయ నిపుణులూ మొదలైనవాళ్ల ప్రత్యేక దళాన్ని ఒక పెద్ద బాంకి సమకూర్చగలదు), పెద్ద యెత్తున పెట్టుబడి పెట్టితే: ఖనిజాలకొరకు అన్వేషించడమూ, ముడిసరుకులను వినియోగించడమూ వగైరా, వగైరా అనేక విషయాలకు కూడా యిది వర్తిస్తుంది. కనుక ఫైనాన్స్ పెట్టుబడి తన పలుకుబడి భూభాగాన్ని విస్తృత పరుచుకోడానికి, తన వాస్తవ భూభాగాన్ని కూడా విస్తృత పరుచుకోడానికి అనివార్యంగా కృషి చేస్తుంది. ట్రస్టులు యేవిధంగా తమ ఆస్తి ద్వారా (వచ్చే లాభాలను కాక) సంభావ్య లాభాలనూ, తమ గుత్త హక్కు సంభావ్య ఫలితాలనూ లెక్కలోకి తీసుకొని, తమ ఆస్తి విలువను రెండు మూడు రెట్లు పెంచి పెట్టుబడిగా లెక్కిస్తారో, ఆవిధంగానే ఫైనాన్స్ పెట్టుబడి ముడిసరుకుల సంభావ్య వనరులను లెక్కలోకి తీసుకొని, పంపకం కాకుండా యింకా మిగిలిపోయిన భూమి ముక్కలకొరకు గానీ, యిప్పటికే పంపకమైపోయిన భూమి పునర్విభజనకొరకు గానీ జరిగే భీషణ పోరాటంలో వెనకబడిపోతానేమో అనే భయంతో, అన్ని చోట్లా, అన్ని పద్ధతులతోనూ, అన్ని రకాల భూమినీ సాధ్యమైనంత యెక్కువగా వశపరచుకోడానికి సాధారణంగా కృషి చేస్తుంది.

బ్రిటిష్ పెట్టుబడిదార్లు తమ వలస ఐన ఈజిప్టులో పత్తి పంట అభివృద్ధి చేయడానికి సకల ప్రయత్నాలూ చేస్తున్నారు (1904లో సాగులో వున్న 23 లక్షల హెక్టార్లలో 6 లక్షల హెక్టార్లు, అంటే నాలుగోవంతుకన్న ఎక్కువ, పత్తికింద వున్నాయి); రష్యన్లు తమ వలస ఐన తుర్కెస్తాన్‌లో అదే చేస్తున్నారు; యెందుకంటే యీవిధంగా చేస్తే వాళ్లు

తమ విదేశీ పోటీదార్లను ఓడించడానికీ, ముడిపదార్థాల వనరుల గుత్త పెత్తనం కలిగి వుండడానికీ, బట్టల ఉత్పత్తిలోని సకల ప్రక్రియలూ ఒకే యజమానుల బృందం చేతిలో "సమ్మేళనమై," సాంద్రీకృతమైనటువంటి, మరింత లాభదాయకమైన జవుళి ట్రస్టును యేర్పరచడానికీ మరింత అనుకూలమైన స్థానంలో వుంటారు.

పెట్టుబడిని యెగుమతి చేయడంలో గల ప్రయోజనాలు కూడా వలసల సంపాదనకు ప్రోద్బలం యిస్తాయి; యెందుకంటే వలస మార్కెట్‌లో పోటీని తొలగించుకోడానికీ, కాంట్రాక్టులను కట్టుదిట్టం చేయడానికీ, అవసరమైన "సంబంధాలు" నెలకొల్పడానికీ, వగైరాలకు గుత్త పద్ధతులు అవలంబించడం సులభం (ఒకోసారి గుత్త పద్ధతులు మాత్రమే సాధ్యం).

ఫైనాన్స్ పెట్టుబడీ, దాని రాజకీయాలూ, దాని భావజాలమూ – వీటి ఆధారంమీద పెరిగే ఆర్థికేతర ఉపరినిర్మాణం వలస సంపాదనను ప్రోత్సహిస్తుంది. హిల్ఫెర్‌డింగ్ సముచితంగా చెప్పినట్లు, "ఫైనాన్స్ పెట్టుబడికి కావలసింది స్వేచ్ఛ కాదు, ఆధిపత్యం." ఒక ఫ్రెంచి బూర్జువా రచయిత, పైన చెప్పిన సెసిల్ రోడ్స్ అభిప్రాయాలకు* మెరుగులు పెడుతూ, మరికొన్ని కలుపుతూ, ఆధునిక వలస విధానంయొక్క ఆర్థిక కారణాలకు సాంఘిక కారణాలు కూడా జతపరచాలని రాసినాడు: "జీవిత సంకీర్ణతలు పెరుగుతూ వుండడంవల్లా, కార్మిక జనసామాన్యంమీదనే కాక, మధ్య తరగతులమీద కూడా భారంగా వున్న కష్టాలవల్లా పాత నాగరికత గల దేశాలన్నిటిలోనూ 'అసహనమూ, విసుగూ, ద్వేషమూ పేరుకుంటూ, ప్రజా శాంతికి ప్రమాదంగా తయారౌతున్నాయి; స్వదేశంలో ప్రేలుడు సంభవించకుండా అరికట్టడానికి, నిర్దిష్ట వర్గ మార్గంలో వెలిజిమ్మబడుతున్న శక్తికి విదేశాలలో పని కల్పించాలి.' "**

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద యుగంలోని వలస విధానం గురించి మాట్లాడుతున్నాం గనుక, మరొక విషయం చెప్పాలి. ఫైనాన్స్ పెట్టుబడీ, దానికి అనుగుణమైన విదేశాంగ విధానమూ (అనగా, చివరకు, ప్రపంచాన్ని ఆర్థిక, రాజకీయ విభజన చేసుకోడానికి గొప్ప రాజ్యాలు చేసే పోరాటమే) – యీ రెండూ కలిసి పరాధీన రాజ్యం అనే దానికి అనేక పరివర్తన రూపాలను సృష్టిస్తాయి. ఈ యుగ స్వభావానికి చిహ్నంగా వున్నది వలసలూ, వలస యజమానులూ అనే రెండు ముఖ్య రకాల దేశాలు మాత్రమే కాదు, వివిధ రూపాల పరా

---

* యీ సంపుటిలో 227వ పేజి చూడండి. – సం.

** Wahl, *La France aux colonies* ("వలసదేశాలలో ఫ్రాన్సు"). ఈ ఖండం Henri Russier, *Le Partage de l'Océanie* ("ఓషియానియా విభజన"), P., 1905, p. 165 పుస్తకంలో ఎత్తిరాయబడింది.

ధీన దేశాలు కూడా వున్నాయి — చట్టరీత్యా రాజకీయ స్వాతంత్ర్యం వుంటుంది గానీ ఆర్థిక, దౌత్య వ్యవహారాల వలలో చిక్కుకొని వుండే దేశాలు. ఒక రూపం — అర్ధవలస అనేది — యింతకుముందే చూపినాను. మరొక రూపానికి ఉదాహరణ అర్జెంటీనా.

"దక్షిణ అమెరికా, ముఖ్యంగా అర్జెంటీనా, ఆర్థికంగా లండన్‌మీద యెంతగా ఆధార పడి వుందంటే, దాన్ని దాదాపు బ్రిటిష్ వాణిజ్య వలస అని వర్ణించడం న్యాయంగా వుంటుంది" అని బ్రిటిష్ సామ్రాజ్యవాదంమీద తాను రాసిన పుస్తకంలో షుల్జె-గేవెర్నిట్జ్ రాసినాడు.* బూనెస్ ఐరీస్‌లో ఆస్ట్రో-హంగేరియన్ కాన్సల్ సమర్పించిన 1909 నివేదిక ఆధారంతో షిల్డెర్ వేసిన అంచనా ప్రకారం బ్రిటిష్ వాళ్లు అర్జెంటీనాలో 875 కోట్ల ఫ్రాంకులు పెట్టుబడి పెట్టినారు. దీని ద్వారా బ్రిటిష్ ఫైనాన్స్ పెట్టుబడికీ (దాని విశ్వసనీయ "మిత్రత్వం" దౌత్య వ్యవహారాలకూ) అర్జెంటీనా బూర్జువా వర్గంతో, ఆ దేశపు ఆర్థిక రాజకీయ జీవితమంతటినీ అదుపుచేసే శక్తులతో, యెంత బలమైన సంబంధాలు యేర్పడేదీ ఊహించుకోవడం కష్టం కాదు.

రాజకీయ స్వాతంత్ర్యం వుంటూ కూడా, ఆర్థిక, దౌత్య పరాధీనత వుండడం, కొంత భిన్నమైన రూపంలో, పోర్చుగల్‌లో కనపడుతుంది. పోర్చుగల్ స్వతంత్ర, సర్వసత్తాక రాజ్యం. కానీ వాస్తవానికి, 200 సంవత్సరాలకుపైగా 1701–1714 స్పానిష్ వారసత్వ యుద్ధం నాటినుండి అది బ్రిటిష్ రక్షణకింద (ప్రొటెక్టొరేట్‌గా) వుంది. పోర్చుగల్‌నూ, దాని వలసలనూ గ్రేట్ బ్రిటన్ యెందుకు రక్షించిందంటే, తన పోటీదారులైన స్పెయిన్‌తోనూ, ఫ్రాన్సుతోనూ తనకు గల పోరాటంలో తన స్థావరాలను భద్రపరచుకోడానికి. దీనికి బదులుగా గ్రేట్ బ్రిటన్‌కు వాణిజ్య సౌకర్యాలూ, పోర్చుగల్‌లోకీ, దాని వలసల్లోకీ తన సరుకులూ, ముఖ్యంగా పెట్టుబడీ దిగుమతి చేయడానికి అనుకూలమైన షరతులూ, పోర్చుగల్ రేవులనూ, దాని దీవులనూ, దాని తంతి మార్గాలూ వగైరాలనూ ఉపయోగించుకొనే హక్కూ లభించినాయి.** పెద్ద రాజ్యాలకూ చిన్న రాజ్యాలకూ మధ్య యిలాంటి సంబంధాలు యెప్పుడూ

---

* Schulze-Gaevernitz, *Britischer Imperialismus und englischer Freihandel zu Beginn des 20-ten Jahrhunderts* ("ఇరవయ్యో శతాబ్దారంభంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదమూ ఇంగ్లీషు స్వేచ్ఛాయుత వ్యాపారమూ"), Lpz., 1906, S. 318. Sartorius v. Waltershausen, *Das volkswirtschaftliche System der Kapitalanlage im Auslande* ("విదేశాలలో పెట్టుబడి నియోజనపు ఆర్థిక వ్యవస్థ"), Berlin, 1907, S. 46. అనే పుస్తకంలో దాని కర్త ఇదే అంటాడు.

** షిల్డెర్, పూర్వోక్త గ్రంథం, సంపుటి I, పేజీలు 160–161.

వున్నవే; కానీ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద యుగంలో యివి సాధారణమైనవిగా ఔతాయి, "ప్రపంచ విభజన" సంబంధాల పూర్తి మొత్తంలో ఒక భాగ మౌతాయి, ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడి చర్యల గొలుసులో లంకెలు ఔతాయి.

ప్రపంచ విభజన సమస్యను ముగించాలంటే మరొక విషయం చెప్పాలి. యీ సమస్య గత శతాబ్ది అంతంలోనూ, యీ శతాబ్ది ప్రారంభంలోనూ, స్పానిష్ అమెరికన్ యుద్ధం తర్వాత అమెరికన్ సాహిత్యంలోనూ, ఆంగ్లో-బోయర్ యుద్ధం తర్వాత ఇంగ్లీషు సాహిత్యంలోనూ బాహాటంగానూ, నిర్దిష్టంగానూ లేవనెత్తబడింది. "బ్రిటిష్ సామ్రాజ్యవాదా"న్ని "యెంతో అసూయతో" కనిపెట్టి వున్న జర్మన్ సాహిత్యం యీ సమస్యను క్రమబద్ధంగా గమనిస్తున్నది. ఫ్రెంచి బూర్జువా సాహిత్యంలో కూడా, బూర్జువా దృక్పథంనుండి సాధ్యమైనంత విస్తృతంగానూ, నిర్దిష్టంగానూ, యిది లేవనెత్తబడింది. "19వ శతాబ్ది అంతంలో రాజకీయ సాంఘిక సమస్యలు" అన్న గ్రంథంలో, "గొప్ప రాజ్యాలూ, ప్రపంచ విభజనా" అనే ప్రకరణంలో డ్రియో అనే చరిత్రకారుడు రాసింది యిది: "గత కొద్ది సంవత్సరాలలో, చైనా తప్ప భూమండలంలోని ప్రదేశమంతటినీ, యూరప్‌లోనూ, ఉత్తర అమెరికాలోనూ వున్న రాజ్యాలు ఆక్రమించినాయి. యీ సమస్యమీద ఘర్షణలూ, ఒకరి పలుకుబడిని ఒకరు తొలగించడమూ అనేకం జరిగినాయి; సమీప భవిష్యత్తులో మరింత భయంకరమైన కల్లోలాలను యివి సూచిస్తాయి. యెందుకంటే, తొందరపడవలసిన అవసరం వుంది. యింతవరకు యేమీ సంపాయించుకోలేని జాతులు యిక యెప్పుడూ భాగం పొందలేకపోవచ్చు, వచ్చే (అనగా 20వ) శతాబ్దికి ఒక అత్యంత ముఖ్య లక్షణంగా వుండబోయే బ్రహ్మాండమైన ప్రపంచ దోపిడీలో యిక యెప్పుడూ పాలు పంచుకోలేకపోవచ్చు. అందుకనే యిటీవల మొత్తం యూరప్ అమెరికాలను 19వ శతాబ్ది అంతపు అత్యంత ప్రముఖ లక్షణమైన వలస విస్తరణ, 'సామ్రాజ్యవాదం,' అనే జాడ్యం సోకింది." ఆ రచయిత యింకా యిలా అన్నాడు: "యీ ప్రపంచ విభజనలో, భూమండలంలోని నిధులకొరకూ, పెద్ద మార్కెట్లకొరకూ జరిగే ఘోరమైన వేటలో, 19వ శతాబ్దిలో స్థాపించబడిన సామ్రాజ్యాల శక్తికీ, వాటిని స్థాపించిన జాతులకు యూరప్‌లో గల స్థానాలకూ బొత్తిగా సంబంధం లేదు. యూరప్‌లో ప్రబలంగా వుండే రాజ్యాలు, యూరప్ భవిష్యత్తును నిర్ణయించే రాజ్యాలు, మొత్తం ప్రపంచంలో అంత ప్రబలంగానూ లేవు. వలస శక్తి, యింకా అంచనా వేయని ఐశ్వర్యాన్ని అదుపులో పెట్టుకోవాలనే ఆశ, యూరపియన్ శక్తుల బలాబలాలను మార్చడం స్పష్టం గనుక, యిప్పటికే యూరప్ రాజకీయ పరిస్థితులను మార్చిన వలస సమస్య — కావాలంటే 'సామ్రాజ్యవాద' సమస్య అనండి — వాటిని అంతకంతకూ అధికంగా మారుస్తుంది."*

* J.-E. Driault, *Problèmes politiques et sociaux* ("రాజకీయ, సాంఘిక సమస్యలు"), P., 1900, p. 299.

# 7. పెట్టుబడిదారీ విధానపు ప్రత్యేక దశగా సామ్రాజ్యవాదం

సామ్రాజ్యవాదం గురించి పైన చెప్పినదాన్ని క్రోడీకరించడానికి యిప్పుడు ప్రయత్నించాలి. పెట్టుబడిదారీ విధానానికి సాధారణంగా వుండే మౌలిక లక్షణాల పర్యవసానంగానూ, వాటి ప్రత్యక్ష కొనసాగింపుగానూ సామ్రాజ్యవాదం ఉద్భవించింది. కానీ పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదంగా యెప్పుడు మారిందంటే, పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిలోని ఒక నిర్దిష్టమైన, చాలా ఉన్నతమైన దశలో మాత్రమే, దాని మౌలిక లక్షణాలలో కొన్ని తద్విరుద్ధమైన లక్షణాలుగా మారడం ప్రారంభించినప్పుడు మాత్రమే, పెట్టుబడిదారీ విధానంనుండి మరింత ఉన్నతమైన సామాజిక-ఆర్థిక విధానానికి మార్పు చెందే ఆ సంధి యుగంయొక్క లక్షణాలు రూపుదాల్చి, సర్వత్రా వెల్లడి ఐనప్పుడు మాత్రమే. ఆర్థికంగా, యీ క్రమంలో ముఖ్య లక్షణం యేమిటంటే, పెట్టుబడిదారీ స్వేచ్ఛాయుత పోటీని తొలగించి దాని స్థానంలో పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం రావడం. పెట్టుబడిదారీ విధానానికీ, సాధారణంగా విక్రయ వస్తు ఉత్పత్తికీ మౌలిక లక్షణం స్వేచ్ఛాయుత పోటీ. దీనికి పూర్తి విరుద్ధమైంది గుత్తాధిపత్యం. కానీ, మన కండ్ల యెదుటనే స్వేచ్ఛాయుత పోటీ గుత్తాధిపత్యంగా మారింది; భారీ పరిశ్రమలు సృష్టించబడి చిన్న పరిశ్రమలను గెంటివేస్తున్నాయి; భారీ పరిశ్రమల స్థానంలో మరింత భారీ పరిశ్రమలు స్థాపించబడుతున్నాయి. ఉత్పత్తి, పెట్టుబడుల సాంద్రీకరణ జరిగి జరిగి తత్ఫలితంగా గుత్తసంస్థలు పెరుగుతున్నాయి — కార్టెల్‌లూ, సిండికేట్లూ, ట్రస్టులూ, వందలకోట్ల డబ్బుతో వ్యవహరించే యే డజను బాంకుల పెట్టుబడో వాటితో కలవడమూ. అదే సమయంలో స్వేచ్ఛాయుత పోటీ నుండి ఉత్పన్నమైన గుత్తసంస్థలు దానిని తొలగించవు, దానిపైనా, దాని పక్కనే వుంటాయి. తద్వారా పలు మహా నిశితమైన, తీవ్రమైన శత్రుత్వాలనూ, రాపిళ్లనూ, ఘర్షణలనూ ఉత్పన్నం చేస్తాయి. గుత్తాధిపత్యం యేర్పడడం అంటే పెట్టుబడిదారీ విధానం మరింత ఉన్నత వ్యవస్థకు పరివర్తన చెందడమే.

సామ్రాజ్యవాదానికి అత్యంత హ్రస్వ నిర్వచనం యివ్వాలంటే, దాన్ని పెట్టుబడిదారీ విధానంయొక్క గుత్త దశగా చెప్పాలి. యీ నిర్వచనంలో అత్యంత ముఖ్యమైన అంశం యిమిడి వుంది. యెందుకంటే, ఒకవైపున, ఫైనాన్స్ పెట్టుబడి అనేది పారిశ్రామికుల గుత్త సంఘాల పెట్టుబడితో లీనమైన కొద్దిపాటి చాలా పెద్ద గుత్త బాంకుల బాంకింగ్

పెట్టుబడి. మరొకవైపున, ప్రపంచ విభజన జరగడమంటే, యే పెట్టుబడిదారీ రాజ్యానికీ చెందని ప్రాంతాలకు అడ్డం లేకుండా విస్తరించిన వలస విధానం, పూర్తిగా పంపకమైపోయిన ప్రపంచంమీద గుత్త యాజమాన్యంకొరకు ప్రయత్నించే వలస విధానంలోకి పరివర్తన చెందడమే.

అతి హ్రస్వ నిర్వచనాలు, ప్రధానాంశాలను క్రోడీకరిస్తాయి గనుక సౌకర్యంగా వున్న ప్పటికీ, అరకొరగానే వుంటాయి; యెందుకంటే నిర్వచించవలసిన విషయాంశంలోని అతి ముఖ్య లక్షణాలను అనుమాన ప్రమాణం ద్వారా ప్రత్యేకంగా తెలుసుకోవలసివుంటుంది. యే నిర్వ చనమూ ఒక విషయంయొక్క సకల సంబంధాలనూ వెల్లడించలేదు గనుక, సాధారణంగా నిర్వచనాలన్నీ సాపేక్షంగానూ, వైకల్పికంగానూ వుంటాయనే విషయం మరిచిపోకుండా, మనం సామ్రాజ్యవాదానికి యిచ్చే నిర్వచనంలో దాని యీకింది ఐదు మౌలిక లక్షణాలూ వుండేటట్లు చూడాలి: 1) ఉత్పత్తియొక్క, పెట్టుబడియొక్క సాంద్రీకరణ యెంత ఉన్నత దశకు పురో గమించిందంటే, అది ఆర్థిక జీవితంలో నిర్ణాయక పాత్ర వహించే గుత్తసంస్థలను సృష్టిం చింది; 2) బాంకి పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడితో లీనం కావడమూ, యీ "ఫైనాన్స్ పెట్టుబడి" ఆధారంమీద ఒక ఆర్థిక ప్రభుమండలి సృష్టి కావడమూ; 3) విక్రయ వస్తువుల ఎగుమతికి భిన్నంగా పెట్టుబడి ఎగుమతి విశేషమైన ప్రాముఖ్యం వహించడం; 4) ప్రపంచాన్ని తమ మధ్య పంచుకునే అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంఘాలు యేర్ప డడం; 5) అన్నిటికంటె పెద్ద పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య ప్రపంచమంతా ప్రాదేశి కంగా పంపకం కావడం పూర్తి అయింది. గుత్తసంస్థల, ఫైనాన్స్ పెట్టుబడి ప్రాబల్యం స్థిరపడడమూ, పెట్టుబడి యెగుమతి విశేష ప్రాముఖ్యం వహించడమూ, అంతర్జాతీయ ట్రస్టుల మధ్య ప్రపంచ విభజన ప్రారంభం కావడమూ, అన్నిటికంటె పెద్ద పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య భూమండలంలోని సకల ప్రాంతాల విభజనా పూర్తి కావడమూ అనే లక్షణాలు గల దశలోకి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానమే సామ్రాజ్యవాదం.

పై నిర్వచనంలో మౌలికమైన శుద్ధ ఆర్థిక భావాలు మాత్రమే వున్నాయి. యీ భావాలు మాత్రమే కాక, మొత్తం పెట్టుబడిదారీ విధానం దృష్ట్యా పెట్టుబడిదారీ విధానంయొక్క యీ దశకు గల చారిత్రక స్థానం కూడా గానీ, సామ్రాజ్యవాదానికీ కార్మికవర్గ ఉద్యమం లోని రెండు ముఖ్య ధోరణులకూ గల సంబంధం కూడా గానీ మనం మనసులో పెట్టుకుంటే, సామ్రాజ్యవాదాన్ని మరొక విధంగా నిర్వచించవచ్చు, నిర్వచించక తప్పదు కూడా; యీ విష యం ముందు తెలుస్తుంది. సరిగా యిక్కడ గుర్తుంచుకోవలసిన విషయం యేమంటే, పైన వ్యాఖ్యానించిన రూపంలో సామ్రాజ్యవాదం నిస్సందేహంగా పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిలో ఒక ప్రత్యేక దశను వ్యక్తం చేస్తుంది. పాఠకునికి సామ్రాజ్యవాదం గురించి

సందేహరహితమైన అభిప్రాయం కలిగించడానికి నేను ఉద్దేశపూర్వకంగానే బూర్జువా అర్థశాస్త్రవేత్తలనుండి వీలైనంత యెక్కువగా ఉల్లేఖించినాను; పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థయొక్క అధునాతన దశలోని మరీ కాదనడానికి వీలులేని వాస్తవాలను వాళ్లు అంగీకరించక తప్పదు. అదే ఉద్దేశంతోనే నేను కొన్ని వివరమైన లెక్కలు యిచ్చినాను; బాంకింగ్ పెట్టుబడి వగైరాలు యేమేరకు పెరిగిందీ, పరిమాణం గుణంలోకి, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంలోకి, పరివర్తన చెందడం సరిగ్గా యెందులో వ్యక్తమయ్యేదీ తెలుసుకోడానికి ఆ లెక్కలు తోడ్పడతాయి. ప్రకృతిలోనూ, సమాజంలోనూ సరిహద్దులు వైకల్పికంగానూ, స్థిరత్వంలేనివిగానూ ఉంటాయని, ఉదాహరణకు ఫలానా సంవత్సరంలోనో, ఫలానా దశాబ్దంలోనో సామ్రాజ్యవాదం "అసందిగ్ధంగా" స్థిరపడిందని వాదించడం అవివేకమనీ చెప్పడం అనవసరం.

కానీ, సామ్రాజ్యవాదాన్ని నిర్వచించే విషయంలో మనం వివాదంలోకి దిగవలసివుంది, ప్రధానంగా కాట్స్కీతో; రెండవ ఇంటర్నేషనల్ అనబడే దాని యుగంలో — అనగా 1889కీ 1914కూ మధ్యగల 25 సంవత్సరాలలో — ప్రధాన మార్క్సిస్టు సిద్ధాంతవేత్త యీ కాట్స్కీ. మన నిర్వచనంలోని మౌలిక భావాలను అతను 1915లో, 1914 నవంబర్‌లోనే దీక్షగా యెదిరించినాడు. అతను చెప్పింది యేమిటంటే, సామ్రాజ్యవాదాన్ని ఆర్థిక వ్యవస్థలో ఒక దశగా చూడకూడదనీ; దాన్ని ఒక విధానంగా, ఫైనాన్స్ పెట్టుబడి "మేలైనదిగా తలచిన" ఒక నిర్దిష్ట విధానంగా చూడాలనీ, సామ్రాజ్యవాదాన్నీ "యీనాటి పెట్టుబడిదారీ విధానా"న్నీ "ఒకటిగా గ్రహించ"కూడదనీ; సామ్రాజ్యవాదం అంటే "యీనాటి పెట్టుబడిదారీ విధానంలోని అన్ని అంశాలూ" — కార్టెల్‌లూ, రక్షణ విధానమూ, ఫైనాన్స్ పెట్టుబడిదార్ల ప్రాబల్యమూ, వలస విధానమూ — అని పరిగణిస్తే యిక పెట్టుబడిదారీ విధానానికి సామ్రాజ్యవాదం అవసరమా అన్న ప్రశ్న "అర్థంలేని చర్విత చర్వణం ఔతుంది," యెందుకంటే అలాంటి సందర్భంలో "సామ్రాజ్యవాదం సహజంగా పెట్టుబడిదారీ విధానానికి ప్రాణావసరం ఔతుంది" అనీ, వగైరా. కాట్స్కీ భావాన్ని వ్యక్తం చేయడానికి ఉత్తమ మార్గం సామ్రాజ్యవాదానికి అతనే యిచ్చిన నిర్వచనాన్ని ఉల్లేఖించడం; అది నేను చెప్పిన భావాల సారానికి పూర్తిగా వ్యతిరేకం (చాలా యేండ్లుగా యిలాంటి అభిప్రాయాలను జర్మన్ మార్క్సిస్టులు ప్రచారం చేస్తున్నారు; వాళ్ల శిబిరంనుండి వచ్చే అభ్యంతరాలు మార్క్సిజంయొక్క ఒక నిర్దిష్ట ధోరణినుండి వచ్చే అభ్యంతరాలని చాలా కాలంగా కాట్స్కీకి తెలుసు).

కాట్స్కీ నిర్వచనం యిది:

"సామ్రాజ్యవాదం అనేది బాగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక పెట్టుబడిదారీ విధాన ఫలితం. ప్రతి పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశమూ అంతకంతకూ విస్తారమైన వ్యావసా

*యిక* (వక్కాణింపు కౌట్స్కీదే) ప్రాంతాలను, ఆ ప్రాంతాలలో యే జాతులు నివసిస్తున్నాయనే ప్రశ్నతో నిమిత్తం లేకుండా, తన అదుపులోకి తెచ్చుకోడానికి గానీ, లేక స్వాధీనపరుచుకోడానికి గానీ చేసే ప్రయత్నమే సామ్రాజ్యవాదం."*

యీ నిర్వచనం పూర్తిగా పనికి మాలినది; యెందుకంటే యిది ఏకపక్షంగా, అనగా నిర్విమర్శగా, జాతీయ సమస్యను (అది స్వయంగానూ, సామ్రాజ్యవాదంతో దానికి గల సంబంధం దృష్ట్యానూ చాలా ముఖ్యమైనదే ఐనప్పటికీ) ఒకదాన్ని వేరుచేస్తున్నది, అది నిర్విమర్శగానూ, *తప్పుగానూ* యీ సమస్యకు యితర జాతులను స్వాధీనపరుచుకొనే దేశాలలోని పారిశ్రామిక పెట్టుబడితో *మాత్రమే* సంబంధం కల్పిస్తున్నది; అదే విధంగా నిర్విమర్శగానూ, తప్పుగానూ అది వ్యావసాయిక ప్రాంతాల స్వాధీనాన్ని ప్రముఖ స్థానానికి తోస్తున్నది.

సామ్రాజ్యవాదం అంటే యితర ప్రాంతాలను స్వాధీనపరుచుకోడానికి చేసే ప్రయత్నం – యిది కౌట్స్కీ నిర్వచనంలోని *రాజకీయ* భాగంయొక్క సారాంశం. యిది సరైనదే, కానీ చాలా అసమగ్రం. యెందుకంటే రాజకీయంగా సామ్రాజ్యవాదం సాధారణంగా దౌర్జన్య పూరితమూ, ప్రగతి వ్యతిరేకమూ అయినది. కానీ ప్రస్తుతం మనం యీ సమస్యయొక్క *ఆర్థిక* పార్శ్వంపట్ల శ్రద్ధ వహిస్తున్నాం; దీన్ని *కౌట్స్కీయే తన* నిర్వచనంలో ప్రవేశ పెట్టినాడు. కౌట్స్కీ నిర్వచనంలోని లోపాలు స్పష్టంగా కనపడుతున్నాయి. సామ్రాజ్యవాదపు విలక్షణ గుణం పారిశ్రామిక పెట్టుబడి *కాదు*, ఫైనాన్స్ *పెట్టుబడే.* ఫ్రాన్సులో 80 దశకం నుండి (వలసవాద) పరదేశ స్వాధీన విధానం అత్యంత తీవ్రం కావడానికి కారణం సరిగ్గా *ఫైనాన్స్* పెట్టుబడి అసాధారణ వేగంతో అభివృద్ధి కావడమూ, పారిశ్రామిక పెట్టుబడి బలహీనపడడమూ; యీ సంబంధం యాదృచ్ఛికమేమీ కాదు. సామ్రాజ్యవాదంయొక్క విలక్షణ గుణం యేమిటంటే సరిగ్గా అది వ్యావసాయిక ప్రాంతాలను *మాత్రమే కాక* పారిశ్రామికంగా అత్యంత ఉన్నతాభివృద్ధి చెందిన ప్రాంతాలను కూడా స్వాధీనపరుచుకోడానికి ప్రయత్నించడమే (బెల్జియంను జర్మనీ, లొరెయిన్‌ను ఫ్రాన్సూ కబళించాలని చూస్తున్నాయి); యెందుకంటే, 1) ప్రపంచమంతా పంపకమైపోయింది గనుక, *పునర్విభజన* కోరేవాళ్లు *యేరకమైన* ప్రదేశం కొరకైనా చేతులు చాచక తప్పదు; 2) సామ్రాజ్యవాదపు ఒక ముఖ్య లక్షణం యేమిటంటే ఆధిపత్యంకొరకు వివిధ పెద్ద రాజ్యాల మధ్య పోటీ; ఆధిపత్యంకొరకు పోటీ అంటే ప్రత్యక్షంగా తమకొరకు గాక, తమ శత్రువును బలహీనపరిచి *అతని* ఆధిపత్యాన్ని

---

* "Die Neue Zeit," 1914, 2 (Vol. 32), p. 909, Sept. 11, 1914. చూ: 1915, 2, 107, తదితర పేజీలు.

దెబ్బతీయడంకొరకు పరాయి ప్రాంతాలను ఆక్రమించడానికి పోటీ. (ఇంగ్లండుమీద శత్రు చర్యలు జరపడానికి జర్మనీకి బెల్జియం చాలా ముఖ్యం; జర్మనీమీద శత్రు చర్యలు జరపడానికి ఇంగ్లండుకు బాగ్దాద్ అవసరం; యిలాగే....)

కాట్స్కీ ముఖ్యంగా, పదే పదే కూడా, ఇంగ్లీషువాళ్లను ప్రస్తావించి, వాళ్లు "సామ్రాజ్య వాదం" అనే పదానికి, తాను అర్థం చేసుకున్న విధంగానే, శుద్ధ రాజకీయ అర్థం యిచ్చి నారని వాదిస్తున్నాడు. హాబ్సన్ అనే ఇంగ్లీషువాడు రాసిన "సామ్రాజ్యవాదం" అనే గ్రంథం 1902లో వెలువడింది; దానిలో యిలా వుంది:

"కొత్త సామ్రాజ్యవాదం పాతదానితో యెక్కడ విభేదిస్తున్న దంటే, 1) ఒకే ఒక వర్ధమాన సామ్రాజ్యపు ఆశకు బదులు రాజకీయ దురాక్రమణా, వ్యాపార లాభమూ అనే ఒకే విధమైన దురాశ గల అనేక పోటీ సామ్రాజ్యాలు సిద్ధాంత రీత్యానూ, ఆచరణలోనూ వుండడం; 2) వర్తక ప్రయోజనాలమీద ఫైనాన్స్ ప్రయోజనాలు, అనగా పెట్టుబడి పెట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలు, ప్రాబల్యం వహించడం."*

కాట్స్కీ మూకమీద యింగ్లీషు రచయితలను ప్రస్తావించడం పూర్తిగా తప్పు అని తెలుస్తున్నది (అతను ఉద్దేశించింది అపభ్రంశ యింగ్లీషు సామ్రాజ్యవాదులో, సామ్రాజ్య వాదాన్ని సమర్థించడానికి దీక్షపూనినవాళ్లో ఐతే తప్ప). కాట్స్కీ తాను మార్క్సిస్టునని చెప్పు కుంటున్నప్పటికీ, సోషల్ ఉదారవాది ఐన హాబ్సన్‌కంటె ఒక అడుగు వెనకే వేస్తున్నాడు. (కాట్స్కీ చారిత్రక నిర్దిష్టతను అపహాస్యం పాలు చేయగా!) అతనికంటె సరిగా హాబ్సన్ ఆధునిక సామ్రాజ్యవాదపు రెండు "చారిత్రక నిర్దిష్ట" లక్షణాలను పరిగణనలోకి తీసుకు న్నాడు. అవి యేమంటే: 1) కొన్ని సామ్రాజ్యవాదాల మధ్య పోటీ, 2) వర్తకునికంటె ఫైనాన్స్ పెట్టుబడిదారుని ప్రాబల్యం వుండడం. పారిశ్రామిక దేశాలు వ్యావసాయిక దేశాలను ఆక్ర మించడమే ముఖ్య విషయమైతే, అప్పుడు వర్తకుని పాత్రే ముందుకు వస్తుంది.

కాట్స్కీ నిర్వచనం తప్పు మాత్రమే కాదు, మార్క్సిస్టు విరుద్ధమైనది. మార్క్సిస్టు సిద్ధాంతంతోనూ, మార్క్సిస్టు ఆచరణతోనూ అత్యంతం విభేదించే ఒక భావ వ్యవస్థ మొత్తానికే అది పునాదిగా వుంటున్నది. దీన్ని గురించి తరువాత చూద్దాం. పెట్టుబడి దారీ విధానపు అధునాతన దశను "సామ్రాజ్యవాదం" అనాల్నా, లేక "ఫైనాన్స్ పెట్టుబడి దశ" అనాల్నా అని పద ప్రయోగం గురించి కాట్స్కీ లేవనెత్తే వాదం కేవలం చిల్లర వ్యవ హారంగా వుంది. దాన్ని యే పేరుతో పిలిచినా సరే, భేదం యేమీ లేదు. సమస్యలోని సార భూతమైన విషయం యేమిటంటే, కాట్స్కీ సామ్రాజ్యవాదపు రాజకీయాలను దాని ఆర్థిక

* Hobson, *Imperialism*, L., 1902, p. 324.

వ్యవహారాలనుండి వేరుచేసి, పరదేశ స్వాధీనాలను ఫైనాన్స్ పెట్టుబడి "మేలైనదిగా తలచిన" విధానంగా చెప్తూ, యీ విధానానికి భిన్నంగా మరొక బూర్జువా విధానం వుందనీ, యీ ఫైనాన్స్ పెట్టుబడి పునాదిమీదనే ఆ బూర్జువా విధానం సాధ్యమౌతుందనీ అంటున్నాడు. ఆర్థిక రంగంలో గుత్తసంస్థలు గుత్తాధిపత్యేతర, దౌర్జన్యేతర, ఆక్రమణేతర విధానాలతో రాజకీయ రంగంలో కలిసి వుండగలవని దీని అర్థం. ప్రపంచ ప్రాదేశిక విభజన సరిగ్గా ఫైనాన్స్ పెట్టుబడి యుగంలో పూర్తి అయింది, అన్నిటికంటె పెద్ద రాజ్యాల మధ్యగల పోటీయొక్క యీనాటి రూపాలకు ఆధారంగా వుంది; అలాంటి ప్రపంచ భౌగోళిక విభజన సామ్రాజ్యవాదేతర విధానంతో కలిసి వుండగలదు – అని కౌట్స్కీ మాటల అర్థం. దీని ఫలితం పెట్టుబడిదారీ విధానపు అధునాతన దశలోని అత్యంత ప్రగాఢ అంతర్వైరుధ్యాలను బట్టబయలు చేయడానికి బదులు, వాటిని మరుగుపరచడమూ, వాటి తీవ్రతను తగ్గించడమూ, దీని ఫలితం మార్క్సిజానికి బదులు బూర్జువా సంస్కరణవాదం అవుతుంది.

సామ్రాజ్యవాదాన్నీ, ఆక్రమణలనూ సమర్థించే జర్మనీ దేశపు క్యూనొవ్‌తో కౌట్స్కీ వివాదంలోకి దిగినాడు. సామ్రాజ్యవాదం నేటి పెట్టుబడిదారీ విధానం అనీ, పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి అనివార్యమూ, అభ్యుదయకరమూ అనీ, కనుక సామ్రాజ్యవాదం అభ్యుదయకరం అనీ, కనుక మనం దాన్ని కీర్తించాలనీ, దాని ముందర సాష్టాంగ పడాలనీ మొరటుగా, కుటిలంగా క్యూనొవ్ వాదిస్తాడు! యిది రష్యన్ మార్క్సిస్టుల గురించి 1894–1895లో నరోద్నిక్కులు చేసిన వక్రచిత్రం లాంటిది. నరోద్నిక్కుల వాదం యిది: మార్క్సిస్టులు రష్యాలో పెట్టుబడిదారీ విధానం అనివార్యమని నమ్మితే, అభ్యుదయకరమని నమ్మితే, వాళ్ళు సారా అంగడి పెట్టి, పెట్టుబడిదారీ విధానాన్ని ప్రవేశపెట్టడానికి పూనుకోవాలి! క్యూనొవ్‌కు కౌట్స్కీ సమాధానం యిది: సామ్రాజ్యవాదం నేటి పెట్టుబడిదారీ విధానం కాదు; యిది నేటి పెట్టుబడిదారీ విధానపు రూపాలలో ఒకటి మాత్రమే; యీ విధానంతో మనం పోరాటం చేయగలం, చేసి తీరాలి; సామ్రాజ్యవాదంతోనూ, పరదేశ స్వాధీనాలు వగైరాలతోనూ పోరాటం చేయాలి.

యీ సమాధానం బాగానే వున్నట్లు కనపడుతుంది; కానీ క్రియలో యిది మరింత నిగూఢంగా, మరింత ప్రచ్ఛన్నంగా (కనుక మరింత ప్రమాదకరంగా) సామ్రాజ్యవాదంతో రాజీని బోధిస్తుంది. యెందుకంటే, ట్రస్టుల, బాంకుల ఆర్థిక వ్యవహారాల పునాదిని తగలకుండా ట్రస్టుల, బాంకుల విధానంతో చేసే "పోరాటం" బూర్జువా సంస్కరణవాదమూ, శాంతివాదమూ తప్ప మరేమీ కాదు; అమాయకంగా, ఉదారంగా పవిత్రమైన కోరికలు కోరడం తప్ప మరేమీ కాదు. ఉన్న వైరుధ్యాల పూర్తి అంతర్యాన్ని వెల్లడి చేయడానికి బదులు వాటిని దాటవెయ్యడం, వాటిలో అత్యంత ముఖ్యమైన వాటిని విస్మరించడం – యిది

కాట్స్కీ సిద్ధాంతం; దీనికీ మార్క్సిజానికీ యేమీ సంబంధం లేదు. సహజంగానే, యిలాంటి "సిద్ధాంతం" క్యూనోవ్‌లాంటి వాళ్లతో ఐకమత్యాన్ని బోధించడానికి మాత్రమే పనికి వస్తుంది.

కాట్స్కీ యిలా రాసినాడు: "కేవల ఆర్థిక దృక్పథంనుండి చూస్తే, పెట్టుబడిదారీ విధానంలో మరొక కొత్త దశ రావడం అసంభవం కాదు, కార్టెల్‌ల విధానం విదేశాంగ విధానానికి విస్తరించే దశ, అది స్వామ్రాజ్యవాద దశ,"* అనగా అతీత స్వామ్రాజ్యవాద దశ, మొత్తం ప్రపంచంలోని స్వామ్రాజ్యవాదాల మధ్య పోరాటాలు కాక వాటి సమ్మేళన జరిగే దశ, పెట్టుబడిదారీ విధానంలో యుద్ధాలు అంతం అయ్యే దశ, "అంతర్జాతీయంగా సమైక్యమైన ఫైనాన్స్ పెట్టుబడి ప్రపంచాన్ని సంయుక్తంగా దోచుకునే"** దశ.

యీ "అధి స్వామ్రాజ్యవాద సిద్ధాంతం" యెలా అసందిగ్ధంగా, పూర్తిగా మార్క్సిజంతో విభేదించేదీ వివరంగా చూపే ప్రయత్నం తరువాత చేస్తాను. ప్రస్తుతం, యీ రచనా పథకానికి కట్టుబడి, యీ సమస్యకు సంబంధించిన ఖచ్చితమైన ఆర్థిక విషయాలను పరిశీలించాలి. "కేవల ఆర్థిక దృక్పథంనుండి చూస్తే" "అధి స్వామ్రాజ్యవాదం" సంభవమా, లేక అది అధి అవివేకమా?

కేవల ఆర్థిక దృక్పథం అంటే "కేవల" భావమే ఐతే, అప్పుడిక ఆ వాదమంతా యీకింది ప్రతిపాదనకు సమాన మౌతుంది: అభివృద్ధి గుత్తసంస్థలవైపు పురోగమిస్తున్నది, కనుక ఏకైక ప్రపంచ గుత్తసంస్థవైపు, ఏకైక ప్రపంచ ట్రస్టువైపు, పురోగమిస్తున్నది. యిది నిర్వివాదం, కానీ పూర్తిగా అర్థరహితం — ఆహారపదార్థాల ఉత్పత్తి రసాయన శాలలలో "అభివృద్ధి పురోగమిస్తున్నది" అన్న ప్రకటనలాగే. "అధి వ్యవసాయ సిద్ధాంతం" యెంత అర్థం లేనిదో, అధి స్వామ్రాజ్యవాద "సిద్ధాంతం" కూడా అంత అర్థం లేనిది.

కానీ, 20వ శతాబ్ది ప్రారంభంలో మొదలైన ఒక చారిత్రక నిర్దిష్ట యుగం ఐన ఫైనాన్స్ పెట్టుబడి యుగంలోని "కేవల ఆర్థిక" పరిస్థితులను మనం చర్చిస్తూ వుంటే, అప్పుడు నిర్జీవమైన "అధి స్వామ్రాజ్యవాదపు" భావాలకు (యివి కేవలం ప్రస్తుత గాఢ వైరుధ్యాలనుండి దృష్టిని మళ్లించే అత్యంత ప్రగతి వ్యతిరేక లక్ష్యానికి మాత్రమే ఉపయోగపడతాయి) ఉత్తమ సమాధానం యేదంటే ఆ భావాలను యీనాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని నిర్దిష్ట ఆర్థిక వాస్తవాలతో పోల్చడమే. అధి స్వామ్రాజ్యవాదం గురించి కాట్స్కీ

---

* "Die Neue Zeit," 1914, 2 (Vol. 32), p. 921, September 11, 1914. చూ: 1915, 2, 107, తదితర పేజీలు.

** "Die Neue Zeit," 1915, 1, p. 144, April 30, 1915.

చెప్పే శుద్ధ అవివేకపు మాటల ఫలితాలలో ఒకటి యేదంటే సామ్రాజ్యవాదాన్ని సమర్థించే వాళ్లకు అనుకూలమైన ఒక మహా పొరపాటు భావాన్ని ప్రోత్సహించడం – ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని అసమానతలనూ, వైరుధ్యాలనూ ఫైనాన్స్ పెట్టుబడి బలహీనపరుస్తుందనే భావాన్ని; నిజానికి అది వాటిని బలపరుస్తుంది.

19, 20వ శతాబ్దాల మలుపులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత సంబంధాలకు ఒక నిర్దిష్ట రూపం యివ్వగల ముఖ్యమైన కేవల ఆర్థిక వివరాలను క్రోడీకరించడానికి ఆర్. కాల్వర్ "ప్రపంచ ఆర్థిక వ్యవహారాలకు ప్రవేశిక"* అనే తన చిన్న గ్రంథంలో ప్రయత్నించినాడు. అతను ప్రపంచాన్ని ఐదు "ప్రధాన ఆర్థిక ప్రాంతాలుగా" విభజించినాడు: 1) మధ్య యూరప్ (రష్యా, గ్రేట్ బ్రిటన్‌లు తప్ప తక్కిన యూరప్ అంతా); 2) గ్రేట్ బ్రిటన్; 3) రష్యా; 4) తూర్పు ఆసియా; 5) అమెరికా; వలసలను అవి యే రాజ్యానికి చెందితే ఆ రాజ్యపు "ప్రాంతం"లో చేర్చినాడు; ప్రాంతాలుగా పంపకం కాని కొద్ది దేశాలను – ఆసియాలో పర్షియా, అఫ్ఘనిస్తాన్, అరేబియా; ఆఫ్రికాలో మొరాకో, అబిసీనియా; మొదలైనవి – "వదిలేసినాడు."

యీ ప్రాంతాలకు సంబంధించి అతను యిచ్చిన ఆర్థిక వివరాల సంగ్రహ రూపం యిది (244వ పేజీలోని పట్టిక చూడండి).

బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం (బాగా అభివృద్ధి చెందిన రవాణా సాధనాలూ, వర్తకమూ, పరిశ్రమలూ) మనకు మూడు ప్రాంతాల్లో కనపడుతుంది: మధ్య యూరపియన్, బ్రిటిష్, అమెరికన్ ప్రాంతాలు. వీటిలో మూడు రాజ్యాలు ప్రపంచంమీద ప్రాబల్యం వహిస్తున్నాయి: జర్మనీ, గ్రేట్ బ్రిటన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు. యీ మూడు దేశాల మధ్య సామ్రాజ్యవాద పోటీ, పోరాటమూ అతి తీవ్రమైనాయి; యెందుకంటే జర్మనీకి విస్తీర్ణం తృణప్రాయంగానూ, వలసలు చాలా కొద్దిగానూ వున్నాయి; "మధ్య యూరప్" యేర్పడడం భవిష్యత్తుకు చెందిన విషయం, భీషణ పోరాటం మధ్య అది పుట్టుతూ వుంది. ప్రస్తుతానికి మొత్తం యూరప్ విశిష్ట లక్షణం దాని రాజకీయ అనైక్యత. యిందుకు భిన్నంగా బ్రిటిష్, అమెరికన్ ప్రాంతాలలో రాజకీయ కేంద్రీకరణ చాలా యెక్కువగా అభివృద్ధి చెందింది; కానీ మొదటిదాని అపారమైన వలసలకూ, రెండవదాని తృణప్రాయమైన వలసలకూ మధ్య బ్రహ్మాండమైన వ్యత్యాసం వుంది. ఐనా, వలసల్లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం యిప్పుడిప్పుడే ప్రారంభమౌతున్నది. దక్షిణ అమెరికాకొరకు పోరాటం అంతకంతకూ తీవ్రమౌతున్నది.

---

* R. Calwer, *Einführung in die Weltwirtschaft*, Brl., 1906.

| ప్రధాన ఆర్థిక ప్రాంతాలు | విస్తీర్ణం | జనసంఖ్య | రవాణా | | వర్తకం | పరిశ్రమలు | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | లక్షల చదరపు కిలోమీటర్లు | లక్షలు | రైల్వేలు (వేల కిలోమీటర్లు) | వాణిజ్య నౌకలు (లక్షల టన్నులు) | ఎగుమతి దిగుమతులు (శతకోటి మార్కులు) | బొగ్గు ఉత్పత్తి (లక్షల టన్నులు) | ఇనుము ఉక్కు ఉత్పత్తి (లక్షల టన్నులు) | నూలు కదుర్లు (లక్షలు) |
| 1) మధ్య యూరపియన్ ప్రాంతం | 276 (236)* | 3,880 (1,460) | 204 | 80 | 41 | 2,510 | 150 | 260 |
| 2) బ్రిటిష్ ప్రాంతం | 289 (286)* | 3,980 (3,550) | 140 | 110 | 25 | 2,490 | 90 | 510 |
| 3) రష్యన్ ప్రాంతం | 220 | 1,310 | 63 | 10 | 3 | 160 | 30 | 70 |
| 4) తూర్పు ఆసియా ప్రాంతం | 120 | 3,890 | 8 | 10 | 2 | 80 | 0.2 | 20 |
| 5) అమెరికన్ ప్రాంతం | 300 | 1,480 | 379 | 60 | 14 | 2,450 | 140 | 190 |

* బ్రాకెట్లలోని అంకెలు వలసల విస్తీర్ణాన్నీ, జనాభానూ తెలియజేస్తాయి.

పెట్టుబడిదారీ విధానం చాలా తక్కువగా అభివృద్ధి ఐన ప్రాంతాలు రెండు వున్నాయి: రష్యా, తూర్పు ఆసియా. మొదటిదానిలో జనాభా సాంద్రత చాలా తక్కువ, రెండవదానిలో చాలా యెక్కువ; మొదటిదానిలో రాజకీయ కేంద్రీకరణ యెక్కువ, రెండవదానిలో అసలు లేదు. చైనా పంపకం కేవలం ప్రారంభ దశలో వుంది; అందుకొరకు జపాన్, అమెరికా, వగైరాల పోరాటం క్రమంగా తీవ్రతరమౌతున్నది.

యీ వాస్తవాన్ని – వివిధ దేశాల ఆర్థిక, రాజకీయ పరిస్థితులలోని అపారమైన వైవిధ్యమూ, వాటి అభివృద్ధి రేట్లలోని విపరీత అసమానతలూ, వగైరాలనూ, సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య జరిగే భీషణ పోరాటాలనూ – "శాంతియుత" అధి సామ్రాజ్యవాదం గురించి కౌట్స్కీ చెప్పే అవివేకపు కట్టుకథతో పోల్చి చూడండి. యిది భయకంపితుడైన కూపస్థమండూకం కరకు వాస్తవంనుండి దాగుకునే ప్రగతి వ్యతిరేక ప్రయత్నం కాదా? యే అంతర్జాతీయ కార్టెల్‌లను కౌట్స్కీ అధి సామ్రాజ్యవాదపు బీజాలుగా (రసాయన శాలలో మాత్రల ఉత్పత్తిని యెవడైనా అధి వ్యవసాయపు బీజంగా వర్ణించినట్లే) ఊహిస్తున్నాడో, ఆ అంతర్జాతీయ కార్టెల్‌లు ప్రపంచ విభజనకూ, పునర్విభజనకూ ఉదాహరణ కాదా? అవి శాంతియుత విభజననుండి హింసాయుత విభజనకూ, హింసాయుత విభజననుండి శాంతియుత విభజనకూ జరిగిన పరివర్తనను వ్యక్తం చేయవా? అంతర్జాతీయ రైలు సిండికేటును యేర్పరచడంలో గానీ, అంతర్జాతీయ సముద్ర వర్తక రవాణా ట్రస్టును యేర్పరచడంలో గానీ జర్మనీతో కలిసి మొత్తం ప్రపంచాన్ని శాంతియుతంగా పంచుకున్న అమెరికన్ తదితర ఫైనాన్స్ పెట్టుబడి ప్రపంచ బలాబలాలను కేవల హింసాయుత పద్ధతుల ద్వారా మార్చడానికీ, తత్పర్యవసానంగా ప్రపంచ పునర్విభజన కొరకూ యిప్పుడు కృషి చేయడం లేదా?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని వివిధ భాగాల పెరుగుదల రేట్లలోని అసమానతలను ఫైనాన్స్ పెట్టుబడీ, ట్రస్టులూ తగ్గించడానికి బదులు, యెక్కువ చేస్తాయి. బలాబలాల స్థితి ఒకసారి మారిన తర్వాత యిక పెట్టుబడిదారీ విధానంలో వైరుధ్యాల పరిష్కారానికి బలం తప్ప మార్గ మేమున్నది? రైల్వేలకు సంబంధించిన గణాంక లెక్కలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ విధానానికీ, ఫైనాన్స్ పెట్టుబడికీ సంబంధించిన వివిధ పెరుగుదల రేట్లను గురించి యెంతో ఖచ్చితమైన వివరాలను యిస్తున్నాయి.* సామ్రాజ్యవాద అభివృద్ధిలోని గత దశాబ్దాలలో మొత్తం రైల్వేల పొడవు యీవిధంగా మారింది:

---

* *Statistische Jahrbuch für das Deutsche Reich*, 1915; *Archiv für Eisenbahnwesen*, 1892 ("జర్మన్ సామ్రాజ్యపు గణాంకశాస్త్రీయ సాంవత్సరిక వివరణ గ్రంథం," 1915; "రైల్వే వ్యవస్థ పత్రిక," 1892). వలసదేశాలలో

రైల్వేలు
(వేల కిలోమీటర్లు)

| | 1890 | 1913 | + |
|---|---|---|---|
| యూరప్ . . . . | 224 | 346 | +122 |
| అమెరికా సంయుక్త రాష్ట్రాలు. | 268 | 411 | +143 |
| వలసలు అన్నీ . . . | 82 } 125 | 210 } 347 | +128 } +222 |
| ఆసియా, అమెరికాలలోని స్వతంత్ర, అర్ధస్వతంత్ర రాజ్యాలు | 43 | 137 | +94 |
| మొత్తం . . . | 617 | 1,104 | |

ఈవిధంగా, వలసల్లోనూ, ఆసియా, అమెరికాలలోని స్వతంత్ర (అర్ధస్వతంత్ర) రాజ్యాలలోనూ రైల్వేల అభివృద్ధి అత్యంత వేగంగా వుండింది. యిక్కడ నాలుగైదు అతి పెద్ద పెట్టుబడిదారీ రాజ్యాల ఫైనాన్స్ పెట్టుబడి అడ్డం లేకుండా రాజ్యం చేస్తున్నదని మనకు తెలుసు. వలసల్లోనూ, ఆసియా అమెరికాలలోని యితర దేశాల్లోనూ రెండు లక్షల కిలోమీటర్ల రైల్వేల నిర్మాణం అంటే నాలుగు వేల కోట్ల మార్కుల పెట్టుబడి కొత్తగా పెట్టబడిందని అర్థం, మంచి లాభాలకు హామీతో, ఉక్కు కర్మాగారాలకు కాంట్రాక్టులతో, లాభదాయకమైన ఆర్డర్లతో వగైరా.

వలసలలోనూ, సముద్రాంతర దేశాలలోనూ పెట్టుబడిదారీ విధానం అత్యంత వేగంతో పెరుగుతున్నది. సముద్రాంతర దేశాలలో కొత్త సామ్రాజ్యవాద రాజ్యాలు పుట్టుతున్నాయి (ఉదా: జపాన్). ప్రపంచ సామ్రాజ్యవాదాలలో పోరాటం మరింత తీవ్రమౌతున్నది. వలసల్లోనూ, సముద్రాంతర దేశాల్లోనూ స్థాపించే లాభదాయకమైన వ్యాపారసంస్థలమీద ఫైనాన్స్ పెట్టుబడి తీస్తున్న లాభం పెరుగుతున్నది. "కొల్లసొమ్ము" విభజనలో చాలా పెద్ద భాగం చెందే దేశాలు తప్పనిసరిగా ఉత్పాదక శక్తులు అత్యంత వేగంగా పెరిగిన దేశాలు కాదు. వాటి వలసలతో కలిసి అన్నిటికంటె పెద్దవైన దేశాల రైల్వేల పొడవు యీకింది విధంగా వుండింది:

---

1890 సంవత్సరపు రైల్వే విస్తరణకు సంబంధించిన చిల్లర వివరాలు ఇంచుమించుగా ఖుదింపు వేయవలసివచ్చింది.

(వేల కిలోమీటర్లు)

| | 1890 సం. | 1913 సం. | |
|---|---|---|---|
| అమెరికా సంయుక్త రాష్ట్రాలు . | 268 | 413 | +145 |
| బ్రిటిష్ సామ్రాజ్యం . . . . | 107 | 208 | +101 |
| రష్యా . . . . . . . . | 32 | 78 | +46 |
| జర్మనీ . . . . . . . | 43 | 68 | +25 |
| ఫ్రాన్సు . . . . . . . | 41 | 63 | +22 |
| 5 రాజ్యాల మొత్తం . . . . | 491 | 830 | +339 |

ఈవిధంగా, వున్న రైల్వేలలో 80 శాతం ఐదు అతి పెద్ద రాజ్యాల చేతుల్లో వుంది. కానీ, యీ రైల్వేల ఆస్తియొక్క సాంద్రీకరణ, ఫైనాన్స్ పెట్టుబడియొక్క సాంద్రీకరణ, యింకా చాలా యెక్కువగా వుంది: ఉదాహరణకు ఫ్రెంచి, యింగ్లీషు కోటీశ్వరులకు అమెరికన్, రష్యన్, తదితర రైల్వేలలో అపారమైన విలువగల షేర్లూ, బాండ్లూ వున్నాయి.

తన వలసల మూలంగా, గ్రేట్ బ్రిటన్ "తన" రైల్వేల పొడవును లక్ష కిలోమీటర్లు పెంచుకుంది, అనగా జర్మనీకంటె నాలుగు రెట్లు యెక్కువ పెంచుకుంది. ఐనా, యీ కాలంలో జర్మనీలో ఉత్పాదక శక్తుల అభివృద్ధి, ముఖ్యంగా బొగ్గు యినుము పరిశ్రమల అభివృద్ధి – ఫ్రాన్సు, రష్యాల మాట అటుంచి – యింగ్లండులోకంటె యెంతో వేగంగా, పోలికే లేనంత వేగంగా, జరిగిందని అందరికీ తెలుసు. 1892లో జర్మనీ 49 లక్షల టన్నుల దుక్క యినుమూ, గ్రేట్ బ్రిటన్ 68 లక్షల దుక్క యినుమూ ఉత్పత్తి చేసినాయి; 1912లో జర్మనీ 176 లక్షల టన్నులూ, గ్రేట్ బ్రిటన్ 90 లక్షల టన్నులూ ఉత్పత్తి చేసినాయి. కనుక, యీ విషయంలో జర్మనీకి బ్రహ్మాండమైన ఆధిక్యం వుండింది!* యిప్పుడు ప్రశ్న యేమిటంటే: యిటు ఉత్పాదక శక్తుల అభివృద్ధికీ, ప్రోగైన పెట్టుబడికీ, అటు వలసల విభజనకూ, ఫైనాన్స్ పెట్టుబడికీ గల "పలుకుబడి ప్రాంతా"లకూ మధ్య వున్న అసమానతను తొలగించడానికి పెట్టుబడిదారీ విధానంలో యుద్ధం తప్ప మరేదైనా మార్గం వుండగలదా?

---

* "The Journal of the Royal Statistical Society" ("రాయల్ స్టాటిస్టికల్ సొసైటీ పత్రిక"), జూలై 1914 సంచికలో పేజి 777 మొదలుకొని తదుపరి పేజీలలో Edgar Crammond, *The Economic Relations of the British and German Empires* ("బ్రిటిష్, జర్మన్ సామ్రాజ్యాల ఆర్థిక సంబంధాలు") అనే వ్యాసంతో సరిపోల్చిచూడవగును.

# 8. పెట్టుబడిదారీ విధానపు పరభాగ్యోప జీవనమూ, క్షైణ్యమూ

యిప్పుడు సామ్రాజ్యవాదంయొక్క మరొక అతిముఖ్యమైన పార్శ్వాన్ని పరిశీలించాలి. యీ విషయంమీద జరిగే చర్చలు చాల వాటిలో మామూలుగా దీనికి లభించవలసినంత ప్రాముఖ్యం లభించడం లేదు. మార్క్సిస్టు హిల్ఫెర్‌డింగ్ లోపాలలో ఒకటి యేమిటంటే అతను మార్క్సిస్టు కాని హాబ్సన్‌కంటె ఒక అడుగు వెనక్కి వేశాడు. సామ్రాజ్యవాద సహజ లక్షణమైన పరభాగ్యోప స్వభావమని నా ఉద్దేశం.

మనం యింతకుముందే తెలుసుకున్నట్లు, గుత్తాధిపత్యం అనేది సామ్రాజ్యవాదానికి అత్యంత లోతైన పునాది. యిది పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం, అనగా పెట్టుబడిదారీ విధానంనుండి ఉద్భవించి, విక్రయ వస్తు ఉత్పత్తి, పోటీ అనే సాధారణ పెట్టుబడిదారీ పరిసరాలలో వుంటూ, ఆ సాధారణ పరిసరాలతో శాశ్వతమైన, పరిష్కార సాధ్యం కాని వైరుధ్యం గల గుత్తాధిపత్యం. ఐనప్పటికీ, గుత్తాధిపత్యాలన్నిటిలాగే అది అనివార్యంగా జడత్వానికీ, క్షీణత్వానికీ ఆభిముఖ్యాన్ని సృష్టిస్తుంది. తాత్కాలికంగా గుత్త ధరలు అయినా, నెలకొల్పబడుతాయి గనుక, సాంకేతిక ప్రగతికీ, తత్ఫలితంగా సర్వప్రగతికీ, చోదక కారణం కొంతవరకు అదృశ్యమై, దానితోబాటు, సాంకేతిక ప్రగతిని ఉద్దేశపూర్వకంగా మందగింపజేసే ఆర్థిక అవకాశం ఉత్పన్నమౌతుంది. ఉదాహరణకు, అమెరికాలో ఓవెన్స్ అనే అతను సీసాల ఉత్పత్తిలో విప్లవం తెచ్చే యంత్రం ఒకటి సృష్టించినాడు. సీసాల ఉత్పత్తి చేసే జర్మన్ కార్టెల్ ఓవెన్స్ పేటెంటును కొని, ఉపయోగించకుండా గూట్లో పెట్టింది. పెట్టుబడిదారీ విధానంలో గుత్తాధిపత్యం పూర్తిగానూ, చాలా కాలంపాటూ ప్రపంచ మార్కెట్‌లో పోటీని తొలగించలేదు అనే మాట నిజమే (అన్నట్లు, అది సామ్రాజ్యవాద సిద్ధాంతం అర్థం లేనిది కావడానికి యిదీ ఒక కారణం). సాంకేతిక అభివృద్ధిని ప్రవేశపెట్టడం ద్వారా ఉత్పత్తి ఖర్చును తగ్గించి, లాభాలను పెంచే అవకాశం వుంది గనుక, యిది మార్పులకు అనుకూలంగా వుండడమూ నిజమే. కానీ, గుత్తాధిపత్యానికి విలక్షణ గుణం అయిన జడత్వానికీ, క్షీణత్వానికీ ఆభిముఖ్యం (tendency) పని చేస్తూ వుండి, కొన్ని పరిశ్రమ శాఖల్లో, కొన్ని దేశాల్లో, కొంత కాలంపాటు పైచేయిని సంపాదించుకుంటుంది.

అతి విస్తారమైన, లేదా సంపన్నమైన, లేదా మంచి స్థానంలో వున్న వలసమీద గుత్త యాజమాన్యం యిదే ధోరణిలో పని చేస్తుంది.

పైగా, సామ్రాజ్యవాదం అంటే కొద్ది దేశాల్లో బ్రహ్మాండంగా పోగుపడిన పెట్టుబడి; మనం యింతకుముందే చూసినట్లు, సెక్యూరిటీల రూపంలో 10, 15 వేల కోట్ల ఫ్రాంకుల మొత్తం వుంటుంది. కనుక వడ్డీజీవుల (rentiers) అనే ఒక వర్గం, ఒక సాంఘిక పొర, అసాధారణంగా పెరిగింది, అనగా "కూపన్లు చించి" బతికేవాళ్లు, యే పనీ చేయకుండా సోమరితనం వృత్తిగా గలవాళ్లు. పెట్టుబడి యెగుమతి, సామ్రాజ్య వాదపు అత్యంత ముఖ్య ఆర్థిక ఆధారాల్లో ఒకటి, వడ్డీజీవులను ఉత్పత్తినుండి యింకా పూర్తిగా వేరుపరిచి, అనేక యితర దేశాల శ్రమనూ, వలసల శ్రమనూ దోపిడీ చేసి బతికే దేశాన్ని మొత్తంగా పరభాగ్యోప జీవిగా స్థిరపరుస్తుంది.

"1893లో విదేశాల్లో వుండిన బ్రిటిష్ పెట్టుబడి మొత్తం బ్రిటన్ సంపదలో సుమారు 15 శాతం వుంటుంది"* అని హాబ్సన్ అన్నాడు. 1915 నాటికి యీ పెట్టుబడి సుమారు రెండున్నర రెట్లు పెరిగిందని పాఠకుడు జ్ఞాపకం చేసుకోవాలి. హాబ్సన్ యింకా యిలా అన్నాడు: "పన్నులు చెల్లించే పౌరులమీద యింత భారంగా వుంటూ, ఉత్పత్తి దారునికీ, వర్తకునికీ బొత్తిగా ఉపయోగం లేని యీ దురాక్రమణశీల సామ్రాజ్యవాదం.... పెట్టుబడి పెట్టేవానికి చాలా లాభదాయకం".... (ఇంగ్లీషులో వాన్ని "investor" — అనగా మదుపుదారు — అంటారు.) "గ్రేట్ బ్రిటన్‌కు మొత్తం తన విదేశ వర్తకం ద్వారా, వలస వర్తకం ద్వారా (యెగుమతులూ, దిగుమతులూ కలిసి) కమిషన్‌ల రూపంలో వచ్చే సాలుసరి ఆదాయం 1899లో 180 లక్షల పౌనులు (సుమారు 17 కోట్ల రూబుళ్లు) వుంటుందని — 80 కోట్ల టర్నోవర్‌మీద రెండున్నర శాతం లెక్కన — సర్ ఆర్. గిఫ్ఫెన్ అంచనా వేసినాడు." యీ మొత్తం గొప్పదే ఐనా, గ్రేట్ బ్రిటన్‌యొక్క దురాక్రమణశీల సామ్రాజ్యవాదాన్ని వివరించలేదు. "పెట్టుబడిగా పెట్టబడిన" డబ్బునుండి వచ్చే 9, 10 కోట్ల పౌనుల ఆదాయం, వడ్డీజీవుల ఆదాయం, దాన్ని వివరిస్తుంది.

ప్రపంచంలోకెల్ల గొప్ప "వర్తక" దేశంయొక్క విదేశ వర్తకంనుండి వచ్చే ఆదాయం కంటె వడ్డీజీవుల ఆదాయం ఐదు రెట్లు యెక్కువ! యిది సామ్రాజ్యవాదంయొక్క, సామ్రాజ్యవాదపు పరభాగ్యోప స్వభావపు సారం.

యీ కారణంవల్లనే, సామ్రాజ్యవాదం గురించి చర్చించే ఆర్థిక సాహిత్యంలో "వడ్డీ జీవి రాజ్యం" (Rentnerstaat) అనే మాట వాడుకలోకి వస్తున్నది. ప్రపంచ మంతా కొద్ది వడ్డీజీవి రాజ్యాలుగానూ, అత్యధిక మెజారిటీ రుణగ్రస్త రాజ్యాలుగానూ విభజితమైపోయింది. "విదేశ పెట్టుబడుల పట్టీలో మొదట వచ్చేవి రాజకీయంగా పరా

---

* Hobson, పూర్వోక్త గ్రంథం, పేజీలు 59, 62.

ధీన దేశాలు, లేక అలాంటి దేశాలు: ఈజిప్టుకూ, జపాన్‌కూ, చైనాకూ, దక్షిణ అమెరికాకూ గ్రేట్ బ్రిటన్ రుణాలు యిస్తుంది. అవసరమైనప్పుడు దాని నౌకా దళం డబ్బు వసూలు చేసే ఏజెంటుగా పనిచేస్తుంది. రుణస్తుల ఆగ్రహంనుండి బ్రిటన్‌ను దాని రాజకీయ బలం కాపాడుతుంది"* అని షుల్జె-గేవెర్నిట్జ్ అన్నాడు. "విదేశ పెట్టుబడుల జాతీయ ఆర్థిక విధానం" అనే పుస్తకంలో సార్టోరియుస్ ఫన్ వాల్టెర్స్‌హౌసెన్ హాలండును ఆదర్శ "వడ్డీ జీవి రాజ్యం"గా పేర్కొని, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సులు అలాంటివే ఔతున్నాయని అన్నాడు.** షిల్డెర్ అభిప్రాయంలో ఐదు పారిశ్రామిక రాజ్యాలు "ప్రముఖంగా రుణదాత దేశాలు" ఐనాయి: గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, బెల్జియం, స్విట్జర్లండు. యీ పట్టీలో అతను హాలండును యెందుకు చేర్చలేదంటే, అది "పారిశ్రామికంగా అభివృద్ధి కాలేదు"*** గనుకనే. అమెరికా సంయుక్త రాష్ట్రాలు అమెరికన్ దేశాలకు మాత్రమే రుణదాత.

షుల్జె-గేవెర్నిట్జ్ యిలా అన్నాడు: "గ్రేట్ బ్రిటన్ క్రమంగా పారిశ్రామిక రాజ్యం నుండి రుణదాత రాజ్యంగా మారుతున్నది. పారిశ్రామిక ఉత్పత్తిలోనూ, పారిశ్రామిక సరుకుల యెగుమతిలోనూ మొత్తంలో పెరుగుదల వున్నప్పటికీ, మొత్తం జాతీయ ఆర్థిక వ్యవస్థలో వడ్డీలనుండీ, డివిడెండ్లనుండీ, సెక్యూరిటీలనుండీ, కమిషన్‌లనుండీ, చట్టావ్యాపారంనుండీ వచ్చే ఆదాయపు ప్రాముఖ్యం పెరుగుతున్నది. నా అభిప్రాయంలో, సామ్రాజ్యవాద ఆరోహణకు ఆర్థిక ప్రాతిపదిక సరిగ్గా యిదే. అమ్మేవానికీ, కొనేవానికీ గల సంబంధం కంటె రుణదాతకూ, రుణగ్రస్తునికీ గల సంబంధం యింకా దృఢంగా వుంటుంది."**** జర్మనీని గురించి "ది బాంక్" అనే బెర్లిన్ పత్రిక ప్రచురణకర్త ఏ. లాన్స్‌బుర్గ 1911లో, "జర్మనీ – ఒక వడ్డీజీవి రాజ్యం" అనే వ్యాసంలో యిలా రాసినాడు: "వడ్డీజీవులుగా మారాలని ఫ్రెంచి ప్రజలలో వుండే కాంక్షను జర్మన్ ప్రజలు యీసడించడానికి సిద్ధంగా వున్నారు. కానీ, బూర్జువావర్గానికి సంబంధించినంతవరకు జర్మనీ పరిస్థితి కూడా ఫ్రాన్సు పరిస్థితిలాగే అంతకంతకూ తయారౌతున్నదని వాళ్లు మరిచిపోతున్నారు."*****

---

* Schulze-Gaevernitz, *Britischer Imperialismus* ("బ్రిటిష్ సామ్రాజ్యవాదం"), S. 320, తదితర పేజీలు.

** Sartorius von Waltershausen, *Das Volkswirtschaftliche System etc.*, B., 1907, Buch IV.

*** Schilder, పూర్వోక్త గ్రంథం, పేజి 393.

**** Schulze-Gaevernitz, *Britischer Imperialismus*, S. 122.

***** "Die Bank," 1911, I, SS. 10—11.

వడ్డీజీవి రాజ్యం అనేది పరభాగ్యోప స్వభావంగల క్షీణముఖం పట్టిన పెట్టుబడిదారీ రాజ్యం. యీ గుణం సాధారణంగా యిలాంటి రాజ్యాల సకల సాంఘిక, రాజకీయ పరిస్థితులనూ, ప్రత్యేకంగా కార్మికవర్గ ఉద్యమంలో వున్న రెండు మౌలిక ధోరణులనూ ప్రభావితం చేయకుండా వుండదు. యీ విషయాన్ని అత్యంత స్పష్టంగా నిరూపించడానికి హాబ్సన్ మాటలు ఉల్లేఖిస్తాను. హాబ్సన్ అత్యంత "విశ్వసనీయమైన" సాక్షి. యెందుకంటే అతను "మార్క్సిస్టు ఛాందసత్వానికి" అనుకూలమని అనుమానించడానికి వీలు లేదు; పైగా, వలసలలోనూ, ఫైనాన్స్ పెట్టుబడిలోనూ, సామ్రాజ్యవాద అనుభవంలోనూ అత్యంత సంపన్నమైన యింగ్లండులోని పరిస్థితులతో బాగా పరిచయం వున్న యింగ్లీషువాడు అతను.

ఆంగ్లో-బోయర్ల యుద్ధం తన స్మృతిలో యింకా పచ్చగా వున్న హాబ్సన్ సామ్రాజ్యవాదానికీ "ఫైనాన్స్ పెట్టుబడిదార్ల" ప్రయోజనాలకూ గల సంబంధమూ, కాంట్రాక్టుల నుండి వచ్చే లాభాల పెరుగుదలా, వగైరాలను వర్ణించి యిలా రాసినాడు: "యీ అసందిగ్ధమైన పరభాగ్యోప జీవన విధానపు నిర్వాహకులు పెట్టుబడిదార్లు కాగా, యివే ఉద్దేశాలు కార్మికుల్లో కొన్ని ప్రత్యేక వర్గాలను ఆకర్షిస్తాయి. అనేక పట్టణాల్లో అతి ముఖ్యమైన పరిశ్రమలు ప్రభుత్వ యాజమాన్యంమీదగానీ, ప్రభుత్వ కాంట్రాక్టులమీదగానీ ఆధారపడి వున్నాయి. లోహ కేంద్రాల్లోనూ, నౌకా నిర్మాణ కేంద్రాల్లోనూ వుండే సామ్రాజ్యవాదానికి యీ వాస్తవం చాలా ముఖ్యమైన కారణం." యీ రచయిత అభిప్రాయంలో పాత సామ్రాజ్యాలను బలహీనపరచిన కారణాలు రెండు: 1) "ఆర్థిక పరభాగ్యోప జీవనం," 2) అధీన ప్రజలతో సైన్యాల ఏర్పాటు. "మొదటిది ఆర్థిక పరభాగ్యోప జీవనపు అలవాటు. దీని ద్వారా పాలక రాజ్యం తన పాలకవర్గాన్ని సంపన్నం చేసుకోడానికీ, కింది వర్గాలను లంచంతో లోబరుచుకోడానికీ తన రాష్ట్రాలనూ, వలసలనూ, అధీన ప్రాంతాలనూ ఉపయోగించింది." దీని కొక మాట చేర్చాలి: లంచం యే రూపంలో వున్నా, అలాంటి లంచం యివ్వడానికి ఆర్థిక అవకాశం వుండాలంటే, పెద్ద యెత్తున గుత్త లాభాలు వుండాలి.

రెండవ కారణం గురించి హాబ్సన్ యిలా రాస్తాడు: "సామ్రాజ్యవాదపు గుడ్డితనానికి ఒక మహా చిత్రమైన చిహ్నం యేమిటంటే, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సు, తదితర సామ్రాజ్యవాద దేశాలు విపరీతమైన నిర్లక్ష్యంతో యీ ప్రమాదకరమైన పరాధీనతా మార్గాన్ని చేపట్టడం. యీ విషయంలో గ్రేట్ బ్రిటన్ అన్నిటికంటె దూరం పోయింది. మనకు మన భారత సామ్రాజ్యాన్ని జయించి యిచ్చిన యుద్ధంలో అత్యధిక భాగం భారతీయులే చేసినారు. భారత దేశంలోనూ, యిటీవల ఈజిప్టులోనూ బ్రిటిష్ కమాండర్లకింద గొప్ప స్థాయీ సైన్యాలు వున్నాయి. మన ఆఫ్రికన్ వలసలకు సంబంధించిన యుద్ధమంతా, దక్షిణ భాగంలో తప్ప, ఆదివాసులే మన తరఫున చేసినారు."

చైనా విభజన జరిగితే కలిగే ఆర్థిక ఫలితాలను హాబ్సన్ యిలా అంచనా వేస్తాడు: "అప్పుడు పశ్చిమ యూరప్‌లో మెజారిటీ భాగానికి యిప్పటికే దక్షిణ యింగ్లండుకూ, రివియేరాకూ, యిటలీ, స్విట్జర్లండులలోని విలాస యాత్రికుల కేంద్రాలకూ, నివాసగృహాల ప్రాంతాలకూ వుండే స్వరూపమూ, స్వభావమూ రావచ్చు. అనగా, దూరప్రాచ్యంనుండి డివిడెండ్లూ, పెన్షన్లూ పొందే ధనిక ప్రభువుల చిన్నచిన్న బృందాలు వుంటాయి; వాళ్లకు సేవలు చేయడానికి కాస్త పెద్ద బృందం ఉద్యోగులు, దానికంటె ఇంకా పెద్ద బృందం గృహ పరిచారకులూ, రవాణా కార్మికులూ, సగం తయారైన వస్తువులకు తుది రూపం యిచ్చే కార్మికులూ వుంటారు. ప్రాణప్రదమైన ముఖ్య పరిశ్రమలన్నీ అదృశ్యమై వుంటాయి; ముఖ్య ఆహారపదార్థాలూ, పారిశ్రామిక వస్తువులూ ఆసియానుండీ, ఆఫ్రికానుండీ కప్పంగా వస్తాయి." "పశ్చిమ రాజ్యాలు యింకా పెద్ద కూటమిగా, గొప్ప రాజ్యాల యూరపియన్ ఫెడరేషన్‌గా యేర్పడే అవకాశం వుంది. యీ ఫెడరేషన్ ప్రపంచ నాగరికతను ముందుకు తీసుకపోవడానికి బదులు పాశ్చాత్య పరభాగ్యోప జీవనం అనే బ్రహ్మాండమైన ప్రమాదాన్ని ప్రవేశపెట్టవచ్చు. పురోగామి పారిశ్రామిక దేశాలు ఒక బృందంగా యేర్పడతాయి; ఆ దేశాల పైవర్గాలు ఆసియానుండీ, ఆఫ్రికానుండీ అపారమైన కప్పం తెచ్చుకుంటాయి; ఆ కప్పంతో ఆ వర్గాల వాళ్లు విధేయులైన సేవకుల సమూహాలను పోషిస్తారు; ఆ సేవకులు వ్యవసాయంలోగానీ, పరిశ్రమల్లోగానీ ప్రధాన ఉత్పత్తి శాఖల్లో పనిచేయరు; వ్యక్తిగత సేవలోనో, అల్ప పారిశ్రామిక శాఖల్లోనో పనిచేస్తూ, ఒక కొత్త ఫైనాన్స్ పెట్టుబడి ప్రభువర్గపు అధీనంలో వుంటారు. యీ సిద్ధాంతాన్ని" (యీ భవిష్యదవకాశాన్ని, అంటే బాగుంటుంది) "పరిశీలనార్హం కాదని నిరసించే వాళ్లు దక్షిణ యింగ్లండులోని యిప్పటికే యీ పరిస్థితికి దిగజారిన జిల్లాల ఆర్థిక, సాంఘిక పరిస్థితిని పరిశీలించాలి. చైనాను అలాంటి ఫైనాన్స్ పెట్టుబడిదార్ల బృందాల, రాజకీయ, వర్తక ఉద్యోగుల ఆర్థిక అదుపులోకి తెచ్చుకుని, యూరప్‌లో ఖర్చు పెట్టేందుకుగాను ప్రపంచంలో కనివిని యెరుగని గొప్ప లాభాలను యివ్వగల వ్యవస్థ ఎంతగా విస్తరించగలదో వాళ్లు ఆలోచించాలి. యీనాటి పరిస్థితి జటిలంగా వున్నందున, ప్రపంచ శక్తుల వర్తనను అంచనా వేయడానికి సాధ్యం కానందున భవిష్యత్తు యిలా వుంటుందని గానీ, అలా వుంటుందని గానీ భాష్యంచెప్పడం అసాధ్యం అవుతోంది. కానీ, యీనాటి పశ్చిమ యూరప్‌యొక్క సామ్రాజ్యవాదాన్ని పాలించే ప్రభావాలు యీ దిశలో పయనిస్తున్నాయి. వీటిని ప్రతిఘటిస్తేనో, పక్కదారి పట్టిస్తేనో తప్ప యిలాంటి పర్యవసానమే యేదో యేర్పడుతుంది."*

---

* Hobson, పూర్వోక్త గ్రంథం, పేజీలు 103, 144, 205, 335, 386.

యీ రచయిత చెప్పింది నూటికి నూరు పాళ్లూ నిజం: సామ్రాజ్యవాద శక్తులు ప్రతిఘటింపబడి వుండకపోతే, అవి సరిగ్గా అతను వర్ణించిన స్థితికే దారితీసి వుండేవి. ప్రస్తుత సామ్రాజ్యవాద దశలో "యూరప్ సంయుక్త రాష్ట్రాల" ప్రాముఖ్యం సరిగా అంచనా వేయబడింది. కానీ అతను మరొకటి కూడా చెప్పి వుండవలసింది: కార్మికవర్గ ఉద్యమంలోపల కూడా అత్యధిక దేశాల్లో ప్రస్తుతానికి విజేతలైన అవకాశవాదులు క్రమ బద్ధంగా, ఏకాగ్రచిత్తంతో యిదే దిశలో "కృషి చేస్తున్నారు." సామ్రాజ్యవాదం, అనగా ప్రపంచ పంపకమూ, చైనాతోపాటు యితర దేశాలను దోచుకోవడమూ, అనగా కొద్ది అతిధనిక దేశాలకు గొప్ప గుత్త లాభాలు, కార్మికవర్గంలోని పైపొరకు లంచం యివ్వడానికి ఆర్థిక అవకాశం సృష్టించి, తద్వారా అవకాశవాదాన్ని పోషించి, రూపు దిద్ది, బలపరుస్తుంది. కానీ, సామ్రాజ్యవాదాన్ని సాధారణంగానూ, అవకాశవాదాన్ని ప్రత్యేకంగానూ ప్రతిఘటించే శక్తులను మనం కనుదప్పిపోనివ్వకూడదు; సోషల్ ఉదారవాది ఐన హాబ్సన్, సహజంగానే, వాటిని గమనించలేదు.

సామ్రాజ్యవాదాన్ని సమర్థించినందుకు పార్టీనుండి బహిష్కరింపబడిన జర్మన్ అవ కాశవాది గెర్‌హార్డ్ హిల్డెబ్రాన్డ్, యీనాడు జర్మనీ దేశపు "సోషల్ డెమొక్రటిక్" అన బడే పార్టీకి నాయకుడు కాగలిగినవాడు, హాబ్సన్‌ను పూరిస్తాడు. అతను (రష్యా మినహా) "పశ్చిమ యూరప్ సంయుక్త రాష్ట్రాలు" కావాలంటాడు; యెందుకంటే, ఆఫ్రికన్ నీగ్రోలకు వ్యతిరేకంగానూ, "మహా ఇస్లామిక్ ఉద్యమా"నికి వ్యతిరేకంగానూ "సంయుక్త" చర్యకొరకూ, "చైనా-జపాన్ కూటమి"కి వ్యతిరేకంగా "బలీయమైన సైన్యాన్ని, నౌకా దళాన్ని" పోషించడానికీ,* వగైరా.

షుల్జె-గేవెర్నిట్జ్ పుస్తకంలో వర్ణింపబడిన "బ్రిటిష్ సామ్రాజ్యవాదా"నికి కూడా యివే పరభాగ్యోప జీవన లక్షణాలు వున్నాయి. 1865 నాటినుండి 1898 నాటికి గ్రేట్ బ్రిటన్ జాతీయ ఆదాయం దాదాపు రెండింత లయింది; కానీ, అదే కాలంలో "విదేశాల నుండి" వచ్చే ఆదాయం తొమ్మిదిరెట్లు అయింది. "నీగ్రోలకు పారిశ్రామిక అలవాట్లలో శిక్షణ యివ్వడం" (బలవంతం లేకుండా కాదనుకోండి...) సామ్రాజ్యవాదపు "సద్గుణం" కాగా, సామ్రాజ్యవాదంవల్ల "ప్రమాదం" యెక్కడుందంటే, "యూరప్ శరీరశ్రమ భారాన్ని – మొదట వ్యవసాయంలోనూ, గనుల్లోనూ వుండే పనినీ, తరువాత పరిశ్రమల్లో

---

* Gerhard Hildebrand, *Die Erschütterung der Industrieherrschaft und des Industriesozialismus* ("పారిశ్రామిక రాజ్యంయొక్క, పారిశ్రామిక సోషలిజంయొక్క క్షోభ"), 1910, S. 229, తరువాతి పేజీలు.

మోటు పనినీ – రంగుజాతులమీదికి తోసేసి, తాను వడ్డీజీవి పాత్రతో తృప్తి పడుతుంది; తద్వారా, రంగుజాతుల ఆర్థిక విమోచనకూ, తరువాత రాజకీయ విమోచనకూ దారితీయవచ్చు."

గ్రేట్ బ్రిటన్‌లో అంతకంతకూ యెక్కువ భూమి వ్యవసాయంనుండి తొలగించబడి, క్రీడలకు, ధనికుల వినోదానికి వినియోగింపబడుతున్నది. ప్రపంచంలోకెల్ల అగ్రవర్గ క్రీడా స్థలం ఐన స్కాట్లండును గురించి "అది తన గతంమీదా, మిస్టర్ కార్నేజిమీదా (అమెరికన్ కోటీశ్వరుడు) బతుకుతున్నది" అంటారు. గుర్రపు పందేలమీదా, గుంట నక్కల వేటమీదా మాత్రమే బ్రిటన్ యేటా 140 లక్షల పౌనులు (సుమారు 13 కోట్ల రూబుళ్లు) ఖర్చుపెడుతుంది. యింగ్లండులో వడ్డీజీవుల సంఖ్య సుమారు 10 లక్షలు. మొత్తం జనసంఖ్యలో ఉత్పత్తి రంగంలో పనిచేసేవాళ్ల శాతం తగ్గిపోతున్నది:

| సంవత్సరం | జనసంఖ్య (లక్షలు) | మౌలిక పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య (లక్షలు) | మొత్తం జనసంఖ్యలో శాతం |
|---|---|---|---|
| 1851 | 179 | 41 | 23% |
| 1901 | 325 | 49 | 15% |

"20వ శతాబ్ది ప్రారంభంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం" అనే విషయాన్ని పరిశీలించే బూర్జువా పరిశీలకుడు, బ్రిటిష్ కార్మికవర్గం గురించి మాట్లాడేటప్పుడు, కార్మికులలోని "పైపొర"నూ, "కచ్చితమైన కార్మికవర్గపు కిందిపొర"నూ క్రమబద్ధంగా వేరు చేసి చూడాలి. సహకార సంఘాల సభ్యుల్లోనూ, ట్రేడ్‌యూనియన్ల సభ్యుల్లోనూ, క్రీడా సంఘాల సభ్యుల్లోనూ, అనేక మత శాఖల సభ్యుల్లోనూ అత్యధిక భాగం పైపొర ఔతారు. దాని స్థాయికి వోటింగు వ్యవస్థ తగినట్టుగా వుంది; అది "కచ్చితమైన కార్మికవర్గపు కిందిపొరను వెలిగా వుంచేటట్లుగా పరిమితం చేయబడింది"!! బ్రిటిష్ కార్మికవర్గ పరిస్థితిని మెరుగ్గా చిత్రించడానికి కార్మికవర్గంలో మైనారిటీ అయిన యీ పైపొరను గురించి మాత్రమే సాధారణంగా మాట్లాడుతారు. ఉదాహరణకు: "నిరుద్యోగ సమస్య ప్రధానంగా లండన్ నగరానికీ, కార్మికవర్గపు కిందిపొరకూ సంబంధించిన సమస్య. దీనికి రాజకీయవాదులు యేమీ ప్రాముఖ్యం యివ్వరు...."* బూర్జువా రాజకీయవాదులూ, "సోషలిస్టు" అవకాశవాదులూ యేమీ ప్రాముఖ్యం యివ్వరు అని అతను అనివుండవలసింది.

---

* Schulze-Gaevernitz, *Britischer Imperialismus*, S. 301.

సామ్రాజ్యవాద ప్రత్యేక లక్షణాల్లో ఒకటి – మనం చర్చించే విషయాలకు సంబంధించింది – యేమిటంటే, సామ్రాజ్యవాద దేశాలనుండి విదేశాలకు వెళ్లిపోయ్యేవాళ్ల సంఖ్య తగ్గడమూ, వేతనాలు తక్కువగా వున్న మరీ వెనుకబడిన దేశాలనుండి సామ్రాజ్యవాద దేశాలకు వచ్చేవాళ్ల సంఖ్య పెరగడమూ. హాబ్సన్ అన్నట్లు, గ్రేట్ బ్రిటన్‌నుండి విదేశ గమనం (emigration) 1884నుండి తగ్గిపోతున్నది: ఆ సంవత్సరంలో విదేశ గాముల సంఖ్య 2,42,000 వుండింది; 1900లో 1,69,000. జర్మనీనుండి విదేశ గమనం 1881కీ 1890కీ మధ్య కాలంలో అత్యున్నత స్థాయిలో వుండింది: ఆ దశాబ్దపు సంఖ్య 14,53,000. తరువాతి రెండు దశాబ్దుల్లో అది 5,44,000కూ, 3,41,000కూ పడిపోయింది. మరోవైపున ఆస్ట్రియా, ఇటలీ, రష్యా మొదలైన దేశాలనుండి జర్మనీకి వచ్చే కార్మికుల సంఖ్య పెరిగింది. 1907 జనాభా లెక్క ప్రకారం జర్మనీలో 13,42,294మంది విదేశీయులు వుండినారు; అందులో 4,40,800మంది పారిశ్రామిక కార్మికులు, 2,57,329మంది వ్యవసాయ కార్మికులు.* ఫ్రాన్సులో గనుల పరిశ్రమలో పనిచేసే కార్మికుల్లో "పెద్ద భాగం" విదేశీయులు: పోలులూ, యిటాలియన్లూ, స్పానియర్డులూ.** అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో, తూర్పు యూరప్‌నుండీ, దక్షిణ యూరప్‌నుండీ వచ్చినవాళ్లు అత్యంత హీన వేతనాలు గల వృత్తుల్లో వున్నారు; ఓవర్‌సీర్లలోనూ, మంచి వేతనాలు గల వృత్తుల్లోనూ అందరికంటె యెక్కువ శాతం అమెరికన్ కార్మికులది.*** సామ్రాజ్యవాదం కార్మికుల్లో కూడా అధిక హక్కులు గల వర్గాలను సృష్టించడానికీ, వాళ్లను కార్మిక జనసామాన్యంనుండి వేరు పరచడానికీ అభిముఖంగా వుంటుంది.

కార్మికులను చీల్చడానికీ, వాళ్లలో అవకాశవాదాన్ని బలపరచడానికీ, కార్మికోద్యమంలో తాత్కాలిక క్షీణతను కలిగించడానికీ సామ్రాజ్యవాదానికి గల ఆభిముఖ్యం 19వ శతాబ్ది అంతమై 20వ శతాబ్ది ప్రారంభమైన కాలంకంటె చాలా ముందుగానే గ్రేట్ బ్రిటన్‌లో కనపడింది. 19వ శతాబ్దపు మధ్యకాలంలోనే గ్రేట్ బ్రిటన్‌లో సామ్రాజ్యవాదపు రెండు ముఖ్యమైన విశిష్ట లక్షణాలు కనపడినాయి – విస్తారమైన వలసలూ, ప్రపంచ మార్కెట్‌లో

---

* *Statistik des Deutschen Reichs* ("జర్మన్ సామ్రాజ్య గణాంక వివరణ"), Bd. 211.

** Henger, *Die Kapitalsanlage der Franzosen* ("ఫ్రెంచిదేశస్థుల పెట్టుబడి నియోజన"), St., 1913.

*** Hourwich, *Immigration and Labour* ("విదేశీయ అగమనం, శ్రమ"), N.Y., 1913.

గుత్త స్థానమూ. బ్రిటిష్ పెట్టుబడిదారీ విధానపు సామ్రాజ్యవాద లక్షణాలకూ, కార్మిక వర్గంలోని అవకాశవాదానికీ అనేక దశాబ్దాలుగా క్రమబద్ధమైన సంబంధం వున్నట్లు మార్క్సు, ఎంగెల్సులు గుర్తించినారు. ఉదాహరణకు 1858 అక్టోబర్ 7న మార్క్సుకు ఎంగెల్సు యిలా రాసినాడు: "యింగ్లీషు కార్మికవర్గం అంతకంతకూ వాస్తవంగా బూర్జువా ఔతు న్నది. అందువలన అన్ని జాతులకంటె బూర్జువా ఐన యీ జాతి చివరకు బూర్జువా వర్గంతోపాటు బూర్జువా ప్రభువర్గాన్నీ, బూర్జువా కార్మికవర్గాన్నీ కలిగివుండడానికి ప్రయ త్నిస్తున్నట్లు కనపడుతుంది. ప్రపంచ మంతటినీ దోచుకునే జాతికి యిది కొంతవరకు సమర్థనీయమే." దాదాపు పాతిక శతాబ్దం తర్వాత, 1881 ఆగస్టు 11న రాసిన జాబులో "బూర్జువావర్గానికి అమ్ముడువోయిన, లేదా కనీసం బూర్జువావర్గంతో డబ్బు తీసుకుం టున్న వాళ్ల నాయకత్వాన్ని అంగీకరించే అధమ యింగ్లీషు ట్రేడ్‌యూనియన్ల"ను ఎంగెల్సు ప్రస్తావించినాడు. 1882 సెప్టెంబర్ 12న కౌట్స్కీకి రాసిన ఉత్తరంలో ఎంగెల్సు యిలా అన్నాడు: "వలస విధానం గురించి యింగ్లీషు కార్మికులు యేమనుకొనేదీ మీరు నన్నడిగినారు. వాళ్లు సాధారణంగా రాజకీయాల గురించి అనుకునేదే, వలస విధానం గురించి కూడా అనుకుంటారు. యిక్కడ కార్మికుల పార్టీ అనేది లేదు; వున్నది యథాస్థితివాద (కన్సర్వేటివ్) పార్టీ వాళ్లూ, లిబరల్ పార్టీ వాళ్లూ. వలసలమీదా, ప్రపంచ మార్కెట్‌మీదా యింగ్లండుకు గల గుత్తాధిపత్యం అనే విందు భోజనంలో కార్మికులు ఆనందంగా పాలుపం చుకుంటున్నారు."* (1892లో వెలువడిన "యింగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" అనే గ్రంథం రెండవ కూర్పుకు రాసిన ముందు మాటలో ఎంగెల్సు యివే అభిప్రాయాలు అచ్చులో వెలువరించినాడు.)

కారణాలూ, ఫలితాలూ ఇక్కడ స్పష్టంగా చూపబడినాయి. కారణాలు యివి: 1) మొత్తం ప్రపంచాన్ని యీ దేశం దోచుకోవడం; 2) ప్రపంచ మార్కెట్‌లో దీని గుత్త స్థానం; 3) వలసలమీద దీని గుత్తాధిపత్యం. ఫలితాలు యివి: 1) బ్రిటిష్ కార్మికవర్గంలో ఒక భాగం బూర్జువా కావడం; 2) బూర్జువావర్గానికి అమ్ముడువోయిన, లేదా కనీసం దానితో డబ్బు తీసుకుంటున్న వాళ్ల నాయకత్వాన్ని కార్మికవర్గంలో ఒక భాగం అంగీకరించడం. 20వ శతాబ్ది ప్రారంభంనాటి సామ్రాజ్యవాదం మొత్తం ప్రపంచాన్ని కొద్ది దేశాల మధ్య

---

* *Briefwechsel von Marx und Engels* ("మార్క్సు, ఎంగెల్సుల ఉత్తరప్రత్యు త్తరాలు"), Bd. II, S. 290; IV, 433. K. Kautsky, *Sozialismus und Kolonialpolitik* ("సోషలిజమూ, వలస విధాన రాజనీతీ"), Berlin, 1907, S. 79; ఈ పుస్తకాన్ని కౌట్స్కీ తానింకా మార్క్సిస్టుగా వుండిన ఆ పురాతనపు కాలంలో రాసినాడు.

పంచివేసింది. వాటిలో ప్రతి వొకటీ యీనాడు మొత్తం ప్రపంచంలో ఒక భాగాన్ని, 1858లో యింగ్లండు దోపిడీచేసిన విస్తీర్ణంకంటె కొంచెం మాత్రమే చిన్నదైన భాగాన్ని, దోపిడీ చేస్తున్నది (అనగా అమిత లాభాలు గడిస్తోంది); ప్రతి వొకదానికీ ట్రస్టులూ, కార్టెల్‌లూ, ఫైనాన్స్ పెట్టుబడీ, రుణదాత రుణగ్రహీతల సంబంధాలూ, వీటి మూలంగా ప్రపంచ మార్కెట్‌లో ఒక గుత్త స్థానం వుంది; ప్రతి వొకదానికీ యేదో ఒకమేరకు గుత్త వలసాధిపత్యం వుంది (750 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల మొత్తం వలస ప్రపంచంలో 650 లక్షల చదరపు కిలోమీటర్లు, అనగా 86 శాతం, ఆరు రాజ్యాలకింద వుంది; 610 లక్షల చదరపు కిలోమీటర్లు, అనగా 81 శాతం, మూడు రాజ్యాలకింద వుంది).

ప్రస్తుత పరిస్థితిలోని విలక్షణ గుణం యేమిటంటే అవకాశవాదానికీ కార్మికోద్యమంయొక్క సాధారణమైన, ప్రాణప్రదమైన ప్రయోజనాలకూ గల వైరుధ్యాన్ని తీవ్రతరం చేయక తప్పని ఆర్థిక రాజకీయ పరిస్థితుల ప్రాబల్యం: అండ దశనుండి యీనాటి ప్రబల వ్యవస్థగా సామ్రాజ్యవాదం పెరిగింది; ఆర్థిక విషయాల్లోనూ, రాజకీయాల్లోనూ పెట్టుబడిదారీ గుత్తసంస్థలు ప్రథమ స్థానం ఆక్రమించినాయి; ప్రపంచ విభజన పూర్తి అయింది; మరొకవైపున, గ్రేట్ బ్రిటన్‌కు గల ఏకైక గుత్తాధిపత్యానికి బదులు, యీ గుత్తాధిపత్యంలో భాగంకొరకు కొన్ని సామ్రాజ్యవాద రాజ్యాలు పోరాటం చేస్తున్నాయి, యీ పోరాటం 20వ శతాబ్ది ప్రారంభపు దశ కంతటికీ విలక్షణ గుణంగా వుంది. అవకాశవాదం 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో యింగ్లండులో లాగా, యిప్పుడు యే దేశంలోనూ అనేక దశాబ్దాల పాటు కార్మికోద్యమంలో సంపూర్ణంగా విజయవంతం కాలేదు; కానీ అనేక దేశాల్లో అది పక్వమై, అతి పక్వమై, కుళ్లిపోతూ, సోషల్ జాతీయ దురహంకారం* రూపంలో బూర్జువా విధానంతో లీనమైంది.

# 9. సామ్రాజ్యవాద పరిశీలన

సామ్రాజ్యవాద పరిశీలన అనగా దాని విస్తృతమైన అర్థంలో, సమాజంలోని వివిధ వర్గాల సాధారణ భావజాలం దృష్ట్యా, సామ్రాజ్యవాద విధానంపట్ల ఆ వర్గాల వైఖరి.

* పాత్రేసొవ్, ఛెన్‌కేలి, మాస్లొవ్‌గార్లూ వగైరాలు బాహాటంగా చెప్పి అనుసరించేదీ, ఛెయీద్జె, స్కొబెలెవ్, అక్సెల్‌రోడ్, మార్తొవ్‌గార్లూ వగైరాలు మౌనంగా అనుసరించేదీ, యీ రెండు రూపాలలోనూ వున్న రష్యన్ సోషల్ జాతీయ దురహంకారం కూడా రద్దువాదం అనబడే రష్యన్ రకం అవకాశవాదంనుండి ఉద్భవించింది.

ఒకవైపున, ఫైనాన్స్ పెట్టుబడి కొద్దిమంది చేతుల్లో బృహత్ పరిమాణంలో సాంద్రీకృతమైన యెలాంటి సంబంధ బాంధవ్యాల విస్తృత సాంద్ర సమాహారాన్ని సృష్టిం చిందంటే, యీ సమాహారం చిన్న పెట్టుబడిదార్లనూ, మధ్యరకం పెట్టుబడిదార్లనూ మాత్రమే కాక, చాలా చిన్న పెట్టుబడిదార్లనూ, చిన్న యజమానులనూ కూడా లోబరుచు కుంది. మరొకవైపున, ప్రపంచ విభజనకొరకూ, యితర దేశాలమీద ఆధిపత్యంకొరకూ ఒక జాతికి చెందిన ఫైనాన్స్ పెట్టుబడిదార్లు యితర జాతుల ఫైనాన్స్ పెట్టుబడిదార్ల బృందాలతో చేసే పోరాటం అంతకంతకూ తీవ్రమైంది. యీ రెండూ కలిసి ఆస్తిపర వర్గాలు సంపూర్ణంగా సామ్రాజ్యవాదంవైపు పోయేటట్లు చేస్తాయి. సామ్రాజ్యవాద భవి ష్యత్తును గురించి "సార్వత్రిక" ఉత్సాహమూ, దాన్ని ఆవేశపూరితంగా సమర్థించడమూ, మెరుగుగా చిత్రించడమూ — యివి యీ యుగానికి చిహ్నాలు. సామ్రాజ్యవాద భావజాలం కార్మికవర్గంలోకి కూడా చొరబడుతుంది. యితర వర్గాలనుండి దాన్ని వేరు చేసే చైనా గోడ యేదీ లేదు. యీనాటి జర్మన్ "సోషల్ డెమోక్రటిక్" అనబడే పార్టీ నాయ కులను "సోషల్ సామ్రాజ్యవాదులు" అని సముచితంగానే అన్నారు; అనగా మాటలలో సోషలిస్టులూ, చేతలలో సామ్రాజ్యవాదులూ అని. కానీ 1902 నాటికే యింగ్లండులో అవకాశవాద "ఫేబియన్ సొసైటీ"కి[149] చెందిన "ఫేబియన్ సామ్రాజ్యవాదు"లను హాబ్సన్ గుర్తించినాడు.

బూర్జువా విద్వాంసులూ, పత్రికా రచయితలూ మామూలుగా కొంత ప్రచ్ఛన్న రూపంలో సామ్రాజ్యవాదాన్ని సమర్థించడానికి పూనుకుంటారు. వాళ్లు దాని సంపూర్ణ ఆధిపత్యాన్నీ, ప్రగాఢమైన వేర్లనూ మరుగుపరిచి, ప్రాముఖ్యంలేని కొన్ని నిర్దిష్ట వివరా లను ముందుకు తోయడానికి ప్రయత్నించి, ట్రస్టులమీదా, బాంకులమీదా పోలీసు అజమా యిషీలాంటి కేవల పరిహాసాస్పదమైన "సంస్కరణ" పథకాల ద్వారా సారభూతమైన విష యాలనుండి దృష్టిని పక్కకు మళ్లించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. అంత తరు చుగా కాదు గానీ, సిగ్గుమాలిన, బాహాటమైన సామ్రాజ్యవాదులు ముందుకు వచ్చి, సామ్రాజ్య వాదపు మౌలిక లక్షణాలను సంస్కరించే అభిప్రాయం అర్థంలేని దని ధైర్యంగా చెప్తారు.

ఒక ఉదాహరణ యిస్తాను. "ప్రపంచ ఆర్థిక పురాపత్రాలు" అనే పత్రికలో జర్మన్ సామ్రాజ్యవాదులు వలసలలో జాతీయ విమోచనోద్యమాలను పరిశీలించ ప్రయత్నిస్తారు — ప్రత్యేకంగా, జర్మనీకి తప్ప మిగత రాజ్యాలకు చెందిన వలసల్లోనే అనుకోండి. భారతదేశం లోని అశాంతినీ, నిరసనోద్యమాలనూ, నెటాల్ (దక్షిణాఫ్రికా), డచ్చి ఈస్ట్ ఇండీస్, వగైరాల ఉద్యమాలనూ వాళ్లు గుర్తిస్తారు. వాళ్లలో ఒకరు, 1910 జూన్ 28–30 తేదీలలో జరి గినట్టి విదేశ పాలనకు లోనైన వివిధ ఆసియా, ఆఫ్రికా, యూరప్ జాతుల, ప్రజల ప్రతిని

ధుల మహాసభమీద వచ్చిన ఒక యింగ్లీషు వార్తమీద వ్యాఖ్యానిస్తూ, ఆ మహాసభలోని ఉప న్యాసాలను అంచనా వేస్తూ యిలా అన్నాడు: "సామ్రాజ్యవాదంతో పోరాడా లన్నారు. పాలిత ప్రజల స్వాతంత్ర్య హక్కును పాలక రాజ్యాలు గుర్తించాలనీ, గొప్ప రాజ్యాలకూ, బలహీన జాతులకూ మధ్య జరిగే ఒప్పందాల అమలును ఒక అంతర్జాతీయ న్యాయస్థానం తనిఖీ చేయాలనీ అన్నారు. యీ పవిత్ర అభీష్టాలను వెల్లడించడం తప్ప, అంతకంటె ముందుకు వాళ్ళు పోరు. వాళ్లకు యేమాత్రమూ యధార్థం అర్థమైనట్లు లేదు – సామ్రాజ్యవాదం యీనాటి పెట్టుబడిదారీ విధానంతో విడదీయరాని విధంగా కలిసిపోయి వుందనీ, అందు వలన (!!) సామ్రాజ్యవాదంతో బహిరంగ పోరాటం, బహుశా ఆ పోరాటం మరీ అసహ్య మైన కొన్ని నిర్దిష్ట అత్యాచారాల నిరసనకు పరిమితమైనప్పుడు తప్ప, కేవలం నిరుప యోగమనీ."* సామ్రాజ్యవాద ప్రాతిపదికను సంస్కరించడం వంచన గనుక, ఒక "సామాన్య ఆకాంక్ష" గనుక, పీడిత జాతుల బూర్జువా ప్రతినిధులు "అంతకంటె" ముందుకు పోరు గనుక, ఒక పీడక జాతి బూర్జువా ప్రతినిధి "అంతకంటె" వెనక్కి – "శాస్త్రీయ దృష్టి" అనే ముసుగు చాటున సామ్రాజ్యవాదానికి అణకువగా వుండే స్థితికి పోతున్నాడు. యిదేం "తర్కం"!

సామ్రాజ్యవాద ప్రాతిపదికను సంస్కరించడం సాధ్యమా, అది ఉత్పన్నం చేసే వైరు ధ్యాలను మరింత తీవ్రమూ, మరింత గాఢమూ చేసే స్థితికి పురోగమించడమా, లేక యీ వైరుధ్యాలను తగ్గించే స్థితికి తిరోగమించడమా అనేవి సామ్రాజ్యవాద పరిశీలనలో మౌలిక ప్రశ్నలు. ఫైనాన్స్ ప్రభుమండలి పీడన మూలంగానూ, స్వేచ్ఛాయుత పోటీ తొలగింపబడడం మూలంగానూ పెరిగే జాతీయ పీడనా, ఆద్యంతం యేర్పడే ప్రగతి వ్యతిరేకతా సామ్రాజ్య వాదపు నిర్దిష్ట రాజకీయ లక్షణాలు. అందువలన 20వ శతాబ్ది ప్రారంభంలో దాదాపు సామ్రాజ్య వాద దేశాలన్నిటిలోనూ సామ్రాజ్యవాదానికి పెటీబూర్జువా ప్రజాతంత్ర వ్యతిరేకత ఉత్పన్న మైంది. కౌట్స్కీ, స్థూలంగా అంతర్జాతీయ కౌట్స్కీయిస్టు ధోరణికి చెందిన వాళ్ళూ మార్క్సిజాన్ని పరిత్యజించి పోవడంలోని అంతర్యం యేమిటంటే, ఆర్థిక ప్రాతిపదికలో వాస్తవంగా ప్రగతి వ్యతిరేకమైన యీ పెటీబూర్జువా సంస్కరణవాద వ్యతిరేకతను వ్యతి రేకించే శ్రద్ధగానీ, శక్తిగానీ కౌట్స్కీకి లేకపోవడమే గాక, అతను ఆచరణలో దానితో లీనం కావడమే.

1898లో సంయుక్త రాష్ట్రాలు స్పెయిన్‌మీద సామ్రాజ్యవాద యుద్ధం ప్రారం

---

* *Weltwirtschaftliches Archiv* ("ప్రపంచ ఆర్థిక పురాపత్రాలు"), Bd. II, S. 193.

భించినప్పుడు, "సామ్రాజ్యవాద వ్యతిరేకుల"లో ఆ యుద్ధంపట్ల వ్యతిరేకత చెలరేగింది. వాళ్లను బూర్జువా ప్రజాస్వామ్యంలో చివరి "విజాతీయులు" అంటారు. వాళ్లు ఆ యుద్ధాన్ని "నేరం" అన్నారు; పరాయి ప్రాంతాల ఆక్రమణ రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం అన్నారు; ఫిలిప్పైన్స్ ప్రజల నాయకుడైన అగ్వినాల్డోపట్ల అమెరికా ప్రవర్తన (ఫిలిప్పైన్స్‌కి స్వాతంత్ర్యం యిస్తామని అతనికి అమెరికన్లు వాగ్దానం చేసి, తరువాత సైన్యాలు దింపి ఆ దేశాన్ని ఆక్రమించుకున్నారు) "జాతీయ దురహంకారపూరితమైన ద్రోహం" అన్నారు; లింకన్ మాటలను ఉల్లేఖించినారు: "తెల్లవాడు తనను తాను పరిపాలించుకుంటే, అది స్వయం పరిపాలన; తెల్లవాడు తననే కాక, యితరులను కూడా పరిపాలిస్తే, అది యిక యెంత మాత్రమూ స్వయం పరిపాలన కాదు; అది నియంతృత్వం."* కానీ యీ విమర్శ అంతా సామ్రాజ్యవాదానికీ ట్రస్టులకూ మధ్యగల, తత్కారణంగా సామ్రాజ్యవాదానికీ పెట్టుబడిదారీ విధానపు పునాదులకూ మధ్యగల, సంబంధాన్ని గుర్తించడానికి వెనుదీసింది గనుక, భారీ పెట్టుబడిదారీ విధానమూ, దాని తదనంతర రూపమూ ఉత్పన్నం చేసిన శక్తులతో కలవడానికి వెనుదీసింది గనుక, అది "సామాన్య ఆకాంక్ష"గానే నిలిచిపోయింది.

తన సామ్రాజ్యవాద పరిశీలనలో హాబ్సన్ కూడా యీ వైఖరీ ప్రధానంగా అవలంబించినాడు. "సామ్రాజ్యవాదం అనివార్యం" అనే వాదాన్ని ఆక్షేపించడంలోనూ, "ప్రజల కొనుగోలు శక్తిని పెంచవలసిన" అవసరాన్ని (పెట్టుబడిదారీ విధానంలో!) ఉద్బోధించడంలోనూ హాబ్సన్ కాట్స్కీని ముందే ఊహించినాడు. సామ్రాజ్యవాదంయొక్క విమర్శనా పరిశీలనలో పెటీబూర్జువా దృక్పథాన్ని — బాంకుల అనంత శక్తీ, ఫైనాన్స్ ప్రభుమండలి వగైరాలను — మేము తరుచుగా ఉల్లేఖించిన రచయితలు అగాడ్, లాన్స్‌బుర్గ్, ఎష్‌వేగె, ఫ్రెంచి రచయితల్లో 1900లో వెలువడిన "ఇంగ్లండూ, సామ్రాజ్యవాదమూ" అనే అషామాషీ పుస్తకం రాసిన విక్టర్ బెరార్‌లాంటి వాళ్లు అవలంబించినారు. యీ రచయిత లందరూ, మార్క్సిస్టులమని యెన్నడూ చెప్పుకోని వాళ్లు, సామ్రాజ్యవాదాన్ని స్వేచ్ఛాయుత పోటీతోనూ, ప్రజాస్వామ్యంతోనూ పోల్చి తారతమ్యాన్ని చూపుతారు, బాగ్దాద్ రైల్వే పథకం ఘర్షణలకూ, యుద్ధానికీ దారితీస్తుందని దాన్ని ఖండిస్తారు, శాంతికొరకు "సామాన్య ఆకాంక్షలు" వల్లిస్తారు, యిలాంటివే యింకా చేస్తారు. ఇది కంపెనీ షేర్ల అంతర్జాతీయ గణాంక లెక్కలు సేకరించిన ఎ. నెయ్‌మార్క్‌కు కూడా వర్తిస్తుంది; అతను "అంతర్జాతీయ" సెక్యూరిటీల వందల కోట్ల ఫ్రాంకుల విలువను లెక్కించి 1912లో యిలా ఆశ్చర్య

* J. Patouillet, *L'impérialisme américain* ("అమెరికన్ సామ్రాజ్యవాదం"), Dijon, 1904, p. 272.

పడినాడు: "శాంతిభగ్నం కాగలదని నమ్మడానికి ఎలా సాధ్యం?... యీ బ్రహ్మాండమైన అంకెల్ని చూస్తే యుద్ధానికి దిగి ఎవరైనా ప్రమాదాన్ని తెచ్చుకుంటారా?"*

బూర్జువా అర్థశాస్త్రజ్ఞులలో యిలాంటి అమాయకత్వం చూసి ఆశ్చర్యం కలిగించదు; పైగా, యిలాంటి పసితనపు అమాయకత్వం నటించడమూ, సామ్రాజ్యవాద విధానంలో శాంతిని గురించి "మనస్ఫూర్తిగా" మాట్లాడడమూ వాళ్లకు ప్రయోజనకరం. కానీ, 1914లో, 1915లో, 1916లో కౌట్స్కీ యిదే బూర్జువా సంస్కరణవాదం చేపట్టి, శాంతి సమస్యను గురించి (సామ్రాజ్యవాదులూ, కుహనా సోషలిస్టులూ, సోషల్ శాంతి వాదులూ) "అందరికీ అంగీకారం వుంది" అని ఉద్ఘాటించినప్పుడు అతని మార్క్సిజంలో మిగిలిందేమిటి? సామ్రాజ్యవాద పరిశీలనకు బదులు, దాని వైరుధ్యాల గాఢత్వాన్ని బట్ట బయలు చేయడానికి బదులు, వాటిని తృణీకరించే, తప్పుకునే సంస్కరణవాద "సామాన్య ఆకాంక్ష" మాత్రం మనకు లభిస్తున్నది.

సామ్రాజ్యవాదంమీద కౌట్స్కీ ఆర్థిక విమర్శకు యిక్కడొక ఉదాహరణ చూడండి. అతను 1872లోనూ 1912లోనూ ఈజిప్టుతో జరిగిన బ్రిటిష్ ఎగుమతి దిగుమతి వర్తకపు లెక్కలు తీసుకున్నాడు. యీ యెగుమతి దిగుమతి వర్తకం మొత్తం బ్రిటిష్ విదేశ వర్తకంకంటె నిదానంగా పెరిగినట్లు కనిపిస్తుంది. దీన్నిబట్టి అతను లాగిన నిర్ధారణ యిది: "సైనిక ఆక్రమణ లేకపోతే కేవల ఆర్థిక శక్తుల ఫలితంగా ఈజిప్టుతో బ్రిటన్‌కు గల వర్తకంలో పెరుగుదల తక్కువగా వుండేదని అనుకోడానికి మనకు యే కారణమూ లేదు." "పెట్టుబడి విస్తరణకు ప్రేరణను" "సామ్రాజ్యవాదపు దౌర్జన్య పద్ధతుల ద్వారా కాక, శాంతియుత ప్రజాతంత్ర పద్ధతుల ద్వారా అత్యుత్తమంగా సాధించగలుగుతాయి."**

కౌట్స్కీయొక్క యీ వాదం అతని రష్యన్ అనుచరుడు (సోషల్ జాతీయ దురహంకారుల రష్యన్ అంగరక్షకుడు కూడా ఐన) స్పెక్టేటర్ పదేపదే పునశ్చరణ చేసిందే; యీ వాదమే కౌట్స్కీయొక్క సామ్రాజ్యవాద పరిశీలనకు పునాది. అందుకనే దీన్ని మనం యింకా వివరంగా పరిశీలించాలి. హిల్ఫర్‌డింగ్‌నుండి ఒక ఉల్లేఖనతో ప్రారంభిస్తాము; అతని వ్యాఖ్య

---

* *Bulletin des l'institut international de statistique* ("అంతర్జాతీయ గణాంక సంస్థ బులెటిన్"), T. XIX, livr. II, p. 225.

** Kautsky, *Nationalstaat, imperialistischer Staat und Staatenbund* ("జాతీయ రాజ్యమూ, సామ్రాజ్యవాద రాజ్యమూ, రాజ్యసమాఖ్య"), Nürnberg, 1915, SS. 70, 72.

లను కౌట్స్కీ అనేక సందర్భాలలో, ముఖ్యంగా 1915 ఏప్రిల్‌లో, "సోషలిస్టు సిద్ధాంత వేత్తలందరూ ఏకగ్రీవంగా ఆమోదించినవి"గా ప్రకటించినాడు.

హిల్ఫర్‌డింగ్ యిలా అన్నాడు: "యింకా ముందుకు పోయిన పెట్టుబడిదారీ విధానాన్ని స్వేచ్ఛాయుత వర్తకమూ, రాజ్య వ్యవస్థపట్ల వ్యతిరేకతా అనే గుణాలు గలిగిన గత యుగం లోని విధానంతో పోల్చడం కార్మికవర్గం పని కాదు. ఫైనాన్స్ పెట్టుబడియొక్క ఆర్థిక విధానానికి, అనగా సామ్రాజ్యవాదానికి, కార్మికవర్గం యిచ్చే జవాబు స్వేచ్ఛాయుత వర్తకం కాజాలదు, సోషలిజమే. యీనాడు కార్మికవర్గ విధానపు లక్ష్యం స్వేచ్ఛాయుత పోటీని పున స్థాపించాలనే ఆదర్శం కాజాలదు — అది యీనాడు ప్రగతి వ్యతిరేక ఆదర్శం అయింది — పెట్టుబడిదారీ విధానాన్ని రద్దుచేయడం ద్వారా పోటీని సంపూర్తిగా తొలగించడమే."*

ఫైనాన్స్ పెట్టుబడి యుగంలో "ప్రగతి వ్యతిరేక ఆదర్శాన్ని," "శాంతియుత ప్రజా స్వామ్యాన్ని," "కేవల ఆర్థిక శక్తుల ప్రభావాన్ని" ఉద్బోధించడం ద్వారా కౌట్స్కీ మార్క్సి జంతో తెగతెంపులు చేసుకున్నాడు. వస్తుగతంగా యీ ఆదర్శం మనలను గుత్త పెట్టుబడిదారీ విధానంనుండి గుత్తేతర పెట్టుబడిదారీ విధానానికి వెనక్కి లాక్కుపోతుంది; యిది సంస్కరణవాద దగా.

సైనిక ఆక్రమణ లేకుంటే, సామ్రాజ్యవాదం లేకుంటే, ఫైనాన్స్ పెట్టుబడి లేకుంటే, ఈజిప్టుతో వర్తకం (లేక యే యితర వలసతోనైనా, అర్ధవలసతోనైనా వర్తకం) యింకా యెక్కువ "పెరిగి వుండేది." అంటే యేమిటి? స్వేచ్ఛాయుత పోటీ సాధారణ గుత్తాధిపత్యాలచేత గానీ, లేక ఫైనాన్స్ పెట్టుబడియొక్క "సంబంధాల"చేత, అనగా బంధనంచేత (అనగా గుత్తాధిపత్యంచేత) గానీ, లేక వలసలమీద కొన్ని దేశాలకు గల గుత్త యాజమాన్యంచేత గానీ, నిర్బంధింపబడకుండా వుంటే పెట్టుబడిదారీ విధానం యింకా వేగంగా అభివృద్ధి చెంది వుండే దనేనా?

కౌట్స్కీ వాదానికి మరొక అర్థం వుండజాలదు; మరి యీ "అర్థం" అర్థరహిత మైంది. యేవిధమైన గుత్త హక్కూ లేని స్వేచ్ఛాయుత పోటీ పెట్టుబడిదారీ విధానాన్నీ వర్తకాన్నీ యింకా వేగంగా అభివృద్ధి చేసి వుండేదని అనుకుందాం. కానీ, వర్తకమూ, పెట్టుబడిదారీ విధానమూ యెంత వేగంగా అభివృద్ధి చెందితే, గుత్తాధిపత్యాన్ని ఉత్పన్నం చేసే ఉత్పత్తి, పెట్టుబడుల సాంద్రీకరణ అంత యెక్కువగా వుంటుంది. మరి గుత్త సంస్థలు యిప్పటికే ఉత్పన్నమైనాయి — సరిగ్గా స్వేచ్ఛాయుత పోటీ నుండి! గుత్త సంస్థలు యిప్పుడు పురోగమనాన్ని మందగింపజేస్తున్నా, అది స్వేచ్ఛాయుత పోటీకి అను

---

* "ఫైనాన్స్ పెట్టుబడి," పేజి 567.

కూలమైన వాదం కాదు; గుత్తాధిపత్యాన్ని ఉత్పన్నం చేసిన తర్వాత స్వేచ్ఛాయుత పోటీ అనేది అసంభవమైపోయింది.

కౌట్స్కీ వాదాన్ని యెటు తిప్పినా, ప్రగతి వ్యతిరేకతా, బూర్జువా సంస్కరణవాదమూ తప్ప యేమీ కనపడదు.

మనం యీ వాదాన్ని సవరించి, స్పెక్టేటర్ చెప్పినట్లు, యిప్పుడు యింగ్లండుతో బ్రిటిష్ వలసల వర్తకం యితర దేశాలతోకంటె నిదానంగా అభివృద్ధి చెందుతున్నదని అన్నా, యీ మాట కౌట్స్కీని రక్షించదు. యెందుకంటే గ్రేట్ బ్రిటన్‌మీద దెబ్బ తీస్తున్నది కూడా గుత్తాధిపత్యమే, సామ్రాజ్యవాదమే – కానీ అది మరొక దేశపు (అమెరికాదో, జర్మనీదో) గుత్తాధిపత్యమూ, సామ్రాజ్యవాదమూ. కార్టెల్‌లు కొత్త, విలక్షణమైన రక్షణ సుంకాలను ఉత్పన్నం చేసిన విషయం, అనగా యెగుమతికి యోగ్యమైన సరుకులకు రక్షణ కల్పించడం, మనకు తెలిసిందే (దీన్ని "పెట్టుబడి" మూడవ సంపుటంలో ఎంగెల్సు గమనించినాడు). మరొక విషయం కూడా తెలిసిందే: కార్టెల్‌లకూ, ఫైనాన్స్ పెట్టుబడికీ ఒక విలక్షణమైన పద్ధతి వుంది, "తగ్గింపు ధరలతో సరుకులు యెగుమతి చేసే" పద్ధతి, లేక, యింగ్లీషువాళ్లు అన్నట్లు, "డంప్" చేసే పద్ధతి: కార్టెల్ తన సరుకులను తన దేశంలో విపరీతమైన గుత్త ధరలతో అమ్ముతుంది; కానీ యితర దేశాలలో, పోటీదార్లను దెబ్బ తీయడానికీ, తన ఉత్పత్తిని వీలైనంతగా పెంచుకోడానికీ, వగైరాలకు, అదే సరుకులను చాలా తక్కువ ధరలతో అమ్ముతుంది. బ్రిటిష్ వలసలతో జర్మనీ వర్తకం బ్రిటన్ వర్తకంకంటె వేగంగా పెరుగుతున్నదంటే, జర్మన్ సామ్రాజ్యవాదం బ్రిటిష్ సామ్రాజ్యవాదంకంటె పడుచుది అనీ, బలమైనది అనీ, సుసంఘటితం అనీ, మేలైనది అనీ రుజువౌతుంది; కానీ స్వేచ్ఛాయుత వర్తకం "మేలైన"దని యేవిధంగానూ రుజువు కాదు. యెందుకంటే, యీ పోరాటం యిటు స్వేచ్ఛాయుత వర్తకానికీ అటు రక్షణకూ, వలస పరాధీనతకూ మధ్య జరిగే పోరాటం కాదు; యిది రెండు శత్రు సామ్రాజ్యవాదాల మధ్య, రెండు గుత్త వ్యవస్థల మధ్య, రెండు ఫైనాన్స్ పెట్టుబడి బృందాల మధ్య జరిగే పోరాటం. బ్రిటిష్ సామ్రాజ్యవాదం మీద జర్మన్ సామ్రాజ్యవాదానికి గల ఆధిక్యం వలస సరిహద్దులు అనే గోడకంటే, రక్షణ సుంకాలు అనే గోడకంటే బలీయంగా వుంది. దీన్ని స్వేచ్ఛాయుత వర్తకానికీ, "శాంతియుత ప్రజాస్వామ్యానికీ" అనుకూలంగా ఉపయోగించుకోవడం చౌకబారుతనం. యిది సామ్రాజ్య వాదపు సారభూతమైన అంశాలనూ, విలక్షణమైన గుణాలనూ మరిచిపోవడం, మార్క్సిజం స్థానంలో పెటీబూర్జువా సంస్కరణవాదాన్ని నిలపడం.

సామ్రాజ్యవాదంమీద కౌట్స్కీది యెంత పెటీబూర్జువా పద్ధతిలో విమర్శో, ఎ. లాన్స్‌బుర్గ్ అనే బూర్జువా అర్థశాస్త్రజ్ఞునిది కూడా అంతే పెటీబూర్జువా పద్ధతిలో

విమర్శ. కానీ వర్తక గణాంక లెక్కలను శాస్త్రీయంగా అధ్యయనం చేసే విషయంలో లాన్స్‌బుర్గ్ కౌట్స్కీకంటె మెరుగు. అతను యేదో ఒక దేశాన్ని, ఒక వలసను, గుడ్డిగా యేరుకొని, యితర దేశాలతో దాన్ని పోల్చలేదు. అతను ఒక సామ్రాజ్యవాద దేశం 1) ఆర్థికంగా తనమీద ఆధారపడి, తనతో రుణాలు తీసుకునే దేశాలతో చేసిన యెగుమతి వర్తకాన్నీ, 2) ఆర్థికంగా స్వతంత్రమైన దేశాలతో చేసిన యెగుమతి వర్తకాన్నీ పరిశీలించినాడు. అతనికి లభించిన ఫలితాలు యివి:

జర్మనీ ఎగుమతి వర్తకం
(లక్షల మార్కులు)

| | | 1889 | 1908 | పెరుగుదల |
|---|---|---|---|---|
| ఆర్థికంగా జర్మనీమీద ఆధారపడిన దేశాలకు | రుమేనియా | 482 | 708 | +47% |
| | పోర్చుగల్ | 190 | 328 | +73% |
| | ఆర్జెంటీనా | 607 | 1,470 | +143% |
| | బ్రెజీల్ | 487 | 845 | +73% |
| | చిలీ | 283 | 524 | +85% |
| | టర్కీ | 299 | 640 | +114% |
| | మొత్తం | 2,348 | 4,515 | +92% |
| ఆర్థికంగా జర్మనీమీద ఆధారపడని దేశాలకు | గ్రేట్ బ్రిటన్ | 6,518 | 9,974 | +53% |
| | ఫ్రాన్సు | 2,102 | 4,379 | +108% |
| | బెల్జియం | 1,372 | 3,228 | +135% |
| | స్విట్జర్లండు | 1,774 | 4,011 | +127% |
| | ఆస్ట్రేలియా | 212 | 645 | +205% |
| | డచ్చి ఈస్ట్ ఇండీస్ | 88 | 407 | +363% |
| | మొత్తం | 12,066 | 22,644 | +87% |

లాన్స్‌బుర్గ్ వ్యాఖ్యానాలు చేయలేదు; కనుక, చిత్రంగా, ఒక విషయం గమనించలేకపోయినాడు: యీ అంకెలవల్ల రుజువయ్యేది యేదైనా వుంటే, లాన్స్‌బుర్గ్ వాదం తప్పు

అని రుజువౌతుంది. ఆర్థికంగా స్వతంత్ర దేశాలకంటె ఆర్థికంగా జర్మనీమీద ఆధారపడిన దేశాలకు జర్మన్ ఎగుమతులు, యెక్కువ వేగంగా పెరిగినాయి, కొంచెం యెక్కువే ఐనా. (లాన్స్‌బుర్గ్ అంకెలు సంపూర్ణమైనవి కావు గనుక "వుంటే" అనే పదాన్ని నొక్కిచెప్తున్నాను.)

ఎగుమతులకూ, రుణాలకూ గల సంబంధాన్ని పరిశీలిస్తూ లాన్స్‌బుర్గ్ యిలా అన్నాడు:

"1890–1891లో జర్మన్ బాంకుల ద్వారా ఒక రుమేనియన్ రుణం యేర్పాటు చేయబడింది; ఆ బాంకులే అంతకుముందు సంవత్సరాలలో ఆ రుణంమీద అడ్వాన్సులు యిచ్చినాయి. ఆ రుణం ప్రధానంగా జర్మనీలో రైల్వే సామగ్రి కొనడానికి ఉపయోగింపబడింది. 1891లో రుమేనియాకు జర్మన్ ఎగుమతులు 550 లక్షల మార్కులు వుండినాయి. మరు సంవత్సరంలో అవి 394 లక్షల మార్కులకు పడిపోయినాయి. తరువాత, ఎగుడు దిగుడులు జరుగుతూ, 1900లో 254 లక్షల మార్కులకు పడిపోయినాయి. యిటీవలి సంవత్సరాలలో మాత్రమే, రెండు కొత్త రుణాల ఫలితంగా, యెగుమతులు మళ్లీ 1891 స్థాయికి వచ్చినాయి.

"పోర్చుగల్‌కు జర్మన్ ఎగుమతులు, 1888–1889 రుణాల తర్వాత, 211 లక్షలకు (1890) పెరిగినాయి. ఆ తరువాత రెండు సంవత్సరాల్లోనూ అవి 162 లక్షలకూ, 74 లక్షలకూ పడిపోయినాయి; 1903లో మాత్రమే మళ్లీ పూర్వ స్థాయికి చేరుకున్నాయి.

"ఆర్జెంటీనాతో జర్మన్ వర్తకపు లెక్కలు మరింత కొట్టవచ్చినట్టు వున్నాయి. 1888లోనూ, 1890లోనూ యేర్పాటు చేయబడిన రెండు రుణాల ఫలితంగా ఆర్జెంటీనాకు జర్మన్ ఎగుమతులు 1889లో 607 లక్షల మార్కులకు పెరిగినాయి. రెండేండ్ల తర్వాత 186 లక్షలు మాత్రమే వుండినాయి; అనగా పై అంకెలో మూడవ వంతు కూడా లేదు. 1901దాకా అవి 1889 స్థాయిని అందుకొని దాటిపోలేదు; అప్పుడైనా ప్రభుత్వమూ, మునిసిపాలిటీలూ కొత్త రుణాలు యేర్పాటు చేసి, పవర్ స్టేషన్లు (విద్యుదుత్పాదక కేంద్రాలు) నిర్మించడానికి అడ్వాన్సులు యిచ్చి, యితర రుణ సౌకర్యాలు కల్పించినందువల్లనే.

"చిలీకి యెగుమతులు, 1889 రుణం మూలంగా, 452 లక్షల మార్కులకు (1892లో) పెరిగినాయి; ఒక సంవత్సరం తర్వాత 225 లక్షల మార్కులకు పడిపోయినాయి. 1906లో జర్మన్ బాంకులు యేర్పాటుచేసిన కొత్త చిలీ రుణం తర్వాత 1907లో యెగుమతులు 847 లక్షల మార్కులకు పెరిగినాయి; కానీ మళ్లీ 1908లో 524 లక్షలకు పడిపోయినాయి."*

---

* "Die Bank," 1909, 2, S. 819 et seq.

యీ వాస్తవాలనుండి లాన్స్‌బుర్గ్ తమాషా అయిన పెటీబూర్జువా నీతి లాగినాడు: రుణాలతో ముడివడి వున్నప్పుడు యెగుమతి వాణిజ్యం యెంతో అస్థిరంగానూ, యెగుడు దిగుడులుగానూ వుంటుందనీ; "సహజంగా," "సమరసంగా" స్వదేశ పరిశ్రమలను అభి వృద్ధి చేసుకోడానికి బదులు విదేశాలలో పెట్టుబడి పెట్టడం యెంతో చెడ్డదనీ; విదేశ రుణాలు యేర్పాటు చేయడంలో క్రుప్ కానుకల రూపంలో యివ్వవలసిన లక్షలు యెంతో "ఖరీదైన"వనీ, వగైరా. కానీ యీ వాస్తవాలు మనకు స్పష్టంచేసేదేమంటే, ఎగుమతుల పెరుగుదల కచ్చితంగా ఫైనాన్స్ పెట్టుబడి చేసే మోసపు చర్యలతో ముడివడి వుంది; ఫైనాన్స్ పెట్టుబడి బూర్జువా నీతిని పట్టించుకోకుండా, యెద్దుకు రెండు సార్లు చర్మం ఒలుస్తుంది — మొదట రుణంనుండి లాభాలను జేబులో వేసుకుంటుంది, తరువాత రుణ గ్రహీత అదే రుణాన్ని క్రుప్‌నుండి యేదైనా కొనడానికీ, లేదా ఉక్కు సిండికేట్‌నుండి రైల్వే సామగ్రి కొనడానికీ ఉపయోగించినప్పుడు మళ్లీ ఆ లాభాలు జేబులో వేసుకుంటుంది.

లాన్స్‌బుర్గ్ అంకెలు లోపరహిత మని నేను అనుకోవడం లేదు. కానీ అవి కౌట్స్కీ అంకెలకంటె, స్పెక్టేటర్ అంకెలకంటె శాస్త్రీయంగా వుండడంవల్లా, సమస్యను యెదు ర్కోడానికి లాన్స్‌బుర్గ్ సరైన మార్గం చూపినందువల్లా, వాటిని ఉల్లేఖించవలసివచ్చింది. ఎగుమతులూ వగైరాల విషయంలో ఫైనాన్స్ పెట్టుబడి ప్రాముఖ్యాన్ని చర్చించేటప్పుడు యెగుమతులకు ప్రత్యేకంగా ఫైనాన్స్ పెట్టుబడిదార్ల మోసాలతో మాత్రమే గల సంబం ధాన్ని, ప్రత్యేకంగా కార్టెల్‌ల ద్వారా జరిగే సరుకుల అమ్మకానికి మాత్రమే గల సంబం ధాన్ని, మనం విడదీసి చూడగలిగి వుండాలి. కేవలం వలసలను వలసలు కాని వాటితోనూ, ఒక సామ్రాజ్యవాదాన్ని మరొక సామ్రాజ్యవాదంతోనూ, ఒక అర్ధవలసనో వలసనో (ఈజి ప్టును) యితర దేశాలతోనూ పోల్చడం సమస్య సారాన్ని తప్పుకోవడమూ, మరుగుపరచడమూ ఔతుంది.

సామ్రాజ్యవాదంమీద కౌట్స్కీ సిద్ధాంత విమర్శకు మార్క్సిజంతో యేమీ సంబంధం లేదు; అవకాశవాదులతోనూ, సోషల్ జాతీయ దురహంకారులతోనూ రాజీకొరకూ, ఐక్యత కొరకూ ప్రచారం చేయడానికి అది ప్రవేశికగా మాత్రమే ఉపయోగపడుతుంది. యెందు కంటే అది సరిగ్గా సామ్రాజ్యవాదంలోని ప్రగాఢమైన, మౌలికమైన వైరుధ్యాలను తప్పు కొని మరుగుపరుస్తుంది: గుత్తాధిపత్యానికీ, దాని పక్కనే వున్న స్వేచ్ఛాయుత పోటీకీ మధ్య వున్న వైరుధ్యాలనూ, ఫైనాన్స్ పెట్టుబడియొక్క బ్రహ్మాండమైన "లావాదేవీల" (బ్రహ్మాండ మైన లాభాల)కూ, స్వేచ్ఛాయుత మార్కెట్‌లోని "నిజాయితీ"గల వర్తకానికీ మధ్య వున్న వైరుధ్యాలనూ, ఒకవైపున కార్టెల్లకూ, ట్రస్టులకూ మరొకవైపున కార్టెల్‌లుగా మారని పరిశ్రమలకు మధ్య వున్న వైరుధ్యాలనూ, వగైరా.

అపకీర్తి పాలైన "అధి సామ్రాజ్యవాద" సిద్ధాంతం, కౌట్స్కీ సృష్టించింది, కూడా దీనంత ప్రగతి వ్యతిరేకమే. యీ విషయంమీద 1915 నాటి యితని వాదాలను 1902 నాటి హాబ్సన్ వాదాలతో పోల్చండి:

కౌట్స్కీ: "...ప్రస్తుత సామ్రాజ్యవాద విధానాన్ని తొలగించి దాని స్థానంలో ఒక కొత్త అధి సామ్రాజ్యవాద విధానం – జాతీయ ఫైనాన్స్ పెట్టుబడుల పరస్పర వైరాలను తొలగించి వాటి స్థానంలో అంతర్జాతీయ సమైక్య ఫైనాన్స్ పెట్టుబడియొక్క సంయుక్త ప్రపంచ దోపిడీని నిలిపే విధానం – రావడం సాధ్యం కాదా? పెట్టుబడిదారీ విధానంలో యిలాంటి కొత్త దశను కనీసం ఊహించవచ్చు. దీన్ని సాధించగలమా? యీ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి తగినన్ని ఆధారాలు లేవు."*

హాబ్సన్: "యీవిధంగా ప్రతి సామ్రాజ్యానికీ ఒక అనాగరిక అధీన రాజ్యాల పరివారం వున్నట్టి కొన్ని గొప్ప ఫెడరల్ సామ్రాజ్యాలలో విస్తరించిన క్రైస్తవ రాజ్యం యీనాటి ధోరణుల సహజ పర్యవసానంగా, అంతర్ సామ్రాజ్యవాదపు స్థిరమైన పునాదిమీద శాశ్వతమైన శాంతిని చూపగల అత్యుత్తమ మార్గంగా చాలామందికి కనపడుతున్నది."

హాబ్సన్ దేన్ని అంతర్ సామ్రాజ్యవాదం (interimperialism) అని వర్ణించినాడో దాన్నే, పదమూడేండ్ల తర్వాత, కౌట్స్కీ అధి సామ్రాజ్యవాదం (ultraimperialism), లేక అతీత సామ్రాజ్యవాదం అన్నాడు. ఒక లాటిన్ ఉపసర్గకు బదులు మరొకటి పెట్టి అతి తెలివిగా కొత్త నినాదం సృష్టించడం తప్ప, "శాస్త్రీయ" ఆలోచనా రంగంలో కౌట్స్కీ సాధించిన పురోగతి యేమిటంటే: హాబ్సన్, వాస్తవంలో, యింగ్లీషు మతగురువుల శ్రీరంగనీతిగా వర్ణించిన దాన్నే కౌట్స్కీ మార్క్సిజంగా ప్రవచించినాడు. ఆంగ్లో-బోయర్ల యుద్ధం తర్వాత, దక్షిణాఫ్రికా యుద్ధ రంగాలలో అనేకమంది బంధువులను కోల్పోయి, బ్రిటిష్ ఫైనాన్స్ పెట్టుబడిదార్లకు యింకా పెద్ద లాభాలను గ్యారంటీ చేయడానికి యింకా యెక్కువ పన్నులు చెల్లించవలసివచ్చిన బ్రిటిష్ మధ్యతరగతినీ, కార్మికులనూ ఓదార్చడానికి తమ ప్రధాన శక్తులు వినియోగించడం ఆ మతగురువుల ఉన్నత కులానికి చాలా సహజం. సామ్రాజ్యవాదం అంత చెడ్డది కాదనీ, శాశ్వత శాంతిని నిస్సంశయం చేయగల అంతర్ (లేక అధి) సామ్రాజ్యవాదానికి అది సన్నిహితంగా వుందనీ చెప్పే సిద్ధాంతాన్ని మించిన ఓదార్పు వుండజాలదు గదా! యింగ్లీషు మతగురువుల సదుద్దేశాలుగానీ, మెతకవాడైన కౌట్స్కీ సదుద్దేశాలుగానీ యేమైనప్పటికీ, కౌట్స్కీ "సిద్ధాంతా"నికి వుండగల ఏకైక లక్ష్యం, అనగా నిజమైన సామాజిక ప్రాముఖ్యం, యేమిటంటే:

* "Die Neue Zeit," April 30, 1915, p. 144.

వర్తమాన కాలపు తీవ్ర వైరుధ్యాలనుండీ, తీవ్ర సమస్యలనుండీ ప్రజల దృష్టిని పక్కకు లాగి, భవిష్యత్ కాలపు ఊహాకల్పిత "అధి సామ్రాజ్యవాదపు" భ్రమలవైపు మళ్లించి, తద్వారా పెట్టుబడిదారీ విధానంలో శాశ్వత శాంతికి అవకాశాలున్నాయనే ఆశలతో ప్రజలను ఓదార్చే అత్యంత ప్రగతి వ్యతిరేక పద్ధతి యిది. ప్రజలను మోసగించడం – యిది మినహా కౌట్స్కీ చెప్పే "మార్క్సిస్టు" సిద్ధాంతంలో మరేమీ లేదు.

జర్మన్ కార్మికుల ముందూ, సకల దేశాల కార్మికుల ముందూ కౌట్స్కీ చిత్రించ ప్రయత్నించే భవిష్యత్తు పట్టి బూటకమని నమ్మకం కలిగేందుకు కొన్ని ప్రసిద్ధ నిర్వివాద వాస్తవాలను పోలిస్తే సరిపోతుంది. ఇండియానూ, ఇండో చైనానూ, చైనానూ పరిశీలించుదాం. యీ మూడు వలస, అర్ధవలస దేశాలూ – 60, 70 కోట్ల జనాభాగల దేశాలూ – గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, అమెరికా మొదలైన కొన్ని సామ్రాజ్యవాద రాజ్యాల ఫైనాన్స్ పెట్టుబడియొక్క దోపిడీకి గురి ఔతున్నాయి. యీ ఆసియా దేశాలలో తాము పరిపాలిస్తున్న భూభాగాలనూ, తమ ప్రయోజనాలనూ, తమ "పలుకుబడి ప్రాంతాలనూ" రక్షించుకోడానికీ, విస్తృత పరుచుకోడానికీ యీ సామ్రాజ్యవాద దేశాలు ఒకదాని కొకటి వ్యతిరేకంగా కూటాలు యేర్పరచుకుంటాయని అనుకుందాం. యీ కూటాలు "అంతర్ సామ్రాజ్యవాద" కూటాలుగా, లేక "అధి సామ్రాజ్యవాద" కూటాలుగా వుంటాయి. ఆసియాలోని యీ ప్రాంతాల "శాంతియుత" పంపకానికి సామ్రాజ్యవాద దేశాలు అన్నీ ఒక కూటమి యేర్పరచుకున్నాయని అనుకుందాం. యీ కూటమి "అంతర్జాతీయ సమైక్య ఫైనాన్స్ పెట్టుబడి" కూటమి ఔతుంది. 20వ శతాబ్ది చరిత్రలో యిలాంటి కూటాలు ఏర్పడినాయి; ఉదాహరణకు చైనాపట్ల సామ్రాజ్యవాద రాజ్యాల వైఖరి.[150] కౌట్స్కీ అనుకుంటున్నట్లు పెట్టుబడిదారీ విధానం చెక్కుచెదరకుండా వుంటుందని అనుకున్నప్పటికీ, అలాంటి కూటాలు శాశ్వతంగా వుండగలవనీ, యే రూపంలోనూ ఘర్షణా, వైరుధ్యమూ, పోరాటమూ లేకుండా చేయగలవనీ ఊహించడం సాధ్యమా? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు.

యీ ప్రశ్నను స్పష్టమైన రూపంలో వేసుకుంటే చాలు – అసాధ్యం అనే తప్ప మరొక సమాధానం యిచ్చేందుకు వీలు లేదని తెలుస్తుంది. యెందుకంటే పెట్టుబడిదారీ విధానంలో పలుకుబడి ప్రాంతాలనూ, ప్రయోజనాలనూ, వలసలనూ, వగైరాలను పంచుకోడానికి భాగస్తుల సాధారణ ఆర్థిక, ఫైనాన్షల్, సైనిక బలానికి సంబంధించిన లెక్కాచారం తప్ప మరొక ప్రాతిపదిక ఊహించడం సాధ్యం కాదు. పంపకంలో పాల్గొనే భాగస్వాముల బలం సమాన స్థాయిలో మారదు; ఎందుచేతనంటే, పెట్టుబడిదారీ విధానంకింద, వివిధ వ్యాపార సంస్థల, ట్రస్టుల, పరిశ్రమ శాఖలయొక్క, లేదా వివిధ దేశాలయొక్క సమాన అభివృద్ధి అసాధ్యం. అర్ధశతాబ్ది క్రితం జర్మనీ, దాని ఆర్థిక శక్తికి సంబంధిం

చినంతవరకు, ఆనాటి యింగ్లండు శక్తితో పోలిస్తే తృణీకరింపదగిన దరిద్రపు దేశం; రష్యాతో పోలిస్తే జపానూ అంతే. సామ్రాజ్యవాద రాజ్యాల సాపేక్ష బలాలు పది యిరవై యేండ్ల కాలంలో మారకుండా వుంటాయని ఊహించడం సాధ్యమా? బొత్తిగా అసాధ్యం.

కనుక, కూపస్థమండూకాలైన యింగ్లీషు మతగురువుల శుష్క భ్రమలలోనూ, జర్మన్ "మార్క్సిస్టు" కౌట్స్కీ భ్రమలలోనూ కాక, పెట్టుబడిదారీ విధానపు వాస్తవ పరిస్థితులలో, "అంతర్ సామ్రాజ్యవాద," లేక "అధి సామ్రాజ్యవాద" కూటాలు, అవి యే రూపం ధరించినప్పటికీ, ఒకదాని కొకటి వ్యతిరేకమైన సామ్రాజ్యవాద కూటాల రూపం ధరించినా, సామ్రాజ్యవాద రాజ్యాల నన్నిటినీ కలిపే సార్వత్రిక కూటమి ఐనా, అనివార్యంగా యుద్ధాల మధ్య కాలంలోని "యుద్ధ విరమణ ఒప్పందం" తప్ప మరేమీ కావు. శాంతియుత కూటాలు యుద్ధానికి భూమిక తయారుచేస్తాయి; తిరిగి అవి యుద్ధాలనుండి ఉత్పన్నమౌతాయి. అవి వీటినీ, యివి వాటినీ నిర్ణయించి, ప్రపంచ ఆర్థిక రాజకీయ వ్యవహారాలలోని సామ్రాజ్యవాద సంబంధ బాంధవ్యాలు అనే అదే ప్రాతిపదికనుండి ఒకసారి శాంతియుత పోరాటాన్నీ, మరొకసారి అశాంతియుత పోరాటాన్నీ మార్చి మార్చి ఉత్పన్నం చేస్తాయి. కానీ, కార్మికులను శాంతపరిచి, యిటువైపునుండి బూర్జువావర్గంవైపుకు పారిపోయిన సోషల్ జాతీయ దురహంకారులతో రాజీచేయడానికి, అతి తెలివిపరుడైన కౌట్స్కీ ఒకే గొలుసులోని ఒక లంకె నుండి మరొక లంకెను విడదీస్తాడు; చైనాను "ప్రశాంతపరచడానికి" (బాక్సర్ తిరుగుబాటు[151] అణచివేతను జ్ఞాపకం చేసుకోండి) జరిగిన సకల సామ్రాజ్యవాద రాజ్యాల ప్రస్తుత శాంతియుత (అధి సామ్రాజ్యవాద, కాదు, అధిఅధి సామ్రాజ్యవాద) కూటమిని రేపటి అశాంతియుత పోరాటంనుండి వేరు చేస్తాడు; రేపటి అశాంతియుత పోరాటం యెల్లుండి యే టర్కీనో పంచుకోడానికి మరొక "శాంతియుత" సార్వత్రిక కూటమికి భూమిక తయారు చేస్తుంది. సామ్రాజ్యవాద శాంతి కాలాలకూ, సామ్రాజ్యవాద యుద్ధ కాలాలకూ గల సజీవ సంబంధం చూపించడానికి బదులు, కార్మికులను తమ నిర్జీవ నాయకులతో రాజీచేయడానికి వాళ్లకొక నిర్జీవ భావం అందిస్తున్నాడు కౌట్స్కీ.

"యూరప్ అంతర్జాతీయ అభివృద్ధిలో దౌత్య వ్యవహారాల చరిత్ర" అనే గ్రంథంలో హిల్ అనే అమెరికన్ రచయిత, తన ముందుమాటలో, దౌత్య వ్యవహారాల యిటీవలి చరిత్రలో యీకింది దశలను గుర్తిస్తాడు: 1) విప్లవ యుగం; 2) రాజ్యాంగబద్ధ ఉద్యమం; 3) ప్రస్తుత "వాణిజ్య సామ్రాజ్యవాద" యుగం.* మరొక రచయిత 1870 తర్వాత

* David Jayne Hill, *A History of the Diplomacy in the International Development of Europe*, vol. I, p. X.

జరిగిన గ్రేట్ బ్రిటన్ "ప్రపంచ విధానపు" చరిత్రను నాలుగు దశలుగా విభజిస్తాడు: 1) మొదటి ఏషియాటిక్ దశ (మధ్య ఆసియాలో, యిండియావైపుగా, జరిగిన రష్యా పురోగమనంతో పోరాటం చేసిన దశ); 2) ఆఫ్రికన్ దశ (సుమారు 1885–1902)– ఆఫ్రికా పంపకంకొరకు ఫ్రాన్సుతో పోరాటం చేసిన దశ (దాదాపు ఫ్రాన్సుతో యుద్ధం సంభవించే స్థితికి తీసుకవచ్చిన 1898 నాటి "ఫషోడా ఘటన"[152]); 3) రెండవ ఏషియాటిక్ దశ (రష్యాకు వ్యతిరేకంగా జపాన్‌తో కూటమి); 4) ప్రధానంగా జర్మన్ వ్యతిరేకమైన "యూరపియన్" దశ.* "వలసలలో జరిగే రాజకీయ ఘర్షణలు ఆర్థిక రంగంలో ఉద్భవిస్తాయి" అని 1905లో బాంకర్ రీసర్ అన్నాడు. యిటలీలో పనిచేసే ఫ్రెంచి ఫైనాన్స్ పెట్టుబడి యేవిధంగా ఆ రెండు దేశాల రాజకీయ కూటమికి దారిచేస్తున్నదీ, పర్షియా కొరకు జర్మనీ, గ్రేట్ బ్రిటన్‌ల మధ్య యేవిధంగా వైరుధ్యం అభివృద్ధి ఔతున్నదీ, చైనా రుణాలకొరకు యూరప్‌లోని పెట్టుబడిదారులందరి మధ్య యేవిధంగా వైరుధ్యం అభివృద్ధి ఔతున్నదీ, వగైరాలను వెల్లడిస్తూ రీసర్ ఆ మాట రాసినాడు. సాధారణ సామ్రాజ్యవాద వైరుధ్యాలతో అవిచ్ఛేద్యమైన సంబంధం గల శాంతియుత "అధి సామ్రాజ్యవాద" కూటాల సజీవ నిజస్వరూపం గమనించండి!

సామ్రాజ్యవాదంలోని అత్యంత ప్రగాఢ వైరుధ్యాలను మరుగుపరచడం అనివార్యంగా సామ్రాజ్యవాదానికి అలంకార మౌతుంది. యీ మరుగుపరచడంయొక్క ఫలితాలు సామ్రాజ్యవాద రాజకీయ లక్షణాలమీద కౌట్స్కీ చేసిన విమర్శలో కూడా కనపడతాయి. సామ్రాజ్యవాదం అనేది ఫైనాన్స్ పెట్టుబడి, గుత్తసంస్థల యుగం; యివి స్వాతంత్ర్యంకొరకు కాక, ఆధిపత్య సంపాదన ప్రయత్నాలకు దారితీస్తాయి. యీ ధోరణుల ఫలితం యేమిటంటే: రాజకీయ వ్యవస్థ యేదైనా, ఆద్యంతం ప్రగతి వ్యతిరేకతా, యీ రంగంలో కూడా అప్పటికే వున్న వైరుధ్యాలు అత్యంత తీవ్రం కావడమూ. ముఖ్యంగా తీవ్రమయ్యేవి జాతీయ పీడనా పరదేశ స్వాధీనాలకొరకు కృషీ, అనగా జాతీయ స్వాతంత్ర్యాన్ని భంగపరిచే కృషీ (పరదేశ స్వాధీన మంటే జాతుల స్వయంనిర్ణయ హక్కును భంగపరచడం తప్ప మరేమీ కాదు). సామ్రాజ్యవాదానికీ, జాతీయ పీడన తీవ్రం కావడానికీ మధ్య గల సంబంధాన్ని హిల్ఫర్‌డింగ్ సరిగా గుర్తించినాడు. అతను యిలా అన్నాడు: "కొత్తగా కనిపెట్టబడిన దేశాలలో, దిగుమతి అయ్యే పెట్టుబడి వైరుధ్యాలను తీవ్రతరం చేస్తుంది, జాతీయ చైతన్యానికి జాగృతులౌతున్న ప్రజల నిత్యప్రవర్ధమాన ప్రతిఘటనను ఆక్రమణదార్లకు వ్యతిరేకంగా రెచ్చగొడుతుంది; యీ ప్రతిఘటన విదేశ పెట్టుబడికి (వ్యతిరేకంగా) ప్రమా

* Schilder, పూర్వోక్త గ్రంథం, పేజి 178.

దకరమైన చర్యలుగా సులభంగా పరివర్తన చెందగలదు. పాత సామాజిక సంబంధాలు విప్ల వాత్మకంగా మారిపోతాయి, "చరిత్రలేని జాతుల" అనాది వ్యావసాయిక ఏకాకితనం ధ్వం సమై, అవి పెట్టుబడిదారీ సుడిగుండంలోకి లాగబడతాయి. పెట్టుబడిదారీ విధానమే క్రమంగా పీడిత జాతులకు విమోచన సాధనాలూ, వనరులూ సమకూరుస్తుంది; ఆ జాతులు ఒకప్పుడు యూరపియన్ జాతులకు అత్యున్నతంగా కనపడిన లక్ష్యాన్ని సాధించడానికి పూను కుంటాయి, అనగా ఆర్థిక సాంస్కృతిక స్వాతంత్ర్యానికి సాధనమైన సమైక్య జాతీయ రాజ్యాన్ని సృష్టించడానికి. యీ జాతీయ స్వాతంత్ర్యోద్యమం యూరపియన్ పెట్టుబడికి, దాని అత్యంత విలువైన, అత్యంత ఆశావహమైన దోపిడీ క్షేత్రాలలో, ప్రమాదం కలిగి స్తుంది; యూరపియన్ పెట్టుబడి నిత్యం తన సైనిక బలాలను పెంచుకోవడం ద్వారా మాత్రమే తన ఆధిపత్యం నిలుపుకోగలదు."*

దీనికి మరొక విషయం కలపాలి. కొత్తగా కనిపెట్టబడిన దేశాలలోనే కాదు, పాత దేశాలలో కూడా సామ్రాజ్యవాదం పరదేశ స్వాధీనానికి, యితోధిక జాతీయ పీడనకూ, తత్ఫలితంగా, పెరుగుతున్న ప్రతిఘటనకూ దారితీస్తున్నది. రాజకీయ ప్రగతి వ్యతిరేకతను సామ్రాజ్యవాదం తీవ్రం చేయడాన్ని కౌట్స్కీ ఆక్షేపిస్తూ, మరీ అత్యవసరమైన ఒక విష యాన్ని స్పృశించకుండా వదలివేసినాడు, సామ్రాజ్యవాద యుగంలో అవకాశవాదులతో ఐక్యత అసాధ్యం అనే విషయాన్ని. పరదేశ స్వాధీనాలను ఆక్షేపిస్తూ అతను తన ఆక్షేపణలను అవ కాశవాదులకు అత్యంత ఆమోదయోగ్యమైన, అత్యంత బాధారహితమైన రూపంలో వెల్ల డిస్తాడు. అతను జర్మన్ శ్రోతలను ఉద్దేశించి మాట్లాడుతాడు, కానీ అత్యంత సమకాలిక మైన, అత్యంత ముఖ్యమైన అంశాన్ని, ఉదాహరణకు జర్మనీ ఆల్సేస్–లొరెయిన్‌లను స్వాధీనం చేసుకోవడాన్ని మరుగుపరుస్తాడు. కౌట్స్కీయొక్క యీ "చిత్తచాంచల్యాన్ని" అంచనా వేయడానికి కింది ఉదాహరణ తీసుకుందాం. ఒక జపాన్‌వాడు ఫిలిప్పైన్స్ దీవు లను అమెరికనులు స్వాధీనపరచుకోవడాన్ని ఖండిస్తున్నా డనుకుందాం. అతనికి పరదేశ స్వాధీ నాలు అంటేనే అసహ్యం గనుక అలా ఖండిస్తున్నాడనీ, ఫిలిప్పైన్స్ దీవులను స్వాధీనపరచు కోవాలని తనకే కోరిక వుండడంవల్ల కాదనీ యెంతమంది నమ్ముతారు? జపాన్‌యొక్క కొరియా స్వాధీనానికి వ్యతిరేకంగా అతను పోరాడితే, జపాన్‌నుండి విడిపోడానికి కొరియాకు స్వేచ్ఛ వుండాలని అతను ఉద్బోధిస్తే, అప్పుడు మాత్రమే అతను పరదేశ స్వాధీనాలకు వ్యతిరేకంగా చేసే "పోరాటం" మనస్ఫూర్తిగా, రాజకీయ నిజాయితీ కలదిగా వుంటుంది, అనే విషయాన్ని మనం ఒప్పుకోక తప్పదు.

---

* "ఫైనాన్స్ పెట్టుబడి," పేజి 487.

సామ్రాజ్యవాదంమీద కౌట్స్కీ చేసిన పరిశీలనలోనూ, ఆర్థిక రాజకీయ విమర్శలోనూ అణువణువునా రెండు విషయాలు వ్యాపించి వున్నాయి. యేమంటే, సామ్రాజ్యవాదంలోని మౌలిక వైరుధ్యాలను మరుగుపరిచి మభ్యపెట్టే తత్వమూ — యిది మార్క్సిజంతో బొత్తిగా పొసగని తత్వం; మరొకటి, యూరపియన్ కార్మికోద్యమానికి అవకాశవాదంతో గల ఐక్యతను, కూలిపోతున్నదాన్ని, యెంత కష్టమైనా నిలబెట్టాలనే ప్రయత్నమూ.

# 10. చరిత్రలో సామ్రాజ్యవాదపు స్థానం

సామ్రాజ్యవాదం దాని ఆర్థిక సారంలో గుత్త పెట్టుబడిదారీ విధానం అని గమనించినాము. యిదే చరిత్రలో దాని స్థానాన్ని నిర్ణయిస్తుంది; యెందుకంటే, స్వేచ్ఛాయుత పోటీ అనే నేలనుండి, సరిగ్గా స్వేచ్ఛాయుత పోటీనుండి పుట్టి పెరిగే గుత్తాధిపత్యం పెట్టుబడిదారీ విధానంనుండి మరింత ఉన్నత సాంఘిక, ఆర్థిక వ్యవస్థకు జరిగే పరివర్తన. మనం పరీక్షిస్తున్న యుగానికి విలక్షణంగా వున్న నాలుగు ప్రధాన రకాల గుత్తాధిపత్యాన్ని, లేదా గుత్త పెట్టుబడిదారీ విధానపు నాలుగు ప్రధాన వ్యక్తీకరణలను మనం ప్రత్యేకంగా నొక్కి చెప్పాలి.

మొదటిది, చాలా ఉన్నత దశలో ఉత్పత్తియొక్క సాంద్రీకరణనుండి గుత్తాధిపత్యం ఉద్భవించింది. యిది గుత్త పెట్టుబడిదారీ సంఘాలకు — కార్టెళ్లకూ, సిండికేట్లకూ, ట్రస్టులకూ — సంబంధించినది. యీనాటి ఆర్థిక జీవితంలో యివి వహించే ముఖ్య పాత్రను మనం గమనించినాము. 20వ శతాబ్ది ప్రారంభంలో గుత్తసంస్థలు పురోగామి దేశాలలో సంపూర్ణ ఆధిక్యం సంపాయించుకొన్నాయి; పెద్ద టారిఫ్‌ల రక్షణ పొందిన దేశాలు (జర్మనీ, అమెరికా) కార్టెళ్ల నిర్మాణంవైపు మొదటి అడుగులు వేసినప్పటికీ, స్వేచ్ఛాయుత వర్తక వ్యవస్థ గల గ్రేట్ బ్రిటన్, కొంచెం ఆలస్యంగానే అయినా, అదే మౌలిక విషయాన్ని నిరూపించింది — ఉత్పత్తి సాంద్రీకరణనుండి గుత్తాధిపత్యం పుట్టడం అనే విషయాన్ని.

రెండవది, గుత్తసంస్థలు ముడిసరుకుల అత్యంత ముఖ్య నిధులను, ముఖ్యంగా పెట్టుబడిదారీ సమాజంలోని కీలకమైన, అత్యంత గుత్త రూపం ధరించిన బొగ్గు, యినుము పరిశ్రమలకు అవసరమైన వాటిని, వశపరచుకోవడానికి దారితీసినాయి. ముడిసరుకుల అత్యంత ముఖ్యమైన నిధులమీద గుత్తాధిపత్యం బడా పెట్టుబడి శక్తిని అపారంగా పెంచి, గుత్త పరిశ్రమలకూ, గుత్తేతర పరిశ్రమలకూ మధ్య వైరుధ్యాన్ని తీవ్రతరం చేసింది.

మూడవది, గుత్తాధిపత్యం బాంకులనుండి ఉద్భవించింది. బాంకులు చిన్న దళారి

సంస్థలనుండి ఫైనాన్స్ పెట్టుబడి గుత్తాధిపతులుగా అభివృద్ధి చెందినాయి. అగ్ర పెట్టుబడిదారీ దేశాలలో ప్రతిదానిలోనూ మూడో, నాలుగో, అయిదో అతి పెద్ద బాంకులు పారిశ్రామిక పెట్టుబడికీ, బాంకి పెట్టుబడికీ మధ్య "వ్యక్తిగత సమ్మేళనాన్ని" సాధించి, మొత్తం దేశాల పెట్టుబడిలోనూ, ఆదాయంలోనూ అధిక భాగంగా వుండే వందలు వందల కోట్ల డబ్బుమీద అజమాయిషీని తమ చేతుల్లో సాంద్రీకరించుకున్నాయి. మినహాయింపు లేకుండా యీనాటి బూర్జువా సమాజంలోని ఆర్థిక, రాజకీయ సంస్థ లన్నిటిమీదా పరాధీనతా సంబంధాల దట్టమైన వలను పరిచే ఫైనాన్షల్ ప్రభుమండలి — యీ గుత్తాధిపత్యంయొక్క మిక్కిలి కొట్టవచ్చినట్టు కనపడే వ్యక్తీకరణ యిది.

నాల్గవది, గుత్తాధిపత్యం వలస విధానంనుండి పెరిగింది. వలస విధానపు అనేక "పాత" ప్రేరకాలకు ఫైనాన్స్ పెట్టుబడి మరొకటి కలిపింది — ముడిసరుకుల నిధులకొరకూ, పెట్టుబడి యెగుమతికొరకూ, "పలుకుబడి ప్రాంతాల"కొరకూ, అనగా లాభదాయకమైన వ్యాపారాల, కంట్రాక్టులు, గుత్త లాభాలు వగైరాలకొరకు, దరహంమీద ఆర్థిక భూభాగంకొరకు, పోరాటం. ఉదాహరణకు, యూరపియన్ రాజ్యాల వలసలు ఆఫ్రికా భూభాగంలో పదింట ఒక వంతుగా మాత్రమే (1876లో లాగ) వుండినప్పుడు, వలస విధానం గుత్త పద్ధతులకంటె యితరమైన పద్ధతులలో అభివృద్ధి కాగలిగింది — భూభాగాలను "స్వేచ్ఛగా లాక్కోవడం" ద్వారా అనవచ్చు. కానీ, ఆఫ్రికాలో పదింట తొమ్మిది వంతులు లాక్కోబడినప్పుడు (1900 నాటికి), ప్రపంచ మంతా పంపకమైనప్పుడు, అనివార్యంగా వలసల గుత్త యాజమాన్య యుగం, తత్పర్యవసానంగా, ప్రపంచపు పంపకంకొరకూ, పునఃపంపకంకొరకూ మరీ తీవ్రమైన పోరాటపు యుగం, ప్రవేశించింది.

పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలను గుత్త పెట్టుబడి యేమేరకు తీవ్రపరిచిందీ అందరికీ తెలుసు. ఉన్నత జీవన వ్యయాన్నీ, కార్టెళ్ల క్రూర ప్రభుత్వాన్నీ ప్రస్తావిస్తే చాలు. ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడియొక్క అంతిమ విజయం జరిగినప్పటినుండి ప్రారంభమైన చారిత్రక పరివర్తన దశకు అత్యంత శక్తివంతమైన చోదక శక్తిగా వుంది యీ వైరుధ్యాల తీవ్రీకరణ.

గుత్తసంస్థలూ, ప్రభుమండలీ, స్వేచ్ఛకొరకు కాక పెత్తనంకొరకు పాటుపడడమూ, కొద్దిపాటి అత్యంత ధనిక, లేదా అత్యంత శక్తివంతమైన జాతులు అంతకంతకూ యెక్కువ చిన్న, లేదా బలహీన జాతులను దోచుకోవడమూ — యివన్నీ సామ్రాజ్యవాదంయొక్క యెలాంటి విలక్షణ గుణాలను ఉత్పన్నం చేసినాయంటే, సామ్రాజ్యవాదాన్ని పరభాగ్యోపజీవన పెట్టుబడిదారీ విధానంగా, లేదా క్షీణమాన పెట్టుబడిదారీ విధానంగా వర్ణించేటట్లు మనల్ని అవి నిర్బంధిస్తాయి. అంతకంతకూ యెక్కువ ప్రమాణంలో బూర్జువావర్గం

పెట్టుబడి యెగుమతుల ఆదాయాలమీదా, "కూపన్లు చించడం" ద్వారానూ జీవించే "వడ్డీజీవుల రాజ్యం" సృష్టి సామ్రాజ్యవాద ధోరణులలో ఒకటిగా అంతకంతకూ ప్రముఖంగా బయటికి వస్తుంది. యీ క్షీణించే ధోరణి పెట్టుబడిదారీ విధానపు సత్వర వృద్ధిని అసాధ్యం చేస్తుందని నమ్మడం పొరపాటు. అది అసాధ్యం చేయదు. సామ్రాజ్యవాద యుగంలో, కొన్ని పరిశ్రమలూ, బూర్జువావర్గంలో కొన్ని పొరలూ, కొన్ని దేశాలూ, యెక్కువగానో తక్కువగానో, యీ ధోరణులలో ఒకసారి ఒకదాన్నీ, మరొకసారి మరొకదాన్నీ వ్యక్తపరుస్తాయి. మొత్తంమీద పెట్టుబడిదారీ విధానం మునుపటికంటె యెంతో వేగంగా పెరుగుతున్నది; కానీ, యీ పెరుగుదల దరహంమీద అంతకంతకూ అసమంగా కావడమే కాక, దీని అసమత్వం కూడా, ప్రత్యేకంగా, పెట్టుబడిలో అత్యంత ధనికమైన దేశాల (బ్రిటన్) క్షీణతలో వ్యక్తమౌతుంది.

జర్మనీ అర్థికాభివృద్ధి వేగం గురించి, పెద్ద జర్మన్ బాంకులమీద పుస్తకం రాసిన రీసర్ యిలా అన్నాడు: "గడచిపోయిన దశ (1848–1870)యొక్క పురోగతి మందంగా లేదు; ఆ పురోగతికీ, యీ దశ (1870–1905)లో మొత్తం జర్మనీ ఆర్థిక వ్యవస్థా, దానితోపాటు జర్మన్ బాంకింగూ పురోగమించిన వేగానికీ యెలాంటి పోలిక వుందంటే, పాత కాలపు మెయిల్ బండి వేగానికీ, యీనాటి మోటారు బండి వేగానికీ గల పోలిక లాంటిదే.... మోటారు బండి బుయ్‌మని యెంత వేగంగా దూసుకపోతుందంటే, దాని దారి కడ్డం వున్న అమాయక బాటసారులకే కాక, దానిలో కూర్చున్నవాళ్లకు కూడా అది ప్రమాదం కలిగిస్తుంది." అంత అసాధారణ వేగంతో పెరిగిన ఫైనాన్స్ పెట్టుబడి, దాని వంతుకు, సరిగ్గా అది అంత వేగంగా పెరిగిన కారణంచేత, ధనిక దేశాలనుండి – శాంతియుత పద్ధతుల ద్వారా మాత్రమే కాదు – గుంజుకోవలసిన వలసలమీద మరింత "ప్రశాంత" యాజమాన్యానికి వెళ్లేందుకు అయిష్టంగా లేదు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో గత దశాబ్దాలలోని అర్థికాభివృద్ధి జర్మనీలో కంటె వేగంగా వుండింది; యీ కారణంవల్లనే ఆధునిక పెట్టుబడిదారీ విధానపు పరభాగ్యోప జీవన లక్షణాలు మరీ ప్రముఖంగా కనపడుతున్నాయి. మరొకవైపున, రిపబ్లికన్ అమెరికన్ బూర్జువావర్గాన్ని రాజరికవాద జపాన్ బూర్జువావర్గంతో గానీ, జర్మన్ బూర్జువావర్గంతో గానీ పోలిస్తే, అత్యంత ప్రముఖమైన రాజకీయ విభేదం సామ్రాజ్యవాద యుగంలో చాలావరకు తగ్గిపోతుందని తెలుస్తుంది – యెందుకు తగ్గిపోతుందంటే, అది దరహంమీద అముఖ్యమైనందువల్ల కాదు, యీ సందర్భాలన్నిటిలోనూ నిశ్చితమైన పరభాగ్యోప జీవన లక్షణాల గురించి మనం మాట్లాడుతున్నాము గనుక.

అనేక పరిశ్రమలలోని ఒక పరిశ్రమలో, లేక అనేక దేశాలలోని ఒక దేశంలో, పెట్టుబడిదార్లకు పెద్ద గుత్త లాభాలు రావడంవలన, వాళ్లు కార్మికులలో కొన్ని భాగాలకు,

కొంత కాలంపాటు వాళ్లలో గణనీయమైన మైనారిటీకి, లంచం యివ్వడానికీ, యితర పరిశ్రమలన్నిటికీ, లేక యితర దేశాలన్నిటికీ వ్యతిరేకంగా ఆ పరిశ్రమలోని, లేక ఆ దేశంలోని బూర్జువావర్గంవైపుకు వాళ్లను తిప్పుకోడానికీ ఆర్థికంగా సాధ్య మౌతుంది. ప్రపంచ పంపకంకొరకు సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రమవుతున్న వైరుధ్యం యీ ప్రేరణను యెక్కువ చేస్తుంది. కనుక సామ్రాజ్యవాదానికీ అవకాశవాదానికీ మధ్య సంబంధం కుదురుకు సాధ్యపడుతుంది. ఇతర దేశాలకంటే ముందుగా సామ్రాజ్యవాద అభివృద్ధి లక్షణాలు కొన్ని ఇంగ్లండులో ప్రస్ఫుటమయినందువల్ల ఈ సంబంధాలు ఇంగ్లండులో మొదట స్పష్టంగా వ్యక్తమయినాయి. సామ్రాజ్యవాదానికీ, కార్మికవర్గ ఉద్యమంలోని అవకాశవాదానికీ గల సంబంధాన్ని — ప్రస్తుత కాలంలో మరీ మిరుమిట్లు గొలిపే వాస్తవాన్ని — కొంతమంది రచయితలు, ఉదాహరణకు ఎల్. మార్తొవ్, తృణీకరించడానికి అభిముఖంగా వున్నారు; వాళ్లు (కౌట్స్కీ, హ్యుస్మన్స్‌ల లాగా) యీకింది దాని లాంటి "అధికారిక ఆశావాదానికి" దిగజారి, అలా వాదిస్తున్నారు: అవకాశవాదం పెరుగుదలకు దారితీసింది ప్రగతిశీల పెట్టుబడిదారీ విధానం అయివుంటే, లేదా అవకాశవాదానికి మొగ్గు చూపించేది అత్యుత్తమ జీతాలు గల కార్మికులు అయివుంటే, వగైరా, పెట్టుబడిదారీ విధానం శత్రువుల పని నిరర్థక మౌతుంది. యీ రకం "ఆశావాదం" గురించి మనకు యే భ్రమలూ వుండకూడదు. యిది అవకాశవాదం విషయంలో ఆశావాదం; యిది అవకాశవాదాన్ని మూసిపెట్టడానికి పనికివచ్చే ఆశావాదం. వాస్తవంలో, అవకాశవాద అభివృద్ధియొక్క అసాధారణ వేగమూ, మరీ అసహ్యమైన స్వభావమూ దాని విజయం చిరస్థాయిగా వుంటుందని యేవిధంగానూ హామీ యివ్వవు: ఆరోగ్యవంతమైన శరీరంమీద బాధాకరమైన పుండు వేగంగా పెరగడం అది మరింత త్వరగా పగలడానికీ, శరీరంనుండి దాన్ని తొలగించడానికీ మాత్రమే కారణం కాగలదు. యీ విషయంలో అందరికంటె ప్రమాదకరమైనవాళ్లు యెవరంటే, సామ్రాజ్యవాదంమీద పోరాటం, అది అవకాశవాదంమీద పోరాటంతో విడదీయరాకుండా కలిస్తే తప్ప, బూటకమూ, మోసమూ అని అర్థం చేసుకోగోరనివాళ్లు.

సామ్రాజ్యవాదపు ఆర్థిక సారంమీద యీ గ్రంథంలో చెప్పినదాన్నంతటినీ బట్టి యేర్పడే దేమిటంటే: దానిని మనం పరివర్తనలోని పెట్టుబడిదారీ విధానంగా నిర్వచించాలి, లేదా, మరింత కచ్చితంగా, మరణోన్ముఖమైన పెట్టుబడిదారీ విధానంగా నిర్వచించాలి. బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు ఆధునిక పెట్టుబడిదారీ విధానాన్ని వర్ణించడంలో "పరస్పరం పెనవేసుకోవడం," "ఏకాకితనం లేకపోవడం," బాంకులు "వాటి పనులకూ, అభివృద్ధి గతినిబట్టి కేవలం సొంత వ్యాపార సంస్థలు కాదు, అవి అంతకంతకూ యెక్కువగా కేవల సొంత వ్యాపార నియంత్రణను మీరి పెరుగుతున్నాయి" వగైరా పడికట్టు మాటలూ, నుడి

కారాలూ ఉపయోగిస్తారని గమనించడం యీ సందర్భంలో చాలా జ్ఞానదాయకంగా వుంటుంది. పై మాటలను చెప్పిన రీసరే మహా గంభీరంగా "సామాజికీకరణ" గురించి మార్క్సిస్టుల "జోస్యం" "నిజం కాలేదు" అని ప్రకటిస్తాడు!

మరి, "పరస్పరం పెనవేసుకోవడం" అనే యీ పడికట్టు మాట అర్థం ఏమిటి? అది మన కండ్లముందు జరిగే క్రమంయొక్క అత్యంత ప్రముఖమైన లక్షణాన్ని మాత్రం వ్యక్తంచేస్తుంది. పరిశీలకుడు విడివిడి చెట్లను లెక్కపెట్టుతాడు గానీ, వనాన్ని చూడజాలడని అది తెలుపుతుంది. అది పైపైదాన్నీ, యాదృచ్ఛికమైనదాన్నీ, అల్లకల్లోలంగా వున్నదాన్నీ బానిసబుద్ధితో కాపీచేస్తుంది. పరిశీలకుడు ముడిపదార్థ సమూహంలో తలమునకలై, దాని అర్థాన్నీ, ప్రాముఖ్యాన్నీ బొత్తిగా గ్రహించ జాలకున్నాడని అది వెల్లడిస్తుంది. షేర్ల మీద యాజమాన్యం, సొంత ఆస్తి యజమానుల మధ్య సంబంధాలు, "కాకతాళీయంగా పరస్పరం పెనవేసుకుంటున్నాయి." కానీ యీ పరస్పరం పెనవేసుకోవడంలో అడుగు మట్టమే – మారుతున్న ఉత్పత్తియొక్క సామాజిక సంబంధాలు. ఒక పెద్ద వ్యాపారసంస్థ బ్రహ్మాండమైన పరిమాణాలు అందుకున్నప్పుడు, సామూహిక సమాచారాన్ని కచ్చితంగా లెక్కాచారం వేసి, దాని ఆధారంమీద, కోట్లమంది ప్రజలకు అవసరమైనదానిలో మూడింట రెండు వంతులమేరకు గానీ, నాలుగింట మూడు వంతులమేరకు గానీ ప్రాథమిక ముడిపదార్థాల సరఫరాను పథకం ప్రకారం యేర్పాటుచేసినప్పుడు; ముడిపదార్థాలు అత్యంత అనుకూలమైన ఉత్పత్తి స్థలాలకు, ఒకోసారి ఒకదానినుండి మరొకటి వందల, వేల మైళ్ల దూరాన వున్నట్టివాటికి, క్రమపద్ధతిగా, నియమబద్ధమైన పద్ధతిలో రవాణా చేయబడినప్పుడు; రకరకాల చరమ వస్తువుల ఉత్పత్తిదాకా సరుకులమీద చేసే పనిలో వరుసగా అన్ని దశల మీదా ఒకేఒక కేంద్రం దర్శకత్వం వహించినప్పుడు; యీ చరమ వస్తువులు ఒకేఒక పథకం ప్రకారం కోటానుకోట్లమంది వినియోగదారుల మధ్య పంపకమైనప్పుడు (అమెరికన్ నూనె ట్రస్టు అమెరికాలోనూ, జర్మనీలోనూ కిరసనాయిలు అమ్మడం) – అప్పుడు తెల్లమౌతుంది, "పరస్పర బంధం" కాక, ఉత్పత్తి సామాజికీకరణ జరిగిందనీ; సొంత ఆర్థిక సంబంధాలూ, సొంత ఆస్తి సంబంధాలూ అనే పైపెంకు యిప్పుడిక దానిలోపలి వస్తువుకు తగినట్లు లేదనీ, అది అనివార్యంగా క్షీణించక తప్పదనీ, దాని తొలగింపును కృత్రిమంగా ఆలస్యంచేస్తే (కీడులోకెల్ల కీడు సంభవించి, అవకాశవాదపు పుండు చికిత్స చాలా కాలం సాగితే) ఆ పెంకు దీర్ఘ కాలం క్షీణ స్థితిలో నిలిచివుండవచ్చుననీ, కానీ అనివార్యంగా తొలగింపబడుతుందనీ.

జర్మన్ సామ్రాజ్యవాదాన్ని ఉత్సాహంగా మెచ్చుకొనే షుల్జె-గేవెర్నిట్జ్ యిలా అంటాడు:

"జర్మన్ బాంకుల అత్యున్నత నిర్వహణ డజన్‌మంది చేతుల్లోకి ఒకసారి అప్పగించ

బడితే, వాటి కార్యకలాపాలు యీనాడు కూడా మంత్రులలో ఎక్కువమంది కార్యకలాపాల కంటె ప్రజా శ్రేయస్సుకు అనుగుణంగా వున్నాయి...." (బాంకర్ల, మంత్రుల, పారిశ్రామిక ప్రభువుల, వడ్డీజీవుల "పరస్పరం పెనవేసుకోవడం" యిక్కడ అనుకూలంగా విస్మరించబడింది....) "మనం గమనించిన ఆ ధోరణులు వాటి తార్కిక పర్యవసానందాకా అభివృద్ధి చేయబడినట్లు మనం ఊహిస్తే, యివి యేర్పడుతాయి: జాతియొక్క డబ్బు పెట్టుబడి బాంకులలో ఐక్యం కావడం; ఆ బాంకులే కార్టెళ్లుగా సమ్మేళనం కావడం; జాతియొక్క పెట్టుబడి పెట్టబడిన మూలధనం సెక్యూరిటీల రూపంలో వుండడం. అప్పుడు ఆ మహా మేధావి సెంట్ సైమన్ జోస్యం ఫలిస్తుంది: 'ఏకరూప నియంత్రణ లేకుండా అభివృద్ధి అవుతున్న ఆర్థిక సంబంధాలకు అనుగుణంగా వున్న ప్రస్తుత ఉత్పత్తి అరాజకత్వం పోయి, ఉత్పత్తిలో సంఘటన రావాలి. ఒకరి కొకరి సంబంధంలేని, మానవుని ఆర్థికావసరాలు తెలియని, ఒంటరి ఉత్పత్తిదార్లు యిక యెంత మాత్రమూ ఉత్పత్తికి దర్శకత్వం వహించరు; ఆ పని ఒక పౌరసంస్థ చేస్తుంది. ఒక కేంద్ర నిర్వహణ కమిటీ, సామాజిక ఆర్థిక వ్యవస్థ అనే విశాలరంగాన్ని మరింత యెత్తునుండి పరిశీలించగలిగి, ఉత్పత్తిని మొత్తం సమాజ ప్రయోజనంకొరకు నియంత్రణ చేస్తుంది, ఉత్పత్తి సాధనాలను తగిన చేతుల్లో పెడుతుంది, అన్నిటినీ మించి, ఉత్పత్తికీ, వినియోగానికీ మధ్య నిత్య సామరస్యం వుండేటట్లు జాగ్రత్త వహిస్తుంది. ఆర్థిక శ్రమయొక్క ఒకానొక యేర్పాటును తమ పనులలో భాగంగా అవలంబించిన సంస్థలు యిప్పటికే వున్నాయి — బాంకులు.' సెంట్ సైమన్ చెప్పిన ఆ జోస్యం ఫలించడానికి మన మింకా చాలా దూరంలో వున్నాము, కానీ మనం దాని దారిలో వున్నాము; అది మార్క్సిజం, మార్క్స్ ఊహించినదానికంటె భిన్నమైనది, కానీ రూపంలో మాత్రమే భిన్నమైనది."*

మార్క్స్‌కు నిజంగా తిరుగులేని "పూర్వపక్షం," మార్క్స్ కచ్చితమైన శాస్త్రీయ పరిశీలననుండి సెంట్ సైమన్ ఊహకు ఒక అడుగు తిరోగమించడం — మహా మేధావి ఊహ, కానీ యెంతైనా ఊహే.

1916 జనవరి — జూన్‌లో
రచింపబడింది

---

* *Grundriß der Sozialökonomik*, S. 146.

# "సామ్రాజ్యవాద ఆర్థికవాదపు" ఆవిర్భవిస్తున్న ధోరణి[153]

1894–1902 నాటి పాత ఆర్థికవాదం యిలా వాదించింది: నరోద్నిక్కులు పూర్వపక్షం చెయ్యబడ్డారు; రష్యాలో పెట్టుబడిదారీ విధానం విజయవంతమైంది. పర్యవసానంగా, రాజకీయ విప్లవమనే ప్రశ్నే ఉత్పన్నం కాజాలదు. ఆచరణలో దీని నిర్ధారణ: "ఆర్థిక పోరాటాన్ని కార్మికులకీ, రాజకీయ పోరాటాన్ని ఉదారవాదులకీ వదలడం" – అంటే మితవాదం దిశగా పిల్లిమొగ్గ. లేక, రాజకీయ విప్లవానికి బదులు, సోషలిస్టు విప్లవంకోసం సార్వత్రిక సమ్మె – అంటే వామపక్షం దిశగా ఆ పిల్లిమొగ్గ 1890వ దశకపు చివరి సంవత్సరాల్లో ఒక ఆర్థికవాది రచించిన – ప్రస్తుతం విస్మరింపబడిన – ఓ చిన్న పుస్తకంలో సమర్థింపబడింది.[154]

ఇప్పుడొక కొత్త ఆర్థికవాదం ఆవిర్భవిస్తోంది. దాని వాదన కూడా యిలాగే యీ రెండు పిల్లిమొగ్గలమీదా ఆధారపడివుంది: "మితవాదపు" పిల్లిమొగ్గ – "స్వయంనిర్ణయ హక్కు"కి (అంటే, పీడిత ప్రజల అణచివేతకి వ్యతిరేకంగా జరిగే పోరాటానికీ, భూభాగాల కలిపివేతలకి వ్యతిరేకంగా జరిగే పోరాటానికీ) అంటే, దేన్ని గురించి అయితే పూర్తిగా ఆలోచించలేదో, లేక సుస్పష్టంగా పేర్కొనబడలేదో దానికి మేము వ్యతిరేకం. "వామపక్ష"పు దిశగా పిల్లిమొగ్గ – సోషలిస్టు విప్లవానికి భిన్నంగా ఒక కనీస కార్యక్రమానికి (అంటే, సంస్కరణలకోసం, ప్రజాస్వామ్యంకోసం జరిగే పోరాటానికి) మేము వ్యతిరేకం.

1915 వసంతకాలంలో బెర్న్‌లో జరిగిన కాన్ఫరెన్సులోనే కొందరు కామ్రేడ్సు ఆవిర్భవిస్తున్న యీ ధోరణిని కనిపెట్టారు. అంటే యిది మొదలై అప్పుడే ఏడాదికిపైగా అయిందన్నమాట. అదృష్టకరమైన విషయం యేమిటంటే, అప్పట్లో ఒక్క కామ్రేడు మాత్రమే యీ "సామ్రాజ్యవాద ఆర్థికవాద" భావాలను కాన్ఫరెన్సు చివరిదాకా పట్టుకు వేలాడి – ఈయనకి సార్వత్రికంగా వ్యతిరేకత వ్యక్తమైంది – రాతపూర్వకంగా వాటిని ప్రత్యేక "ప్రధానాంశాలు"గా సూత్రీకరించాడు. ఆ ప్రధానాంశాలతో యే ఒక్కరూ ఏకీభవించలేదు.[155]

దరిమిలా మరో యిద్దరు కామ్రేడ్సు ఆ కామ్రేడు ప్రధానాంశాలతో (యీ సమస్య పైన పేర్కొనబడిన "ప్రధానాంశాల" సాధారణ సంధాతో విడదీయరాని విధంగా ముడి వడి వుందన్న విషయం అర్థంచేసుకోలేదు గనుక) ఏకీభవించారు. అయితే, 1916 ఫిబ్రవరిలో "అంతర్జాతీయ సోషలిస్టు కమిటీ బులెటిన్" సంచిక 3లో "డచ్చి కార్యక్రమం" ప్రచురింపబడిన[156] వెంటనే అది యీ "అభిప్రాయభేదాన్ని" తెచ్చిపెట్టింది. దానితో, మొదటి ప్రధానాంశాల రచయిత తన "సామ్రాజ్యవాద ఆర్థికవాదాన్ని" – యీసారి కూడా, "విడి" సమస్యకు అన్వయించడానికే కేవలం పరిమితంగాకుండా – పునర్నిర్వచించక తప్పనిసరి పరిస్థితిలో పడ్డాడు.

ఈ వ్యవహారంతో సంబంధమున్న కామ్రేడ్సును, మీరొక ఊబిలో దిగబడ్డారనీ, మీ భావాలకు మార్క్సిజంతో గాని, విప్లవకర సోషల్ డెమోక్రసీతో గాని బొత్తిగా పొందూ పోలికా లేదనీ మళ్లీమళ్లీ హెచ్చరించడం పరమావసరం. ఈ వ్యవహారాన్ని యిక ఎంత మాత్రమూ మనం తొక్కిపట్టి వుంచకూడదు: అలా చేసినట్లయితే అది సైద్ధాంతిక గందరగోళాన్ని ప్రోత్సహించి, దాని సత్యాన్ని కప్పిపుచ్చడానికి సంబంధించిన పరమ హీనమైన మార్గంలోకీ, "వ్యక్తిగత" వైరుధ్యాల్లోకీ, ఎడతెగని "ఘర్షణ" వగైరాల్లోకీ నడపడమే అవుతుంది. ఇందుకు భిన్నంగా, చర్చల్లోకి వచ్చిన సమస్యలను గురించి కూలంకషంగా ఆలోచించడం, విశ్లేషించడం తప్పనిసరి అవసరం అన్న విషయాన్ని మిక్కిలి నిర్దిష్టంగానూ, నిర్ద్వంద్వంగానూ నొక్కిచెప్పడం మన విధి.

స్వయంనిర్ణయ హక్కును గురించిన తన ప్రధానాంశాల్లో ("Vorbote"[157] 2వ సంచికనుంచి జర్మన్ భాషలో పునర్ముద్రింపబడ్డాయి) "సోత్సియాల్ డెమోక్రట్" సంపాదకవర్గం ఉద్దేశపూర్వకంగా, యీ విషయాన్ని వస్తుపరంగా, అయితే, మిక్కిలి విపులంగా, స్వయంనిర్ణయ హక్కుకీ, సంస్కరణలకోసమూ, ప్రజాస్వామ్యంకోసమూ జరిగే పోరాటం, రాజకీయ పార్శ్వాన్ని అలక్ష్యం చెయ్యరాదన్న విషయాన్నీ, వగైరాలకి సంబంధించిన సాధారణ సమస్యకీ మధ్య సంబంధాన్ని ప్రత్యేకించి నొక్కిచెబుతూ, పత్రికలో ప్రస్తావించింది. సంపాదకవర్గపు ప్రధానాంశాలమీద తన వ్యాఖ్యల్లో, మొదటి ప్రధానాంశాల ("సామ్రాజ్యవాద ఆర్థికవాదం") రచయిత డచ్చి కార్యక్రమంతో సంఘీభావం ప్రకటించి, తద్వారా, స్వయంనిర్ణయ సమస్య అన్నది ఆవిర్భవిస్తున్న ధోరణి వ్యాఖ్యాతలు వాదిస్తున్నట్లు "ప్రత్యేకమైనది" ఎంతమాత్రం కాదనీ, సాధారణమూ, మౌలికమూ అయినదనీ స్పష్టంచేశాడు.

1916 ఫిబ్రవరి 5–8 తేదీలలో బెర్న్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కమిటీ సమావేశంలో[158] డచ్చి కర్యక్రమం త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్షీయుల[159] ముందు ఉంచబడింది. త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష గ్రూపులోని ఏ ఒక్క సభ్యుడూ కూడా, చివరకు రాడెక్ కూడా,

ఆ కార్యక్రమానికి అనుకూలంగా మాట్లాడలేదు. "బాంకుల అస్తిహరణం," "సుంకాల రద్దు" "ప్రథమ సెనేట్ సభ రద్దు" వగైరా అంశాలను విచక్షణా రహితంగా ఆ కార్యక్రమం కలగాపులగం చెయ్యడమే యిందుకు కారణం. త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్షీయులు ఏకగ్రీవంగా, దాదాపు ఏ వ్యాఖ్యానమూ లేకుండా, నిజానికి కేవలం భుజాలు ఎగరేసి, స్పష్టంగానూ, పూర్తిగానూ తగనిదని ఆ డచ్చి కార్యక్రమాన్ని తోసిపుచ్చారు.

1915 వసంతకాలంలో రచింపబడిన మొదటి ప్రధానాంశాల రచయితకి యీ కార్యక్రమం ఎంతగా నచ్చిందంటే, అతను యిలా ప్రకటించాడు: "సారభూతంగా, నేను చెప్పింది కూడా యింతే" (1915 వసంతకాలంలో), "డచ్చివాళ్లకి యిలా తోచింది": "వాళ్ల దృష్టిలో ఆర్థిక పార్శ్వం యేమిటంటే, బాంకుల, భారీ ఉత్పాదక సంస్థల" (పరిశ్రమల) "అస్తిహరణం, రాజకీయ పార్శ్వం యేమిటంటే, రిపబ్లిక్ వగైరాలు. పూర్తిగా రైటు!"

అయితే వాస్తవం యేమిటంటే, డచ్చివాళ్లకి "తోచ"లేదు. సరికదా, **అనాలోచితమైన** కార్యక్రమాన్ని సమర్పించారు. రష్యా దౌర్భాగ్యం ఏమిటంటే, మనలో **కొందరు** యీ సరికొత్త కార్యక్రమంలో సరిగ్గా ఏదైతే పర్యాలోచించబడలేదో సరిగ్గా దాన్నే గ్రహిస్తున్నారు....

1915 ప్రధానాంశాల రచయిత "తామే" క్లాజు 8లో (నిర్దిష్ట కర్తవ్యాలు) "బ్యాంకుల అస్తిహరణం" జరగాలని విజ్ఞప్తిచేసి, ఆ మాటలకు "వెంటనే" అన్న పదాన్ని సైతం (దీనికితోడు "నియంతృత్వ చర్యలు") జోడించిన "సోత్సియాల్ డెమోక్రట్" సంపాదకులు స్వవచో వ్యాఘాత దోషానికి గురయ్యారని భావిస్తున్నాడు. 1915 వసంతకాలంలో బెర్న్ సమావేశంలో జరిగిన చర్చలను గుర్తుచేసుకొని 1915 ప్రధానాంశాల రచయిత కోపంగా "మరి బెర్న్‌లో సరిగ్గా యీ మాట అన్నందుకే కదా నన్ను దుయ్యబట్టారు!" అంటున్నాడు.

ఈకింది "చిన్న" అంశాన్ని అతను మరచిపోతున్నాడు లేక చూడలేకపోతున్నాడు: క్లాజు 8లో "సోత్సియాల్ డెమోక్రట్" సంపాదకులు రెండు సంభావ్యతల మధ్య తేడాని స్పష్టంగా గుర్తించారు: 1. సోషలిస్టు విప్లవం మొదలైంది. అలా అయినప్పుడు, వాళ్లు యిలా అంటారు: "బాంకుల అస్తి తక్షణం హరించడం" వగైరాలు. 2. సోషలిస్టు విప్లవం యింకా మొదలు కాలేదు, అలా అయినప్పుడు, యీ మంచి పనులని గురించి మాట్లాడటాన్ని మనం వాయిదా వేసుకోవాలి.

పైన పేర్కొనబడిన అర్థంలో సోషలిస్టు విప్లవం యింకా మొదలుకాలేదనడం స్పష్టం, డచ్చి కార్యక్రమం అసంబద్ధమైనది. ప్రధానాంశాల రచయిత రాజకీయ డిమాండ్లను ("ప్రథమ సభ రద్దు" వంటి?) "సాంఘిక విప్లవంకోసం రాజకీయ సూత్రంగా" మార్చే తన పాత పొరపాటుకు (అతను ఎప్పుడూ సరిగా యిదే చోట

పప్పులో కాలు వేస్తూవుంటాడులా కనిపిస్తుంది) తిరిగివెళ్లడం ద్వారా వ్యవహారాన్ని "ప్రగాఢం" చేస్తున్నాడు.

ఒక ఏడాది గడవనిచ్చి, ఆ రచయిత తన పాత పొరపాటుకి తిరిగివచ్చాడు. అతని తప్పటడుగులకి "కీలకం" యిదీ: వెనకటి ఆర్థికవాదం పెట్టుబడిదారీ విధానపు ఆగమనాన్ని ప్రజాస్వామ్యంకోసం జరిగే పోరాటంతో ఎలా జోడించలేకపోయిందో, అతను కూడా సరిగ్గా అలాగే సామ్రాజ్యవాద ఆవిర్భావాన్ని సంస్కరణలకోసం, ప్రజాస్వామ్యంకోసం జరిగే పోరాటంతో జోడించడం ఎలాగన్న సమస్యను పరిష్కరించలేకపోయాడు.

అందుకే — సామ్రాజ్యవాదంకింద ప్రజాతంత్ర డిమాండ్ల సాధన "అసాధ్యత" గురించిన పూర్తి గందరగోళం.

అందుకే — రాజకీయ పోరాటాన్ని యిప్పుడు, ప్రస్తుతం, తక్షణం, సర్వథా నిర్లక్ష్యంచెయ్యడం, మార్క్సిస్టు విషయంలో యిది అనుమతం కాదు ("రబోచయ మీస్ల" ఆర్థికవాదికి మాత్రమే యిది అనుమతం).

అందుకే — సామ్రాజ్యవాదపు గుర్తింపునుంచి సామ్రాజ్యవాద సమర్థనకు ఎడతెగకుండా "దిగజారే" నేర్పు (పాతకాలపు ఆర్థికవాదులు పెట్టుబడిదారీ విధానపు గుర్తింపునుంచి పెట్టుబడిదారీ విధానపు సమర్థనకు దిగజారినట్లు).

వగైరా, వగైరాలు.

1915 ప్రధానాంశాల రచయిత స్వయంనిర్ణయ హక్కుమీద "సోత్సియాల్ డెమోక్రట్" ప్రధానాంశాలను వ్యాఖ్యానిస్తూ చేసిన పొరపాట్లను సవివరంగా పరిశీలించడమన్నది దుస్సాధ్యం, ఎందుకంటే, అతను రాసిన ప్రతి ఒక్క పంక్తి తప్పే! ఏదేమైనా, "సామ్రాజ్యవాద ఆర్థికవాద" ప్రతిపాదకులు ఒక పూర్తి సంవత్సరంపాటు కదలమెదలకుండా ఉండిపోయి, రాజకీయ సమస్యలపట్ల, అంటే, "మన విభేదాలు" అని వాళ్ల పిలుస్తున్న, మనం బాగా ఆలోచించిన, తదుపరి చేసిన సుస్పష్టమైన ప్రకటనపట్ల గంభీర వైఖరి తీసుకోవాలని వాళ్లు అనుకొని, తమ ప్రత్యక్ష పార్టీ విధి అయివుండాల్సినదాన్ని పట్టించుకోనప్పుడు, "వ్యాఖ్యలకు" జవాబుగా పుస్తకాలు రాసేందుకు సాధ్యం కాదు.

అందుచేతనే, ఆ రచయిత తన ప్రధానమైన పొరపాటును ఎలా అన్వయిస్తున్నాడు, దానికి అతను ఎలా "చేర్పులు చేస్తున్నాడు" అన్న అంశాల సంక్షిప్త సమీక్షకు నన్ను నేను పరిమితం చేసుకోవలసి వస్తోంది.

నన్ను నేనే ఖండించుకున్నానని అతనికి కనిపిస్తోంది: 1914లో "పశ్చిమ యూరపియన్ సోషలిస్టుల కార్యక్రమాల్లో"* స్వయంనిర్ణయ హక్కుకోసం వెతకడం

* ఈ పుస్తకంలో 75—76వ పేజీలు చూడండి.

అసందర్భ విషయమని నేను రాశాను ("ప్రొస్వేష్చేనియె"లో), కాని 1916లో జాతుల స్వయంనిర్ణయ హక్కు ప్రత్యేకించి తక్షణావశ్యకం అని నేను రాశాను.

ఆ "కార్యక్రమాలు" 1875, 1880, 1891 సంవత్సరాల్లో రచించబడ్డాయన్న విషయం ఆ రచయితకి తట్టలేదు![160]

ఇప్పుడిక మనం అతని అభ్యంతరాలను (జాతుల స్వయంనిర్ణయ హక్కుపై "సోత్సియాల్ డెమోక్రట్" ప్రధానాంశాలకు) వరుసవారీగా పరిశీలిద్దాం.

§1. రాజకీయ సమస్యలను గమనించి ప్రతిపాదించడంలో అదే ఆర్థికవాద నిరాకరణ. రాజకీయ రంగంలో సోషలిజం జాతీయ పీడన రద్దుకి ఆర్థిక ప్రాతిపదికను సృష్టిస్తుందిగనుకనూ, అందుకనే మన రచయిత యీ రంగంలో మన రాజకీయ కర్తవ్యాలను సూత్రీకరించ నిరాకరిస్తాడు! ఇది అసందర్భం!

విజయం సాధించిన శ్రామికవర్గం యితర దేశాల బూర్జువావర్గానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధాల సంభావ్యత లేదనడం లేదు కనుకనూ, అందుచేతనే, జాతీయ పీడన విషయంలో మన రాజకీయ కర్తవ్యాలను సూత్రీకరించేందుకు ఆ రచయిత నిరాకరిస్తాడు!! మార్క్సిజాన్నీ, తర్కాన్నీ పూర్తిగా వ్యతిక్రమించినదానికి, లేక, మీకు నచ్చితే, "సామ్రాజ్యవాద ఆర్థికవాదపు" మౌలికమైన పొరపాట్లతో కూడిన తర్కపు వ్యక్తీకరణలకి యివన్నీ ఉదాహరణలు.

§2. జాతుల స్వయంనిర్ణయ హక్కును వ్యతిరేకించేవాళ్ళు అది "అసాధ్యమైనది" అని చెప్పే సందర్భాల్లో విపరీతమైన గందరగోళంలో వున్నారు.

"సోత్సియాల్ డెమోక్రట్" సంపాదకులు అసాధ్యత అన్నదానికి ఉండగల రెండు భాష్యాలనూ, ఆ రెండు సందర్భాల్లోనూ వున్న పొరపాట్లనూ వాళ్ళకి వివరిస్తారు.

అయినాకూడా, 1915 ప్రధానాంశాల రచయిత, "అసాధ్యత" అన్నదానికి తన వ్యాఖ్యానాన్ని యిచ్చేందుకు ప్రయత్నించనైనా ప్రయత్నించకుండా, అంటే, యిక్కడ రెండు విభిన్న అంశాలు గందరగోళపరచబడ్డాయన్న మన వివరణను ఆమోదించి, ఈ గందరగోళంలోనే కొట్టుమిట్టాడుతున్నాడు!!

అతను సంక్షోభాలను "సామ్రాజ్యవాద" "విధానానికి" ముడిపెడతాడు: సామ్రాజ్యవాదానికి ముందు కూడా సంక్షోభాలు ఉన్నాయన్న విషయాన్ని మన అర్థశాస్త్రవేత్త మరచిపోయాడు!...

జాతుల స్వయంనిర్ణయం ఆర్థికంగా అసాధ్యమైనదని వాదించడం ఆ సమస్యని గందరగోళపరచడమేనని సంపాదకులు వివరించారు. ఆ రచయిత సమాధానం యివ్వడు, జాతుల స్వయంనిర్ణయం ఆర్థికంగా అసాధ్యమైనదని తను పరిగణిస్తున్నట్లు పేర్కోడు.

అతను తన సందిగ్ధ వైఖరిని వదిలేసి, రాజకీయాలకు ("ఎటుతిరిగీ" అసాధ్యమైన) గంతు వేస్తాడు. సామ్రాజ్యవాదంకింద జాతుల స్వయంనిర్ణయం మాదిరిగానే, రాజకీయంగా రిపబ్లిక్ కూడా అంతే "అసాధ్యం" అన్న విషయాన్ని మిక్కిలి సుస్పష్టంగా చెప్పినాకూడా అతను పట్టించుకోడు.

ఇరుకులో పెట్టబడిన ఆ రచయిత మళ్లీ "గంతువేస్తాడు": రిపబ్లిక్కునీ, యావత్తు కనీస కార్యక్రమాన్నీ "సాంఘిక విప్లవానికి రాజకీయ సూత్రం"గా మాత్రమే అతను ఆమోదిస్తాడు!!!

జాతుల స్వయంనిర్ణయపు "ఆర్థిక" అసాధ్యతను సమర్థించేందుకు అతను నిరాకరించి, రాజకీయాల్లోకి గంతువేసి, రాజకీయ అసాధ్యత అన్నది యావత్తు కనీస కార్యక్రమానికీ వర్తిస్తుందని వాదిస్తాడు. దీనిలో కూడా "సామ్రాజ్యవాద ఆర్థికవాద" తర్కమే తప్ప రవ్వంత మార్క్సిజం గాని, రవ్వంత తర్కం గాని లేదు.

పైకి కనిపించకుండా (పర్యాలోచించకుండా సమగ్రమైనదేదీ రూపొందించకుండా, తన కార్యక్రమాన్ని తయారుచేసేందుకు ఎలాంటి ప్రయత్నమూ చెయ్యకుండా) సోషల్ డెమోక్రటిక్ పార్టీ కనీస కార్యక్రమాన్ని తోసెయ్యాలని ఆ రచయిత కోరుతాడు! అందుకని బుద్ధిపూర్వకంగానే ఒక ఏడాదిపాటు కదల మెదలకుండా ఉండటంలో ఆశ్చర్యం లేదు!!

కౌట్స్కీయిజంతో పోరాట సమస్య సైతం ఆధునిక కాలపు సాధారణ, మౌలిక సమస్యే గాని, పాక్షిక సమస్య కాదు: ఆ రచయిత యీ పోరాటాన్ని అర్థం చేసుకోడు. ఆర్థికవాదులు నరోద్నిక్కులకి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని పెట్టుబడిదారీ విధాన సమర్థనగా మార్చినట్లుగానే, యీ రచయిత కౌట్స్కీయిజానికి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని సామ్రాజ్యవాదానికి సమర్థనగా మార్చాడు (యిదే §3కి కూడా వర్తిస్తుంది).

కౌట్స్కీ అనుచరుల పొరపాటు ఏమిటంటే, ఎలాంటి సమయంలో, ఎలాంటి డిమాండ్లను విప్లవాత్మక పద్ధతిలో మాత్రమే ముందుపెట్టాలో అలాంటి డిమాండ్లను సంస్కరణవాద పద్ధతిలో ముందుపెట్టడం (కాని యీ రచయిత, అసలీ డిమాండ్లను ముందుపెట్టడమే వాళ్ల పొరపాటు అన్న వైఖరికి దిగజారుతాడు; ఆర్థికవాదులు నరోదిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని, "నిరంకుశత్వం నశించాలి" అన్న నినాదమే నరోదిజం అన్నట్లు "అర్థంచేసుకున్నారు").

కౌట్స్కీయిజంలో పొరపాటు యేమిటంటే, సరైన ప్రజాతంత్ర డిమాండ్లను భవిష్యత్తులోకీ, సాంఘిక విప్లవంలోకీ కాకుండా, గతంలోకి, శాంతియుత పెట్టుబడిదారీ విధానంలోకి తిప్పడం (అయితే రచయిత, యీ డిమాండ్లను తప్పుగా పరిగణించే వైఖరికి దిగజారుతున్నాడు).

§ 3. పైన చూడండి. రచయిత "సమాఖ్య" సమస్యని కూడా దాటవేస్తున్నాడు. అదే పాత ఆర్థికవాదపు అదే పాత మౌలిక పొరపాటు: రాజకీయ సమస్యలను ముందుకుతేవడంలో అసామర్థ్యం.*

§ 4. "జాతీయ స్వయంనిర్ణయ హక్కు మాతృదేశ రక్షణకు దారితీస్తుంది" అంటూ మొండిగా వల్లిస్తాడు ఆ రచయిత. మాతృదేశ రక్షణ తిరస్కరణను ఒక నమూనాను చెయ్యడం, ఒక నిర్దిష్ట యుద్ధపు నిర్దిష్ట చారిత్రక లక్షణాలనుంచి నిర్ధారణచెయ్యడం కాక, దాన్ని "మొత్తంగా" అన్వయించడమే యిక్కడ అతను చేస్తున్న పొరపాటు. అది మార్క్సిజం కాదు.

ఆ రచయితకి చాలా కాలం క్రితమే చెప్పబడింది — జాతీయ పీడనకి లేక అసమానత్వానికి వ్యతిరేకంగా, అది (ఆ సూత్రం) "మాతృదేశ రక్షణ"ను సహేతుకమైనది కాదనేదిగా వుండేమాదిరి ఒక పోరాట సూత్రాన్ని ఆలోచించి రూపొందించేందుకు ప్రయత్నించమని. అలాంటి సూత్రాన్ని రూపొందించడం అసాధ్యం, ఆ రచయిత దాన్ని సవాలు చెయ్యలేదు.

జాతీయ పీడనకి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని — దీనిలో మాతృదేశ రక్షణ యిమిడి వుందని భాష్యంచెప్పగలిగితే — మేము తిరస్కరిస్తున్నామని దీని అర్థమా?

కాదు, ఎందుకంటే, మేము "మొత్తంగా" "మాతృదేశ రక్షణ"కు వ్యతిరేకులం కాము (మా పార్టీ తీర్మానాలు చూడండి), యీ తప్పుడు తీర్మానాన్ని ప్రస్తుత సామ్రాజ్యవాద యుద్ధానికి మెరుగుపూత పెట్టేందుకు వినియోగించడానికి మాత్రమే మేము వ్యతిరేకం.

ఆ రచయిత "మాతృదేశ రక్షణ" సమస్యను మౌలికంగా తప్పుడు, అచారిత్రక పద్ధతిలో ముందుకు తేవాలని కోరుతున్నాడు (అయితే, అతను అలా చెయ్యలేదు; ఇప్పటికప్పుడే ఒక పూర్తి సంవత్సరంగా అతను యీ వృథా ప్రయత్నం చేస్తున్నాడు...).

"ద్వంద్వవాదం" గురించిన అతని ప్రస్తావన ఏకతావాదానికీ, ద్వంద్వవాదానికీ మధ్య భేదాన్ని అతను అర్థం చేసుకోలేదన్న విషయాన్ని తెలియజేస్తోంది.

నేనొక బూట్ బ్రష్షునీ, ఒక సస్తన జంతువునీ "కలిపితే" అది "ఏకతావాదం" అవుతుందా?

"అ" అన్న గమ్యాన్ని చేరుకునేందుకు

ఇ → అ ← ఆ

---

* ఆ రచయిత యిలా రాస్తాడు: "మాకు విచ్ఛిత్తి అంటే భయంలేదు, జాతీయ సరిహద్దుల్ని మేం సమర్థించం." ఇప్పుడు, దీనికే సరైన రాజకీయ సూత్రీకరణ యిచ్చేందుకు ప్రయత్నించండి!! మీరాపని చెయ్యలేరు, అంతే, సరిగా అక్కడే వుంది తంటా; రాజకీయ ప్రజాస్వామ్య సమస్యమీద ఆర్థికవాద అంధత్వం మీకు ఆటంకమవుతుంది.

''ఆ'' అనే చోటునుంచి ఎడమవైపుకి వెళ్లాలనీ ''ఇ'' అనే చోటునుంచి కుడివైపుకి వెళ్లాలనీ చెప్తే, అది ''ద్వంద్వవాదం'' అవుతుందా?

జాతీయ పీడనకి సంబంధించి శ్రామికవర్గపు వైఖరి పీడక దేశాల్లోనూ, పీడిత దేశాల్లోనూ ఒకేవిధంగా వుంటుందా? ఉండదు, ఆర్థికంగా, రాజకీయంగా, సైద్ధాంతికంగా, బౌద్ధికంగా, వగైరాలుగా అది ఒకేలా వుండదు.

దాని అర్థం?

దాని అర్థం యేమిటంటే, అదే గమ్యాన్ని (జాతుల సంలీనం) కొందరు ఒక మార్గాన చేరితే, మరికొందరు మరో మార్గాన, రెండు భిన్న ఆరంభాంశాలనుంచి చేరుతారు. దాన్ని కాదనడం ఒక బూట్ బ్రష్షుని ఒక సస్తన జంతువుతో ఏకంచేసే ''ఏకతావాదమే'' అవుతుంది.

''ఒక పీడిత దేశపు శ్రామికులకి దీన్ని (అంటే, జాతీయ స్వయంనిర్ణయ హక్కును ఆమోదించమని) చెప్పడం సరైనది కాదు'' – సంపాదకుల ప్రధానాంశాలను ఆ రచయిత యిలా ''అర్థం చేసుకున్నాడు.''

ఇది హాస్యాస్పదంగా వుంది!! ఆ ప్రధానాంశాల్లో అలాంటిదేమీ లేదు. ఆ రచయిత సంపాదకుల ప్రధానాంశాలను చివరిదాకా చదవకపోయైనా వుండాలి, లేకపోతే, వాటిని గురించి బొత్తిగా పర్యాలోచించకపోయైనా వుండాలి.

§ 5. కాట్స్కీయిజం గురించి పైన చూడండి.

§ 6. ప్రపంచంలో మూడు తరహాల దేశాలు ఉన్నాయని ఆ రచయితకి చెప్పబడింది. అతను ''అభ్యంతరం చెప్పి,'' ''సందర్భాలు'' అన్న పదాన్ని లాగేస్తాడు. అది మాటల చమత్కారమే గాని రాజకీయం కాదు.

మీకు నిర్దిష్టమైన ఒక ''సందర్భం'' కావాలి, ఔనా: ''బెల్జియం సంగతి యేమిటి?''

లెనిన్, జినోవ్యెవ్‌ల పుస్తకం చూడండి: ఈ నిర్దిష్ట యుద్ధం భిన్నమైనదైతే, మనం బెల్జియం రక్షణకి (యుద్ధం ద్వారా అయినాసరే) అనుకూలం అని అది చెప్తుంది.*

దానితో మీరు ఒప్పుకోరా?

అయితే, ఆ మాట చెప్పండి!!

సోషల్ డెమోక్రట్లు ''మాతృదేశ రక్షణ''కు ఎందుకు వ్యతిరేకంగా ఉన్నారన్నదాన్ని గురించి మీరు బాగా ఆలోచించలేదు.

---

* V. I. Lenin, *Collected Works*, Vol. 21, pp. 305—306.

మీరు అనుకునే కారణాల మూలంగా మేము దానికి వ్యతిరేకులం కాము. ఎందుకంటే, ఆ సమస్యను మీరు చిత్రించే పద్ధతి (వృథా ప్రయత్నాలే గాని, అవి నిజమైన చిత్రణ కావు) చరిత్రకి వ్యతిరేకం. ఆ రచయితకి నా సమాధానం యిదే.

జాతుల పీడన తొలగింపుకోసం యుద్ధాలు సహేతుకమైనవని చెప్తూనే, మేము ప్రస్తుత సామ్రాజ్యవాద యుద్ధం సహేతుకమైనదని చెప్పకపోవడాన్ని — యిది రెండు పక్షాలా జాతుల పీడనను పెంపొందించేందుకు జరుగుతోంది — "కుతర్కం" అని వర్ణించడం యీ విషయాన్ని గురించి ఎంతమాత్రం ఆలోచించకుండా "ఘాటైన" మాటల్ని వాడటమే తప్ప మరేమీ కాదు.

"మాతృదేశ రక్షణ" సమస్యను ఆ రచయిత మరింత "వామపక్ష" దృక్కోణం నుంచి ముందుకు తేవాలని కోరుతున్నాడు, కాని, ఫలితం (యిప్పటికిప్పుడే పూర్తిగా ఒక యేడాది) శుద్ధ గందరగోళం!

§ 7. ఆ రచయిత యిలా విమర్శిస్తున్నాడు: "'శాంతి షరతుల' సమస్యను ప్రస్తావించనే లేదు."

ఇది వింత విమర్శ: మేమసలు లేవదియ్యని సమస్యను ప్రస్తావించడంలో వైఫల్యం!!

అయితే ప్రస్తావించి చర్చించిన సమస్య యేమిటంటే, దురాక్రమణపూరితమైన కలిపివేతల సమస్య. ఈ సమస్యమీద "సామ్రాజ్యవాద ఆర్థికవాదులు" — యీమారు డచ్చివారితో, రాడెక్‌తోబాటు — పరమ గందరగోళంలో పడ్డారు.

పాత, కొత్త దురాక్రమణపూరితమైన కలిపివేతలకు వ్యతిరేకంగా అన్న తక్షణ నినాదాన్ని (యూరప్‌లోనే గాక, అన్ని వలసల్లోనూ కూడా సామ్రాజ్యవాదం కింద జాతుల స్వయంనిర్ణయం యెంత "అసాధ్యమో" యిది కూడా అంతే అసాధ్యం) — మీరు తిరస్కరించనైనా తిరస్కరించండి, అలా చేస్తే, మీరు సామ్రాజ్యవాదానికి గుప్త సమర్థననుంచి, బాహాటమైన సమర్థనకి చేరుకుంటారు.

లేకపోతే మీరు ఆ నినాదాన్ని ఆమోదించండి (పత్రికల్లో రాడెక్ చేసినట్లు) — అలా చేస్తే, మీరు జాతుల స్వయంనిర్ణయాన్ని మరో పేరున ఆమోదించినవారవుతారు!!

§ 8. "పశ్చిమ యూరపియన్ స్థాయిలో బోల్షెవిజం" అని ఆ రచయిత ప్రకటిస్తున్నాడు ("ఇది మీ వైఖరి కాదు" అని అతను జోడిస్తున్నాడు).

"బోల్షెవిజం" అన్న పదాన్ని పట్టుకొని వేలాడాలన్న యీ కోర్కెకు నేను ప్రాముఖ్యమేమీ ఆపాదించను, ఎందుకంటారేమో, నాకు అలాంటి "పాత బోల్షెవిక్కులు" తెలుసు, అలాంటి బోల్షెవిక్కులనుంచి భగవంతుడు మనల్ని కాపాడుగాక. "పశ్చిమ యూరపియన్ స్థాయిలో బోల్షెవిజం" అన్న ఆ రచయిత ప్రకటన, ఆ పాత ఆర్థికవాదపు స్వల్ప రూప

భేదమే తప్ప, అది బోల్షెవిజమూ కాదు, మార్క్సిజమూ కాదన్న విషయంలో నాకు పూర్తి నమ్మకం వుంది.

నా దృష్టిలో, పూర్తిగా ఒక యేడాదిపాటు కొత్త బోల్షెవిజాన్ని చాటిచెప్పడం, విషయాలను అంతటితో వదిలెయ్యడం అన్నది బొత్తిగా సహించరానిదీ, గాంభీర్యం కొరవడినదీ, పార్టీతత్వ రహితమైనదీ. వ్యవహారాలను పర్యాలోచించి, క్రమేడ్సుకి "పశ్చిమ యూరపియన్ స్టైలులో బోల్షెవిజాన్ని" సుస్పష్టంగానూ, సుసమన్వితంగానూ విపులీకరించే సమయం రాలేదా?

వలసదేశాలకీ, యూరప్‌లోని పీడిత జాతులకీ మధ్య తేడాను (ప్రస్తుతం మనం చర్చిస్తున్న సమస్య దృష్ట్యా) ఆ రచయిత నిరూపించలేదు, నిరూపించడు.

---

జాతుల స్వయంనిర్ణయ హక్కును డచ్చి గ్రూపూ, పి.ఎస్.డి.* తిరస్కరించడమన్నది గందరగోళపు ఫలితం మాత్రమేనూ, పూర్తిగా దాని పర్యవసానమూనూ కాదు — ఎందుకంటే, దీన్ని వాస్తవానికి గోర్టర్ ఆమోదిస్తాడు. అలాగే పోలిష్‌వారి త్సిమ్మెర్‌వాల్డ్ ప్రకటనను కూడా ఆమోదిస్తాడు. తద్భిన్నంగా వాటి జాతుల (శతాబ్దాలపాత సంప్రదాయాలతోనూ, అగ్రరాజ్య హోదాకి హక్కుదారులమన్న ఆకాంక్షతోనూ వున్న చిన్న జాతుల) ప్రత్యేక స్థానానికి యిది పర్యవసానం.

జాతీయ బూర్జువావర్గానికీ, అది తన ప్రజలకు చేసే దగాకీ వ్యతిరేకంగా దశాబ్దాలుగా జరిగిన పోరాట క్రమంలో యితరుల్లో అభివృద్ధిచెందినదాన్ని అందిపుచ్చుకొని, యాంత్రికంగానూ, విమర్శన రహితంగానూ వల్లించడం శుద్ధ ఆలోచనా రహితమూ, అమాయకమే అవుతుంది. దేన్ని అందిపుచ్చుకోకూడదో సరిగ్గా దాన్నే అందిపుచ్చుకున్నవాళ్ల ఉదాహరణ యిదిగో మనకిక్కడ తటస్థపడింది.

1916 ఆగస్టు — సెప్టెంబరు
మాసాల్లో రచింపబడింది

---

* పోలిష్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ. — సం.

# శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమం[161]

ప్రస్తుత సామ్రాజ్యవాద యుద్ధంలో "మాతృదేశ రక్షణ"ను గురించిన సోషల్ జాతీయ దురహంకార అబద్ధాలకు వ్యతిరేకంగా పోరాటం జరుపుతున్న డచ్చి, స్కాండినేవియన్, స్విస్ రివల్యూషనరీ సోషల్ డెమోక్రట్లలో, పాత సోషల్ డెమోక్రటిక్ కనీస కార్యక్రమం, "మిలీషియా" లేక "జనాన్ని సాయుధంచేయడం" కావాలన్న డిమాండు స్థానంలో "నిరాయుధీకరణ" డిమాండును పెట్టేందుకు అనుకూలురైన వాళ్లు కొందరు వున్నారు. "Jugend-Internationale"[162] పత్రిక యీ అంశంమీద ఒక చర్చా గోష్ఠిని మొదలు పెట్టి, 3వ సంచికలో నిరాయుధీకరణను సమర్థిస్తూ ఒక సంపాదకీయాన్ని ప్రచురించింది. ఆర్. గ్రిమ్‌యొక్క యిటీవలి ప్రధానాంశాలు[163] కూడా యీ "నిరాయుధీకరణ" భావానికి మినహాయింపుగా వుండటం విచారకర విషయం. "Neues Leben"[164], "Vorbote" పత్రికల్లో వాదోపవాదాలు చెలరేగాయి.

నిరాయుధీకరణ సమర్థకుల వైఖరిని మరింత సన్నిహితంగా పరిశీలిద్దాం.

## I

నిరాయుధీకరణ డిమాండే అన్ని రకాల సైనికతత్వానికీ, అన్ని యుద్ధాలకీ వ్యతిరేకంగా జరిగే పోరాటానికి మిక్కిలి స్పష్టమూ, అత్యంత నిర్ణయాత్మకమూ, అత్యంత సుసంగతమూ అయిన వ్యక్తీకరణ అన్నదే వాళ్ల ప్రధానమైన వాదం.

అయితే, ప్రధానమైన యీ వాదంలోనే నిరాయుధీకరణ సమర్థకుల ప్రధానమైన పొరపాటు వుంది. సోషలిస్టులు, తాము సోషలిస్టులుగా ఉండటం మానుకున్నప్పుడు గాని అన్ని యుద్ధాలనూ వ్యతిరేకించజాలరు.

మొదటిది, విప్లవకర యుద్ధాలకు సోషలిస్టులు ఎన్నడూ వ్యతిరేకులుగా లేరు, యిక ముందెన్నడూ ఉండనూ జాలరు. సామ్రాజ్యవాద "అగ్ర" రాజ్యాల బూర్జువావర్గం

పూర్తిగా అభివృద్ధినిరోధకంగా తయారైంది, ఈ బూర్జువావర్గం యిప్పుడు సాగిస్తున్న యుద్ధాన్ని అభివృద్ధినిరోధకమైన, బానిసయజమానుల, నేరస్థుల యుద్ధంగా మనం పరిగణిస్తాం. అయితే, యీ బూర్జువావర్గానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధం మాటేమిటి? ఉదాహరణకు, యీ బూర్జువావర్గంచేత పీడింపబడుతూ, యీ బూర్జువావర్గంమీద ఆధారపడే ప్రజలు లేక వలసదేశాల ప్రజలు విముక్తికోసం జరిపే యుద్ధం మాటేమిటి? "ఇంటర్నేషనల్" గ్రూపు[165] ప్రధానాంశాల్లోని 5వ అంశంలో యిలా వుంది: "ఈ విశృంఖల సామ్రాజ్యవాద దశలో జాతీయవాద యుద్ధాలు యింక ఎంతమాత్రమూ సాధ్యం కావు." అది తప్పనడం స్పష్టం.

20వ శతాబ్దపు చరిత్ర – "విశృంఖల సామ్రాజ్యవాద" శతాబ్దపు చరిత్ర – అంతా వలసవాద యుద్ధాల మయం. కాని, యూరపియన్లమైన మనం, ప్రపంచంలోని అధిక సంఖ్యాక ప్రజల సామ్రాజ్యవాద పీడకులమైన మనం, మనకి అలవాటైన, నికృష్ట యూరపియన్ జాతీయ దురహంకారంతో, "వలసవాద యుద్ధాలు" తరచుగా జాతీయవాద యుద్ధాలనీ లేక యీ పీడితప్రజల జాతీయ తిరుగుబాట్లనీ పిలుస్తూ వుంటాం. సామ్రాజ్యవాదపు ప్రధాన లక్షణాల్లో ఒకటేమిటంటే, అది మిక్కిలి వెనుకబడిన అత్యధిక దేశాల్లో పెట్టుబడిదారీ అభివృద్ధిని త్వరితంచేసి, తద్వారా జాతీయ పీడనకి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని విస్తృతమూ, తీవ్రతరమూ చేస్తుంది. అదొక వాస్తవం. దాన్నుంచి అనివార్యంగా వుత్పన్నమయ్యేదేమిటంటే, సామ్రాజ్యవాదం తరచుగా జాతీయవాద యుద్ధాలకు కారణభూతమవుతుంది. పైన పేర్కొనబడిన "ప్రధానాంశాల"ను తన పుస్తకంలో సమర్థించే జూనియస్, సామ్రాజ్యవాద దశలో, ఒక సామ్రాజ్యవాద మహా రాజ్యానికి వ్యతిరేకంగా జరిగే ప్రతిఒక జాతీయ యుద్ధమూ దానికి ప్రత్యర్థి అయిన సామ్రాజ్యవాద మహా రాజ్యపు జోక్యానికి దారితీస్తుందని అంటాడు. ఈవిధంగా, ప్రతి జాతీయ యుద్ధమూ ఒక సామ్రాజ్యవాద యుద్ధంగా మార్చబడుతుంది. అయితే, యీ వాదం కూడా తప్పే. ఇది జరగవచ్చు, కాని ఎప్పుడూ యిది జరగకపోవచ్చు. 1900–14 మధ్య జరిగిన అనేక యుద్ధాలు యీ క్రమంలో సాగలేదు. ఉదాహరణకు, యీ ప్రస్తుత యుద్ధం తర్వాత, యుద్ధమగ్న దేశాలన్నీ పూర్తిగా వట్టిపోయినట్లయితే, "ఎలాంటి" జాతీయ, ప్రగతిశీల, విప్లవకర యుద్ధాలూ – ఉదాహరణకి, ఇండియా, పర్షియా, సయాం వగైరాల పొత్తుతో మహా రాజ్యాలకు వ్యతిరేకంగా చైనా జరిపే మాదిరివి – "జరగడం అసంభవం" అని చెప్పడం కేవలం హాస్యాస్పదం.

సామ్రాజ్యవాదంకింద జాతీయ యుద్ధాల సంభావ్యతను తిరస్కరించడమన్నది సిద్ధాంత రీత్యా తప్పు, చారిత్రకంగా పొరపాటు, ఆచరణరీత్యా యూరపియన్ జాతీయాహంకారంతో సమానం: యూరప్, ఆఫ్రికా, ఆసియా, వగైరాల్లోని కోట్లాది ప్రజలను పీడించే జాతులకు

చెందిన మనం, పీడితప్రజలకు, "మన" జాతులకు వ్యతిరేకంగా వాళ్ల యుద్ధం జరపడం "అసాధ్యం" అని చెప్పవలసివుంటుంది!

రెండవది, మిగిలిన అన్ని యుద్ధాల మాదిరిగానే అంతర్యుద్ధం అన్నది కూడా ఒక యుద్ధమే. వర్గపోరాటాన్ని ఆమోదించేవాడు అంతర్యుద్ధాలను ఆమోదించకుండా వుండ జాలడు. అంతర్యుద్ధాలన్నవి ప్రతిఒక్క వర్గసమాజంలో, వర్గపోరాటపు సహజమైన, కొన్ని పరిస్థితుల్లో అనివార్యమైన, కొనసాగింపు, అభివృద్ధి, అది తీవ్రం కావడం. ప్రతి ఒక మహా విప్లవంచేతా యిది ధృవీకరింపబడింది. అంతర్యుద్ధాన్ని కాదనడమంటే, లేక దాన్ని విస్మరించడమంటే, తీవ్రమైన అవకాశవాదంలోకి దిగజారిపోయి, సోషలిస్టు విప్లవాన్ని పరిత్యజించడమే.

మూడవది, ఒక్క దేశంలో సోషలిజం విజయం ఒక్క దెబ్బలో మొత్తంగా అన్ని యుద్ధాలనూ తొలగించిపారెయ్యదు. అందుకు భిన్నంగా, యుద్ధాలు జరుగుతాయని అది చెప్తోంది. పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి భిన్న దేశాల్లో మిక్కిలి అసమానంగా సాగుతుంది. సరుకు ఉత్పత్తి పద్ధతిలో అది యిందుకు భిన్నంగా ఉండజాలదు. దీన్నిబట్టి తిరుగులేని పద్ధతిలో తేలేదేమిటంటే, సోషలిజం ఒకే సమయంలో అన్ని దేశాల్లోనూ విజయవంతం కాజాలదు. అది మొదట ఒక దేశంలోనో, లేక కొన్ని దేశాల్లోనో విజయవంతమవుతుంది. కాగా, మిగిలిన దేశాలు కొంత కాలంపాటు బూర్జువా దేశాలుగానో, లేక బూర్జువాపూర్వ దేశాలుగానో వుంటాయి. ఇది ఘర్షణను సృష్టించితీరుతుంది, అంతేకాకుండా, సోషలిస్టు రాజ్యపు విజయవంతమైన శ్రామికవర్గాన్ని అణచివేసేందుకుగాను యితర దేశాల బూర్జువా వర్గం ప్రత్యక్ష ప్రయత్నం చేసేందుకు కూడా యిది దారితీస్తుంది. అలాంటి సందర్భాల్లో, మనం జరిపేది న్యాయవిహితమైన, ధర్మబద్ధమైన యుద్ధం అవుతుంది. అది సోషలిజం కోసం, యితర జాతులను బూర్జువావర్గంనుంచి విముక్తంచేసేందుకోసం జరిపే యుద్ధంగా వుంటుంది. ఎంగెల్సు 1882 సెప్టెంబరు 12న కౌట్స్కీకి లేఖ రాస్తూ, యింతకు ముందే విజయవంతమైన సోషలిజం "రక్షణాత్మక యుద్ధాలు" జరపడం సంభవమేనని స్పష్టంగా పేర్కొనడం పూర్తిగా రైటే. ఇతర దేశాల బూర్జువావర్గానికి వ్యతిరేకంగా విజయవంతమైన శ్రామికవర్గ పరిరక్షణే ఆయన మనస్సులో వున్నది.

కేవలం ఒక్క దేశానికే కాక, యావత్ప్రపంచానికీ చెందిన బూర్జువావర్గాన్ని మనం కూలదోశాక, దానిపైన అంతిమ విజయం సాధించాక, దాని ఆస్తిని హరించాక మాత్రమే యుద్ధాలు అసంభవమవుతాయి. శాస్త్రీయ దృష్ట్యా, బూర్జువావర్గపు ప్రతిఘటనను అణచివెయ్యడమనే అతి ముఖ్య కర్తవ్యాన్ని – యిది మిక్కిలి కష్టమైన, సోషలిజానికి పరివర్తనలో అత్యధిక పోరాటం అవసరమయ్యే కర్తవ్యం – దాటవెయ్యడమన్నా, మభ్యపుచ్చడమన్నా

శుద్ధ పొరపాటూ, పరమ విప్లవ వ్యతిరేకమూ అవుతుంది. "సాంఘిక" మతగురువులూ, అవకాశవాదులూ భావి శాంతియుత సోషలిజానికి సంబంధించిన స్వప్నాలను కల్పించేందుకు సదా సంసిద్ధంగా వుంటారు. అయితే విప్లవకర సోషల్ డెమోక్రట్లకీ వాళ్లకీ మధ్య వున్న తేడా యేమిటంటే, ఆ ఉజ్వల భవిష్యత్తును సాధించేందుకు భయంకరమైన వర్గపోరాటాలూ, వర్గ సమరాలూ అవసరమన్న విషయాన్ని గురించి ఆలోచించేందుకూ, ఊహించేందుకూ వాళ్లు నిరాకరిస్తారు.

మాటలు మనల్ని పెడదోవ పట్టించకుండా మనం చూసుకోవాలి. ఉదాహరణకు, "మాతృదేశ రక్షణ" అన్న పదబంధాన్ని చాలామంది అసహ్యించుకుంటారు. ప్రస్తుత కొల్ల దారీ యుద్ధాన్ని గురించిన బూర్జువా అబద్ధాలను మరుగుపరచేందుకూ, మభ్యపుచ్చేందుకూ పరమ అవకాశవాదులూ, కౌట్స్కీ అనుచరులూ దీన్ని వాడటమే యిందుకు కారణం. ఇది వాస్తవం. కాని, రాజకీయ నినాదాల అంతరార్థాన్ని యికనెంతమాత్రం మనం గ్రహించకూడదని దీని అర్థం కాదు. ప్రస్తుత యుద్ధంలో "మాతృదేశ రక్షణ" నినాదాన్ని ఆమోదించడమంటే దాన్నొక "ధర్మ" యుద్ధంగా, శ్రామికవర్గ ప్రయోజనాలకు అనుకూలమైన యుద్ధంగా ఆమోదించడమే తప్ప మరేమీ కాదు. ఎందుకంటే, ఏ యుద్ధంలోనైనా దురాక్రమణలు జరగవచ్చు. సామ్రాజ్యవాద మహా రాజ్యాలకు వ్యతిరేకంగా యుద్ధాలు జరిపే పీడిత జాతుల విషయంలోనూ, ఏ బూర్జువా రాజ్యపు ఏ గాలిఫేకి వ్యతిరేకంగానో తను జరిపే యుద్ధంలో విజయవంతమైన శ్రామికవర్గం విషయంలోనూ "మాతృదేశ రక్షణ"ను తిరస్కరించడం కేవలం మూర్ఖత్వమే అవుతుంది.

సైద్ధాంతికంగా, ప్రతిఒక యుద్ధమూ భిన్నమైన పద్ధతిలో రాజకీయాల కొనసాగింపు మాత్రమే అన్న విషయాన్ని మరచిపోవడం శుద్ధ పొరపాటే అవుతుంది. ప్రస్తుత సామ్రాజ్యవాద యుద్ధం అగ్ర రాజ్యాల రెండు గ్రూపుల సామ్రాజ్యవాద రాజకీయాల కొనసాగింపు, మరి యీ రాజకీయాలు సామ్రాజ్యవాద శక సంబంధాల వెరశి మొత్తంచేత ఉత్పన్నమై, పెంపొందించబడ్డాయి. అయితే, యిదే శకం జాతీయ పీడనకు వ్యతిరేకంగా పోరాట విధానాలనూ, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ పోరాటాన్నీ ఉత్పన్నంచేసి, పెంపొందించవలసి కూడా వుంది. తత్పర్యవసానంగా, 1) విప్లవాత్మక జాతీయ తిరుగుబాట్లనూ, యుద్ధాలనూ; 2) బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ యుద్ధాలనూ, తిరుగుబాట్లనూ; 3) రెండురకాల విప్లవాత్మక యుద్ధపు మేళవింపు వగైరాల అవకాశ, అనివార్యతలనూ ఉత్పన్నంచేసి, పెంపొందిస్తుంది.

## II

దీనికి యీకింది అభిప్రాయాన్ని జోడించాలి.

ఆయుధాలు ఉపయోగించడమెలాగో నేర్చుకునేందుకూ, ఆయుధాలు పొందడానికీ కృషి చెయ్యని పీడిత జాతి బానిసలుగా పరిగణింపబడేందుకు మాత్రమే తగివుంటుంది. బూర్జువా శాంతివాదులంగానో లేక అవకాశవాదులంగానో తయారైతే తప్ప, మనమొక వర్గ సమాజంలో నివసిస్తున్నామనీ, వర్గపోరాటం ద్వారా తప్ప దాన్నుంచి బయటపడే మార్గం లేదనీ, ఉండజాలదనీ మనం విస్మరించలేము. ప్రతి ఒక వర్గసమాజంలోనూ — అది బానిసత్వం మీదనో, భూదాస్య విధానంమీదనో ఆధారపడినా లేక యిప్పటిలాగ వేతనశ్రమమీద ఆధారపడినదైనా — పీడక వర్గం ఎప్పుడూ సాయుధమయ్యే వుంది. ఆధునిక స్థాయీ సైన్యమే కాదు, ఆధునిక మిలీషియా సైతం — ఉదాహరణకు, అత్యంత ప్రజాస్వామిక రిపబ్లిక్ అయిన స్విట్జర్లండులో సైతం — శ్రామికవర్గానికి వ్యతిరేకంగా సాయుధమైన బూర్జువా వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. దాన్ని గురించి వివరించవలసిన అవసరం దాదాపు లేనేలేనంత ప్రాథమిక సత్యం అది. పెట్టుబడిదారీ దేశాలన్నింటిలోనూ సమ్మెదారులకు వ్యతిరేకంగా సైనికులను వినియోగించడాన్ని పేర్కొంటే చాలు.

ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలోని మిక్కిలి పెద్ద, మౌలిక, ప్రధాన వాస్తవాల్లో ఒకటేమిటంటే, శ్రామికవర్గానికి వ్యతిరేకంగా సాయుధమైన బూర్జువావర్గం ఉండటం. ఈ వాస్తవం కట్టెదుట ఉండగా, విప్లవకర సోషల్ డెమోక్రట్లకు "నిరాయుధీకరణ"ను "డిమాండు చెయ్యవలసిందిగా" ప్రతిపాదిస్తున్నారు! ఇది వర్గపోరాట దృక్పథానికీ, అసలు విప్లవాన్ని గురించిన ఆలోచనకే తిలాంజలి యివ్వడంతో సమానం. ఇందుకు భిన్నంగా, మన నినాదం యీకింది విధంగా ఉండాలి: బూర్జువావర్గాన్ని ఓడించి, దాని ఆస్తిని హరించి, దాన్ని నిరాయుధం చేసేందుకు శ్రామికవర్గాన్ని సాయుధంచెయ్యాలి. ఏ విప్లవకర వర్గమైనా అనుసరించగల ఏకైక ఎత్తుగడ — పెట్టుబడిదారీ సైనికతత్వమంతటి వస్తుపర అభివృద్ధి నుంచీ తార్కికంగా వుత్పన్నమయ్యే, అవసరమయ్యే ఎత్తుగడ — యిది మాత్రమే. శ్రామిక వర్గం బూర్జువావర్గాన్ని నిరాయుధంచేసిన తర్వాత మాత్రమే, అది, తన అంతర్జాతీయ చారిత్రక కర్తవ్యానికి ద్రోహంచెయ్యకుండా, ఆయుధాలన్నింటినీ చెత్త కుప్పమీదకి విసిరెయ్యగలుగుతుంది. మరి శ్రామికవర్గం నిస్సందేహంగా యీ పని చేస్తుంది, అయితే, పైన పేర్కొన్న షరతును పరిపూర్తిచేసిన తర్వాతనే తప్ప, ముందుగా యెంతమాత్రం కాదు.

ప్రస్తుత యుద్ధం అభివృద్ధినిరోధక క్రిస్టియన్ సోషలిస్టుల్లోనూ, వసిగే పెటీబూర్జువా వర్గంలోనూ భయభీతులను మాత్రమే, ఆయుధాల వినియోగంపట్లా, రక్తపాతంపట్లా,

మృత్యువు వగైరాలపట్ల అసహ్యాన్ని మాత్రమే కలిగించినట్లయితే, మేమొక విషయం చెప్పాల్సివుంది: పెట్టుబడిదారీ విధానం యిప్పుడూ, ఎప్పుడూ కూడా హద్దులేని బీభత్సమే. అన్ని యుద్ధాల్లోకీ మిక్కిలి అభివృద్ధినిరోధకమైన ఈ యుద్ధం ఆ సమాజాన్ని బీభత్సపు అంతానికి సన్నద్ధం చేస్తూంటే, మనం నిస్పృహలో మునగవలసిన అవసరం లేదు. అయితే, నిరాయుధీకరణ "డిమాండు," లేక యింకా సరిగా చెప్పాలంటే, నిరాయుధీకరణ స్వప్నం, వస్తుపరంగా, బూర్జువావర్గమే స్వయంగా అందరికీ కొట్టవచ్చినట్లు కనపడేలా ఏకైక న్యాయ విహితమూ విప్లవాత్మకమూ అయిన యుద్ధానికి, అంటే, సామ్రాజ్యవాద బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా అంతర్యుద్ధానికి మార్గాన్ని సుగమంచేస్తున్న తరుణంలో, నిస్పృహ వ్యక్తంచెయ్యడం తప్ప మరేమీ కాదు.

ఇది నిర్జీవమైన సిద్ధాంతమని కొందరు అనవచ్చు, కాని, మనం వాళ్లకి రెండు ప్రపంచ చారిత్రక వాస్తవాలను గుర్తుచేస్తాం: ఒకవైపున, ట్రస్టుల పాత్ర, పరిశ్రమల్లో మహిళలను పనిలో పెట్టుకోవడం, మరోవైపున, 1871 నాటి పారిస్ కమ్యూన్, రష్యాలో 1905 డిసెంబరు నాటి తిరుగుబాటు.

ట్రస్టులను వృద్ధిచెయ్యడం, స్త్రీలనీ, పిల్లల్నీ ఫ్యాక్టరీల్లోకి తోలడం, వాళ్లని అవినీతికీ, బాధలకీ, గర్భదారిద్ర్యానికీ గురిచెయ్యడం—వీటినే తన పనిగా పెట్టుకొంటుంది బూర్జువావర్గం. అలాంటి అభివృద్ధిని మనం "డిమాండు చెయ్యం," దాన్ని మనం "సమర్థించం." మనం దానికి వ్యతిరేకంగా పోరాడుతాం. అయితే మనం ఎలా పోరాడుతాం? ట్రస్టులూ, పరిశ్రమల్లో స్త్రీలను పనుల్లో పెట్టుకోవడం ప్రగతిశీలమైనదేనని మనం వివరించి చెప్తాం. చేతిపనుల వ్యవస్థకీ, గుత్తపెట్టుబడిదారీ పూర్వ విధానానికీ, స్త్రీలను వంటయింటి చాకిరీలో మగ్గజెయ్యడానికీ తిరోగమించాలని మనం కోరం. ట్రస్టులు వగైరాల ద్వారా ముందుకు పోవాలనీ, వాటిని దాటి సోషలిజానికి చేరుకోవాలనీ మనం కోరుతాం!

అవసరమైన కొన్ని మార్పులతో యీ వాదాన్ని జనాభాయొక్క ప్రస్తుత సైనికీకరణకి కూడా అన్వయించవచ్చు. ఈరోజున సామ్రాజ్యవాద బూర్జువావర్గం యువజనుల్నే కాకుండా వయోజనులని కూడా సైనికీకరిస్తోంది. రేపు అది స్త్రీలను కూడా సైనికీకరించనారంభించవచ్చు. ఈ విషయంలో మన వైఖరి యిలా వుండాలి: మరీ మంచిది! పూర్తి వేగంలో యీ పని కానివ్వండి! ఈ స్థితికి మనం ఎంత తొందరగా చేరుకుంటే, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటుకి అంత దగ్గరకి చేరుకుంటాం. సోషల్ డెమోక్రట్లు పారిస్ కమ్యూన్ ఉదాహరణను మరచిపోయివుండకపోతే, యువజనులు వగైరాల సైనికీకరణను గురించి భయానికి ఎందుకు దాసులవుతారు? ఇది "నిర్జీవ సిద్ధాంతం" గాని, స్వప్నంగాని కాదు. ఇదొక వాస్తవం. ఆయా ఆర్థిక, రాజకీయ వాస్తవాలు యిన్ని కని

పిస్తున్నాకూడా, సామ్రాజ్యవాద శకమూ, సామ్రాజ్యవాద యుద్ధాలూ అనివార్యంగా అలాంటి వాస్తవాల పునరావృత్తికి దారితీసితీరాలని సోషల్ డెమోక్రట్లు శంకించనారంభిస్తే, అది నిజంగానే దుస్థితి అవుతుంది.

పారిస్ కమ్యూన్ గురించి సమీక్షించిన ఒకానొక బూర్జువా సమీక్షకుడు 1871 మేలో ఒక ఇంగ్లీషు వార్తాపత్రికకి యిలా రాశాడు: "ఫ్రెంచి జాతి పూర్తిగా స్త్రీలతోనే కూడి వుంటే, అదెంత భీకరమైన జాతి అయివుండేది!" స్త్రీలూ, కౌమార వయస్కులూ పారిస్ కమ్యూన్‌లో పురుషులతో భుజం భుజం కలిపి పోరాడారు. బూర్జువావర్గాన్ని కూలదోసేందుకు యికముందు జరగబోయే పోరాటాల్లో కూడా పరిస్థితి యిందుకు భిన్నంగా ఉండబోదు. తక్కువ ఆయుధాలతో పోరాడుతున్న లేక నిరాయుధులైన కార్మికులను బూర్జువావర్గపు సుసజ్జిత సాయుధ బలగాలు కాల్చి చంపుతూంటే శ్రామిక స్త్రీలు నిరాసక్తంగా చూస్తూ ఊరుకోరు. 1871లో మాదిరిగానే, వాళ్లు ఆయుధాలు చేబట్టుతారు. మరి యీనాటి బెదరిపోయిన జాతులనుంచి – లేక, యింకా సరిగ్గా చెప్పాలంటే, ప్రభుత్వాల మూలంగా కంటె అవకాశవాదుల మూలంగా అసంఘటితమైన ప్రస్తుత కార్మిక ఉద్యమంనుంచి – ముందు వెనకలుగా, అయినా నిస్సందేహంగా, విప్లవకర శ్రామికవర్గపు "భయంకర జాతుల" అంతర్జాతీయ యూనియన్ ఒకటి ఉద్భవిస్తుంది.

యావత్తు సాంఘిక జీవితమూ యీనాడు సైనికీకరింపబడుతోంది. సామ్రాజ్యవాదం అంటే, మహా రాజ్యాలు ప్రపంచపు పంపిణీకోసమూ, పునఃపంపిణీకోసమూ జరిపే భీకర పోరాటం. అందుచేత, అన్ని దేశాల్లోనూ, చివరకు తటస్థ దేశాల్లోనూ, చిన్న దేశాల్లోనూ సైతం అది యితోధిక సైనికీకరణకు పూనుకొనితీరాల్సి వుంటుంది. శ్రామిక స్త్రీలు దీన్ని ఎలా ఎదిరిస్తారు?? యుద్ధాన్నీ, సైనిక సంబంధమైన అన్నింటినీ శాపనార్థాలు పెట్టడం ద్వారా మాత్రమేనా? నిరాయుధీకరణను డిమాండు చెయ్యడం ద్వారా మాత్రమేనా? పీడిత వర్గానికి, నిజంగా విప్లవకరమైన వర్గానికి చెందిన స్త్రీలు అలాంటి సిగ్గుచేటు పాత్రను వహించడానికి ఎన్నడూ ఒప్పుకోరు. వాళ్లు తమ పుత్రులకు యిలా చెప్తారు: "నువ్వు త్వరలోనే పెరిగి పెద్దవాడివవుతావు. నీ చేతిలో తుపాకి పెడతారు. దాన్ని తీసుకో, సైనిక కళని సక్రమంగా నేర్చుకో. శ్రామికులకి యీ పరిజ్ఞానం అవసరం, అయితే ప్రస్తుత యుద్ధంలో జరుగుతున్నట్లూ, సోషలిజానికి ద్రోహులైనవాళ్లు, నీ సోదరుల్ని, అంటే, యితర దేశాల కార్మికుల్ని కాల్చిచంపమని నీకు చెప్తున్నట్లూ చేసేందుకు కాదు. తమ స్వదేశీ బూర్జువావర్గానికి వ్యతిరేకంగా పోరాడేందుకూ, దోపిడి, పేదరికం, యుద్ధాలను తుదముట్టించేందుకూ – అందునా సత్సంకల్పాల ద్వారా కాక, బూర్జువావర్గాన్ని ఓడించి నిరాయుధంచేసేందుకూ – యీ జ్ఞానం నీకు కావాలి."

ప్రస్తుత యుద్ధానికి సంబంధించి అలాంటి ప్రచారానికి, సరిగ్గా అలాంటి ప్రచారానికి మనం ఎడమొగం పెట్టేమాటయితే, అప్పుడిక మనం అంతర్జాతీయ విప్లవకర సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం గురించీ, సోషలిస్టు విప్లవాలను గురించీ, యుద్ధానికి వ్యతిరేకంగా యుద్ధాన్ని గురించీ చక్కటి మాటలు చెప్పడం మానెయ్యడం మంచిది.

## III

నిరాయుధీకరణ సమర్థకులు కార్యక్రమంలోని "జనాన్ని సాయుధంచేయడం" కావాలన్న క్లాజును వ్యతిరేకిస్తారు. ఎందుకంటారేమో, అది అవకాశవాదానికిరాయితీలు యిచ్చేందుకు మరింత తేలిగ్గా దారితీస్తుందని వాళ్లంటారు. ప్రధానాంశాన్ని, అంటే, వర్గపోరాటంపట్లా, సాంఘిక విప్లవంపట్లా నిరాయుధీకరణ వైఖరి ఎలా వుందో మనం పైన పరిశీలించాం. ఇప్పుడిక మనం అవకాశవాదంపట్ల నిరాయుధీకరణ డిమాండు వైఖరి యేమిటో పరిశీలిద్దాం. ఈ డిమాండు మనకి ఆమోదయోగ్యమైనది కాకపోవడానికి గల ప్రధాన కారణాల్లో సరిగ్గా ఒకటేమిటంటే, దాని మూలంగా భ్రమలు కలగడంతోబాటు, అవకాశవాదానికి వ్యతిరేకంగా మనం జరిపే పోరాటం అనివార్యంగా బలహీనపడుతుంది, నిర్వీర్యంచేయబడుతుంది.

ఇంటర్నేషనల్ని యీనాడు ఎదుర్కొంటున్న ప్రధాన, తక్షణ సమస్య నిస్సందేహంగా యీ పోరాటమే. అవకాశవాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంతో సన్నిహితంగా జోడింపబడని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం శుష్క పదమేనా అవుతుంది లేక దగాయేనా అవుతుంది. త్సిమ్మెర్వాల్డ్, కీంతాల్ల[166] ప్రధాన లోపాల్లో ఒకటి – మూడవ ఇంటర్నేషనల్ యొక్క యీ బీజాలు బహుశా విఫలమవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి – యేమిటంటే, అవకాశ వాదులతో తెగతెంపులు చేసుకోవలసిన అవసరాన్ని చాటిచెప్పే అర్థంలో పరిష్కరింపబడటం మాట అటుంచి, అవకాశవాద వ్యతిరేక పోరాట సమస్యను బహిరంగంగా ప్రస్తావించనైనా ప్రస్తావించకపోవడం. యూరపియన్ కార్మికోద్యమంలో అవకాశవాదానిది తాత్కాలికంగా పైచేయిగా వుంది. దాని రెండు ప్రధాన ధోరణులూ అన్ని పెద్ద దేశాల్లోనూ బయటకి పొక్కాయి: మొదటిది, శ్రీయుతులు ప్లెహానొవ్, షైడెమన్, లెగీన్, అల్బేర్ టోమా, సెంబా, వాండెర్ వెల్డె, హైండ్మన్, హెండర్సన్ వగైరాల బాహాటమూ, మోటూ అయిన, తత్కారణంగా తక్కువ ప్రమాదకారి అయిన సోషల్ సామ్రాజ్యవాదం; రెండవది, ప్రచ్ఛన్నమైన కౌట్స్కీ యిస్టు అవకాశవాదం: జర్మనీలో కౌట్స్కీ – హాసె, "సోషల్ డెమోక్రటిక్ లేబర్ గ్రూపు;"[167] ఫ్రాన్సులో లోంగె, ప్రెస్మెన్, మయేర వగైరాలు; ఇంగ్లండులో రామ్సె, మెక్డోనల్డ్, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ[168] యితర నాయకులు; రష్యాలో మార్తొవ్, ఛెయీద్జె వగైరాలు; ఇటలీలో ట్రేవెస్, తదితర వామపక్ష సంస్కరణవాదులు అనబడేవాళ్లు.

ప్రకటిత అవకాశవాదం విప్లవానికీ, ఆరంభ దశలో వున్న విప్లవోద్యమాలు, ప్రజ్వలనాలకీ బాహాటంగా వ్యతిరేకం. అది ఆయా ప్రభుత్వాలతో ప్రత్యక్షమైన పొత్తు కలిగి వుంటుంది. ఈ పొత్తు రూపాలు, మంత్రి పదవులు స్వీకరించడంనుంచి యుద్ధపరిశ్రమల కమిటీలలో (రష్యాలో)[169] పాల్గొనడందాకా రకరకాలుగా ఉండవచ్చు. ప్రచ్ఛన్న అవకాశ వాదులైన కౌట్స్కీయిస్టులు కార్మికోద్యమానికి మరింత ఎక్కువ హానిదాయకులూ, అపాయ కారులూను. ఎందుకంటే, హేతుబద్ధంగా కనిపించే కుహనా "మార్క్సిస్టు" ఊతపదాల, శాంతివాద నినాదాల ముసుగులో వీళ్ళ ప్రభుత్వంతో పొత్తు సమర్థనను మరుగుపరుస్తారు. ప్రస్తుతం ప్రచలితంగా వున్న యీ రెండు రకాల అవకాశవాదాలకూ వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని శ్రామికవర్గ రాజకీయాలకు సంబంధించిన అన్ని రంగాల్లోనూ — పార్లమెం టులో, ట్రేడ్‌యూనియన్లలో, సమ్మెల్లో, సాయుధ బలగాలు వగైరాల్లో — నిర్వహించాలి. ప్రచలితంగా వున్న అవకాశవాదపు యీ రెండు రూపాల ప్రధానమైన విశిష్ట లక్షణం ఏమిటంటే, ప్రస్తుత యుద్ధానికీ, విప్లవానికీ మధ్య వున్న సంబంధపు నిర్దిష్ట సమస్యనీ, విప్లవానికి సంబంధించిన తదితర నిర్దిష్ట సమస్యలనీ తొక్కిపట్టడం, మరుగుపరచడం లేక వాటిపట్ల పోలీసు నిషేధాల దృష్ట్యా చూడటం. ఇది కూడా, యుద్ధానికి ముందు, యీ ఆసన్న యుద్ధానికీ, శ్రామికవర్గ విప్లవానికీ మధ్య సంబంధం అనేక సార్లు అన ధికారికంగానూ, బాసెల్ ప్రణాళికలో[170] అధికారికంగానూ నొక్కి చెప్పబడ్డాక జరగడం గమనార్హం. విప్లవానికి సంబంధించిన అన్ని నిర్దిష్ట సమస్యలనూ దాటవెయ్యడమే నిరాయు ధీకరణ డిమాండులోని ప్రధాన లోపం. లేకపోతే నిరాయుధీకరణ సమర్థకులు పూర్తిగా ఓ కొత్తరకమైన యుద్ధాన్ని, నిరాయుధ విప్లవాన్ని సమర్థిస్తారా?

ఇక పోతే, సంస్కరణలకోసం జరిగే పోరాటానికి మనమెంతమాత్రమూ వ్యతిరేకులం కాము. కీడు ముంచుకువస్తే, మానవాళి రెండవ సామ్రాజ్యవాద యుద్ధాన్ని గడవక తప్పని అవకాశాన్ని — జనబాహుళ్యంలోని అశాంతీ, అసంతృప్తీ రకరకాలుగా బయటపడుతున్నప్పటికీ, మనం యెన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రస్తుత యుద్ధం విప్లవానికి దారితియ్యకపోయిన ట్లయితే — నిర్లక్ష్యంచెయ్యాలని మనం కోరుకోవడంలేదు. అవకాశవాదులకు వ్యతిరేకంగా కూడా ఉన్ముఖమైన సంస్కరణల కార్యక్రమానికి మనం అనుకూలురం. సంస్కరణల కోసం జరిగే పోరాటాన్ని మనం వాళ్ళకి పూర్తిగా వదిలేసి, విషాదకర వాస్తవంనుంచి అస్పష్ట మైన "నిరాయుధీకరణ" ఊహాకల్పనలోకి జారుకుంటే వాళ్ళ సంతోషానికి అవధివుం డదు. "నిరాయుధీకరణ" అంటే, అయిష్టమైన వాస్తవంనుంచి పలాయనం చిత్తగించడమే కాని, దానికి వ్యతిరేకంగా పోరాడటం కాదు.

అలాంటి కార్యక్రమంలో మనం అందాజుగా యిలా చెప్తాం: "1914–16 సామ్రాజ్య

వాద యుద్ధంలో మాతృదేశ రక్షణ నినాదాన్ని ఆమోదించడమంటే, ఒక బూర్జువా అబద్ధం సాయంతో కార్మికోద్యమాన్ని కలుషితం చెయ్యడమే." ఒక నిర్దిష్ట సమస్యకి అలాంటి నిర్దిష్ట సమాధానం, నిరాయుధీకరణ డిమాండుకంటె, మాతృదేశపు "సర్వతో ముఖ" రక్షణ పరిత్యాగంకంటె సైద్ధాంతికంగా సరైనదిగా వుంటుంది, శ్రామికవర్గానికి యింకెంతో ఉపయోగకరంగా వుంటుంది, అవకాశవాదులకు మరింత సహించరానిదిగా వుంటుంది. మనం యింకా యీకింది విషయాన్ని జోడించవచ్చు: "అన్ని సామ్రాజ్యవాద అగ్రరాజ్యాల — ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, ఇటలీ, జపాను, అమెరికా — బూర్జువావర్గమూ ఎంత అభివృద్ధినిరోధకమైనదిగా తయారైందంటే, ప్రపంచ పెత్తనం విషయంలో యెంత పట్టుదలగా వుందంటే, ఆ దేశాల బూర్జువావర్గం సాగించే ఏ యుద్ధమైనా కూడా అభివృద్ధినిరోధకమైనదై వుండక తప్పదు. శ్రామికవర్గం అలాంటి యుద్ధాలను వ్యతిరేకించడమే కాకుండా, అలాంటి యుద్ధాల్లో తన 'సొంత' ప్రభుత్వ పరాజయాన్ని కూడా కోరుకోవాలి, యుద్ధాన్ని నివారించేందుకు తను చేసే తిరుగుబాటు విఫలమైనట్లయితే, ఆ ప్రభుత్వ పరాజయాన్ని విప్లవాత్మక తిరుగుబాటుకోసం వినియోగించుకోవాలి."

మిలీషియా సమస్యమీద మనం యిలా చెప్పాలి: బూర్జువా మిలీషియాకి మేము వ్యతిరేకులం; శ్రామికవర్గ మిలీషియాకి మాత్రమే మేము అనుకూలురం. అందుచేత, అమెరికావంటి దేశాల్లో లేక స్విట్జర్లండు, నార్వే వగైరా దేశాల్లో సైతం, స్థాయీ సైన్యానికి మాట అటుంచి, చివరకు బూర్జువా మిలీషియాకి సైతం "ఒక్క పెన్నీ గాని, ఒక్క మనిషిని గాని" యివ్వకూడదు. మిక్కిలి స్వేచ్ఛాయుతమైన రిపబ్లికన్ దేశాల్లో సైతం (ఉదాహరణకు స్విట్జర్లండు) మిలీషియా ప్రష్యన్ పద్ధతిలో అంతకంతకు ఎక్కువగా, ప్రత్యేకించి 1907లోనూ, 1911లోనూ సంఘటితం చెయ్యబడుతోంది, సమ్మెదారులకు వ్యతిరేకంగా వినియోగింపబడటం ద్వారా నింద్యప్రయోజనానికి వినియోగింపబడుతోంది. ఆఫీసర్లు జనంచేత ఎన్నుకోబడాలనీ, సైనిక చట్టాలన్నింటినీ రద్దుచెయ్యాలనీ, విదేశీ కార్మికులకూ స్వదేశీ కార్మికులకూ సమాన హక్కులు కల్పించాలనీ మనం డిమాండు చెయ్యవచ్చు (స్విట్జర్లండు మాదిరిగా అంతకంతకు ఎక్కువ సంఖ్యలో విదేశీ కార్మికులను — వాళ్లకి అన్ని హక్కులనూ నిరాకరిస్తూ — బాహాటంగా దోచుకొంటున్న సామ్రాజ్యవాద రాజ్యాల విషయంలో అది ప్రత్యేకించి ముఖ్యంగా వర్తిస్తుంది). అంతేకాకుండా, ప్రతి నిర్దిష్ట దేశపు ప్రతి నూరుమంది జనాభాకీ స్వచ్ఛంద సైనిక శిక్షణ సంఘాలను నెలకొల్పుకొనే హక్కూ, ఆఫీసర్లను స్వేచ్ఛగా ఎన్నుకోనే హక్కూ ఉండాలనీ, ఆ ఆఫీసర్లకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలనీ వగైరాలను మనం డిమాండు చెయ్యవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మాత్రమే శ్రామికవర్గం, తన బానిసయజమానులకోసం గాక, తనకోసమే సైనిక శిక్ష

ణను పొందగలుగుతుంది. శ్రామికవర్గ ప్రయోజనాల దృష్ట్యా అలాంటి సైనిక శిక్షణ ఆవశ్యకత ఎంతైనా వుంది. విప్లవోద్యమపు ప్రతి ఒక్క విజయమూ, అది ఒక నగరాన్ని పట్టుకోవడం, ఒక ఫ్యాక్టరీ పేటను ఆక్రమించుకోవడం వంటి పాక్షిక విజయమైనా కూడా, లేక సైన్యపు ఒక విభాగాన్ని తమ పక్షానికి తిప్పుకోవడమైనా కూడా, విజయవంతమైన శ్రామికవర్గం సరిగా అలాంటి కార్యక్రమాన్ని అమలుజరపడాన్నే అనివార్యం చేసితీరుతుందన్న విషయాన్ని రష్యన్ విప్లవం నిరూపించింది.

చివరి సంగతి, అవకాశవాదంతో కేవలం కార్యక్రమాలు వెయ్యడం ద్వారా ఎన్నడూ పోరాడజాలమంటే అదెంతైనా సమంజసమైన విషయం. ఈ కార్యక్రమాలు అమల్లో పెట్టడం ద్వారానే వాళ్లతో పోరాడాలి. దివాళాకోరు రెండవ ఇంటర్నేషనల్ చేసిన మిక్కిలి పెద్ద వినాశకరమైన పొరపాటు యేమిటంటే, దాని మాటలకీ చేతలకీ పొందిక లేకపోవడం, అది కాపట్యంతో సిగ్గు లేకుండా విప్లవాత్మక పదజాలాన్ని అలవాటుగా వినియోగించడం (బాసెల్ ప్రణాళికపట్ల కౌట్స్కీ ప్రభృతుల ప్రస్తుత వైఖరిని గమనించండి). నిరాయుధీకరణ అన్నది ఏ తలతిక్క మనిషో కనిపెట్టినదిగా కాక, ఒక సాంఘిక భావంగా, అంటే, జనాభాలోని ఒక భాగంనుంచి తలెత్తి, దాన్ని ప్రభావితంచెయ్యగల భావంగా, దీర్ఘకాలంపాటు యుద్ధాలకీ, రక్తపాతానికీ సంబంధించిన ప్రపంచ పథంనుంచి దూరంగా వుండి, అలాగే ఉండిపోవాలని ఆశించే కొన్ని చిన్న రాజ్యాల్లో ఒక మినహాయింపుగా వున్న విలక్షణ "ప్రశాంత" పరిస్థితులనుంచి ఉత్పన్నమవుతుంది. ఈ విషయంలో మనకి విశ్వాసం కలగాలంటే, నిరాయుధీకరణ నార్వీజియన్ సమర్థకులు ముందుకు తెచ్చే వాదనలను ఉదాహరణకు మనం పరిశీలిస్తే సరిపోతుంది. వాళ్లు యిలా అంటారు: "మాది చిన్న దేశం. మా సైన్యం చిన్నది. మహా రాజ్యాలకి వ్యతిరేకంగా మేము చెయ్యగలిగింది ఏమీ లేదు" [మరి, అందుకని, మహా రాజ్యాల ఏదో ఒక గ్రూపుతో ఒక సామ్రాజ్యవాద పొత్తులో బలవంతాన యిరుక్కోకుండా ప్రతిఘటించే విషయంలో మేము చెయ్యగలిగింది ఏమీ లేదు].... "మమ్మల్ని మా మారుమూలలో యిలా వదిలేయండి, మా మారుమూల రాజకీయాలనూ – నిరాయుధీకరణనూ, నిర్బంధ మధ్యవర్తిత్వాన్నీ, శాశ్వత తాటస్థ్యం" [బెల్జియన్ పద్ధతిలో "శాశ్వతమైనది"] "వగైరాలనీ డిమాండుచెయ్యడం – కొనసాగించుకోనివ్వండి."

దూరంగా ఉండాలని చిన్న రాజ్యాలు చేసే అల్ప ప్రయత్నం, ప్రపంచ చరిత్రయొక్క మహా యుద్ధాలనుంచి సాధ్యమైనంత దూరంగా వుండి, నూతిలో కప్పమాదిరి క్రియాశూన్యతలో వుండిపోయేందుకుగాను సాపేక్షంగా తన గుత్త స్థితినుంచి ప్రయోజనం పొందాలన్న పెటీబూర్జువా ఆకాంక్ష – నిరాయుధీకరణ భావానికి కొంత విజయావకాశాన్నీ, కొన్ని చిన్న రాజ్యాల్లో దానికి కొంతమేరకు ప్రజానురంజకత్వాన్నీ సంపాదించిపెట్టే వస్తుపరమైన

సాంఘిక పరిస్థితి యిదే. సహజంగానే అలాంటి వాంఛ అభివృద్ధినిరోధకమైనదీ, పూర్తిగా భ్రమలమీద ఆధారపడినదీని. ఎందుకంటే, సామ్రాజ్యవాదం ఆ చిన్న రాజ్యాలను ఎటు తిరిగి ఏదో ఒక విధంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ రాజకీయాల సుడిగుండంలోకి యీడుస్తుంది.

ఉదాహరణకు స్విట్జర్లండులో, కార్మికోద్యమానికి సామ్రాజ్యవాద పరిస్థితి వస్తు పరమైన రెండు క్రమాలను నిర్దేశిస్తుంది: అవకాశవాదులు, బూర్జువావర్గపు పొత్తుతో, సామ్రాజ్యవాద బూర్జువా టూరిస్టులనుంచి సమకూరే లాభాలతో వృద్ధిచెందే రిపబ్లికన్ ప్రజాతంత్ర సమాఖ్యగా దేశాన్ని మార్చాలనీ, యీ "ప్రశాంత" గుత్త స్థితిని సాధ్యమైనంత లాభదాయకమూ, ప్రశాంతమూ చేసుకోవాలనీ ప్రయత్నిస్తున్నారు.

నికరమైన స్విస్ సోషల్ డెమోక్రట్లు స్విట్జర్లండ్ సాపేక్ష స్వేచ్ఛనూ, దాని "అంత ర్జాతీయ" స్థానాన్నీ యూరపియన్ కార్మిక పార్టీలలోని విప్లవకర శక్తుల సన్నిహితమైన పొత్తు విజయానికి తోడ్పడేలా చేసేందుకు కృషిచేస్తున్నారు. దేవుడు మేలుచేసి స్విట్జర్లండుకి "తన సొంత ప్రత్యేక భాష అంటూ" ఏమీ లేదు, కాని అక్కడ మూడు ప్రపంచ భాష లను, పక్కనవున్న యుద్ధమగ్న దేశాల భాషల్లో మాట్లాడుతారు.

ఇరవై వేలమంది స్విస్ పార్టీ సభ్యులు వారానికి రెండు సెంటీమ్‌ల లెవీని ఒక మాదిరి "అదనపు యుద్ధ పన్ను" లాగ చెల్లిస్తే, ఏడాదికి మనదగ్గర ఇరవై వేల ఫ్రాంకులు జమ అవుతాయి. ఈ మొత్తం మనకి మూడు భాషల్లో ప్రచురణలు వెలువరచి, యుద్ధమగ్న దేశాల కార్మికుల మధ్యా, సైనికుల మధ్యా పంచేందుకు – సైన్యాధికారుల నిషేధం ఉన్నప్ప టికీ – మస్తుగా సరిపోతుంది. కార్మికుల ప్రాథమిక తిరుగుబాటుకి సంబంధించిన సమస్త వాస్తవిక సాక్ష్యాన్నీ, కందకాల్లో వారి మధ్య వ్యక్తమైన సౌభ్రాతృత్వాన్నీ, తమతమ "సొంత" దేశాల సామ్రాజ్యవాద బూర్జువావర్గాలకు వ్యతిరేకంగా జరిగే విప్లవ పోరాటంకోసం అవి వినియోగింపబడతాయన్న ఆకాంక్ష వగైరాలనీ గురించిన సమాచారాన్ని మనం పంచగలు గుతాం.

అది కొత్త యేమీ కాదు. "La Sentinelle,"[171] "Volksrecht,"[172] "Berner Tagwacht"[173] వంటి అత్యుత్తమ పత్రికలు యీ పని – దురదృష్టవశాత్తూ తక్కువ ప్రమాణంలోనే అయినప్పటికీ – యింతకుముందే చేస్తున్నాయి. అలాంటి కార్య కలాపాల ద్వారా మాత్రమే ఆరవు పార్టీ మహాసభ[174] చేసిన ఉజ్వల నిర్ణయం, కేవలం ఉజ్వల నిర్ణయంగా మాత్రమే ఉండిపోక, అంతకంటె అధికమైనదవుతుంది.

ఇప్పుడు మనకి ఆసక్తి గొలిపే ప్రశ్న యిదీ: నిరాయుధీకరణ డిమాండు స్విస్ సోషల్ డెమోక్రట్లలోని యీ విప్లవకర ధోరణికి అనుగుణంగా వుందా? అది అనుగుణంగా లేదన

డం స్పష్టం. వస్తుసరంగా చూస్తే నిరాయుధీకరణ అన్నది చిన్న రాజ్యాల అత్యంత జాతీయ, విశిష్ట జాతీయ కార్యక్రమం. అది అంతర్జాతీయ విప్లవ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు అంతర్జాతీయ కార్యక్రమం ఎంతమాత్రం కాదు.

జర్మన్ భాషలో 1916 సెప్టెంబరులో
రచింపబడింది

# వివరణలు

[1] డిసెంబర్ తిరుగుబాటు – డిసెంబర్ 1905లో జారిస్టు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మాస్కో కార్మికులు తిరుగుబాటు లేవదీశారు. మాస్కో సోషల్ డెమొక్రటిక్ బోల్షెవిక్కుల నాయకత్వాన కార్మికులు జారు సైన్యంతో తొమ్మిది రోజులపాటు వీరోచిత పోరాటం సాగించారు. పీటర్స్‌బుర్గ్‌నుండి అదనపు బలాలు పిలిపించిన తరువాత ప్రభుత్వం తిరుగుబాటును అణచివేయగలిగింది. నమ్మశక్యంకానంత పాశవికత్వంతో తిరుగుబాటుదార్లను అణచివేశారు. కార్మిక పేటలను రక్తంలో ముంచివేశారు, మాస్కోలోనూ, దాని పరిసరాలలోనూ వేలాది కార్మికులను చంపారు. – 14.

[2] ఐచ్ఛిక పోరాట దళాలు – 1905–07 విప్లవ క్రమంలో బోల్షెవిక్కులు ఆత్మరక్షణ దళాలుగా ఏర్పాటుచేసిన సాయుధ కార్మిక దళాలు. మెన్షెవిక్కుల, సోషలిస్టు రివల్యూషనరీల పెటీబూర్జువా పార్టీలు కూడా పోరాట దళాలను ఏర్పాటుచేశాయి. 1905 అక్టోబరు చివర్లో, మాస్కోలో ఐచ్ఛిక పోరాట దళాల సంయుక్త కౌన్సిల్ ఏర్పాటు చెయ్యబడింది. ఆ కౌన్సిల్‌లో సంఖ్యాధిక్యత కలిగిన సోషలిస్టు రివల్యూషనరీలూ, మెన్షెవిక్కులూ దాని కార్యకలాపాలను విచ్ఛిన్నం చేశారు. డిసెంబరు సాయుధ తిరుగుబాటు రోజుల్లో ఆ సంయుక్త కౌన్సిల్ విప్లవ ఘటనలకి వెనకబడిపోయి, ఆ తిరుగుబాటు సాధారణ కార్యాచరణ కేంద్రపు విధి నిర్వహణలో విఫలమైంది. – 14.

[3] 1905 నాటి తొలి రష్యన్ విప్లవ క్రమంలో, అఖిల రష్యా అక్టోబరు రాజకీయ సమ్మెకు యిది ప్రస్తావన.

అక్టోబరు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నవారి సంఖ్య 20 లక్షలను మించింది. నిరంకుశ పాలనను కూలదొయ్యాలి, రాజ్యాంగ నిర్ణయసభని సమావేశపరచాలి, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ని స్థాపించాలి అన్న నినాదాలతో ఆ సమ్మె జరిగింది. అఖిల రష్యా అక్టోబరు రాజకీయ సమ్మె కార్మికవర్గోద్యమ బలాన్నీ, శక్తినీ నిరూపించి, గ్రామీణ

ప్రాంతాల్లోనూ, పదాతి, నౌకా సైన్యాల్లోనూ విప్లవ పోరాటాభివృద్ధికి ఊపునిచ్చి, శ్రామికవర్గాన్ని డిసెంబరు సాయుధ తిరుగుబాటుకి సన్నిహితంగా తెచ్చింది. – 14.

4 తను రచించిన "ఫ్రాన్సులో వర్గపోరాటం, 1848–1850"లో కార్ల్ మార్క్స్ ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను లెనిన్ యిక్కడ ఉల్లేఖిస్తున్నాడు. – 15.

5 1905 డిసెంబరు 8 (21) సాయంత్రం సైనికులూ, పోలీసులూ "అక్వేరియం" గార్డెన్సును చుట్టుముట్టారు. అప్పటికి ఆ గార్డెన్సులోని థియేటర్లో చాలామంది పాల్గొన్న సమావేశం ఒకటి జరుగుతోంది. ఆ సమావేశం చుట్టూ కావలికాస్తున్న కార్మికుల ఐచ్ఛిక పోరాట దళాల నిస్వార్థ ప్రయత్నాల ఫలితంగా రక్తపాతం నివారింపబడింది. కానైతే, ఆ సమావేశంలో పాల్గొన్న చాలమందిని సోదాచేసి, కొట్టి, నిర్బంధించడం తటస్థించింది. – 15.

6 ఫీడ్లర్ పాఠశాల భవనం మామూలుగా పార్టీ సమావేశాలకోసం వినియోగింపబడింది. 1905 డిసెంబరు 9 (22) సాయంత్రం, అక్కడొక సమావేశం జరుగుతూండగా, ఆ పాఠశాల భవనాన్ని సైనికులు చుట్టుముట్టారు. ఆ సమావేశంలో పాల్గొంటున్నవారితో అధిక సంఖ్యాకులైన ఐచ్ఛిక పోరాట దళాల సభ్యులు లొంగిపోయేందుకు నిరాకరించి, ఆ భవనంలో బ్యారికేడ్లు నిర్మించుకున్నారు. సైనికులు ఆ భవనంమీద కాల్పులు జరిపారు. 30మందికిపైగా చంపబడటమో, గాయపడటమో జరగ్గా, 120మంది అరెస్టుచెయ్యబడ్డారు. – 15.

7 క్రాస్నయ ప్రేస్న్య (ఎర్ర ప్రేస్న్య) (1918కి ముందు – ప్రేస్న్య నది పేరుగల) – మాస్కోలోని చరిత్రాత్మకమైన ఒక పేట. 1905 నాటి డిసెంబరు సాయుధ తిరుగుబాటు రోజుల్లో ఆ పేటలో తీవ్రమైన పోరాటాలు జరిగాయి. మాస్కో కార్మికుల తిరుగుబాటును అణచివేసేందుకుగాను సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి సెమ్యోనొవ్‌స్కీ గార్డ్స్ రెజిమెంటు సైనికులు మాస్కోకి పంపబడ్డారు. – 15.

8 "ఇస్క్రా" ("నిప్పు రవ్వ") – తొలి అఖిల రష్యా మార్క్సిస్టు పత్రిక. దీన్ని వి. ఐ. లెనిన్ 1900లో స్థాపించాడు. "ఇస్క్రా" మొదటి సంచిక లైప్జిగ్‌లోనూ, తదుపరి సంచికలు మ్యూనిచ్, లండన్, జెనీవాల్లోనూ ప్రచురింపబడ్డాయి.

మార్క్సిస్టు పార్టీకోసం జరిగిన పోరాటంలోనూ, సోషల్ డెమోక్రటిక్ గ్రూపులను సమైక్యం చెయ్యడంలోనూ, పార్టీ కార్యక్రమ, నిబంధనావళులను రూపొందించడంలోనూ, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభను (1903) సమావేశపరచ

డంలోనూ "ఇస్క్రా" నిర్ణయాత్మక పాత్ర వహించింది. కానైతే, పార్టీ కార్యక్రమ విపులీకరణ క్రమంలో బయటకి పొక్కిన సంపాదకవర్గంలోపలి విభేదాలు రెండవ మహా సభానంతరం పత్రిక మెన్షెవిక్కుల చేతుల్లోకి పోయేందుకు దారితీశాయి 52వ సంచిక మొదలుకొని దరిమిలా "ఇస్క్రా" విప్లవాత్మక మార్క్సిస్టు పత్రికగా వుండటం ముగిసిపోయింది. అప్పటినుంచి పార్టీ సభ్యులు పాత "ఇస్క్రా"ని లెనినిస్టు, బోల్షెవిక్ పత్రిక అనీ, కొత్త "ఇస్క్రా"ని మెన్షెవిక్, అవకాశవాద పత్రిక అనీ పిలిచారు. – 18.

9 "జర్మనీలో విప్లవమూ, విప్లవ ప్రతీఘాతమూ" అన్న ఎఫ్. ఎంగెల్స్ రచనకు యిది ప్రస్తావన. ఇది "New York Daily Tribune" పత్రికలో 1851–52 సంవత్సరాల్లో మార్క్స్ సంతకంతో వ్యాసపరంపరగా ప్రచురింపబడింది. 1913లో మార్క్స్, ఎంగెల్సుల లేఖలు ప్రచురింపబడేదాకా యీ రచన ఎంగెల్సుదని వెల్లడి కాలేదు. – 19.

10 1905–07 విప్లవంలో నిరంకుశ రాజరిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో లాత్వియన్ శ్రామికవర్గమూ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ మిక్కిలి ముఖ్యమైన పాత్ర వహించాయి. లాత్వియా అంతట్లోనూ సైనిక బృందాలూ, పోరాట దళాలూ ఏర్పాటుచెయ్యబడ్డాయి. బహిరంగ సమావేశాలూ, ప్రదర్శనలూ, సమ్మెలూ జరపబడ్డాయి. విప్లవోద్యమం కార్మికుల్నే కాకుండా సైనికులనూ, నావికులనూ, రైతుల్నీ కూడా ముంచెత్తింది. చాలా చోట్ల సద్యోజనితంగా నెలకొల్పబడిన విప్లవాత్మక పరిపాలనా సంస్థలు సోవియట్ల పాత్ర వహించాయి. కానైతే, లాత్వియాలో దండనాత్మకమైన దాడుల సహాయంతో విప్లవం అణచివేయబడింది. – 20.

11 దూరప్రాచ్యంలో ప్రాబల్యంకోసం రష్యా, జపానుల మధ్య 1904–05 సంవత్సరాల్లో జరిగిన సామ్రాజ్యవాద యుద్ధానికి యిది ప్రస్తావన. బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదం యిచ్చిన తోడ్పాటు పర్యవసానంగా ఆ యుద్ధంలో జపాన్ విజయం పొందింది. – 20.

12 స్టేట్ డూమా – 1905 విప్లవ ఘటనల ప్రభావంచేత జారు సమావేశపరచవలసి వచ్చిన ప్రతినిధుల సంస్థ. లాంఛనంగా దానికి శాసనాధికారాలు వున్నాయి, కానీ ఆచరణలో నిజమైన అధికారం యేదీ లేదు. డూమకు యెన్నికలు పరోక్షంగా, అసమానంగా వున్నాయి; వోట్లు అందరికీ లేవు. శ్రామిక ప్రజలకూ, రష్యనేతర జాతులకూ వోటింగు హక్కులు చాలా యెక్కువగా పరిమితపరచబడ్డాయి. కార్మిక కర్షకులలో చాలామందికి అసలే వోట్లు లేవు.

మొదటి దూమకు ఎన్నికలు 1906 ఏప్రిల్‌లో జరిగాయి. జూలైలో జారిస్టు ప్రభుత్వం దాన్ని రద్దుచేసింది. – 20.

13 1906 స్వెయాబోర్గ్‌లోనూ, 1905 అక్టోబరులో, 1906 జూన్‌లో క్రోన్‌స్టాడ్ట్‌లోనూ జరిగిన తిరుగుబాటులకు యిక్కడ ప్రస్తావన. ఆ తిరుగుబాట్లను జారిస్టు ప్రభుత్వం అణచివేసింది. – 20–21.

14 1908 మధ్యలో ఏర్పడిన మెన్షెవిక్కులలో దక్షిణ పక్షానికి యిది ప్రస్తావన. దాని అనుచరులు రహస్య విప్లవ పార్టీని రద్దుచెయ్యాలని వాదించారు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. విప్లవాత్మక కార్యక్రమాన్ని పరిత్యజించారు, బహిరంగ సంస్కరణవాద పార్టీని స్థాపించాలని ప్రతిపాదించారు. – 22.

15 1908 డిసెంబరులో పారిస్‌లో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ అఖిల రష్యా కాన్ఫరెన్సుని గురించి లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఆ కాన్ఫరెన్సు రష్యాలో అప్పట్లో వున్న పరిస్థితిని ప్రగాఢంగా విశ్లేషించి, అభివృద్ధి నిరోధక దశలో పార్టీ ఎత్తుగడలను రూపొందించింది.

ఆనాటి రాజకీయ పరిస్థితిమీదా, పార్టీ కర్తవ్యాలమీదా ఆ కాన్ఫరెన్సు ఆమోదించిన తీర్మానం దేశపు రాజకీయ, ఆర్థిక పరిస్థితిని గురించి సమగ్రంగా అంచనా వేసింది. ఆ తీర్మానం నిరంకుశ రాజరికం బూర్జువా రాజరికంగా పరిణామం చెందడాన్నీ, వర్తక, పారిశ్రామిక బూర్జువావర్గపు పైపొరపట్ల నిరంకుశ రాజరికపు సౌహార్దాన్నీ, రైతాంగపు పైపొరతో పొత్తు పెట్టుకోవాలన్న నిరంకుశ రాజరికపు వాంఛనూ, మెన్షెవిక్కులలో రద్దువాద ధోరణి పెరుగుదలనూ కూడా ప్రతిబింబించింది. ఆ తీర్మానం నూతన విప్లవపు భావి రూపాన్నీ, నూతన విప్లవ వెల్లువ అనివార్యతనూ సుస్పష్టంగా చిత్రించింది.

లెనిన్ ప్రతిపాదన మేరకు ఆ కాన్ఫరెన్సు రద్దువాదాన్ని ఖండించి, పార్టీకి ప్రతికూలమైన యీ ధోరణిమీద అవిరామ పోరాటం జరపవలసిందిగా అన్ని పార్టీ శాఖలకూ విజ్ఞప్తిచేసింది. ఈ కాన్ఫరెన్సులో మెన్షెవిక్ రద్దువాదులమీద బోల్షెవిక్కులు ఒక ప్రధాన విజయాన్ని సాధించారు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ కాన్ఫరెన్సు రష్యన్ కార్మికోద్యమ అభివృద్ధిలో ఒక మూలమలుపు. కార్మికవర్గపు విప్లవకర శక్తుల్ని బోల్షెవిక్ కేంద్రం చుట్టూ సమీకరించేందుకు యిది పునాదిని వేసింది. – 22.

16 1903లో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో ముందుకు తేబడి, పార్టీ

కార్యక్రమంలో చేర్చబడిన ప్రజాతంత్ర రిపబ్లిక్, భూస్వాముల భూముల జప్తు, 8 గంటల పనిరోజు అనే విప్లవాత్మక డిమాండ్లు "తగ్గించబడని" నినాదాలని పిలవబడ్డాయి.

అభివృద్ధినిరోధక పరిస్థితుల్లో మెన్షెవిక్కులు పార్టీ కార్యక్రమంలోని విప్లవాత్మక డిమాండ్లనూ, నినాదాలనూ పరిత్యజించి, తక్షణ కార్యక్రమంనుంచి విప్లవ సమస్యని వదలివేసి రాజ్యాంగచట్టపరమైన శకం అనబడేది వచ్చిందని ప్రకటించారు. – 23.

[17] మూడవ స్టేట్ దూమ (1907–1912) 1907 జూన్ 3 నాటి కొత్త అభివృద్ధినిరోధక ఎన్నికల చట్టపు ప్రాతిపదికమీద ఎన్నుకోబడింది. ఈ చట్టం కార్మికుల, రైతుల హక్కుల్నీ, పట్టణవాసపు పెటీబూర్జువావర్గపు హక్కుల్నీ మరింతగా కుంటుపరచి, భూస్వాముల, బడా పెట్టుబడిదారుల పూర్తి ప్రాబల్యాన్ని స్థిరపరచింది. మూడవ స్టేట్ దూమ పోలీసులకీ, రాజకీయ పోలీసులకీ, కోర్టులకీ, జైళ్లకీ పుష్కలంగా డబ్బు కేటాయించడం ద్వారా జూన్ 3 అభివృద్ధినిరోధక పాలనను, దేశాంగ, విదేశాంగ విధానపు అన్ని సమస్యలపైనా పూర్తిగా బలపరచింది.

దూమ వేదికను వినియోగించుకునేందుకుగాను, దూమకి జరిగిన ఎన్నికల్లో బోల్షెవిక్కులు పాల్గొన్నారు. నలుగురు ప్రతినిధుల్ని ఎన్నికచేయించుకోవడంలో వాళ్లు సఫలురయ్యారు. మొత్తంమీద దూమకి ఎన్నుకోబడిన 19మంది సోషల్ డెమోక్రట్లూ తమ సొంత గ్రూపును ఏర్పాటుచేసుకున్నారు. ఆ గ్రూపులోపల బోల్షెవిక్కులకీ మెన్షెవిక్కులకీ మధ్య తీవ్రమైన పోరాటం సాగింది. తమ మెజారిటీని వినియోగించుకొని మెన్షెవిక్కులు పార్టీ పంథాని వక్రీకరించి, పార్టీ నాయక సంస్థలు ఆమోదించిన అతి ముఖ్యమైన తీర్మానాలను భగ్నంచేశారు. మెన్షెవిక్ ప్రతినిధుల మూలంగా సోషల్ డెమోక్రటిక్ గ్రూపు కార్యకలాపాల్లో, ప్రత్యేకించి మొదట్లో, చాలా పొరపాట్లు జరిగాయి. అత్యంత పురోగామి కార్మికుల తీవ్ర విమర్శకు గురయ్యాయి. – 23.

[18] మూడవ స్టేట్ దూమలో భూస్వాముల, బడా బూర్జువావర్గ ప్రతినిధులూ, విప్లవోద్యమాన్ని ప్రతిఘటించేందుకు ఏర్పాటుచెయ్యబడిన సామూహిక హత్యాకాండల్లో నిమగ్నులైన రాజరిక సంఘాల ప్రతినిధులూ ("నల్ల నూర్లవాళ్లు") ప్రాబల్యం వహించారు. అందుకే లెనిన్ మూడవ స్టేట్ దూమని "నల్ల నూర్ల" లేక "నల్ల" దూమ అని పిలుస్తూండేవాడు. – 24.

[19] "త్రుదొవిక్కులు" – స్టేట్ దూమల్లోని పెటీబూర్జువా ప్రజాతంత్రవాదుల ఒక

గ్రూపు. మొదటి దూమలోని రైతు ప్రతినిధుల్లోనుంచి 1906 ఏప్రిల్లో త్రుదొవీక్ గ్రూపు ఏర్పడింది. దూమలో వాళ్లొక నిర్దిష్టమైన పంథా అంటూ ఏదీ అనుసరించ లేదు, తమదంటూ రాజకీయ వేదిక ఏదీ వాళ్లకి లేదు. కాగా, వాళ్లు సోషల్ డెమోక్రట్లకీ, బడా బూర్జువావర్గ పార్టీలకీ మధ్య ఊగిసలాడారు. సన్నకారు సొంతదారుల — రైతుల — వర్గస్వభావం మూలంగానే యీ ఊగిసలాటలు నిర్ధరింపబడ్డాయి. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం "త్రుదొవీక్కులు" విప్లవప్రతీఘాతం పక్షాన చేరారు. — 24.

20 అక్టోబరిస్టులు — రష్యాలో 1905–17 దశలో ఏర్పాటుచెయ్యబడిన "అక్టోబరు పదిహేడు సంఘం" అనే పార్టీ సభ్యులు. బడా భూస్వాములు, వర్తక, పారిశ్రామిక బూర్జువావర్గంతో కూడిన పార్టీ యిది. పౌర స్వేచ్ఛలనూ, శాసన నిర్మాణ దూమనీ ప్రకటించిన 1905 అక్టోబరు 17వ తేదీ నాటి ప్రణాళిక ద్వారా దానికి ఆ పేరు వచ్చింది. వాస్తవానికి విప్లవ పోరాటంనుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఉద్దేశింపబడిన ఒక ఎత్తుగడ అయిన ఆ ప్రణాళిక అక్టోబరిస్టుల రాజకీయ ఆకాంక్షలను సంతృప్తిపరచింది. జారిస్టు ప్రభుత్వపు అభివృద్ధినిరోధక విధానాన్ని అక్టోబరిస్టులు పూర్తిగా బలపరిచారు. ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం తర్వాత అక్టోబరిస్టులు పాలక పార్టీ అయి, రష్యాలో తలెత్తుతున్న సోషలిస్టు విప్లవానికి వ్యతిరేకంగా చురుగ్గా పోరాడారు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం తమ యావచ్ఛక్తి యుక్తులనూ వినియోగించి, సోవియట్ అధికారానికి వ్యతిరేకంగా పోరాడారు. — 24.

21 కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ (కాడెట్లు) — రష్యన్ ఉదారవాద రాజరికవాద బూర్జువావర్గపు ప్రముఖ పార్టీ. అది 1905 అక్టోబరులో నెలకొల్పబడింది. బూర్జువా వర్గపు, భూస్వాముల, బూర్జువా మేధావుల ప్రతినిధులతో కూడివున్న పార్టీ అది. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో కాడెట్లు జారిస్టు ప్రభుత్వం అనుసరించిన కొల్లదారీ విదేశాంగ విధానాన్ని బలపరచారు. ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కాలంలో రాజరికాన్ని కాపాడేందుకు ప్రయత్నించారు. బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో ప్రముఖ పదవులను వహించిన కాడెట్లు ప్రజావ్యతిరేక, విప్లవప్రతీఘాత విధానాన్ని అనుసరించారు. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ విజయానంతరం కాడెట్లు సోవియట్ అధికారానికి వ్యతిరేకంగా క్రియాశీలమైన పోరాటం జరిపారు. — 24.

22 స్తొలీపిన్ వ్యవసాయ సంస్కరణని లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. రష్యాలో రైతుల భూమి స్వాధీనానుభవ వ్యవస్థకి సంబంధించిన యీ బూర్జువా సంస్కరణకి మంత్రి పి. ఎ. స్తొలీపిన్ పేరు వచ్చింది. భూస్వామ్య ఎస్టేట్లను అలాగే వుంచి చిల్లరమల్లర

భూ కమతాలను రద్దుచెయ్యడం, గ్రామంలో శ్రేణీకరణను త్వరితపరచి, కులాక్కుల (ధనిక రైతుల) రూపంలో నిరంకుశ రాజరికానికి అదనపు ప్రధానాధారాన్ని కల్పించడమే యీ సంస్కరణ లక్ష్యం. స్తొలీపిన్ వ్యవసాయ సంస్కరణ రైతు జనసామాన్యపు యితోధిక ఆర్థిక వినాశానికీ, కులాక్కులకీ గ్రామీణ పేదలకీ మధ్య వర్గ వైరుధ్యాలు తీవ్రతరమయ్యేందుకూ దారితీసింది. – 24.

23 సోషలిస్టు వ్యతిరేక చట్టం – 1878లో జర్మనీలో బిస్మార్క్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యీ చట్టం కార్మికవర్గాన్నీ, సోషలిస్టు ఉద్యమాన్నీ దెబ్బతీసేందుకు ఉద్దేశింపబడింది. ఈ చట్టం మేరకు సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన అన్ని సంఘాలూ, అన్ని కార్మిక సంఘాలూ, కార్మికవర్గపు అన్ని పత్రికలూ నిషేధింపబడ్డాయి. సోషలిస్టు సాహిత్యం జప్తుచెయ్యబడింది, సోషల్ డెమోక్రట్లు హింసింపబడి, దేశంనుంచి వెళ్లగొట్టబడ్డారు. కానైతే, యీ నిర్బంధాలు సోషల్ డెమోక్రటిక్ పార్టీని విచ్ఛిన్నంచెయ్యలేకపోయాయి. ఆ పార్టీ రహస్య పరిస్థితుల్లో తన కార్యకలాపాలను పునర్నిర్మించుకోగలిగింది. అదే సమయంలో, జనబాహుళ్యంతోడి తన సంబంధాలను సుదృఢంచేసుకునేందుకుగాను చట్టబద్ధమైన అవకాశాలను విస్తృతంగా వినియోగించుకుంది. దాని పలుకుబడి నిరంతరాయంగా పెరుగుతూవచ్చింది. 1878–90 దశలో జర్మన్ పార్లమెంటు (రైహ్‌స్టాగ్)కి జరిగిన ఎన్నికల్లో సోషల్ డెమోక్రట్లకి వచ్చిన **వోట్ల** సంఖ్య మూడు రెట్లకిపైగా పెరిగింది. మార్క్స్, ఎంగెల్సులు జర్మన్ సోషల్ డెమోక్రట్లకి విశేషమైన తోడ్పాటు యిచ్చారు. నానాటికీ పెంపొందుతున్న సామూహిక కార్మికోద్యమపు ఒత్తిడి మూలంగా సోషలిస్టులకి వ్యతిరేకంగా ఈ చట్టం 1890లో రద్దుచెయ్యబడింది. – 26–27.

24 "ఒత్జొవిస్టులు" – 1908లో బోల్షెవిక్కుల్లో తలెత్తిన ఒక అవకాశవాద గ్రూపు. విప్లవాత్మక పదాల మాటున మూడవ స్టేట్ దూమనుంచి సోషల్ డెమోక్రటిక్ ప్రతినిధులను ఉపసంహరించాలనీ, చట్టబద్ధమైన సంఘాల్లో కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలనీ డిమాండుచేశారు. అభివృద్ధినిరోధక పరిస్థితుల్లో పార్టీ రహస్య కార్యకలాపాలు మాత్రమే జరపాలన్న అభిప్రాయంతో, దూమలోనూ, కార్మికుల వృత్తి సంఘాల్లోనూ, సహకార సంఘాల్లోనూ, తదితర చట్టబద్ధ, అర్ధచట్టబద్ధ ప్రజా సంఘాల్లోనూ పాల్గొనేందుకు ఒత్జొవిస్టులు నిరాకరించారు. – 27.

25 నరోద్నిక్కులు – రష్యన్ విప్లవోద్యమంలో 1860, 1870 దశకాల్లో తలెత్తిన నరోదిజం అనే ఒక పెటీబూర్జువా ధోరణికి చెందినవాళ్లు. నరోద్నిక్కులు నిరంకుశ

రాజరికాన్ని రద్దుచెయ్యాలనీ, భూస్వాముల భుక్తంలో వున్న భూమిని రైతులకు బదిలీ చెయ్యాలనీ వాంఛించారు. రష్యాలో పెట్టుబడిదారీ సంబంధాల నియమబద్ధమైన అభివృద్ధిని వాళ్ళు తిరస్కరించి, తన్మూలంగా శ్రామికవర్గాన్ని కాక, రైతాంగాన్ని ప్రధాన విప్లవ శక్తిగా పరిగణించారు. అంతే కాకుండా, గ్రామ కమ్యూన్‌ని వాళ్ళు సోషలిజానికి పిండప్రాయంగా పరిగణించారు. నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా పోరాడేందుకోసం రైతులను ఉత్తేజితులను చేసే ప్రయత్నంలో నరోద్నిక్కులు గ్రామాలకి, అంటే, "ప్రజల మధ్యకి" వెళ్ళారు గాని, వాళ్ళకి అక్కడ తోడ్పాటు లభించలేదు.

నరోద్నిక్కుల సోషలిజం ఊహాజనితమైనది. అది సమాజపు వాస్తవాభివృద్ధిమీద ఆధారపడకపోవడమే యిందుకు కారణం. నరోదిజం తన అభివృద్ధి క్రమంలో విప్లవ ప్రజాస్వామ్యంనుంచి ఉదారవాదందాకా, కొన్ని దశలగుండా పరిణామం చెందింది.

1880, 1890 దశకాల్లో నరోద్నిక్కులు జారిజంతో రాజీ విధానాన్ని అవలంబించి, ధనిక రైతుల ప్రయోజనాలను వ్యక్తంచేసి, మార్క్సిజానికి వ్యతిరేకంగా పోరాటం జరిపారు. – 31.

26 డిసెంబరిస్టులు – రష్యన్ ప్రభువర్గానికి చెందిన విప్లవకారులు, భూదాస్య విధానాన్నీ, నిరంకుశ ప్రభుత్వాన్నీ వ్యతిరేకించి, 1825 డిసెంబరు 14న సాయుధ తిరుగుబాటును లేవదీసినవాళ్ళు. – 31.

27 1848 జూన్ 23–26 తేదీల్లో పారిస్ శ్రామికవర్గం జరిపిన తిరుగుబాటుకి యిది ప్రస్తావన. ఆ తిరుగుబాటులో 40 వేలమందికిపైగా పాల్గొన్నారు. ప్రభుత్వ సైనికులు ఆ తిరుగుబాటును క్రూరంగా అణచివేశారు.

1848–49లో యూరప్‌లో జరిగిన విప్లవానికి ఆ జూన్ తిరుగుబాటు శిఖరప్రాయమైనది. లెనిన్ దాన్ని శ్రామికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య జరిగిన మొట్టమొదటి బృహత్తర అంతర్యుద్ధంగా పేర్కొన్నాడు. – 32.

28 "చిరకాల క్రామేడ్‌కి" లేఖలనుంచి (4వ, 2వ లేఖలు) లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు.

మొదటి ఇంటర్నేషనల్‌కి (అంతర్జాతీయ కార్మిక సంఘం) యిది ప్రస్తావన – 1864 సెప్టెంబరు 28న స్థాపించబడిన యీ సంఘం శ్రామికవర్గపు తొట్టతొలి అంతర్జాతీయ ప్రజా సంఘం. ఈ మొదటి ఇంటర్నేషనల్ స్థాపన, కార్మికవర్గపు విప్లవకర పార్టీకోసం అనేక సంవత్సరాలపాటు మార్క్స్, ఎంగెల్సులు జరిపిన ఎడతెగని కృషి ఫలితం.

మొదటి ఇంటర్నేషనల్ వివిధ దేశాల్లో కార్మికులు జరిపిన ఆర్థిక, రాజకీయ

పోరాటానికి మార్గదర్శకత్వం వహించి, వారి అంతర్జాతీయ సంఘీభావాన్ని సుదృఢంచేసింది. మార్క్సిజాన్ని వ్యాపింపజెయ్యడంలోనూ, సోషలిజాన్ని కార్మికోద్యమంతో మేళవించడంలోనూ మొదటి ఇంటర్నేషనల్ బృహత్తరమైన పాత్ర వహించింది.

1870 దశకంలో యూరపియన్ దేశాల్లోని రాజకీయ అభివృద్ధినిరోధకత్వ, పోలీసు బీభత్స పరిస్థితుల్లో మొదటి ఇంటర్నేషనల్ తన కార్యకలాపాలను నిలిపేసింది. 1876లో లాంఛనప్రాయంగా అది రద్దుచెయ్యబడింది. – 33.

[29] సోషలిస్టు రివల్యూషనరీలు (ఎస్.ఆర్.లు) – 1901–23 మధ్య రష్యాలోని ఒక పెటీబూర్జువా పార్టీ సభ్యులు. సోషలిస్టు రివల్యూషనరీలు శ్రామికవర్గానికీ, రైతాంగానికీ మధ్య వున్న వర్గ తేడాని చూడలేకపోయారు. రైతాంగం మధ్య వున్న వర్గ నిశ్రేణీకరణనూ, వైరుధ్యాలనూ మరుగుపరచారు. విప్లవంలో శ్రామికవర్గపు నాయకత్వ పాత్రను తిరస్కరించారు.

సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ వ్యవసాయ కార్యక్రమం భూమిపైన వ్యక్తి స్వామ్యపు రద్దునూ, సమానకరణ భూమి అనుభవ సూత్రాల మేరకు గ్రామ కమ్యూన్లకు భూమి బదలాయింపునూ ఉద్దేశించింది. బూర్జువా ప్రజాతంత్ర విప్లవ దశలో యీ డిమాండ్లు రైతాంగపు ప్రయోజనాలనూ, ఆకాంక్షలనూ వస్తుపరంగా ప్రతిబింబించాయి. "భూమి సామాజికీకరణ"గా సోషలిస్టు రివల్యూషనరీలు చూపప్రయత్నించిన కార్యక్రమంలో సోషలిజం అన్నదేమీ లేదు. లెనిన్ నిరూపించినట్లు భూమిపైన వ్యక్తిగత స్వామ్యపు రద్దు పెట్టుబడి ప్రాబల్యాన్నీ, జనబాహుళ్యపు పేదతనాన్నీ రద్దుచెయ్యలేదు.

1917 ఫిబ్రవరిలో నిరంకుశ రాజరికం కూలదొయ్యబడ్డాక, సోషలిస్టు రివల్యూషనరీలు సోషలిస్టు విప్లవానికి సన్నద్ధమవుతున్న కార్మికవర్గానికి వ్యతిరేకంగా పోరాటం జరిపారు. 1917 వేసవిలో రైతు ఉద్యమాల అణచివేతలో పాల్గొన్నారు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం ఎస్.ఆర్.లు సోవియట్ అధికారానికి వ్యతిరేకంగా చురుకుగా పోరాడారు. – 33.

[30] రష్యాలో భూదాస్య విధానాన్ని రద్దుచేసిన రైతు సంస్కరణకి యిది ప్రస్తావన. భూదాస్యంనుంచి విముక్తులైన రైతులను గురించిన ప్రణాళికమీదా, నియమావళిమీదా రెండవ అలెక్సాండ్ర్ చక్రవర్తి 1861 ఫిబ్రవరి 19న సంతకం చేశాడు. ఆ సంస్కరణ భూస్వాముల ప్రయోజనాలకు అనుకూలంగా అమలుజరపబడింది. భూమిమీద వ్యక్తిగత స్వామ్యం అలాగే వుండిపోయింది. భూస్వాములనుంచి రైతులకి కేటాయింపబడిన భూములను

రైతులు డబ్బు చెల్లించి విడిపించుకోవలసివచ్చింది. తమకి కేటాయింపబడిన భూముల విడుదలకోసం రైతులు డబ్బు చెల్లించడమన్నది భూస్వాములూ, జారిస్టు ప్రభుత్వమూ ప్రత్యక్షంగా చేసిన దోపిడీ తప్ప మరేమీ కాదు. ఈ విడుదల మొత్తాల చెల్లింపులు రైతులకు కేటాయించబడిన భూఖండాల అసలు ధరని గణనీయంగా మించి వుండి, రైతు కమతాల వినాశానికి దారితీశాయి.

భూమి పంపిణీ క్రమంలో భూస్వాములు రైతులకు కేటాయింపబడిన భూముల నుంచి తమకోసం కొంత అధీనం చేసుకున్నారు ("చీల్చివేసిన" భూములు), రైతులకు నాసి భూముల్ని వదిలేస్తూ వుండేవారు. భూస్వాములు యీవిధంగా, పచ్చిక బయళ్లు, అడవులు, నీటివనరులున్న చోట్లు, పశుగ్రాస బీళ్లతోబాటు (యివి లేనిదే రైతులు స్వతంత్రంగా సేద్యం చెయ్యలేరు) సుక్షేత్రాలను కూడా కలిగివుండేవారు. – 34.

31 అఖిల రష్యా రైతు సంఘం – రష్యాలో 1905–07 సంవత్సరాల్లో వున్న ఒక సామూహిక ప్రజా విప్లవ ప్రజాతంత్ర సంఘం. దాని సభ్యత్వం సుమారు 2 లక్షలు వుండేది. దాని కార్యక్రమంలో భూమి జాతీయకరణకీ, రాజకీయ స్వేచ్ఛలకీ, రాజ్యాంగ నిర్ణయ సభ సమావేశానికీ సంబంధించిన డిమాండ్లు వున్నాయి. కానైతే, సోషలిస్టు రివల్యూషనరీల, ఉదారవాదుల ప్రభావంలో ఉన్న కారణంగా, ఆ రైతు సంఘం పెటీ బూర్జువా అర్ధమనస్కతనూ, ఊగిసలాటలనూ, అనిశ్చితత్వాన్నీ ప్రదర్శించింది. – 34.

32 "కోలొకొల్" ("గంట") – ఎ. గేర్‌త్సెన్, ఎన్. ఒగర్యోవ్‌లు ప్రచురించిన ఒక రాజకీయ పత్రిక. 1857 జూలై 1నుంచి 1865 ఏప్రిల్‌దాకా లండన్‌లోనూ, 1865 మేనుంచి 1867 జూలైదాకా జెనీవాలోనూ అది ముద్రింపబడింది. దాని ముఖ వాక్యం "Vivos voco!" ("సజీవులకి నా విజ్ఞప్తి!").

విప్లవాత్మక పత్రికలకూ, సెన్సారులేని పత్రికలకూ అగ్రశ్రేణిలో వున్న "కోలొకొల్," రష్యాలో ప్రజాతంత్ర, విప్లవోద్యమాన్ని పెంపొందించడంలోనూ, నిరంకుశ రాజరికానికీ, భూదాస్య విధానానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటంలోనూ అదొక ముఖ్య పాత్ర వహించింది. – 34.

33 "పొల్యార్నయ జ్వెజ్దా" ("ధ్రువ తార") – ఒక సాంస్కృతిక, రాజకీయ సంకలనం. 1855–62లలో లండన్‌నుంచి ప్రచురింపబడింది. మొత్తం 8 సంచికలు వెలువడ్డాయి. మూడు సంచికలు గేర్‌త్సెన్‌చేత ప్రచురింపబడ్డాయి. మిగిలినవి గేర్‌త్సెన్, ఒగర్యోవ్‌లచేత వెలువరచబడ్డాయి. ప్రగతిశీల రష్యన్ సాహిత్యాభివృద్ధిలోనూ, సామాజిక చింతనలోనూ "పొల్యార్నయ జ్వెజ్దా" ముఖ్య పాత్ర వహించింది. – 34.

34 రజ్నొచీంత్సి (విప్లవకర సామాన్యులు) – జనాభాలో ఒక విభాగం. దీనికి చట్టపరమైన స్థిరత్వం లేదు. వివిధ వర్గాలకు చెందిన యీ విభాగంలో వర్తక తరగతులకీ, మతాధిపతులకీ, సామాన్య ఉద్యోగులు వగైరాలకీ చెందిన మేధావులు వుండేవారు. రజ్నొచీంత్సి బూర్జువా ప్రజాతంత్ర, విప్లవ ప్రజాతంత్ర భావజాలానికి వాహికగా వ్యవహరించారు. – 35.

35 జారిస్టు నిరంకుశ రాజరికపు పీడనకి వ్యతిరేకంగా ఉద్దేశింపబడిన 1863–64 నాటి పోలిష్ జాతీయ విముక్తి తిరుగుబాటును లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. మొదట, యీ తిరుగుబాటుకి 1862 "రెడ్స్" పెటీబూర్జువా పార్టీ కేంద్ర జాతీయ కమిటీ నాయకత్వం వహించింది. ఆ కమిటీ కార్యక్రమంలో పోలండు జాతీయ స్వాతంత్ర్యం, జాతి, మత ప్రసక్తి లేకుండా దేశంలో అందరికీ సమానత్వం, రైతులు దున్నే భూమిని భూమి విడుదలకోసం ఎలాంటి మొత్తాలూ చెల్లించనవసరం లేకుండా వాళ్లకి దఖలుపరచడం, వగైరా డిమాండ్లు వున్నాయి. వాటి మూలంగా ఆ తిరుగుబాటులో పోలిష్ జనాభాలోని వివిధ విభాగాలకు చెందిన వృత్తిపనివాళ్లూ, కార్మికులూ, విద్యార్థులూ, మేధావులూ, రైతాంగంలో ఒక విభాగమూ, మతాధిపతులూ పాల్గొన్నారు.

దరిమిలా, ఆ తిరుగుబాటులో "వైట్స్" పార్టీ (బడా భూస్వామ్య ప్రభువులూ, బడా బూర్జువావర్గమూ) చుట్టూ సమీకృతులైనవాళ్లు చేరారు. వాళ్లు ఆ తిరుగుబాటును తమ ప్రయోజనాలకోసం వినియోగించుకోవాలనీ, బ్రిటన్, ఫ్రాన్సుల సహాయంతో జారిస్టు ప్రభుత్వంతో లాభసాటి బేరం కుదుర్చుకోవాలనీ వాంఛించారు.

విప్లవాత్మకమైన చొరవను కోల్పోయిన "రెడ్స్" పార్టీ అస్థిరత్వం మూలంగా, ఆ తిరుగుబాటు నాయకత్వం దానికి ద్రోహంచేసిన "వైట్స్" చేతుల్లోకి పోయింది. 1864 వేసవి నాటికి జారిస్టు సైనికులు ఆ తిరుగుబాటును క్రూరంగా అణచివేశారు.

మార్క్స్, ఎంగెల్సులు 1863–64 నాటి పోలిష్ తిరుగుబాటును ప్రగతిశీలమైనదిగా అంచనావేశారు. దానిపట్ల విశేషమైన సానుభూతి చూపారు. పోలిష్ ప్రజలు జాతీయ విముక్తికోసం జరిపిన పోరాటంలో వారికి విజయం కలగాలని కోరారు. జర్మన్ ప్రవాసుల తరపున మార్క్స్ లండన్‌లో పోలిష్‌వారికి సహాయంచెయ్యవలసిందిగా ఒక విజ్ఞప్తి చేశాడు. – 35.

36 మరీయ మేగ్దలీనా – బైబిల్ పురాణకథ ప్రకారం, పశ్చాత్తాపం పొందిన పాపి, జీసస్ క్రీస్తుకి విధేయ అనుచరి, జీసస్ పునరుత్థానం పొందినప్పుడు, ఆయన్ని అందర్లోకీ మొదట చూసే గౌరవం పొందినది. – 36.

[37] కజాన్ సమీపంలోని బెజ్దా గ్రామంలో జరిగిన రైతు తిరుగుబాటుకి యిది ప్రస్తావన. 1861 ఫిబ్రవరిలో భూదాస్యపు రద్దు షరతులను గురించిన ప్రణాళిక, నియమావళి జారీ రైతుల్లో నిరుత్సాహ నిరసనలని రేకెత్తించాయి. 1861 వసంతంలో కొన్ని గుబేర్నియాల్లో (రాష్ట్రాల్లో) రైతు తిరుగుబాట్లు జరిగాయి. వాటన్నింట్లోకీ ముఖ్యమైనది అంతోన్ పెత్రోవ్ అనే రైతుయువకుని నాయకత్వంలో బెజ్దా గ్రామంలో జరిగిన రైతుల తిరుగుబాటు. కజాన్ గుబేర్నియాలోని 75 గ్రామాల్లో తిరుగుబాట్లు చెలరేగాయి. బెజ్దా గ్రామంలో జరిగిన తిరుగుబాటు క్రూరంగా అణచివెయ్యబడింది. బెజ్దా విషాద ఘటనలు రష్యన్ సమాజంలోని ప్రగతిశీల విభాగాల్లో విస్తృతమైన ప్రతిస్పందనను కలిగించాయి. ఎ. ఐ. గేర్‌త్సెన్ తన "కోలొకొల్" పత్రికలో బెజ్దా విషాద ఘటనలను గురించి సవివరమైన వర్ణన యిచ్చాడు. – 36.

[38] హోలీ సినద్ – 1721–1917 మధ్య కాలంలో రష్యాలో ఆర్థడాక్స్ చర్చి వ్యవహారాలు చూసే అత్యున్నత ప్రభుత్వ సంస్థ. ఆ సినద్‌కి జారుచేత నియమింపబడిన ఒబర్-ప్రొక్యురేటర్ ఆధిపత్యం వహించేవాడు. 1917 అనంతరం ఆ సినద్, మాస్కో, అఖిల రష్యాల పేట్రియార్క్ దగ్గర ఒక సలహా సంస్థ అయింది. – 36.

[39] వర్తకంకోసం, పశ్చిమ ఓడరేవులకోసం, మార్కెట్లకోసం 16వ శతాబ్దంలో రష్యా జరిపిన గొప్ప పోరాటం మూలంగా, స్వీడన్, డెన్మార్కు, పోలండు, లిథువేనియా, జర్మనీ, ఇంగ్లండులతో రష్యా సంబంధాలు సంక్లిష్టమయ్యాయి. రష్యన్, ప్రష్యన్ రాజవంశాల మధ్య వైవాహిక సంబంధాలను ఆ దేశాలు ప్రోత్సహించాయి. చివరకు యిది, రష్యన్ సామ్రాట్టుల కుటుంబపు జర్మనీకరణకూ, రష్యాలో జర్మన్ మిలిటరీ సంస్థాపనకూ దారితీసింది. – 36.

[40] "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") – 1879 ఆగస్టులో స్థాపించబడిన నరోద్నిక్ టెరరిస్టుల రహస్య రాజకీయ సంఘం. నరోద్నిక్ ఊహాజనిత సోషలిస్టు భావాలకు అంటిపెట్టుకొని వుంటూనే, "నరోద్నయ వోల్య" సభ్యులు నిరంకుశ రాజరికపు కూల్చివేతనీ, రాజకీయ స్వాతంత్ర్య సాధననీ తమ ప్రధాన కర్తవ్యంగా పరిగణించి, రాజకీయ పోరాట పంథాని చేబట్టారు.

"నరోద్నయ వోల్య" సభ్యులు జారిస్టు నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా వీరోచితమైన పోరాటం జరిపారు. కాని, "క్రియాశీల" వీరులూ, "క్రియారహిత జనబాహుళ్యం" అనే పొరపాటు సిద్ధాంతంనుంచి బయల్దేరి, జనబాహుళ్యం పాల్గొనకుండా, తమ ప్రయత్నాల ద్వారా, వ్యక్తిగత టెరరిజం ద్వారా సమాజాన్ని పునర్నిర్మించాలని

వాళ్లు ఆశించారు. 1881లో క్రూరమైన నిర్బంధాల ద్వారా, కవ్వింపు ద్వారా, హతమార్చడం ద్వారా ప్రభుత్వం "నరోద్నయ వోల్య"ని అణచివేసింది.

"నరోద్నయ వోల్య" సభ్యుల పొరపాటు, ఊహాజనిత కార్యక్రమాన్ని విమర్శిస్తూనే, జారిజానికి వ్యతిరేకంగా వాళ్లు జరిపిన స్వార్థరహిత పోరాటంపట్ల లెనిన్ విశేషమైన గౌరవం చూపాడు. – 37.

41 "ఆర్థివాద" ధోరణి లేక "ఆర్థికవాదం" – 19వ శతాబ్దం చివర 20వ శతాబ్దం ఆరంభంలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో తలెత్తిన ఒక అవకాశవాద ధోరణి. అది అంతర్జాతీయ అవకాశవాద ధోరణుల్లో ఒక రకం.

ఆర్థికవాదులు కార్మికవర్గ కర్తవ్యాలను ఆర్థిక పోరాటానికి పరిమితంచేశారు. కార్మికోద్యమం సద్యోజనితత్వానికి దాసోహంచేసి, వాళ్లు కార్మికోద్యమంలో మార్క్సిస్టు పార్టీ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాలన్న భావాన్ని నిరాకరించి, తద్వారా బూర్జువా సిద్ధాంతానికి మార్గాన్ని సుగమం చేశారు. ఆర్థికవాదులు సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో అనైక్యతనూ, "అనిపుణతనూ" సమర్థించి, కేంద్రీకృతమైన కార్మికవర్గ పార్టీ ఆవశ్యకతను నిరాకరించారు. – 39.

42 "ప్రొస్వేష్చేనియె" పత్రికకు ప్రస్తావన ఇది. "ప్రొస్వేష్చేనియె" ("విద్య") – బోల్షెవిక్కుల సైద్ధాంతిక చట్టబద్ధ మాసపత్రిక, అది పీటర్స్‌బుర్గ్‌నుంచి డిసెంబరు 1911 – జూన్ 1914 మధ్య ప్రచురింపబడింది. లెనిన్ పారిస్‌నుంచి, తరువాత క్రాకొవ్, పొరోనినొనుంచి ఆ పత్రికకు నాయకత్వం వహించాడు: వ్యాసాలు సరిచూసుకున్నాడు, సంపాదకవర్గ సభ్యులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. – 39.

43 "బొర్బా" ("పోరాటం") – 1914 ఫిబ్రవరినుంచి జూలైదాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి ప్రచురింపబడిన ట్రాట్స్కీ పత్రిక. "గ్రూపు అతీత తత్వం" ముసుగులో లెనిన్‌కీ, బోల్షెవిక్ పార్టీకీ వ్యతిరేకంగా ట్రాట్స్కీ పోరాటం సాగించాడు. – 39.

44 "సేవెర్నయ రబోచయ గజేత" ("ఉత్తరాది కార్మికుల పత్రిక") – 1914 జనవరి 30 (ఫిబ్రవరి 12)నుంచి మే 1 (14)దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడిన మెన్షెవిక్కుల దినపత్రిక. మే 3 (16) దరిమిలా అది "నాష రబోచయ గజేత" ("మన కార్మికుల పత్రిక") పేర ప్రచురింపబడింది. లెనిన్ తన వ్యాసాల్లో దాన్ని హేళనగా "ఉత్తరాది రద్దువాదుల పత్రిక" అని పేర్కొన్నాడు. – 40.

45 స్టాక్‌హోమ్ మహాసభ (ఆర్.ఎస్.డి.ఎల్.పి. నాల్గవ ఐక్య మహాసభ) 1906 ఏప్రిల్‌లో

జరిగింది. ఆ మహాసభలో మెన్షెవిక్కులు అధిక సంఖ్యలో వున్నారు. ఆజెండాలోని ప్రతి అంశంపైనా బోల్షెవిక్కులకీ, మెన్షెవిక్కులకీ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. గట్టి ఘర్షణ అనంతరం, స్టేట్ దూమా, సాయుధ తిరుగుబాటు, అంశాలమీద మెన్షెవిక్కుల తీర్మానాలనూ, మెన్షెవిక్కులు ప్రతిపాదించిన వ్యవసాయ కార్యక్రమాన్నీ ఆ మహాసభ ఆమోదించింది.

అదే సమయంలో, పార్టీ బహుళ శాఖల డిమాండు మేరకు లెనిన్ ప్రతిపాదించిన నిబంధనావళిలోని మొదటి నిబంధనని ఆమోదించడం ద్వారా 1903లో ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ ఆమోదించిన మార్తొవ్ అవకాశవాద సూత్రీకరణను తిరస్కరించింది.

మహాసభలో జరిగిన తీవ్ర వాగ్వివాదం బోల్షెవిక్కుల మెన్షెవిక్కుల మధ్య గాఢమైన అభిప్రాయభేదాలను వెల్లడి చేసింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ (లండన్) మహాసభలో బోల్షెవిక్కులకి పోలండు రాజ్యం, లిథువేనియాల సోషల్ డెమొక్రట్ల, లెట్టుల తోడ్పాటు వుంది. బోల్షెవిక్కులు, యీ సోషల్ డెమొక్రట్లను ఒక విప్లవాత్మక వేదికమీద సమైక్యంచేసి, మెజారిటీని సంపాదించి, విప్లవాత్మక మార్క్సిస్టు విధానానికి విజయం సంపాదించారు. ఆ మహాసభ అన్ని మౌలిక అంశాలమీదా బోల్షెవిక్ తీర్మానాలను ఆమోదించింది. బోల్షెవిక్ ఎత్తుగడలు యావత్తు పార్టీకీ విధాయకమైన ఎత్తుగడలుగా ఆమోదింపబడ్డాయి. – 41.

46 వియన్నాలో 1912 ఆగస్టులో జరిగిన రద్దువాదుల ఆగస్టు కాన్ఫరెన్సు అనబడేదానికి యిది ప్రస్తావన.

ఆ కాన్ఫరెన్సు సోషల్ డెమొక్రటిక్ ఎత్తుగడలకి సంబంధించిన అన్ని సమస్యల మీదా రద్దువాద తీర్మానాలను ఆమోదించి, రహస్య పార్టీ ఉనికిని వ్యతిరేకించింది. ఎన్నికల ఎత్తుగడల విషయంలో, సార్వజనిక వోటింగు హక్కునీ, పొత్తులు పెట్టుకొనే స్వేచ్ఛనీ బలపరుస్తామని హామీ యిచ్చిన ఉదారవాద బూర్జువా పార్టీల అభ్యర్థులకు తోడ్పాటు యివ్వడం సమర్థనీయమైనదని ఆ కాన్ఫరెన్సు భావించింది.

రష్యాలో తమ సొంత మధ్యస్థవాద పార్టీని నెలకొల్పాలన్న రద్దువాదుల ప్రయత్నానికి కార్మికులు తోడ్పాటు యివ్వలేదు. కేంద్ర కమిటీని ఎన్నుకోలేకపోయిన రద్దువాదులు ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకోవడంతో సరిపెట్టుకున్నారు.

ఒకదానితో ఒకటి సరిగా పొసగని శక్తులతో ఏర్పాటుచెయ్యబడిన ఒక బోల్షెవిక్

వ్యతిరేక కూటమి — దీన్ని ఏర్పాటుచెయ్యడమే ఆ కాన్ఫరెన్సు ప్రధాన కర్తవ్యం — ఆచరణలో ఒకటి, ఒకటిన్నర ఏళ్లలో విచ్ఛిన్నమై పోయింది. — 41.

47 "ప్రావ్ద"వాళ్లు — "ప్రావ్ద" పత్రిక చుట్టూ ఐక్యంచెయ్యబడిన బోల్షెవిక్కులు. "ప్రావ్ద" ("సత్యం") పీటర్స్‌బుర్గ్‌లో 1912 ఏప్రిల్ 22 (మే 5) నుంచి ప్రచురింపబడిన బోల్షెవిక్ దినపత్రిక. కార్మికులు స్వయంగా పోగుచేసిన డబ్బుతో అది ప్రచురింపబడింది. లెనిన్ "ప్రావ్ద"కి మార్గదర్శకత్వం వహించి, దాదాపు రోజూ దానిలో రాశాడు, "ప్రావ్ద" సంపాదకవర్గానికి సూచనలు యిచ్చాడు.

"ప్రావ్ద" ఎడతెగని పోలీసు వేధింపును ఎదుర్కోవలసివచ్చింది. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవంలోగా దాని పేరు కొన్ని సార్లు మారింది. 1917 అక్టోబరు 27 (నవంబరు 9)న, పార్టీ కేంద్ర పత్రిక "ప్రావ్ద" అనే తన అసలు పేరుతో వెలువడనారంభించింది. సి.పి.ఎస్.యు. చరిత్రలో "ప్రావ్ద" చాలా గొప్ప పాత్ర వహించింది. అది పార్టీని ఐక్యంచేసి కార్మికులలో ఒక తరంవారికి మార్క్సిస్టు వైఖరిలో తర్ఫీదు యిచ్చింది. — 41.

48 వామపక్ష నరోద్నిక్కులు — సోషలిస్టు రివల్యూషనరీలు (29వ వివరణ చూడండి). — 41.

49 1912 ఫిబ్రవరిలో పారిస్‌లో జరిగిన పార్టీ వ్యతిరేక అన్ని గ్రూపుల, ధోరణుల సమావేశానికీ, 1912 ఆగస్టులో వియన్నాలో జరిగిన రద్దువాదుల కాన్ఫరెన్సుకీ ప్రస్తావన యిది. — 42.

50 "పార్టీ అనుకూల బోల్షెవిక్కులు" — రద్దువాదులతో రాజీపడే, ఐక్యమయ్యే వైఖరి కలిగిన బోల్షెవిక్కుల గ్రూపు.

"పార్టీ అనుకూల మెన్షెవిక్కులు" జి. వి. ప్లెహానొవ్ నాయకత్వాన అభివృద్ధి నిరోధక దశలో మెన్షెవిక్ వైఖరి తీసుకొంటూనే, రహస్య పార్టీ యంత్రాంగాన్ని రద్దువాదులకు వ్యతిరేకంగా పదిలపరచి, దృఢపరచాలన్నదానికి అనుకూలంగా నిలబడి, దానికోసం బోల్షెవిక్కులతో సంఘటనగా ఏర్పడిన ఒక గ్రూపు. పార్టీ అనుకూల మెన్షెవిక్కులు బోల్షెవిక్కులతోపాటు స్థానిక పార్టీ శాఖలలో కార్యకలాపాలు సాగించారు, బోల్షెవిక్కుల పత్రికలకు వ్యాసాలు రాశారు.

1911 చివర ప్లెహానొవ్ ఆ సంఘటనను భగ్నంచేశాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి.లో "గ్రూపు తత్వానికీ," చీలికకీ వ్యతిరేకంగా పోరాడే ముసుగులో ఆయన, అవకాశవాదులతో బోల్షెవిక్కులను రాజీపరచే ప్రయత్నం చేశాడు. — 42.

51 నాల్గవ స్టేట్ దూమకి 1912 ఆకురాలు కాలంలో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలకు చాలా ముందే బోల్షెవిక్కులు ప్రజల మధ్య విప్లవ ప్రచారోద్యమాన్ని మొదలుపెట్టారు. బోల్షెవిక్ శాఖల ఎన్నికల ప్రచారం యావత్తుకీ, లెనిన్ నాయకత్వాన, ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ మార్గదర్శకత్వం వహించింది. ఎన్నో యిబ్బందులు ఉన్నా కూడా బోల్షెవిక్ పార్టీ ఎన్నికల ప్రచారోద్యమాన్ని విజయవంతంగా వినియోగించుకొని, దూమ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది: మొత్తం కార్మికుల్లో 83 శాతంమంది బోల్షెవిక్కులకి ఓటుచేశారు, నాల్గవ దూమకి ఆరుగురు బోల్షెవిక్ ప్రతినిధులు ఎన్నుకోబడ్డారు. – 43.

52 "నాష జర్యా" ("మన ఉషారాగం") – సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 1910 జనవరికీ 1914 సెప్టెంబరుకీ మధ్య ప్రచురింపబడిన మెన్షెవిక్ రద్దువాదుల లీగల్ పత్రిక. రష్యాలో రద్దువాదుల కేంద్రం యీ పత్రిక చుట్టూనే ఏర్పడింది. – 47.

53 నాజ్‌ద్రోవ్ – గోగోల్ నవల "మృత జీవులు"లో కజ్జాకోర్లకీ, మోసగాళ్లకీ ఈ పాత్ర ప్రతీక.

"జూడాస్" గొలొవ్ల్యోవ్ – సల్తికోవ్-ష్చెద్రీన్ రచించిన "గొలొవ్ల్యోవ్ కుటుంబం" అన్న పుస్తకంలోని ఒక పాత్ర. ధర్మాడంబరం, కాపట్యం, హృదయరాహిత్యాల మూలంగా "జూడాస్" అన్న వ్యంగ్యాత్మకమైన పేరు సంపాదించుకున్నాడు. – 48.

54 క్యూరియా – కొన్ని బూర్జువా ఎన్నికల వ్యవస్థల్లో – వోటర్ల ఒక గ్రూపు. వోటర్లు తరగతినిబట్టీ, ఆస్తి అర్హతలనిబట్టీ గ్రూపులుగా విభజింపబడతారు.

స్టేట్ దూమకి నాలుగు క్యూరియాల ప్రకారం (వ్యావసాయిక, పట్టణ, రైతు, కార్మిక) ఎన్నికలు జరపబడ్డాయి. వీటిలో ప్రతి ఒక్కటీ అసమానమైన హక్కులు కలిగివుంటుంది.

స్టేట్ దూమలో తమ ప్రతినిధులను పెట్టి, జారిజాన్ని బహిర్గతంచేసి ఖండించేందుకూ, విప్లవ శక్తులను సంఘటితపరచేందుకూ దూమ వేదికను వినియోగించుకొనే ఉద్దేశంతో బోల్షెవిక్కులు స్టేట్ దూమకి జరిగిన ఎన్నికల్లో పాల్గొన్నారు.

మొదటిదాన్ని మాదిరిగానే రెండవ స్టేట్ దూమని కూడా (1907 ఫిబ్రవరి – జూన్) జారిస్టు ప్రభుత్వం రద్దుచేసింది.

1907 జూన్‌లో ప్రభుత్వం ఒక కొత్త ఎన్నికల చట్టాన్ని జారీచేసింది. ఆ చట్టం కార్మికులకీ, రైతులకీ, పట్టణవాస పెటీబూర్జువావర్గానికీ వున్న ఎన్నిక హక్కుల్ని మరింత కత్తిరించేసి, మూడవ స్టేట్ దూమ (1907–1912)లోనూ, నాల్గవ

స్టేట్ దూమ (1912–1917)లోనూ భూస్వాముల, బడా పెట్టుబడిదార్ల అభివృద్ధినిరోధక కూటమి పూర్తి ప్రాబల్యాన్ని స్థిరపరచింది. కానైతే, కార్మిక ప్రతినిధుల్లో బోల్షెవిక్ ప్రతినిధుల సంఖ్య పెరుగుతూవచ్చింది. – 48.

55 "లూచ్" ("కిరణం") – మెన్షెవిక్ రద్దువాదుల చట్టబద్ధ పత్రిక. ఇది 1912–13లలో సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి ప్రచురింపబడింది. ప్రధానంగా ఉదారవాదుల నుంచి వచ్చిన విరాళాలతో ఆ పత్రిక నిర్వహింపబడింది. – 49.

56 "Vorwärts" ("ముందుకు") – 1891నుండి బెర్లిన్‌నుంచి ప్రచురింపబడిన దినపత్రిక. ఇది జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కేంద్ర పత్రిక. ఎంగెల్స్ యీ పత్రికలో అవకాశవాద ధోరణులు అన్నింటిమీదా పోరాటం జరిపాడు. 1890 దశకపు చివరి సంవత్సరాల్లో, ఎంగెల్స్ మరణానంతరం, యీ వార్తాపత్రిక అజమాయిషీ పార్టీలోని మితవాద పక్షం చేతుల్లో పడింది. దానితో యీ పత్రిక అవకాశవాదుల వ్యాసాలను వరుసగా ప్రచురించింది.

1914–18 నాటి ప్రథమ ప్రపంచ యుద్ధ కాలంలో "Vorwärts" సోషల్ దురహంకార వైఖరిని చేబట్టింది. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవానంతరం అది సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని సాగించింది. ఈ పత్రిక ప్రచురణ 1933లో నిలిచిపోయింది. – 50.

57 1912 ఆకురాలు కాలంలో సమావేశపరచబడిన నాల్గవ స్టేట్ దూమలోని మెన్షెవిక్ ప్రతినిధుల్ని లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. నాల్గవ దూమలోని సోషల్ డెమోక్రటిక్ గ్రూపులో ఆరుగురు బోల్షెవిక్కులూ, ఏడుగురు మెన్షెవిక్కులూ వున్నారు. ఆ గ్రూపులో తమకి వున్న స్వల్ప మెజారిటీని మెన్షెవిక్కులు దాని కార్యకలాపాలను కుంటుబరచి, బోల్షెవిక్కులు ప్రతిపాదించిన కొన్ని తీర్మానాలు ఆమోదింపబడకుండా అడ్డు తగిలారు. 1913 అక్టోబరులో, పార్టీ కేంద్ర కమిటీ ఆదేశం మేరకు ఐక్య సోషల్ డెమోక్రటిక్ విభాగంనుంచి బోల్షెవిక్ ప్రతినిధులు ఉపసంహరించుకొని, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక విభాగం పేర ఒక స్వతంత్ర బోల్షెవిక్ విభాగంగా ఏర్పడ్డారు. – 51.

58 "పూత్య ప్రావ్ది" ("సత్య పంథా") – బోల్షెవిక్ పత్రిక "ప్రావ్ద" మారుపేర్లలో ఒకటి. – 52.

59 ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ, పార్టీ కార్యకర్తల సంయుక్త సమావేశం (రహస్య గోపనం నిమిత్తం దాన్ని "వేసవి" సమావేశం అన్నారు). ఈ సమావేశం, అప్పట్లో

లెనిన్ ఉంటున్న క్రాకొవ్ సమీపంలోని పొరోనిన్ గ్రామంలో 1913 అక్టోబరులో జరిగింది. ఈ సమావేశంలో కీలకమైన సమస్యలు చర్చింపబడిన మూలంగా దాని ప్రాముఖ్యం పార్టీ కాన్ఫరెన్సుకి సమానం.

దూమలోని సోషల్ డెమోక్రటిక్ గ్రూపును గురించిన తన తీర్మానంలో ఆ గ్రూపులోని బోల్షెవిక్, మెన్షెవిక్ సభ్యులు సమాన హక్కుల్ని కలిగివుండాలని ఆ సమావేశం డిమాండు చేసి, ఒక్క ఓటు యాదృచ్ఛిక మెజారిటీని అవకాశంగా తీసుకొని, రష్యాలోని అత్యధిక సంఖ్యాక కార్మికులకు ప్రాతినిధ్యం వహించే బోల్షెవిక్ ప్రతినిధుల ప్రాథమిక హక్కులకి భంగం కలిగించిన మెన్షెవిక్కుల చర్యల్ని గట్టిగా ఖండించింది. బోల్షెవిక్ పార్టీ కేంద్ర కమిటీ యిచ్చిన సూచనల మేరకు బోల్షెవిక్ ప్రతినిధులు 1913 అక్టోబరులో సంయుక్త సోషల్ డెమోక్రటిక్ దూమ గ్రూపును వదిలేసి, ఒక స్వతంత్ర బోల్షెవిక్ గ్రూపును (రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు గ్రూపును) ఏర్పాటుచేశారు. – 53.

60 రెండవ ఇంటర్నేషనల్‌కి యిది ప్రస్తావన. 1889లో పారిస్‌లో నెలకొల్పబడిన యీ సోషలిస్టు పార్టీల అంతర్జాతీయ సంఘంలో ఎఫ్. ఎంగెల్స్ ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. మార్క్సిజం వ్యాప్తికీ, కార్మిక పార్టీల మధ్య సంబంధాల స్థాపనకీ రెండవ ఇంటర్నేషనల్ తోడ్పడింది. కానైతే, సామ్రాజ్యవాద యుగం గడిచేకొద్దీ, దానిలో అవకాశవాద ధోరణులు పైచెయ్యి సంపాదించుకోనారంభించాయి. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లాక, రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాద నాయకులు తమతమ దేశాల బూర్జువా ప్రభుత్వాల సామ్రాజ్యవాద విధానాలను బాహాటంగా బలపరిచారు. అటు తర్వాత రెండవ ఇంటర్నేషనల్ విచ్ఛిన్నమైపోయింది. – 55.

61 1913 డిసెంబరులో అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానం మేరకు అంతర్జాతీయ బ్యూరో నిర్వహణ కమిటీ, పార్టీ కార్యక్రమాన్ని లేక సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు అనుగుణంగా వున్న కార్యక్రమాన్ని గుర్తించే రష్యాలోని కార్మికోద్యమ విభాగాల ప్రతినిధులను సమావేశపరచి ఆ విభాగాల మధ్య వున్న అభిప్రాయభేదాలను తేల్చుకునేందుకు ఆ సమావేశం జరపాల్సివుంది.

రష్యాలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ చచ్చిపోయిందనీ, రష్యన్ కార్మికుల ఐక్యతా వాంఛ ఆధారంగా ఆ పార్టీని పునరుద్ధరించాలనీ ఆ తీర్మానంపై జరిగిన చర్చల

క్రమంలో తను చేసిన ప్రసంగంలో కొట్స్కీ చెప్పాడు. "మంచి తీర్మానమూ, చెడ్డ ప్రసంగమూ" అనే వ్యాసంలో లెనిన్ ఆ తీర్మానపు సారాంశం వివరించి కొట్స్కీ ప్రసంగాన్ని ఖండించాడు. – 55.

62 పి.ఎస్.పి. వామపక్షీయులు – పోలిష్ సోషలిస్టు పార్టీలో (Polska Partia Socjalistyczna) వామపక్షం, 1906లో అది ఒక స్వతంత్ర పార్టీగా వేరుపడింది. బోల్షెవిక్ పార్టీ ప్రభావంవల్ల పి.ఎస్.పి. వామపక్షీయులు క్రమంగా స్థిరమైన విప్లవ వైఖరిని స్వీకరించారు. – 56.

63 బులీగిన్ దూమ – 1905లో జారిస్టు ప్రభుత్వం సమావేశపరచదలచుకున్న ఒక ప్రాతినిధ్య సంస్థ. అప్పట్లో దేశాంగ మంత్రి అయిన ఎ. జి. బులీగిన్‌నుంచి దానికి యీ పేరు వచ్చింది. ఆ దూమ పథకపు ముసాయిదాను తయారుచెయ్యవలసిందిగా బులీగిన్‌ని జారు ఆదేశించాడు. ఆ ముసాయిదా పథకం మేరకు ఆ దూమకి చట్టాలేవీ చేసే అధికారం వుండదు. జారుకి ఒక సలహా సంఘంగా అది కొన్ని సమస్యల్ని చర్చించగలదు అంతమాత్రమే.

బులీగిన్ దూమని చురుగ్గా బహిష్కరించవలసిందిగా కార్మికులకీ, రైతులకీ బోల్షెవిక్కులు విజ్ఞప్తిచేశారు. ఆ బహిష్కరణోద్యమాన్ని విప్లవ శక్తులన్నింటినీ సమీకృతంచేసేందుకూ, సామూహిక రాజకీయ సమ్మెలు చేయించేందుకూ, సాయుధ తిరుగుబాటుకి సన్నాహాలు చేసేందుకూ బోల్షెవిక్కులు వినియోగించుకున్నారు. చివరకు బులీగిన్ దూమకి ఎన్నికలు జరగలేదు, ప్రభుత్వం దాన్ని సమావేశపరచలేకపోయింది. – 59.

64 జేమ్‌స్త్వో కార్యకర్త – జేమ్‌స్త్వో: 1864లో రష్యా మధ్య ప్రాంతపు గుబేర్నియాల్లో (రాష్ట్రాల్లో) ప్రవేశపెట్టబడిన స్థానిక స్వయంపరిపాలక సంస్థలు. అత్యంత పరిమితమైన హక్కులు మాత్రమే వుండేవి. జేమ్‌స్త్వో కార్యకర్తల్లో నిరంకుశ రాజరికాన్ని వ్యతిరేకించిన మేధావుల, ఉదారవాద భూస్వాముల ప్రతినిధులు వున్నారు. అయితే, ప్రతిపక్షంలో ఉన్న కారణంగా జేమ్‌స్త్వో సభ్యులు విప్లవం యింకా ఎక్కువ ఎక్కడ అభివృద్ధిచెందుతుందోనని బెదిరిపోయారు. నిజానికి జారు ప్రణాళిక లక్ష్యం ప్రజల దృష్టిని కపట వాగ్దానాల ద్వారా విప్లవ పోరాటంనుంచి పక్క దోవలు పట్టించడంకాగా, "రాజ్యాంగబద్ధమైన" ఒకానొక "యుగానికి" నాందిగా జారు ప్రణాళికకు వాళ్లు స్వాగతం పలికారు. – 61.

65 కల్లోల కాలం – రైతు యుద్ధ కాలానికీ, 17వ శతాబ్ది తొలి సంవత్సరాల్లో పోలిష్,

స్వీడిష్ జోక్యానికీ వ్యతిరేకంగా రష్యన్ ప్రజలు జరిపిన పోరాట కాలానికీ విప్లవ పూర్వ రష్యన్ బూర్జువా చరిత్రకారులు వాడిన పేరు. – 61.

66 "నిరంతరాయ విప్లవ" భావాన్ని మార్క్స్, ఎంగెల్సులు 1848–50 సంవత్సరాల్లో ముందుకు తెచ్చారు. శ్రామికవర్గం బూర్జువా ప్రజాతంత్ర విప్లవంనుంచి సోషలిస్టు విప్లవానికి పరివర్తనను సాధించి, రాజ్యాధికారాన్ని సంపాదించుకోగలుగుతుందని భావించారు. ఈ అనుస్యూతిని వారు విప్లవ క్రమపు దశల క్రమానుగతమైన మార్పుగా పరిగణించారు. లెనిన్ ఆ భావాలను, సోషలిస్టు విప్లవంలోకి పెంపొందే ప్రజాతంత్ర విప్లవ సిద్ధాంతంగా అభివృద్ధిచేశాడు. శ్రామికవర్గ నాయకత్వ పాత్ర భావమే దానికి ప్రాతిపదిక.

1905–07 నాటి మొదటి రష్యన్ విప్లవ దశలో ఎ. పార్వుస్, ఎల్. ట్రాట్స్కీలు శాశ్వత విప్లవానికి సంబంధించిన మార్క్సిస్టు భావాన్ని వక్రీకరించారు. వాళ్ల నిరంతరాయ విప్లవ "సిద్ధాంతపు" సారాంశం యేమిటంటే, విప్లవంలో శ్రామిక వర్గపు నాయకత్వ పాత్రకి సంబంధించిన లెనినిస్టు భావాన్ని తిరస్కరించడం, శ్రామిక వర్గానికి ఒక పొత్తుదారుగా రైతాంగపు విప్లవకర పాత్రను తిరస్కరించడం, ఒక విడి దేశంలో సోషలిజం విజయం పొందడం దుస్సాధ్యమన్న విషయాన్ని నిరూపించడం. విప్లవాన్ని బయటనుంచి కృతకంగా ప్రోత్సహించడానికీ, విప్లవాన్ని "ఎగుమతి చెయ్యడానికీ" సంబంధించిన మార్క్సిస్టు వ్యతిరేక భావం ఒకటి వాళ్లు ప్రతిపాదించారు. నిరంతరాయ విప్లవానికి సంబంధించిన ట్రాట్స్కీయిస్టు సిద్ధాంతం, పెటీబూర్జువా విప్లవవాదపు ఆధునిక దుందుడుకు భావనలకు మూలాధారాల్లో ఒకటి. – 62.

67 బుంద్ (లిథువేనియా, పోలండ్, రష్యా సాధారణ యూదు కార్మికుల సంఘం) – 1897లో విల్నోలో జరిగిన యూదు సోషల్ డెమోక్రటిక్ బృందాల సంస్థాపక మహాసభలో స్థాపింపబడింది. ఈ సంఘంలో ప్రధానంగా, రష్యాలోని పశ్చిమ ప్రాంతపు అర్ధనిరాస్తిపరుల యూదు చేతిపనివాళ్లు ఉండేవారు. 1898 మార్చిలో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభలో "ప్రత్యేకించి యూదు శ్రామికవర్గానికి సంబంధించిన సమస్యలకు మాత్రమే స్వయం ప్రతిపత్తి కలిగిన సంఘం"గా బుంద్ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో చేరింది. యూదు శ్రామికవర్గానికి తననే ఏకైక ప్రతినిధిగా గుర్తించాలన్న బుంద్ డిమాండును ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండో మహాసభ తిరస్కరించాక, బుంద్ పార్టీనుంచి వైదొలగింది. కాని, నాలుగవ (ఐక్యతా) మహాసభలో చేసిన తీర్మానం ప్రాతిపదికమీద, బుంద్ 1906లో తిరిగి పార్టీలో చేరింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి.లోపల, బుండ్ ఎప్పుడూ కూడా పార్టీలోని అవకాశవాద పక్షాన్ని — ఆర్థికవాదులు, మెన్షెవిక్కులు, రద్దువాదులు — బలపరుస్తూ, బోల్షెవిక్కులకు వ్యతిరేకంగా పోరాటం జరుపుతూ వుండేది. 1917లో బుండ్ విప్లవ ప్రతీఘాత తాత్కాలిక ప్రభుత్వాన్ని బలపరచి, అక్టోబరు సోషలిస్టు విప్లవ శత్రువుల పక్షం వహించింది. విదేశీ సైనిక జోక్యం కాలంలోనూ, అంతర్యుద్ధ కాలంలోనూ బుండ్ నాయకులు విప్లవ ప్రతీఘాత శక్తులతో చేతులు కలిపారు. అదే సమయంలో, బుండ్ సామాన్య సభ్యులు సోవియట్ ప్రభుత్వంతో పొత్తు పెట్టుకోవడంపట్ల మొగ్గు చూపారు. 1921 మార్చిలో బుండ్ తనను తాను రద్దుచేసుకుంది. దాని సభ్యుల్లో కొందరు, సభ్యత్వార్హతకు సంబంధించిన సాధారణ సూత్రాల ప్రాతిపదికపైన, రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షెవిక్) సభ్యత్వం తీసుకున్నారు. — 63.

68 రెండవ ఇంటర్నేషనల్ లండన్ మహాసభ (1896)ని లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. జాతుల స్వయంనిర్ణయ హక్కుకి సంబంధించి ఆ మహాసభ చేసిన తీర్మానాల వివరాలను యీ సంపుటంలోని 102–06 పేజీల్లో చూడండి. — 64.

69 "Die Neue Zeit" ("కొత్త కాలం") — జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ సిద్ధాంత పత్రిక, 1883నుండి 1923దాకా ష్టుట్‌గార్ట్‌లో ప్రచురించబడింది. మార్క్స్, ఎంగెల్సుల రచనలలో కొన్ని మొదట ఆ పత్రికలో అచ్చయినాయి. ఆ పత్రికలో ఎ. బేబెల్, వి. లీబ్‌క్నెఖ్ట్, ఎర్. లుక్సెంబుర్గ్, క. జెట్కిన్, ఎఫ్. మేరింగ్, పి. లాఫార్గ్, జి. ప్లెహానొవ్, తదితర జర్మన్, అంతర్జాతీయ ఉద్యమ ప్రముఖులు వ్యాసాలు రాశారు. ఎంగెల్సు తన సలహాతో సంపాదకులకు సహాయం చేసి, మార్క్సిజంనుండి వైదొలగినందుకు వాళ్లను అప్పుడప్పుడు విమర్శించాడు. 1890ల ఉత్తరార్ధంలో, ఎంగెల్సు మరణం తర్వాత, యీ పత్రిక మార్క్సిజంమీద రివిజనిస్టు యుద్ధం ప్రారంభించిన "సోషలిజం సమస్యలు" అనే ఇ. బెర్న్‌స్టైన్ వ్యాస పరంపరతో సహా క్రమపద్ధతిగా రివిజనిస్టుల వ్యాసాలు ముద్రించింది. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో యిది సెంట్రిస్టు స్థావరం అవలంబించి, అర్థాత్తూ సోషల్ జాతీయ దురహంకారులకు అండదండలు యిచ్చింది. — 65.

70 "నవూచ్నయ మీస్ల్" ("శాస్త్రీయ చింతన") - 1908లో రీగాలో ప్రచురించబడిన ఒక పత్రిక. — 65.

71 సాంస్కృతిక-జాతీయ స్వయంపాలన (జాతీయ-సాంస్కృతిక స్వయంపాలన) — జాతీయ సమస్యా పరిష్కారానికి ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రట్లు ఒ. బౌవర్, క. రెన్నెర్‌లు

రూపొందించిన ఒక బూర్జువా జాతీయవాద కార్యక్రమం. ఆ కార్యక్రమం విడిపోయే హక్కుతోబాటు జాతుల స్వయంనిర్ణయ హక్కును తిరస్కరించింది. ఆ కార్యక్రమ సారాంశం యేమిటంటే, ఒకానొక దేశంలో ఒకే జాతికి చెందిన ప్రజలు, వాళ్లు ఆ దేశపు ఏ భాగంలో నివసిస్తున్నారన్నదాని ప్రసక్తిలేకుండా, స్వయంపాలిత జాతీయ యూనియన్‌గా రూపొందుతారు. ఆ యూనియన్‌కి ప్రభుత్వం పాఠశాల విద్యనీ (వేర్వేరు జాతులకి చెందిన పిల్లలకి వేర్వేరు పాఠశాలలు), విద్యా, సంస్కృతులకి చెందిన తదితర విభాగాలనీ పూర్తిగా బదిలీచేస్తుంది. ఆ కార్యక్రమం, అది అమలు జరపబడినట్లయితే, మతాధిపతుల ప్రభావాన్నీ, ప్రతిఒక్క జాతీయ గ్రూపులోనూ అభివృద్ధి నిరోధక సిద్ధాంత ప్రభావాన్నీ పెంచి, కార్మికవర్గ సంఘటనను కుంటుపరచి, జాతీయత ప్రకారం కార్మికుల మధ్య చీలికను ప్రగాఢంచేసివుండేది. – 66.

72 "Przegląd Socjaldemokratyczny" ("సోషల్ డెమోక్రటిక్ సమీక్ష") – రోజా లుక్సెంబుర్గ్ సన్నిహిత సహకారంతో క్రాకొవ్‌లో 1902నుంచి 1904దాకా, 1908నుంచి 1910దాకా పోలిష్ సోషల్ డెమోక్రట్లు ప్రచురించిన పత్రిక. – 66.

73 K. Marx, *Capital*, Vol. I, Moscow, 1972, p. 716. – 67.

74 "రూస్కయ మీస్ల్" ("రష్యన్ చింతన") – మాస్కోలో 1880నుంచి 1918దాకా ప్రచురింపబడిన సాహిత్య, రాజకీయ మాసపత్రిక. 1890 దశకంలో మార్క్సిస్టులు మధ్యమధ్య దానిలో రాస్తూండేవారు. 1905 విప్లవానంతరం అది కాడెట్ పార్టీ అధికారిక పత్రిక అయింది. దానికి పి. స్త్రూవె సంపాదకత్వం వహించాడు. – 74.

75 1905–07 నాటి ప్రథమ రష్యన్ బూర్జువా ప్రజాతంత్ర విప్లవం పలు దేశాల్లోని జాతీయ విముక్తి ఉద్యమంమీద బృహత్తరమైన ప్రభావం బరపింది. ఈవిధంగా, టర్కీలో ఆనాటి బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమం సైన్యంలో తిరుగుబాటులో ముగిసింది. దాని ఫలితంగా 1876 నాటి రాజ్యాంగచట్టం పునరుద్ధరింపబడి, పార్లమెంటు నెలకొల్పబడింది.

ఇరాన్ (పర్షియా)లో వర్తక, పారిశ్రామిక బూర్జువావర్గ నాయకత్వంలో జరిగిన ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల క్రమంలో, ఆ దేశ చరిత్రలో మొట్టమొదటి పార్లమెంటు సమావేశపరచబడింది. అది 1905లో రాజ్యాంగ చట్టాన్ని రూపొందించింది. 1906లో అక్కడ మొదలైన బూర్జువా విప్లవం 1909లో పర్షియన్ షా పదవీచ్యుతికి దారితీసింది.

1905–11లో చైనాలో కూడా రాజ్యాంగచట్టంకోసం, రాష్ట్రాల స్వయం

పాలన హక్కుకోసమూ బూర్జువావర్గం పోరాటం జరిపింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నినాదం ముందుకి వచ్చింది. 1911లో మంచూరియన్ ఛ్రీన్ రాజ వంశం కూల్చివెయ్యబడింది. చైనా రిపబ్లిక్‌గా ప్రకటింపబడింది. విప్లవ ప్రజాస్వామ్యవాది అయిన సన్‌యట్‌సేన్ చైనా రిపబ్లిక్‌కి తాత్కాలిక అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు.

తూర్పు యూరప్ దేశాల ప్రజలు తమ జాతీయ విముక్తికోసమూ, ఫ్యూడలిజం రద్దుకోసమూ జరిపిన పోరాటాల్లో 1912–13 నాటి బాల్కన్ యుద్ధాలు ఒకటి. అయితే బాల్కన్లలో ఏర్పడ్డ గ్రూపుల వెనక, తమ స్వార్థ ప్రయోజనాలకోసం బాల్కన్ వ్యవహారాల్లో నిరంతరాయంగా జోక్యంచేసుకొంటూ, బాల్కన్ రాజ్యాల మధ్య వైరుధ్యాలను ఎగసనదోస్తూవుండే అగ్ర సామ్రాజ్యవాద ప్రభుత్వాలు నిలబడ్డాయి. ఫలితంగా బాల్కన్లలో స్వతంత్ర జాతీయ రాజ్యాల స్థాపన రక్తప్లావితమైన యుద్ధాల ద్వారా జరిగి, బాల్కన్ ప్రజలు విపరీతమైన త్యాగాలు చెయ్యవలసివచ్చింది. – 75.

[76] 1899 సెప్టెంబరు 24 నుండి 29 దాకా బ్రూన్ (ఆస్ట్రియా)లో జరిగిన ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభకి యిది ప్రస్తావన. అజెండాలో జాతీయ సమస్యే ప్రధానాంశం. విభిన్న దృక్పథాలకు ప్రాతినిధ్యం వహించే రెండు తీర్మానాలు ఆ మహాసభకు అందజెయ్యబడ్డాయి: (1) జాతుల ప్రాంతీయ స్వయంపాలన భావాన్ని సమర్థించే పార్టీ కేంద్ర కమిటీ తీర్మానం, (2) ప్రాంతీయ అతీత సాంస్కృతిక-జాతీయ స్వయంపాలన భావాన్ని సమర్థించే దక్షిణ స్లావ్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ కమిటీ తీర్మానం.

ఆ మహాసభ సాంస్కృతిక-జాతీయ స్వయంపాలన కార్యక్రమాన్ని ఏకగ్రీవంగా తిరస్కరించి, ఆస్ట్రియన్ రాజ్య సరిహద్దులలోపల జాతీయ స్వయంపాలనను గుర్తించే ఒక రాజీ తీర్మానాన్ని ఆమోదించింది. – 77.

[77] 1903లో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ పార్టీ మొదటి కార్యక్రమాన్ని ఆమోదించింది. దానిలో కనీస కార్యక్రమం, గరిష్ఠ కార్యక్రమం అన్న రెండు భాగాలు వున్నాయి.

కనీస కార్యక్రమం బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాన్ని నిర్ణయించింది: నిరంకుశ రాజరికాన్ని కూలదొయ్యడం, ప్రజాతంత్ర రిపబ్లిక్ స్థాపన, ఎనిమిది గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టడం, జాతుల సమానత్వం, జాతుల స్వయంనిర్ణయ హక్కు, గ్రామాల్లో భూదాస్య అవశేషాల రద్దు.

గరిష్ఠ కార్యక్రమం సోషలిస్టు విప్లవ కర్తవ్యాలను నిర్ణయించింది: పెట్టుబడిదారీ విధానపు కూల్చివేత, శ్రామికవర్గ నియంతృత్వ స్థాపన.

1917లో ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవ ఫలితంగానూ, అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ ఫలితంగానూ మొదటి పార్టీ కార్యక్రమం అమలుజరపబడింది. – 82.

78 1907 జూన్ 3న రెండవ స్టేట్ దూమను రద్దుచేస్తూ, ఎన్నికల చట్టాన్ని సవరిస్తూ జారు ఒక ఉత్తరువు జారీచేశాడు. ఈ కొత్త చట్టం మూలంగా దూమలో భూస్వాముల, వాణిజ్య, పారిశ్రామిక బూర్జువాల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది; అంతకుముందే తక్కువగా వున్న రైతు, కార్మిక ప్రతినిధుల సంఖ్య మరింత తరిగింది. – 85.

79 ప్రోగ్రెసిస్టులు – రష్యన్ ఉదారవాద రాజరికవాద బూర్జువావర్గానికి చెందిన ఒక గ్రూపు. ఈ గ్రూపు స్టేట్ దూమకి జరిగిన ఎన్నికల్లోనూ, స్టేట్ దూమలోపలా వివిధ బూర్జువా, భూస్వామ్య పార్టీలకూ, గ్రూపులకూ చెందిన శక్తులను "పార్టీ అతీత" నినాదంకింద ఐక్యంచేసేందుకు ప్రయత్నించింది.

1912 నవంబరులో ప్రోగ్రెసిస్టులు ఒక స్వతంత్ర రాజకీయ పార్టీని నెలకొల్పారు. – 85.

80 "రేచ్" ("వాణి") – కాడెట్ పార్టీ కేంద్ర అధికార పత్రికగా 1906 ఫిబ్రవరి నుంచి సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడిన ఒక దినపత్రిక. పెట్రోగ్రాడ్ సోవియట్ విప్లవ సైనిక కమిటీ యీ పత్రికను 1917 అక్టోబరు 26 (నవంబరు 8)న మూసేసింది. 1918 ఆగస్టువరకు అది మారు పేరుతో ప్రచురింపబడింది. – 85.

81 1913 జూన్‌లో ల్వోవ్‌లో జరిగిన విద్యార్థుల రెండవ అఖిల ఉక్రేనియన్ మహాసభకి యిది ప్రస్తావన. ఉక్రేనియన్ మహా రచయితా, పండితుడూ, పౌర ప్రముఖుడూ, విప్లవ ప్రజాతంత్రవాదీ అయిన ఇవాన్ ఫ్రంకో జన్మదినోత్సవ వేడుక కాలంలో మహాసభ జరగవలసివుంది. ఆ మహాసభలో "స్వతంత్ర" ఉక్రెయిన్ నినాదాన్ని ప్రతిపాదించిన ఉక్రేనియన్ సోషల్ డెమోక్రట్ దొన్‌త్సోవ్ ప్రసంగించాడు. – 85.

82 "రబోచయ ప్రావ్ద" ("కార్మిక సత్యం") – ఈ పేరుతో 1913 జూలై – ఆగస్టు మాసాల్లో బోల్షెవిక్కుల పత్రిక "ప్రావ్ద" ప్రచురింపబడింది. – 86.

83 "ష్ల్యాహి" ("మార్గాలు") – ఉక్రేనియన్ విద్యార్థి సంఘపు పత్రిక. ఇది 1913 ఏప్రిల్‌నుంచి 1914 మార్చిదాకా ల్వోవ్ పట్టణంనుంచి ప్రచురింపబడింది. – 86.

84 "ప్రొలెతార్‌స్కయ ప్రావ్దా" ("శ్రామికవర్గ సత్యం") – ఈ పేరుతో బోల్షెవిక్కుల పత్రిక "ప్రావ్దా" 1913 డిసెంబరు – 1914 జనవరి మధ్య కాలంలో ప్రచురింపబడింది. – 87.

85 "నోవాయె వ్రేమ్య" ("నూతన కాలం") – 1868నుంచి 1917దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి ప్రచురింపబడిన ఒక దినపత్రిక. వేర్వేరు సమయాల్లో వేర్వేరు ప్రచురణకర్తలకు చెందినది, దీని రాజకీయ ధోరణి కొన్ని సార్లు మారింది. 1905 అనంతరం యిది నల్లనూర్లవాళ్ల వాణి అయింది. – 88.

86 "జేమ్‌ష్చిన" – నల్లనూర్లవాళ్ల దినపత్రిక. ఇది సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి 1909 జూన్‌నుంచి 1917 ఫిబ్రవరిదాకా ప్రచురింపబడింది. ఇది స్టేట్ దూమలోని అత్యంత మితవాద ప్రతినిధుల పత్రిక. – 88.

87 లెనిన్ యిక్కడ జి. ఉస్పేన్‌స్కి రాసిన "కాపలావాడి బంకు"నుంచి ఉల్లేఖిస్తున్నాడు. పోలీసుల నిరంకుశత్వాన్ని అది ఉద్దేశిస్తోంది. – 89.

88 "కీయెవ్‌స్కయ మీస్ల్" ("కీయెవ్ చింతన") – 1906నుంచి 1918దాకా కీయెవ్‌లో ప్రచురింపబడిన ఒక బూర్జువా ప్రజాతంత్ర దినపత్రిక. – 90.

89 "మజేపిస్టులు" – రష్యానుంచి ఉక్రెయిన్ వేర్పాటును కోరిన ఉక్రేనియన్లకు లెనిన్ పెట్టిన పేరు. మొదట పోలండు రాజుతోనూ, తర్వాత స్వీడిష్ రాజుతోనూ రష్యానుంచి ఉక్రెయిన్ వేర్పాటు విషయంలో కొన్ని యేళ్ల తరబడి రహస్యమంతనాలు జరిపిన ఉక్రేనియన్ నాయకుడు మజేప పేరునుబట్టి లెనిన్ యీ పేరు పెట్టాడు. – 92.

90 "Naprzód" ("ముందడుగు") – గలీషియా, సైలీషియాల సోషల్ డెమోక్రటిక్ పార్టీ కేంద్ర పత్రిక. ఇది 1892–1941మధ్య క్రాకొవ్‌లో ప్రచురింపబడింది. పెటీబూర్జువా జాతీయవాద భావాలకు యిది వాహికగా వుండేది. – 95.

91 "ఫ్రాకీ" (విప్లవకర విభాగం) – 1892లో నెలకొల్పబడిన సంస్కరణవాద జాతీయవాద పార్టీ అయిన పోలిష్ సోషలిస్టు పార్టీ దక్షిణ విభాగం. స్వతంత్ర పోలండుకోసం పోరాట నినాదాన్ని వినియోగించుకొని, పిల్సూడ్‌స్కి, అతని అనుచరుల నాయకత్వాన పోలిష్ సోషలిస్టు పార్టీ పోలిష్ కార్మికుల్లో వేర్పాటువాద జాతీయవాద ప్రచారం

సాగించి, నిరంకుశ రాజరికానికీ, పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా రష్యన్ కార్మికులతో కలిసి వాళ్ళ సంయుక్త పోరాటం జరపకుండా పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించింది.

1906 దరిమిలా, పోలిష్ సోషలిస్టు పార్టీ (పి.ఎస్.పి.) చీలిక ఫలితంగా, రెండు పి.ఎస్.పి.లు – వామపక్ష పి.ఎస్.పి., దక్షిణపక్ష పి.ఎస్.పి. (విప్లవకర విభాగం – "ఫ్రాకీ") ఏర్పడ్డాయి. ఈ విభాగం తన జాతీయవాద విధానాన్ని కొనసాగించింది. మొదటి ప్రపంచయుద్ధ కాలంలోనూ, దాని తర్వాతా "ఫ్రాకీ" తమ జాతీయ దురహంకార విధానాన్ని కొనసాగించాయి. – 97.

92 1863–64 నాటి పోలిష్ జాతీయ విముక్తి తిరుగుబాటును గురించి 35వ వివరణ చూడండి. – 104.

93 చార్టిజం – 19వ శతాబ్దంలో ఇంగ్లండులో జరిగిన కార్మికవర్గపు మొట్టమొదటి సామూహిక ఉద్యమం. ఆ ఉద్యమపు రాజకీయ డిమాండులున్న charter (పత్రం) అనే మాటనుంచి దానికా పేరు వచ్చింది. ఆ పత్రంలో సార్వత్రిక ఓటింగు హక్కు కావాలనీ, పార్లమెంటు డిప్యూటీలకు భూమి ఉండాలన్న షరతు రద్దు కావాలనీ డిమాండ్లు ఉన్నాయి. కొన్ని సంవత్సరాలపాటు దేశవ్యాపితంగా కోట్లాది ప్రజలతో సభలూ, ప్రదర్శనలూ జరిగాయి. బ్రిటన్ పార్లమెంటు ఆ పత్రం ఆమోదించడానికి నిరాకరించింది.

ప్రభుత్వం చార్టిస్టులపై దమనకాండ ఉధృతంగా జరిపింది, వాళ్ల నాయకులను అరెస్టుచేసింది. ఉద్యమం అణచివేయబడింది, కాని తరువాతి అంతర్జాతీయ కార్మికోద్యమ అభివృద్ధిమీద దాని ప్రభావం చాలా వుంది. – 107.

94 "The Times" – లండన్‌లో 1785లో నెలకొల్పబడిన ఒక దినపత్రిక. బ్రిటిష్ బూర్జువావర్గం ప్రచురించిన అతిముఖ్యమైన కన్సర్వేటివ్ దినపత్రికల్లో యిదొకటి. – 109.

95 ఫెనియనిజం – ఐరిష్ పెటీబూర్జువా విప్లవకారుల ఉద్యమాల్లో ఒకటి. 1850 దశకపు చివరి సంవత్సరాల్లో యిది పెంపొందింది. ఆంగ్లేయ వలసవాద పీడనకి వ్యతిరేకంగా ఐర్లండులో వ్యక్తమైన ప్రజా నిరసనకు ఫెనియన్ల కార్యక్రమ, కార్యకలాపాలు ప్రతిబింబాలు. తమ దేశానికి జాతీయ స్వాతంత్ర్యం కావాలనీ, ప్రజాతంత్ర రిపబ్లిక్ ఏర్పడాలనీ, కౌలుదారీ రైతులను వాళ్ళు సాగుచేసే భూమికి సొంతదారులను చెయ్యాలనీ ఫెనియన్లు డిమాండుచేశారు. అయితే ఫెనియన్ల రహస్య కుట్రదారీ

కార్యకలాపాలు ఐరిష్ ప్రజల్లోని విస్తృత విభాగాలతో వాళ్ళు సంబంధాలు పెట్టుకోడానికి ప్రతిబంధకమయ్యాయి. గ్రేట్ బ్రిటన్‌లోని సాధారణ ప్రజాతంత్ర, కార్మికోద్యమంతో వాళ్ళకి సంబంధం లేకపోయింది. 1867 ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ఫెనియన్లు లేవదీసిన తిరుగుబాటు పరాజయం పొందింది. కోర్టు విచారణకు గురి అయిన ఫెనియన్ల పరిరక్షణకు ఇంగ్లండులో లేవదీసిన ఉద్యమాన్ని మొదటి ఇంటర్నేషనల్ సమర్థించింది. – 110.

[96] అమెరికన్ వలసలు స్వాతంత్ర్యంకోసం జరిపిన పోరాటంలో బ్రిటన్ ఓడిపోయిన కారణంగా, ఐర్లండులో జాతీయ విముక్తి ఉద్యమ వెల్లువ పరిస్థితుల్లో, ఐరిష్ జనాభాలో విస్తృత ప్రజాబాహుళ్యపు ఒత్తిడికింద ఐర్లండు చట్టాలను ఆమోదించే బ్రిటిష్ పార్లమెంటు హక్కుని రద్దుచేసి, యీ హక్కుని ఐరిష్ పార్లమెంటుకి బదిలీచేసిన చట్టం 1782లో ఆమోదింపబడింది. ఈ చట్టాన్ని బ్రిటిష్ పార్లమెంటు తిరిగి 1783లో కొత్త "రాజ్య హక్కు పరిత్యాగ చట్టం" రూపంలో ధృవీకరించింది. కానైతే, 1798లో ఐరిష్ జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేసిన తర్వాత, ఐర్లండుపైన బ్రిటిష్-ఐరిష్ యూనియన్‌ని రుద్ది, (నిజానికి ఈ యూనియన్ ఐర్లండ్ స్వయంపాలన అవశేషాలను తుదముట్టించింది) బ్రిటిష్ ప్రభుత్వం వాస్తవంలో యీ రాయితీలను రద్దుచేసింది. – 110.

[97] 1869 వేసవిలోనూ, ఆకురాలుకాలంలోనూ, ఖైదుచెయ్యబడిన ఫెనియన్లకు క్షమాదానాన్ని డిమాండుచేస్తూ ఐర్లండులో విస్తృతమైన ఒక ఉద్యమం వృద్ధిచెందింది. ఐరిష్ విప్లవకారులను విడుదల చెయ్యవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ అనేక సమావేశాల్లో అర్జీలు ఆమోదింపబడ్డాయి. ప్రభుత్వాధినేత అయిన గ్లాడ్‌స్టన్ ఐరిష్ ప్రజల యీ డిమాండ్లన్నింటినీ తిరస్కరించాడు. ఈ నిరాకరణ లండన్‌లో నిరసన ప్రదర్శనలకు కారణభూతమైంది. – 111.

[98] "The New York Daily Tribune" – 1841నుంచి 1924 దాకా ప్రచురింపబడిన ఒక అమెరికన్ దినపత్రిక. 1850 దశకపు మధ్య సంవత్సరాలదాకా అది అమెరికన్ విగ్గులలో వామపక్షపు అధికార పత్రిక. తర్వాత అది రిపబ్లికన్ పార్టీ అధికార పత్రిక అయింది. 1851 ఆగస్టునుంచి 1862 మార్చిదాకా కార్ల్ మార్క్స్ యీ పత్రికకి తన వ్యాసాలు పంపాడు. ఆయన కోరిక మేరకు ఫ్రెడరిక్ ఎంగెల్స్ దానికి చాలా వ్యాసాలు పంపాడు. – 112.

[99] "జర్యా" ("ఉషారాగం") – 1901–02 సంవత్సరాల్లో "ఇస్క్రా" సంపాదకవర్గం

ష్టుట్‌గార్ట్‌నుంచి ప్రచురించిన మార్క్సిస్టు శాస్త్రీయ, రాజకీయ పత్రిక. మొత్తం మీద నాలుగు సంచికలు (మూడు విడతల్లో) వెలువడ్డాయి. – 116.

100 జి. వి. ప్లెహానొవ్ రచించిన "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ముసాయిదా కార్యక్రమం" అనే వ్యాసంనుంచి లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు. ఇది 1902లో "జర్యా" 4వ సంచికలో ప్రచురింపబడింది. – 116.

101 ప్రస్తావింపబడిన కాన్ఫరెన్సులు మూడూ యివి: 1) ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ కాన్ఫరెన్సు, ఇది ఫిన్లాండులోని కోత్కాలో 1907 జూలైలో జరిగింది; 2) ఆర్.ఎస్. డి.ఎల్.పి. నాల్గవ కాన్ఫరెన్సు, ఇది హెల్సింగ్‌ఫర్స్‌లో 1907 నవంబరులో జరిగింది; 3) ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ కాన్ఫరెన్సు, ఇది పారిస్‌లో 1908 డిసెంబరులో జరిగింది. – 120.

102 ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ విస్తృత సమావేశం (దీన్ని ఐక్యతా ప్లీనం అని కూడా అంటారు) పారిస్‌లో 1910 జనవరిలో జరిగింది. అన్ని పార్టీ విభాగాల, విభాగపు గ్రూపుల, వివిధ జాతులకి చెందిన సోషల్ డెమోక్రటిక్ శాఖల ప్రతినిధులు దానికి హాజరయారు. పార్టీ అంతర్గత పరిస్థితే చర్చనీయాంశాల్లోని ప్రధాన సమస్య. ఆ విస్తృత సమావేశంలో లెనిన్‌కీ, శ్రామికవర్గ విప్లవ పార్టీ ప్రతికూలురకీ మధ్య తీవ్రమైన పోరాటం జరిగింది. లెనిన్ తన ప్రసంగాల్లో రద్దువాదుల్నీ, ఒత్‌జొవిస్టుల్నీ బహిర్గతంచేసి ఖండించి, ఆ ధోరణులు శ్రామికవర్గ బాహుళ్యంమీద బూర్జువా ప్రభావ వ్యక్తీకరణలని అభివర్ణించాడు. కానైతే, ఆ విస్తృత సమావేశంలో పాల్గొన్నవారిలో అధిక సంఖ్యాకులు రాజీవాదులైన కారణంగా, వాళ్లు లెనినిస్టు వ్యతిరేక తీర్మానాలు కొన్నింటిని ఆమోదింపజేసుకోగలిగారు. – 120.

103 రష్యన్ రచయిత పొమ్యలోవ్‌స్కీ రచించిన "మత పాఠశాల జీవిత చిత్రణలు"నుంచి లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు. జారిస్టు రష్యాలోని మతశాస్త్ర విద్యాలయాల్లో ప్రబలంగా వున్న కఠిన పరిస్థితులు, దేహదండన, పాశవికమైన ఆచారాలను గురించి రచయిత తన యీ పుస్తకంలో వాస్తవిక చిత్రణ యిచ్చాడు. – 122.

104 "ద్జ్విన్" ("గంట") – 1913 జనవరినుంచి 1914 మధ్యదాకా కీయెవ్‌లో ఉక్రేనియన్ భాషలో ప్రచురింపబడిన మెన్షెవిక్ జాతీయవాద చట్టబద్ధ మాసపత్రిక. – 123.

105 రద్దువాదుల ఆగస్టు కాన్ఫరెన్సు గురించి 46వ వివరణ చూడండి. – 124.

106 క్రైమియా యుద్ధక్రమంలో, 1855 ఆగస్టు 4న, చోర్నయ నది దగ్గర జరిగిన యుద్ధకాండ గురించిన సెవస్తోపోల్ సైనికుడి పాటలోని మాటలను లెనిన్ యిక్కడ ఉల్లేఖిస్తున్నాడు. ఈ పాటను లియో టాల్‌స్టాయ్ రచించాడు. – 125.

107 "ప్రజా సోషలిస్టు" పార్టీ – సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ మితవాద పక్షంనుంచి 1906లో వేర్పడిన పెటీబూర్జువా పార్టీ. ప్రజా సోషలిస్టులు కాడెట్లతో కూటమి ఏర్పాటు చెయ్యాలని వాదించారు. ఈ పార్టీ తన కార్యక్రమంనుంచి రిపబ్లిక్ స్థాపననూ, భూమి జాతీయంచేయాలన్న డిమాండునీ తొలగిస్తుంది కనుక, దీనికీ, కాడెట్లకీ ఉన్న భేదం చాలా తక్కువ అని లెనిన్ నొక్కి చెప్పాడు. ఫిబ్రవరి బూర్జువా డెమోక్రటిక్ విప్లవానంతరం ప్రజా సోషలిస్టులు క్రియాశీలంగా తాత్కాలిక ప్రభుత్వాన్ని బలపరచారు. అక్టోబరు సోషలిస్టు విప్లవం విజయం పొందిన తరువాత, సోవియట్ అధికారానికి వ్యతిరేకంగా విప్లవ ప్రతీఘాత కుట్రలలో, సాయుధ చర్యలలో పాల్గొన్నారు. – 127.

108 "రూస్కొయె బొగాత్‌స్త్వో" ("రష్యన్ సంపద") – 1876నుంచి 1918దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురితమైన మాసపత్రిక. 1906నుండి అది ప్రజా సోషలిస్టు పార్టీ పత్రిక అయింది. – 127.

109 "Zeit" ("కాలం") – బుంద్ సంఘం వారపత్రిక; 1913–14లో పీటర్స్‌బుర్గ్‌నుంచి యూదు భాషలో ప్రచురింపబడింది. – 130.

110 పారిస్ కమ్యూన్ – చరిత్రలో శ్రామికవర్గ నియంతృత్వ స్థాపనానుభవాల్లో మొట్టమొదటిది. 1871లో జరిగిన తిరుగుబాటు పర్యవసానంగా పారిస్‌లో ఏర్పడిన కార్మిక వర్గపు విప్లవాత్మక ప్రభుత్వం మార్చి 18నుంచి మే 28దాకా – 72 రోజులు వుంది. పారిస్ కమ్యూన్ ఏకకాలంలో శాసనాలను చేసే, వాటిని అమలుజరిపే ప్రభుత్వం. అది చర్చిని రాజ్యంనుంచీ, విద్యా సంస్థలను చర్చినుంచీ వేరుచేసింది. కార్మికులు, గ్రామీణ పేదలు వగైరాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచే కొన్ని చర్యలను అమలు జరిపింది.

కానైతే, ఫ్రెంచి బ్యాంకును జాతీయంచేసేందుకు అది సంకోచించింది. పారిస్‌లోని విప్లవప్రతీఘాత శక్తుల్ని నిర్మూలించడంలో ఊగిసలాట ప్రదర్శించింది. సాత్విక ప్రతిఘటన ఎత్తుగడలు అనుసరించింది. రైతాంగంతో పొత్తు ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనావేసింది. ఇవన్నీ పారిస్ కమ్యూన్ పతనాన్ని త్వరితపరచాయి.

1871 మే 21న, విప్లవ ప్రతీఘాత తేయేర్ ప్రభుత్వపు సైనికులు పారిస్ కార్మి

కుల్ని క్రూరంగా ఊచకోత కోశారు. కమ్యూనార్డులు బ్యారికేడ్లవద్ద మే 28దాకా పోరాటం జరిపారు. – 134.

111 ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రజ్వలించినప్పుడు, నాల్గవ స్టేట్ దూమలోని బోల్షెవిక్ ప్రతినిధులు కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణకోసం ముందుకొచ్చారు. పార్టీ విధానం మేరకు వాళ్ళు, జారిజానికి యుద్ధ రుణాల మంజూరుకి అనుకూలంగా వోటుచేసేందుకు నిరాకరించారు. యుద్ధపు సామ్రాజ్యవాద, ప్రజావ్యతిరేక స్వభావాన్ని బహిర్గతంచేసి, యుద్ధాన్ని గురించిన వాస్తవాలను కార్మికులకు వివరించి చెప్పి, జారిజానికీ, బూర్జువా వర్గానికీ, భూస్వాములకీ వ్యతిరేకంగా పోరాడేందుకు వాళ్లని ఉత్తేజితుల్ని చేశారు. యుద్ధ కాలంలో విప్లవ కార్యకలాపాలకుగాను దూమలోని బోల్షెవిక్ సభ్యులపై కోర్టు విచారణ జరిపి సైబీరియా ప్రవాసశిక్ష విధించారు. – 135.

112 "Sozialistische Monatshefte" ("సోషలిస్టు మాసపత్రిక) – జర్మన్ అవకాశవాదుల ప్రధాన పత్రిక, అంతర్జాతీయ అవకాశవాదపు పత్రికల్లో ఒకటి. 1897నుంచి 1933దాకా బెర్లిన్‌లో ప్రచురింపబడింది. ప్రథమ ప్రపంచ యుద్ధ కాలంలో ఆ పత్రిక సోషల్ జాతీయ దురహంకార వైఖరి తీసుకుంది. – 135.

113 అంతర్జాతీయ సోషలిస్టు స్టుట్‌గార్ట్ మహాసభ (రెండవ ఇంటర్నేషనల్ ఏడవ మహాసభ) 1907 ఆగస్టు 18–24 తేదీల్లో జరిగింది. సోషలిస్టు పార్టీలకీ, ట్రేడ్ యూనియన్లకీ ప్రాతినిధ్యం వహించే 886మంది ప్రతినిధులు దానికి హాజరయ్యారు. జర్మన్ ప్రతినిధివర్గం (289మంది) మిక్కిలి పెద్దది. వాళ్లలో అధికసంఖ్యాకులు ట్రేడ్‌యూనియన్ల నాయకులు. ఇది, ఆ మహాసభ తీర్మానాలపై జరిగిన చర్చల్లో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ పరిస్థితిమీద ప్రగాఢమైన ప్రభావం కలిగించింది.

ఆ మహాసభలో యీకింది సమస్యలమీద చర్చలు జరిగాయి: 1) సైనికతత్వం, అంతర్జాతీయ వైరుధ్యాలు; 2) రాజకీయ పార్టీలకీ, ట్రేడ్‌యూనియన్లకీ మధ్య సంబంధాలు; 3) వలసవాద సమస్య; 4) కార్మికుల వలస, ప్రవాసం; 5) మహిళల ఓటుహక్కు.

ఆ మహాసభ ప్రధాన కృషి ప్లీనరీ సమావేశాలకు తీర్మానాల ముసాయిదాలు తయారు చేసిన కమిషన్లలో సాగింది. లెనిన్ "సైనికతత్వం, అంతర్జాతీయ వైరుధ్యాలు" అన్న ప్రధాన తీర్మానాన్ని రూపొందించిన కమిషన్‌లో పనిచేశాడు. పోలిష్ సోషల్ డెమోక్రట్ల తోడ్పాటుతో, ఎ. బేబెల్ ముసాయిదా తీర్మానానికి ముఖ్యమైన సవరణలు ప్రతిపాదించి, దాన్ని విప్లవకర మార్క్సిజం దృష్ట్యా మౌలికంగా సంస్కరించడంలో లెనిన్ సఫలుడయ్యాడు.

అన్ని సమస్యలమీదా ఆమోదింపబడిన తీర్మానాలు అవకాశవాద విభాగంమీద విప్లవ కర విభాగపు విజయానికి ప్రతీకలు. – 135.

114 అంతర్జాతీయ సోషలిస్టు కోపెన్‌హాగెన్ మహాసభ (రెండవ ఇంటర్నేషనల్ ఎనిమిదవ మహాసభ) 1910 ఆగస్టు 28నుంచి సెప్టెంబరు 3దాకా జరిగింది. కొన్ని సమస్యల మీద ప్రాథమిక చర్చలు జరిపి, ముసాయిదా తీర్మానాలు తయారుచేసేందుకోసం ఆ మహాసభ కొన్ని కమిషన్‌లను ఏర్పాటుచేసింది. లెనిన్ సహకార కమిషన్‌లో పనిచేశాడు.

యుద్ధ వ్యతిరేక పోరాట సమస్యమీది తీర్మానంలో ఆ మహాసభ ష్టుట్‌గార్ట్ మహాసభ ఆమోదించిన తీర్మానాన్ని ధృవీకరించింది. సోషలిస్టు పార్టీలకూ, పార్ల మెంట్లలో వాటి ప్రతినిధులకూ తమ ప్రభుత్వాలనుంచి ఆయుధాల తగ్గింపునూ, మధ్యవర్తి తీర్పుల న్యాయస్థానం ద్వారా రాజ్యాల మధ్య తగాదాల పరిష్కారాన్ని డిమాండు చెయ్యడాన్ని కూడా అది విధాయకంచేసింది. యుద్ధప్రమాదానికి వ్యతిరేకంగా నిర సన ప్రదర్శనలను ఏర్పాటుచెయ్యవలసిందిగా ఆ మహాసభ కార్మికులకి విజ్ఞప్తిచేసింది. – 135.

115 బాసెల్ మహాసభ (అత్యవసర అంతర్జాతీయ సోషలిస్టు మహాసభ) 1912 నవంబరు 24–25 తేదీల్లో జరిగింది. ముంచుకొస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధ ప్రమాద వ్యతిరేక పోరాట సమస్యను చర్చించేందుకోసం ఆ మహాసభ ఏర్పాటుచెయ్య బడింది. ఆ మహాసభ ఆమోదించిన ప్రణాళిక సామ్రాజ్యవాదులు సన్నాహాలు జరు పుతున్న యుద్ధపు కొల్లదారీ లక్ష్యాలను బహిర్గతంచేసి, శాంతికి అనుకూలంగానూ, యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగానూ కృతనిశ్చిత పోరాటం జరపవలసిందిగా అన్ని దేశాల కార్మికులకి విజ్ఞప్తిచేసింది. యుద్ధమే కనక వస్తే, తత్పర్యవసానంగా సంభ వించే ఆర్థిక, రాజకీయ సంక్షోభాలను సోషలిస్టు విప్లవంకోసం వినియోగించుకోవాలని ఆ ప్రణాళిక సోషలిస్టులకి సిఫారసుచేసింది.

కౌట్స్కీ, వాండెర్‌వెల్డెలూ, తదితర రెండవ ఇంటర్నేషనల్ నాయకులూ యుద్ధ వ్యతిరేక ప్రణాళికకి అనుకూలంగా వోటుచేశారు. అయితే, సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లాక వాళ్లు దాన్ని, అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలు ఆమోదించిన తదితర తీర్మానాలతోబాటు విస్మరించి తమతమ సామ్రాజ్యవాద ప్రభు త్వాల పక్షం వహించారు. – 135.

116 అరాజకవాద సిండికాలిస్టు ధోరణి – కార్మికవర్గ ఉద్యమంలో ఒక అవకాశవాద ధోరణి. అది రాజకీయ పోరాటాన్నీ, రాజకీయ కార్మిక పార్టీల నాయకత్వ పాత్రనీ తిరస్కరి

స్తుంది. ట్రేడ్‌యూనియన్లనే ఉత్పత్తి సాధనాలమీద స్వామ్యం కలిగివుండవలసిన కార్మికవర్గపు అత్యున్నత సంఘటన రూపంగానూ, సార్వత్రిక ఆర్థిక సమ్మెనే అత్యున్నత పోరాట రూపంగానూ అది పరిగణిస్తుంది. – 136.

117 సమైక్య ప్రభువర్గ సమితి – 1906 మేలో ఏర్పాటుచెయ్యబడిన భూస్వాముల విప్లవ ప్రతీఘాత సంఘం. జారిస్టు ప్రభుత్వ విధానంమీద యీ సమితికి విశేషమైన ప్రభావం వుండేది. – 140.

118 ఎన్. జి. చెర్నిషేవ్‌స్కీ రచించిన "నాందీ ప్రస్తావన" అనే నవలనుంచి లెనిన్ ఉల్లేఖి స్తున్నాడు. – 140.

119 F. Engels, *Fluchtlingsliterature* ("ప్రవాసుల సాహిత్యం"). – 141.

120 మార్క్స్, ఎంగెల్సులు రచించిన "'Social-Demokrat' సంపాదకులకి."

లాసాలియన్లు – 1863లో ఎఫ్. లాసాల్ స్థాపించిన అఖిల జర్మన్ కార్మిక సంఘ సభ్యులు. జర్మనీలో కార్మికోద్యమాభివృద్ధి క్రమంలో కార్మికవర్గపు ఒక సామూహిక రాజకీయ సంఘ స్థాపన కచ్చితంగా ఒక ముందడుగే. కానైతే, ప్రధానమైన సైద్ధాంతిక, రాజకీయ సమస్యలమీద లాసాలియన్లు అవకాశవాద వైఖరి తీసుకున్నారు. తమ ప్రత్యక్ష కార్యకలాపాల్లో ఎఫ్. లాసాలూ, అతని అనుచరులూ, వారసులూ ప్రష్యన్ నాయకత్వ పాత్రకి అనుగుణంగా తమని తాము మలుచుకొని, బిస్మార్క్ అనుసరించిన విధానాన్ని అనుసరించారు.

లాసాలియన్లు అనుసరించే సిద్ధాంతమూ, ఎత్తుగడలూ, నిర్మాణపర సూత్రాలూ జర్మన్ కార్మికోద్యమంలో ఒక అవకాశవాద ధోరణి అని మార్క్స్, ఎంగెల్సులు పదే పదే నిశితంగా విమర్శించారు. – 142.

121 ఆర్.ఎస్.డి.ఎల్.పి. దేశాంతర శాఖల కాన్ఫరెన్సు బెర్న్‌లో 1915 ఫిబ్రవరి 14–19 (ఫిబ్రవరి 27– మార్చి 4)న జరిగింది. అది లెనిన్ చొరవతో సమావేశ పరచబడి, అఖిల పార్టీ కాన్ఫరెన్సు పాత్ర వహించింది. యుద్ధమూ, పార్టీ కర్తవ్యాలూ కార్యక్రమంలో ప్రధాన అంశంగా వున్నాయి. యీ సమస్యలమీద లెనిన్ నివేదిక యిచ్చాడు.

లెనిన్ నివేదికమీద అవలంబించబడిన తీర్మానాలలో కాన్ఫరెన్సు సామ్రాజ్యవాద యుద్ధం కల్పించిన సన్నివేశంలో బోల్షెవిక్ పార్టీ లక్ష్యాలనూ, యెత్తుగడలనూ నిర్వచించింది. – 144.

122 "సోత్సియాల్ డెమోక్రట్" – ఆర్.ఎస్.డి.ఎల్.పి. రహస్య కేంద్ర వార్తాపత్రిక, 1908

ఫిబ్రవరినుండి 1917 జనవరిదాకా ప్రచురింపబడింది. మొదటి సంచిక తర్వాత అది విదేశాలలో అచ్చువెయబడింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. అయిదవ మహాసభ (లండన్)లో యెన్నికైన కేంద్ర కమిటీ నిర్ణయం ద్వారా పత్రిక సంపాదక సిబ్బందిలో బోల్షివిక్కులూ, మెన్షివిక్కులూ, పోలిష్ సోషల్ డెమోక్రట్లూ వున్నారు. ఆచరణలో పత్రిక లెనిన్ దర్శకత్వంకింద వుంది. ఆయన వ్యాసాలకు ప్రాముఖ్యం యివ్వబడింది. రద్దువాదులతోనూ, ట్రాట్స్కీయిస్టులతోనూ, ఒల్జొవీస్టులతోనూ చేసిన పోరాటంలోనూ, రహస్య మార్క్సిస్టు పార్టీని నిలుపుకోడానికీ, దాని ఐక్యతను వృద్ధిచేసుకోడానికీ, జనాలతో దాని సంబంధాలను పటిష్ఠపరచుకోడానికీ చేసిన పోరాటంలోనూ "సోత్సియాల్ డెమోక్రట్" ముఖ్య పాత్ర వహించింది. – 144.

123 ప్రూడనిజం – మార్క్సిజానికి వ్యతిరేకమైన ఒక పెటీబూర్జువా ధోరణి. ఈ ధోరణి సైద్ధాంతికుడైన ఫ్రెంచి అరాజకవాది ప్రూడన్ పేర దీనికి పేరు వచ్చింది. ప్రూడనూ, అతని అనుచరులూ భారీ పెట్టుబడిదారీ ఉత్పత్తిని విమర్శించి, చిన్న తరహా సరుకు ఉత్పత్తిని పదిలపరచాలని వాదించారు. రాజకీయ పార్టీలనూ, రాజకీయ పోరాటాన్నీ, ట్రేడ్‌యూనియన్లనీ, సమ్మెలనీ తిరస్కరించి, ఉత్పత్తి, పరపతి, వినిమయ సహకార సంఘాల స్థాపన ద్వారా, ప్రత్యక్ష సరుకు మారకం ద్వారా, శాంతియుత పద్ధతిలో రాజ్యాన్ని రద్దుచెయ్యడం ద్వారా దోపిడిని రద్దుచెయ్యవచ్చునన్న ఊహాజనిత పథకాలను వాళ్లు ప్రతిపాదించారు. ప్రూడన్ శ్రామికవర్గపు చారిత్రక పాత్రను అర్థంచేసుకోలేదు, వర్గపోరాటాన్నీ, శ్రామికవర్గ విప్లవాన్నీ, శ్రామికవర్గ నియంతృత్వాన్నీ వ్యతిరేకించాడు. అరాజకవాద వైఖరి మూలంగా రాజ్యపు అవసరాన్ని తిరస్కరించాడు. బూర్జువా సిద్ధాంతవేత్తలు వర్గ సహకారాన్ని బోధించేందుకు ప్రూడన్ భావాలను విస్తృతంగా వినియోగించుకున్నారు.

తన అభిప్రాయాలను మొదటి ఇంటర్నేషనల్‌మీద రుద్దేందుకు ప్రూడన్ చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా మార్క్సు, ఎంగెల్సులు ఎడతెగని పోరాటం జరిపారు. కార్ల్ మార్క్సు తను రచించిన "తత్వశాస్త్ర దారిద్ర్యం"లో ప్రూడనిజాన్ని నిర్దాక్షిణ్యమైన విమర్శకి గురిచేశాడు. మొదటి ఇంటర్నేషనల్‌లో ప్రూడనిజానికి వ్యతిరేకంగా మార్క్సు, ఎంగెల్సులూ, వారి అనుయాయులూ జరిపిన కృతనిశ్చిత పోరాటం మార్క్సిజానికి అఖండ విజయంలో ముగిసింది. – 146.

124 లెనిన్ "సోషలిజమూ, యుద్ధమూ" అనే తన పుస్తకాన్ని ప్రచురణకి తయారుచేసే

సందర్భంగా, ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ ప్రకటన "యుద్ధమూ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం"కి ప్రస్తుత వివరణను రచించాడు. – 149.

125 బ్రెస్ట్-లితోవ్‌స్క్ సంధి – సోవియట్ రష్యాకూ, చతుష్టయ కూటమి (జర్మనీ, ఆస్ట్రో-హంగెరీ, బల్గేరియా, టర్కీ)కీ జరిగిన శాంతి సంధికి ప్రస్తావన. యీ సంధి 1918 మార్చి 3న బ్రెస్ట్-లితోవ్‌స్క్‌లో సంతకాలు చేయబడింది. సంధి షరతులు సోవియట్ రష్యాకు చాలా భారంగా ఉన్నాయి. 1918 ఆగస్టులో సోవియట్ రష్యా మీద జర్మనీ మరికొన్ని పరభక్షణాత్మక డిమాండ్లు గల అదనపు సంధినీ, ఆర్థిక ఒప్పందాన్నీ విధించింది.

జర్మనీలో రాజరికాన్ని కూలదోసిన 1918 నవంబర్ విప్లవం తర్వాత, 1918 నవంబర్ 13న రష్యా ప్రభుత్వం పరభక్షణాత్మకమైన, అన్యాయమైన బ్రెస్ట్ సంధిని రద్దుచేసింది. – 154.

126 1914–18 సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధాన్ని అంతంచేసిన వెర్సేల్స్ శాంతి సంధిపైన 1919 జూన్ 28న ఒకవైపున అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, జపాన్, వాటి పొత్తుదార్లూ, మరొకవైపున జర్మనీ సంతకాలు చేశాయి. దాని ఉద్దేశం విజేతలకు అనుకూలంగా పెట్టుబడిదారీ ప్రపంచ పునర్విభజనను దృఢపరచడమూ, సోవియట్ రష్యా గొంతు నొక్కడానికీ, ప్రపంచ మంతటా విప్లవోద్యమాన్ని నిలిపివేయడానికీ ఉపయోగపడేటట్లు దేశాల మధ్య సంబంధాల వ్యవస్థను సృష్టించడమూ. – 154.

127 "విల్సనిజం" అనేది 1913–21లో అమెరికా అధ్యకుడైన వుడ్రో విల్సన్ పేరును బట్టి యేర్పడింది: తన అధ్యక్ష పదవి మొదటి సంవత్సరంలో చట్టాల పరంపర (వృద్ధిక్రమానుగతమైన ఆదాయం పన్ను చట్టమూ, ట్రస్టు వ్యతిరేక చట్టమూ, మొదలైనవి) చేసి, వాటిని ఆడంబరంగా "నూతన స్వేచ్ఛా" యుగం అన్నాడు. అతనూ, అతని అనుచరులూ అమెరికా సామ్రాజ్యవాదపు దురాక్రమణపర విదేశాంగ విధానానికి ఆడంబర నినాదాలతోనూ, "ప్రజాస్వామ్యం," "జాతుల పొత్తు" లాంటి మాటలతోనూ ముసుగువేశారు. సోవియట్ అధికారం నెలకొల్పబడిన వెంటనే, సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా జోక్యానికి ప్రేరేపణ యిచ్చి, అందుకు యేర్పాటుచేసిన మొదటి వాళ్లలో ఒకడు అతను. సోవియట్ ప్రభుత్వ శాంతి విధానపు తీవ్ర ప్రభావాన్ని యెదుర్కోడానికి అతను ఆడంబర పూరితమైన "14 అంశాల శాంతి కార్యక్రమా"న్ని ప్రతిపాదించాడు; యిది అమెరికా దురాక్రమణశీల విధానానికి ముసుగుగా ఉద్దేశింపబడింది.

అమెరికన్ ప్రచారమూ, యూరపియన్ బూర్జువా పత్రికలూ విల్సన్‌కు శాంతి యోధుడనే కీర్తిని సృష్టించాయి. యిది బూటకపు కీర్తి. అమెరికాలోపల అనుసరింప బడిన కార్మిక వ్యతిరేక విధానమూ, యితర దేశాలపట్ల అనుసరింపబడిన దురాక్రమణ విధానమూ త్వరలోనే విల్సన్, విల్సన్ అనుచరుల పెటీబూర్జువా వాగాడంబరంలోని బూటకాన్ని బయటపెట్టాయి. – 154.

128 లెనిన్ ప్రస్తావించింది 1919 ఫిబ్రవరిలో బెర్న్‌లో జరిగిన సోషలిస్టు పార్టీల కాన్ఫరెన్సులో పశ్చిమ యూరపియన్ సోషలిస్టు పార్టీల నాయకులు నెలకొల్పిన రెండవ (బెర్న్) ఇంటర్నేషనల్‌ని. ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు ఆగిపోయిన రెండవ ఇంటర్నేషనల్ స్థానాన్ని అది పూరించాలని ఉద్దేశింపబడింది. సారభూతంగా అది అంతర్జాతీయ బూర్జువావర్గపు తొత్తు పాత్ర నిర్వహించింది. – 155.

129 జర్మన్ స్వతంత్ర సోషల్ డెమొక్రటిక్ పార్టీ – సెంట్రిస్టు పార్టీ, 1917 ఏప్రిల్‌లో నెలకొల్పబడింది. సెంట్రిస్టు పదజాలం వెనుక దాని సభ్యులు సోషల్ జాతీయ దురహంకారులతో "ఐక్యత"ను బోధిస్తూ, వర్గపోరాటు విసర్జనలోకి దిగజారారు.

హాలెలో 1920 అక్టోబర్‌లో జరిగిన మహాసభలో యీ పార్టీలో చీలిక యేర్పడింది. 1920 డిసెంబర్‌లో దాని సభ్యులలో అత్యధిక భాగం జర్మన్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. దక్షిణపక్ష సభ్యులు పాత పేరుతోనే విడిగా పార్టీగా యేర్పడ్డారు. ఆవిధంగా యీ పార్టీ 1922దాకా వుంది. – 156.

130 మూడవ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ – వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలను యేకంచేసిన అంతర్జాతీయ విప్లవ శ్రామికవర్గ సంస్థ. 1919నుండి 1943దాకా వుంది.

ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాద నాయకులు సోషలిజానికి చేసిన ద్రోహం ద్వారా కార్మికవర్గ ఉద్యమంలో చీలిక యేర్పడి, రెండవ ఇంటర్నేషనల్ కూలిపోయిన తర్వాత, మూడవ ఇంటర్నేషనల్ స్థాపన చారిత్రకంగా అవసరమైంది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను స్థాపించడంలో లెనిన్ ప్రముఖ పాత్ర వహించాడు.

కొమింటర్న్ సకల దేశాల శ్రామిక ప్రజల మధ్య సంబంధాలను పునరుద్ధరించి, పటిష్ఠపరచి, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలోని అవకాశవాదాన్ని బహిర్గతంచేసి ఖండించడానికి తోడ్పడి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ వ్యూహాన్నీ, యెత్తుగడలనూ కొత్త చారిత్రక పరిస్థితులకు అన్వయించింది.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మొదటి మహాసభ మాస్కోలో 1919 మార్చి 2–6న జరిగింది. గతించిన దశ అవసరాలను తీర్చే సంస్థా రూపానికి కాలం తీరిందని గమనించి, 1943 మేలో కొమింటర్న్ కార్యనిర్వాహకవర్గం కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను రద్దుచేయాలని తీర్మానించింది. – 156.

131 స్పార్టకిస్టులు – జర్మన్ వామపక్ష సోషల్ డెమోక్రట్ల విప్లవ సంఘం, ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు కార్ల్ లీబ్‌క్నెఖ్ట్, రోజా లుక్సెంబుర్గ్ తదితరులచేత నిర్మించబడింది. యీ సంఘపు సభ్యులు విప్లవ ప్రచారం చేసి, సామూహిక యుద్ధ వ్యతిరేక చర్యలు యేర్పాటుచేసి, సమ్మెలకు దర్శకత్వం వహించి, యుద్ధపు సామ్రాజ్యవాద స్వభావాన్నీ, అవకాశవాద సోషల్ డెమోక్రటిక్ నాయకుల ద్రోహాన్నీ బయట పెట్టారు. కానీ, వాళ్ళు సిద్ధాంత, రాజకీయ సమస్యలలో పక్కదారి పట్టారు: వాళ్ళ కార్మికవర్గ పోరాటంలో కార్మికవర్గ పార్టీ నాయక పాత్రను తక్కువ అంచనావేశారు, అవకాశవాదులతో చీలిక వస్తుందని భయపడ్డారు, కార్మికవర్గానికీ, రైతులకూ మధ్య పొత్తు అవసరాన్నీ, జాతీయ విమోచనోద్యమాల ప్రాముఖ్యాన్నీ గుర్తించలేకపోయారు, విడిపోయి, స్వతంత్ర రాజ్యాలుగా యేర్పడేటంతవరకు జాతుల స్వయంనిర్ణయ హక్కును వ్యతిరేకించారు.

1917 ఏప్రిల్‌లో వాళ్ళు తమ సంస్థాగత స్వాతంత్ర్యాన్ని నిలుపుకుంటూ, జర్మన్ సెంట్రిస్టు స్వతంత్ర సోషల్ డెమోక్రటిక్ పార్టీలో చేరారు. 1918 నవంబర్‌లో, జర్మనీలో విప్లవం జరిగేటప్పుడు, వాళ్ళు "స్పార్టకస్ యూనియన్" యేర్పరచి, 1918 డిసెంబర్‌లో తమ కార్యక్రమాన్ని ప్రచురించిన తర్వాత, "స్వతంత్రుల" నుంచి విడిపోయారు. 1918 డిసెంబర్ 30–1919 జనవరి 1న జరిగిన ప్రారంభ మహాసభలో వాళ్ళు జర్మన్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. – 156.

132 "వెర్సేల్స్" పక్షం – పారిస్ కమ్యూన్‌కి బద్ధ శత్రువులు. 1871లో పారిస్ కమ్యూన్ యేర్పడిన తర్వాత, త్యేర్ నాయకత్వాన వెర్సేల్స్‌లో యేర్పడిన ఫ్రెంచి విప్లవ ప్రతీఘాత బూర్జువా ప్రభుత్వపు అనుచరులు. కమ్యూన్ అణచివేయబడినప్పుడు కమ్యూనార్డులమీద వాళ్ళు కనివిని యెరగని శిక్షాచర్యలు తీసుకున్నారు; తత్ఫలితంగా వాళ్ళ పేరు పాశవిక ప్రతీఘాత విప్లవానికి పర్యాయ పదం అయింది. – 157.

133 1898 నాటి స్పానిష్-అమెరికన్ యుద్ధం – లెనిన్ పేర్కొన్నట్లు చరిత్రలో యిది మొట్టమొదటి సామ్రాజ్యవాద యుద్ధం, సామ్రాజ్యవాద యుగారంభానికి సంకేత

ప్రాయమైన ఒక ప్రముఖ ఘటన. స్పానిష్ వలసవాద పీడనకి వ్యతిరేకంగా క్యూబన్ (1895), ఫిలిప్పైన్ (1896నుంచి) ప్రజాసామూహిక తిరుగుబాట్ల పరిస్థితుల్లో ఆ యుద్ధం మొదలైంది. ఆ ప్రజలకు తోడ్పాటు పేరుతో, అమెరికా ఆ యుద్ధాన్ని తన స్వార్థ ప్రయోజనాలకి వినియోగించుకొని, పోర్టోరికోనీ, గువాం దీవినీ, ఫిలిప్పైన్స్‌నీ వశపరచుకొని, లాంఛనప్రాయంగా స్వతంత్ర దేశంగా ప్రకటింపబడిన క్యూబాని ఆక్రమించుకుంది. – 158.

134 1899–1902 నాటి ఆంగ్లో-బోయర్ల యుద్ధం – దక్షిణ ఆఫ్రికాలోని బోయర్ల రిపబ్లిక్కులైన ఆరెంజ్ ఫ్రీస్టేట్, ట్రాన్స్‌వాల్‌లకి వ్యతిరేకంగా గ్రేట్ బ్రిటన్ జరిపిన కొల్లదారీ యుద్ధం. సామ్రాజ్యవాద యుగపు తొలి యుద్ధాల్లో యిదొకటి. ఆ యుద్ధ పర్యవసానంగా ఆ రెండు రిపబ్లిక్కులూ బ్రిటిష్ వలసలుగా మార్చివెయ్యబడ్డాయి, ఆదివాసి ఆఫ్రికన్ జనాభా ద్విముఖ – బోయర్ల, బ్రిటిష్ వలసవాదుల – దోపిడికి గురిచెయ్యబడ్డారు. – 158.

135 సామ్రాజ్యవాద సమస్యమీదా, యుద్ధంపట్ల సోషలిస్టుల వైఖరిమీదా జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క హెమ్నిట్స్ మహాసభ (1912) చేసిన తీర్మానానికి ప్రస్తావన. 1912 సెప్టెంబర్ 20న చేసిన యీ తీర్మానం సామ్రాజ్యవాద విధానాన్ని ఖండించి, శాంతికొరకు చేసే పోరాట ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పింది. – 158.

136 రక్షణ విధానం – విదేశీ పోటీకి వ్యతిరేకంగా జాతీయ ఆర్థిక వ్యవస్థని రక్షించేందుకు ఉద్దేశింపబడిన ప్రభుత్వ ఆర్థిక విధానం. జాతీయ పరిశ్రమలకి ద్రవ్య ప్రోత్సాహం ద్వారానూ, ఎగుమతులు పెంచడం ద్వారానూ, దానికితోడు దిగుమతులను పరిమితం చెయ్యడం ద్వారానూ యీ విధానం అమలుజరపబడుతుంది.

సామ్రాజ్యవాద దశలో రక్షణ విధానం "దాడి" స్వభావాన్ని సంతరించుకుంటుంది. అత్యధికంగా అభివృద్ధిచెందిన, అధికంగా గుత్తస్వభావాన్ని సంతరించుకున్న పరిశ్రమలను రక్షించడం, పెట్టుబడి ఎగుమతి, సరుకులతో ముంచెత్తడం వగైరాల ద్వారా విదేశీ మార్కెట్లను జయించడమే దాని ప్రధాన కర్తవ్యం. – 163.

137 "Die Bank" ("ది బాంక్") – జర్మన్ ఫైనాన్సర్ల పత్రిక, 1908నుండి 1948దాకా బెర్లిన్‌లో ప్రచురింపబడింది. – 172.

138 స్టాక్ ఎక్స్‌చేంజి దివాళా 1873లో మొదట ఆస్ట్రో-హంగెరీలోనూ, తర్వాత జర్మనీలోనూ, తదితర దేశాల్లోనూ సంభవించింది. 1870 దశకపు మొదటి సంవత్స

రాల్లో రుణ విస్తరణ, కంపెనీల స్థాపన, స్టాక్ ఎక్స్చేంజి చట్టావ్యాపారుల పెరుగుదల కొనసాగి, యింతకుముందెన్నడూ లేని ప్రమాణాన్ని సంతరించుకుంది. పెంపొందుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభపు విస్పష్ట లక్షణాలు వర్తక, పరిశ్రమల్లో అప్పుడే కానవస్తున్న దశలో స్టాక్ ఎక్స్చేంజి చట్టావ్యాపారపు పెరుగుదల కొనసాగింది. వియన్నా స్టాక్ ఎక్స్చేంజిలో 1873 మే 9న యీ విలయం భళ్ళుమంది. 24 గంటల్లోపల వాటాల విలువ కొన్ని కోట్ల మేరకు పడిపోయింది. దివాళాలు విపరీతమైన సంఖ్యలో సంభవించాయి. అటుతర్వాత స్టాక్ ఎక్స్చేంజి దివాళా జర్మనీకి వ్యాపించింది. –184.

139 కంపెనీల స్థాపన కుంభకోణాలు – జాయింట్‌స్టాక్ కంపెనీలు, బాంకులు, ఇన్సూరెన్సు కంపెనీల స్థాపన క్రమంలో జరిగాయి. 1850, 1860 దశకాలకు మిక్కిలి విశిష్టమైన ఉద్యమం యిది. కంపెనీల స్థాపనతోబాటు, బినామీ పారిశ్రామిక, వర్తక సంస్థల ఏర్పాటు ద్వారా, డబ్బు పోగేసుకునే బూర్జువా వ్యాపారస్తుల యితర దగాకోరు లావాదేవీల ద్వారా స్థిరాస్తులలోనూ, సెక్యూరిటీల్లోనూ విచ్చలవిడి చట్టావ్యాపారం సాగింది. – 184.

140 "Frankfurter Zeitung" ("ఫ్రాంక్‌ఫుర్టెర్ వార్తాపత్రిక") – జర్మన్ స్టాక్ ఎక్స్చేంజికి చెందిన బడా వ్యాపారస్తుల దినపత్రిక. ఇది 1856నుంచి 1943దాకా ఫ్రాంక్‌ఫుర్ట్-ఆమ్-మెయిన్‌లో ప్రచురింపబడింది. "Frankfurter Allgemeine Zeitung" ("ఫ్రాంక్‌ఫుర్టెర్ సార్వత్రిక వార్తాపత్రిక") అన్న శీర్షికతో 1949లో అది పునరుద్ధరింపబడింది. – 186.

141 "సంఘటిత పెట్టుబడిదారీ విధాన" సిద్ధాంతపు బూర్జువా సమర్థక, అశాస్త్రీయ స్వభావాన్ని "సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అన్న తన పుస్తకంలో లెనిన్ బహిర్గతంచేశాడు. ఈ సిద్ధాంతం సామ్రాజ్యవాదాన్ని ఒకరకమైన ప్రత్యేక, పరివర్తిత పెట్టుబడిదారీ విధానంగా చిత్రించి, దానిలో పోటీ, ఉత్పత్తి అరాజకత్వం, ఆర్థిక సంక్షోభాలు ఉండవన్నట్లూ, జాతీయార్థిక వ్యవస్థయొక్క ప్రణాళికాబద్ధ అభివృద్ధి జరుగుతుందన్నట్లుగా వర్ణిస్తుంది. గుత్తపెట్టుబడిదారీ విధాన సిద్ధాంతకారులైన సొంబార్ట్, లీఫ్మన్ ప్రభృతులు ముందుకుతెచ్చిన "సంఘటిత పెట్టుబడిదారీ విధానపు" సిద్ధాంతాన్ని సంస్కరణవాదులైన కౌట్స్కీ, హిల్ఫెర్‌డింగ్‌లూ, రెండవ ఇంటర్నేషనల్‌కి చెందిన యితర సిద్ధాంతకారులూ అందిపుచ్చుకున్నారు. సామ్రాజ్యవాదపు ఆధునిక వత్తాసుదారులు పెట్టుబడిదారీ విధానపు "సంఘటిత,"

"ప్రణాళికాబద్ధ" సిద్ధాంతానికి పలు పాఠ్యాంతరాలను కనిపెడుతూవుంటారు. అలా చెయ్యడంలో వాళ్ల లక్ష్యం, జనబాహుళ్యాన్ని మోసగించడం, గుత్తపెట్టుబడిదారీ విధానానికి మెరుగుపూతలు పెట్టడం. సామ్రాజ్యవాదాన్ని గురించి లెనిన్ యిచ్చిన వివరణ సరైనదన్న విషయాన్ని అనుభవం తిరుగులేని పద్ధతిలో రుజువుచేసింది: గుత్త సంస్థల ప్రాబల్యం ఉత్పత్తి అరాజకత్వాన్ని తొలగించదు సరికదా, దాన్ని పెంపొందిస్తుంది, పెట్టుబడిదారీ విధానాన్ని అది సంక్షోభాలనుంచి కాపాడదు. – 191.

142 జి. వి. ప్లెహానొవ్‌ని లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. సామ్రాజ్యవాదాన్ని గురించిన ప్లెహానొవ్ భావాలు "యుద్ధం గురించి" అన్న వ్యాససంకలనంలో వున్నాయి. అది 1915లో పెట్రోగ్రాడ్‌లో ప్రచురింపబడింది. – 195.

143 "Deutsche Ökonomist" ("జర్మన్ ఆర్థికవేత్త") – 1883–1935 మధ్య బెర్లిన్‌లో ప్రచురింపబడిన పత్రిక. – 202.

144 ఫ్రెంచి పనామా కుంభకోణం – ఫ్రెంచి పనామా కెనాల్ కంపెనీచేత లంచాలు తిన్న రాజనీతిజ్ఞుల, రాజకీయవాదుల, సివిల్ ఉద్యోగుల, వార్తాపత్రికల విపరీతమైన అకార్యాలు 1892–93లో వెల్లడి అయినప్పుడు వాడుకలోకి వచ్చిన మాట. – 205.

145 "Weltwirtschaftliches Archiv" ("ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పురాపత్రాలు") – ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇన్‌స్టిట్యూట్ ప్రచురించిన పత్రిక. ఇది 1913 నుంచి కీల్ విశ్వవిద్యాలయంనుంచి (యేనా, జి.డి.ఆర్.) ప్రచురింపబడింది. – 210.

146 "Bulletin de l'Institut International de Statistique" ("అంతర్జాతీయ గణాంక ఇన్‌స్టిట్యూట్ బులెటిన్") – ఇది హేగ్‌లో 1885–1912 మధ్య ప్రచురింపబడింది. – 210.

147 "The Daily Telegraph" ("దిన తంతి") – లిబరల్, 1880లనుంచి కన్సర్వేటివ్ వార్తాపత్రిక. ఇది 1855నుంచి 1937దాకా మొదట లండన్‌లోనూ, దరిమిలా మాంచెస్టర్‌లోనూ ప్రచురింపబడింది. – 210.

148 "Journal of the Royal Statistical Society" ("రాయల్ గణాంక సంస్థ పత్రిక") – ఇది లండన్‌లో 1838నుంచి ప్రచురింపబడింది. – 210.

149 "ఫేబియన్ సొసైటీ" – 1884లో బ్రిటన్‌లో స్థాపించబడిన సంస్కరణవాద సంఘం.

క్రీ. పూ. 3వ శతాబ్దిలో హాన్నిబల్‌తో నిర్ణయాత్మక యుద్ధాలు పరిహరించిన యుద్ధతంత్రానికి గాను కాలహర్త అని పేరు తెచ్చుకున్న రోమన్ జనరల్ ఫేబియస్ మాక్సిమస్‌నుబట్టి సంఘానికి ఆ పేరు వచ్చింది. సంఘ సభ్యులు అత్యధికంగా బూర్జువా మేధావులు – శాస్త్రజ్ఞులూ, రచయితలూ, రాజకీయవాదులూ. వీళ్లు కార్మిక వర్గ వర్గపోరాట అవసరాన్నీ, సోషలిస్టు విప్లవ అవసరాన్నీ నిరాకరించి, చిల్లర సంస్కరణలచేతా, సమాజంలో క్రమక్రమ మార్పులచేతా పెట్టుబడిదారీ విధానంనుండి సోషలిజానికి పరివర్తనను సాధించవచ్చునని వాదించారు. 1900లో ఫేబియన్ సంఘం లేబర్ పార్టీలో కలిసింది. – 258.

150 1899–1901 నాటి బాక్సర్ తిరుగుబాటు అణచివేయబడిన తర్వాత, సామ్రాజ్యవాద దేశాలకూ (బ్రిటన్, ఆస్ట్రో-హంగెరీ, బెల్జియం, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, జపాన్, హాలండు, రష్యా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు) చైనాకూ మధ్య 1901 సెప్టెంబర్ 7న సంతకాలు చేయబడిన "తుది పత్రాని"కి ప్రస్తావన. చైనాను దోచుకోడానికీ, కొల్లగొట్టడానికీ విదేశీ పెట్టుబడిదారులకు అది కొత్త అవకాశాలు యిచ్చింది. – 268.

151 బాక్సర్ (మరింత కచ్చితంగా చెప్పాలంటే ఇహోటువాన్) తిరుగుబాటు – 1899–1901 మధ్య ఉత్తర చైనాలో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా తిరుగుబాటు. "ఇహోచువాన్" ("ధర్మబద్ధ సామరస్యపు పిడికిలి") అన్న ఒక రహస్య సంఘం దీన్ని ప్రారంభించింది. దీన్నే తర్వాత "ఇహోటువాన్" (ధర్మబద్ధ సామరస్య దళాలు) అని వ్యవహరించారు. 1900 జూన్‌లో తిరుగుబాటుదారులు పెకింగులో ప్రవేశించారు. విదేశీయులు "బాక్సర్" తిరుగుబాటు అని పిలిచిన ఆ తిరుగుబాటును జర్మన్ జనరల్ వాల్డెర్‌సే నాయకత్వంలో సామ్రాజ్యవాద దేశాల దాడి దళాలు క్రూరంగా అణచివేశాయి. జర్మన్, జపనీజ్, బ్రిటిష్, అమెరికన్, రష్యన్ సామ్రాజ్యవాదులు ఆ తిరుగుబాటు అణచివేతలో పాల్గొన్నారు. చైనా బలవంతాన సంతకం పెట్టవలసివచ్చిన అంతిమ ఒప్పందం విదేశీ సామ్రాజ్యవాదానికి దాన్నొక అర్ధవలసగా మార్చివేసింది. – 269.

152 "ఫషోడా ఘటన" – ఫషోడా తూర్పు సుడాన్‌లో ఒక పట్టణం. 1898 సెప్టెంబర్‌లో ఫషోడావద్ద బ్రిటిష్, ఫ్రెంచి వలస సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ అంతర్జాతీయ సంబంధాలలో తీవ్ర సంక్షోభాన్ని కలిగించింది. యిది సుడాన్‌లో ఆధిపత్యం కొరకు బ్రిటన్‌కూ, ఫ్రాన్సుకూ మధ్య జరిగిన పోరాటాన్ని ప్రతిబింబించి, ఆఫ్రికా పంపకాన్ని ముగించింది. – 270.

153 “‘సామ్రాజ్యవాద ఆర్థికవాదపు’ ఆవిర్భవిస్తున్న ధోరణి” అనే వ్యాసం బుహారిన్—ప్యతకోవ్—బోష్ బృందం మార్క్సిస్టు కాని, బోల్షెవిక్కుల వ్యతిరేక వైఖరికి నిరసనగా ఉద్దేశింపబడింది. ఈ బృందం 1915 ఆరంభంలో ఏర్పడనారంభించింది. వాళ్ళు ప్రకటించిన “జాతుల స్వయంనిర్ణయ హక్కు” అనే ప్రధాన అంశాలలో వాళ్లు లెనినిస్టు సోషలిస్టు విప్లవ సిద్ధాంతాన్ని వ్యతిరేకించారు, సామ్రాజ్యవాద దశలో ప్రజాస్వామ్యంకోసం పోరాట ఆవశ్యకతను తిరస్కరించారు, జాతుల స్వయంనిర్ణయహక్కు అనే నినాదాన్ని పార్టీ వదలించుకోవాలని డిమాండుచేశారు.

సైద్ధాంతిక అభిప్రాయభేదాలకు పరిమితం చేయకుండా బుహారిన్—ప్యతకోవ్—బోష్ బృందం పార్టీ పంథానూ, నినాదాలనూ బాహాటంగా వ్యతిరేకించింది, “కమ్యూనిస్టు,” “సోషల్ డెమోక్రాట్” పత్రికలను సొంత బృందపు ప్రయోజనాలకోసం వినియోగించడానికి ప్రయత్నించింది. – 278.

154 “రాజకీయ విప్లవాన్ని ఎవరు సాధిస్తారు?” అన్న వ్యాసానికి యిది ప్రస్తావన. ఈ వ్యాస రచయిత అయిన ఎ. ఎ. సానిన్ అనే ఆర్థికవేత్త రష్యా సోషలిస్టు పరివర్తనను సార్వత్రిక సమ్మె ద్వారా సాధించవచ్చునని విశ్వసించి, స్వతంత్రమైన కార్మికవర్గ రాజకీయ పార్టీ, రాజకీయ విప్లవాల అవసరాన్ని తిరస్కరించాడు. – 278.

155 ఆర్.ఎస్.డి.ఎల్.పి. దేశాంతర శాఖల కాన్ఫరెన్సుకి యిది ప్రస్తావన (121వ వివరణ చూడండి). – 278.

156 హెన్రీయెటె రోలండ్-హోల్స్ట రచించిన డచ్ వామపక్షీయుల ముసాయిదా కార్యక్రమానికి యిది ప్రస్తావన. – 279.

157 “Vorbote” (“వేగుచుక్క”) – త్సిమ్మెర్వాల్డ్ వామపక్షీయుల సైద్ధాంతిక పత్రిక. ఇది జర్మన్ భాషలో 1916లో బెర్న్‌నుంచి ప్రచురింపబడింది. – 279.

158 1916 ఫిబ్రవరి 5–9 తేదీల మధ్య బెర్న్‌లో జరిగిన విస్తృత అంతర్జాతీయ సోషలిస్టు కమిటీ సమావేశాన్ని లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. ప్రతినిధుల సంపుటినిబట్టి శక్తుల బలాబలాల్లో వామపక్షానికి అనుకూలంగా మార్పువచ్చినట్లు కనిపించింది, కాని, త్సిమ్మెర్వాల్డ్ కాన్ఫరెన్సులో మాదిరిగానే, మెజారిటీ సభ్యులు యింకా మధ్యస్థులుగానే ఉండిపోయారు.

అంతర్జాతీయ సోషలిస్టు కమిటీ విస్తృత సమావేశం బూర్జువా ప్రభుత్వాల్లో సోషలిస్టులు పాల్గొనడాన్నీ, సామ్రాజ్యవాద యుద్ధంలో “మాతృదేశ రక్షణ” నినాదాన్నీ,

యుద్ధ రుణాలకు అనుకూలంగా వోటుచెయ్యడాన్నీ నిరసిస్తూ "అన్ని అనుబంధిత పార్టీలకీ, గ్రూపులకీ" ఒక విజ్ఞప్తిని ఆమోదించింది. కార్మికోద్యమానికి తోడ్పాటు నివ్వవలసిన ఆవశ్యకతను గురించీ, సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజా సామూహిక విప్లవ కార్యాచరణల ఆవశ్యకతను గురించీ కూడా ఆ విజ్ఞప్తి పేర్కొంది. అయితే, సోషల్ జాతీయ దురహంకారంతోనూ అవకాశవాదంతోనూ తెగతెంపులు చేసుకోవాలన్న హెచ్చరిక లేని కారణంగా, ఆ విజ్ఞప్తి అసమగ్రంగా వుంది. – 279.

159 త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు – త్సిమ్మెర్‌వాల్డులో 1915 సెప్టెంబరులో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సులో లెనిన్ చొరవ మేరకు యీ గ్రూపు నెలకొల్పబడింది. ఆ గ్రూపులో 8మంది ప్రతినిధులు – ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ ప్రతినిధులు, స్వీడన్, నార్వే, స్విట్జర్లండ్, జర్మనీ దేశాల వామపక్ష సోషల్ డెమోక్రట్లు, పోలిష్ సోషల్ డెమోక్రటిక్ ప్రతిపక్ష ప్రతినిధులూ, లాత్వియన్ ప్రాంతపు సోషల్ డెమోక్రట్లూ – సమీకృతులయ్యారు. బోల్షివిక్కుల నాయకత్వంలో త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు ఆ కాన్ఫరెన్సులోని మధ్యస్థ మెజారిటీకి వ్యతిరేకంగా పోరాటం జరిపారు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని నిరసిస్తూ, సోషల్ జాతీయ దురభిమానుల విద్రోహాన్ని బహిర్గతంచేసి ఖండిస్తూ, యుద్ధానికి వ్యతిరేకంగా చురుకైన పోరాటం జరపవలసిన ఆవశ్యకతను పేర్కొంటూ ఆ గ్రూపు ఒక ముసాయిదా తీర్మానాన్నీ, ప్రణాళికనీ ప్రతిపాదించింది. ఆ ముసాయిదాలను మధ్యస్థ మెజారిటీ తిరస్కరించింది. కానైతే, త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు, తమ ముసాయిదా తీర్మానంలోని కొన్ని ముఖ్యమైన అంశాలను ప్రణాళికలో చేర్చించడంలో విజయం సాధించింది. త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు ఆ ప్రణాళికకు అనుకూలంగా వోటుచేసింది, కాని దానిలోని అసంగతత్వాన్ని గురించీ, దానికి అనుకూలంగా తాము వోటుచెయ్యడానికి గల కారణాలను గురించి వివరిస్తూ ఒక ప్రత్యేక ప్రకటన చేసింది.

అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు అంతర్జాతీయవాదులు ఆ గ్రూపు చుట్టూ సమీకృతం కాసాగారు. త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు సభ్యులు భారీ యెత్తున విప్లవాత్మక కార్యకలాపాలు సాగించి, తమతమ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలను నెలకొల్పడంలో ఒక ముఖ్య పాత్ర వహించారు. – 279.

160 1880 నాటి ఫ్రెంచి కార్మిక పార్టీ కార్యక్రమానికి, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ 1875 నాటి గోతా, 1891 నాటి ఏర్‌ఫుర్ట్ కార్యక్రమాలకు ప్రస్తావన యిది. – 282.

161 "శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమం" అనే వ్యాసం జర్మన్ భాషలో రచింపబడింది (లెనిన్ దీనికి "Entwaffnung" – "నిరాయుధీకరణ గురించి" – అని శీర్షిక పెట్టాడు). ఈ వ్యాసం స్విస్, స్వీడిష్, నార్వీజియన్ వామపక్ష సోషల్ డెమోక్రటిక్ పత్రికల్లో ప్రచురణకు ఉద్దేశింపబడింది. కాని యిది అప్పట్లో ఆ భాషల్లో ప్రచురింపబడలేదు. అంతకు కొంచెం తర్వాత, రష్యన్ భాషలో ప్రచురణ నిమిత్తం లెనిన్ దాన్ని తిరిగి కొంచెం సంస్కరించాడు.

జర్మన్ మూలపాఠం సోషలిస్టు యువజన సంఘాల అంతర్జాతీయ లీగు పత్రిక అయిన "Jugend-Internationale"లో 1917 సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో 9, 10 సంచికల్లో "Das Militär-programm der proletarischen Revolution" అన్న శీర్షికతో ప్రచురింపబడింది. – 288.

162 "Jugend-Internationale" ("యువజన ఇంటర్నేషనల్") – త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్షీయులతో సంబంధం కలిగిన సోషలిస్టు యువజన సంఘాల అంతర్జాతీయ లీగు పత్రిక. జూరిచ్‌లో 1915 సెప్టెంబరునుంచి 1918 మేదాకా అది ప్రచురింపబడింది. – 288.

163 ఆర్. గ్రిమ్ రచించిన "యుద్ధ సమస్యపై ప్రధానాంశాలు"కి యిది ప్రస్తావన. స్విట్జర్లండు యుద్ధంలో యిరికించబడే ప్రమాదం పెరగడంతో, యుద్ధంపట్ల వైఖరి గురించి స్విస్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో చర్చ చెలరేగింది. 1916 ఏప్రిల్‌లో ప్రముఖ సభ్యులైన ఆర్. గ్రిమ్, జి. మూలెర్, షి. నేన్, పి. ఫ్లూగర్ ప్రభృతులను ఆ సమస్యమీద తమతమ అభిప్రాయాలను పత్రికల్లో వెల్లడించవలసిందిగా పార్టీ ఆదేశించింది. వారిలో ప్రతి ఒక్కరూ వ్యాసాలనో లేక ప్రధానాంశాలనో రాశారు. అవి "Berner Tagwacht," "Volksrecht," "Grütlianer" పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

లెనిన్ ఆ చర్చలను జాగ్రత్తగా అనుసరించి, ఆ సమాచారాన్ని అధ్యయనంచేసి, ప్రధానాంశాలపైన తన వ్యాఖ్యలు రాశాడు. – 288.

164 "Neues Leben" ("నూతన జీవితం") – స్విస్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ మాసపత్రిక. ఇది బెర్న్‌లో 1915 జనవరినుంచి 1917 డిసెంబరుదాకా ప్రచురింపబడింది. త్సిమ్మెర్‌వాల్డ్ దక్షిణపక్షీయుల అభిప్రాయాలను వెల్లడించిన యీ పత్రిక 1917 మొదట్లో సోషల్ జాతీయ దురహంకార వైఖరి తీసుకుంది. – 288.

165 "ఇంటర్నేషనల్" గ్రూపు – జర్మన్ వామపక్ష సోషల్ డెమోక్రట్ల విప్లవ సంఘం,

దాన్ని ప్రథమ ప్రపంచ యుద్ధారంభంలో కె. లీబ్‌క్నెఖ్ట్, ఆర్. లుక్సెంబుర్గ్, ఎఫ్. మేరింగ్, కె. జెట్కిన్, జె. మర్‌ఫ్లెవ్‌స్కీ, ఎల్. యోగిహెస్ (తీష్క), డబ్లియు. పిక్‌లు స్థాపించారు. 1915 ఏప్రిల్‌లో ఆర్. లుక్సెంబుర్గ్, ఎఫ్. మేరింగ్‌లు వాళ్ల పత్రిక "Die Internationale"ని స్థాపించారు. జర్మన్ వామపక్ష సోషల్ డెమోక్రట్ల ప్రధాన గ్రూపు ఆ పత్రిక చుట్టూ సమీకృతమైంది. 1916 జనవరి 1వ తేదీన, వామపక్ష సోషల్ డెమోక్రట్ల అఖిల జర్మన్ కాన్ఫరెన్సు బెర్లిన్‌లో జరిగింది. దానిలో యీ గ్రూపు సంఘటిత రూపంలో ఏర్పడి, ''ఇంటర్నేషనల్'' గ్రూపు అన్న పేరు పెట్టుకోవాలని తీర్మానించుకుంది. 1915లో ప్రచురించిన రాజకీయ కరపత్రాలే కాకుండా, 1916నుంచి ఇంటర్నేషనల్ గ్రూపు ''స్పార్టకస్'' సంతకంతో ''రాజకీయ లేఖలు'' రహస్యంగా ప్రచురించి, పంపిణీ చెయ్యడం మొదలు పెట్టింది (1918 అక్టోబరుదాకా అవి క్రమబద్ధంగా వెలువడ్డాయి). ఈ సందర్భంగా ఆ ''ఇంటర్నేషనల్'' గ్రూపు ''స్పార్టకస్'' గ్రూపు అన్న పేరూ, దరిమిలా ''స్పార్టకస్ యూనియన్'' అన్న పేరూ కూడా పొందింది. – 289.

166 లెనిన్ త్సిమ్మెర్‌వాల్డ్, కీంతాల్‌లలో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సులను ప్రస్తావిస్తున్నాడు.

త్సిమ్మెర్‌వాల్డ్ లేక మొదటి అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సు 1915 సెప్టెంబరు 5–8 తేదీల్లో జరిగింది. రెండవ లేక కీంతాల్ అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సు కీంతాల్ (స్విట్జర్లండ్)లో 1916 ఏప్రిల్ 24–30 తేదీల్లో జరిగింది.

పశ్చిమ యూరపియన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని వామపక్ష శక్తుల్ని మార్క్సిజం-లెనినిజం సూత్రాలపైన ఐక్యంచేసేందుకు త్సిమ్మెర్‌వాల్డ్, కీంతాల్ కాన్ఫరెన్సులు తోడ్పడ్డాయి. దరిమిలా యీ వామపక్ష శక్తులు తమతమ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలను స్థాపించడంలోనూ, మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ని నెలకొల్పడంలోనూ చురుకైన పాత్ర వహించాయి. – 295.

167 ''సోషల్ డెమోక్రటిక్ లేబర్ గ్రూపు'' ("Arbeitsgemeinschaft") – సోషల్ డెమోక్రటిక్ రైహ్‌స్టాగ్ గ్రూపుతో తెగతెంపులు చేసుకున్న రైహ్‌స్టాగ్ సభ్యులు 1916 మార్చిలో స్థాపించిన జర్మన్ సెంట్రిస్టుల సంఘం. బెర్లిన్ సంఘంలోని అత్యధిక సంఖ్యాకుల తోడ్పాటు కలిగిన ఆ సంఘం 1917 ఏప్రిల్‌లో స్థాపించబడిన జర్మన్ స్వతంత్ర సోషల్ డెమోక్రటిక్ పార్టీకి వెన్నెముక ప్రాయమైంది. ఆ కొత్త

పార్టీ బాహాటమైన సోషల్ జాతీయ దురహంకారవాదులను వెనకేసుకొనివచ్చి, వాళ్లతో ఐక్యతను పదిలపరచుకోవాలని వాదించింది. – 295.

168 ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (Independent Labour Party) – సమ్మె ఉద్యమం పునరుజ్జీవం పొంది, బూర్జువా పార్టీనుండి స్వాతంత్ర్యంకొరకు కార్మిక వర్గంలో ఉద్యమం పెరుగుతున్న కాలంలో, 1893లో స్థాపించబడిన సంస్కరణ వాద సంఘం. ఆ పార్టీలో "కొత్త ట్రేడ్‌యూనియన్," కొన్ని పాత ట్రేడ్‌యూనియన్ల సభ్యులూ, మేధావివర్గ ప్రతినిధులూ, పెటీబూర్జువావర్గ ప్రతినిధులూ చేరారు. ఆ పార్టీకి కేర్-హార్డీ నాయకత్వం వహించాడు.

ఇండిపెండెంట్ లేబరు పార్టీ మొట్టమొదటినుంచీ బూర్జువా సంస్కరణవాద వైఖరి స్వీకరించి, పార్లమెంటరీ పోరాటంమీదా, లిబరల్ పార్టీతో పార్లమెంటరీ రాజీలు చేసుకోవడంమీదా దృష్టిని కేంద్రీకరించింది. – 295.

169 యుద్ధ నిర్వహణలో జారిస్టు ప్రభుత్వానికి తోడ్పడేందుకుగాను సామ్రాజ్యవాద బూర్జువావర్గం రష్యాలో 1915 మేలో యుద్ధపరిశ్రమల కమిటీలను నెలకొల్పింది. కార్మికులను తమ పలుకుబడికిందకి తెచ్చుకొని, వారిలో జాతీయ దురహంకార భావాలను పెంపొందించేందుకుగాను, యీ కమిటీల్లో "కార్మిక గ్రూపులను" ఏర్పాటుచేసి, తద్వారా, రష్యాలో బూర్జువావర్గానికీ శ్రామికవర్గానికీ మధ్య "వర్గ శాంతి" సాధింపబడిందన్న భ్రాంతి కలిగించేందుకు బూర్జువావర్గం తీర్మానించుకుంది. బోల్షెవిక్కులు ఆ కమిటీలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, కార్మికుల్లో అధిక సంఖ్యాకుల తోడ్పాటుతో దాన్ని విజయవంతంగా అమలుజరిపారు.

బోల్షెవిక్ ప్రచార ఫలితంగా, "కార్మిక గ్రూపుల"కు ఎన్నికలు మొత్తం 239 ప్రాంతీయ, స్థానిక కమిటీల్లోనూ కేవలం 70 కమిటీలకు మాత్రమే జరిగాయి, వాటిలో సైతం 36 కమిటీల్లో మాత్రమే కార్మిక ప్రతినిధులు ఎన్నుకోబడ్డారు. – 296.

170 బాసెల్ ప్రణాళిక – యుద్ధ సమస్యమీద ఒక ప్రణాళిక. 1912 నవంబరు 24–25 తేదీల్లో బాసెల్‌లో జరిగిన అసాధారణ అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలో యిది ఆమోదింపబడింది (115వ వివరణ చూడండి). – 296.

171 "La Sentinelle" ("కాపలావాడు") – ఒక వార్తాపత్రిక. నెవ్షతేల్ కాంటన్ (జిల్లా) (స్విట్జర్లండ్) సోషల్ డెమోక్రటిక్ సంఘ పత్రిక. 1890నుంచి (1906–10 విరామంతో) ప్రచురింపబడింది. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో అది అంతర్జాతీయతావాద వైఖరిని అనుసరించింది. – 299.

172 "Volksrecht" ("ప్రజా హక్కు") — స్విట్జర్లండ్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ దినపత్రిక; 1898నుంచి జూరిహ్‌నుంచి ప్రచురింపబడుతోంది. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో (1914–18) ఈ పత్రిక వామపక్ష త్సిమ్మెర్‌వాల్డ్ వాళ్ల వ్యాసాలను ప్రచురించింది. ప్రస్తుతం, ప్రధానమైన దేశాంగ, విదేశాంగ సమస్యలపై బూర్జువా పత్రికల వైఖరి అనుసరిస్తోంది. – 299.

173 "Berner Tagwacht" ("బెర్న్ కాపలావాడు") – బెర్న్‌లో 1893లో నెలకొల్పబడిన ఒక సోషల్ డెమొక్రటిక్ వార్తాపత్రిక. ప్రథమ ప్రపంచ యుద్ధపు తొలి రోజుల్లో కార్ల్ లీబ్‌క్నెఖ్ట్, ఫ్రాంత్స్ మేరింగ్‌ల, తదితర సోషల్ డెమొక్రట్ల వ్యాసాలను ఆ పత్రిక ప్రచురించింది. 1917లో అది సోషల్ జాతీయ దురహంకారవాదులను బాహాటంగా బలపరచింది. – 299.

174 1915 నవంబరు 20–21 తేదీల్లో జరిగిన స్విస్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆరవు మహాసభని లెనిన్ ప్రస్తావిస్తున్నాడు.

త్సిమ్మెర్‌వాల్డ్ ఇంటర్నేషనల్ గ్రూపుపట్ల స్విస్ సోషల్ డెమొక్రట్ల వైఖరే ఆ మహాసభ చర్చనీయాంశాల్లో కేంద్ర సమస్య. తీవ్ర ఘర్షణ పర్యవసానంగా త్సిమ్మెర్‌వాల్డ్ దక్షిణపక్ష గ్రూపు రాజకీయ పంథాని ఆమోదిస్తూ, ఆ మహాసభ ఒక తీర్మానం చేసింది. ఆ తీర్మానానికి వామపక్ష స్విస్ సోషల్ డెమొక్రట్లు ప్రతిపాదించిన ఒక సవరణను కూడా మెజారిటీ వోట్లతో ఆ మహాసభ ఆమోదించింది. ఆ సవరణ యుద్ధానికి వ్యతిరేకంగా సామూహిక విప్లవ పోరాటాన్ని పెంపొందించవలసిన అవసరాన్ని గుర్తించాలని విజ్ఞప్తిచేసి, జయప్రదమైన శ్రామికవర్గ విప్లవం మాత్రమే సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించగలదని పేర్కొంది. – 299.

# పేర్ల సూచి


అక్సెల్‌రోడ్, పి. బి. (Axelrod) (1850–1928) – రష్యన్ విప్లవోద్యమంలో పాల్గొన్నాడు. 1903నుండి – మెన్షివిక్కుల నాయకుల్లో ఒకడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం విదేశాల్లో వున్నాడు. – 257.

అగాడ్, ఇ. (Agahd) – జర్మన్ పెటీబూర్జువా అర్థశాస్త్రవేత్త. 15 సంవత్సరాలపాటు రష్యన్-చైనీజ్ బాంకులో ఉద్యోగం చేశాడు. – 197, 199, 206, 260.

అగ్వినాల్డో (Aguinaldo), ఎమీలియో (1869–1964) – ఫిలిప్పైన్స్ రాజనీతిజ్ఞుడు. 1896లో స్పానిష్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఫిలిప్పైన్స్ ప్రజలు చేసిన తిరుగుబాటులో పాల్గొన్నాడు. దానిలో భూస్వామ్య, బూర్జువావర్గపు ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించాడు. తిరుగుబాటు నాయకుడైన ఎ. బొనిఫాత్సియొ హత్యకి ఏర్పాట్లుచేసి, దరిమిలా 1897లో తనే ఆ ఉద్యమ నాయకుడయ్యాడు. 1899లో ఫిలిప్పైన్స్ రిపబ్లిక్కు స్థాపనానంతరం దాని అధ్యక్షుడు అయ్యాడు. ఫిలిప్పైన్స్‌లో స్పెయిన్ స్థానాన్ని అమెరికా ఆక్రమించిన తరువాత, అమెరికన్లకి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి అగ్వినాల్డో నాయకత్వం వహించాడు. 1901 మార్చిలో అమెరికన్లు అతన్ని ఖైదు చేశారు. తదుపరి అగ్వినాల్డో ఫిలిప్పైన్స్‌లో అమెరికన్లకు అనుకూలమైన విధానాన్ని అమలుజరిపాడు. – 260.

అరక్చేయెవ్, ఎ. ఎ. (Arakcheyev) (1769–1834) – రష్యన్ రాజనీతిజ్ఞుడు. 1815–25 సంవత్సరాల్లో ఆచరణలో ప్రభుత్వానికి ఆధిపత్యం వహించాడు. అత్యంత అభివృద్ధినిరోధక విధానాన్ని అనుసరించి, పోలీసు నిరంకుశత్వాన్ని అమలుజరిపాడు. – 31.

అరిస్టోఫనిస్ (Aristophanes) (క్రీ. పూ. సుమారు 445 – సుమారు 385) – ప్రాచీన గ్రీకు కవి, సుఖాంత నాటకాల రచయిత. – 212.

అలెక్సాండ్ర్, రెండవ (Alexander II) (రొమానొవ్) (1818–1881) – రష్యన్ చక్రవర్తి (1855–81). – 34, 35, 36.

ఆంతోని (వొలీన్స్కీకు చెందినవాడు) (హ్రపొవీత్స్కీ, ఎ. పి.) (Anthony—Hrapovitsky) (1863–1936) – ఉన్నత మతాధికారి, రష్యన్ ఆర్థడాక్స్ చర్చిలోని అతివాద దక్షిణపక్ష ధోరణికి నాయకుడు, అభివృద్ధినిరోధక జారిస్టు విధాన ప్రతిపాదకుడు. – 37.

ఆన్ – జోర్డానియా, ఎన్. ఎన్. చూడండి.

ఆర్న్డ్ట్ (Arndt), పౌల్ – జర్మన్ పత్రికారచయిత, 1890 దశకంలో "Vorwärts" ("ముందుకు") పత్రికకి పారిస్ విలేఖరి. – 210.

ఆర్మ్‌స్ట్రాంగ్ (Armstrong) – విలియమ్ జార్జ్ ఆర్మ్‌స్ట్రాంగ్ (1810–1900) స్థాపించిన ఆంగ్ల సైనిక, పారిశ్రామిక సంస్థ "ఆర్మ్‌స్ట్రాంగ్, ఉయిట్‌వెర్స్ అండ్ కంపెనీ"కి ప్రతినిధి. ఈ సంస్థ 1937దాకా పనిచేసింది. – 213.

ఎంగెల్స్ (Engels), ఫ్రెడరిక్ (1820–1895) – శాస్త్రీయ కమ్యూనిజం సంస్థాపకుల్లో ఒకడు; అంతర్జాతీయ శ్రామికవర్గపు నాయకుడు. మార్క్స్ మిత్రుడు, సహచరుడు; మార్క్స్‌తో కలిసి గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని రూపొందించాడు. – 10–12, 19, 71, 107–111, 114, 115, 141, 256, 263, 290.

ఎడ్వర్డ్, ఏడవ (Edward VII) (1841–1910) – ఇంగ్లండు రాజు (1901–10). – 205.

ఎయ్‌డెల్స్ (Jeidels), ఒట్టో – జర్మన్ అర్థశాస్త్రవేత్త. – 173, 174, 187, 189, 191, 192, 215, 218.

ఎష్‌వేగె (Eschwege), లుడ్విగ్ – జర్మన్ పెటీబూర్జువా అర్థశాస్త్రవేత్త, "Die Bank" అనే జర్మన్ అర్థశాస్త్ర పత్రికకు ఫైనాన్సు పెట్టుబడి గురించి వ్యాసాలు రాశాడు. – 172, 196, 203–205, 260.

ఓవెన్స్ (Owens), మైకెల్ జోసెఫ్ (1859–1923) – అమెరికన్. సీసాలు తయారుచేసే యంత్రం కల్పించాడు. దరిమిలా ఈ రంగంలో పారిశ్రామికుడు. – 248.

కవేలిన్, కె. డి. (Kavelin) (1818–1885) – రష్యన్ చరిత్రకారుడు, ఉదారవాద పౌర ప్రముఖుడు, పత్రికారచయిత. రష్యాలో భూదాస్యపు రద్దుకి సంబంధించిన మొదటి బిల్లుల్లో ఒకదాని కర్త. – 35.

కార్నెజి (Carnegie), ఆండ్రూ (1835–1919) – అమెరికన్ కోటీశ్వరుడు. 1889లో స్టీల్ కార్పొరేషన్ స్థాపించాడు. 1901లో తన కర్మాగారాలను పి. మోర్గన్ స్టీల్ ట్రస్టులో కలిపాడు. – 254.

కాల్వర్ (Calwer), రిఖార్డ్ (1868–1927) – ప్రముఖ జర్మన్ అర్థశాస్త్రవేత్త; జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో సంస్కరణవాదానికీ, రివిజనిజానికీ ప్రతినిధి. – 243.

కూట్లెర్, ఎన్. ఎన్. (Kutler) (1859–1924) – రష్యన్ రాజనీతిజ్ఞుడు, కాడెట్ పార్టీ నాయకుల్లో ఒకడు; న్యాయవాది. – 140.

కెస్ట్నెర్ (Kestner), ఫ్రిట్జ్ – జర్మన్ అర్థశాస్త్రవేత్త. – 166, 170, 171.

కొకోష్కిన్, ఎఫ్. ఎఫ్. (Kokoshkin) (1871–1918) – రష్యన్ న్యాయవాది, పత్రికారచయిత, కాడెట్ పార్టీ నాయకుడు. మొదటి స్టేట్ దూమ డెప్యూటీ. – 90–94, 100, 106, 125–128.

కొలుబాకిన్, ఎ. ఎమ్. (Kolyubakin) (1868–1915) – రష్యన్ సాంఘిక కార్యకర్త, బూర్జువా ఉదారవాది, కాడెట్. – 90.

కొల్చాక్, ఎ. వి. (Kolchak) (1873–1920) – జారిస్టు నౌకా దళపు అడ్మిరల్, రాజరికవాది. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం విప్లవప్రతిఘాత ఉద్యమపు అగ్రనైజర్లలో ఒకడు. – 156.

కొసోవ్స్కీ, వి. (లెవిన్‌సోన్, ఎమ్. వై.) (Kosovsky) (1870–1941) – బుండ్ నాయకుల్లో ఒకడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ (1903) తర్వాత మెన్షెవిక్. – 129, 130.

కొస్త్రోవ్ – జోర్డానియా, ఎన్. ఎన్. చూడండి.

కౌట్స్కీ (Kautsky), కార్ల్ (1854–1938) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, రెండవ ఇంటర్నేషనల్ నాయకుల్లో, సైద్ధాంతికుల్లో ఒకడు. మొదట్లో మార్క్సిస్టు; మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రివిజనిజంతో రాజీపడే వైఖరి వహించాడు. వాస్త

వంలో కార్మికవర్గ విప్లవ అనివార్యతను నిరాకరించి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని వ్యతిరేకించాడు. కార్మికోద్యమంలో అత్యంత ప్రమాదకరమైన అవకాశవాద ధోరణికి – సెంట్రిజానికి (కాట్స్కీయిజానికి) – సిద్ధాంతవేత్త అయాడు. జర్మన్ సోషల్ డెమోక్రట్ల సైద్ధాంతిక పత్రిక "Die Neue Zeit" ("నూతన కాలం") సంపాదకుడు. – 19, 55, 56, 65–68, 71, 81, 84, 104, 149, 151, 155, 156, 158, 171, 222, 223, 231, 238–42, 245, 256, 259, 260–64, 266–272, 275, 283, 290, 291, 295, 296.

కాఫ్మన్ (Kaufmann), యెవ్గేనీ. – 179, 189.

క్యూనొవ్ (Cunow), హైన్‌రిఖ్ (1862–1936) – జర్మన్ దక్షిణపక్ష సోషల్ డెమోక్రట్, చరిత్రకారుడు, సాంఘికశాస్త్రజ్ఞుడు, నరజాతిశాస్త్రవేత్త. మొదట్లో మార్క్సిస్టులకు సన్నిహితంగా ఉన్నాడు, తర్వాత రివిజనిస్టు అయి, మార్క్సిజాన్ని వక్రీకరించాడు. – 241.

క్రామ్‌వెల్ (Cromwell), ఆలివెర్ (1599–1658) – 17 శతాబ్ది నాటి ఇంగ్లీషు బూర్జువా విప్లవపు ప్రముఖ కార్యకర్త. – 110.

క్రామండ్ (Crammond), ఎడ్గార్ – 247.

క్రుప్ (Krupp) – జర్మన్ సామ్రాజ్యవాదపు ప్రధాన ఆయుధాగారాల్లో ఒకటైన జర్మన్ సైనిక లోహ పరిశ్రమ యజమానుల కుటుంబం. – 187, 213, 216.

క్రెస్తొవ్‌నికొవ్, జి. ఎ. (Krestovnikov) (జననం 1855) – రష్యన్ బడా పారిశ్రామికుడు, స్టాక్ ఎక్స్‌చేంజి వ్యాపారి; అక్టోబరిస్టు. – 140.

క్రొపోత్కిన్, పి. ఎ. (Kropotkin) (1842–1921) – రష్యన్ భూగోళశాస్త్రజ్ఞుడు, యాత్రికుడు; ప్రిన్సు. అరాజకవాదపు ప్రముఖ సిద్ధాంతవేత్తలలో ఒకడు. 1876–1917లలో విదేశాలలో ఉన్నాడు. – 139.

క్రోమర్ (Cromer), ఎవెలింగ్ (1841–1917) – ఇంగ్లీషు అభివృద్ధినిరోధక రాజనీతిజ్ఞుడు, దౌత్యవేత్త, లార్డ్. 1907లో రాజీనామాచేసి సాహిత్య కార్యకలాపాలకి పూనుకున్నాడు. – 230.

గంకేవిచ్, ఎన్. (Hankiewicz) (జననం 1869) – ఉక్రేనియన్ పెటీబూర్జువా సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపకుల్లో ఒకడు. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవం

తర్వాత సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కీ పోలండ్‌కీ మధ్య పొత్తును సమర్థించాడు. — 77.

గరిబాల్డి (Garibaldi), జూసెప్పె (1807–1882) — ఇటాలియన్ విప్లవ ప్రజాస్వామ్యోద్యమ నాయకుల్లో ఒకడు, ప్రసిద్ధ సేనానాయకుడు. ఇటలీ సమైక్యంకోసం, విదేశ బానిసత్వానికి వ్యతిరేకంగా ఇటాలియన్ ప్రజలు సాగించిన పోరాటానికి నాయకత్వం వహించాడు. — 108.

గానెత్స్కి, జె. ఎస్. (Hanecki) (1879–1937) — రష్యన్, అంతర్జాతీయ విప్లవ ఉద్యమంలో కార్యకర్త, బోల్షెవిక్; 1903–09లో పోలిష్ సోషల్ డెమొక్రట్ల నాయకుల్లో ఒకడు. — 116, 117.

గాలిఫే (Galliffet), గాస్టన్ (1830–1909) — ఫ్రెంచి జనరల్. 1871 నాటి పారిస్ కమ్యూన్‌ని అణచివేసినప్పుడు అతి క్రూర చర్యలను అనుసరించాడు. — 291.

గిఫ్ఫెన్ (Giffen), రాబర్ట్ (1837–1910) — ఇంగ్లీషు బూర్జువా అర్థశాస్త్రవేత్త, గణాంకశాస్త్రవేత్త, ఇంగ్లీషు పెట్టుబడిదారీ సమర్థకుడు. అర్థశాస్త్రం, గణాంక శాస్త్రంమీద చాలా రచనలు చేశాడు. — 249.

గుచ్‌కోవ్, ఎ. ఐ. (Guchkov) (1862–1936) — బడా పెట్టుబడిదారీ, అక్టోబరిస్టు పార్టీ సంస్థాపకుడూ, నాయకుడూ. కార్మికవర్గానికీ, రైతాంగానికీ వ్యతిరేకంగా ప్రభుత్వం అనుసరించిన నిర్దాక్షిణ్యమైన దమనకాండతో కూడిన విధానాన్ని బలపరచాడు. — 25, 140.

గురేవిచ్, ఇ. ఎల్. (Gurevich) (స్మిర్నోవ్, ఇ.) (జననం 1865) — రష్యన్ సోషల్ డెమొక్రట్, మెన్షెవిక్; మెన్షెవిక్ రద్దువాదుల పత్రిక "నాష జర్యా" ("మన ఉషారాగం") స్థాపకుల్లో, దానిలో పనిచేసినవారిలో ఒకడు. — 137, 139.

గూర్విచ్, ఐ. ఎ. (Hourwich) (1860–1924) — రష్యన్ అర్థశాస్త్రవేత్త. 1889లో అమెరికాకు ప్రవాసం వెళ్లిపోయాడు, అమెరికన్ ట్రేడ్‌యూనియన్, సోషల్ డెమొక్రటిక్ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. "రష్యన్ గ్రామసీమ ఆర్థిక పరిస్థితి," "విదేశీయ ఆగమనం" అనే అతని రచనలపట్ల లెనిన్ సదభిప్రాయం వెల్లడించాడు. 1900 శతాబ్ది మొదటి దశకంనుండి రివిజనిస్టు. — 255.

గేర్‌త్సెన్, ఎ. ఐ. (Herzen) (1812–1870) — ప్రసిద్ధ రష్యన్ ప్రజాస్వామ్యవాది; భౌతికవాద తత్వవేత్త, రచయిత, ప్రతికారచయిత. — 31–38.

గోంపెర్స్ (Gompers), సామ్యుయెల్ (1850–1924) – అమెరికన్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమ కార్యకర్త. అమెరికన్ శ్రామిక సమాఖ్య సంస్థాపకుల్లో ఒకడు; 1895నుంచి ఎడతెగకుండా దాని కార్యదర్శిగా పనిచేశాడు. పెట్టుబడిదారులతో వర్గ సహకార విధానాన్ని అనుసరించి, కార్మికవర్గ విప్లవోద్యమాన్ని వ్యతిరేకించాడు. – 155.

గోర్టర్ (Gorter), హెర్మన్ (1864–1927) – హాలండు సోషల్ డెమోక్రట్; కవి, పత్రికారచయిత. – 287.

గోల్డ్‌బ్లాత్ – మెడేమ్, వి. డి. చూడండి.

గ్రిమ్ (Grimm), రోబెర్ట్ (1881–1956) – స్విట్జర్లండ్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, రెండవ ఇంటర్నేషనల్ నాయకుల్లో ఒకడు. త్సిమ్మెర్‌వాల్డ్, కీంతాల్ మహా సభల అధ్యక్షుడు. – 288.

గ్లాడ్‌స్టన్ (Gladstone), విలియం ఎవర్ట్ (1809–1898) – గ్రేట్ బ్రిటన్ ప్రధాన మంత్రి (1868–74, 1880–86, 1892–94); 1868నుంచి లిబరల్ పార్టీ నాయకుడు. గ్లాడ్‌స్టన్ ప్రభుత్వం ఐర్లండులో జాతీయ విమోచనో ద్యమాన్ని అణచివేసింది; 1882లో ఈజిప్టును ఆక్రమించింది. – 111.

గ్విన్నర్ (Gwinner), ఆర్థర్ (1856–1931) – జర్మన్ బడా ఫైనాన్షియర్, 1894–1919లో "జర్మన్ బాంకు" డైరెక్టరు. – 219.

చిర్ష్కి (Tschierschky), జీగ్‌ఫ్రిడ్ (జననం 1872) – జర్మన్ అర్థశాస్త్రవేత్త. కార్టెళ్ళూ, ట్రస్టులలో ఉద్యోగి. – 167, 182.

చెర్నిషేవ్‌స్కి, ఎన్. జి. (Chernyschevsky) (1828–1889) – రష్యన్ విప్లవ ప్రజాస్వామ్యవాది, ఊహాజనిత సోషలిస్టు, రచయిత, సాహిత్య విమర్శకుడు. రష్యాలో 1860 దశకంలో విప్లవ ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు. 1862 నిర్బంధింపబడి సైబీరియాలో ఏడేళ్ల కఠిన శ్రమ శిక్ష విధింపబడ్డాడు. అక్కడినుంచి అతను 1883లోగాని తిరిగి రాలేదు. – 35, 37, 105, 140.

చేంబర్లేన్ (Chamberlain), జోసెఫ్ (1836–1914) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు, వలసలకు విదేశాంగ శాఖ కార్యదర్శి (1895–1903). బ్రిటిష్ సామ్రాజ్య వలస విధాన విస్తరణ సైద్ధాంతికుడు. – 226.

ఛెంకేలి, ఎ. ఐ. (Chkhenkeli) (1874–1959) – జార్జియన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్. – 257.

ఛెయీడ్జె, ఎన్. ఎస్. (Chkheidze) (1864–1926) – మెన్షెవిక్కుల నాయకులలో ఒకడు. మూడవ, నాల్గవ స్టేట్ దూమల్లో సభ్యుడు. నాల్గవ దూమలో మెన్షెవిక్ పక్షానికి నాయకుడు. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవానంతరం జార్జియాలో మెన్షెవిక్ ప్రభుత్వానికి నాయకత్వం వహించాడు. 1921లో జార్జియాలో సోవియట్ అధికారం స్థాపించబడిన తరువాత విదేశాలకు వెళ్లిపోయాడు. – 257, 295, 353.

జినోవ్యెవ్, జి. ఇ. (రదొమీస్ల్‌స్కీ) (Zinoviev–Rodomyslsky) (1883–1936) – రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1901నుండి ఆర్.ఎస్.డి.ఎల్.పి. సభ్యుడు. "సోత్సియాల్ డెమోక్రట్," "ప్రొలెతారీ" అనే బోల్షెవిక్ పత్రికల సంపాదకవర్గాల సభ్యుడు. పార్టీ లెనినిస్టు విధానానికి వ్యతిరేకంగా పదేపదే ముందుకు వచ్చాడు. 1934లో ముఠా కార్యకలాపాలకుగాను పార్టీనుండి బహిష్కరింపబడ్డాడు. – 285.

జూనియస్ – లుక్సెంబుర్గ్, రోజా చూడండి.

జార్డానియా, ఎన్. ఎన్. (ఆన్, కొస్త్రోవ్) (Jordania—Kostrov) (1870–1953) – సోషల్ డెమోక్రట్, కాకసస్ మెన్షెవిక్కుల నాయకుల్లో ఒకడు. – 52, 118.

టాఫెల్ (Tafel), పాల్. – 168.

టోమా (Thomas), అల్‌బేర్ (1878–1923) – ఫ్రెంచి రాజకీయవేత్త, సోషల్ సంస్కరణవాది. 1910నుంచి సోషలిస్టు పార్టీ పార్లమెంటరీ పక్షానికి నాయకుడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సోషల్ జాతీయ దురహంకారి అయ్యాడు. ఫ్రాన్సు బూర్జువా ప్రభుత్వ సభ్యుడు. – 155, 295.

ట్రాట్స్కీ, ఎల్. డి. (బ్రోన్‌స్టైయిన్) (Trotsky—Bronstein) (1879–1940) – రష్యన్ సోషల్ డెమోక్రట్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభానంతరం సోషలిస్టు విప్లవ సిద్ధాంతాచరణలకి సంబంధించిన అన్ని సమస్యలపైనా బోల్షెవిక్కులతో పోరాటం జరిపాడు. 1905–07 నాటి విప్లవ పరాజయానంతరం రద్దువాది. 1917 నాటి ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవానంతరం విదేశాల

నుంచి స్వదేశానికి వచ్చాడు. అతను బోల్షెవిక్ పార్టీలో చేరాడు, కాని బోల్షెవిక్కుల వైఖరి స్వీకరించక, పార్టీ విధానాన్ని వ్యతిరేకించాడు.

అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం వివిధ ముఖ్య పదవులు వహించాడు. అయితే, అప్పుడు కూడా పార్టీ సాధారణ పంథాని వ్యతిరేకించి, సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణం అసాధ్యమని వాదించాడు. తన సోవియట్ వ్యతిరేక కార్యకలాపాలకుగాను 1927లో పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు, 1929లో దేశంనుంచి వెళ్లగొట్టబడ్డాడు. 1932లో అతని సోవియట్ పౌరసత్వాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. – 39–48, 50–62, 121, 122, 127.

త్రీవెస్ (Tréves), క్లాడియో (1868–1933) – ఇటాలియన్ సోషలిస్టు పార్టీ నాయకుల్లో ఒకడు. ఇటాలియన్ సంస్కరణవాద సైద్ధాంతికుడు. – 295.

డిస్రేలీ (Disraeli), బెంజమిన్, కౌంటు (1804–1881) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు. పలుసార్లు ప్రభుత్వ సభ్యుడు, ప్రధాన మంత్రిగా ఉన్నాడు. – 226.

డీయురిచ్ (Diouritch), జార్జ్. – 210, 214, 217, 218.

డెషనేల్ (Deschanel), పాల్ (1855–1922) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, పత్రికా రచయిత. 1899–1919ల్లో ప్రజాసభ డెప్యూటీ, దాని అధ్యక్షుడుగా అనేక సార్లు ఎన్నుకోబడ్డాడు. – 213.

డేవిడ్ (David), ఎడువార్డ్ (1863–1930) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ దక్షిణపక్ష నాయకుల్లో ఒకడు, రివిజనిస్టు. – 227.

డ్రియో (Driault), జి. ఎడువార్డ్ – ఫ్రెంచి చరిత్రకారుడు. – 235.

తుర్గేనెవ్, ఐ. ఎస్. (Turgenev) (1818–1883) – రష్యన్ రచయిత. – 35, 36.

తుల్యకోవ్, ఐ. ఎన్. (Tulyakov) (జననం 1877) – కార్మికుడు, సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్; నాల్గవ స్టేట్ దూమ డెప్యూటీ. – 51.

త్రుబెత్స్కోయ్, ఇ. ఎన్. (Trubetskoi) (1863–1920) – రష్యన్ బూర్జువా ఉదారవాద సైద్ధాంతికుడు, భావవాద తత్వశాస్త్రవేత్త. కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రష్యన్ సామ్రాజ్యవాద సైద్ధాంతికుల్లో ఒకడు. – 74.

దవీదొవ్, ఎల్. ఎఫ్. (Davydov) – సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో పరపతి కార్యాలయం డైరెక్టరు. – 206.

దాన్, ఎఫ్. ఐ. (గూర్విచ్) (Dan—Gurvich) (1871–1947) – రష్యన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్కుల నాయకుల్లో ఒకడు. – 45, 52, 54.

దుబాసొవ్ (Dubasov) – ఏ పార్టీకీ చెందని ఆఫీసరు, యుద్ధంలో పాల్గొన్నాడు. – 15, 17, 18.

దెనీకిన్, ఎ. ఐ. (Denikin) (1872–1947) – జారిస్టు సైన్యంలో జనరల్; విదేశీ సైనిక జోక్య కాలంలోనూ, 1918–20 అంతర్యుద్ధ కాలంలోనూ రష్యా దక్షిణ ప్రాంతంలో వైట్‌గార్డు సైన్యాల సేనాధిపతి. 1920 మార్చిలో అతని సైన్యం సోవియట్ సైన్యంచేత నాశనంచెయ్యబడిన తరువాత విదేశానికి వెళ్లాడు. – 156.

దొన్‌త్సోవ్, డి. (Dontsov) – ఉక్రేనియన్ పెటీబూర్జువా సోషల్ డెమోక్రటిక్ కార్మిక పార్టీ సభ్యుడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో "ఉక్రెయిన్ విముక్తి యూనియన్" అనే జాతీయవాద సంఘపు సంస్థాపకుల్లో ఒకడు. ఈ సంఘం ఆస్ట్రియన్ నిరంకుశత్వ సహాయంతో "స్వతంత్ర ఉక్రెయిన్" నినాదాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నించింది. – 86.

దొబ్రొల్యూబొవ్, ఎన్. ఎ. (Dobrolyubov) (1836–1861) – రష్యన్ విప్లవ ప్రజాస్వామ్యవాది, సాహిత్య విమర్శకుడు, పత్రికారచయిత. – 35.

దొల్గొరూకొవ్, పి. డి. (Dolgorukov) (1866–1930) – రష్యన్ ప్రిన్స్, పెద్ద భూస్వామి; కాడెట్ల పార్టీ నాయకుల్లో ఒకడు. – 140.

ద్రగొమానొవ్, ఎమ్. పి. (Dragomanov) (1841–1895) – ఉక్రేనియన్ పత్రికారచయిత, చరిత్రకారుడు. – 105.

నహిమ్‌సోన్, ఎమ్. ఐ. (Nakhimson) (స్పెక్టేటర్) (1880–1938) – రష్యన్ అర్థశాస్త్రవేత్త, పత్రికారచయిత; బుండ్ సభ్యుడు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురించి కొన్ని రచనలు చేశాడు. – 261, 263, 266.

నీకొలస్, రెండవ (రొమానొవ్) (Nicholas II — Romanov) (1868–1918) – 1894నుంచి 1917లో జరిగిన ఫిబ్రవరి బూర్జువా ప్రజాస్వామిక విప్లవంవరకు రష్యా చివరి చక్రవర్తి. 1905 జనవరి 9న జరిగిన శాంతి ప్రదర్శ

వని క్రూరంగా అణచివేసినందుకుగాను అతనికి "రక్తపంకిల" అని పేరు వచ్చింది. – 134, 139, 141, 142.

నెపోలియన్, మూడవ (లూయీ బోనపార్ట్) (Napoleon III—Louis Bonaparte) (1808–1873) – 1852–70ల్లో ఫ్రాన్సు చక్రవర్తి; మొదటి నెపోలియన్ భ్రాతీయుడు. 1848 విప్లవ పరాజయం తర్వాత ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. 1851 డిసెంబరు 2వ తేదీన సైనిక అధికారుల సహాయంతో రాజకీయ కుట్ర చేశాడు. 1852లో డిసెంబరు 2వ తేదీన చక్రవర్తిగా ప్రకటించ బడ్డాడు. – 32.

నెపోలియన్, మొదటి (బోనపార్ట్) (Napoleon I—Bonaparte) (1769–1821) – 1804–14ల్లోనూ, 1815 మార్చి – జూన్‌ల్లోనూ ఫ్రాన్సు చక్రవర్తి. – 98.

నెక్రాసొవ్, ఎన్. వి. (Nekrasov) (1879–1940) – వామపక్ష కాడెట్ల నాయకుల్లో ఒకడు; మూడవ, నాల్గవ స్టేట్ దూమల డెప్యూటీ. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం ఆర్థిక రంగంలో పనిచేశాడు. – 90.

నెయ్‌మార్క్ (Neymarck), ఆల్‌ఫ్రెడ్ – ఫ్రెంచి బూర్జువా అర్థశాస్త్రవేత్త, గణాంక శాస్త్రవేత్త. – 206, 207, 260.

నోబెల్ (Nobel) – స్వీడిష్ వ్యాపారుల కుటుంబం. – 218.

నోస్కె (Noske), గుస్టావ్ (1868–1946) – జర్మన్ దక్షిణపక్ష సోషల్ డెమోక్రట్. 1919 ఫిబ్రవరి – 1920 మార్చిలో సైనిక మంత్రి; 1919 జనవరిలో బెర్లిన్‌లో జరిగిన కార్మికుల సార్వత్రిక రాజకీయ సమ్మె క్రూర అణచివేతను, కార్ల్ లీబ్‌క్నెఖ్ట్, రోజా లుక్సెంబుర్గ్ హత్యను ఏర్పాటుచేశాడు. – 156.

పాతుయె (Patouillet), జోసెఫ్ – ఫ్రెంచి అర్థికశాస్త్రవేత్త, "అమెరికన్ సామ్రాజ్యవాదం" అనే పుస్తకం కర్త. – 260.

పుయన్‌కరే (Poincaré), రైమండ్ (1860–1934) – ఫ్రెంచి బూర్జువా రాజకీయవేత్త, లాయరు. 1912, 1922–24, 1926–29 ప్రధానమంత్రి, 1913–20 – ఫ్రాన్సు ప్రెసిడెంటు. ఆ పదవుల్లో ఉన్నప్పుడు ప్రపంచ సామ్రాజ్యవాద యుద్ధాన్ని క్రియాశీలంగా సమర్థించాడు. అతను అనుసరించిన విధానం తీవ్రంగా సోవియట్ వ్యతిరేకమైనది, ఫ్రెంచి శ్రామికుల ప్రజాస్వామ్య స్వేచ్ఛ, పౌర హక్కులమీద దాడులతో కూడినది, ఫ్రెంచి కమ్యూనిస్టులను వేటాడటంతో కూడినది. – 134.

పురిష్కేవిచ్, వి. ఎమ్. (Purishkevich) (1870–1920) – రష్యన్ బడా భూస్వామి, రాజరికవాది, అభివృద్ధినిరోధకుడు. విప్లవోద్యమంపై పోరాటం జరిపేందుకుగాను "నల్ల నూర్ల" సంఘాలు స్థాపించాడు. రెండవ, మూడవ, నాల్గవ స్టేట్ దూమల సభ్యుడు. దూమలో యూదు వ్యతిరేక ప్రసంగాలకు పేరుమోశాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం సోవియట్ ప్రభుత్వ వ్యతిరేకి. – 25, 89, 94, 125, 126, 128, 141, 142.

పెత్రోవ్, ఎ. పి. (Petrov) (1824–1861) – కజాన్ గుబేర్నియాలోని బెజ్దా గ్రామ రైతు. 1861 నాటి భూ సంస్కరణకి వ్యతిరేకంగా జరిగిన రైతుల తిరుగుబాటుకి నాయకత్వం వహించాడు. – 36.

పెషెహోనోవ్, ఎ. వి. (Peshekhonov) (1867–1933) – రష్యన్ బూర్జువా పౌర ప్రముఖుడు, పత్రికారచయిత. 1906నుంచి "ప్రజా సోషలిస్టులు" అనే పెటీబూర్జువా పార్టీకి నాయకుడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం సోవియట్ వ్యతిరేక కుట్రల్లో, తిరుగుబాటుల్లో పాల్గొన్నాడు. – 127.

పైష్ (Paish), జార్జ్ (1867–1957) – బ్రిటిష్ బూర్జువా అర్థశాస్త్రవేత్త, గణాంకశాస్త్రవేత్త. ప్రపంచ ఆర్థిక, రాజకీయ విధానానికి సంబంధించిన కొన్ని పుస్తకాలు రాశాడు. – 210, 214.

పొత్రేసొవ్, ఎ. ఎన్. (స్తరొవేర్) (Potresov—Starover) (1869–1934) – రష్యన్ విప్లవోద్యమంలో పాల్గొన్నాడు. 1890 దశకంలో మార్క్సిస్టులకు అనుబంధితుడై ఉన్నాడు. "ఇస్క్రా" స్థాపనలో పాల్గొన్నాడు. 1903నుంచి మెన్షెవిక్కుల నాయకుల్లో ఒకడు, సిద్ధాంత నాయకుడు. "వొజ్రొజ్దేనియె," "నాష జర్యా" తదితర మెన్షెవిక్ రద్దువాదుల పత్రికల్లో నాయక పాత్ర వహించాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సోషల్ జాతీయ దురహంకారవాది. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం విదేశాలకు వెళ్లిపోయి, సోవియట్ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగించాడు. – 227, 257.

ప్రూడన్ (Proudhon), ప్యేర్ జోసెఫ్ (1809–1865) – ఫ్రెంచి రచయిత, అర్థశాస్త్రవేత్త, సాంఘిక శాస్త్రవేత్త. పెటీబూర్జువావర్గపు సైద్ధాంతికుడు, అరాజకవాద స్థాపకుల్లో ఒకడు. సన్నకారు ప్రైవేటు ఆస్తిని పదిలపరచాలని ఆశించి, బడా పెట్టుబడిదారీ ఆస్తిని పెటీబూర్జువా దృష్ట్యా విమర్శించాడు. రాజ్యమే వర

వైరుధ్యాలకి ముఖ్య కారణమని భావించాడు. "రాజ్యాన్ని" శాంతియుతంగా "రద్దు చేయాలనే" ఊహాజనిత పథకాలు ప్రతిపాదించాడు. – 108, 109, 146.

ప్రెస్‌మెన్ (Pressmane), అడ్రియేన్ (1879–1929) – ఫ్రెంచి సోషలిస్టు. 1912లో అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరోకి ఫ్రెంచి సోషలిస్టు పార్టీ శాశ్వత ప్రతినిధి. – 295.

ప్లెహానొవ్, జి. వి. (Plekhanov) (1856–1918) – రష్యన్, అంతర్జాతీయ కార్మికోద్యమాల ప్రముఖ నాయకుడు. రష్యాలో మార్క్సిజం తొలి ప్రచారకుడు. తొట్టతొలి రష్యన్ మార్క్సిస్టు సంఘమైన "శ్రమ విమోచన" గ్రూపు స్థాపకుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్కుల్లో చేరాడు. ఎత్తుగడలకు సంబంధించిన మౌలిక సమస్యలలో ప్లెహానొవ్ బోల్షెవిక్కులతో విభేదించాడు. తత్వశాస్త్ర విషయాల్లో గతితార్కిక భౌతికవాదంనుంచి కొన్ని సందర్భాల్లో పక్కకి మళ్లాడు.
అక్టోబరు సోషలిస్టు మహా విప్లవంపట్ల శత్రు వైఖరి వహించాడు, అయితే విప్లవ ప్రతీఘాతాన్ని సమర్థించలేదు. ప్లెహానొవ్ విప్లవ కార్యకలాపాలను, 19వ శతాబ్ది అంతంలోనూ, 20వ శతాబ్ది ప్రారంభంలోనూ అతను రాసిన రచనలను లెనిన్ ప్రశంసించాడు. – 16, 51, 87, 116, 117, 119, 123, 137, 139, 143, 295.

ఫొయెర్‌బాఖ్ (Feuerbach), లుడ్విగ్ (1804–1872) – గొప్ప జర్మన్ భౌతికవాద తత్వవేత్త. మార్క్సిజానికి ప్రాతిపదిక తయారుచేసినవారిలో ఒకడు. – 32.

ఫొగెల్‌ష్టైన్ (Vogelstein), థియొదోర్ – జర్మన్ అర్థశాస్త్రవేత్త; బడా పెట్టుబడిదారీ సంస్థల ఆర్థిక విషయాల గురించి కొన్ని వ్యాసాలు రాశాడు. – 221, 222.

ఫొల్కెర్ (Völker) – జర్మన్ ప్రభుత్వ అధికారి, జర్మన్ ఉక్కు పరిశ్రమ సమ్మేళనకి మేనేజరు. – 205.

బకూనిన్, ఎమ్. ఎ. (Bakunin) (1814–1876) – రష్యన్ విప్లవకారుడు; నరోదిజం, అరాజకవాదాల సిద్ధాంతవేత్తల్లో ఒకడు. 1848–49 నాటి జర్మన్ విప్లవంలో పాల్గొన్నాడు. మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు; అందులో మార్క్సిజాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. మార్క్స్, ఎంగెల్సులు బకూనిన్‌కి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం సాగించారు, బకూనినిజాన్ని పెటీబూర్జువా ఒంటెత్తువాదంగా బహిర్గతంచేసి

ఖండించారు. తన చీలిక కార్యకలాపాలకుగాను 1872లో బకూనిన్ ఇంటర్నేషనల్ నుండి బహిష్కరింపబడ్డాడు. –33.

బిరోన్, ఎ. ఐ. (Biron) (1690–1772) – కౌంట్, రష్యన్ రాజకీయవేత్త. అభివృద్ధి నిరోధక పాలనను నెలకొల్పాడు. విదేశీయులకు ఉన్నత పదవులు కట్టబెట్టడమూ, దేశ సంపద కొల్లగొట్టడమూ, సర్వత్రా ప్రబలిన పరస్పర అపనమ్మకమూ, నిఘా పెట్టడమూ, పితూరీలు చెప్పడమూ మొదలైనవి ఈ పాలనకి ప్రత్యేక లక్షణాలు. – 31.

బిస్మార్క్ (Bismarck), ఒట్టో (1815–1898) – ప్రష్యన్, జర్మన్ రాజనీతిజ్ఞుడు, దౌత్య నిపుణుడు; 1871నుండి 1890దాకా జర్మన్ సామ్రాజ్యానికి మొదటి ఛాన్సలర్. 1878లో సోషలిస్టు వ్యతిరేక చట్టాన్ని జారీచేశాడు. కాని ఈ చట్టం ద్వారా కార్మికోద్యమాన్ని నిలవరించలేక సదాడంబరంతోకూడిన సాంఘిక చట్టాల కార్యక్రమాన్ని ప్రతిపాదించాడు. – 48, 108, 134, 142.

బుర్యానోవ్, ఎ. ఎఫ్. (Buryanov) (జననం 1880) – మెన్షివిక్కు, రద్దువాది. నాల్గవ స్టేట్ దూమ డెప్యూటీ. 1914లో రద్దువాదులనుంచి దూరమై, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రక్షణవాదంపట్ల ఆసక్తి చూపించాడు. – 51.

బులీగిన్, ఎ. జి. (Bulygin) (1851–1919) – జారిస్టు రష్యాలో రాజనీతిజ్ఞుడు, బడా భూస్వామి. 1905 జనవరి 20న యితను ఆంతరంగిక వ్యవహారాల మంత్రిగా నియమించబడ్డాడు. దేశంలో పెరుగుతూ వున్న విప్లవోద్యమాన్ని నిరోధించేందుకు అదే సంవత్సరం ఫిబ్రవరినుండి జార్ ఆజ్ఞ మేరకు సలహా సంస్థ అయిన స్టేట్ దూమను సమావేశపరచడానికి ఒక బిల్లు ముసాయిదా తయారీలో నాయకత్వం వహించాడు. అయితే విప్లవం మూలంగా ఈ దూమ సమావేశపరచబడలేదు. 1905 అక్టోబరు తర్వాత బులీగిన్ దాదాపు రాజకీయాల్లో పాల్గొనలేదు. – 52.

బుహారిన్, ఎన్. ఐ. (Bukharin) (1888–1938) – రష్యన్ పత్రికారచయిత, అర్థశాస్త్రవేత్త; రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. పార్టీ లెనినిస్టు విధానానికి వ్యతిరేకంగా పదేపదే ముందుకు వచ్చాడు. 1937లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకుగాను పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు. – 189.

బూర్త్సెవ్, వి. ఎల్. (Burtsev) (1862–1942) – రష్యన్ పత్రికారచయిత; 1880 దశకంలో విప్లవోద్యమంలో పాల్గొన్నాడు. 1905–07లో ప్రథమ

రష్యన్ విప్లవానికి ముందు ఎస్.ఆర్.లకు సన్నిహితంగా ఉన్నాడు, తర్వాత కాడెట్ పార్టీని బలపరచాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవం తర్వాత విదేశాలకు వెళ్లిపోయాడు. – 139.

బూల్కిన్ (సెమ్యోనొవ్), ఎఫ్. ఎ. (Bulkin–Semyonov) (జననం 1888) – సోషల్ డెమోక్రటట్, మెన్షివిక్. 1904నుండి ఆర్.ఎస్.డి.ఎల్.పి. సభ్యుడు. 1920లో ఆర్.కె.పి.(బి.) పార్టీ సభ్యుడయ్యాడు. 1922లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు గాను పార్టీనుండి బహిష్కరింపబడ్డాడు. 1927లో మళ్లీ బోల్షెవిక్ పార్టీలో చేరాడు, ఆర్థిక నిర్వహణ రంగంలో పనిచేశాడు. – 48.

బెన్నిగ్సెన్, ఇ. పి. (Benningsen) (జననం 1875) – కౌంట్, భూస్వామి; మూడవ, నాల్గవ స్టేట్ డూమల డెప్యూటీ. – 61.

బెర్న్‌స్టైన్ (Bernstein), ఎడువార్డ్ (1850–1932) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోనూ, రెండవ ఇంటర్నేషనల్‌లోనూ అవకాశవాద పక్ష నాయకుల్లో ఒకడు. రివిజనిజం సిద్ధాంతకర్త. కార్ల్ మార్క్సు సిద్ధాంతాన్ని వక్రీకరించాడు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంపట్లా, సోవియట్ రష్యాపట్లా శత్రు వైఖరి వహించాడు. – 155.

బెర్న్‌హార్ట్ (Bernhard), లుడ్విగ్ (1875–1935) – జర్మన్ అర్థశాస్త్రజ్ఞుడు, పత్రికారచయిత. – 128.

బెరార్ (Bérard), విక్టర్ (1864–1931) – ఫ్రెంచి పెటీబూర్జువా అర్థశాస్త్రవేత్త; పత్రికారచయిత, భాషాశాస్త్రజ్ఞుడు. – 260.

బేర్ (Beer), మాక్స్ (1864–1943) – జర్మనీ దేశస్థుడు, సోషలిజం చరిత్రకారుడు; 1901నుండి "Vorwärts" ("ముందుకు") పత్రిక లండన్ విలేకరి. – 226.

బోబ్రిన్‌స్కీ, వి. ఎ. (Bobrinsky) (జననం 1868) – రష్యన్ అభివృద్ధినిరోధక రాజనీతిజ్ఞుడు; బడా భూస్వామి, చక్కెర ఫాక్టరీల సొంతదారు. రెండవ, మూడవ, నాల్గవ స్టేట్ డూమల డెప్యూటీ. 1919లో విదేశాలకు వెళ్లిపోయాడు. – 141, 142.

బౌవర్ (Bauer), ఒట్టో (1882–1938) – ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రటిక్

పార్టీయొక్కా, రెండవ ఇంటర్నేషనల్ యొక్కా నాయకుల్లో ఒకడు. రివిజనిజం సిద్ధాంత కర్తల్లో ఒకడు. – 65, 66, 155.

మజ్జీనీ (Mazzini), జూసెపె (1805–1872) – ప్రముఖ ఇటాలియన్ విప్లవ కారుడు, బూర్జువా ప్రజాస్వామ్యవాది; ఇటలీ జాతీయ విముక్తి ఉద్యమ నాయకుల్లోనూ, సిద్ధాంతకర్తల్లోనూ ఒకడు. కుట్రదారీ ఎత్తుగడలూ, రైతుల ప్రయోజనాల నిర్లక్ష్యమూ అతని విధానపు ముఖ్యమైన లక్షణాలు. "శ్రమ, పెట్టుబడుల మధ్య సహకారం" అనే ఊహాజనిత పెటీబూర్జువా పథకాన్ని ప్రచారంచేశాడు. – 108.

మజేప, ఐ. ఎస్. (Mazepa) (1644–1709) – 1687–1708లో ఉక్రేనియన్ నాయకుడు. రష్యానుండి ఉక్రెయిన్ వేర్పాటును సాధించాలని చూశాడు. – 92.

మయేర (Mayéras), బార్టెలెమి (జననం 1879) – ఫ్రెంచి సోషలిస్టు, పత్రికారచయిత. ఫ్రెంచి సోషలిస్టు పార్టీ నాయకత్వ సభ్యుడుగా ఉండగా పార్టీలోని సోషల్ జాతీయ దురహంకారవాదులతో ఐక్యతకు అనుకూలంగా కృషిచేశాడు. – 295.

మర్తీనొవ్, ఎ. ఎస్. (పిక్కెర్) (Martynov—Pieker) (1865–1935) – రష్యన్ విప్లవోద్యమంలో పాల్గొన్నాడు. "ఆర్థికవాద" సిద్ధాంతకర్తల్లో ఒకడు. అక్టోబర్ సోషలిస్టు విప్లవానంతరం తన అభిప్రాయాలను మార్చుకున్నాడు. 1923లో కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. పత్రికలలో ఉద్యోగంచేశాడు. – 62, 119.

మలాహొవ్, ఎన్. ఎన్. (Malakhov) (జననం 1827) – జారిస్టు జనరల్; 1905–06లో మాస్కో సైనిక రీజియన్ సేనాధిపతి. మాస్కోలో 1905 డిసెంబరులో జరిగిన సాయుధ తిరుగుబాటు అణచివేతలో జారిస్టు ప్రభుత్వ ఆజ్ఞ మేరకు చురుకుగా పాల్గొన్నాడు. – 18.

మాంతషెవ్, ఎ. ఐ. (Mantashev) (1849–1911) – రష్యన్ పెట్టుబడిదారు. 1899లో బాకూలో పారిశ్రామిక నూనె సంస్థను స్థాపించాడు. – 218.

మార్క్స్ (Marx), కార్ల్ (1818–1883) – ప్రతిభావంతుడైన చింతనాపరుడు, అంతర్జాతీయ కార్మికవర్గ నాయకుడు, శాస్త్రీయ కమ్యూనిజం స్థాపకుడు. గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని రూపొందించి, తత్వశాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చాడు. – 10–12, 15, 19, 33, 67, 71, 104, 105, 107–15, 141–143, 162, 163, 182, 256, 277.

మార్తొవ్, ఎల్. (త్సెదెర్‌బౌమ్, వై. ఒ., ఎల్. ఎమ్.) (Martov—Tsederbaum) (1873–1923) – రష్యన్ సోషల్ డెమొక్రట్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో అవకాశవాద అల్పసంఖ్యాక పక్షానికి నాయకుడయ్యాడు. తదుపరి – మెన్షెవిక్కుల కేంద్ర కమిటీల నాయకుల్లో ఒకడు, మెన్షెవిక్కుల ప్రచురణల సంపాదకుడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం సోవియట్ అధికారాన్ని వ్యతిరేకించాడు. – 44, 48, 125, 257, 275, 295.

మాస్లొవ్, పి. పి. (Maslov) (1867–1946) – రష్యన్ అర్థశాస్త్రవేత్త, సోషల్ డెమొక్రట్. వ్యవసాయ సమస్యపై కొన్ని రచనలు చేశాడు. వీటిలో మార్క్సిజాన్ని సంస్కరించేందుకు ప్రయత్నించాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభానంతరం మెన్షెవిక్ పార్టీలో చేరాడు, తర్వాత – రద్దువాది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సోషల్ జాతీయ దురహంకారవాది. సోషలిస్టు విప్లవం తర్వాత రాజకీయ కార్యకలాపాలను వదిలేశాడు. – 137, 138, 227, 257.

మాహ్ (Mach), ఎర్నెస్ట్ (1838–1916) – ఆస్ట్రియన్ భౌతికశాస్త్రవేత్త, తత్వశాస్త్రవేత్త; వ్యక్తిపరమైన భావవాది, ప్రత్యక్షానుభవయుత విమర్శనవాద స్థాపకుల్లో ఒకడు. – 44.

మిలెరాన్ (Millerand), అలెగ్జాండ్ర్ ఎటియేన్ (1859–1943) – ఫ్రెంచి రాజకీయవేత్త. ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలో అవకాశవాద ధోరణికి నాయకత్వం వహించాడు. 1899లో బూర్జువా అభివృద్ధినిరోధక ప్రభుత్వంలో చేరాడు. కార్మికవర్గ ఆకాంక్షలకు ద్రోహంగా, రివిజనిజపు ఆచరణాత్మక వ్యక్తీకరణగా లెనిన్ మిలెరానిజాన్ని బహిర్గతంచేసి ఖండించాడు.

1904లో సోషలిస్టు పార్టీనుండి బహిష్కరింపబడిన తర్వాత మిలెరాన్ యితర మాజీ సోషలిస్టులతో కలిసి "స్వతంత్ర సోషలిస్టుల" పార్టీని స్థాపించాడు. 1920–24ల్లో – ఫ్రెంచి రిపబ్లిక్ ప్రెసిడెంటు. – 155.

మెక్‌డోనల్డ్ (MacDonald), జేమ్స్ రామ్సే (1866–1937) – బ్రిటిష్ రాజకీయవాది; ఇండిపెండెంట్ వర్కర్స్ పార్టీ, లేబర్ పార్టీల స్థాపకుల్లోనూ, నాయకుల్లోనూ ఒకడు. తీవ్ర అవకాశవాద విధానాన్ని అనుసరించాడు. వర్గ సహకార సిద్ధాంతాన్నీ, పెట్టుబడిదారీ విధానం క్రమంగా సోషలిజంలోకి మార్చబడాలన్న సిద్ధాంతాన్నీ ప్రబోధించాడు. కొన్ని సార్లు ప్రధానమంత్రి పదవిలో ఉన్నాడు. మెక్‌డోనల్డ్ ప్రభుత్వం సోవియట్ యూనియన్‌తో దౌత్య సంబంధాలు నెలకొల్పుకుంది. – 155, 295.

మెదెమ్, వి. డి. (Medem) (గోల్డ్‌బ్లాత్) (1879–1923) – రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు, బుండ్ నాయకుల్లో ఒకడు. – 118, 119, 123.

మేన్షికొవ్, ఎమ్. ఒ. (Menshikov) (1859–1919) – అభివృద్ధినిరోధక పత్రికారచయిత. – 140.

మొగిలాన్‌స్కీ, ఎమ్. ఎమ్. (Mogilyansky) (1873–1942) – న్యాయవాది, పత్రికారచయిత. కాడెట్ పార్టీ కేంద్ర పత్రిక అయిన "రేచ్"లో పనిచేశాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం కాడెట్ పార్టీని వదిలేసి, శాస్త్రీయ రంగంలో పని చేశాడు. – 85–87.

మోర్గన్ (Morgan), జాన్ ప్యిర్‌పోంట్ (1867–1943) – అమెరికన్ కోటీశ్వరుడు; 19వ శతాబ్ది మధ్యలో స్థాపించబడిన, అమెరికాలోకెల్ల మిక్కిలి పెద్ద బాంకింగు సంస్థకు అధిపతి. – 186, 221.

మోరిస్ (Morris), హెన్రీ (జననం 1868) – అమెరికన్ న్యాయవాది, చరిత్రకారుడు. – 225.

యుర్కేవిచ్, ఎల్. (Yurkevich) – ఉక్రేనియన్ సోషల్ డెమొక్రట్, జాతీయవాది. – 63, 64, 69, 87, 88, 94, 102, 103, 115, 123, 125.

రదీష్చెవ్, ఎ. ఎన్. (Radischev) (1749–1802) – ప్రముఖ రష్యన్ విప్లవాత్మక చింతనాపరుడు, రచయిత. – 140.

రాక్‌ఫెల్లర్ (Rockefeller), జాన్ డేవిసన్ (1839–1937) – అమెరికన్ నూనె వ్యాపార ప్రభుత్వ కోటీశ్వరుల వంశపు మూలపురుషుడు. 1870లో "Standard Oil" ట్రస్టు స్థాపించాడు. రాక్‌ఫెల్లర్ కుటుంబం దేశీయ, విదేశీ విధానాన్ని నిర్దేశించడంలో పెద్ద పాత్ర వహిస్తోంది. – 186, 218, 219.

రాడెక్, కె. బి. (Radek) (1885–1939) – పోలండు, జర్మనీలలో సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1917లో బోల్షెవిక్ పార్టీలో చేరాడు. కాని, దరిమిలా తన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకుగాను పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు. – 279, 286.

రీసర్ (Riesser), జాకొబ్ (1853–1932) – జర్మన్ అర్థశాస్త్రవేత్త, బాంకరు. సామ్రాజ్యవాదానికీ, ఫైనాన్స్ పెట్టుబడికీ స్తోత్రాలు వల్లించే కొన్ని పుస్తకాలు

రాశాడు. – 166, 169, 176, 178, 180, 185, 187, 193, 210, 214, 217, 221, 270, 274, 276.

రుబనోవిచ్, ఐ. ఎ. (Rubanovich) (1860–1920) – సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ నాయకుల్లో ఒకడు. అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో సభ్యుడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం సోవియట్ ప్రభుత్వ వ్యతిరేకి. – 139.

రుస్సీయె (Russier), ఆంద్రి. – 233.

రెయాద్, ఎన్. ఎ. (Read) (సుమారు 1793–1855) – రష్యామీద బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీ, సార్డీనియా దేశాల కూటమి సాగించిన క్రైమియా యుద్ధంలో (1853–56) రష్యన్ జనరల్. – 125.

రేగర్ (Reger), తడేవుష్ (1872–1938) – పోలిష్ సోషల్ డెమోక్రట్, జర్నలిస్టు. – 77.

రైటెర్న్ (Reitern) (మరణం 1861) – జారిస్టు కల్నల్; వార్సాలో ప్రదర్శనలో పాల్గొన్నవారిపై కాల్పులు జరిపేందుకు నిరాకరించి ఆత్మహత్య చేసుకున్నాడు. – 36.

రొమానొవ్ – నీకొలస్, రెండవ చూడండి.

రొమానొవ్‌లు (Romanovs) – రష్యన్ జారుల, చక్రవర్తుల వంశం (1613–1917). – 36.

రోడ్స్ (Rhodes), సెసిల్ (1853–1902) – బ్రిటిష్ అభివృద్ధినిరోధక రాజనీతిజ్ఞుడు, రాజకీయవేత్త. సామ్రాజ్యవాద, వలసవాదాల సైద్ధాంతికుడు. దక్షిణాఫ్రికాలో విస్తృత ప్రాంతాలపై బ్రిటిష్‌వారి దురాక్రమణ నిర్వాహకుడు. బోయర్లపై యుద్ధ ప్రారంభకుడు (1899–1902). – 226, 227, 233.

రోత్‌షిల్డ్ (Rothschild) – పశ్చిమ యూరప్‌లో ఫైనాన్షల్ ప్రభువుల కుటుంబం. – 218.

రోదిచెవ్, ఎఫ్. ఐ. (Rodichev) (1853–1932) – భూస్వామి, న్యాయవాది, కాడెట్ పార్టీ నాయకుల్లో ఒకడు. – 140.

ర్యజానొవ్, డి. బి. (గోల్డెన్‌డాఖ్) (Ryazanov—Goldendakh) (1870–1938) – 1889నుంచి రష్యన్ విప్లవోద్యమ సభ్యుడు. 1917లో ఆర్.ఎస్.డి.ఎల్.

పి.లో చేరాడు. 1931లో విప్లవప్రతిఘాతకులతో సహకరించినందుకుగాను పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు. – 62.

ర్యబుషీన్‌స్కీ, పి. పి. (Ryabushinsky) (1871–1924) – రష్యన్ విప్లవ ప్రతిఘాత బూర్జువాల నాయకుడు; మాస్కోలోని బడా బాంకరు, పారిశ్రామికుడు. – 199.

ఎల్. ఎమ్. – మార్తొవ్, ఎల్. చూడండి.

ఎల్. వ్ల. – వ్లదీమిరొవ్, ఎమ్. కె. చూడండి.

లాన్స్‌బుర్గ్ (Lansburgh), ఆల్‌ఫ్రెడ్ (1872–1940) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త; 1908–35లో "Die Bank" మాసపత్రికా సంపాదకుడు. – 175, 177, 181, 250, 260, 263–66.

లాఫార్గ్ (Lafargue), పాల్ (1842–1911) – ఫ్రెంచి, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ కార్యకర్త. ప్రతిభావంతుడైన పత్రికారచయిత. ఫ్రాన్సులో శాస్త్రీయ కమ్యూనిజాన్ని అనుసరించిన ప్రథములల్లో ఒకడు. మార్క్స్, ఎంగెల్సుల సహచరుడూ, మిత్రుడూ. బహుసంఖ్యాకమైన తన రచనల్లో లాఫార్గ్ మార్క్సిజాన్ని సమర్థించి, ప్రచారంచేశాడు. అయితే, రైతాంగ, జాతీయ సమస్యలపైనా, సోషలిస్టు విప్లవ కర్తవ్యాల సమస్యపైనా లాఫార్గ్ రచనల్లో కొన్ని సైద్ధాంతిక పొరపాట్లు ఉన్నాయి.– 109.

లాయిడ్ జార్జ్ (Lloyd George), డేవిడ్ (1863–1945) – బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు, దౌత్య నిపుణుడు, లిబరల్ పార్టీ నాయకుడు. 1916 నుండి 1922 దాకా ప్రధానమంత్రి. సమీప, మధ్య ప్రాచ్యంలోనూ, బాల్కన్లలోనూ బ్రిటిష్ సామ్రాజ్యవాద స్థావరాలను బలపరచాడు, వలసల్లోనూ, అధీన దేశాల్లోనూ విమోచనోద్యమాలను క్రూరంగా అణచివేశాడు. అక్టోబర్ సోషలిస్టు విప్లవానంతరం సోవియట్ రాజ్యానికి వ్యతిరేకంగా సైనిక జోక్యాన్నీ, దిగ్బంధాన్నీ ప్రేరేపించినవాళ్ళలోనూ, సంఘటితపరచినవాళ్ళలోనూ ఒకడు. – 210.

లాసాల్ (Lassalle), ఫెర్డినాండ్ (1825–1864) – జర్మన్ పెటీబూర్జువా సోషలిస్టు. జర్మన్ కార్మికోద్యమంలో లాసాలియనిజం అనే ఒక రకం అవకాశవాదానికి కారకుడు. అఖిల జర్మన్ కార్మిక సంఘం (1863) సంస్థాపకుల్లో ఒకడు. ఈ సంఘం స్థాపన కార్మికోద్యమంలో సానుకూల పాత్ర వహించింది. కాని సంఘ కార్యక

లాపాలను బిస్మార్క్ ప్రభుత్వ విధానంతో సర్దుబాటుచేసేందుకు లాసాల్ చూశాడు. ఇలాంటి ధోరణి మొదటి ఇంటర్నేషనల్ కార్యకలాపాలనూ, సిసలైన కార్మిక పార్టీ నిర్మాణాన్నీ కుంటుపరచింది. – 71, 142.

లింకన్ (Lincoln), అబ్రహామ్ (1809–1865) – ప్రఖ్యాత అమెరికన్ రాజనీతిజ్ఞుడు. 1861–65 కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రెసిడెంటు. బానిసత్వాన్ని రద్దుచేయాలన్న డిమాండుతో ముందుకు వచ్చిన రిపబ్లికన్ పార్టీ (1854) సంస్థాపకుల్లో ఒకడు. బానిస యజమానుల కిరాయి మనిషిచేత హత్య గావించబడ్డాడు. లింకన్ పేరు అమెరికన్ ప్రజల విప్లవ సంప్రదాయాలకు సంకేత ప్రాయమైనది. – 260.

లిసిస్ (లెటయేర్) (Lysis—Letailleur), ఎజేన్ – ఫ్రెంచి బూర్జువా అర్థశాస్త్రవేత్త; ఆర్థిక, రాజకీయ సమస్యలపై కొన్ని రచనలు చేశాడు. – 200, 201.

లీఫ్మన్ (Liefmann), రాబర్ట్ (1874–1941) – జర్మన్ అర్థశాస్త్రవేత్త, ప్రొఫెసరు. ఆర్థిక, సాంఘిక సమస్యలపై కొన్ని రచనలు చేశాడు. – 167, 173, 176, 191, 193, 194, 203, 222.

లీబ్మన్, ఎఫ్. (గెర్ష్, పి. ఎమ్.) (Liebman—Hersch) (జననం 1882) – బుండ్ నాయకుల్లో ఒకడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జారిజం అనుసరించిన దురాక్రమణ విధానాన్ని బలపరిచాడు. స్విట్జర్లండులో నివసించాడు. – 63, 64, 69, 87, 88, 94, 102, 103, 115, 123, 125, 130.

లీబెర్, ఎమ్. ఐ. (గోల్డ్మన్) (Lieber—Goldman) – (1880–1937) – 1898 నుండి రష్యన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. మెన్షివిక్కు. – 118, 119.

లుక్సెంబుర్గ్ (Luxemburg), రోజా (జూనియస్) (1871–1919) – అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ కార్యకర్త. రెండవ ఇంటర్నేషనల్ వామపక్ష నాయకురాల్లో ఒకరు. అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించింది. జర్మన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపనలో పాల్గొంది. జనవరి 1919లో విప్లవప్రతీఘాతకుల చేత హత్యచేయబడింది. వి. ఐ. లెనిన్కి లుక్సెంబుర్గ్ పట్ల గొప్ప అభిప్రాయం ఉన్నప్పటికీ, ఆమె చేసిన పొరపాట్లను విమర్శిస్తూ సరియైన వైఖరిని వహించేందుకు

నాయకుడు, రెండవ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో అధ్యక్షుడు, పచ్చి అవకాశవాది. – 295.

వాల్ (Wahl), మోరిస్. – 233.

వావెల్‌బెర్గ్ (Wawelberg). – 198.

విల్‌హెల్మ్, రెండవ (హోహెన్‌జోలెర్న్) (Wilhelm II—Hohenzollern) (1859–1941) – 1888–1918 సంవత్సరాల్లో జర్మన్ చక్రవర్తి, ప్రష్యా రాజు. 1918 నవంబరు విప్లవం మూలంగా సింహాసన భ్రష్టుడయాడు. – 131, 205.

విల్సన్ (Wilson), వుడ్రో (1856–1924) – 28వ అమెరికన్ అధ్యక్షుడు (1913–21). బయటకి ఉదారవాద స్వభావం ఉన్నట్లు కనిపించినప్పటికీ గుత్తసంస్థల ప్రయోజనాలకు అనుకూలమైన కొన్ని శాసనాలను జారీచేశాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా చేరాలని ప్రతిపాదించాడు; సోవియట్ వ్యతిరేక సైనిక జోక్యం ఆర్గనైజర్లలో ఒకడు. – 154.

వ్లదీమిరొవ్, ఎమ్. కె. (Vladimirov) (1879–1925) – సోవియట్ రాజనీతిజ్ఞుడు, పార్టీ కార్యకర్త; 1903నుండి బోల్షెవిక్ పార్టీ సభ్యుడు. – 82, 113.

షిల్డెర్ (Schilder), జిగ్‌ముంద్ (మరణం 1932) – జర్మన్ అర్థశాస్త్రవేత్త. ప్రపంచ ఆర్థిక విధానంమీద కొన్ని పుస్తకాలు రాశాడు. – 113, 210, 213, 231, 234, 250, 270.

షుల్జె-గేవెర్నిట్జ్ (Schulze-Gaevernitz), గెర్‌హార్ట్ (1864–1943) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త. అన్ని వర్గాల (పెట్టుబడిదారుల, కార్మికుల, రైతుల) పరిస్థితిని మెరుగుపరచే ఉద్దేశంతో పెట్టుబడిదారీ సమాజంలో సాంఘిక శాంతి, "సాంఘిక సామరస్యం" సాధ్యమని నిరూపించేందుకు ప్రయత్నించాడు. – 176, 179, 185, 186, 191, 193, 195, 234, 250, 253, 254, 276.

షైడెమన్ (Scheidemann), ఫిలిప్ (1865–1939) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ తీవ్ర దక్షిణపక్ష నాయకుల్లో ఒకడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సోషల్ జాతీయ దురహంకారవాది. 1918–21 నాటి కార్మికోద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు. – 156, 295.

ఆమెకు సహాయంచేశాడు. – 62–78, 80, 81, 83–86, 91, 92, 95–99, 101–104, 107, 117–121, 125, 127, 289.

లూకస్ (Lucas), చార్ల్స్ (1853–1931) – ఇంగ్లీషు వలస ఉద్యోగి, చరిత్రకారుడు. కార్మికవర్గం, బూర్జువావర్గాల మధ్య వర్గ సహకారం ఉండాలని బోధించాడు. – 230.

లెగీన్ (Legien), కార్ల్ (1861–1920) – జర్మన్ దక్షిణపక్ష సోషల్ డెమో క్రట్. జర్మన్ ట్రేడ్‌యూనియన్ల నాయకుల్లో ఒకడు, రివిజనిస్టు. – 295.

లెనిన్, వి. ఐ. (Lenin). – 9–13, 65, 116, 157, 285.

లెవీ (Levy), హెర్మన్ (జననం 1881) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త. ఫైనాన్షియల్ పెట్టుబడికి సంబంధించిన కొన్ని వ్యాసాల రచయిత. – 162.

లెవీన్‌స్కీ, వి. పి. (Levinsky) (1880–1953) – ఉక్రేనియన్ సోషల్ డెమో క్రటిక్ ఉద్యమ కార్యకర్తల్లో ఒకడు; జాతీయవాది. "ద్జ్వీన్" ("గంట") పత్రికలో పనిచేశాడు. – 123.

లెస్క్యూర్ (Lescure), జాన్. – 180.

లొపాతిన్, జి. ఎ. (Lopatin) (1845–1918) – విప్లవకర నరోద్నిక్. కార్ల్ మార్క్స్ మిత్రుడు. "పెట్టుబడి"కి రష్యన్ భాషలో ప్రథమ అనువాదకుడు. 1870నుండి మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు. – 107.

లోంగె (Longuet), షార్ల్ (1839–1903) – ఫ్రెంచి కార్మికోద్యమ కార్యకర్త, ప్రూడనిస్టు, పత్రికారచయిత. 1866–67, 1871–72 కాలంలో మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సభ్యుడు. 1871లో పారిస్ కమ్యూన్ సభ్యుడు. తదుపరి ఫ్రెంచి కార్మిక పార్టీ అనుసరించిన అవకాశవాద ధోరణిని చేబట్టాడు. – 109, 295.

వర్షావ్‌స్కీ (Warszawski), అడొల్ఫ్ (1868–1937) – పోలిష్, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ కార్యకర్త. పోలిష్ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకడు, ఈ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు. పోలిష్ సేయ్‌మ్ (పార్లమెంటు) డెప్యూటీ, దానిలోని కమ్యూనిస్టు పక్షానికి అధ్యక్షుడు. 1929నుంచి యు.ఎస్.ఎస్.ఆర్.లో నివసించాడు. – 116, 117.

వాండెర్‌వెల్డె (Vandervelde), ఎమీల్ (1866–1938) – బెల్జియన్ కార్మిక పార్టీ

ష్చ్రెదీన్ – సల్తికోవ్-ష్చ్రెదీన్, ఎమ్. ఇ. చూడండి.

ష్టిల్లిఖ్ (Stillich), ఓస్కార్. – 184, 190, 202, 203.

ష్టీర్నెర్ (Stirner), మాక్స్ (1806–1856) – జర్మన్ తత్వశాస్త్రవేత్త, అరాజకవాద సైద్ధాంతికుల్లో ఒకడు. మార్క్స్, ఎంగెల్సులు అతని రచనలను పదేపదే విమర్శించారు. – 109.

ష్టౌస్ (Stauß), ఎమీల్ గెయోర్గ్ (జననం 1877) – జర్మన్ ఫైనాన్షియర్, బాంకర్. – 219.

ష్నైడెర్ (Schneider) – ఫ్రెంచి బడా ఫైనాన్స్, ప్రభు కుటుంబం, అది దేశపు ఆర్థిక, రాజకీయ జీవితంలో గొప్ప పాత్ర వహిస్తోంది. – 213.

సల్తికోవ్-ష్చ్రెదీన్, ఎమ్. ఇ. (Saltykov-Shchedrin) (1826–1889) – రష్యన్ వ్యంగ్య రచయిత. – 59, 90.

సవేంకొ, ఎ. ఐ. (Savenko) (జననం 1874) – పెద్ద భూస్వామి, నాల్గవ స్టేట్ దూమ డెప్యూటీ, ఉగ్ర జాతీయవాది. – 92.

సార్టోరియుస్ ఫన్ వాల్టెర్స్‌హౌసెన్ (Sartorius von Waltershausen), ఔగుస్ట్ (జననం 1852) – జర్మన్ అర్థశాస్త్రవేత్త, ప్రపంచ ఆర్థికవాద రాజకీయ విధానాలకు సంబంధించిన సమస్యమీద కొన్ని గ్రంథాలు రాశాడు. – 234, 250.

సీమెన్స్ (Siemens), గెయోర్గ్ (1839–1901) – జర్మన్ పారిశ్రామిక, ఫైనాన్స్ ప్రభువుల్లో ఒకడు. 1870లో "జర్మన్ బాంక్" స్థాపించి, దాని డైరెక్టరు అయ్యాడు. – 216.

సుపాన్ (Supan), అలెగ్జాండర్ (1847–1920) – జర్మన్ భూగోళశాస్త్రవేత్త. – 223, 224, 227, 228.

సెంట్ సైమన్ (Saint-Simon), హెన్రీ క్లాడ్ (1760–1825) – గొప్ప ఫ్రెంచి చింతనాపరుడు, ఊహాజనిత సోషలిస్టు. అయన బోధన – శాస్త్రీయ సోషలిజానికి మూలాల్లో ఒకటి. – 227.

సెంబా (Sembat), మార్సెల్ (1862–1922) – ఫ్రెంచి సోషలిస్టు పార్టీ సంస్కరణవాద నాయకుల్లో ఒకడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సోషల్ జాతీయ దురహంకారవాది. ఫ్రాన్స్ బూర్జువా ప్రభుత్వ సభ్యుల్లో ఒకడు. – 295.

సెమ్‌కోవ్‌స్కీ, ఎస్. (బ్రోన్‌స్టైన్, ఎస్. వై.) (Semkovsky—Bronstein) (జననం 1882) – రష్యన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్. కొన్ని మెన్షెవిక్ పత్రికల్లో రచనలు చేశాడు. 1920లో మెన్షెవిక్కులతో తెగతెంపులు చేసుకుని అధ్యాపకుడుగానూ, శాస్త్రీయపరిశోధకుడుగానూ పని చేశాడు. – 51, 63, 64, 69, 81, 87, 88, 94, 102, 103, 115, 124, 125, 127.

సెర్నో-సొలొవ్యేవిచ్, ఎ. ఎ. (Serno-Solovyevich) (1828–1869) – 1860 దశకంలో విప్లవ ప్రజాతంత్ర ఉద్యమంలో ఒక ప్రముఖ వ్యక్తి. మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడు. – 35.

సోంబార్ట్ (Sombart), వెర్నర్ (1863–1941) – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త; జర్మన్ సామ్రాజ్యవాదపు ప్రముఖ సైద్ధాంతికుడు. పెట్టుబడిదారీ విధానాన్ని సమరసమైన ఆర్థిక వ్యవస్థగా చిత్రించాడు. జీవితపు ఆఖరి సంవత్సరాల్లో ఫాసిస్టు వైఖరి తీసుకొన్నాడు. – 202.

స్టెడ్ (Stead), విలియం థామస్ (1849–1912) – ఇంగ్లీషు పత్రికారచయిత. –227.

స్తొలీపిన్, పి. ఎ. (Stolypin) (1862–1911) – జారిస్టు రాజనీతిజ్ఞుడు, భూస్వామి, మంత్రిమండలి అధ్యక్షుడు, దేశాంగ శాఖ మంత్రి (1906–11). 1907 జూన్ 3 నాటి ప్రభుత్వ కుట్ర ఆర్గనైజర్లలో ఒకడు. రష్యాలో అత్యంత అభివృద్ధినిరోధక రాజకీయ దశకు (1907–10) యితని పేరు పర్యాయపదమైంది. స్తొలీపిన్ ధనిక కులాక్కులకు అనుకూలమూ, గ్రామీణ పేదలకు వినాశకరమూ అయిన భూ సంస్కరణను ప్రవేశపెట్టాడు. – 24, 26, 30, 48.

స్త్రూవె, పి. బి. (Struve) (1870–1944) – బూర్జువా అర్థశాస్త్రవేత్త, తత్వశాస్త్రవేత్త, చరిత్రకారుడు, రచయిత. 1890 దశకంలో "చట్టబద్ధ మార్క్సిజం" ప్రముఖ ప్రతినిధుల్లో ఒకడు. మార్క్స్ ఆర్థిక, తాత్విక సిద్ధాంతాన్ని సవరించేందుకు ప్రయత్నించి దాన్ని విమర్శించాడు. మార్క్సిజాన్నీ, కార్మిక ఉద్యమాన్నీ బూర్జువా వర్గ ప్రయోజనాలకు అన్వయించడానికి ప్రయత్నించాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవానంతరం విదేశాలకు వెళ్లిపోయాడు. తదుపరి సంవత్సరాల్లో కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు అయ్యాడు. – 105.

స్పెక్టేటర్ – నహిమ్‌సోన్, ఎమ్. ఐ. చూడండి.

స్మిర్నోవ్ – గురేవిచ్, ఇ. ఎల్. చూడండి.

స్యూడెకుమ్ (Südekum), ఆల్బర్ట్ (1871–1944) – జర్మన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమపు దక్షిణపక్ష నాయకుల్లో ఒకడు; జాతీయ దురహంకారవాది. – 227.

హవెమెయర్ (Havemeyer), జాన్ క. (1883–1922) – అమెరికన్ పారిశ్రామికుడూ, ప్రధాన పంచదార ట్రస్టు యజమానీ, రైల్వే, తదితర కంపెనీల భాగస్వామి. – 200.

హాబ్సన్ (Hobson), జాన్ (1858–1940) – ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్త, సంస్కరణవాది; శాంతివాది. – 150, 156, 158, 210, 226, 240, 248, 249, 251–253, 255, 258, 260, 267.

హార్మ్స్ (Harms), బెర్న్‌హార్డ్ (1876–1939) – జర్మన్ అర్థశాస్త్రవేత్త, జర్మన్ సామ్రాజ్యవాద సమర్థకుడు. – 210.

హాసే (Haase), హూగో (1863–1919) – జర్మన్ సోషల్ డెమొక్రసీ నాయకుల్లోనూ, జర్మన్ స్వతంత్ర సోషల్ డెమొక్రటిక్ పార్టీ స్థాపకుల్లోనూ ఒకడు, అవకాశవాది. జర్మనీలో 1918లో జరిగిన నవంబరు విప్లవ కాలంలో విప్లవ ఉద్యమాన్ని అణచివేసే విధానాన్ని అనుసరించిన ప్రజా ప్రతినిధుల కౌన్సిల్ అనబడే దానిలో సభ్యుడు. – 295.

హిల్ (Hill), డేవిడ్ (1850–1932) – అమెరికన్ చరిత్రకారుడు, దౌత్య వ్యవహర్త. – 269.

హిల్డెబ్రాన్డ్ (Hildebrand), గెర్‌హార్డ్ – జర్మన్ అర్థశాస్త్రవేత్త, పత్రికారచయిత, సోషల్ డెమొక్రట్. 1912లో అవకాశవాద వైఖరిని తీసుకున్నందుకుగాను జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు. – 253.

హిల్ఫెర్‌డింగ్ (Hilferding), రూడొల్ఫ్ (1877–1941) – ఆస్ట్రియా, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ ఉద్యమం, రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాద నాయకుల్లో ఒకడు. 1907–15లో "Vorwärts" ("ముందుకు") పత్రిక సంపాదకుడు. – 156, 158, 161, 192, 193, 200, 203, 210, 248, 261, 262, 270.

హూబ్నర్ (Hübner), ఒట్టో – గణాంకశాస్త్ర-భూగోళశాస్త్ర వార్షిక సంచికల "Geographisch-statistische Tabellen aller Länder der Erde" సంకలనకర్త, ప్రచురణకర్త. – 228.

హెంగెర్ (Henger), హాన్స్. – 255.

హెండర్సన్ (Henderson), ఆర్థర్ (1863–1935) – ఇంగ్లీషు ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలో ఒక ప్రసిద్ధ కార్యకర్త; గ్రేట్ బ్రిటన్ లేబరు పార్టీ నాయకుల్లో ఒకడు. 1911–34ల్లో ఆ పార్టీ కార్యదర్శి. 1915నుంచి 1931వరకు ఇంగ్లండు ప్రభుత్వ సభ్యుడు. – 295.

హెక్కెర్ (Haecker), ఎమీల్ (1875–1934) – పోలండు సోషలిస్టు పార్టీ దక్షిణపక్ష కార్యకర్త. 1894నుంచి దాదాపు 40 ఏళ్లపాటు క్రాకొవ్‌నుంచి ప్రచురింపబడిన "Naprzód" ("ముందుకు") సోషలిస్టు పత్రిక సంపాదకుడుగా పనిచేశాడు. రెండవ ఇంటర్నేషనల్ కొన్ని మహాసభల్లో పాల్గొన్నాడు. – 103.

హేగెల్ (Hegel), గెయోర్గ్ విల్‌హెల్మ్ ఫ్రీడ్రిఖ్ (1770–1831) – సుప్రసిద్ధ సాంప్రదాయిక జర్మన్ తత్వవేత్త, వస్తుపర భావవాది. భావవాద ప్రాతిపదికమీద గతితార్కిక అభివృద్ధిని గురించిన సిద్ధాంతాన్ని విపులీకరించాడు. – 32.

హైండ్‌మన్ (Hyndman), హెన్రీ మయర్స్ (1842–1921) – బ్రిటన్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకడు. 1916లో తన సోషల్ జాతీయ దురహంకార వైఖరిని పార్టీ మహాసభ ఖండించిన అనంతరం పార్టీని వదిలిపోయాడు. సోవియట్ వ్యతిరేక జోక్యాన్ని బలపరచాడు. – 155, 295.

హైనిగ్ (Heinig), కుర్త్ (1886–1956) – జర్మన్ సోషల్ డెమోక్రట్, అర్థశాస్త్రవేత్త, పత్రికారచయిత. – 196, 217, 295.

హైమన్ (Heymann), హాన్స్ గిడెయోన్ – జర్మన్ బూర్జువా అర్థశాస్త్రవేత్త. – 161, 194.

హ్యూస్‌మన్స్ (Huysmans), కామిల్ (1871–1968) – బెల్జియన్ కార్మికోద్యమ దీర్ఘకాల సభ్యుల్లో ఒకడు. 1905–22 సంవత్సరాల్లో రెండవ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో కార్యదర్శి, మధ్యస్థ వైఖరి వహించాడు. తన జీవితపు చివరి సంవత్సరాల్లో అంతర్జాతీయ కార్మికోద్యమ ఐక్యతనూ, పునర్నిర్మాణాన్నీ సమర్థించాడు. – 275.

## పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

చిరునామా:

Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
బాంక్ రోడ్డు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515114

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
రష్యన్ షాపింగ్ కాంప్లెక్స్
స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్
విశాఖపట్నం–530039

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు –522002

వి. ఐ. లెనిన్ "సంకలిత రచనలు" నాల్గవ సంపుటంలో "దూరంనుంచి లేఖలు," "ప్రస్తుత విప్లవంలో శ్రామికవర్గ కర్తవ్యాలు," "రాజీలను గురించి," "ముంచుకొస్తున్న విపత్తు, దాన్ని ఎదుర్కోవడం ఎలా?" మొదలైనవి ఉన్నాయి.